Akse Furqan

(Telugu)

ఖుర్ఆన్ సౌరభాలు

మూలం

ఏజాజ్ మొహియుద్దీన్ వసీమ్

తెలుగురూపం

అబ్దుల్ వాహెద్

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను

ఖుర్ఆన్ అవగాహనకు మూల సూత్రాలు

– మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై)

దివ్య ఖుర్ఆన్ అధ్యయనానికిగాను రెండు లక్ష్యాలు నా దృష్టిలో ఉన్నాయి.

మొదటిదేమంటే, దివ్యఖుర్ఆన్ అధ్యయనానికి ముందు దాని అవగాహనకు దోహదం చేసే విషయాలను ప్రారంభంలోనే స్పష్టంగా పాఠకు నికి తెలుపటం, లేకపోతే ఈ విషయాలు, అధ్యయనం చేసేటప్పుడు మాటిమాటికీ సంశయజనకంగా పరిణమిస్తాయి. ఒక్కొక్కప్పుడయితే కేవలం వీటి ని అర్థం చేసుకోని కారణంగానే మనిషి సంవత్సరాల తరబడి శ్రమించి నప్పటికీ దివ్య ఖుర్ఆన్ సారాన్ని గ్రహించలేడు. దాని భావాల లోతులోకి దిగే మార్గం అతనికి కానరాదు.

రెండవదేమంటే, దివ్య ఖుర్ఆన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు సాధారణంగా పాఠకుల మనస్సుల్లో ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు సమాధానం మొదట్లోనే ఇవ్వాలన్నది. ప్రారంభంలో స్వయంగా నా మనస్సులో ఉత్పన్నమయిన ప్రశ్నలకు లేదా తరువాత నాలో తలెత్తిన సమస్యలకు మాత్రమే సమాధానం ఇస్తాను. ఇవికాక ఇంకా ఏమన్నా ప్రశ్నలు ఉదయిస్తే, వాటిని నాకు తెలిపితే దైవచిత్తమయితే, నేను వాటికి సమాధానం తరువాతి ముద్రణలో ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.

ఏకైక గ్రందంసాధారణంగా మనం చదివే పుస్తకాల్లో ఒక నిర్ణీత విషయానికి సంబంధించిన సమాచారం, అభిప్రాయాలు, ఆధారాలు నిరూ పణలు అన్నీ ఒక ప్రత్యేక రచనాక్రమంలో నిరంతరంగా వివరించబడతాయి. ఈ కారణంగా ఇంతవరకు ఖుర్ఆన్తో పరిచయంలేని వ్యక్తి మొదటిసారిగా ఈ గ్రంథాన్ని చదవటానికి సంకల్పించుకున్నప్పుడు, 'గ్రంథం' అయిన కారణంగా ఇందు లోనూ మామూలు గ్రంథాలవలె ఇతివృత్తం ముందుగానే నిర్ణయించబడు తుందనీ తరువాత అసలు విషయాన్ని అధ్యాయాలుగా, విభాగాలుగా విభజించి క్రమంగా ఒక్కొక్క సమస్యనే చర్చించటం జరుగుతుందనీ, ఇదేవిధంగా, జీవితానికి సంబంధించిన ఒక్కొక్క రంగాన్ని వేర్వేరుగా తీసుకుని దానికి సంబంధించిన ఆదేశాలు, నిర్దేశాలు వరుస క్రమంలో పేర్కొనబడి ఉంటాయని అతడు ఆశిస్తాడు. కాని గ్రంథాన్ని తెరచి అధ్యయనం ప్రారంభించినప్పుడు అతనికి ఎదురయ్యేది, అతడు ఆశించిన దానికి పూర్తిగా భిన్నమయిన, ఇంతవరకు పరిచయంలేని కొత్త పంథాలో నడిచే ప్రకటనా

విధానం. ఇక్కడ అతడు – విశ్వాసానికి సంబంధించిన సమస్యలు, నీతిబోధలు, ధర్మశాసనాలు, ధర్మసందేశం, హితోపదేశం, గుణపాఠం, విమర్శ, అధిక్షేపణ, భయభక్తులు, శుభవార్తలు, స్వాంతన వచనాలు, నిదర్శనాలు, నిరూపణలు, చారిత్రక గాథలు, సృష్టి నిదర్శనాలను సూచించడం – ఇవన్నీ మళ్ళీ మళ్ళీ ఒకదాని తరువాత మరొకటి రావటం తిలకిస్తాడు. ఒకే విషయం విభిన్న రీతుల్లో విభిన్న పదాల్లో పునరుక్తమవుతుంది. ఒక విషయం తరువాత మరొక విషయం, ఒకదాని తరువాత ఇంకొ విషయం అకస్మాత్తుగా ప్రారంభమవుతాయి. అంతేకాదు, ఒక విషయం మధ్యలో మరొక విషయం ఆకస్మికంగా వచ్చేస్తుంది. సంబోధితుడు, సంబోధకుడు మాటిమాటికీ మారుతూ ఉంటారు. సంబోధన ఉండీ ఉండీ విభిన్న దిక్కులకు మళ్ళుతూ ఉంటుంది. అధ్యాయాలు, ఖండాల విభజన ఎక్కడా కన్పించదు. ఏదైనా చారిత్రక విషయం వస్తే, అది చరిత్ర రచనా విధానంలో ఉండదు; తత్వశాస్త్రం, లోకోత్తర విషయాలు వస్తే, అవి తర్క, తత్వశాస్త్రాల పరిభాషలో ఉండవు; 'మానవుడు' మరియు 'విశ్వం'ను గురించి ప్రస్తావించటం జరిగితే, అది ప్రకృతి (Natural Sciences) పద్ధతిలో ఉండదు. నాగరిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలకు సంబంధించిన చర్చ జరిగితే, ఆ చర్చాధోరణి ఆ ఫక్కీలో ఉండదు; శాసనాలు, చట్టాలు, న్యాయశాస్త్ర సూత్రాల వివరణ వస్తే, అది న్యాయశాస్త్రజ్ఞుల పద్ధతికి అనుగుణంగా జరగదు; నీతిబోధ జరిగితే, అది నీతిశాస్త్రాలకు సంబంధించిన సాహిత్యంలో ఉన్నవిధంగా ఉండదు.

కనుకనే మనిషి, పూర్వం 'తనకు' గ్రంథం గురించి ఉన్న భావానికి పూర్తిగా భిన్నంగా ఉన్న దీన్ని చూసి కంగారుపడతాడు. ఖుర్‌ఆన్ అతనికి సంకలనా దోషంతో నిండిన గ్రంథంగా, వాక్యాల్లో సమన్వయంలేని రచనగా, విషయక్రమం లేని కలగూర గంపలాంటి పుస్తకంగా కనిపిస్తుంది. ఇది మొదటి నుండి చివరి వరకు అగణ్యమయిన వేర్వేరు చిన్న పెద్ద వ్యాసాలతో నిండిన కూర్పు మాత్రమే కాని, ఎడతెగని రచనగా వ్రాయబడిందని అతను అనుకుంటాడు. పర్యవసానంగా వ్యతిరేక దృక్కోణం గల వ్యక్తి ఈ ఒక్క విషయం ఆధారంగానే రకరకాల ఆక్షేపణలు లేవనెత్తటం మొదలుపెడతాడు. సానుకూల దృక్కోణంగల వ్యక్తి ఒక్కొక్కప్పుడు అర్థాన్ని అంతగా పట్టించుకో కుండా అనుమానాలకు దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తాడు. మరొకప్పుడు బాహ్యంలో కన్పించే ఈ క్రమరాహిత్యానికి ఏవో సాకులు చెప్పుకుని మనసును కుదుటపరచుకుంటాడు. ఇంకొకప్పుడు కృత్రిమంగా వాక్యాల్లో క్రమాన్ని, సంబంధాన్ని అన్వేషించి, చిత్రవిచిత్రమయిన భావకల్పనలు చేస్తాడు. చివరికి ఖుర్‌ఆన్, 'విభిన్న

విషయాల కలగూర గంప' అనే వింత సిద్ధాంతాన్ని స్వీకరి స్తాడు. ఫలితంగా ప్రతి ఖుర్‌ఆన్ వాక్యం తన సందర్భానికి దూరమై వక్త అభిప్రాయానికి భిన్నమయిన విభిన్న భావాల కొలువుకూటమై నిలుస్తుంది.

ఒక గ్రంథాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలంటే, పాఠకునికి తప్పని సరిగా, దాని ఇతివృత్తం ఏమిటో తెలియాలి. దాని ఉద్దేశ్యం, దాని ప్రధాన విషయాలు తెలిసి ఉండాలి. దాని శైలి, దాని పరిభాష, దాని ప్రత్యేక భావ ప్రకటనా విధానం పరిచయమై ఉండాలి. దానిలో ఉన్న వివరణలు, వాటి పూర్వరంగానికి సంబంధించిన పరిస్థితులు అన్నీ కళ్ళెదుట ఉండాలి. సాధారణంగా మనం చదివే గ్రంథాల్లో ఈ విషయాలన్నీ తేలిగ్గా దొరుకుతాయి. అందువల్ల వాటి సారాన్ని గ్రహించటం అంతకష్టం కాదు. కాని ఇవన్నీ మనకు గ్రంథాల్లో లభించే విధంగా ఖుర్‌ఆన్‌లో లభించవు. కనుక ఒక సాధారణ పాఠకునిలా మనలో ఎవరయినా ఖుర్‌ఆన్ అధ్యయనానికి ఉపక్రమిస్తే, దాని ఇతివృత్తం, దాని ఉద్దేశ్యం ఏమిటో అర్థంకాక తికమక పడతాడు. దాని శైలి, దాని ప్రకటనా విధానం కూడా కొత్తగా కనిపిస్తాయి అతనికి. అనేకచోట్ల వాక్యాల (ఆయత్‌ల) సందర్భం అతని దృష్టికి దూరంగా ఉంటుంది. పర్యవసానంగా, విభిన్న ఆయతుల్లో ప్రోక్తమైన వివేచనా కాంతిని ఎంతో కొంత గ్రహించినప్పటికీ, మనిషి 'దైవవాణి' అసలు సారాన్ని ఆస్వా దించలేడు. దైవగ్రంథ పరిజ్ఞానం పొందటానికి బదులుగా అతడు కేవలం కొన్ని వేర్వేరు అంశాలను, భావాలను మాత్రమే గ్రహించి తృప్తి చెందవలసి ఉంటుంది. వాస్తవానికి ఖుర్‌ఆన్‌ను పఠించి కొందరు సందేహాలకు, కుశంకలకు లోనయి పెడమార్గం పట్టడానికి ఇది కూడా ఒక కారణమే.

గ్రంథ సమవగాహనకు కావలసిన అత్యవసర ప్రాథమిక విషయాలు సరిగ్గా తెలియకపోవటంచేతనే, ఖుర్‌ఆన్ పఠించేటప్పుడు, ఇలాంటివారికి, దీని పుటల్లో వివిధ విషయాలు చెల్లాచెదురుగా కనిపిస్తాయి. ఎన్నో ఆయతుల (వాక్యాల) భావం వారికి బోధపడదు, ఇంకా ఎన్నో ఆయతుల్ని– అవి విజ్ఞతతో విలసిల్లినప్పటికీ–ఇతర ఆయతుల మధ్యన చూస్తే, అవి అక్కడ అతకనట్లు తోస్తుంది. ఇంకా ఎన్నో చోట్ల ఖుర్‌ఆన్ భావప్రకటనా విధానంతో, దాని ప్రత్యేక శైలితో పరిచయం లేకపోవటంచేత, వారు దాని అసలు అర్థానికి ఎంతో దూరంగా వెళ్ళిపోతారు. ఇంకా, చాలా సంద ర్భాల్లో ఆయతుల అవతరణా సందర్భం సరిగ్గా తెలియని కారణంగా, తీవ్రమయిన అపోహలు, అపార్థాలు ఏర్పడుతాయి.

ఖుర్‌ఆన్ ఎటువంటి గ్రంథం? అది అవతరించిన విధానం ఎటు వంటిది? దాని క్రమం, కూర్పులు ఎటువంటివి? దాని చర్చనీయాంశం ఏది? దాని వాదన యొక్క ఉద్దేశ్యమేమిటి? ఇందులో చర్చించబడిన ఎన్నో విభిన్న ఉప విషయాలకు ఏ ప్రధాన విషయంతో సంబంధం ఉంది? తన ఉద్దేశ్యాన్ని వ్యక్తపరచటానికి అది ఏ నిర్ధారణా పద్ధతిని, ఏ చర్చా విధానాన్ని అవలంబించింది? ఇవీ, ఇంకా ఇలాంటివే మరికొన్ని అవసరమయిన ప్రశ్న లకు సమాధానాలు ప్రారంభంలోనే మనిషికి స్పష్టంగా, సూటిగా లభిస్తే అతడు ఎన్నో ఉపద్రవాలను తప్పించుకుంటాడు. అతని అవగాహన, ఆలోచనా మార్గాలు సువిశాలమవుతాయి. ఖుర్‌ఆన్‌లో 'రచనాక్రమాన్ని' వెదికి, అది అందులో దొరక్కపోవడంతో, అతడు గ్రంథం యొక్క పుటల్లోనే కొట్టు మిట్టాడుతూ ఉంటాడు. ఈ చిక్కుకు కారణం, ఖుర్‌ఆన్ పఠనానికి సంబంధిం చిన ఈ ప్రాథమిక సూత్రాలను అతను తెలుసుకోకపోవడమే. అతడు, తాను మత విషయంపై ఒక గ్రంథాన్ని చదువబోతున్నాననే భ్రమతో గ్రంథ పఠనం ప్రారంభిస్తాడు. 'మత విషయం', 'గ్రంథం' – ఈ రెంటిని గురించి అతనిలో ఉన్న భావనలు, సాధారణంగా ప్రజల్లో 'మతం', 'గ్రంథం' అనే వాటిని గురించి ప్రచారంలో ఉన్న భావనలే. కాని ఇక్కడ తన ఊహాజగత్తులోని రూపానికి పూర్తిగా భిన్నమయిన రూపాన్ని చూసి అతడు ఈ గ్రంథానికి చేరువకాలేకపోతాడు. ఇంకా ఈ గ్రంథంలోని విషయా నికి మూలం చేజిక్కక పోవడంతో కొత్త నగరంలోని వీధుల్లో మార్గం తప్పి తిరుగాడే బాటసారి మాదిరిగా, అతడు పంక్తుల మధ్య తారాడుతూ ఉంటాడు. ఈ 'మార్గం తప్పటం' నుండి అతన్ని రక్షించవచ్చు. అయితే మొదటే కొన్ని విషయాలు అతనికి తప్పనిసరిగా తెలుపవలసి ఉంటుంది. నీవు పఠించబొయ్యే గ్రంథం యావత్తు ప్రపంచ సాహిత్యంలో దాని కోవకు చెందిన ఏకైక గ్రంథం. దాని సాహిత్య శైలి లోక గ్రంథా లన్నింటికీ పూర్తిగా భిన్నమయినది. దాని ఇతివృత్తం, అందులో చర్చించబడిన విషయాలు మరియు దాని కూర్పు రీత్యా కూడా అది అపూర్వమయిన గ్రంథరాజం. అందుచేత ఇంతవరకు నీవు చేస్తూ వచ్చిన పుస్తక పఠనం వల్ల ఏర్పడిన 'గ్రంథం' భావన ఈ మహత్తర గ్రంథాన్ని అర్థం చేసుకునేందుకు ఏ విధంగానూ దోహదపడదు. పైగా దీన్ని అర్థం చేసుకోవటానికి నీవు చేసే కృషిలో ఆటంకాలు సృష్టిస్తుంది. ఈ గ్రంథాన్ని అర్థం చేసుకోవాలనే అభిలాషే నీకు ఉంటే, నీవు ముందే ఏర్పరచుకున్న ఊహాలన్నింటికీ స్వస్తి చెప్పి దీని అపూర్వమయిన విశేషాలను పరిచయం చేసుకోవాలి.

దైవ మార్గదర్శకత్వం

ఈ సందర్భంలో పాఠకుడు అన్నిటికంటే ముందు ఖుర్‌ఆన్ ప్రాతిపది కను, దాని మూలాన్ని తెలుసుకోవాలి. అతడు విశ్వసించినా విశ్వసించక పోయినా, ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకునేందుకు ప్రారంభాంశంగా దానికి ఏ ప్రాతిపదికను, ఏ మూలాన్ని స్వయంగా ఈ గ్రంథం, మరియు దీన్ని అందజేసిన చివరి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సూచించారో దాన్నే స్వీకరించడం అవసరం.

(1) సర్వసృష్టికర్త, స్వామి, పాలకుడు అయిన విశ్వప్రభువు తన అనంత రాజ్యంలోని ఒక భాగమైన ఈ భూమిపై మానవుణ్ణి సృష్టించాడు : అతనికి తెలుసుకునే, ఆలోచించే, అర్థం చేసుకునే శక్తుల్ని ప్రసాదించాడు; మంచి, చెడుల విచక్షణా జ్ఞానాన్ని అనుగ్రహించాడు; ఎన్నిక సంకల్పం, ఆచరణల స్వేచ్ఛను ప్రదానం చేశాడు; తన చుట్టూ ఉన్న వస్తువుల్ని వినియోగించుకునే అధికారం ఇచ్చాడు; మొత్తంమీద ఒక విధమైన స్వయం ప్రతిపత్తి (Autonomy) ని ఇచ్చి అతన్ని భువిలో తన ప్రతినిధి (ఖలీఫా)గా నియమించాడు.

(2) మానవుణ్ణి తన ప్రతినిధిగా నియామకం చేసినప్పుడే, అతడు తనతో ఎలాంటి సంబంధాలు కలిగి ఉండాలో అతి స్పష్టంగా తెలియజేశాడు విశ్వప్రభువు. "నేను మీకూ, ఈ విశ్వానికంతటికీ స్వామిని, ఆరాధ్యుణ్ణి, పరిపాలకుణ్ణి. నా ఈ రాజ్యంలో మీరు సర్వాధికారులూ కారు, ఇతరుల బానిసలూ కారు. నేను తప్ప మరొకరెవ్వరూ మీరు పాటించే విధేయ తకు, దాస్యానికి, మీ ఉపాసనకు అర్హులుకారు. ఈ ప్రాపంచిక జీవితం లోకి మిమ్మల్ని అధికారాలిచ్చి పంపడం జరుగుతోంది. ఇది వాస్తవానికి ఒక పరీక్షా సమయం. తరువాత మీరు మళ్ళీ నా వద్దకే మరలి రావలసి ఉంటుంది. అప్పుడు నేను మీ కార్యకలాపాలను పరిశీ లించి, ఈ పరీక్షలో ఎవరు నెగ్గారో, ఎవరు నెగ్గలేదో నిర్ణయిస్తాను."

"మీరు అనుసరించవలసిన నిజ వైఖరి ఏదంటే, మీరు నన్ను మీ ఏకైక ఆరాధ్యునిగా, పాలకునిగా స్వీకరించాలి. నేను పంపే ఆజ్ఞలకు అనుగుణంగా ప్రపంచంలో జీవితం గడపాలి. ప్రపంచాన్ని పరీక్షా రంగంగా భావిస్తూ, నేను చెయ్యబోయే చివరి తీర్పులో సాఫల్యం పొందటమే మీ జీవిత పరమార్థమనే స్పృహతో జీవితం గడపాలి. ఈ వైఖరికి భిన్నంగా ఉన్న ప్రతి వైఖరీ, తప్పుడు వైఖరే. మీరు ఈ వైఖరిని అవలంబిస్తే (ఆ విధంగా చేసే స్వేచ్ఛ మీకు ఉంది)

మీకు ఇహలోకంలోనూ సుఖశాంతులు సంప్రాప్తమవుతాయి, నా వద్దకు మరలి వచ్చినప్పుడూ నేను మీకు శాశ్వత సౌఖ్యం, చిరకాల ఆనందాల నిలయమయిన స్వర్గాన్ని ప్రసాదిస్తాను. ఇదికాక మరే ఇతర వైఖరిని అవలంబించినా (దాన్ని అవలంబించే స్వేచ్ఛ కూడా మీకు ఉంది) మీరు ప్రపంచంలో అశాంతి, అరాచకాలను చవిచూడవలసి ఉంటుంది. ఇహాన్ని వదలి పరలోకాన్ని చేరినప్పుడు కూడా శాశ్వత దుఃఖం, శాశ్వత బాధల అఖాతం అయిన నరకంలో మిమ్మల్ని పడవేయటం జరుగుతుంది."

(3) ఇలా విశదపరచి విశ్వప్రభువు మానవాళికి భువిలో చోటిచ్చాడు, మానవ జాతికి తొలి జంట అయిన ఆదం, హవ్వాలకు (అల్లాహ్ వారిపై శాంతిని వర్షింపజేయుగాక!) వారూ వారి సంతతి ప్రపంచంలో పాటించవలసిన మార్గదర్శకత్వాన్ని కూడా అనుగ్రహించాడు. ఈ ఆది మానవులు అజ్ఞానపు అంధకారంలో జన్మించలేదు. దైవం ధరణిపై వారి జీవితాన్ని ప్రారంభం చేసింది విజ్ఞానపు వెలుతురులోనే. యదార్థం ఏమిటో వారికి తెలుపటం జరిగింది. వారు అనుసరించవలసిన జీవిత నియమావళిని కూడా వారికి చూపడం జరిగింది. అదే ఇస్లామ్, దైవాజ్ఞాపాలన, దైవివిధేయత. ఆదమ్, హవ్వాలు తమ సంతానానికి దైవ విధేయులుగా, ముస్లిమ్‌లుగా జీవించాలనే బోధించారు. తరువాత వచ్చిన శతాబ్దాల్లో క్రమక్రమంగా మానవులు సవ్యమయిన జీవిత విధానానికి (ఇస్లామ్ ధర్మానికి) విముఖులయి వివిధ తప్పుడు విధానాల వైపునకు పరుగుతీశారు. వారు ఆ జీవిత విధానాన్ని తమ అలక్ష్యం కారణంగా కోల్పోయారు; తమ చెడు నడత మూలంగా దాన్ని వికృతం చేశారు. భూనభాంతరాళాల్లోని విభిన్న మానవ మానవేతర శక్తుల్ని, కాల్పనిక, భౌతిక వస్తువుల్ని వారు అల్లాహ్‌కు సహవర్తులుగా ఎంచసాగారు. దైవం ప్రసాదించిన 'వాస్తవికతా జ్ఞానం'లో రకరకాల మూఢనమ్మకాలను, సిద్ధాంతాలను, తత్వాలను కలిపి వారు అసంఖ్యాకమైన మతాలను సృష్టించుకున్నారు. దైవం నిర్ణయించిన, న్యాయమయిన నైతిక నాగరిక సూత్రాలను త్రోసి రాజని లేదా వాటిని వికృతం చేసి తమ మనోకాంక్షలకు, దురభిమానాలకు అనువైన జీవిత నియమాలను చేసుకున్నారు. వీటిద్వారా అల్లాహ్ ధరణిలో దౌర్జన్యం ప్రబలిపోయింది.

(4) అల్లాహ్ తన సృష్టికి సంబంధించిన శక్తి మార్గభ్రష్టులయిన ఈ మానవుల్ని బలాత్కారంగా రుజుమార్గం వైపునకు మళ్ళించలేదు. ఎందుకంటే ఇలా

చెయ్యటం, ఆయన మానవునికి ప్రదానం చేసిన పరిమిత స్వేచ్ఛాప్రతిపత్తికి వ్యతిరేకమవుతుంది. అదే విధంగా, ద్రోహం, ధిక్కారం విజృంభించగానే ఆయన వారిని హతమార్చలేదు. ఎందుకంటే, భూమిపై మానవ జాతికి దాని విభిన్న జాతులకు ప్రపంచంలో మనుగడ సాగించటానికి ఆయన నిర్ణయించిన గడువుకు ఇది పూర్తిగా విరుద్ధమవుతుంది. అయితే ఆది నుంచే ఒక బాధ్యతను ఆయన తనపై వేసుకున్నాడు.

అది, మానవుని స్వేచ్ఛాధికారాలను కొనసాగిస్తూ అతని ఆచరణా వ్యవధి (జీవిత కాలం)లోనే అతని మార్గదర్శకత్వానికి ఏర్పాట్లను చేస్తూ ఉండటం. కాగా, తాను స్వయంగా వేసుకున్న ఈ బాధ్యతా భారాన్ని నిర్వహించటానికి, ఆయన మానవుల్లో నుంచే తనను విశ్వసించేవారిని తన అభీష్టానికి అనుగుణంగా నడచుకునేవారిని వినియోగించుకోవటం ప్రారంభించాడు. ఆయన వారిని తన దౌత్య ప్రతినిధులుగా నియమించాడు; తన సందేశాలను వారి వద్దకు పంపాడు; వారికి వాస్తవికతా జ్ఞానాన్ని ప్రసాదించాడు; వారికి నిజమయిన జీవిత నియమావళిని అనుగ్రహించాడు. మానవులు తమ అశ్రద్ధ వల్ల ఏ రుజుమార్గం నుండి తొలిగిపొయ్యారో దాని వైపునకు మళ్ళడానికి వారికి పిలుపునిచ్చే బాధ్యతను ఆయన వారికి అప్పగించాడు.

(5) ఈ దైవ సందేశహరులు వివిధ జాతుల్లో, విభిన్న దేశాల్లో ప్రభవిం చారు. వేలాది సంవత్సరాల వరకు వేలాది సంఖ్యలో వారి ఆవిర్భావం జరుగుతూనే వచ్చింది. వారందరి ధర్మం ఒక్కటే; అంటే మానవుడికి ఆదిలోనే తెలుపబడిన రుజుమార్గం. వారంతా ఒకే మార్గదర్శకత్వాన్ని అనుసరించారు; అంటే సృష్టి ప్రారంభంలోనే మానవులకై నిర్ణయించబడిన శాశ్వత నైతిక, నాగరిక సూత్రాలు. వారందరి జీవిత ధ్యేయం కూడా ఒక్కటే – ఆ ధర్మం వైపునకు, ఆ మార్గదర్శక కాంతి వైపునకు తోటి మానవుల్ని ఆహ్వానించటం, ఈ సందేశాన్ని స్వీకరించినవారిని సంఘటితపరచటం, వారి ద్వారా స్వయంగా దైవాజ్ఞాపాలన చేస్తూ, దైవవిధేయతా వ్యవస్థను స్థాపించి, దైవ శాసనాలను ఉల్లంఘించడాన్ని ప్రతిఘటించగలిగే ఒక 'ఉమ్మత్'ను (అనుచర సంఘాన్ని) సమాయత్త పరచటం. దైవప్రవక్తలు తమ తమ కాలాల్లో ఈ ధ్యేయసాధనకై ఎంతో చక్కగా కృషి చేశారు. కాని నిత్యం అత్యధిక ప్రజలు వారి సందేశాన్ని స్వీకరించటానికి ముందుకు రాలేదు. కొందరు దాన్ని స్వీకరించి ముస్లిమ్ సమాజంగా రూపొందినా వారు కూడా క్రమేణా భ్రష్టులయ్యారు. చివరికి

కొన్ని సమాజాలవారు దైవోపదేశాలను పూర్తిగా కోల్పోయారు. కొన్ని సమా ంజాలవారు దైవ బోధనల్లో మార్పులు చేర్పులు చేసి వాటిని వికృతం చేశారు.

(6) చివరికి విశ్వ ప్రభువు అరేబియాలో ముహమ్మద్ (స)ను ఎంపిక చేశాడు. గతించిన ప్రవక్తలందరూ ఏ కార్యనిర్వహణకై విచ్చేశారో దానికొరకే ఈయన్నీ ప్రభవింపజేశాడు. ఆయన (మహాప్రవక్త ముహమ్మద్) సామాన్య ప్రజలను, పూర్వపు ప్రవక్తల మార్గభ్రష్టులైన అనుచరులనూ సంబోధించారు. అందరినీ రుజుమార్గం వైపునకు పిలవడం, అందరికీ సరికొత్తగా దైవాదేశాలను అందజేయటం, ఎవరయితే ఈ సందేశాన్నీ, మార్గదర్శకత్వాన్ని స్వీకరిస్తారో వారిని, వారు స్వయంగా తమ జీవిత వ్యవస్థను దైవాదేశాలకనుగుణంగా స్థాపించుకుంటూ, లోక సంస్కరణకై నిరంతర కృషి చేసే 'అనుచర సంఘం'గా రూపొందించటం ఆయన కర్తవ్యం. ఈ సందేశం, ఈ మార్గదర్శకత్వం, ఈ ఆదేశాలు కల గ్రంథమే, అల్లాహ్ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై అవతరింపజేసిన 'దివ్య ఖుర్ఆన్'.

ప్రధాన విషయం

ఖుర్ఆన్ యొక్క ఈ ప్రాతిపదికను, ఈ మూలాన్ని తెలుసుకున్న తరువాత దాని ఇతివృత్తాన్ని, అందులోని ప్రధాన విషయాన్ని, దాని లక్ష్యాన్ని అర్థం చేసుకోవటం సులువవుతుంది.

అసలు వాస్తవికత దృష్ట్యా మానవుని సఫలతా, నిష్ఫలతలు ఎందులో ఉన్నాయి అనే విషయం దృష్ట్యా మానవుడే దీని 'ఇతివృత్తం.'

భౌతిక దృష్టి, కాల్పనిక సిద్ధాంతాలు, మనోవాంఛల బానిసత్వం- వీటి మూలంగా మానవుడు దైవం గురించి, విశ్వవ్యవస్థను గురించి తన ఉనికీ, తన ప్రాపంచిక జీవితాలను గురించి ఏర్పచుకున్న దృక్పథాలు, వాటి ఆధారంగా అతడు అవలంబించిన వైఖరులు, అన్నీ అసలు వాస్తవికత దృష్ట్యా ఎంతో లోపభూయిష్టమైనవి, పరిణామం దృష్ట్యా స్వయంగా మానవునికే ఎంతో వినాశకరమయినవి. మానవుణ్ణి తన ప్రతినిధి (ఖలీఫా)గా నియమిస్తూ అల్లాహ్ స్వయంగా సూచించినదే అసలు వాస్తవికత. ఈ వాస్తవికత దృష్ట్యా పైన "నిజ వైఖరి"గా నిర్వచించబడిన వైఖరే మానవుని మనుగడకు సరి అయినదీ, సత్ఫలితాన్ని చేకూర్చేదీనూ, ఇదే ఖుర్ఆన్‌లోని 'ప్రధాన విషయం.'

మానవుణ్ణి ఆ 'నిజ వైఖరి' వైపునకు ఆహ్వానించడం, మానవుడు తన ఉపేక్ష వల్ల కోల్పోతూ, తన నైచ్యం కారణంగా చెరిపివేస్తూవచ్చిన దైవ మార్గదర్శ కత్వాన్ని స్పష్టంగా అందజెయ్యడం, దీని లక్ష్యం, దీని ఆశయం.

పై మూడు ప్రాథమిక అంశాలను దృష్టిలో ఉంచుకుని ఎవరైనా ఖుర్‌ఆన్‌ను అధ్యయనం చేస్తే, వారికి ఈ విషయాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి.

ఈ గ్రంథం దాని ఇతివృత్తం నుండి, దాని ఆశయం నుండి, దాని ప్రధాన విషయం నుండి ఇసుమంతమయినా తొలగలేదు. ఒకే హారంలోని రకరకాల, రంగు రంగుల వజ్రాలు పొందికగా, పటిష్టంగా పొదగబడి ఉన్నట్లే ఖుర్‌ఆన్‌లోని అనేక ఉపవిషయాలు తొలి నుంచి తుది వరకు దాని ప్రధాన విషయంతో పెనవేసుకుని ఉన్నాయి. ఖుర్‌ఆన్, భూమ్యాకాశాల నిర్మాణాన్ని, మానవ సృష్టిని, సృష్టిలోని నిదర్శనల పరిశీలనను, గతించిన మానవ జాతి చరిత్రను ప్రస్తావిస్తుంది; విభిన్న మానవ సమాజాల విశ్వాసాలను, నీతీ నియమాలను, ఆచార వ్యవహారాలను విమర్శిస్తుంది; లోకోత్తర విషయాలను, సమస్యలను, విశదీకరిస్తుంది; ఇంకా ఎన్నో విషయాలను కూడా చర్చిస్తుంది. కాని భౌతిక శాస్త్రాన్నీ, చరిత్రను, తత్వశాస్త్రాన్నీ లేదా ఇంకేదయినా శాస్త్రాన్ని గాని, కళనుగాని మానవుడికి బోధించటం దాని లక్ష్యం కాదు. దీని లక్ష్యం కేవలం సృష్టి వాస్తవికత పట్ల మానవుడికున్న అపార్థాలను తొలగించటం. అసలు యదార్థాన్ని సుబోధకం చెయ్యడం, వాస్తవికతకు విరుద్ధమయిన వైఖరిని అవలంబిం చటంవల్ల కలిగే కీడును, చెడు పరిణామాలను వివరించటం, వాస్తవికతకు అనుగు ణంగా ఉన్న, మంచి పరిణామానికి దోహదం చేసే వైఖరి వైపునకు మానవుల్ని ఆహ్వానించటం. ఈ కారణం చేతనే దాని లక్ష్యానికి అవసరమయిన మేరకు అనువైన పంథాలో మాత్రమే, ప్రతి విషయాన్నీ అది ప్రస్తావిస్తుంది. ఈ విషయాలను తన అవసరం మేరకు ప్రస్తావించి తరువాత సందర్భ శుద్ధిలేని వివరాలను వదిలేసి, అది దాని ఆశయం వైపునకు, దాని ప్రధాన విషయం వైపునకు మళ్ళుతుంది. ఇక దాని వివరణలు 'ప్రధాన సందేశం' చుట్టూ ఎంతో పొందికగా, మనోజ్ఞంగా పరిభ్రమిస్తూ ఉంటాయి.

పూర్వరంగం

ఖుర్‌ఆన్ శైలిని, దాని క్రమాన్ని, అందులోని ఎన్నో విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలంటే, దాని అవతరణా విధానాన్ని అది అవతరిం చిన కాలం నాటి

సామాజిక, చారిత్రక పరిస్థితుల్ని, వాటి వెనుక ఉన్న గాథల్ని అవగాహన చేసుకోవటం తప్పనిసరి.

అల్లాహ్ దాన్ని ఒకేసారి రచించి, 'దీన్ని ప్రచురించి ప్రజల్ని ఒకే ప్రత్యేక జీవిత విధానం వైపునకు పిలువమ'ని ముహమ్మద్ (సఅసం)ను ఆజ్ఞాపిస్తూ ఇచ్చిన గ్రంథం కాదు ఖుర్ఆన్. ఇంకా, దాని ఇతివృత్తాన్ని, దాని ప్రధాన విషయాన్ని ఓ క్రమమయిన రచనా పంథాలో చర్చించిన గ్రంథం కూడా కాదు ఖుర్ఆన్. అందువల్లనే, ఖుర్ఆన్‌లో ఒక రచనాక్రమంగాని, ఒక సామాన్య పుస్తక శైలిగాని కానరాదు. అసలు విషయం ఏమిటంటే, అల్లాహ్ అరేబియా దేశంలోని ఒక నగరం మక్కాలో తన దాసుణ్ణొకణ్ణి ప్రవక్త పదవికి ఎన్నుకున్నాడు. ఆ దాసుణ్ణి తన సొంత పట్టణంలో, అందునా తన సొంత తెగ (ఖురైష్)లో సందేశ ప్రచారం ప్రారంభించాలని ఆదేశించాడు. ఈ సందేశ ప్రచార కార్యం మొదలెట్టడానికి ప్రారంభంలో ఏ ఆదేశాలు అవసరమో వాటినే ప్రోక్తం చెయ్యటం జరిగింది. అవి ఇతోధికంగా మూడు ముఖ్య విషయాలను ఆవరించి ఉన్నాయి.

మక్కాలో అవతరించిన సూరాలు

మొదటిది, ఈ మహత్తర కార్యనిర్వహణ కొరకు దైవప్రవక్త ఏ విధంగా సమాయత్తం కావాలో, ఏ పంథాలో పని చెయ్యాలో దైవప్రవక్తకు బోధించటం.

రెండోది, అసలు యదార్థానికి సంబంధించిన ప్రాథమిక విషయాలను బోధపరచటం. పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల వైఖరి, యదార్థం పట్ల గల ఏ అపార్థాల కారణంగానైతే అపసవ్యంగా తయారయిందో వాటిని సమగ్రంగా ఖండించటం.

మూడోది, "నిజ వైఖరి" వైపునకు ప్రజల్ని ఆహ్వానించటం. మానవ జీవిత సాఫల్యం, మానవుడి శుభశ్రేయాలు ఏ మౌలిక నీతిసూత్రాల అనుసరణపై ఆధారపడి ఉన్నాయో ఆ దైవధర్మ సూత్రాలను వివరించటం.

ప్రారంభంలో ఈ సందేశాలు ఇస్లామీయ ఉద్యమ ప్రారంభ దశకు అనువైన విధంగా కొన్ని చిన్న చిన్న క్లుప్తమయిన వచనాల రూపంలో అవతరిం చేవి. వాటి భాష అతి స్వచ్ఛమయినదిగా, అత్యంత మధురమయినదిగా, హృదయాన్ని హత్తుకునేదిగా, సంబోధిత ప్రజల అభిరుచికి తగిన రీతిలో మనోహర సాహిత్య శైలిని ప్రతిబింబించేదిగా ఉండేది-ఈ తీయని పలుకులు హృదయాంతరాళాల్లోకి శరవేగంతో

చొచ్చుకుపోవాలని, వీనులు వీటి రాగ సుధకు పరవశిస్తూ పరుగిడి రావాలని, వీటి మనోహర మధుర స్వరాలకు జిహ్వాలు తన్మయత్వంలో మునిగి వాటిని ఆలాపించాలని!

వీటిలో స్థానిక విషయాల ప్రస్తావన అధికంగా ఉండేది. విశ్వజనీన సత్యాలనే అవి వివరించినా, వాటి ఆధారాలు, తార్కాణాలు, నిదర్శనాలు – సమస్తం సంబోధిత ప్రజలకు సుపరిచితమయిన పరిస్థితుల నుండి, పరిసర ప్రాంతాల నుండి గ్రహించబడేవి. వారికి బోధపడాలనీ, వారిని ప్రభావితం చెయ్యాలని, వారి చరిత్రనే, వారి ఇతిహాసాన్నే, వారి అనుదినం అనుభవంలోకి వచ్చే నిదర్శనాలనే ఎల్లప్పుడూ ప్రస్తావించటం జరిగేది. వారి విశ్వాసాల్లోని, వారి నైతికతల్లోని, వారి సామూహిక జీవితంలోని చెడులనే చర్చించటం జరిగేది.

ఈ ఉద్యమ ప్రారంభ దశ దాదాపు నాలుగైదు ఏళ్ళ వరకు సాగింది. ఈ దశలో మహాప్రవక్త (సఅసం) చేసిన ధర్మ ప్రచారానికి ఫలితం మూడు రూపాల్లో కనిపించింది:

(1) కొందరు సజ్జనులు ఈ సందేశాన్ని స్వీకరించి 'ఉమ్మతె ముస్లిమ' (ముస్లిమ్ సమాజం)గా రూపొందటానికి సంసిద్ధులయ్యారు.

(2) ఎక్కువమంది ప్రజలు, అజ్ఞానం లేదా స్వార్థప్రియత్వం, లేదా తాతముత్తాతల ఆచారం పట్ల ఉన్న అభిమానం కారణంగా వ్యతిరేకించటానికే నిర్ణయించుకున్నారు.

(3) మక్కా నగరం, ఖురైష్ తెగల సరిహద్దుల్ని దాటి ఈ వినూత్న సందేశం ఇంకా సువిశాల పరిధుల్లో ప్రతిధ్వనించసాగింది.

తరువాత ఈ ఉద్యమం రెండో దశ ప్రారంభమవుతుంది. ఈ దశలో ఇస్లామీయ ఉద్యమానికి, పురాతన మూఢత్వానికి మధ్య ఎంతో తీవ్రమైన అత్యంత మనోవిదారకమయిన సంఘర్షణ ప్రారంభమయింది. ఈ సంఘర్షణ దాదాపు తొమ్మిది ఏండ్ల వరకు కొనసాగింది. కేవలం మక్కాలోను, ఖురైష్ తెగవారేకాక, అరేబియాలోని అత్యధిక భాగాల్లోనూ ప్రాచీన మూఢ వ్యవస్థ సజీవంగా ఉండాలని కోరే ప్రజలు కూడా ఈ ఉద్యమాన్ని రూపుమాపడానికి ఒడిగట్టారు; దీన్ని అణచివెయ్యటానికి కుయుక్తులన్నీ ప్రయోగించారు. దానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేశారు. దానిపై ఆరోపణలు, ఆక్షేపణలు, అనుమానాల అగ్ని వర్షం కురిపించారు. దానిపట్ల ప్రజాసామాన్యం హృదయాల్లో రకరకాల సందేహాలను సృష్టించారు; తెలియనివారు తటస్థపడితే వారు

మహాప్రవక్త (సఅసం) బోధలు వినకుండా అడ్డంకులు కల్పించారు; ఇస్లామ్ స్వీకరించే వారిపై ఘోరమయిన అత్యాచారాలు చేశారు; వారిని యాతనలకు గురిచేశారు; వారిని సాంఘికంగా, ఆర్థికంగా బహిష్కరించారు; వారిని ఎంత దారుణంగా హింసించారంటే, వారిలోని చాలామంది రెండుసార్లు తమ స్వదేశాన్ని వదలి అబిసీనియాకు వలసపొయ్యారు. చివరికి మూడోసారి వారంతా మదీనా పట్టణానికి వలసపోవలసి వచ్చింది. అయితే, ఇటువంటి తీవ్రమయిన, అనుదినం తీవ్రతరమవుతూపోయిన ప్రతిఘటన కొనసాగుతున్నప్పటికీ, ఉద్యమం వ్యాప్తిచెందుతూనే పోయింది. అప్పుడు ఏ ఒక్కరయినా ఇస్లామ్ స్వీకరించిన ఒక కుటుంబమయినా, ఒక ఇల్లయినా మక్కాలో మిగల్లేదు. ఇస్లామ్ వ్యతిరేకుల వైషమ్యంతో నిండిన విషానికి, తీవ్రతకు ఎక్కువగా కారణభూతమయిన విషయం ఏమిటంటే, వారి సొంత సోదరీ సోదరులు, కొడుకులూ కూతుళ్ళూ, మామా అల్లుళ్ళూ మొదలైన బంధువులు ఇస్లామ్ సందేశాన్ని స్వీకరించి దాన్ని అనుసరించటమే గాక, దాని కొరకు వారు తమ ప్రాణాలను సైతం త్యాగం చెయ్యగల అభిమానులుగా తయారవడం, అందునా స్వయంగా తమకు ప్రియమయిన ఆప్తులే తమతో తలపడటా నికి పూనుకోవటం – ఈ విషయాలు వారిని మరీ రెచ్చగొట్టాయి. చిత్రమేమి టంటే, పురాతన మూఢత్వంతో తెగదెంపులు చేసుకుని ఈ కొత్త ఉద్యమంలో చేరేవారంతా పూర్వం కూడా సమాజంలో సజ్జనులుగా, ఉత్తములుగా పరిగణించబడేవారే. ఈ ఉద్యమంలో చేరిన తరువాత వారు ఎంతో రుజువర్తనులుగా, సత్యసంధులుగా, సద్గుణ సంపన్నులుగా తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్నారు. ఇలాంటి వ్యక్తుల్ని ఆకర్షించి వారిని ఈ విధంగా రూపొం దిస్తున్న ఈ సందేశం మహత్తును, గొప్పతనాన్ని ప్రపంచం గుర్తించకుండా ఉండటం అసంభవం.

సుదీర్ఘమైన ఈ తీవ్ర సంఘర్షణా కాలంలో అల్లాహ్ సమయ సందర్భాలనుబట్టి, అవసరానికి అనువుగా, తన ప్రవక్త (సఅసం)పై ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలను అవతరింపజేశాడు. వాటిలో, ప్రవాహాల్లాంటి ఉరవడి, వరద ల్లాంటి శక్తి, తీవ్రమయిన అగ్ని జ్వాలల్లాంటి ఉద్వేగం ఉండేవి. ఈ ప్రసంగాల్లో ఒక వైపు విశ్వసించినవారికి వారి ప్రాథమిక విధులేవో తెలుపటం జరిగింది, వారిలో సామూహిక చైతన్యం ప్రదీప్తం చెయ్యబడింది, వారికి భయభక్తుల్ని, ఉన్నత గుణగణాలను, పరిశుద్ధ స్వరూప స్వభావాలను పెంపొందించుకోవాలని బోధించటం

జరిగింది. సత్యధర్మాన్ని ప్రచారం చేసే విధానాలు తెలుపబడ్డాయి. విజయాన్ని చేకూర్చే వాగ్దానాలతో, పరలోకంలో సాఫల్యం ప్రసాదించే శుభవార్తలతో వారికి ధైర్యం చెప్పటం జరిగింది. ఓరిమితో, నిలకడతో, తొణకని ధీమాతో అల్లాహ్ మార్గంలో కృషి చెయ్యాలని ఉత్తేజపరచటం జరిగింది. ఎలాంటి కష్టాన్నయినా సహించేందుకు, ఎంత గొప్ప వ్యతిరేకతనైనా ఎదుర్కొనేందుకు, వారిలో ప్రాణాలొడ్డి కృషిచేసే అపూర్వమయిన ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని ప్రజ్వలితం చెయ్యడం జరిగింది. మరొకవైపు ఉద్యమాన్ని వ్యతిరేకించేవారినీ, రుజుమార్గం నుండి విముఖులయినవారినీ, నిర్లక్ష్యపు నిద్రపొయ్యే వారినీ, వారు బాగా ఎరిగిన జాతుల ఇతిహాసం నుండి, అవి ఎలా ముగి శాయో ఎత్తిచూపడం జరిగింది. వారు నిత్యం ప్రయాణం చేసే మార్గాల్లోని శిథిలమై పోయిన పట్టణాల అవశేషాల ద్వారా గుణపాఠం గ్రహిం చాలని బోధించడం జరిగింది.

ఇంకా వారు రేయింబవళ్ళు భూమ్యాకాశాల్లో తమ చర్మ చక్షువులతో స్పష్టంగా చూచే, ఇంకా వారు స్వయంగా తమ జీవితాల్లోనూ నిత్యం తిలకించే, అనుభవించే ప్రస్ఫుటమయిన నిదర్శనాల ద్వారా దేవుని ఏకత్వానికీ, మరణా నంతర జీవితానికీ సంబంధించిన దృష్టాంతాలు, తార్కాణాలు సూచించబడ్డాయి. బహుదైవారాధన, సర్వస్వతంత్రతా భావన, పరలోక నిరాకరణ, పూర్వీకుల అంధానుకరణ మొదలయిన విషయాల్లోని ఘోరమైన తప్పుల్ని ఎంతో స్పష్టమయిన ఆధారాల ద్వారా హృదయాన్ని హత్తుకుని మదిలో ముద్రవేసేలా విశదీకరించటం జరిగింది. వారి ఒక్కొక్క సంశయాన్ని దూరం చేసి, వారి ఒక్కొక్క అధిక్షేపణకు సమంజసమయిన సమాధానం ఇవ్వబడింది. ఏ సమస్యల్లోనయితే స్వయంగా వారు ఇరుక్కున్నారో, లేదా ఏ చిక్కుల్లో వారు ఇతరుల్ని ఇరికించటానికి ప్రయత్నించేవారో వాటిని పరిష్కరించటం జరిగింది. మొత్తానికి మూఢత్వాన్ని నలువైపుల నుండి చుట్టుముట్టి ఊపిరాడకుండా చేసి, దాన్ని విజ్ఞతా వివేకాల జగత్తులో నిలువ నీడలేకుండా చెయ్యటం జరిగింది. ఇంకా వీటితో పాటు ఆ ఉపన్యాసాల్లో దైవాగ్రహం, ప్రళయ బీభత్సం, నరకబాధల వర్ణనల ద్వారా వారిని భీతిగొలపటం జరిగింది. వారి చెడు నడవడికను, వారవలంబించే తప్పుడు జీవిత విధానాన్ని, వారిని వెంటాడుతున్న మూఢాచారాలను నిశితంగా విమర్శించటం జరిగింది. వారనుసరిస్తున్న సత్యద్వేషం, విశ్వసించినవారి పట్ల జరిపే హింసా వైఖరిని ఖండించి, అన్ని కాలాల్లో దైవ సమ్మతమయిన ఉత్తమ సంస్కృతికి ప్రాతిపది కలయిన ముఖ్యమయిన మౌలిక సూత్రాలను సూచించటం జరిగింది.

ఈ దిశలోనే ఇస్లామీయ ఉద్యమం ఎన్నో మలుపులు తిరిగింది. ప్రతి మలుపు లోనూ సందేశం ఇతోధికంగా వ్యాప్తి కాసాగింది. ఇటు కృషి, అటు దానికి అవరోధాలు రెండూ తీవ్రతరమయ్యాయి. విభిన్న నమ్మకాలు, వివిధ సంప్రదాయాలు కల ప్రజలు ఎదురయ్యారు. దాని కనుగుణంగానే అల్లాహ్ పంపే ఉపదేశాల్లోనూ సందర్భోచితమైన వైవిధ్యం అధికమవసాగింది. ఇది ఖుర్ఆన్ మక్కా జీవితపు పూర్వరంగం.

మదీనాలో అవతరించిన సూరాలు

మక్కాలో ఈ ఉద్యమం ప్రారంభమై పదమూడేండ్లు గడచిపొయ్యాయి. ఆ తరుణంలో అకస్మాత్తుగా మదీనా నగర రూపంలో ఈ ఉద్యమానికి ఒక కొత్త కేంద్రం ప్రాప్తమయింది. అక్కడ అరేబియా భూభాగం నలుమూలల నుండి ఉద్యమ అనుయాయుల్ని సమీకరించి, దాని శక్తిని సంఘటితపరచు కోవడం సాధ్యమయింది. కాగా, మహాప్రవక్త (సఅసం), ఇంకా ఎంతోమంది ఇస్లామ్ అనుయాయులు మదీనా పురానికి వలసపొయ్యారు. ఈ విధంగా ఈ ఉద్యమం మూడో దశలో ప్రవేశించింది. ఈ దిశలో పరిస్థితుల రూపురేఖలే మారిపొయ్యాయి. ముస్లిమ్ అనుచర సమాజం (ఉమ్మతె ముస్లిమ) సక్రమంగా ఒక ప్రభుత్వానికి నాంది వెయ్యటంలో విజయం సాధించింది. పురాతన మూఢత్వపు ధ్వజవాహకులపై సాయుధ పోరాటం ప్రారంభమైంది. పూర్వపు ప్రవక్తల అనుయాయులు (యూదులు, క్రైస్తవులు) సయితం ఉద్యమాన్ని వ్యతిరేకించ నారంభించారు; ముస్లిమ్ సమాజం అంతర్గత వ్యవస్థలోకి కపటులు (మునాఫిఖ్‌లు) ప్రవేశించారు; వారిని కూడా ఎదుర్కోవలసివచ్చింది. ఈ విధంగా పదేళ్ళ అత్యంత తీవ్ర సంఘర్షణా వ్యవస్థను అధిగమించి, ఈ ఉద్యమం చివరకు విజయ శిఖరాలను చేరుకోగలిగింది - అప్పుడు మొత్తం అరబ్బు దేశమే దానికి దాసోహమన్నది. విశ్వవ్యాప్తంగా సంస్కరణా సందేశాల కవాటాలు తెరచుకున్నాయి.

ఈ దశలో కూడా ఎన్నో మలుపులు తారసపడ్డాయి. ప్రతి మలుపు లోనూ ఉద్యమానికి ప్రత్యేక అవసరాలు ఎన్నో ఎదురయ్యాయి.

ఈ అవసరాల కనుగుణంగా మహాప్రవక్త (సఅసం) పై అల్లాహ్ అవతరింపజేసిన ఉపన్యాసాల్లో ఎంతో వైవిధ్యం కానవచ్చేది. ఒకప్పుడు అవి జ్వాలలు క్రక్కే ఉద్వేగపూరితమయిన ఉపన్యాసాల్లో అవతరిస్తే, మరొకప్పుడు అవి ప్రభువు జారీ చేసే ఆజ్ఞలు, ఫర్మానాల్లో సాక్షాత్కరించేవి. ఒకసారి ఆ ప్రసంగాల్లో ఉపాధ్యాయుని బోధనా శిక్షణా శైలి గోచరిస్తే, మరోసారి సంస్కర్త చేసే ప్రబోధాల ధోరణి కానవచ్చేది.

ఆ ఉపన్యాసాల్లో సమాజ నిర్మాణాన్ని, రాజ్య వ్యవస్థీకరణను, ఉత్తమ నాగరికతా స్థాపనను ఎలా చేపట్టాలో, జీవితపు విభిన్న విభాగాలను ఏ సిద్ధాంతాల, ఏ నియమాల ఆధారంగా తీర్చిదిద్దాలో, కపటుల (మునాఫిఖ్‌ల)తో ఎలా వ్యవహరించాలో, జిమ్మీల (ఇస్లామీయ రాజ్య రక్షణలో ఉన్న ముస్లిమేతరుల) పట్ల ఎటువంటి వైఖరిని అవలంబించాలో, గ్రంథం కలవారి (యూదులు, క్రైస్తవుల)తో ఎటువంటి సంబంధాలు పెట్టుకోవాలో, యుద్ధానికి సన్నద్ధులైన శత్రువుల పట్ల, ఒడంబడిక చేసుకున్న జాతుల పట్ల ఏ విధానాన్ని అనుసరించాలో, ఇంకా, సంఘటితమైన ఈ ముస్లిమ్ సమాజం ప్రపంచంలో తనపై మోపబడిన దైవ ప్రాతినిధ్యపు బాధ్యతలను నిర్వహించటానికి ఏ విధంగా సన్నద్ధమవ్వాలో మొదలయిన ముఖ్య విషయాల పట్ల సూచనలు ఇవ్వబడ్డాయి.

ఈ ఉపన్యాసాల్లో ఒక వైపున ముస్లిమ్‌లను సుశిక్షితులుగా తీర్చిదిద్దే బోధలుండేవి; వారి బలహీనతల పట్ల వారిని హెచ్చరించడం జరిగేది. అల్లాహ్ మార్గంలో ధన ప్రాణాలతో శాయశక్తులా కృషి చేసేందుకు ఉత్తేజపరచడం జరిగేది. జయాపజయాల్లో, కష్టసుఖాల్లో, కలిమిలేముల్లో, భయనిర్భయావస్థల్లో – అన్ని పరిస్థితుల్లోను – సందర్భానికి తగిన విధంగా నైతిక హితవులు బోధింపబడేవి. మహాప్రవక్త (సఅసం) తరువాత వారి స్థానంలో సందేశ సంస్కరణల ఈ బృహత్తర కార్యాన్ని నిర్వహించేందుకు తగిన విధంగా వారిని సమాయత్తపరచటం జరిగేది; మరొక వైపున విశ్వాస (ఈమాన్) పరిధికి వెలుపల ఉన్న గ్రంథం కలవారికి, కపటులకు, ధర్మధిక్కారులకు, బహుదైవోపాసకులకు, వారి వారి విభిన్న పరిస్థితులకు అనువైన రీతిలో బోధపరచటానికి, మృదువుగా సందేశం వైపునకు ఆహ్వానించటానికి, కఠినంగా హెచ్చరించటానికి, హితోపదేశం చెయ్యటానికి, దైవాగ్రహం వల్ల లభించే శిక్షను గురించి వారిని భయపెట్టటానికి గుణపాఠం గరిపే సంఘటనలు, సమాచారాల ద్వారా శిక్షణ గ్రహించేలా చెయ్యటానికి ప్రయత్నం చెయ్యబడింది. ఇదీ మదీనా సూరాల పూర్వ రంగం.

శైలి

పై వివరణ వల్ల విశదమయ్యేదేమిటంటే, ఖుర్ఆన్ ఒక సందేశాత్మక ఉద్యమంతోపాటే అవతరించసాగింది. ఈ సందేశం ప్రారంభమయి పరిపూర్ణత చెందే వరకు గల 23 సంవత్సరాల కాలంలో ఏ ఏ దశలు, ఏ ఏ మలుపులు దాటిందో,

ఆ పరిస్థితుల విభిన్న అవసరాలకు అనుగుణంగా ఖుర్‌ఆన్‌లోని విభిన్న భాగాలు అవతరించాయి. కనుక డాక్టరేట్ (ఆచార్య) పట్టా పొందే ఉద్దేశ్యంతో వ్రాసే పరిశోధనా పత్రంలో అనుసరించబడే రచనా క్రమం ఇటువంటి గ్రంథంలో సాధ్యపడదనే విషయం సుస్పష్టం. ఇంకా ఈ సందేశ ప్రగతికి అనువుగా అవతరించిన చిన్న, పెద్ద ఖుర్‌ఆన్ భాగాలను చిన్న చిన్న పుస్తకాల రూపంలో ప్రచురించటం కూడా జరగలేదు. అవి ఉపన్యాసాల రూపంలో ప్రజల ముందుకు వచ్చేవి. అలాగే ప్రజల్లో వ్యాప్తినొందేవి. అందుచేత వాటి శైలి కూడా గ్రంథ శైలి కాదు. అది ప్రసంగాల శైలి. ఈ ప్రసంగాలు సయితం ఒక ప్రొఫెసర్‌గారి లెక్చర్ల మాదిరిగా కాక ఒక సందేశప్రదాత చేసే ఉపన్యాసాల తీరులో ఉండేవి. ఆయన మనస్సునూ, మస్తిష్కాన్నీ, బుద్ధినీ, వివేకాన్నీ, భావోద్రేకాలను ఆకర్షించవలసి ఉంటుంది. ఆయనకు వివిధ మనస్తత్వాల ప్రజలు తారసపడతారు. ఆయన తన సందేశ ప్రచారంలోను ఉద్యమాన్ని క్రియాత్మకంగా నడపడంలోను వివిధ పరిస్థితుల్ని ఎదుర్కొనవలసి ఉంటుంది. ఇంకా ఆయన సాధ్యమైనన్ని విధాలుగా తన మాటను ఎదుటివారికి అర్థమయ్యేలా చెప్పటం, వారి ఆలోచనా జగత్తునే మార్చటం, వారి భావోద్రేకాల్లో సంచలనం సృష్టించటం, వ్యతిరేక శక్తుల్ని ఛిన్నాభిన్నం చెయ్యటం, సహచరుల సంస్కరణకు, సుశిక్షణకు తగిన ఏర్పాట్లు చెయ్యటం, వారిలో ఉత్తేజాన్ని, వజ్ర సంకల్పాన్ని సృజించటం, విరోధుల్ని ఆత్మీయులుగా, తిరస్కరించేవారిని స్వీకరించేవారుగా మార్చటం, ప్రత్యర్థుల వాదనలను ఖండించటం, వారి నైతిక శక్తిని, ఆత్మ విశ్వాసాన్ని నిర్మూలించటం వంటి పనుల్ని చెయ్యవలసి ఉంటుంది. అంటే, ఒక సందేశ ప్రదాతగా, ఒక ఉద్యమ నాయకునిగా తప్పనిసరిగా చెయ్యవలసిన పనులన్నీ ఆయన చెయ్యవలసి ఉంటుంది. కనుకనే, ఈ కార్యనిర్వహణ కొరకు అల్లాహ్ తన ప్రవక్తపై అవతరింపజేసిన ఉపన్యాసాల ప్రసంగ శైలి ఒక ఉద్యమానికి సముచితమయిన రీతిలోనే ఉంది. వాటిలో కాలేజీ లెక్చర్ల శైలిని వెదకటం పొరపాటు.

దీన్నిబట్టే ఖుర్‌ఆన్‌లో ఇంత ఎక్కువగా విషయాల పునరుక్తి ఎందుకు ఉందో చక్కగా బోధపడుతుంది. ఒక సందేశానికి, ఒక ఆచరణాత్మక ఉద్యమానికి స్వాభావికంగా అవసరమయ్యేదేమిటంటే, అది ఎప్పుడు ఏ దశలో ఉంటుందో, అప్పటికి ఆ దశకు సంబంధించిన విషయాలనే చర్చించాలి. ఉద్యమం ఒక దశలో ఉన్నప్పుడు, భావి దశల మాట ఎత్తకూడదు. కేవలం ఆ దశకు వర్తించే విషయాలనే మళ్ళీ మళ్ళీ

పునరావృతం చేస్తూ ఉండాలి. ఇలా కొన్ని నెలల వరకు లేదా కొన్ని సంవత్సరాల వరకు జరిగినా ఫరవాలేదు. అయితే ఒక విషయాన్ని మళ్ళీ మళ్ళీ వల్లించేటప్పుడు, ఒకే పదజాలాన్ని, ఒకే శైలిని ప్రయోగిస్తే దాన్ని వినీ వినీ చెవులు మొద్దుబారిపోతాయి. శ్రోతలో విసుగుదల జనిస్తుంది. అందుకే ప్రతి దశలోనూ పునరావృతం కాగల విషయాలను ప్రతిసారీ కొత్త పదాల్లో, సరికొత్త శైలిలో, సరికొత్త రీవితో చెప్పటం కూడా చాలా అవసరమే. అప్పుడే అవి మనోజ్ఞంగా హృదయాల్లో నాటుకుంటాయి. ఉద్యమం ఒక్కొక్క దశ పటిష్ఠవంతం అవుతూ పోతుంది. దీనితోపాటు, ఈ సందేశం ఏ విశ్వాసాల, ఏ సిద్ధాంతాలపై ఆధారభూతమయి ఉందో అది తొలి మెట్టు నుండి చివరి గమ్యం వరకు సర్వకాల సర్వావస్థల్లోనూ కనుమరుగవకుండా జాగ్రత్తపడాలి, అంతేకాదు, ఎట్టి పరిస్థితిలోను ఉద్యమం ప్రతి దశలోనూ వాటి పునశ్చరణ జరుగుతూ ఉండాలి. ఈ కారణం వల్లనే, ఇస్లామీయ ఉద్యమం ఒక దశలో అవతరించిన అన్ని సూరాల్లోనూ సామాన్యంగా ఒకే విధమయిన విషయాలు, పదజాలాన్ని శైలిని మార్చి మార్చి చెప్పడం జరిగింది. కానీ దేవుని ఏకత్వం, ఆయన గుణవిశేషాలు, పరలోకం, అక్కడ జరిగే పరీక్ష, అక్కడ లభించే శిక్షా బహుమానాలు, దైవదౌత్యం, దైవ గ్రంథం పట్ల విశ్వాసం, భయభక్తులు, సహనస్థయిర్యాలు, అల్లాహ్‌పై భారం మోపటం మొదలయిన మౌలిక విషయాల పునశ్చరణ మాత్రం ఖుర్ఆన్ అంతటా కనిపిస్తుంది. ఎందుకంటే, ఉద్యమం ఏ దశలో ఉన్నా, వీటిపట్ల ఉపేక్షాభావం సహింపరానిదే. ఈ మౌలిక భావనలు ఏమాత్రం సడలినా, ఇస్లామీయ ఉద్యమం దాని నిజ స్వరూపంలో ఒక్క అడుగు కూడా ముందుకు పోగలిగేది కాదు.

క్రమం

మక్కీ, మదనీ సూరాలను గురించి పై వివరణను శ్రద్ధగా పరిశీలిస్తే, ఖుర్ఆన్ అవతరించిన క్రమంలోనే దాన్ని మహాప్రవక్త (స) ఎందుకు సంకలనం చెయ్యలేదనే ప్రశ్న కూడా పరిష్కృతమవుతుంది.

సందేశం ప్రారంభమై ఏ క్రమంలో పరిణామం చెందిందో, విస్తరిం చిందో, అదే క్రమంలో 23 ఏళ్ళ వరకు ఖుర్ఆన్ అవతరణ జరిగిందనే యదార్థం మనకు పై విషయాల అవలోకనం ద్వారా తెలిసింది. ఇలా అవతరించిన ఖుర్ఆన్ భాగాలను, కేవలం సందేశ పరిణామ దశకే సముచితమయిన క్రమంలోనే, సందేశం పరిపూర్ణత చెందిన తరువాత కూడా కూర్చటం ఏ విధంగానూ భావ్యం కాదనే విషయం ద్యోతక

మవుతూనే ఉంది. ఇప్పుడయితే సందేశ పరిపూర్ణత పిదప ఉత్పన్నమయ్యే పరిస్థితులకు అనువయిన మరో క్రమమే ఎంతయినా అవసరం. ఎందుకంటే, ప్రారంభ కాలంలో ఖుర్ఆన్ సంబోధితులు ఇస్లామ్ గురించి ఏమాత్రం తెలియనివారు. అందువల్లనే అప్పుడు ప్రాథమిక స్థాయి నుండి బోధన, హితవు గరపడం జరిగింది. కాని సందేశ పరిపూర్ణత తరువాత, దాని సంబోధిత ప్రజలు ఆ సందేశాన్ని స్వీకరించిన ఒక ఉమ్మత్ (అనుచర సంఘం)గా ఏర్పడినవారు. వీరిపై మహాప్రవక్త (సఅసం) సైద్ధాంతికంగాను, క్రియాత్మకంగానూ పరిపూర్ణం చేసి అప్పగించిన మహత్కార్యాన్ని ముమ్ముందుకు నడిపించే భారం మోపబడింది. ఇప్పుడు వీరు స్వయంగా తమ విద్యుక్త ధర్మాలేవో, తాము అనుసరించవలసిన జీవన నియమాలేవో, వెనుకటి ప్రవక్తల అనుచర సంఘాల్లో ఉత్పన్నమయిన ఉపద్రవాలేవో తెలుసుకోవటం అనివార్యంగా ప్రాధాన్యత వహించింది. ఆ తరువాత వీరు ఇస్లామ్‌ను గురించి ఏమీ తెలియక అంధకారంలో పడివున్న మిగతా ప్రపంచానికి ఈ దైవోపదేశాన్ని అందజేయటానికి ముందుకు రావలసిన విషయమూ ప్రాధాన్యత వహించింది.

మరొక విషయం, ఖుర్ఆన్ ఎటువంటి గ్రంథమో మనిషి అర్థం చేసుకుంటే, ఒక్కొక్క కోవకు చెందిన విషయాలను ఒక్కొక్క చోట సమకూర్చటం ఈ గ్రంథం నైజానికే జతపడదనే యదార్థం దానంతట అదే అవగతమవు తుంది. ఈ గ్రంథం స్వభావం దృష్ట్యా కావలసింది ఏమిటంటే, పఠితల ముందు, మక్కా దశలోని బోధల మధ్యన మదీనా దశలోని విషయాలు, మదీనా దశలోని ఉపన్యాసాల మధ్య మక్కా దశలోని ప్రవచనాలు, ప్రారంభంలోని సంభాషణలు, చివరి హితోపదేశాల నడుమ, చివరి రోజుల్లోని ఆదేశాలు, ప్రారంభం నాటి నిర్దేశాలతో పాటు మాటిమాటికీ వస్తూ ఉండాలి. ఎందుకంటే, ఇలా వస్తూ ఉంటేనే ఇస్లామ్ పరిపూర్ణ దర్శనం, సమగ్ర రూపం పఠితల దృష్టిలో అనునిత్యం మసలుతూ ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠకుడు ఒకే వైపునకు మొగ్గకుండా ముందుకు సాగిపోగలడు – ఇదీ ప్రస్తుతం మనకు గోచరించే ఖుర్ఆన్ కూర్పులోని మర్మహేతువు.

ఇకపోతే, ఖుర్ఆన్‌ను దాని అవతరణాక్రమంలో సంకలనం చేస్తే అది తరువాతి ప్రజలకు, అర్థం కావాలంటే, ఖుర్ఆన్‌తో పాటు అది అవతరించిన చరిత్రను, దాని ప్రతి భాగం అవతరణాస్థితి వివరాలను, అవతరణా సందర్భాన్ని, తదితర విషయాలన్నింటినీ గ్రంథస్థం చేసి ఖుర్ఆన్‌కు తోడుగా జతపరచవలసి

ఉంటుంది. దాన్ని ఖుర్ఆన్‌కు ఒక అనుబంధంగా పెట్టడం అనివార్యమవుతుంది. అలా చెయ్యటం వల్ల అల్లాహ్ ఏ ఉద్దేశ్యంతో తన ఈ దివ్య వాణిని కూర్పు చేయించి భద్రపరిచే ఏర్పాటు చేశాడో, ఆ ఉద్దేశ్యం భంగమవుతుంది. ఎందుకంటే, స్వచ్ఛ మయిన దైవవాణి, ఇతర రచనల ఎలాంటి కల్తీ జరగకుండా, దాని సమగ్ర, సంగ్రహ రూపంలో సంకలనం కావాలన్నదే అసలు ఉద్దేశ్యం. అది పిల్లలకు, పెద్దలకు, యువకులకు, వృద్ధు లకు, స్త్రీలకు, పురుషులకు, పల్లెవాసులకు, పట్టణవాసులకు, పండితులకు, పామరులకు అందరికీ అందుబాటులో ఉండాలని, అందరూ దాన్ని చదవగల గాలి అన్నదే ఆ ఉద్దేశ్యం. ఇంకా ప్రజలు, ప్రతివేళా, ప్రతిచోటా, ప్రతి నెలవులో దాన్ని చదవగలగాలి. బుద్ధిజ్ఞానాలు ఏ స్థాయిలో ఉన్న మనిషి అయినా, అతడు కనీసం తన ప్రభువు తనను కోరేదేమిటో, కోరనిదేమిటో తప్పనిసరిగా తెలుసుకోగలగాలి. అలాంటప్పుడు ఈ దైవ ప్రవచనాలకు తోడుగా సుదీర్ఘమయిన చరిత్రనొకదాన్ని జతపరచి దాని పఠనం కూడా తప్పనిసరే అనే నిబంధన ఉన్నట్లయితే, ఉద్దేశ్యం పూర్తిగా భంగమవుతుందన్న విషయం వ్యక్తమవుతూనే ఉంది.

అసలు విషయం ఏమిటంటే, ఖుర్ఆన్ ప్రస్తుత క్రమాన్ని ఆక్షేపించేవారు దాని ఉద్దేశ్యాన్ని, లక్ష్యాన్ని అసలు ఎరుగరు. పైగా ఈ గ్రంథం, చరిత్ర, మానవ శాస్త్రాల (Humanities) అధ్యయనం చేసే విద్యార్థుల కొరకు అవతరించిందనే అపోహకు కూడా వారు గురిఅయినట్లు అనిపిస్తోంది.

ఖుర్ఆన్ కూర్పు క్రమాలను గురించి మరొక మాటను కూడా పఠితలు తెలుసుకోవాలి. ఈ కూర్పు తరువాతివారు చేసింది మాత్రం కాదు. స్వయంగా అల్లాహ్ ఆదేశానుసారం మహాప్రవక్త (సఅసం) తానే ఈ కూర్పును చేశారు. దీనిగ్గాను అనుసరించిన పద్ధతి ఏమిటంటే, ఏదయినా సూరా అవతరించి నప్పుడు వెంటనే ఆయన తన లేఖకులలోని ఒకర్ని పిలిపించేవారు. దాన్ని సక్రమంగా గ్రంథస్థం చేయించిన తరువాత, ఈ సూరా ఫలానా సూరా తరువాత, ఫలానా సూరాకు ముందు అమర్చాలని ఆదేశించేవారు. అదే విధంగా, ఖుర్ఆన్‌లో కొంత భాగం మాత్రమే అవతరించినప్పుడు, దాన్ని ఒక ప్రత్యేక సూరాగా చెయ్యడం ఉద్దేశ్యం కాకపోతే, దాన్ని ఫలానా సూరాలో ఫలానా చోట గ్రంథస్థం చెయ్యాలని ఆయన ఆజ్ఞాపించేవారు. ఇంకా, అదే క్రమాన్ని నమాజ్‌లోనూ, ఇతర సందర్భాల్లో ఖుర్ఆన్ చదివేటప్పుడు కూడా స్వయంగా మహాప్రవక్త (సఅసం) అనుసరించేవారు. అదేక్రమంలో సహాబా

(రజిఅన్) (మహాప్రవక్త సహచరులు) కూడా ఖుర్ఆన్‌ని కంఠస్థం చేసుకునే వారు. కనుక ఏ రోజయితే ఖుర్ఆన్ అవతరణ ముగిసిందో, అదే రోజున ఖుర్ఆన్ కూర్పు కూడా ముగిసింది అనే విషయం నిర్ధారిత చారిత్రక సత్యం. దాన్ని అవతరింపజేసిన దేవుడే దాని కూర్పు కూడా చేశాడు. ఎవరి హృదయ ఫలకంపై అది అవతరించిందో, ఆయన పవిత్ర హస్తాల మీదుగానే దాని కూర్పు చేయించడం కూడా జరిగింది. ఇందులో జోక్యం కలుగజేసుకోవటం ఇతరులెవరి తరమూ కాదు.

కూర్పు

మొదటి నుండే ముస్లిమ్‌లపై నమాజ్★ ఒక విధి కావడం వల్లనూ, నమాజ్‌లో ఖుర్ఆన్ పఠనం తప్పనిసరి అంశంగా నిర్ణయించబడటం వల్లనూ, ఖుర్ఆన్ అవతరణతో పాటే ముస్లిమ్‌లు ఖుర్ఆన్‌ను కంఠస్థం చేసుకునే ఆచారం ప్రారంభ మయింది. ఖుర్ఆన్ అవతరణ జరుగుతూపోయినకొద్దీ, ముస్లిమ్‌లు దాన్ని కంఠస్థం చేసుకుంటూపొయ్యారు. కనుక ఖుర్ఆన్ సంరక్షణ కేవలం మహాప్రవక్త (సఅసం) తన లేఖకుల ద్వారా గ్రంథస్థం చేయించిన ఖర్జూరపు ఆకులు, ఎముకలు, తోలు పొరలపై మాత్రమే ఆధారపడి ఉండలేదు. ఖుర్ఆన్ అవతరణ జరగగానే కొందరు వ్యక్తులు, ఆ తరువాత కొన్ని వందల మంది, ఆ తరువాత కొన్ని వేలమంది ప్రజలు, తరువాత కొన్ని లక్షల మంది దాన్ని తమ హృదయఫలకాలలో భద్రపరచుకున్నారు. ఇక ఏ షైతాన్‌కయినా సరే దానిలోని ఒక్క అక్షరాన్ని కూడా తారుమారుచేసే ఆస్కారమే లేకుండాపోయింది.

మహాప్రవక్త (సఅసం) పరమపదించిన తరువాత అరేబియాలో ఇర్తిదాద్ (ధర్మ పరిత్యాగం – Apostasy) పెనుతుఫానులా విజృంభించినప్పుడు, దాన్ని అణచటానికి సహాబా (రజిఅన్) (ప్రవక్త సహచరులు) యుద్ధాలు చెయ్యవలసి వచ్చింది. అలా జరిగిన యుద్ధాల్లో ఖుర్ఆన్‌ను పూర్తిగా కంఠస్థం చేసుకున్న సహాబా (రజిఅన్) చాలామంది షహీద్ (అమరగతులు) అయ్యారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజిఅన్) కు ఒక ఆలోచన తట్టింది. ఖుర్ఆన్ పరిరక్షణ విషయంలో ఒకే ఆధారాన్ని పూర్తిగా నమ్ముకోవడం శ్రేయస్కరం కాదు గనక, హృదయ ఫలకాల పైననే కాకుండా, కాగితపు

★ ఐదు పూటలు నమాజ్ విధిగా చెయ్యాలన్న నియమమయితే మహాప్రవక్త ప్రభవించిన ఎన్నో ఏండ్లకు ఖరారయింది. కాని స్వతహాగా నమాజ్ మాత్రం తొలినాటి నుండే విధిగా ఉంటూ వచ్చింది. నమాజ్ విధిగా లేకుండా మాత్రం ఇస్లామ్‌లో ఒక్క క్షణమయినా గడవలేదు.

పుటలపై కూడా దాన్ని భద్రపరచే ఏర్పాట్లు చెయ్యటం అత్యంతావశ్యకం అని ఆయన భావించి, ఆ విషయాన్నే హజ్రత్ అబూబక్ర్ (రజిఅన్)కు తెలిపారు. మొదట ఆయన కొంత తటపటాయించిన తరువాత ఉమర్ (రజిఅన్) అభిప్రాయంతో ఏకీభవించారు. మహాప్రవక్త (సఅసం)కు లేఖకులు (సెక్రటరీ)గా సేవచేసిన హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజిఅన్) ఈ కార్యనిర్వహణకు నియమించబడ్డారు. దీనికి నిర్ణయిం చబడిన విధానమేమిటంటే, ఒక వైపున మహాప్రవక్త (సఅసం) వ్రాయించి పొందు పరచిన భాగాలన్నీ ప్రోగు చెయ్యాలి. మరొకవైపున సహాబా (రజిఅన్)ల్లో ఎవరివద్దనైనా పూర్తి ఖుర్ఆన్ లేదా దాని భాగం ఏదయినా గ్రంథస్థం చెయ్యబడి ఉన్నట్లయితే, దాన్ని వారి వద్దనుండి సేకరించాలి.★ ఆ తరువాత ఖుర్ఆన్ హాఫిజ్‌ల (ఖుర్ఆన్ స్మర్తలు) సహకారం పొందాలి. ఈ మూడు ఆధారాల ఏకగ్రీవ సాక్ష్యంతో, పరిపూర్ణ స్వచ్ఛత సిద్ధించినట్లు తృప్తి కలిగినప్పుడే, ఖుర్ఆన్ ఒక్కొక్క పదాన్ని ముస్‌హాఫ్ (ఖుర్ఆన్ మూలప్రతి)లో గ్రంథస్థం చెయ్యాలి. ఈ నిర్ణయం మేరకు ఖుర్ఆన్ ఒక ప్రామాణిక ప్రతిని తయారుచేసి విశ్వాసుల మాతృమూర్తి (ఉమ్ముల్ మోమినీన్) ★★ హజ్రత్ హఫ్సా (రజిఅన్) వద్ద భద్రపరిచారు. అవసరమున్న వారు దాన్ని నకలు చేసుకోవటానికి లేదా దానితో పోల్చి చూసుకుని తమ వద్దనున్న ప్రతిని సరిదిద్దుకోవటానికీ ప్రజలకు అనుమతి ఇవ్వబడింది.

ఉచ్చారణా విభేదాలు

మనలో ఉన్నట్లే ఆ కాలంలో అరబ్బుల్లో కూడా ఉచ్చారణా విభేదాలు (యాసలు) ఉండేవి. మన దేశంలోని హిందీ, ఉర్దూ, తెలుగు, పంజాబి, బెంగాలి భాషల్లో – ఏ భాషనైనా సరే – ఒక మండలానికీ, మరో మండలానికీ, ఒక పట్టణానికీ మరొక పట్టణానికీ, ఉచ్చారణలో వ్యత్యాసమున్నట్లే, అరబ్బుల్లో కూడా విభిన్న ప్రాంతాల తెగల మధ్య ఈ వ్యత్యాసాలు ఉండేవి. మక్కాలోని ఖురైష్ ప్రజలు మాట్లాడే

★ మహాప్రవక్త జీవిత కాలంలోనే అనేకమంది సహాబా (రజిఅన్) పూర్తి ఖుర్ఆన్‌ను లేదా దానిలోని కొన్ని భాగాలను గ్రంథస్థం చేసి తమ వద్ద పదిలపరచుకున్నట్లు నిర్ధారితమయిన ఉల్లేఖనాలు ఉన్నాయి. ఈ సందర్భంలో ఈ మహనీయుల్ని పేర్కొనడం జరిగింది. ఉస్మాన్, అలీ, అబ్దుల్లా బిన్ మసూద్, అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్, సాలిం మౌలా హుజైఫా, జైద్ బిన్ సాబిత్, ముఆజ్ బిన్ జబల్, ఉబై బిన్ కఅబ్ (రజిఅన్).

★★ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సతీమణి.

భాషలోనే ఖుర్ఆన్ అవతరించింది. అయితే ప్రారంభంలో ఇతర ప్రాంతాల, తెగల వాళ్ళకు తమ తమ ఉచ్చారణ యాసలో ఖుర్ఆన్‌ను పఠించే అనుమతి ఇవ్వబడింది. ఎందుకంటే, అంతమాత్రాన అర్థంలో ఏ విధమయిన భేదం వాటిల్లదు. ఆ విధంగా చదవటం వారికి సులభతరమవుతుంది. కాని క్రమేణా ఇస్లామ్ వ్యాప్తిచెందటం మూలాన అరబ్బులు తమ ఎడారి ప్రాంతాలను వదిలి ముందుకు సాగి ప్రపంచంలోని ఒక పెద్ద భూభాగాన్నే జయించారు. ఇతర జాతులవాళ్ళు కూడా ఇస్లామ్ పరిధిలోకి రావటం ప్రారంభించారు. అరబ్బులు, అరబ్బేతరుల సమ్మేళనం భారీ ఎత్తున జరగటం మూలాన అరబీ భాష ప్రభావితం కాసాగింది. దీనివల్ల ఒక ప్రమాదం ఏర్పడింది. కనుక ఇప్పుడు కూడా ఖుర్ఆన్ పఠనంలో ఇతర యాసల్ని, ఉచ్చారణలను అను మతిస్తే, అనేక ఉపద్రవాలు తలెత్తే అవకాశం ఉంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి తన సొంత యాసలో ఖుర్ఆన్‌ను పఠిస్తూ వుంటే, మరొక అపరిచిత వ్యక్తి దాన్ని విని, అతడు దైవవాణిలో బుద్ధి పూర్వకంగా ప్రక్షిప్తాలు చేస్తున్నాడని భావించి అతనితో పోరాడటానికి పాల్పడవచ్చు. లేదా ఈ ఉచ్చారణా విభేదాలు క్రమేపి నిజంగానే ప్రక్షిప్తాలకు దారితీయ వచ్చు. లేదా, అరబ్బు, అరబ్బేతర జాతుల మిశ్రమం వల్ల భాష స్వచ్ఛతను కోల్పోయినవారు తమ వికృత భాష కనుగుణంగా ఖుర్ఆన్‌లో మార్పులు చేసి దాని భాషా సౌందర్యాన్ని భంగపరిచే ప్రమాదం ఉంది. ఈ కారణాల వల్ల, కేవలం హజ్రత్ అబూబక్ర్ (రజిఅన్) ఆదేశానుసారం గ్రంథస్థం చేసి భద్ర పరచబడిన ప్రామాణిక ఖుర్ఆన్ ప్రతి నకళ్ళనే ఇస్లామీయ దేశాలన్నింటి లోనూ ప్రచురించాలని హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) సహాబా మహనీయుల సలహా ప్రకారం నిర్ణయించారు. ఇతర యాసల్లో వ్రాయబడి ఉన్న ప్రతుల ప్రచురణను నిషేధించారు.

నేడు మన చేతుల్లో ఉన్న ఖుర్ఆన్, ఆనాడు హజ్రత్ అబూబక్ర్(రజిఅన్) సమీక రించగా, హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) అధికారికంగా అన్ని మహానగరా లకు ప్రచురణార్థం పంపిన ప్రామాణికమయిన ముస్‌హఫె సిద్దీఖీ ప్రతి అనురూపమే. నేటికీ ఆ ప్రామాణిక ఖుర్ఆన్ ప్రతులు ప్రపంచంలో పలుచోట్ల సురక్షితంగా ఉన్నాయి. ఎవరికయినా ఖుర్ఆన్ (ఏ విధమైన ప్రక్షిప్తాలు లేకుండా) సురక్షితంగా ఉందనే విషయంలో ఏమాత్రం సందేహమున్నా, వారు తమ సందేహనివృత్తి కొరకు ఇలా చెయ్యాలి: పశ్చిమ ఆఫ్రికాలో ఏ పుస్తకాల దుకాణం నుండయినా ఖుర్ఆన్ ప్రతి నొకదాన్ని కొనాలి, జావాలో ఒక ఖుర్ఆన్ హాఫిజ్ నోట ఖుర్ఆన్‌ను పూర్తిగా విని ఆ ప్రతిని పోల్చి చూడాలి; తరువాత, ప్రపంచంలోని పెద్ద పెద్ద లైబ్రరీలకు వెళ్ళి అక్కడ

హ(జత్ ఉస్మాన్ (రజిఅన్) కాలం నుండి నేటివరకు విభిన్న శతాబ్దాల్లో వ్రాయబడిన ఖుర్ఆన్ ప్రతులతో దాన్ని పోల్చి చూసుకోవాలి. ఇందులో, ఒక్క అక్షరం కాదు, పొల్లు మందం కూడ తేడా గోచరిస్తే, ఈ మహత్తర 'చారిత్రక ఆవిష్కరణ'ను అతడు ప్రపంచానికి తప్పకుండా వెల్లడి చెయ్యవచ్చు. నిత్య శంకితుడెవడైనా ఖుర్ఆన్ దైవప్రోక్తమైన గ్రంథం అనటాన్ని సందేహించటం సాధ్యం కావచ్చుగాని, మన చేతుల్లో ఉన్న ఖుర్ఆన్ ఎలాంటి హెచ్చుతగ్గుల్లేకుండా మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆనాడు ప్రపంచానికి అందజేసిన గ్రంథమే అనే విషయం, ఏ విధమైన సందేహానికి ఆస్కారం లేని చారిత్రక సత్యం. మానవ చరిత్రలో ఇలాంటి నిర్దుష్టమయిన సాక్ష్యాధారాలతో నిర్ధారిత మయినదేదీ మరొకటి లేదు. ఎవరయినా దీని స్వచ్ఛతను శంకిస్తే వారు శంకించని విషయం ప్రపంచంలో ఉండదు. రోమను సామ్రాజ్యం అనేది ఒకప్పుడు ప్రపంచంలో విలసిల్లిందనీ, మొగల్ ప్రభువులు కూడా భారతదేశాన్ని ఒకప్పుడు పాలించారనీ, నెపోలియన్ అనే నియంత కూడా ప్రపంచంలో ఉండేవాడనీ, చరిత్ర చాటే సత్యాలనూ వారు శంకించగలరు. ఇలాంటి చారిత్రక సత్యాలను శంకించటం విజ్ఞానం కాదు, అజ్ఞానానికి తార్కాణం.

అధ్యయనం

ప్రపంచంలో ఎందరో వ్యక్తులు ఎన్నో లక్ష్యాలతో ఖుర్ఆన్ అధ్యయనా నికి పూనుకుంటారు. వీరందరి ఉద్దేశ్యాలను, అవసరాలను దృష్టిలో ఉంచుకుని సలహా ఇవ్వటం సాధ్యం కాదు. జిజ్ఞాసువుల ఈ సమూహంలోని, కేవలం దీన్ని అర్థం చేసుకోదలచినవారు మరియు జీవితపు సమస్యల్లో ఈ గ్రంథం మానవునికి చూపే మార్గదర్శకత్వాన్ని తెలుసుకోగోరేవారి కొరకే నా తాపత్రయ మంతా! ఇలాంటివారికి ఖుర్ఆన్ అధ్యయనం కొరకు నేను ఇక్కడ కొన్ని సలహాలిస్తున్నాను. ఈ సందర్భంలో సాధారణంగా ఎదురయ్యే చిక్కుల్ని విడదీయటానికి ప్రయత్నిస్తున్నాను.

ఒక వ్యక్తి ఖుర్ఆన్‌ను విశ్వసించినా విశ్వసించకపోయినా, వాస్తవంగా అతడు దీని అవగాహన పట్ల ఆసక్తి కలిగి ఉంటే, ప్రథమంగా అతడు చెయ్య వలసిన పని ఏమిటంటే, తన మనస్సు నుండి తాను ముందే ఏర్పరచుకున్న భావాలను, సిద్ధాంతాలను, అనుకూల, ప్రతికూల అభిప్రాయాలను సాధ్యమయి నంత వరకు దూరం చేసుకోవాలి; కేవలం అర్థం చేసుకునే నిష్కల్మషమైన ఆశయంతో, విశాల హృదయంతో అధ్యయనానికి ఉపక్రమించాలి. ఎవరయితే కొన్ని ప్రత్యేకమయిన భావాలను

మనస్సులో ఉంచుకుని ఈ గ్రంథాన్ని పఠిస్తారో, వారు దీని పంక్తుల్లో తమ భావాలనే పఠిస్తూపోతారు. ఖుర్‌ఆన్ గాలి కూడా వారికి సోకదు. ఈ అధ్యయనా విధానం ఏ గ్రంథం పట్ల అయినా సరైనది కాదు. కాని ముఖ్యంగా ఖుర్‌ఆన్ అయితే ఇటువంటి వారికొరకు దాని అవగాహనా ద్వారాలను, భావకవాటాలను అసలు తెరవనే తెరవదు.

పోతే, స్థూలంగా ఎంతో కొంత తెలుసుకోగోరిన వ్యక్తి మాత్రం ఒకసారి అధ్యయనం చేస్తే బహుశా సరిపోవచ్చు. కాని ఖుర్‌ఆన్ లోతుల్లోకి పోదలచిన వ్యక్తి ఖుర్‌ఆన్‌ను రెండు మూడుసార్లు చదివినా చాలదు, అతడు దాన్ని పలుమార్లు చదవాలి. చదివిన ప్రతిసారీ ఒక విశేష రీతిలో చదవాలి; ఒక విద్యార్థిలా పెన్సిల్, నోట్‌బుక్‌లు చేతబూని మరీ అధ్యయనానికి పూనుకోవాలి. అవసరమయిన విషయాలు వ్రాసు కుంటూ పోవటానికి. ఇలా అధ్యయనం చెయ్యడానికి సంసిద్ధమయినవారు, ఖుర్‌ఆన్ ప్రతిపాదిస్తున్న ఆలోచన, ఆచరణా వ్యవస్థను సమగ్రంగా అర్థం చేసుకునే ధ్యేయంతో ఖుర్‌ఆన్‌ను కనీసం రెండు పర్యాయాలైనా పూర్తిగా చదవాలి. ఈ ప్రాథమిక అధ్యయనం చేసేటప్పుడు ఖుర్‌ఆన్ స్వరూపాన్ని సమగ్రంగా ఆకళింపు చేసుకోవటానికి ప్రయత్నించాలి. ఈ గ్రంథం అందజేసే మౌలిక భావనలేవో ఆ భావనలు పునాదిగా, అది ఎలాంటి జీవన వ్యవస్థను నిర్మిస్తుందో గమనిస్తూపోవాలి. ఈ లోపల ఏ దశ లోనయినా ఏదైనా ప్రశ్న తట్టినట్లయితే, దాన్ని గురించి అక్కడికక్కడే ఏదో ఒక నిర్ణయం చేసెయ్యకూడదు. దాన్ని నోట్ చేసుకుని జ్ఞాపకం ఉంచుకోవాలి. ఓర్పుతో అధ్యయనాన్ని ముందుకు సాగనివ్వాలి. సాధారణంగా ముందు ఎక్కడో ఒకచోట ఆ ప్రశ్నకు సమాధానం తప్పకుండా లభిస్తుంది. సమాధానం లభిస్తే ప్రశ్నతోపాటు దాన్ని కూడా వ్రాసుకోవాలి. ఒకవేళ ప్రథమ అధ్యయనంలో ఏ సమస్యకైనా సమాధానం దొరక్కపోతే, ఓర్పుతో రెండోసారి చదవాలి. నా అనుభవం కొద్దీ చెబుతున్నాను. రెండోసారి శ్రద్ధగా అధ్యయనం చేస్తే ఏ ప్రశ్నకయినా సమాధానం దొరక్కపోవటం అనేది బహు అరుదు.

ఇలా ఖుర్‌ఆన్‌ని గురించి ఒక సమగ్రమయిన అవగాహన కలిగిన తరువాత, అధ్యయనం చెయ్యటం మొదలెట్టాలి. ఈ సందర్భంలో పాఠకుడు ఖుర్‌ఆన్ బోధనల ఒక్కొక్క అంశాన్ని దృష్టిలో ఉంచుకుని వ్రాసుకుంటూ పోవటం సముచితం. ఉదాహరణకు ఎలాంటి వ్యక్తుల్ని ఖుర్‌ఆన్ అభిలషనీయులైన వారుగా, ఎలాంటి వారిని ద్వేషించదగినవారుగా పరిగణిస్తుందీ అనే విషయాన్ని తెలుసుకోదలిస్తే పాఠకుడు ఈ అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి, తన నోట్‌బుక్‌లో ఒక వైపున

"అభిలషణీయుడయిన మనిషి" దానికెదురుగా రెండో వైపున "ద్వేషించదగిన మనిషి" అని రెండు శీర్షికలు వ్రాసి వాటి క్రింద ఖుర్ఆన్ ప్రస్తావించే ఆయా లక్షణాలను వ్రాసుకుంటూ పోవాలి. లేదా, ఖుర్ఆన్ ప్రకారం, మానవుడి సాఫల్యం, మోక్షం ఏ విషయాలపై ఆధారపడి ఉన్నాయో, ఏ విషయాలను ఖుర్ఆన్ మానవుడికి నష్టకర మనీ, వినాశానికీ, విధ్వంసానికీ దారితీసేవని సూచిస్తుందో తెలుసుకోదలిస్తే, సరియైన పద్ధతి, నోటు పుస్తకంలో ఒక వైపున "సాఫల్యమార్గాలు" అనీ, మరోవైపున "వినాశ హేతువులు" అని శీర్షికలు పెట్టుకుని, ఖుర్ఆన్ అధ్యయనం చేసేటప్పుడు వాటి క్రింద ఈ రెంటిని గురించి ఖుర్ఆన్ చూపే విషయాలను వ్రాస్తూపోవాలి. ఇదేవిధంగా విశ్వాసాలు, నైతిక విషయాలు, విధులు, హక్కులు, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ విషయాలు, న్యాయశాస్త్రం, సామూహిక వ్యవస్థ, సంధి, యుద్ధాలకు సంబంధించిన విషయాలు, ఇంకా ఇతర జీవిత సమస్యలను ఒక్కొక్కదాన్ని గురించి ఖుర్ఆన్ బోధనలేవో వ్రాసుకుంటూ పోవాలి. తరువాత జీవితానికి సంబంధించిన ఒక్కొక్క రంగం సమగ్ర స్వరూపం ఎలా తయారవుతుందో, ఈ రంగాలన్నింటినీ సమన్వయపరచినప్పుడు మొత్తం జీవిత చిత్రం ఎలా రూపొందుతుందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి.

ఎవరైనా ఏదైనా ఒక ప్రత్యేక జీవన సమస్యను గురించి ఖుర్ఆన్ దృక్పథం ఏమిటో పరిశోధించదలిస్తే, అందుకు సరైన పద్ధతి ఏమిటంటే, ఆ సమస్యకు సంబం ధించిన ప్రాచీన ఆధునిక సాహిత్యాన్నంతా క్షుణ్ణంగా అధ్య యనం చెయ్యాలి. తద్వారా సమస్య మౌలిక అంశాలేవో, దీన్ని గురించి మానవుడు ఇంతవరకు ఆలోచించిందీ, అర్థం చేసుకున్నదీ ఏమిటో, ఇందులో ఇంకా అపరిష్కృతంగా ఉండిపోయిన అంశాలేవో, మానవుని ఆలోచనా శకటం ఎంత దూరం పరుగెత్తి నిలిచిపోయిందో విశదంగా తెలుసుకోవాలి. తరువాత అపరిష్కృతంగా ఉండిపోయిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఖుర్ఆన్ అధ్యయనం చెయ్యాలి. ఇలా ఏ సమస్యనైనా పరిశోధించే నిమిత్తం, ఖుర్ఆన్ పఠనానికి ఎవరైనా ఉపక్రమిస్తే నా అనుభవం ప్రకారం ఇంతకు ముందు ఎన్నోసార్లు పఠించిన ఆయత్‌లలోనే ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. ఈ ఆయత్‌లలో ఈ భావం కూడ ఉంది అనే విషయం ఊహామాత్రంగానయినా అంతకు పూర్వం స్ఫురించి కూడా ఉండదు.

కాని ఖుర్ఆన్ అవగాహన కొరకు ఈ మార్గాలన్ని అవలంబించినప్ప టికీ, ఏ ఆశయసిద్ధికై ఖుర్ఆన్ అవతరించిందో, దాని కొరకు క్రియాత్మకంగా కృషి చెయ్యనంతవరకు మనిషి ఖుర్ఆన్ సారాన్ని (Inspiring Spirit) సంపూర్ణంగా

గ్రహించలేడు. మీరు ఈజీ చేర్‌లో నడుంవాల్చి ఖుర్‌ఆన్‌ను చదివి, దాని బోధనలన్నీ అర్థం చేసుకోవటానికి, అది కేవలం కొన్ని సిద్ధాం తాలు, దృక్పథాల పుస్తకం కాదు. ఆశ్రమాల్లోనో, మఠాల్లోనో తాపీగా కూర్చుని దాని మర్మ హేతువులన్ని వడబోయటానికి, ప్రపంచంలో ప్రచారంలో ఉన్న "మత" భావన ప్రకారం ఇది కేవలం 'మత' గ్రంథం కూడా కాదు. ప్రారం భంలో సూచించినట్లు ఇది, ఒక సందేశానికి, ఒక ఉద్యమానికి మూల గ్రంథం, ఇది వచ్చీరాగానే సౌమ్య స్వభావుడైన ఒక సజ్జనుణ్ణి ఏకాంతపు మూలల్లో నుండి బయటికి రప్పించి దైవాన్ని ధిక్కరించిన లోకానికెదురుగా నిలబెట్టింది; ఆయన చేత అసత్యవాదాన్ని సవాలు చేయించింది. దైవధిక్కారం, దుర్మార్గం, మార్గవిహీనతలకు ఆనాటి ధ్వజవాహకులైన వారితో ఆయన్ని పోరాటానికి దింపింది; ప్రతి ఇంటి నుండి ఒక్కొక్క పవిత్ర హృదయాన్ని ఒక్కొక్క మంచి మనసును వెలికితీసి ఈ సత్యసందేశకుని పతాకం క్రింద సమీకరించింది. మూలమూలల నుండి ఒక్కొక్క దుర్మార్గుణ్ణి, ఒక్కొక్క ఉపద్రవ జనకుణ్ణి ఉసిగొలిపి సత్యప్రియులతో పోరాడచేసింది. ఒకే ఒక వ్యక్తి పిలుపుతో ఈ బృహత్తర కార్యాన్ని ప్రారంభించి, దైవ ప్రాతినిధ్య ప్రభుత్వ స్థాపన వరకు పూర్తిగా 23 సంవత్సరాలు ఈ గ్రంథమే ఈ మహోజ్వల ఉద్యమానికి మార్గదర్శ కత్వం వహించింది. సత్యాసత్యాల సుదీర్ఘమయిన ప్రాణసంకట సంఘర్షణా కాలంలో ఒక్కొక్క దశలో, ఒక్కొక్క మలుపులో నిర్మూలనా మార్గాలను, నిర్మాణ పథకాలను సూచించింది.

అటువంటప్పుడు, ధర్మాధర్మాల పోరాటంలో, ఇస్లామ్ మరియు అజ్ఞానాల సమర రంగంలో మీరసలు అడుగుపెట్టకనేపోతే సంఘర్షణలోని ఏ దశనైనా ఎదుర్కొనే సందర్భమే మీకు తటస్థపడకపోతే, కేవలం ఖుర్‌ఆన్ వచనాలను వల్లిస్తూ ఉన్నంతమాత్రాన, అందులోని నిగూఢ సత్యాలన్నీ మీ ఎదుట ప్రత్యక్షమవటం ఎలా సంభవం? ఖుర్‌ఆన్‌ని మీరు కూలంకషంగా అర్థం చేసుకోగలగాలంటే, దీన్ని చేతబూని లేచి నిలవాలి. దైవం వైపునకు ఆహ్వానించే కార్యాన్ని ప్రారంభించాలి. ఏ ఏ బాటలపై ఈ గ్రంథం మిమ్మల్ని నడిపిస్తుందో ఆ ఆ బాటలపై నడుస్తూ పురోగమించాలి. అప్పుడే ఖుర్‌ఆన్ అవతరణా కాలంలో ఎదురయిన అనుభవాలు మీకు ఎదురవుతాయి. మక్కా, అబిసీనియా, తాయిఫ్‌లాంటి మలుపుల్ని మీరు చూడగలుగుతారు. బద్ర్,[1], ఉహద్[2]ల నుండి హునైన్,[3] తబూక్[4]ల వరకు అన్ని దశలూ మీ ఎదుట నిలుస్తాయి; అబూ జహల్,[5] అబూలహబ్[6]లు కూడ తటస్థపడతారు. కపటులు (మునాఫిక్‌లు), యూదులు కూడ ప్రత్యక్షమవుతారు. "సాబిఖూనుల్

అవ్వలూన్"[7] నుండి "మఅల్లఫతుల్ కులూబ్"[8] వరకు అన్ని రకాల మానవుల నమూనాలను మీరు వీక్షిస్తారు. వీరిలోనే మసలుతారు, వీరిని ఉద్యమ కార్యాల్లో వినియోగించుకుంటారు కూడా. ఇది విలక్షణమయిన 'సులూక్' (యోగపథం). దీన్ని నేను "సులూకే ఖురానీ" (ఖుర్‌ఆన్ యోగపథం) అంటాను. ఈ యోగ పథంలోని మహత్తు ఏమిటంటే, మీరు ఒక్కొక్క దశను దాటుతూ ఉంటే, ఖుర్‌ఆన్‌లోని కొన్ని ఆయత్‌లు (వాక్యాలు), కొన్ని సూరాలు (అధ్యాయాలు) స్వయంగా ముందుకు వచ్చి, అవి సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే అవతరించా యని, ఫలానా ఆదేశాన్ని అందజేశాయనీ సూచిస్తూ ఉంటాయి. అటువంట ప్పుడు ఖుర్‌ఆన్‌లోని భాష, భావం, వ్యాకరణం, వ్యాఖ్యానాల రీత్యా కొన్ని అంశాలు "యోగి" కనుమరుగవటం సాధ్యమే. కాని ఖుర్‌ఆన్ తన నిజసారాన్ని మాత్రం అతని ఎదుట ప్రత్యక్షపరచటంలో పిసినారితనం ప్రదర్శించదు.

ఈ మూల సూత్రానుసారంగానే ఖుర్‌ఆన్ ఆజ్ఞలు, నైతిక బోధనలు, ఆర్థిక, నాగరిక ఆదేశాలు, ఇంకా జీవితంలోని అనేక రంగాలకు అది సూచించే సూత్రాలు, నియమాలను మనిషి క్రియాత్మకంగా ఆచరించి చూడనంతవరకు అవి అతనికి బోధపడవు. తన వ్యక్తిగత జీవితాన్ని ఖుర్‌ఆన్ అనుసరణకు దూరంగా ఉంచిన వ్యక్తి కూడా ఈ గ్రంథాన్ని అర్థం చేసుకోలేడు. ఇంకా, సామూహిక జీవిత రంగాలన్నీ ఖుర్‌ఆన్ మార్గానికి భిన్నమయిన మార్గంలో నడిపించే జాతి కూడా దీన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదు.

సార్వజనీనత

ఖుర్‌ఆన్ సర్వ మానవులకు మార్గదర్శకత్వంగా అవతరించిందని స్వయంగా ఖుర్‌ఆన్ చేసే వాదన అందరికీ తెలిసిందే. కాని ఖుర్‌ఆన్ సంబోధన ఎక్కువగా దాని అవతరణకు సమకాలీన అరబ్బులకే పరిమితమైనట్లు అగుపిస్తుంది. అప్పుడప్పుడు

1,2,3,4 - ఇస్లామీయ ఉద్యమంలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు ఎదురయిన సాయుధపోరాటాలు.

5,6 - మక్కాలో ఇస్లామీయ ఉద్యమాన్ని ఎదిరించిన వారిలో అగ్రగణ్యులు

7. ఇస్లాం స్వీకారం విషయంలో అగ్రగాములు.

8. (ఉద్యమం - చివరి దశలో) ఇస్లాంను స్వీకరించిన నిర్థనులయిన వారికి ఆర్థిక సహాయం చెయ్యటం.

అది మానవ జాతినంతటినీ, జనసామాన్యాన్ని సంబోధించినా, తరచుగా అది పలికే విషయాలు అరబ్బుల అభిరుచికి, అరబ్బుల వాతావరణానికి, అరబ్బుల ఇతిహాసానికి, వారి ఆచార సంప్రదాయా లకు సంబంధించినవే. వీటిని గమనిస్తే ఒక సందేహం జనిస్తుంది. సామాన్య మానవుల మార్గదర్శకత్వం కొరకు అవతరించిన గ్రంథంలో తాత్కాలిక స్థానిక, జాతీయమయిన అంశాలు ఇంత అధికంగా ఎందుకు చోటుచేసుకున్నాయి? ఈ విషయాన్ని దాని వాస్తవ రూపంలో అర్థం చేసుకోకపోవటం వల్ల, ఇది కేవలం ఆనాటి అరబ్బుల సంస్కరణకు ఉద్దేశించబడిందేకాని, ఆ తరువాత దాన్ని బలవంతంగా సాగదీసి సర్వజనుల కొరకు అన్ని కాలాల కొరకు మార్గదర్శక గ్రంథంగా నిర్ణయించటం జరిగిందనే కుశంకకు లోనవుతారు ప్రజలు.

ఎవరయినా ఈ ఆక్షేపణను కేవలం ఆక్షేపణగా లేవనెత్తక నిజంగానే విషయాన్ని అర్థం చేసుకోదలిస్తే, వారికి నాదొక సలహా – వారు మొదట స్వయంగా ఖుర్ఆన్‌ను చదవాలి. అందులో ఎక్కడైనా కేవలం అరబ్బులకే ప్రత్యేకమయింది, వాస్తవంగానే దేశకాల పరిమితులకు లోబడినది ఏదైనా విశ్వాసం, అభిప్రాయం లేదా భావన గోచరిస్తుందేమో, లేదా అటువంటి దేదయినా నైతిక సిద్ధాంతమో, ఆచరణ నియమావళియో కానవస్తుందేమో వేలెట్టి చూపాలి. అంతేకాని, కేవలం అది ప్రత్యేక దేశం, ప్రత్యేక కాలంలోని ప్రజలకు సంబోధించి, వారి బహుదైవారాధనకు సంబంధించిన విశ్వాసాలను, ఆచారాలను ఖండించటంచేత వారి పరిసరాల్లోని వస్తువుల్నే నిదర్శనాలుగా చూపి దేవుని ఏకత్వాన్ని నిరూపించటంచేత, ఖుర్ఆన్ సందేశం, దాని పిలుపు కూడా తాత్కాలికమైందనీ, స్థానికమైందని నిర్ణయించటం సమంజసమూ కాదు, సముచితమూ కాదు. గమనించవలసిన విషయమేమిటంటే, 'షిర్క్' (బహుదైవారాధన)ను ఖండిస్తూ, అది చెప్పేదంతా అరేబియా బహుదైవారాధ కుల షిర్క్‌కు వర్తించినట్లే, ప్రపంచంలోని మరెక్కడి షిర్క్‌కైనా వర్తించదా? ఆ నిదర్శనాలనే మనం ఏనాటి బహు దైవోపాసకుల భావ సంస్కరణార్థమయినా ఉదాహరించలేమా? తౌహీద్ (దేవుని ఏకత్వపువాదన)ను ధ్రువీకరించటానికి, ఖుర్ఆన్ నిరూపణా విధానాన్ని కొంత మార్పుతో అన్ని కాలాల్లోనూ, అన్ని వేళల్లోనూ మనం వినియోగించలేమా? ఈ ప్రశ్నకు సమాధానం అను కూలంగా ఉంటే, ప్రత్యేక కాలంలో, ప్రత్యేక జాతిని సంబోధించి అందజేసినంత మాత్రాన, విశ్వజనీనమయిన బోధనల్ని, తాత్కాలికమైనవిగా, స్థానికమయిన విగా నిర్ణయించటం సబబు కాదు.

ప్రపంచంలోని ఏ తత్వమయినా, ఏ జీవన వ్యవస్థ అయినా, ఏ ఆలోచనా విధానమయినా, దాని విషయాలన్నీ ఆమూలాగ్రం అన్నింటికీ అతీతమయినవిగా, కేవలం (Abstract) గా అందజెయ్యబడలేదు; ఇంకా ఒక నిర్దిష్ట పరిస్థితిపై వాటిని అన్వయింపజెయ్య కుండానే వాటిని వివరించడమన్నది జరగలేదు. అన్నింటికీ పరమయిన ఇలాంటి విషయం అసలు సాధ్యపడదు కూడా, ఒకవేళ సాధ్యపడినా, ఇలా తయారైన సిద్ధాంతం కేవలం గ్రంథం పుటలపైనే మనగలుగుతుంది కాని, మానవ జీవితంలో అది అంతర్లీనమై ఆచరణాత్మకమైన వ్యవస్థగా రూపొందటం మాత్రం కల్ల.

మరొకమాట; ఒక సైద్ధాంతిక, నైతిక, సాంస్కృతిక ఉద్యమాన్ని అంతర్జాతీయ స్థాయిలో వ్యాపింపజేసే ఉద్దేశ్యం ఉంటే, దాన్ని ఆదిలోనే అంతర్జాతీయ స్థాయిలో స్థాపించే ప్రయత్నం చెయ్యవలసిన అవసరం ఏమాత్రం లేదు. నిజం చెప్పాలంటే, అలా చెయ్యడం శ్రేయస్కరం కూడా కాదు. వాస్తవానికి దీని సరైన, ఆచరణాత్మక విధానం ఒక్కటే : ఏ సిద్ధాంతాలు, ఏ దృక్పథాలు, ఏ సూత్రాల ఆధారంగా మానవ జీవన వ్యవస్థను ఆ ఉద్యమం స్థాపించగోరుతుందో, వాటిని స్వయంగా ఆ ఉద్యమం ప్రారంభమైన దేశంలోనే శక్తిమంతంగా సమర్పించే కృషిచెయ్యాలి. ఏ ప్రజల భాష, నైజం, గుణం మరియు స్వభావం, ఉద్యమ సందేశకులకు బాగా తెలుసో వారికి బాగా మనోగతమయ్యేలా బోధించాలి; ఇంకా ఆ సిద్ధాంతాలను తమ దేశంలోనే అమలుపరచి వాటి ఆధారంగా జీవన వ్యవస్థను విజయవంతంగా నడిపి, ప్రపంచానికి ఆదర్శంగా చూపాలి. అప్పుడే ఇతర దేశస్థులు దానిపట్ల ఆసక్తి వ్యక్తం చేస్తారు. వారిలోని మేధావులు ముందుకు వచ్చి దాన్ని అర్థం చేసుకోవడానికి, దాన్ని తమ దేశంలో అమలుపరచటానికి ప్రయత్నిస్తారు. కనుక తేలిందేమంటే, ఒక ఆలోచన, ఆచరణా వ్యవస్థను ప్రారంభంలో ఒక ప్రత్యేక జాతికి అందజెయ్యటం, నిరూపణా శక్తినంతటినీ ఆ జాతి ప్రజలకు బోధపరచటానికి, వారిని సంతృప్తపరచటానికి వినియోగించటం వంటి విషయాలను మాత్రమే ఆధారంగా తీసుకుని, ఆలోచన ఆచరణా వ్యవస్థ కేవలం ఒక ప్రత్యేక జాతికే చెందినదనటం ఏమాత్రం సమంజసం కాదు. వాస్తవానికి ఒక జాతీయ వ్యవస్థను అంతర్జాతీయ వ్యవస్థ నుండి, ఒక తాత్కాలిక వ్యవస్థను ఒక శాశ్వత వ్యవస్థ నుండి వేరుచేసే విశేష లక్షణాలేవంటే : ఒక జాతీయ వ్యవస్థ ఒక ప్రత్యేక జాతి ఔన్నత్యం కొరకే, దాని ప్రత్యేక

హక్కుల కొరకే కృషి చేస్తుంది. లేదా దాని సిద్ధాంతాలు, సూత్రాలు ఇతర జాతుల ప్రజలకు ఉపయోగపడనివై ఉంటాయి. దీనికి ప్రతిగా, ఒక అంతర్జాతీయ వ్యవస్థ మానవులందరికీ సమాన స్థానం, సమాన హక్కులనిస్తుంది. దాని సిద్ధాంతాల్లో కూడా విశ్వజనీనత గోచరిస్తుంది. ఇదేవిధంగా ఒక తాత్కాలిక వ్యవస్థకు మూలాధారమయిన సిద్ధాంతాలు కాలగతిలో సంభవించే కొన్ని పరివర్తనలకే తమ ఆచరణాయోగ్యతను పూర్తిగా కోల్పోతాయి. దీనికి భిన్నంగా ఒక శాశ్వత వ్యవస్థ యొక్క సూత్రాలు సమస్త కాలపరిణామాలకు సరిగ్గా అన్వయిస్తూ ఉంటాయి. ఈ ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకుని ఖుర్‌ఆన్ అధ్యయనం చెయ్యాలి. తద్వారా ఖుర్‌ఆన్ ప్రతిపాదించే జీవన వ్యవస్థ దేశ కాల అవధులకు పరిమితమైనదనటానికి ఆస్కారం కలిగించే విషయాలను ఎత్తి చూపాలి.

పరిపూర్ణ జీవన వ్యవస్థ

ఖుర్‌ఆన్ గురించి మరొక విషయం కూడా పాఠకునికి ముందే తెలిసి ఉంటుంది - ఇదొక సవివరమైన మార్గదర్శకావళి అని, జీవన సంవిధాన గ్రంథం అనీ, అతడు విని ఉంటాడు. కాని దీన్ని చదివినప్పుడు ఇందులో సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక ఇత్యాది రంగాలకు సంబంధించిన విపులమైన ఆదేశాలు, నిర్దేశాలు, నియమాలు అతనికి కనిపించవు. అంతేకాదు, ఖుర్‌ఆన్ మరీ మరీ నొక్కిచెప్పే నమాజ్, జకాత్ ★ వంటి విధుల విషయంలో కూడ అవసరమైన ఆదేశాలు సవివరంగా ఉన్న జాబితా నొకదాన్ని ఇది అందజెయ్యలేదు. అయితే దీన్ని ఏ భావంలో మార్గదర్శక గ్రంథమనాలో బోధపడక కళవళపడతాడు మనిషి.

ఈ చిక్కు ఏర్పడటానికి కారణం, ఒక యదార్థం కనుమరుగవటమే. దైవం కేవలం గ్రంథాన్ని మాత్రమే అవతరింపజెయ్యలేదు, ఒక ప్రవక్తను సైతం ప్రభవింపజేశాడు. అసలు పథకం ప్రకారం కేవలం కట్టడం రూపకల్పన మాత్రమే రచించి తదనుగుణంగా ప్రజలే కట్టడం నిర్మించుకోవాలని నిర్ణయమై ఉంటే నిస్సందేహంగా నిర్మాణ కార్యక్రమం ఒక్కొక్క అంశం ప్రజలకు వివరంగా తెలుపటం అత్యవసరమే. కాని నిర్మాణానికి నిర్దేశాలతో పాటు ఒక ఇంజనీరు కూడా అధికారికంగా నియమించబడి అతడు ఆ నిర్దేశాల కనుగుణంగా ఒక కట్టడాన్ని కూడా నిర్మించి నిలబెట్టినప్పుడు, ఆ ఇంజనీ రునూ, అతడు నిర్మించిన కట్టడాన్నీ త్రోసిపుచ్చి కేవలం రూపకల్పనలోనే చిన్న చిన్న అంశాలన్నింటి వివరాలను వెదకటం, అవి

అందులో లభించక పోయేసరికి, ఆ ప్లాను అసంపూర్ణమైందని అభ్యంతరం తెలుపటం శుద్ధ పొరపాటు. ఖుర్‌ఆన్ చిన్న చిన్న విషయాల జాబితా కాదు, సిద్ధాంతాల మూలసూత్రాల గ్రంథం. ఇస్లామీయ వ్యవస్థ సైద్ధాంతిక, నైతిక ప్రాతిపదికల్ని ప్రస్ఫుటంగా విశదపరచటమేకాక సమంజసమైన ఆధారాలు, భావోద్రేకాల ఆకర్షణతో వాటిని పటిష్టవంతం కూడా చెయ్యటం దాని అసలు కార్యక్రమం. ఇకపోతే, ఇస్లామీయ జీవితపు ఆచరణాత్మక రూపం. ఈ విషయంలో మానవుని మార్గదర్శకత్వం కొరకు అది జీవితపు ఒక్కొక్క విభాగానికి సంబంధించిన వివరమయిన నియమాలు, శాసనాలను సూచించదు; దానికి బదులుగా జీవితపు ప్రతివిభాగం పరిధుల్ని అది సూచిస్తుంది. ఇంకా, కొన్ని మలుపుల్లో ప్రస్ఫుటమైన గురుతు రాళ్ళను ప్రతిష్ఠించి పెడుతుంది. ఇవి అల్లాహ్ అభీష్టానికి అనుగుణంగా విభాగాల వ్యవస్థాపన నిర్మాణాలు ఎలా జరగాలో నిర్దిష్టంగా నిర్ణయిస్తాయి. ఈ నిర్దేశాల ప్రకారం ఆచరణాత్మకంగా ఇస్లామీయ జీవితాన్ని నిర్మించడమే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బాధ్యత. ఖుర్‌ఆన్ ప్రసాదించిన సిద్ధాంతాల ఆచరణాత్మక అన్వయం, వ్యాఖ్యానాలు కాగల వ్యక్తిగత స్వరూప స్వభావాలు, సమాజం, రాజ్యాల ఆదర్శప్రాయమయిన రూపురేఖలు ప్రపంచానికి చూపటానికే ఆయన్ని నియమించటం జరిగింది.

వ్యాఖ్యానాల్లో విభేదాలు

మనుషుల మనస్సుల్ని అసంతృప్తపరచే మరొక విషయం ఏమిటంటే, ఒకవైపున దైవగ్రంథం అవతరించిన తరువాత విభేదాలు, వేర్పాటు ధోరణులు అవలంబించి ధర్మాన్ని ముక్కలు చెక్కలుగా విభజించేవారిని అతి తీవ్రంగా ఖండిస్తుంది; మరొకవైపున ఖుర్‌ఆన్ ఆజ్ఞల భావాన్వయంలో, వ్యాఖ్యానాల్లో విభేదాలున్నాయి. కేవలం ఆధునికుల్లోనే కాదు, అగ్రగాములుగా అలరారిన ధర్మవేత్తల్లోనూ, వారి ముందు తాబియీన్ (సహాబా అనుచరులు)ల్లోనూ, ఆ మాటకు వస్తే మహాప్రవక్త (సఅసం) సహచరుల్లోనూ (సహాబా) కానవస్తాయి. చివరికి అందరూ ఏకగ్రీవంగా ఒకే వ్యాఖ్యానం చేసినటువంటి ఒక్క ఆదేశం కూడా ఖుర్‌ఆన్‌లో లేదని చెప్పవచ్చు. అయితే వీరంతా ఖుర్‌ఆన్ ప్రకటించిన ఆ ఖండనకు, నిరసనకు గురవుతారా? కాకపోతే, ఖుర్‌ఆన్ నిషేధించే ఆ విభేదాలు, వేర్పాటు ధోరణులు ఏవి?

ఇవి సర్వతోముఖమయిన విస్తృత సమస్యలు. దీన్ని వివరంగా చర్చించే అవకాశం ఇప్పుడు లేదు. ప్రస్తుతం ఒక సాధారణ ఖుర్‌ఆన్ పాఠకుని చిక్కును విడదీయటానికి ప్రయత్నిస్తాను. ఖుర్‌ఆన్ ఆరోగ్యవంతమైన భేదాభిప్రాయాన్ని

వ్యతిరేకించదు. అయితే ఈ విభేదం ధర్మం పట్ల ఏకాభిప్రాయంతో, ఇస్లామీయ సాంఘిక వ్యవస్థలో ఐక్యంగా ఉంటూ, ఆదేశాలు, భావాల అన్వయంలో, కేవలం చిత్తశుద్ధితో చేసిన పరిశోధనకు ఫలితంగా ఏర్పడిన విభేదమై ఉండాలి. ఖుర్ఆన్ గర్హించేది, అహంభావం, వక్రదృష్టితో ప్రారంభమై, ముఠాతత్వానికి, పరస్పర ఘర్షణలకు దారితీసే విభేదాన్నే. ఈ రెండు రకాల విభేదాలు వాటి వాస్తవికత రీత్యా కూడ సమానం కావు. మరియు పరిణామం దృష్ట్యా కూడ వాటికి పోలికే లేదు. అలాంటప్పుడు రెంటినీ ఒకే త్రాటితో ఎలా కట్టగలం? మొదటి కోవకు చెందిన భేదాభిప్రాయమైతే ప్రగతికి ప్రాణం, సజీవ సమా జానికి ఆత్మ లాంటి ది. బుద్ధీవివేకాలున్నవారితో ఏర్పడిన ప్రతి సమాజంలోనూ ఇది ఉంటుంది. దీని ఉనికే జీవితానికి చిహ్నం, ఇది లేని సమాజం వివేకవంతులతోకాక, మోడువారిన మొద్దులతో నిండి ఉంటుంది. పోతే, రెండో రకం విభేదం : ఇది ఏ సమాజంలో తలెత్తినా దాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది. ఇది పొడసూపటం ఆరోగ్యానికి కాదు, రోగానికి గుర్తు. దీని పరిణామాలు ఏ సమాజానికైనా ఎట్టి పరిస్థితుల్లోను ప్రయోజనకరం కావు. ఈ రెండు రకాల విభేదాలలో గల భేదం ప్రస్ఫుటంగా ఇలా ఉంటుంది.

ఒక రూపంలో: అల్లాహ్, ప్రవక్తల విధేయతను పాటించాలనే విషయం పట్ల సమాజంలోని ప్రజలందరికీ ఏకాభిప్రాయం ఉంటుంది. ఆదేశాల మూలాధారం ఖుర్ఆన్ మరియు ప్రవక్త సంప్రదాయమైన సున్నత్‌లే అన్న విషయం కూడా ఏకగ్రీవంగా ఒప్పుకున్నదే. ఆ తరువాత, ఈ సమాజంలోని ఇద్దరు ధర్మవేత్తలు ఏదైనా నిమ్న విషయం పరిశోధనలోనో లేదా ఇద్దరు న్యాయమూర్తులు ఒక కేసు తీర్పు విషయంలోనో విభేదించడం సాధ్యమే. కాని వారిలో ఎవరున్నూ ఈ సమస్యకు, దానికి సంబంధించిన తమ అభిప్రాయానికి "ధర్మం"లో మౌలిక స్థానాన్ని ఆపాదించరు; దానిపట్ల భేదాభిప్రాయాన్ని వెలిబుచ్చినవారిని ధర్మం నుండి వెలివెయ్యరు; దానికి బదులుగా ఉభయులూ తమ తమ ఆధారాలను సమర్పించి తమ శక్తిమేరకు పరిశోధనను పూర్తిచెయ్యటానికి కృషిచేస్తారు. ఆ రెండు అభిప్రాయాల్లో ఏ ఒక్కదాన్నయినా స్వీకరించటమో లేదా రెంటినీ ఆచరణలో పెట్టటమో అనే విషయాన్ని ప్రజాభిప్రాయానికో, చట్టసంబంధమైన విషయమయితే దేశంలోని అత్యున్నత న్యాయస్థానానికో, సామూహిక విషయమయితే సాంఘిక వ్యవస్థకో వదలివేస్తారు.

రెండో రూపంలో:ధర్మం మౌలిక విషయాల్లోనే విభేదాలు లేవదీయటం. ఒక విద్వాంసుడు, షరీఅత్‌వేత్త (ముఫ్తి), ఆధ్యాత్మిక తత్వవేత్త(సూఫి) దార్శ నికుడు లేక ఒక నాయకుడు– వీరిలో ఎవరైనా, అల్లాహ్, ఆయన ప్రవక్త ధర్మంలో మౌలిక

సమస్యగా పరిగణించని ఒకానొక సమస్య పట్ల ఒక అభిప్రాయం కలిగివుండి, దాన్ని అనవసరంగా సాగదీసి ధర్మంలో మౌలిక సమస్యగా నిర్ణయించి, దానికి భిన్నమైన అభిప్రాయం కలవారిని ధర్మం నుండి, సమాజం నుండి వెలివేసి తనను సమర్థించేవారిని ఒక ముఠాగా ఏర్పరచుకుని అసలు ఉమ్మత్ (ఇస్లామీయ అనుచర సంఘం) తమదేనని, మిగతావారంతా నరకవాసులేనని, ముస్లిములుగా మనదలచినవారు తమ ముఠాలో చేరాలని లేకపోతే ముస్లిములుగా ఉండజాలరని బహిరంగంగా చాటుతారు.

దివ్య ఖుర్‌ఆన్, విభేదాన్ని, ముఠాతత్వాన్ని ఖండించిన చోటల్లా దాని ఉద్దేశ్యంలో ఈ రెండో కోవకు చెందిన విభేదమే ఉంది. పోతే మొదటి రకం విభేదం, ఇటువంటి వాటికి తార్కాణాలు ఎన్నో స్వయంగా మహాప్రవక్త (సఅసం) సమక్షంలోనే ఉత్పన్నమయ్యాయి. ఆయన అనుమతించటమేకాక వాటిని శ్లాఘించారు కూడా. ఎందువల్లనంటే, ఇలాంటి విభేదం వల్ల సమాజంలో చింతన, ఆలోచన, పరిశోధన, అనుశీలన, అవగాహన చెయ్యగల సామర్థ్యాలు ఉన్నట్లు రుజువవుతుంది. సమాజంలోని మేధావులు తమ ధర్మం దాని ఆదేశాల పట్ల శ్రద్ధాసక్తులు కలిగి ఉన్నారని, వారి మేధ వివేచనలు వారి జీవిత సమస్యల పరిష్కారాన్ని ధర్మానికి వెలుపల కాకుండా ధర్మం పరిధిలోనే అన్వేషిస్తాయని తెలుస్తుంది. మొత్తానికి సమాజం సిద్ధాంతాలపై ఏకాభిప్రాయం కలిగి ఉండటం ద్వారా తన ఐక్యతను కాపాడుకుంటూ తనలోని విద్వాంసులు ఆలోచనాపరులకు సరయిన పరిధుల్లో అన్వేషణ, పరిశోధన, అన్వయంవంటి విషయాల్లో స్వేచ్ఛనిచ్చి ప్రగతికి పూలబాట వెయ్యాలనే స్వర్ణ సూత్రాన్ని అనుసరిస్తుందని ద్యోతకమవుతుంది.

"వమా తౌఫీకీ ఇల్లా బిల్లాహ్"

"నాకు సాధ్యమైంది ఇదే - వాస్తవ జ్ఞానమైతే అల్లాహ్‌కే ఉంది. నేను ఆయన్నే పూర్తిగా నమ్ముకున్నాను; ఆయన్నే మార్గదర్శకత్వం కొరకు అర్థిస్తున్నాను."

ఖుర్‌ఆన్ అధ్యయనం చేసేటప్పుడు పాఠకుని మనస్సులో ఉత్పన్న మయ్యే ప్రశ్నలనన్నింటినీ ఈ పుస్తకంలో చర్చించటం నా దృష్టిలో లేదు. ఎందుకంటే అలాంటి ప్రశ్నలు అధికంగా ఏదో ఒక ఆయత్ లేదా సూరా పఠించే సందర్భంలో ఉద్భవిస్తాయి. అలాంటివాటి సమాధానం "తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్"లో ఇవ్వటానికి కృషి జరిగింది. కాబట్టి అటువంటి ప్రశ్నల్ని వదలి కేవలం పూర్ణతః ఖుర్‌ఆన్‌కు సంబంధించిన సమగ్రమైన ప్రశ్నల్లే ఇక్కడ చర్చించాను.

విషయసూచిక

	ముందుమాట	....	41
1.	సూరె ఫాతిహా	....	43
2.	సూరె బఖర	....	43
3	ఆలి ఇమ్రాన్	....	58
4.	అన్ నిసా	....	67
5.	అల్‌మాయిదా	....	77
6.	అల్ అన్ఆమ్	....	84
7.	అల్ ఆరాఫ్	....	92
8.	అన్‌ఫాల్	....	101
9.	అత్ తౌబా	....	105
10.	యూనుస్	....	111
11.	హూద్	....	115
12.	యూసుఫ్	....	119
13	అర్రాద్	....	123
14.	ఇబ్రాహీమ్	....	126
15.	అల్ హిజ్ర్	....	128
16.	అన్ నహ్ల్	....	130
17.	బనీ ఇస్రాయీల్	....	135
18.	అల్ కహఫ్	....	139
19.	మర్యమ్	....	143
20.	తాహా	....	146
21.	అల్ అంబియా	....	149

22.	అల్ హజ్	....	151
23.	అల్ మూమినూన్	....	155
24.	అన్ నూర్	....	157
25.	అల్ ఫుర్ఖాన్	....	161
26.	అష్ షుఅరా	....	163
27.	అన్ నమ్ల్	....	167
28.	అల్ ఖసస్	....	170
29.	అల్ అన్కబూత్	....	174
30.	అర్రూమ్	....	177
31.	లుఖ్మాన్	....	179
32.	అస్ సజ్దహ్	....	181
33.	అల్ అహ్జాబ్	....	182
34.	సబా	....	186
35.	ఫాతిర్	....	188
36.	యాసీన్	....	190
37.	అస్ సాఫ్ఫాత్	....	193
38.	సాద్	....	195
39.	అజ్ జుమర్	....	196
40.	అల్ మూ'మిన్	....	200
41.	హామీమ్ అస్సజ్దహ్	....	203
42.	అష్ షూరా	....	205
43.	అజ్ జుఖ్రుఫ్	....	207
44.	అద్ దుఖాన్	....	210
45.	అల్ జాసియహ్	....	211

46.	అల్ అహ్ఖాఫ్	....	212
47.	ముహమ్మద్	....	214
48.	అల్ ఫత్హ్	....	216
49.	అల్ హుజురాత్	....	217
50.	ఖాఫ్	....	218
51.	అజ్ జారియాత్	....	219
52.	అత్తూర్	....	221
53.	అన్ నజ్మ్	....	221
54.	అల్ ఖమర్	....	223
55.	అర్ రహ్మాన్	....	224
56.	అల్ వాఖిఅహ్	....	225
57.	అల్ హదీద్	....	226
58.	అల్ ముజాదలహ్	....	228
59.	అల్ హష్ర్	....	229
60.	అల్ ముమ్తహినహ్	....	230
61.	అస్ సఫ్	....	231
62.	అల్ జుముఅహ్	....	231
63.	అల్ మునాఫిఖూన్	....	232
64.	అత్ తగాబున్	....	233
65.	అత్ తలాఖ్	....	233
66.	అత్ తహ్రీమ్	....	234
67.	అల్ ముల్క్	....	235
68.	అల్ ఖలమ్	....	236
69.	అల్హాఖ్ఖహ్	....	237

70.	అల్ మఆరిజ్	....	237
71.	నూహ్	....	238
72.	అల్ జిన్న్	....	239
73.	అల్ ముజ్జమ్మిల్	....	240
74.	అల్ ముద్దస్సిర్	....	241
75.	అల్ ఖియామహ్	....	241
76.	అద్దహ్ర్	....	242
77.	అల్ ముర్సలాత్	....	243
78.	అన్ నబా	....	243
79.	అన్ నాజిఆత్	....	244
80.	అబస	....	245
81.	అత్తక్వీర్	....	245
82.	అల్ ఇన్ఫితార్	....	245
83.	అల్ ముతఫ్ఫిఫీన్	....	246
84.	అల్ ఇన్షిఖాఖ్	....	246
85.	అల్ బురూజ్	....	247
86.	అత్ తారిఖ్	....	247
87.	అల్ ఆలా	....	247
88.	అల్ గాషియహ్	....	247
89.	అల్ ఫజ్ర్	....	248
90.	అల్ బలద్	....	248
91.	అష్ షమ్స్	....	249
92.	అల్ లైల్	....	249
93.	అజ్ జుహా	....	249

94.	అలమ్ నష్రహ్	....	250
95.	అత్ తీన్	....	250
96.	అల్ అలఖ్	....	250
97.	అల్ ఖద్ర్	....	250
98.	అల్ బయ్యినహ్	....	251
99.	అజ్జిల్ జాల్	....	251
100.	అల్ ఆదియాత్	....	251
101.	అల్ ఖారిఅహ్	....	251
102.	అత్తకాసుర్	....	252
103.	అల్ అస్ర్	....	252
104.	అల్ హుమజహ్	....	252
105.	అల్ ఫీల్	....	252
106.	ఖురైష్	....	252
107.	అల్ మావూన్	....	253
108.	అల్ కౌసర్	....	253
109.	అల్ కాఫిరూన్	....	253
110.	అన్ నస్ర్	....	253
111.	అల్ లహబ్	....	253
112.	అల్ ఇఖ్లాస్	....	254
113.	అల్ ఫలఖ్	....	254
114.	అన్ నాస్	....	254

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

ముందుమాట

రమజాను మాసం దివ్యఖుర్ఆన్ అవతరించిన మాసం. శుభప్రదమైన రమజాన్ మాసం సందర్భంగా చదివే తరావీహ్ నమాజులలో, రమజాన్ మాసం ముగిసేలోగా సంపూర్ణ ఖుర్ఆన్‌ను ఇమామ్ పఠించడం, ముసల్లీలు వినడం అన్నది ఒక ఆనవాయితీగా కొనసాగుతూ వస్తోంది. ఈ ఆనవాయితీ వెనుక కారణం లేకపోలేదు. ఈ దివ్యగ్రంథం అవతరించిన రమజాను మాసం అత్యంత శుభప్రదమైన మాసం. ఈ శుభాల మాసంతో దైవ విశ్వాసులకు అవినాభావ సంబంధముంది. ఈ దివ్యగ్రంథాన్ని పొందే మహద్భాగ్యం రమజాన్ మాసంలోనే వారికి లభించింది. ఈ దివ్యఖుర్ఆన్ బోధనలను, ఆదేశాలను క్రమబద్ధంగా, సంపూర్ణంగా విశ్వాసులకు వినిపించడానికే ఈ ఆనవాయితీ కొనసాగుతోంది.

అందువల్ల హైదరాబాద్ ముమాయున్ నగర్‌లోని మస్జిద్ అజీజియాలో తరావీహ్ నమాజుల సందర్భంగా, ప్రతీ తరావీహ్ (అంటే నాలుగు రకాతుల తర్వాత విరామం)లో అప్పటి వరకు విన్న ఖుర్ఆన్ పాఠం క్లుప్తంగా వివరించే బాధ్యత నాకు అప్పగించబడింది. ఈ పని చాలా బాధ్యతతతో, సమయాన్ని వెచ్చించి చేయవలసిన పని. దివ్యఖుర్ఆన్‌లోని ప్రతి రుకూ (ఒక నిర్ధారిత భాగం) లోతుగా అధ్యయనం చేయాలి. సారాన్ని గ్రహించాలి. ముఖ్యమైన అంశాలన్నీ తెలుసుకోవాలి. క్లుప్తంగానూ ఉండాలి, ముఖ్యమైన అంశాలేవీ విడిచిపెట్టనూరాదు. అల్లాహ్ పేరుతో ఈ పని ప్రారంభించాను, మస్జిద్‌లో నేను ఈ విధంగా ప్రతీరోజు ఖుర్ఆన్ వినిపించిన పిదప శ్రోతలను కూడా ఈ ప్రయత్నం ఆకట్టుకొంది. కొద్ది రోజులు గడిచిన తర్వాత ఈ ఖుర్ఆన్ పాఠాలన్నీ ఒక పుస్తకంగా ప్రచురిస్తే బాగుంటుందన్న అభిలాష అనేకులు వ్యక్తం చేశారు.

ఈ పుస్తకంలో కొన్నిచోట్ల ఖుర్ఆన్ ఆయతుల (సూక్తుల) అనువాదం సంపూర్ణంగా అందించడం జరిగింది. మరికొన్ని చోట్ల అనేక ఆయతుల భావాన్ని

క్లుప్తంగా, సమగ్రంగా వివరించడం జరిగింది. అలాగే సంఘటనలను సంక్షిప్తంగా ప్రస్తావించడం జరిగింది. అలాగే ప్రతి 'రుకూ' లోని పాఠ్య విషయాన్ని లేదా ముఖ్య ప్రబోధాన్ని వివరించే ప్రయత్నం చేశాను. ఏది ఏమైనా ఈ ప్రయత్నం చివరికి పుస్తక రూపం ధరించింది. ఈ పుస్తకం చదివిన పిదప ఎవరైనా దివ్యఖుర్‌ఆన్ పట్ల ఆకర్షితులైతే నా ఈ ప్రయత్నం ధన్యమైనదని భావిస్తాను.

నా యీ ప్రయత్నాన్ని దైవం పరలోక ప్రతిఫలంగా మార్చాలనీ, ప్రజలందరికీ దాని ద్వారా ప్రయోజనం చేకూరాలని ఈ పుస్తకం ప్రజలకు ఖుర్‌ఆన్ పఠనం పట్ల ప్రేరేపించేదిగా చేయాలని దైవాన్ని ప్రార్థించగలరు. (ఆమీన్)

ప్రియ సోదరులు ముహమ్మద్ సిద్దీక్, సయ్యద్ జమాల్ అహ్మద్, సయ్యద్ అజీజుల్లా హుస్సేనీ, అల్‌హాజ్ అహ్మద్ ఆరిఫుల్లా షరీఫ్, ముహమ్మద్ అబ్దుర్రహీమ్‌లకు ఈ సందర్భంగా నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. వీరందరి సహాయ సహకారాల వల్లనే నేడు ఈ ప్రతులు పాఠకుల చేతుల్లో ఉన్నాయి. అల్లాహ్ వీరందికీ ఇహపర లోకాల సౌభాగ్యం ప్రసాదించుగాక. (ఆమీన్)

మౌలానా ముహమ్మద్ గియాసుల్ ఇస్లామ్ రమ్మానీ గారి మార్గదర్శకత్వం, ప్రేరణ లేనట్లయితే ఈ పుస్తకం వెలువడేది కాదు. అల్లాహ్ వారికి అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదించాలని వేడుకొంటున్నాను. (ఆమీన్)

ఈ పనిలో నా జీవిత భాగస్వామి అందించిన సహకారం కూడా ఎనలేనిది. స్వర్గలోకపు ఉత్తమ కానుకల్లో ఒక కానుక భార్య. అలాంటి భార్య మనస్ఫూర్తిగా భర్తకు సహకరిస్తూ ఉంటే, ధార్మిక సేవలో భర్తకు చేయూతనిస్తే అంతకన్నా కావలసిందేముంది. అల్లాహ్ ఆమెకు ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. (ఆమీన్)

- ఏజాజ్ మొహియుద్దీన్ వసీమ్

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

సూరె ఫాతిహా

రుకు1 : సర్వస్తోత్రాలు అల్లాహ్‌కే. ఆయన సకల లోకాలకు ప్రభువు, కరుణామయుడు. కృపాసాగరుడు. ప్రతిఫల దినానికి స్వామి. మేము నిన్నే ఆరాధిస్తున్నాము. సహాయం కోసం నిన్నే వేడుకొంటున్నాము. మాకు రుజుమార్గం చూపు. నీ బహుమానాలను, నీ కారుణ్యాన్ని పొందిన వారి మార్గం చూపు. నీ ఆగ్రహానికి గురయినవారు, మార్గం తప్పినవారి బాటన మమ్మ నడుపవద్దు. - ఆమీన్

2. సూరె బఖర

రుకూ 1 : ఈ గ్రంథం దైవభీతి కలవారికి హితబోధ. దైవభీతి కలవారంటే 1. అగోచర వాస్తవాలను విశ్వసించేవారు. 2. నమాజును స్థాపించేవారు 3. అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టేవారు 4. ఖుర్ఆన్‌ను, పూర్వం అవతరించిన గ్రంథాలను విశ్వసించేవారు. 5. పరలోకాన్ని విశ్వసించేవారు. రుజుమార్గంపై ఉన్నది వీరే. వీరే సాఫల్యాన్ని పొందుతారు. కానీ, అవిశ్వాసుల హృదయాలపై చెవులపై సీలుపడి ఉంది. వారి కళ్లపై తెరపడి ఉంది.

రుకూ 2 : ఈ రుకూలో మునాఫికుల (కపట విశ్వాసుల) ప్రస్తావన ఉంది. కాపట్యం ఎన్నివిధాలో వివరించబడింది. 1.'భూమిపై కల్లోలం రేకెత్తించవద్ద'ని వారితో అన్నప్పుడు వారు "మేము సంస్కరణ చేస్తున్న వాళ్లం' అంటారు. 2. ఇతరులు విశ్వసించినట్లు మీరు కూడా విశ్వసించండ'ని అన్నప్పుడు "మేము మూర్ఖుల మాదిరి విశ్వసించాలా?" అంటారు. 3. విశ్వాసులతో కలిసినప్పుడు వారు 'మేము విశ్వసించాము' అంటారు. కాని తమ షైతానులతో ఏకాంతంగా కలిసినప్పుడు "మేమసలు మీతోనే ఉన్నాం. వాళ్లతో కేవలం పరిహాసమాడుతున్నాం" అంటారు. వీరి పోలిక ఎలాంటిదంటే ఒక వ్యక్తి నిప్పురాజేశాడు. పరిసరాలన్నీ వెలుగుతో నిండాయి. అప్పుడు

అల్లాహ్ అతడి కంటి వెలుగు (చూపు) హరింపజేశాడు (అలాంటి వ్యక్తిని పోలిన వాళ్లు)

రుకూ 3 : ఇక్కడ ఒక సవాలు చేయబడింది. ఇది దైవగ్రంథం అవునో కాదో అన్న సందేహం ఉంటే దాని వంటి ఒక్క సూరా అయినా రచించి తీసుకురండి, మీ సహచరులందరినీ పిలుచుకొండి, ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి సహాయాన్నయినా పొందండి, మీరు సత్యవంతులే అయితే ఈ పని చేసి చూపించండి (అని ఛాలెంజి చేయడం జరిగింది). కాని, మీరు అలా చేయలేకపోతే– నిశ్చయంగా ఎన్నటికీ చేయ లేరు. మనుష్యులు, రాళ్ళు ఇంధనమయ్యే అగ్నికి భయపడండి (అని హెచ్చరించడం జరిగింది). అల్లాహ్ ఉదాహరణలు చూసి కూడా అపమార్గం పట్టే వారు తిరస్కారులు (ఫాసిఖ్) మాత్రమే. తిరస్కారులంటే 1) అల్లాహ్‌తో చేసిన ప్రమాణాన్ని దృఢపరచిన తర్వాత భంగపరిచేవారు 2) అల్లాహ్ వేటినయితే కలుపండని ఆదేశించాడో వాటిని తెంచేవారు 3) భువిలో కల్లోలాన్ని రేకెత్తించేవారు.

రుకూ 4 : అల్లాహ్ దైవదూతలతో "నేను భూమిపై ఒక ప్రతినిధిని సృష్టిస్తున్నాను" అన్నప్పుడు దైవదూతలు అభ్యంతరం పెట్టారు. అల్లాహ్ ఆదమ్‌కు సమస్త వస్తువుల పేర్లు నేర్పాడు. ఆదమ్ దైవదూతల ముందు సమస్త వస్తువుల పేర్లు తెలియజేశాడు. పిదప అల్లాహ్ దైవదూతలందరినీ "ఆదమ్ ముందు తలవంచండి" అని ఆదేశించాడు. అందరూ తలవంచారు. కాని ఇబ్లీస్ ధిక్కరించాడు. ఆ పిదప ఆదమ్, హవ్వాలను స్వర్గంలో ఉంచడం జరిగింది. వారితో "ఈ చెట్టు దరిదాపులకు పోవద్దు." అని చెప్పడం జరిగింది. కాని షైతాను చివరకు వారిద్దరిని ఆ చెట్టు వైపునకు వెళ్లేలా ప్రేరే పించి అల్లాహ్ ఆజ్ఞను అతిక్రమించేలా చేశాడు. ఆదమ్‌ను, ఆయన భార్యను అల్లాహ్ భూమిపై దించేశాడు. అప్పుడు ఆదమ్ అల్లాహ్ నుంచి కొన్ని మాటలు నేర్చుకొని పశ్చాత్తాపపడుతూ క్షమాపణ వేడుకొన్నాడు. అల్లాహ్ ఆయన్ను మన్నించాడు. " నా తరఫు నుంచి ఉపదేశం మీ వద్దకు వచ్చినప్పుడు దాన్ని పాటించిన వారికి ఎలాంటి భయ విచారాలూ ఉండవు. నిరాకరించిన వారు నరకాగ్నికి గురవుతారు" అని తెలియజేశాడు అల్లాహ్.

రుకూ 5 : ఇస్రాయీల్ సంతతి వారితో 1) అల్లాహ్‌కు భయపడండి, నేను ఇప్పుడు పంపిన గ్రంథాన్ని విశ్వసించండి, మీ వద్ద ముందు నుంచి ఉన్న దివ్యగ్రంథాన్ని ఇది

ధృవీకరిస్తుంది. 2) అల్పమయిన ధరకు నా వాక్యాలను అమ్మకండి 3) సత్యాన్ని అసత్యంతో కలిపి కలగాపులగం చేయకండి 4) బుద్ధిపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయకండి, నమాజు స్థాపించండి, జకాత్ ఇవ్వండి. నా సమక్షంలో విధేయులై తలవంచే వారితో పాటు మీరు విధేయతతో తలవంచండి" అనడం జరిగింది.

రుకూ 6: అల్లాహ్ ఇస్రాయీల్ సంతతికి అనేక మేళ్లు చేసినప్పటికీ వారు ప్రతీ ఉపకారానికి బదులు కృతఘ్నతనే చూపారు. వారి కళ్ల ముందే వారి మగ సంతానాన్ని వధించి కుమార్తెలను మాత్రం వదిలిపెట్టే 'ఫిరౌను' నుంచి వారిని అల్లాహ్ విముక్తి ప్రసాదించాడు. ఆ ఫిరౌనును వారి కళ్ల ముందే సముద్రంలో ముంచి వేశాడు. ఇస్రాయీల్ సంతతిని క్షేమంగా ఆవలి ఒడ్డుకు చేర్చడం జరిగింది. ఈ ఉపకారానికి బదులుగా వారు చేసింది ఏమిటంటే, మూసాను నలభై రాత్రుల కాలానికి గాను అల్లాహ్ పిలుచుకొన్నప్పుడు వాళ్లు ఆవు దూడను ఆరాధ్యదైవంగా చేసుకొన్నారు. అయినా అల్లాహ్ క్షమించాడు. వారిపై మబ్బుల నీడను ఏర్పరిచాడు. ఆకాశం నుంచి మన్న్ సల్వాలను వారికోసం ఆహారంగా దించాడు. వారితో "మీ ఎదురుగా ఉన్న నగరంలో ప్రవేశించండి. అక్కడ పండే పంటలను తృప్తిగా తినండి- కాని వినమ్రులై తలవంచుతూ నగర ద్వారంలోనికి ప్రవేశించాలి" అన్నప్పుడు దుర్మార్గులు ఆ ఆదేశాన్ని మార్చివేశారు. అప్పుడు అల్లాహ్ వారిపై ఆకాశం నుంచి ఆపదను దించాడు.

రుకూ 7: పన్నెండు ఊటలు పెల్లుబికడం - తన జాతి ప్రజల కోరికపై మూసా ప్రార్థించినపుడు మేము "ఆ కొండరాతిపై చేతి కర్రతో కొట్టు" అని ఆదేశించాము. తదనుగుణంగా కొండరాయి నుంచి పన్నెండు ఊటలు పెల్లుబికాయి. ప్రతీ తెగ ఒక్కో నీటి ఊటను తమ కోసం ప్రత్యేకించుకున్నది. వాళ్లు మూసాతో "ఒకే రకమైన భోజనం భరించలేకపోతున్నాం. మా కోసం భూమిపై పండే ఆకుకూరలు, కూరగాయలు, గోధుమలు, వెల్లుల్లి, ఉల్లిపాయలు, పప్పులు వగైరా ఉత్పత్తి చేయమని మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి" అన్నారు.

అప్పుడు మూసా వారితో శ్రేష్ఠమైన దానికి బదులుగా హీనమైన దానిని కోరుకుంటున్నారా" అన్నారు. చివరకు వారు తీవ్ర పరాభవానికి, దుర్భర దారిద్ర్యానికి గురి అయ్యారు.

రుకూ 8 : తూర్ పర్వతాన్ని మీపైకి ఎత్తి మీ నుంచి గట్టి ప్రమాణం తీసుకున్నాము. మేము మీకు ఇస్తున్న గ్రంథాన్ని దృఢంగా పట్టుకోండి. ఇందులో ఉన్న ఆదేశాలను, ఉపదేశాలను జ్ఞాపకం ఉంచుకోండి అని ప్రమాణం తీసుకున్నాము. కాని తరువాత వాళ్లు ప్రమాణాన్ని భంగపరిచారు. సబ్బత్ శాసనాన్ని ఉల్లంఘించారు. అందువల్ల అల్లాహ్ వారిని కోతులుగా మార్చివేసి, వారి ముగింపును ఆ కాలం ప్రజలకు, భావితరాల వారికి గుణపాఠంగా చేసివేశాడు. అల్లాహ్ ఆవును బలిగా ఇవ్వండని ఆదేశించినపుడు వారు "ఎలాంటి ఆవు? రంగెలా ఉండాలి? ఏ విధంగా ఉండాలి? వివరాలేమిటి?" అంటూ దాటవేయడానికి ప్రయత్నించారు. చివరకు బలి ఇచ్చారు.

రుకూ 9 : హజ్రత్ మూసా ఒక శవంపై చేతి కర్రతో కొట్టారు. కళేబరంలో ప్రాణం వచ్చింది. ఈ నిదర్శనాన్ని చూసినప్పటికీ వాళ్ల హృదయాలు మరింత కఠినమై పోయాయి. పాషాణం కన్నా కఠినమైపోయాయి. వారిలో ఒక వర్గం అల్లాహ్ ప్రవచనాన్ని విని బాగా అర్థం చేసుకుంటూనే, బుద్ధిపూర్వకంగా దాన్ని తారుమారు చేసేది. నిరక్షరాస్యుల వర్గం మరొకటి ఉంది. వారికి గ్రంథజ్ఞానం ఎంతమాత్రం లేదు. లేనిపోని ఆశలను, కోరికలను పెంచుకుని ఊహల్లో జీవించే వర్గం అది. "నరకాగ్ని మమ్మల్ని తాకలేదు. మహా అయితే కొన్ని రోజుల శిక్షపడవచ్చు" అంటారు. నరకాగ్ని ఎందుకు ముట్టుకోదు? పాపం సంపాదించి పాపజాలంలో ఇరుక్కున్న వాళ్ళు నరకవాసులే. వారు నరకంలో శాశ్వతంగా ఉంటారు.

రుకూ 10: ఇస్రాయీల్ సంతతి నుంచి వాగ్దానం తీసుకోవడం జరిగింది. అదేమంటే, 1) అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు. 2) తల్లిదండ్రులను, బంధువులను, అనాథలను, నిరుపేదలను ఆదరించాలి 3) ప్రజలను సహృదయంతో పలుకరించాలి. 4) నమాజును స్థాపించాలి 5) జకాత్ చెల్లించాలి 6) ఒకరినొకరు చంపుకోరాదు 7) ఒండొరులను ఇళ్ల నుంచి బహిష్కరించరాదు. కాని కొందరు తప్ప అందరూ ఈ వాగ్దానాన్ని భంగపరిచారు. సొంత సోదరులనే సంహరించారు. ఇళ్ళ నుంచి గెంటి వేశారు. యుద్ధ ఖైదీలుగా పట్టుకొని వారి నుంచి నష్టపరిహారం వసూలు చేశారు. ఫలితంగా ఇహలోక జీవితంలో వారు ఘోరపరాభవానికి గురయ్యారు. పరలోకంలో తీవ్రమైన శిక్షకు అర్హులయ్యారు.

రుకూ 11: ఇపుడు అల్లాహ్ తరపు నుంచి వచ్చిన గ్రంథం వారి వద్ద పూర్వం నుంచీ

ఉన్న గ్రంథాన్ని ధృవీకరిస్తుంది. అయినప్పటికీ వారు దీనిని గుర్తించకుండా తిరస్కరించారు. "అల్లాహ్ అవతరింపజేసిన దానిని విశ్వసించండి" అని వారితో అన్నప్పుడు 'మా (ఇస్రాయీలు సంతతి) వద్దకు వచ్చిన దానిని మాత్రమే మేము విశ్వసిస్తాము.' అన్నారు. తమ జాతి పరిధికి ఆవల అవతరించిన ప్రతి దానిని తిరస్కరించారు. నిజానికి అది సత్యం. వారి వద్ద పూర్వం నుంచి ఉన్న బోధనలను అది ధృవీకరిస్తోంది. వారిని ఇలా అడగండి: "అల్లాహ్ వద్ద పరలోక నివాసం మానవులందరికీ కాక కేవలం మీకు మాత్రమే ప్రత్యేకించబడితే, అప్పుడు మీరంతా మరణాన్ని తప్పక కోరుకోవాలి" కాని వారు ఎన్నడూ మరణాన్ని కోరరు. ఎందుకంటే వారి ఆచరణలు అలాంటివి. అందువల్ల వారు అక్కడికి వెళ్లడం అంటే ఇష్టపడరు.

రుకూ 12 : అల్లాహ్‌కు, ఆయన దూతలకు, ఆయన ప్రవక్త (సఅసం), జిబ్రీలుకూ (అస), మీకాయీలు (అస)కు శత్రువులయిన వారికి అల్లాహ్ శత్రువు. అల్లాహ్ నుంచి దివ్యగ్రంథం తీసుకుని ప్రవక్త ఎవరయినా వారి వద్దకు వచ్చినపుడు వారి వద్ద పూర్వం నుంచి ఉన్న గ్రంథాన్ని అది ధృవీకరిస్తున్నప్పుడు ఒక వర్గం వారు దానిని త్రోసిపుచ్చారు. చేతబడి వెంటపడ్డారు.

బాబిలోనియాలో అల్లాహ్ పంపిన ఇద్దరు దైవదూతలు హారూత్, మారూత్‌లు మంత్ర విద్య నేర్పేవారు. ఎవరికైనా ఆ విద్య నేర్పేముందు వారు స్పష్టంగా హెచ్చరిక చేసేవారు. "జాగ్రత్త, మేము ఒక పరీక్ష మాత్రమే. అవిశ్వాసానికి గురికావద్దు" అని హెచ్చరించేవారు. అయినప్పటికీ వారు ఆ విద్యను నేర్చుకునేవారు. భార్యాభర్తలను వేరు చేసే విద్య అది. ఈ విద్యను నేర్చుకొన్న వాడిని పరలోక సౌఖ్యాలలో ఏమాత్రం భారం లేదని వారికి బాగా తెలుసు.

రుకూ 13: యూదులు ప్రయోగించే పదాలు లేదా వారి మాట తీరును అవలంబించరాదని విశ్వాసులకు బోధించడం జరిగింది. 'రాయినా' అనరాదు. "ఉన్‌జుర్నా" అనాలి. పూర్వం మూసా (అస)ను అడిగిన ప్రశ్నల వంటి ప్రశ్నలను ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను అడుగరాదని చెప్పడం జరిగింది. గ్రంథ ప్రజలలోని పలువురు మిమ్మల్ని ఏదో విధంగా విశ్వాసమార్గం నుంచి మరల్చి మళ్లీ అవిశ్వాస మార్గం వైపునకు తీసుకుపోవాలని కోరుకుంటున్నారు. వారు మిమ్మల్ని చూసి అసూయ పడుతున్నారు. అందుకే అవిశ్వాసం వైపునకు తీసుకుపోవాలని భావిస్తున్నారు. వారిని క్షమించండి. ధర్మంపై

దృఢంగా ఉండండి. స్వర్గం యూదులకో లేక క్రైస్తవులకో చెందినది కాదు. ఎవరు తమను తాము అల్లాహ్ విధేయతకు అంకితం చేసుకుంటారో సన్మార్గం అవలంబిస్తారో వారికి ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం లభిస్తుంది.

రుకూ 14 : అల్లాహ్ ఆరాధనాలయాల్లో ఆయన నామ సంస్మరణను నిషేధించి, వాటిని పాడుబడేలా చేసే వానికంటే పరమ దుర్మార్గుడెవడు? అటువంటి వారు ఆ ఆరాధనా లయాల్లో అడుగు పెట్టడానికి అర్హులుకారు. ఒకవేళ వారు అక్కడకు ప్రవేశించినా భయపడుతూ ప్రవేశించాలి. ఇలాంటి వారికి ప్రపంచంలో తీవ్ర పరాభవమూ పరలోకంలో ఘోరశిక్ష తప్పవు. అల్లాహ్ ఆకాశాలకు, భూమికి సృష్టికర్త. ఆయన ఏదన్నా చేయాలని నిర్ణయం తీసుకొన్నప్పుడు, ఆ పనిని కేవలం 'అయిపో' అని ఆజ్ఞాపిస్తాడు. ఆ పని వెంటనే అయిపోతుంది. 'అల్లాహ్ చూపించిన మార్గమే ఏకైక మార్గం' అని స్పష్టంగా చెప్పండి. దివ్యజ్ఞానం మీ వద్దకు వచ్చిన పిదప కూడా, ఒకవేళ మీరు వారి కోరికలకు లొంగిపోతే, అల్లాహ్ పట్టు నుంచి కాపాడే సహాయకుడు, మిత్రుడు ఎవడూ లేడు అని చెప్పబడింది.

రుకూ 15 : హజ్రత్ ఇబ్రాహీంను అల్లాహ్ కొన్ని విషయాలలో పరీక్షించాడు. వాటన్నిటిలోనూ ఆయన పూర్తిగా నెగ్గారు. అప్పుడు అల్లాహ్ ఆయన్ను ప్రజలందరికీ నాయకునిగా చేశాడు. "మేము ఆ యింటిని (కాబాను) మానవులందరికీ కేంద్రం గానూ శాంతి నిలయం గానూ చేశాము. ఇబ్రాహీమ్ ఆరాధనకు నిలబడిన ప్రదేశాన్ని శాశ్వతమైన నమాజు స్థలంగా చేసుకొమ్మని ప్రజలను ఆదేశించాము. ఇంకా నా యీ గృహాన్ని, ప్రదక్షిణం చేసే వారి కొరకు, దానిలో ఏతెకాఫ్ పాటించే వారి కొరకు, రుకూ, సజ్దాలు చేసేవారి కొరకు పరిశుద్ధంగా ఉంచవలసిందని ఇబ్రాహీమ్‌ను, ఇస్మాయీలును నిర్దేశించాము."

ఇబ్రాహీము, ఇస్మాయీలు ఆ యింటి గోడలు ఎత్తేటప్పుడు "ఓ మా ప్రభూ! మా యీ సేవలను నీవు దయతో స్వీకరించు, నీవు అందరి మొరలు ఆలకించేవాడవు. అన్నీ తెలిసిన వాడవు. మా యిద్దరినీ నీ విధేయులుగా చేసుకో. పూర్తిగా నీ విధేయతకే అంకితమయ్యే, ఓ జాతిని మా సంతతిలో ఆవిర్భవింపజెయ్యి. నీ ఆరాధనా పద్ధతులు మాకు తెలుపు. మా తప్పులను మన్నించు. ప్రభూ! నీ వాక్యాలు వినిపించి, నీ గ్రంథాన్ని దివ్యజ్ఞానాన్ని బోధించి, జీవితాలను తీర్చిదిద్దే ఒక ప్రవక్తను స్వయంగా వారి నుంచే పుట్టించు" అని ప్రార్థించేవారు.

రుకూ 16 : అల్లాహ్, ఇబ్రాహీమ్ (అస)తో "ముస్లిమ్ అయిపో" అని అన్న వెంటనే ఆయన "నేను విశ్వ ప్రభువుకు "ముస్లిమ్ అయిపోయాను" అని జవాబు ఇచ్చారు. హజ్రత్ యాకూబ్ (అస) తన సంతానానికి హితోపదేశం చేస్తూ, "నా బిడ్డలారా! అల్లాహ్ ఈ ధర్మాన్నే మీ కొరకు ఇష్టపడ్డాడు. అందువల్ల మరణించే వరకు మీరు ముస్లిములు గానే ఉండండి" అని చెప్పారు.

మేమంతా అల్లాహ్‌ను ఆయన మా వైపునకు పంపిన హితోపదేశాన్ని విశ్వసించాము. ఇంకా ఇబ్రాహీము (అస), ఇస్మాయీలు (అస), ఇస్‌హాఖు (అస), యాకూబ్ (అస), యాకూబ్ సంతానంపై అవతరించిన దానిని, మూసా (అస), ఈసా (అస)కు ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు ప్రసాదించిన దానిని విశ్వసించాము. వారిలో ఏ ఒక్కరి పట్ల భేదభావం చూపము. ముస్లిములుగా అల్లాహ్‌కు స్వీయ సమర్పణ చేసుకున్నాం మేము' అని ప్రకటించండని ముస్లిములకు చెప్పడం జరిగింది.

"అల్లాహ్ రంగును స్వీకరించండి. అల్లాహ్ రంగు కంటే యే రంగు శ్రేష్ఠతరమైనది? మేము కేవలం ఆయననే ఆరాధిస్తాము" అని చెప్పండని ఆదేశించడం జరిగింది.

రుకూ 17 : 'ఆ విధంగా మేము ముస్లిములను "ఒక మధ్యస్త సమాజం" గా చేశాము. ఇకపై మీరు సమస్త మానవ జాతికి సాక్షులుగా ఉంటారు. ప్రవక్త మీకు సాక్షిగా ఉంటారు' (పిదప ఖిబ్లా గురించిన ఆదేశం వచ్చింది).

"ప్రవక్తా! నీవు మాటిమాటికి నీ ముఖాన్ని ఆకాశం వైపునకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. ఇదిగో, నీకు అత్యంత ప్రీతికరమైన ఖిబ్లా వైపునకే ఇప్పుడు మేము నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని "మస్జిదె హరామ్" వైపునకు త్రిప్పు. ఇకనుంచి ఎక్కడ ఉన్నా సరే ముఖాన్ని ఆ వైపునకే పెట్టి నమాజు చెయ్యండి" గ్రంథ ప్రజలు మీరు చెప్పే ఖిబ్లాను అంగీకరించరు. నీవు ఎలాంటి నిదర్శనం చూపినా సరే. అలాగే వారి ఖిబ్లాను మీరు అనుసరించడం మీకు అసాధ్యం. నిజం చెప్పాలంటే, గ్రంథ ప్రజలు తమ సంతానాన్ని గుర్తించినంత సులువుగా ఈ ఖిబ్లాను గుర్తించగలరు. కాని వాళ్లు సత్యాన్ని దాచిపెడుతున్నారు.

రుకూ 18 : ఈ రుకులో మరోసారి 'మస్జిదె హరామ్ వైపునకు ముఖం పెట్టాలని, వ్యతిరేకులను లక్ష్యపెట్టనవసరం లేదని చెప్పడం జరిగింది." మీరు ఏ ప్రాంతంలో ప్రయాణం చేసినా మీ ముఖాన్ని (నమాజు సమయంలో) మస్జిదె హరామ్ వైపునకు

తిప్పండి. ఎందుకంటే ఇది మీ ప్రభువు చేసిన న్యాయమైన నిర్ణయం. మీరు ఎక్కడ ఉన్నా సరే మీ ముఖాన్ని మస్జిదే హరామ్ వైపునకు త్రిప్పి నమాజు చెయ్యండి. మీ వ్యతిరేకుల నోరు ఎట్టి పరిస్థితిలోనూ మూతపడదు. మీరు వారికి భయపడకండి. నాకు భయపడండి. మీరు నన్ను జ్ఞాపకముంచుకోండి. నేను మిమ్మల్ని జ్ఞాపక ముంచు కుంటాను. నాకు కృతజ్ఞతలు తెలుపండి. చేసిన మేలును మరువకండి.

రుకూ 19 : విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి. సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు. అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని 'మృతులు' అనకండి. వాస్తవానికి వారు సజీవులు.

భయప్రమాదాలకు, ఆకలి బాధలకు, ధన ప్రాణ, ఆదాయాల నష్టానికి గురిచేసి అల్లాహ్ తప్పక మిమ్మల్ని పరీక్షిస్తాడు. ఈ పరిస్థితులలో సహనం వహించినవారు, కష్టకాలం దాపురించినప్పుడు "మేమంతా అల్లాహ్‌కే చెందినవారము, అల్లాహ్ వైపునకే మరలి పోవలసిన వారము" అని పలికే వారికి శుభవార్త ఉంది. అల్లాహ్ తన అపార అనుగ్రహాలను, కరుణా కటాక్షాలను వారిపై కురిపిస్తాడు.

అల్లాహ్ అవతరింపజేసిన స్పష్టమైన జ్ఞానబోధలు, ధర్మోపదేశాలు వాస్తవానికి మానవులందరి మార్గదర్శకత్వం కోసం అని విశదం చేసిన తరువాత కూడా వాటిని దాచిపెట్టే వారిని అల్లాహ్ తప్పక శపిస్తాడు. ఇంకా శపించే వారంతా వారిని శపిస్తారు.

రుకూ 20 : భూమ్యాకాశాల నిర్మాణంలో, రేయింబవళ్ళు ఒకదాని వెంట ఒకటి చేసే నిరంతర పయనంలో, ప్రజాబాహుళ్యానికి ఉపయోగపడే వస్తువులు మోసుకుంటూ నదులలో, సముద్రాలలో సంచరించే ఓడలలో, పై నుంచి అల్లాహ్ కురిపించే వర్షపు నీటిలో తద్వారా ఆయన మృతభూమికి ప్రాణం పోస్తాడు. (ఈ ఏర్పాటు ద్వారా) భూమిపై వివిధ ప్రాణులు వర్ధిల్లేలా చేస్తాడు. వీచే గాలుల్లో, భూమ్యాకాశాల మధ్య అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడి వున్న మేఘ మాలికల్లో వివేకం ఉన్న వారికి అసంఖ్యాక సూచనలు కానవస్తాయి. కాని కొందరు అల్లాహ్ ఏకత్వాన్ని స్పష్టంగా, బహిరంగంగా చాటే ఇన్ని సూచనలు ఉన్నప్పటికీ) అల్లాహ్‌ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తూ, అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా వారిని ప్రేమిస్తుంటారు. కాని, విశ్వాసులు అల్లాహ్‌నే అందరికన్నా అధికంగా ప్రేమిస్తారు.

రుకూ 21 : ప్రజలారా! షైతాను చూపే మార్గాన నడవవద్దు. వాడు మీకు బహిరంగ

శత్రువు. వాడు మిమ్మల్ని దుర్మార్గం, అశ్లీలం చేసేలా ఆజ్ఞాపిస్తాడు. (అల్లాహ్ చెప్పినట్టు) మీకు తెలియని విషయాలు అల్లాహ్ పేరు మీద చెప్పేలా మిమ్మల్ని ప్రేరేపిస్తాడు.

"అల్లాహ్ ఆదేశాలను అనుసరించండి" అని వారితో అన్నప్పుడు వాళ్లు "మేము మా పూర్వీకుల పద్ధతినే పాటిస్తాం" అంటారు. వారి పూర్వీకులు జ్ఞానం లేనివారయి నప్పటికీ, సన్మార్గం పొందని వారయినప్పటికీ వారినే అనుసరిస్తూ ఉంటారా?

అల్లాహ్ చూపిన మార్గాన్ని తిరస్కరించే వారు నిజానికి చెవిటివారు, మూగవారు, గ్రుడ్డివారు. అందుకే ఏ విషయమూ వారికి బుర్రకెక్కదు. విశ్వసించిన ప్రజలారా! పరిశుభ్రమైన వస్తువులన్నింటినీ నిస్సంకోచంగా తినండి. అల్లాహ్ నిషేధించినది - 1) మరణించిన వాటిని తినరాదు 2) రక్తాన్ని, పందిమాంసాన్ని ముట్టరాదు 3) అల్లాహ్‌కు కాక ఇతరులకు సమర్పించబడిన వాటిని తినకండి. కాని ఎవరయినా గత్యంతరం లేని పరిస్థితుల్లో వాటిలో యే పదార్థమైనా తింటే అది పాపం కాదు.

రుకూ 22 : సత్కార్యం అంటే ముఖాన్ని తూర్పుకో, పడమరకో తిప్పడం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, దైవదూతలను అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించడం. ఇంకా, అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే సంపదను బంధువుల కొరకు, అనాథల కొరకు, నిరుపేదల కొరకు, బాటసారుల కొరకు, సహాయం అర్థించే వారి కొరకు, ఖైదీలను విడుదల చేయడానికి వ్యయపరచడం, ఇంకా నమాజును స్థాపిం చడం, జకాత్ ఇవ్వడం, వాగ్దానం చేస్తే దానికి కట్టుబడడం, కష్టకాలంలో, లేమిలో, సత్యాసత్యాల పోరాటంలో స్థైర్యం చూపడం- ఇలా చేసే వారు సత్పురుషులు. హత్యావ్యవహారాలలో, హత్య చేసిన వ్యక్తి స్వతంత్రుడయితే అతడినే శిక్షించాలి. బానిస అయితే ఆ బానిసనే వధించాలి. స్త్రీ అయితే ఆ స్త్రీతోనే ప్రతీకారం. ఒకవేళ హతుని వారసులు హంతకుడిని కనికరించదలిస్తే రక్తపరిహారం తీసుకుని హంతకుడిని క్షమించవచ్చు. ఇది ప్రతీకార న్యాయం. బుద్ధి జ్ఞానం కల ఓ మానవులారా! ఈ ప్రతీకార న్యాయంలోనే మీ సమాజానికి ప్రాణం ఉంది.

రుకూ 23 : రమజాను నెల పవిత్ర ఖుర్‌ఆన్ అవతరించిన నెల. మానవులందరికి (ఈ గ్రంథం) మార్గదర్శకం. రుజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరు పరిచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కనుక ఇక నుంచి రమజాను నెలను పొందే వ్యక్తి

ఆ నెల అంతా విధిగా ఉపవాసముండాలి. అయితే, వ్యాధిగ్రస్తులు, లేదా ప్రయాణంలో ఉన్నవారు, ఆ ఉపవాస దినాలను వేరే రోజులలో పూర్తి చేయవచ్చు. రాత్రి సమయాలలో మీరు మీ భార్యల వద్దకు పోవడం మీ కొరకు ధర్మసమ్మతం చేయబడింది. ఇంకా రాత్రి నలుపు రేఖల నుంచి ఉషోదయపు ధవళ రేఖలు ప్రస్ఫుటమయ్యే వరకు తినండి, తాగండి, ఆ తర్వాత వీటన్నింటిని త్యజించి చీకటి పడే వరకు మీ ఉపవాసం పూర్తి చేయండి. కాని మస్జిద్‌లలో 'ఏతెకాఫ్' పాటించే టప్పుడు మీరు మీ భార్యలతో సంభోగించరాదు. ఇవి అల్లాహ్ ఏర్పరచిన హద్దులు. వాటి దరిదాపులకు కూడా పోవద్దు.

రుకూ 23: అల్లాహ్ మార్గంలో మీతో పోరాడే వారితో మీరూ పోరాడండి. కాని హద్దులు మీరరాదు. హద్దు మీరే వారిని అల్లాహ్ ఇష్టపడడు. మిమ్మల్ని వారు ఎక్కడ ఎదుర్కొన్నా మీరు వారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడి నుంచి పారద్రోలారో, అక్కడి నుంచి మీరు వారిని పారద్రోలండి. చంపడం చెడ్డదే కాని ఫిత్నా (పీడన) అంతకంటే చెడ్డది. పీడన (ఫిత్నా) అంతమయ్యే వరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో పోరాడండి. తరువాత వారు దానిని మానుకుంటే దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించరాదు. మీపై ఎవరన్నా దాడి చేస్తే మీరు వారిపై అదేవిధంగా దాడి చెయ్యండి. దూరప్రాంతాల నుంచి హజ్‌యాత్ర కొరకు వచ్చేవారు హజ్ కాలం వచ్చేవరకు 'ఉమ్రా' చేయవచ్చు. వారు తమ శక్తికి తగిన విధంగా ఖుర్బానీ ఇవ్వాలి. ఖుర్బానీ ఇవ్వలేకపోతే హజ్ కాలంలో మూడు ఉపవాసాలు, ఇంటికి తిరిగి వచ్చిన పిదప ఏడు ఉపవాసాలు ఈ విధంగా మొత్తం పది ఉపవాసాలు ఉండాలి.

రుకూ 25 : హజ్‌యాత్రకు సంకల్పం చేసుకున్న వ్యక్తి నిష్ఠతో వ్యవహరించాలి. హజ్ సమయంలో కామచేష్టలకు, దుష్కార్యాలకు ఘర్షణలకు దూరంగా ఉండాలి. హజ్‌యాత్రకు ప్రయాణ సామగ్రి తీసుకువెళ్లాలి. అన్నింటికన్నా ఉత్తమమైన ప్రయాణ సామగ్రి దైవం పట్ల భయభక్తులు. 'అరఫాత్' నుంచి బయలుదేరి 'మష్‌అరె హరామ్" (ముజ్‌దల్‌ఫ) వద్ద ఆగి అల్లాహ్‌ను స్మరించండి. హజ్ విధులను ముగించిన పిదప అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి. ఈ సందర్భంగా క్రింది దుఆ సముచితమైనది.

"రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతంవ్వఫిల్ ఆఖిరతి హసనతంవ్వఖినా అజాబన్నార్" (మా ప్రభూ ఇహలోకంలోనూ, పరలోకం లోనూ మాకు మంచిని ప్రసాదించు.

మమ్మల్ని నరక బాధ నుంచి కాపాడు) లెక్కకు కొన్ని రోజులు మాత్రమే ఉన్నాయి. అల్లాహ్ నామ స్మరణలోనే ఈ రోజులు గడపాలి.

రుకూ 26 : అవిశ్వాస మార్గాన్ని అవలంబించిన వారు, విశ్వాస మార్గం అవలంబించిన వారిని పరిహసిస్తారు. కాని ప్రళయదినాన భయభక్తులు కలవారే ఉన్నత స్థానాన్ని పొందుతారు. ఆరంభంలో మానవులంతా ఒకే మార్గం అనుసరించేవారు. అంటే సత్యమార్గం అనుసరించేవారు. కాని తరువాత మానవులు విభిన్న మార్గాలు అనుసరించడం ప్రారంభించారు. తద్వారా ఒకరిపై ఒకరు దౌర్జన్యానికి పాల్పడే వీలు కల్పించుకున్నారు. స్వర్గంలోకి ప్రవేశం ఊరకనే లభిస్తుందని అనుకుంటున్నారా? మీకు పూర్వం విశ్వసించిన వారిపై గతించినదంతా మీపై ఇంకా జరగలేదు. వారిపై ఆపదలు, ఎనలేని వ్యథలు విరుచుకుపడ్డాయి. వారు కుదిపివేయబడ్డారు. చివరకు అప్పటి ప్రవక్త, అతని అనుచరులు "అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది?" అని ఆక్రోశించారు. "అల్లాహ్ సహాయం త్వరలోనే లభిస్తుంది" అని వారిని ఓదార్చడం జరిగింది.

రుకూ 27 : ధర్మాన్ని వదలిపెట్టి అవిశ్వాస స్థితిలో మరణించిన వ్యక్తి చేసిన మంచి పనులన్నీ ఇహపరలోకాలు రెండింటిలోనూ వృథా అవుతాయి. ఇలాంటి వారంతా నరకవాసులు. నరకంలోనే వారు శాశ్వతంగా ఉంటారు. కాని, దీనికి భిన్నంగా విశ్వసించి, అల్లాహ్ మార్గంలో తమ ఇల్లు వాకిలిని సయితం విడిచి జిహాద్ చేసేవారు దైవకారుణ్యం ఆశించడానికి అన్ని విధాల అర్హులు. మీ జీవిత అవసరాలకు పోగా మిగిలినది అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టండి. అనాథలతో వారికి మేలు కలిగేవిధంగా వ్యవహరించండి. ముష్రిక్కు మహిళలను ఎన్నడూ వివాహమాడరాదు. అలాగే ముష్రిక్కు పురుషులకు మహిళలనిచ్చి వివాహం చేయరాదు.

రుకూ 28 : ఋతుకాలంలో భార్యలకు దూరంగా ఉండండి. వారు పరిశుద్ధులు కానంతవరకు వారి వద్దకు పోకండి. పాశ్చాత్తాపపడేవారిని, పరిశుద్ధతను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. మీ భార్యలు పరిశుద్ధులు అయిన తరువాత మీరు వారి వద్దకు పోవచ్చు. మీ స్త్రీలు మీ సేద్యపు భూములు. మీ పొలాలకు మీరు కోరిన విధంగా వెళ్లే అధికారం ఉంది. విడాకులివ్వబడిన స్త్రీలు మూడు ఋతువుల కాలం పూర్తయ్యే వరకు విధిగా వేచి ఉండాలి. వారి గర్భాశయాలలో అల్లాహ్ సృష్టించిన

దానిని దాచరాదు. పురుషులకు ఉన్నటువంటి హక్కులే స్త్రీలకూ ఉన్నాయి. కాని పురుషులకు స్త్రీలపై కొద్దిపాటి ఆధిక్యం ఉంది.

రుకూ 29 : 1. విడాకులు రెండు సార్లు ఇవ్వాలి. తరువాత భార్యకు సక్రమంగా తమ వద్ద ఉండనివ్వాలి, లేదా ఆమెను సహృదయంతో సాగనంపాలి. సాగనంపేటప్పుడు మీరు వారికి పూర్వం ఇచ్చిన వాటి నుంచి దేన్నయినా తిరిగి తీసుకోవడం ధర్మసమ్మతం కాదు. 2. అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేమన్న భయం దంపతులకు కలిగిన పక్షంలో స్త్రీ తన భర్తకు ఏదయినా పరిహారం ఇచ్చి వేరు కావడంలో ఎలాంటి దోషం లేదు. 3. భర్త రెండు విడాకులు ఇచ్చిన పిదప మూడవ సారి విడాకులిస్తే ఇక ఆ స్త్రీ అతనికి హలాల్ (ధర్మసమ్మతం) కాదు. ఆమెకు వేరే పురుషునితో వివాహం జరిగి అతడు కూడా ఆమెకు విడాకులిస్తే తప్ప. 4. స్త్రీలను మంచితనంతో సాగనంపండి లేదా మంచితనంతో మీతో ఉండనివ్వండి. కేవలం వేధించే ఉద్దేశ్యంతో వారిని మీతో ఉంచడం అన్యాయం.

రుకూ 30 : మీ నుంచి విడాకులు పొందిన స్త్రీలు తమ ఇద్దత్ (నిరీక్షణ వ్యవధి) పూర్తి చేసిన పిదప తమ ప్రతిపాదిత భర్తలను ధర్మసమ్మతంగా పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకోదలిస్తే మీరు వారిని ఆటంకపరచరాదు. అలా చేయడం సంస్కారవంతమూ, పవిత్రమూ అయిన వైఖరి కాదు. మీరు ఈ వైఖరికి దూరంగా ఉండాలి. తమ సంతానానికి పాలుపట్టే గడువు పూర్తికావాలని తండ్రులు కోరినట్లయితే, తల్లులు తమ బిడ్డలకు పూర్తిగా రెండు సంవత్సరాలు పాలుపట్టాలి. అప్పుడు పిల్లల తండ్రి ఆమెకు తగురీతిగా భోజన వస్త్రాలు సమకూర్చి పోషించవలసి ఉంటుంది. మీలో ఎవరైనా మరణించి, వారి భార్యలు బ్రతికి ఉంటే, వారు నాలుగు నెలల పది రోజుల వరకు తమను తాము నిగ్రహించుకోవాలి. ఈ ఇద్దత్ పూర్తయిన పిదప వారు తమకు మంచిదని తోచిన పని యుక్తమైన రీతిలో చేసుకునే స్వేచ్ఛ కలిగి ఉన్నారు.

రుకూ 31 : మహర్ ధనం నిర్ణయం కాక ముందే, మీరు ముట్టుకోకముందే మీ స్త్రీలకు విడాకులిస్తే, అలాంటి సందర్భంలో పురుషుడు స్త్రీకి ఎంతో కొంత ఇవ్వాలి. ధనవంతుడైన వ్యక్తి తన శక్తి కొలది, పేదవాడు తన స్థితిని బట్టి ధర్మసమ్మతమైన విధంగా చెల్లించాలి. ఒకవేళ మహర్ నిర్ణయం జరిగి, ముట్టుకోకముందే విడాకులిచ్చి ఉంటే, అలాంటి సందర్భంలో సగం మహర్ చెల్లించాలి. స్త్రీ మహర్‌ను క్షమించి

విడిచిపెట్టనూ వచ్చు లేక పురుషుడు ఔదార్యంతో పూర్తి మహర్ చెల్లించనూవచ్చు. భార్యాభర్తలు పరస్పర వ్యవహారాల్లో ఔదార్యంతో వ్యవహరించాలి. మీ నమాజులను పరిరక్షించుకొండి. అల్లాహ్ సాన్నిధ్యంలో విధేయులైన దాసుల్లా నిలబడండి.

రుకూ 32 : ముస్లిములారా! అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయండి. అల్లాహ్‌కు మంచి రుణం ఇవ్వండి. ఆయన దాన్ని అనేక రెట్లు పెంచి ఇచ్చేలా మంచి రుణం ఇవ్వండి. ఈ విషయంలో ఇస్రాయీల్ సంతతిలా వ్యవహరించకండి. వారు తమ ప్రవక్తతో "మేము అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయడానికి నీవు మా కొరకు ఒక రాజును నియమించు" అన్నారు. కాని వారికి యుద్ధం చేయండి అని ఆదేశించిన తర్వాత వారిలో కొందరు తప్ప అందరూ వెన్ను చూపారు. అల్లాహ్ ఆదేశంతో వారి ప్రవక్త వారికి రాజుగా తాలూత్‌ను నియమించాడు. కాని వాళ్ళు చాలా అసంతృప్తి చెందారు. అతడు ధనవంతుడు కాదు. కాని ప్రవక్త వారితో "మీకు బదులుగా అల్లాహ్ అతనినే ఎన్నిక చేశాడు. అల్లాహ్ అతనికి బుద్ధి బలాన్ని, కండబలాన్ని సమృద్ధిగా ప్రసాదించాడు. తాను కోరిన వారికి తన రాజ్యం ప్రసాదించే అధికారం అల్లాహ్‌కు ఉంది" అన్నాడు.

రుకూ 33 : తాలూత్ సైన్యంతో బయలుదేరాడు. అతను వారితో "ఒక నదిపై నుంచి మనం వెళ్లవలసి ఉంది. ఆ నదిలో నీళ్ళు తాగేవాడు నా వాడు కాదు. ఆ నీటితో దప్పిక తీర్చుకోని వాడే నా సహచరుడు" అని ప్రకటించాడు. కాని కొందరు తప్ప అందరూ ఆ నదీ జలాన్ని కడుపు నిండా తాగారు. జాలూత్ సైన్యాలు ఎదురుపడినప్పుడు వాళ్ళు తాలూత్‌తో "జాలూత్‌ను అతని సైన్యాలను ఎదుర్కొనే శక్తి ఈ రోజు మాలోలేదు" అన్నారు. కాని వారితో విశ్వసించిన వారు "ఒక చిన్న వర్గం ఒక పెద్ద వర్గాన్ని అల్లాహ్ అనుమతితో చేయించడం ఎన్నో సార్లు జరిగింది" అని ప్రకటించి, దేముని ప్రార్థించారు. "అల్లాహ్ వారికి విజయం ప్రసాదించాడు. దావూద్, జాలూత్‌ను సంహరించాడు. ఈ విధంగా అల్లాహ్ మానవుల ఒక వర్గాన్ని మరొక వర్గం ద్వారా తొలగించకపోతే భూలోక వ్యవస్థ చిన్నాభిన్నమై ఉండేది.

రుకూ 34 : అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టండి. క్రయవిక్రయాలు జరుగని, మైత్రి ఉపయోగపడని, సిఫారసు కూడా చెల్లని ఆ (చివరి) రోజు రాకముందే మేము మీకు

ప్రసాదించిన సిరిసంపదల నుంచి (మా మార్గంలో) ఖర్చుపెట్టండి. అల్లాహ్ సజీవుడు, నిత్యమూ ఉండేవాడు, అనంతుడు. ఆయన యావత్ విశ్వానికి మూలాధారం. ఆయన తప్ప దేవుడు లేడు. ఆయన నిదురపోడు, కునుకు తీయడు. భూమ్యాకాశాల్లో ఉన్నదంతా ఆయనదే. ఆయన సన్నిధిలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగలవాడెవ్వడు? ప్రజల ముందు ఉన్న దానినీ ఆయన తెలిసినవాడు. వారికి గుప్తంగా ఉన్నదీ తెలిసినవాడు ఆయన స్వయంగా తెలియజేయాలని అనుకుంటే తప్ప ఆయనకున్న జ్ఞాన విశేషాలలోని ఏ విషయమూ ప్రజల గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన రాజ్యాధికారం ఆకాశాలను, భూములను ఆవరించుకొని ఉంది. వాటి పరిరక్షణ ఆయనకు ఎంతమాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడూను.

రుకూ 35: హజ్రత్ ఇబ్రాహీమ్ (అస) నమ్రూద్‌తో "జీవన్మరణాలు ఎవరి అధీనంలో ఉన్నాయో, ఆయనే నా ప్రభువు" అన్నారు. నమ్రూద్ "చావు బతుకులు రెండుగా అధీనంలో ఉన్నాయి" అని జవాబిచ్చాడు. అప్పుడు ఇబ్రాహీమ్ (అస) "సరే, అల్లాహ్ సూర్యుణ్ణి తూర్పు నుంచి ఉదయింపజేస్తాడు. నీవు కాస్త దాన్ని పడమర నుంచి ఉదయింపజెయ్యి" అనడిగారు. ఇది విన్న ఆ సత్యధిక్కారి నిరుత్తరుడయ్యాడు.

... హజ్రత్ ఇబ్రాహీమ్ (అ.స), అల్లాహ్‌తో "ఓ నా ప్రభూ! నీవు మృతులను యేవిధంగా బ్రతకనిస్తావో నాకు చూపించు" అని అడిగారు. అప్పుడు అల్లాహ్ "నీకు విశ్వాసం లేదా?" అని ప్రశ్నించాడు. "నాకు విశ్వాసముంది. కాని మనస్సును సంతృప్తపరచడం కోసం అడుగుతున్నాను" అన్నారు ఆయన. అప్పుడు అల్లాహ్ "సరే, మంచిది, నాలుగు పక్షులను తీసుకురా, వాటిని బాగా మచ్చిక చేసుకో, తరువాత వాటి ఒక్కొక్క భాగాన్ని ఒక్కొక్క కొండపై పెట్టిరా, మళ్లీ వాటిని రమ్మని పిలువు అవి నీ వద్దకు పరుగిడుతూ వస్తాయి" అన్నాడు.

రుకూ 36 : అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టేవారు, వారి ఖర్చు ఎలాంటిదంటే, ఒక విత్తనాన్ని నాటితే అది మొలిచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతీ వెన్నుకు నూరేసి గింజలు ఉంటాయి. అదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింప జేస్తాడు. అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టేవారు, ఖర్చు చేసిన పిదప తమ దాతృత్వాన్ని

చాటుతూ ఉండని వారు, గ్రహీతల మనస్సును బాధపెట్టని వారు ఇలాంటి వారిని ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంది. ఒక మంచి మాట, క్షమాగుణం అన్నవి మనస్సును గాయపరిచే దానం కన్నా ఎంతో మేలైనది. విశ్వసించిన ఓ ప్రజలారా! కేవలం పరుల మెప్పును పొందడానికే తన ధనం ఖర్చు చేసే వాని మాదిరిగా, అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించని వాని మాదిరిగా, దెప్పిపొడుపులతో గ్రహీత మనస్సు గాయపరచి మీ దానధర్మాలను మట్టిలో కలుపకండి.

రుకూ 37 : విశ్వసించిన ప్రజలారా! మీరు సంపాదించిన దానిలో మేలైన భాగాన్ని దైవమార్గంలో ఖర్చుపెట్టండి. అల్లాహ్ మార్గంలో ఇవ్వడానికి పనికిరాని వస్తువులను ఏరి తీసే ప్రయత్నం చేయకండి. ఒకవేళ ఆ వస్తువులను మీకు ఎవరన్నా ఇస్తే వాటిని మీరు తృణీకారభావంతో తప్ప మనసారా స్వీకరించరు కదా! అల్లాహ్‌కు ఏది యేమాత్రం అవసరం లేదని, మహోత్తమ గుణాలు కలవాడని తెలుసుకోండి. దారిద్ర్యాన్ని చూపి షైతాన్ మిమ్మల్ని భయపెడతాడు. నీతి బాహ్యమైన నీచమైన మార్గం అవలంబించండి అని ప్రేరేపిస్తాడు. కాని, మిమ్మల్ని క్షమిస్తాననీ, అనుగ్రహిస్తాననీ అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. మీరు మీ దాన ధర్మాలను బహిరంగంగా చేసినా మంచిదే, కాని రహస్యంగా నిరుపేదలకు దానమివ్వడం మీకు ఎక్కువ మేలు చేకూరుస్తుంది. దైవకార్యంలో నిమగ్నులైన కారణంగా, తమ జీవనోపాధి కోసం భూమిపై తిరిగే అవకాశం లేనందువల్ల లేమికి గురిఅయిన వారు ప్రత్యేకంగా ధన సహాయానికి అర్హులు. వారు సహాయం చేయండని అడిగే మనుషులు కారు. మీరు వారికి సహాయం చేయండి.

రుకూ 38 : వడ్డీ తినేవాడి స్థితి షైతాను పట్టడం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. అందువల్లనే వారు "వ్యాపారం కూడా వడ్డీ లాంటిదేగా" అంటారు. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. ఈ ఆదేశం తర్వాత వడ్డీ తినడం మానేసిన వ్యక్తి అంతకు ముందు తిన్నదేదో తిన్నాడు. అతని వ్యవహారం అల్లాహ్ వద్దకు పోతుంది. అయితే ఈ ఆదేశం తర్వాత కూడా వడ్డీ తింటే ఈ వ్యక్తి నిశ్చయంగా నరకవాసి. అక్కడ శాశ్వతంగా ఉంటాడు. విశ్వసించిన ప్రజలారా! మీకు ప్రజల నుంచి రావలసిన వడ్డీని

విడిచిపెట్టండి. మీరు గనుక అలా చేయనట్లయితే, మీపై అల్లాహ్, ఆయన ప్రవక్త తరఫు నుంచి యుద్ధ ప్రకటన ఉందని తెలుసుకోండి. మీకు బాకీ ఉన్న వ్యక్తి ఇబ్బందుల్లో ఉంటే, అతడి పరిస్థితి మెరుగుపడే వరకు గడువు ఇవ్వండి. అయితే ఆ బాకీని అతడికి దానం చెయ్యడం మేలైన విషయం.

రుకూ 39 : విశ్వసించిన ప్రజలారా! మీరు ఒక నిర్ణీత కాలానికి గాను ఒకరి నుంచి మరొకరు అప్పు తీసుకుంటుంటే ఆ వ్యవహారాన్ని రాసి పదిలపరచండి. మీలోని ఇద్దరు పురుషులను సాక్షులుగా పెట్టుకోవాలి. ఇద్దరు పురుషులు లభించని పక్షంలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండాలి. ఎందుకంటే వారిలో ఒకామె మరచిపోతే రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేస్తుంది. సాక్ష్యం ఇవ్వండి అని పిలిచినప్పుడు సాక్షులు నిరాకరించరాదు. మీరు అప్పటికప్పుడు పరస్పరం చేసుకునే వ్యాపారలావాదేవీలను రాయకున్నా అభ్యంతరం లేదు. కాని సాక్షులను పెట్టుకోండి. సాక్ష్యాన్ని దాచకండి. సాక్ష్యాన్ని దాచేవాని హృదయం పాపభూయిష్టమైనది.

రుకూ 40 : ఆకాశాల్లో, భూమిపై ఉన్నదంతా అల్లాహ్‌దే. మీరు మీ మనస్సులోని మాటలు పైకి ప్రకటించినా, లేక దాచి ఉంచినా, వాటి గురించి అల్లాహ్ లెక్కతీసు కుంటాడు. యే ప్రాణిపైనా అల్లాహ్ దాని శక్తి సామర్థ్యాలకు మించిన బరువు బాధ్యత లను మోపడు. తాను సంపాదించిన పుణ్యానికి సత్ఫలితాన్ని, తాను కూడబెట్టిన పాపా నికి దుష్ఫలితాన్ని ప్రతీ వ్యక్తి అనుభవిస్తాడు. విశ్వసించిన ప్రజలారా, క్రింది విధంగా ప్రార్థిస్తూ ఉండండి. "మా ప్రభూ! పొరబాటు వల్ల జరిగే మా తప్పులను పట్టబోకు. స్వామి! మాకు పూర్వం వారిపై మోపిన భారాన్ని మాపై మోపకు. ప్రభూ! యే బరువును మోసే శక్తి మాలో లేదో దానిని మాపై పెట్టకు. మమ్మల్ని మన్నించు. మమ్మల్ని క్షమించు. మమ్మల్ని కరుణించు. నీవే మాకు రక్షకుడవు. అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయపడు.

3 ఆలి ఇమ్రాన్

రుకూ 1 : ఓ ప్రవక్తా! సజీవుడు, నిత్యుడు, అయిన అల్లాహ్ ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాడు. ఇది సత్యాన్ని తీసుకువచ్చింది. మునుపు అవతరించిన గ్రంథాలను

ధృవపరుస్తుంది. ఇంతకు మునుపు తౌరాత్, ఇంజీల్ గ్రంథాలను ఆయన అవతరింపజేశాడు. ఇప్పుడు సత్యాసత్యాలను వేరుపరిచే గీటురాయి అవతరింప జేశాడు. ఈ గ్రంథంలో రెండు రకాల ఆయతులు (వాక్యాలు) ఉన్నాయి. మొదటివి: "ముహ్కమాత్" (స్పష్టమైనవి) ఇవి గ్రంథానికి పునాదుల వంటివి. రెండోవి: "ముతషాబిహాత్" (అస్పష్టమైనవి) వక్రమనస్కులు కలతలు రేపేందుకు ఎల్లప్పుడు "ముతషాబిహాత్" వెంటపడి వాటికి పెడర్థాలు తొడిగే ప్రయత్నం చేస్తారు. దీనికి భిన్నంగా పరిపక్వ జ్ఞానం కలవారు "వాటిని మేము విశ్వసించాము. ఇవన్నీ మా ప్రభువు నుంచి వచ్చినవే" అంటారు.

రుకూ :2 అవిశ్వాస వైఖరిని అవలంబించిన వారికి వారి ఐశ్వర్యబలం గాని, సంతానబలం గాని, అల్లాహ్ ఎదుట ఉపయోగపడవు. వారు నరకానికి ఇంధనం అయి తీరుతారు. స్త్రీలు, సంతానం, వెండి, బంగారు రాశులు, మేలుజాతి గుర్రాలు, పశువులు, సేద్యపు భూములు ప్రజలకు వ్యామోహానికి గురిచేసేవిగా తయారు చేయబడ్డాయి. ఇవన్నీ కొద్దిరోజుల ఐహిక జీవనానికి సంబంధించిన సామాగ్రి మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్దనే ఉంది. సహనం వహించేవారు, సత్యసంధులు, విధేయులు, దానశీలురు, రాత్రి చివరి ఘడియల్లో అల్లాహ్‌ను క్షమాభిక్ష వేడుకునేవారు - ఇలాంటి వారికి అల్లాహ్ ప్రసన్నత లభిస్తుంది.

రుకూ 3 : అల్లాహ్ ఆదేశాలను శిరసావహించక, తిరస్కరించేవారిని, ప్రవక్తలను అన్యాయంగా చంపే వారికి, సత్యాన్ని న్యాయాన్ని ఆదేశించడానికి బయలుదేరిన వారి ప్రాణాల వెంట పడేవారికి బాధాకరమైన శిక్ష ఉంది. గ్రంథప్రజలను ఈ దైవగ్రంథం వైపునకు ఆహ్వానించినప్పుడు వాళ్ళు ముఖం త్రిప్పుకుంటూ "మమ్మల్ని నరకాగ్ని అసలు ముట్టుకోదు. ఒకవేళ మాకు నరకశిక్ష పడినా అది కొన్ని రోజులు మాత్రమే" అంటారు. స్వయం కల్పితాలైన వారి నమ్మకాలే వారిని ధర్మం విషయంలో అపోహలకు లోనుచేశాయి. కాని, ఏ రోజయితే తప్పకరానుందో, ఆ రోజున మేము వారిని సమావేశపరిచినప్పుడు వారి గతి ఏమవుతుంది? - అనండి, "ఓ అల్లాహ్ విశ్వసామ్రాజ్యానికి ప్రభూ! నీవు కోరిన వారికి ప్రభుత్వ అధికారాన్ని ప్రసాదిస్తావు. కోరిన వారి నుంచి దాన్ని లాక్కుంటావు. తలచిన వారికి గౌరవాన్ని ప్రసాదిస్తావు. నీవు తలచిన వారిని పరాభవం పాలు చేస్తావు. శుభాలు నీ అధీనంలో ఉన్నాయి. నిస్సందేహంగా నీకు అన్నింటిపైన అధికారం ఉంది. నీవు రాత్రిని పగటిలోకి

ప్రవేశింపజేస్తావు. పగలును రాత్రిలోకి ప్రవేశింపజేస్తావు. ప్రాణం లేని దాని నుంచి ప్రాణమున్న దానిని తీస్తావు. ప్రాణమున్న దాని నుంచి ప్రాణం లేని దాన్ని తీస్తావు. నీవు కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ప్రసాదిస్తావు. విశ్వసించిన వారు సోదర విశ్వాసులను వదలి అవిశ్వాసులను మిత్రులుగా సహాయకులుగా చేసుకోరాదు. అలా చేసిన వ్యక్తికి అల్లాహ్‌తో ఎలాంటి సంబంధమూ లేదు.

రుకూ 4 : ప్రవక్తా! ప్రజలకు చెప్పు "మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు" అని. మర్యమ్ (అ.స) పుట్టినప్పుడే ఆమె అల్లాహ్‌కు అంకితం చేయబడ్డారు. అల్లాహ్ ఆమెకు శిక్షగా బాధ్యతను స్వీకరించాడు. జకరియ్యాను ఆమెకు సంరక్షకునిగా చేశాడు. జకరియ్యా (అ.స) ఆమె గదికి పోయినప్పుడల్లా ఆమె వద్ద ఆయన ఏవో కొన్ని భోజన పదార్థాలు చూసేవాడు. "మర్యమ్ ఇవి నీ వద్దకు ఎక్కడి నుండి వచ్చాయి" అని అడిగేవాడు. "అల్లాహ్ వద్ద నుంచి వచ్చాయని" హజ్రత్ మర్యమ్ (అ.స) బదులిచ్చే వారు. ఇది చూసి జకరియ్యా (అ.స) సంతానం కోసం ప్రార్థించాడు. కుమారుడు పుడతాడన్న శుభవార్త ఆయనకు తెలిసినపుడు "ప్రభూ నేను ముసలివాడిని, నా భార్య గొడ్రాలు. నాకు కుమారుడెలా పుడతాడు? అన్నాడు "అలానే జరుగుతుంది. అల్లాహ్ తాను తలచింది చేస్తాడు" అని సమాధానం వచ్చింది.

రుకూ 5 : దైవదూతలు మర్యమ్‌కు ఈసా మసీహ్ గురించిన శుభవార్త వినిపించారు. ఆయన ఇహపరలోకాల్లో గౌరవనీయుడవుతాడని తెలిపారు. ఉయ్యాలలో ఉన్నప్పుడు, పెరిగిపెద్దవాడయినప్పుడు ప్రజలతో సంభాషిస్తాడు. ఒక సత్పురుషుడవుతాడని చెప్పారు. ఇది విన్న మర్యమ్ "ప్రభూ! నాకు శిశువు ఎలా జన్మిస్తుంది. నన్ను ఏ పురుషుడు చేతితోనైనా తాకలేదే" అన్నారు. "అలాగే జరుగుతుంది. అల్లాహ్ తాను కోరింది చేస్తాడు. ఆయన ఒక పని చేయాలని అనుకుంటే ఆ పనిని 'అయిపో' అని అంటాడు. అంతే ఆ పని అయిపోతుంది. అని సమాధానం వచ్చింది. హజ్రత్ ఈసా (అ.స) ఇస్రాయీల్ సంతతిని అల్లాహ్ వైపునకు ఆహ్వానించాడు. మహిమలు ప్రదర్శించాడు. మట్టితో బొమ్మలను చేసేవారు. దానిపై ఊదగానే అది పక్షిగా మారింది. పుట్టు గ్రుడ్డివారిని, కుష్టురోగుల్ని బాగు చేసేవారు. మృతులను బ్రతికించే వారు. ఇదంతా అల్లాహ్ ఆదేశంతో చేశారు. అయినా వారు విశ్వసించలేదు. కొందరు తప్ప – వారు "మేము అల్లాహ్‌కు సహాయకులం" అని ప్రకటించారు.

రకూ 6 : ఇస్రాయీల్ సంతతివారు ఈసా (అ.స)కు వ్యతిరేకంగా రహస్యపుటెత్తులు వేయసాగారు. అల్లాహ్ ఈసా(అ.స)తో "నేను నిన్ను తిరిగి నా దగ్గరకు రప్పించు కుంటాను. నా వైపునకు లేపుకుంటాను. నిన్ను అనుసరించిన వారికి, నిన్ను తిరస్క రించిన వారిపై ప్రళయం వరకు ఆధిక్యాన్ని ప్రసాదిస్తాను. మీరంతా చివరికి నా వద్దకే మరలివస్తారు. ప్రళయదినాన అందరి గురించి తీర్పు చెబుతాను" అన్నాడు. ప్రవక్తా! మేము నీకు వినిపించేవి సూచనలతోనూ, వివేకంతోనూ నిండి ఉన్న గాథలు. అసలు వాస్తవం ఇది. దీన్ని శంకించే వారిలో నీవు చేరిపోకు. ఇక ఈ విషయమై నీతో ఎవరన్నా వివాదానికి దిగితే "వారితో ఇలా అను "రండి, మీరూ మేము స్వయంగానూ వద్దాము. మన ఆలుబిడ్డలను కూడా పిలుచుకువద్దాము. అసత్యం పలికే వారిపై అల్లాహ్ శాపం పడుగాక అని ప్రార్థిద్దాము." అని చెప్పు.

రుకూ 7 : గ్రంథ ప్రజలారా! మాకు మీకు మధ్య సమానంగా ఉన్న విషయం వైపునకు రండి. అదేమంటే, మనం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ దాస్యం చేయరాదు. ఆయనకు సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అని చెప్పు. ఒకవేళ వారు వైముఖ్యం కనబరిస్తే వారికి స్పష్టంగా ఇలా చెప్పు; "మేము ముస్లిములం (అల్లాహ్‌కు విధేయులం) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి." ఇబ్రాహీం (అ.స)తో సంబంధం కలిగి ఉండే హక్కు ఎవరికైనా ఉంటే అది అతన్ని అనుసరించిన ప్రజలకు మాత్రమే. ఇప్పుడు ఈ ప్రవక్త (సఅసం)ను అనుసరించేవారు ఆ సంబంధానికి అందరికంటే ఎక్కువ అర్హులు.

రుకూ 8 : గ్రంథ ప్రజలలోని ఒక వర్గం "ఈ ప్రవక్త (సఅసం) బోధనలను ఉదయం విశ్వసించండి. సాయంత్రం తిరస్కరించండి. బహుశా ఈ ఉపాయం ద్వారా విశ్వాసులు తమ విశ్వాసం నుంచి వెనక్కి మరలవచ్చు" అంటారు. ప్రవక్తా "వాస్తవానికి మార్గదర్శకత్వమంటే అల్లాహ్ మార్గదర్శకత్వమే" అని వారికి చెప్పు. వారి నైతిక స్థితి ఎంతగా దిగజారి ఉందంటే వారిలోని ఒక వ్యక్తి వద్ద ఒక దీనార్ ఉంచినా కబళిస్తాడు. దానికి కారణం ఏమంటే వారు "ఉమ్మీల విషయంలో మిమ్మల్ని పట్టించుకోవడం జరగదు" అని భావిస్తున్నారు. ఈ అబద్ధాన్ని వారు కల్పించి అల్లాహ్‌కు ఆరోపిస్తున్నారు. అల్లాహ్ ఇలాంటి మాట ఏది చెప్పలేదని వారికి తెలుసు. ఏ వ్యక్తికైనా అల్లాహ్ గ్రంథాన్ని, వివేకాన్ని, ప్రవక్త పదవిని ప్రసాదిస్తే, అతడు ప్రజలతో అల్లాహ్‌కు బదులు

నాకు దాసులు అవ్వండని చెప్పడం జరుగదు. దైవదూతలను, ప్రవక్తలను ప్రభువులుగా చేసుకొండని అతను మీతో ఎన్నటికీ చెప్పడు. ముస్లిములైన మిమ్మల్ని అవిశ్వాసాన్ని అవలంబిచవలసిందిగా ఒక ప్రవక్త ఆదేశించడం జరుగుతుందా?

రుకూ 9 : ఈ ప్రజలు అల్లాహ్ విధేయతా విధానాన్ని (అల్లాహ్ ధర్మాన్ని) వదలిపెట్టి మరొక విధానాన్ని దేన్నయినా కోరుతున్నారా? వాస్తవానికి భూమ్యాకాశాలలో ఉన్న సమస్త వస్తువులు ఇష్టం ఉన్నా, లేకపోయినా అల్లాహ్ విధేయతకు కట్టుబడి ఆయన అధీనంలోనే ఉన్నాయి. అంతా ఆయన వైపునకే మరలిపోవలసి ఉంది. ప్రవక్తా! వారికి చెప్పండి మేము అల్లాహ్‌ను విశ్వసిస్తున్నాము. మాపై అవతరింపజెయ్యబడిన హితోపదేశాన్ని విశ్వసిస్తాము. ఇంకా ఇబ్రాహీము (అస) ఇస్మాయీలు (అస), ఇస్హాఖు (అ.స), యాకూబు (అ.స.), యాకూబు సంతానంపై అవతరించిన దానిని కూడా విశ్వసిస్తాము. ఇంకా, మూసా (అ.స), ఈసా(అ), ఇతర ప్రవక్తలకు వారి ప్రభువు తరపు నుంచి ఇవ్వబడిన ఉపదేశాలను కూడా విశ్వసిస్తాము. వారి మధ్య విచక్షణ చెయ్యము. మేము అల్లాహ్ విధేయతకు కట్టుబడి (ముస్లిములుగా) ఉన్నాము." ఎవరైనా ఈ విధేయతా విధానాన్ని (ఇస్లామ్) కాక మరొక మార్గాన్ని అవలంబించదలిస్తే ఆ మార్గం ఎంతమాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడౌతాడు, నష్ట పోతాడు. విశ్వాసవరం పొందిన తరువాత మళ్లీ అవిశ్వాసాన్ని అవలంబించే ప్రజలకు శిక్ష తగ్గదు. వారికి వ్యవధి ఇవ్వబడదు. ఒకవేళ ఎవరైనా పశ్చాత్తాపపడి, అల్లాహ్ వైపునకు మరలితే, తన ఆచరణలను సంస్కరించుకుంటే, అల్లాహ్ క్షమించేవాడు, కరుణామయుడూను.

రుకూ 10 : మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టనంతవరకు మీరు సత్కార్య స్థాయిని చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. అబద్ధాన్ని సృష్టించి అల్లాహ్‌కు ఆపాదించేవారు దుర్మార్గులు. మీరు ఏకాగ్రతతో ఇబ్రాహీమ్ (అస) పద్ధతినే పాటించాలి. ఇబ్రాహీము (అ.స) షిర్కు చేసే ప్రజలలోని వాడు కాదు. ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనా గృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వ ప్రజలందరికీ అది మార్గదర్శక కేంద్రంగా రూపొందించబడింది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఇబ్రాహీము (అ.స.) ప్రార్థన స్థలం ఉంది. దానిలో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు. ప్రజలపై

అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ గృహానికి వెళ్లే శక్తిగలవారు దాని హజ్‌ను విధిగా చేయాలి. ఈ ఆజ్ఞను పాటించక తిరస్కరించేవాడు– అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంతమాత్రం లేదు అని స్పష్టం తెలుసుకోవాలి.

రుకూ 11 : విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. ఏవిధంగా భయపడాలో ఆ విధంగా భయపడండి. ముస్లిములుగా ఉన్న స్థితిలోనే తప్ప మరో స్థితిలో మృత్యువు రాకుండా జాగ్రత్తపడండి. అంతా కలిసి అల్లాహ్ త్రాడును దృఢంగా పట్టుకోండి. విభేదాలలో పడకండి. అల్లాహ్ మీకు చేసిన మేలును గుర్తుకు తెచ్చుకోండి. మీరు ఒకరికొకరు శత్రువులుగా ఉండేవారు. మీరు నిప్పుతో నిండి ఉన్న ఒక గుండం ఒడ్డున ఉండేవారు. అల్లాహ్ మిమ్మల్ని దాని నుంచి కాపాడాడు. మీలో మంచి వైపునకు పిలిచేవారు, మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించే వారు, చెడు నుంచి వారించే వారు కొందరు తప్పక ఉండాలి. ఈ పని చేసేవారు సాఫల్యం పొందుతారు. స్పష్టమైన ఉ పదేశాలు పొంది కూడా తెగలుగా చీలిపోయి, విభేదాలకు గురి అయిన వారి మాదిరిగా మీరు మారవద్దు. ఇటువంటి వైఖరి అవలంబించే వారికి కఠిన శిక్షపడుతుంది.

రుకూ 12 : ప్రపంచ మానవులకు మార్గం చూపడానికి, వారి సంస్కరణకు రంగంలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరే. మీరు మంచి చెయ్యండని ఆజ్ఞాపిస్తారు. చెడు నుంచి ఆపుతారు. అల్లాహ్‌ను విశ్వసిస్తారు. గ్రంథప్రజలు మిమ్మల్ని వ్యతిరేకిస్తున్నారు. వారు మీకు ఏమాత్రం హాని కలిగించలేరు. మహా అయితే కొంచెం బాధించడం తప్ప. అల్లాహ్ ఆగ్రహంలో వారు చిక్కుకుని ఉన్నారు. వారు ఎక్కడ ఉన్న అవమానానికి గురి చెయ్యబడతారు. పరాధీనత, పరాజయం వారిపై విధించబడ్డాయి. కాని, గ్రంథ ప్రజలు అందరూ ఒకలాంటి వారు కాదు. వారిలో కొందరు సత్యమార్గంపై స్థిరంగా ఉన్నారు. విశ్వాసాన్ని కలిగి ఉన్నారు. చెడుల నుంచి ఆపుతారు. మంచి పనులలో ముమ్మందు ఉంటారు... విశ్వాసులారా! మీ పక్షం వారిని తప్ప ఇతరులెవ్వరినీ మీకు ఆంతరంగికులుగా చేసుకోకండి. వారు మీకు హాని కలిగించే యే అవకాశాన్నయినా ఉపయోగించుకోవడానికి వెనుదీయరు. మీకు నష్టం కలిగించే దానినే వారు ఇష్టపడతారు. వారి కడుపు మంట వారి నోట నుంచి బయటపడుతుంది. కాని వారు హృదయాలలో దాచి ఉంచింది ఇంకా తీవ్రమైనది.

రుకూ 13 : ఓ ప్రవక్తా! అప్పుడు నీకు వేకువ జామున నీ ఇంటి నుంచి బయలుదేరి

(ఉహుద్ క్షేత్రంలో) ముస్లిములను యుద్ధం కొరకు వారి వారి స్థానాలలో నియమించావు. అల్లాహ్ అన్ని మాటలు వింటాడు. ఆయన అన్నీ తెలిసినవాడు. విశ్వ సించిన వారు కేవలం అల్లాహ్‌పై మాత్రమే నమ్మకముంచాలి. ఆయనే బదర్ యుద్ధంలో మీరు చాలా బలహీనంగా ఉన్నప్పుడు మీకు సహాయం చేశాడు. మీరు సహనం చూపితే, ఆచరణలో అల్లాహ్‌కు భయపడితే, ఏ క్షణంలో శత్రువులు మీపై దాడి చేస్తారో, ఆ క్షణంలో మీ ప్రభువు ఐదువేల మంది ప్రత్యేక గుర్తులు గల దూతలతో మీకు నిస్సందేహంగా సహాయం చేస్తాడు. అల్లాహ్ మీకు ఈ విషయాన్ని మీకు సంతోషం కలగాలని, మీ మనస్సుకు తృప్తి కలగాలని తెలుపుతున్నాడు. అవిశ్వాస మార్గంలో నడిచేవారి ఒక పార్శ్వాన్ని ఖండించాలని, వారు ఘోరపరాజయం పొంది ఆశాభంగంతో వెనుతిరిగిపోవాలని అల్లాహ్ మీకు ఈ సహాయం చేస్తాడు.

రుకూ 14 : విశ్వసించిన ప్రజలారా! ఇబ్బడిముబ్బడిగా పెరిగే ఈ వడ్డీని తినడం మానండి. అల్లాహ్‌కు భయపడండి. మీరు సాఫల్యం పొందగలరు. మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు, స్వర్గం వైపునకు పోయే మార్గంపై పరుగెత్తండి. ఆ స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలమయ్యింది. అది భయభక్తులు కలవారి కొరకు తయారు చెయ్యబడింది. 1. వారు కలిమిలో, లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చు చేస్తారు. 2. కోపాన్ని దిగమ్రింగుతారు. 3. ఇతరుల తప్పులను క్షమిస్తారు. 4. ఎప్పుడైనా, ఏదైనా పాపకార్యం లేదా అశ్లీలకృత్యం వారివల్ల జరిగితే వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. 5. వారు తమ తప్పులకు క్షమాభిక్ష కోసం మొరపెట్టు కుంటారు. వారు చేసిన తప్పుల గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చేయరు. ఇలాంటి వారికి ప్రభువు వద్ద చక్కని ప్రతిఫలం ఉంది. స్వర్గం ఉంది. ఉహుద్ యుద్ధంలో మీరు దెబ్బతిన్నారు. నిజమే. ఇదివరకు మీ ప్రత్యర్థి ఇటువంటి దెబ్బనే తిన్నాడు కదా! ఇటువంటి కాలం మీకు ఎందుకు ప్రాప్తించిందంటే మీలో నిజమైన విశ్వాసులెవరో అల్లాహ్ చూడదలిచాడు. (సత్యానికి) నిజమైన సాక్షులెవరో ఏరదలిచాడు. ఎందుకంటే అల్లాహ్ దుర్మార్గులను ఇష్టపడడు.

రుకూ 15 : ముహమ్మద్ (సఅస) ఒక ప్రవక్త. ఆయనకు పూర్వం కూడా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు ఒకవేళ ఆయన మరణిస్తే లేక హత్య చెయ్యబడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? మరలిపోయేవాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కలిగించలేడు. మరణకాలం వ్రాయబడే ఉంది. ప్రాపంచిక ప్రతిఫలం పొందే

ఉద్దేశ్యంతో పనిచేసే వాడికి మేము ప్రపంచాన్నుండే ఇస్తాము. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవాడు పరలోక ప్రతిఫలాన్ని పొందుతాడు. ఇంతకు పూర్వం ఎంతోమంది ప్రవక్తలు గతించారు వారితో కలిసి దైవభక్తులు యుద్ధం చేశారు. అల్లాహ్ మార్గంలో ఎదురయిన కష్టాలకు వారు క్రుంగిపోలేదు. బలహీనత కనబరచలేదు. అసత్యం ముందు తలవంచలేదు. అలాంటి సహనశీలురనే అల్లాహ్ ప్రేమిస్తాడు.

రుకూ 16 : ఉహుద్ యుద్ధాన్ని విశ్లేషిస్తూ ఇలా చెప్పడం జరిగింది– ప్రారంభంలో అల్లాహ్ ఆజ్ఞతో మీరే వారిని సంహరిస్తూ ఉన్నారు. కాని, మీరు బలహీనతను ప్రదర్శించినప్పుడు మీ కర్తవ్యం విషయంలో పరస్పరం విభేదాలకు గురి అయినప్పుడు మీరు వ్యామోహపడిన వస్తువును (అంటే విజయధనం) చూడగానే మీ నాయకుని ఆజ్ఞను ఉల్లంఘిస్తూ దాన్ని దోగు చేయడం ప్రారంభించినప్పుడు – ఎందుకంటే మీలో కొందరు ఇహాన్ని కోరారు. – అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించడానికి అవిశ్వాసులకు బదులుగా మిమ్మల్ని ఓటమిపాలు చేశాడు. మీ ప్రవక్త కేక వేస్తున్నప్పటికీ వెనక్కి తిరిగి ఎవరినీ చూసే అంత స్పృహ మీకు లేదు. ఈ వైఖరికి ప్రతిఫలంగా అల్లాహ్ మీకు దు:ఖం తర్వాత దు:ఖం కలుగజేశాడు. భవిష్యత్తులో ఏదైనా ఆపద కలిగినా మీరు చింతించకుండా ఉండడానికి తగిన గుణపాఠం కావాలని అల్లాహ్ అలా చేశాడు. మీ వాళ్లు చంపబడడం గురించి నానా విధంగా మాట్లాడుతున్నారు. మీరు మీ ఇళ్లల్లో ఉండినప్పటికీ మరణం వ్రాయబడి ఉన్నవారు స్వయంగా తమ మధ్య స్థానాలకు తరలివస్తారు. ఈ సమయంలో విశ్వసించినవారిలో ఉన్న బలహీనతలను అల్లాహ్ క్షమించి మన్నించాడు.

రుకూ 17 : యుద్ధంలో తమ బంధుమిత్రులను కోల్పోయిన వారు "మాతో ఉన్నట్లయితే మరణించే వారు కాదు, చంపబడేవారు కాదు" అని అంటారు. మీరు అల్లాహ్‌మార్గంలో చంపబడినా, లేదా చనిపోయినా మీ వంతుగా మీకు లభించే దైవకారుణ్యం, ఆయన క్షమాభిక్ష మీరు కూడబెట్టే సమస్త వస్తువుల కంటే ఎంతో ఉత్తమమైనవి. ఓ ప్రవక్తా! వారి తప్పులను మన్నించు, వారి కోసం అల్లాహ్‌ను క్షమాభిక్ష అర్థించు. ధర్మానికి సంబంధించిన పనిలో వారిని కూడా సంప్రదించు. అయితే ఒక నిర్ణయాన్ని తీసుకుని దాన్ని అమలుపరచడానికి సంకల్పించినపుడు అల్లాహ్‌పై భారం వెయ్యి. అల్లాహ్ మీకు సహాయం చేస్తూ ఉన్నట్లుయితే ఏ శక్తీ మీపై ఆధిక్యాన్ని సాధించలేదు. ఆయన మిమ్మల్ని విడిచి పెట్టినట్లయితే ఆ తరువాత మీకు సహాయం చేయగల వాడెవడు? ఉహుద్

యుద్ధంలో మీకు కలిగిన నష్టం అల్లాహ్ అనుమతితోనే జరిగింది. ఎందుకంటే తద్వారా మీలో విశ్వాసులెవరో, కపటులెవరో అల్లాహ్ చూడదలిచాడు.. అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు సజీవులే. తమ ప్రభువు వద్ద జీవికను పొందుతున్నారు. ఎంతో సుఖంగా, సంతోషంగా ఉన్నారు.

రుకూ 18 : గాయపడిన తరువాత కూడా అల్లాహ్ పిలుపునకు, ప్రవక్త పిలుపునకు జవాబిచ్చిన వారిలో, సజ్జనులు, భయభక్తులు గల వారికి మంచి ప్రతిఫలం ఉంది. వారితో ప్రజలు "మీకు వ్యతిరేకంగా పెద్ద సైన్యాలు మోహరించి ఉన్నాయి. వాటికి భయపడండి" అన్నప్పుడు ఈ మాటలు విని వారి విశ్వాసం ద్విగుణీకృతమయ్యింది. "మాకు అల్లాహ్ చాలు, ఆయనే శ్రేష్ఠమైన కార్యసాధకుడు" అని బదులిచ్చారు. ఊరక ప్రజలను భయపెట్టింది షైతానేనని ఇప్పుడు మీరు గ్రహించే ఉంటారు. కనుక మీరు ఇకముందు మానవులకు భయపడకండి. నాకు భయపడండి. ప్రవక్తా! అవిశ్వాస మార్గంలో గట్టి ప్రయత్నాలు చేస్తున్న వారి కార్యకలాపాలు నిన్ను ఖేదపరచరాదు. వారు అల్లాహ్‌కు ఏమాత్రం హాని కలిగించలేరు. పరలోకంలో వారికి ఏమాత్రం వాటా ఇవ్వరాదన్నదే అల్లాహ్ అభిమతం. లోభత్వంతో సంపద కూడబెడుతున్న వారికి ప్రళయంనాడు ఆ సంపద వారి పాలిట కంఠపాశం అవుతుంది.

రుకూ 19 : 'అల్లాహ్ దరిద్రుడు, మేము ధనికులం' అంటున్నారు గ్రంథప్రజలు ఈ మాటలు మేము నమోదుచేస్తున్నాము. నరక బాధలు చవిచూసేలా చేస్తాము. వారు ప్రవక్తతో "ఆకాశం నుంచి అగ్ని దిగివచ్చి తినేటటువంటి బలిని మా సమక్షంలో ఇయ్యనంత వరకు మేము ఎవరినీ ప్రవక్తగా స్వీకరించం" అంటున్నారు. ప్రవక్తా! వారు నిన్ను తిరస్కరిస్తుంటే, సరే, నీకు పూర్వం ప్రత్యక్ష నిదర్శనాలను, సహీఫాలను (PSALMS) వెలుగును ప్రసాదించే గ్రంథాలను తీసుకువచ్చిన చాలామంది ప్రవక్తలు కూడా తిరస్కరించబడ్డారు.

ఈ ప్రపంచం కేవలం ఒక మాయాజాలం మాత్రమే. ముస్లిములారా, మీరు ధన ప్రాణాలకు సంబంధించిన పరీక్షలు తప్పక ఎదుర్కోవలసి ఉంటుంది. గ్రంథ ప్రజల నుంచి, ముష్రిక్కుల నుంచి మీరు కష్టం కలిగించే మాటలు అనేకం వింటారు. ఈ పరిస్థితులలో మీరు గనక సహనంతో, భయభక్తులతో నిలకడగా ఉంటే ఇది ఎంతో సాహసంతో కూడుకున్న పని.

రకూ 20 : ఆకాశాల సృష్టిలో, రేయింబవళ్లు ఒక దాని తర్వాత ఒకటి రావడంలో వివేకవంతులకు, నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అన్ని వేళలా అల్లాహ్‌ను స్మరించే వారికి భూమి ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారికి ఎన్నో సూచనలు ఉన్నాయి. వారి నోట అప్రయత్నంగా– "ప్రభూ! ఇదంతా నీవు వ్యర్థంగా లక్ష్యరహితంగా సృష్టించలేదు. నీవు పరిశుద్ధుడవు కాబట్టి నిష్ఫలకార్యాలు చేయవు. కనుక ప్రభూ! మమ్మల్ని నరక బాధ నుంచి కాపాడు. ప్రభూ! మేము విశ్వాసం వైపునకు పిలిచేవాని పిలుపు విన్నాము. మీ ప్రభువును విశ్వసించండని అతను అనేవాడు. మేము అతని సందేశాన్ని స్వీకరించాము. కనుక స్వామి! మేము చేసిన తప్పులను మన్నించు. మాలో ఉన్న చెడులను దూరం చెయ్యి. సజ్జనులతోపాటు మా జీవితానికి ముగింపు ప్రసాదించు" అని ప్రార్థన చేస్తారు. సమాధానంగా వారి ప్రభువు "మీలోని ఎవరి శ్రమనూ నేను వృధాగా పోనివ్వను. పురుషుడైనా, స్త్రీ అయినా మీరంతా ఒకే రాశికి చెందినవారు" అంటాడు.

ప్రవక్తా! ప్రపంచ దేశాలలో ఉన్నటువంటి అవిశ్వాసులు దర్జాగా తిరుగాడడం నిన్ను మోసంలో పడవేయరాదు. ఇది కేవలం కొన్ని రోజుల జీవితపు కొద్దిపాటి సుఖం మాత్రమే. తర్వాత వారంతా నరకానికి పోతారు.

4. అన్ నిసా

రుకూ 1 : మానవులారా ! మీ ప్రభువునకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించాడు. అదే ప్రాణి నుంచి దాని జతను సృష్టించాడు. ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. 1. ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచడం మానండి. 2. అనాథల ఆస్తిని వారికి తిరిగి ఇచ్చి వేయండి. వారి మంచి వస్తువులను మీ చెడ్డ వస్తువులతో మార్చకండి. వారి ఆస్తిని మీ ఆస్తితో కలిపి కబళించకండి. 3. అనాథలతో న్యాయంగా వ్యవహరించలేమన్న భయం మీకు కలిగితే మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరిని గాని, ముగ్గురిని గాని, నలుగురిని గాని వివాహం చేసుకోండి. అయితే వారితో సమానంగా న్యాయంగా వ్యవహరించలేమన్న భయం మీకుంటే అప్పుడు ఒక స్త్రీని చేసుకోండి. 4. స్త్రీల మహర్‌ను సంతోషంగా చెల్లించండి. 5. మీ సంపదను అవివేకులకు అప్పగించకండి. 6. అనాథలకు పెళ్లి ఈడు వచ్చే వరకు వారి ఆజమాయిషి చేస్తూ ఉండండి. వారు

యోగ్యులైన పిదప సాక్షుల సమక్షంలో వారి ఆస్తిని వారికి అప్పగించండి. ప్రజలు ఒక విషయాన్ని గురించి ఆలోచించి భయపడాలి. అదేమంటే, ఒకవేళ వారే తమ పిల్లలను నిస్సహాయంగా విడిచిపెట్టి వెళ్లవలసివస్తే, మరణ సమయంలో ఎంతగా ఆందోళన పడతారో ఆలోచించాలి. అనాథల ఆస్తిని కబళించే వారు వాస్తవానికి తమ కడుపును అగ్గితో నింపుకుంటున్నారు. వారు తప్పక నరకానికి పోతారు.

రుకూ 2 : ఆస్తి పంపకానికి ముందు మృతుడు రాసిన వీలునామ అమలు జరిపి అతనిపై ఉన్న అప్పులు తీర్చాలి. ఆస్తి భాగాలను అల్లాహ్ నిర్ణయించాడు. మానవులకు తమ తరపున భాగాలు నిర్ణయించుకునే హక్కులేదు. ఇది అల్లాహ్ నిర్దేశించిన హద్దులు. అల్లాహ్‌కు, దైవ ప్రవక్తకూ విధేయత చూపే వారికి అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్, దైవప్రవక్తల పట్ల అవిధేయత చూపేవారిని, నిర్దేశిత హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ అగ్నిలో పడవేస్తాడు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు. అలాంటి వారికి మిక్కిలి అవమానకరమైన శిక్ష ఉంది.

రుకూ 3 : అజ్ఞానం వల్ల ఏదైనా చెడు చేసి వెనువెంటనే పశ్చాత్తాపపడేవారి పశ్చాత్తాపాన్ని మాత్రమే అల్లాహ్ స్వీకరిస్తాడు. చావు ఘడియ సమీపించే వరకు ఎడతెగకుండా అకృత్యాలు చేస్తూ ఉండి "ఇప్పుడు నేను పశ్చాత్తాపపడుతున్నాను" అని పలికేవారి పశ్చాత్తాపం ఎంత మాత్రం స్వీకరించబడదు. ఇలాంటి వారికి బాధాకరమైన శిక్ష ఉంది. విశ్వసించిన ప్రజలారా! బలవంతంగా స్త్రీలకు వారసులు కావడం మీకు ధర్మ సమ్మతం కాదు. ఇంకా, వారిని వేధించి వారికి మీరు ఇచ్చిన 'మహర్'లో కొంత భాగాన్ని కాజేసే ప్రయత్నం చేయడం కూడా ధర్మసమ్మతం కాదు. మీ భార్యలతో సద్భావంతో జీవితం గడపండి. వారు గనుక మీకు నచ్చనట్లయితే మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టి ఉండవచ్చు. మీ భార్యలకు మీరు ఇచ్చిన సంపదలోంచి కొంచెం కూడా తిరిగి తీసుకోవద్దు.

రుకూ 4 : వివాహం నిషిద్ధమైన స్త్రీలు: మీ తల్లులు, కుమార్తెలు, సోదరీమణులు, మేనత్తలు, మీ తల్లిసోదరీమణులు (పినతల్లులు), మీ సోదరుల కుమార్తెలు, మేనకోడళ్లు, మీకు పాలిచ్చిన తల్లులు, మీతోపాటు పాలు త్రాగిన సోదరీమణులు, మీ భార్యల తల్లులు, మీ సంరక్షణలో పెరిగిన మీ భార్యల కుమార్తెలు - అంటే మీరు రమించిన భార్యల కుమార్తెలు. మీ కుమారుల భార్యలు, ఇంకా ఏకకాలంలో

అక్కాచెల్లెళ్ళు ఇద్దరినీ చేర్చి భార్యలుగా చేసుకోవడం కూడా నిషిద్ధమే. ఇంకా, ఇతరుల వివాహబంధంలో ఉండే స్త్రీలు కూడా మీకు నిషిద్ధమే. ఈ స్త్రీలు తప్ప మిగతా స్త్రీలందరూ మీరు మీ ధనం ద్వారా పొందడం ధర్మసమ్మతం. అయితే వారికి వివాహ బంధంతో రక్షణ కల్పించాలి. విశృంఖలమైన కామ క్రీడలకు ఒడిగట్టరాదు. మీ భార్యల 'మహర్'ను విధిగా చెల్లించండి.

రుకూ 5 : అల్లాహ్ మీ వైపునకు కారుణ్యంతో మరలాలని కోరుతున్నాడు. మీపై ఆంక్షలను తేలిక చేయాలని అభిలషిస్తున్నాడు. ఎందుకంటే, మనిషి బలహీనుడు. విశ్వసించిన ప్రజలారా! ఒకరి సొమ్మును మరొకరు అధర్మంగా తినకండి. ఇచ్చిపుచ్చుకోవడం జరుగవలసిందే. అయితే పరస్పర అంగీకారంతో జరగాలి. హింసా దౌర్జన్యాల ద్వారా అలా చేసేవాణ్ణి అల్లాహ్ తప్పక అగ్నిలో పడవేస్తాడు. మీకు నిషేధిం చిన మహాపాపాలకు దూరంగా ఉంటే, మీ చిన్న చిన్న దోషాలను మేము మీ లెక్క నుంచి తీసివేస్తాము. అల్లాహ్ మీలో ఎవరికయినా ఇతరుల కన్నా అధికంగా ప్రసా దించి ఉంటే, మీరు దానికి ఆశపడకండి. అల్లాహ్‌ను ఆయన అనుగ్రహం కోసం ప్రార్థిస్తూ ఉండండి.

రుకూ 6 : పురుషులు, స్త్రీలకు అధికారులు. ఎందుకంటే, అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతను ప్రసాదించినందువల్ల, ఇంకా పురుషులు తమ సంపదను వారి కొరకు ఖర్చు చేస్తున్నందువల్ల. మీకు ఏ స్త్రీల విషయంలో అయినా వారు ధిక్కరిస్తున్నారన్న సందేహం ఉంటే వారికి నచ్చజెప్పండి. పడకగదులలో వారిని దూరంగా ఉంచండి. తేలికగా కొట్టండి. తరువాత వారు మీకు విధేయులైతే అకార ణంగా వారిని వేధించడానికి సాకులు వెదక్కండి. భార్యభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయన్న భయం మీకు కలిగితే, భర్త బంధువుల నుంచి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుంచి ఒక మధ్యవర్తిని నియమించండి. వీరిద్దరూ సంస్కరణను కోరితే అల్లాహ్ వారి మధ్య సమాధానం కుదరడానికి ఏదో ఒక మార్గం చూపుతాడు. బంధువులు, అనాథలు, నిరుపేదల పట్ల మంచిగా మెలగండి. పొరుగువారు, అపరిచి తులు, ప్రయాణికులు, ప్రక్కనున్న మిత్రులు, మీ అధీనంలో ఉన్న దాసదాసిజనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించండి. గర్వాతిశయంతో కన్నూమిన్నూ కాననివారు, తమ గొప్పతనం గురించి విర్రవీగే వారిని అల్లాహ్ ఇష్టపడడు. ఇలాంటి వాడు పిసినారిగా ఉంటాడు. ఖర్చుపెట్టినా కేవలం ప్రదర్శన కోసం ఖర్చుచేస్తాడు.

రుకూ 7 : విశ్వాసులారా! అపరిశుద్ధ స్థితిలో స్నానం చేయనంతవరకు నమాజ్ దగ్గరకు వెళ్లవద్దు. ఒకవేళ మీరు ప్రయాణంలో ఉంటే తప్ప. మీరు అనారోగ్యంగా ఉన్నప్పుడు లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు, మలమూత్ర విసర్జన చేసి ఉంటే లేదా మీరు మీ స్త్రీలను తాకి ఉంటే మీకు నీరు లభ్యం కాని పక్షంలో పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించండి. దానితో ముఖం, చేతులను రుద్దుకోండి. నిస్సందేహంగా అల్లాహ్ ఉదార స్వభావం కలవాడు. క్షమాగుణం కలవాడు. గ్రంథ ప్రజలు మీరు కూడా అపమార్గాన్ని పట్టాలని కోరుతున్నారు. గ్రంథప్రజలారా! మేము ఇపుడు అవతరింపజేసిన గ్రంథాన్ని విశ్వసించండి. అది మీవద్ద పూర్వం నుంచి ఉన్న గ్రంథాన్ని ధ్రువపరుస్తుంది. మీరు దాన్ని విశ్వసించనట్లయితే మేము మీ ముఖాలను వికృతం చేసి వెనక్కు తిప్పేస్తాము లేక సబ్బత్ ప్రజల మాదిరిగా పరిస్థితి మీకు దాపురించేలా చేస్తాము. అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. ఇది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తనకు ఇష్టమైన వారిని క్షమిస్తాడు.

రుకూ 8 : గ్రంథ ప్రజలు అవిశ్వాసుల గురించి మాట్లాడుతూ "విశ్వాసుల కంటే వీరే చాలా వరకు సరయిన మార్గంలో ఉన్నారు" అని అంటారు. ఇటువంటి వారినే అల్లాహ్ శపించాడు. అల్లాహ్ శపించిన వాడికి సహాయం చేసే వాడెవ్వడూ లేడు. మా ఆయత్‌లను నిరాకరించిన వారిని మేము నిశ్చయంగా అగ్నిలో పడవేస్తాము. వారి శరీర చర్మం కాలి కరగిపోతే దాని స్థానంలో మేము మరొక చర్మాన్ని సృష్టిస్తాము. వారు శిక్షను బాగా చవిచూడాలని మేము ఇలా చేస్తాము. మా ఆయత్‌లను విశ్వసించి మంచి పనులు చేసే వారిని దట్టమైన నీడలలో స్వర్గాల్లో ఉంచుతాము. ముస్లిములారా! అమానతులను యోగ్యులైన వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయంగా చెయ్యండి. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్తకు విధేయత చూపండి. మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు విధేయత చూపండి. మీ మధ్య ఏ విషయంలో అయినా వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించండి.

రుకూ 9 : ప్రవక్తా! "నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని, నీకు పూర్వం పంపబడిన గ్రంథాలను విశ్వసించామని ప్రకటన చేసినప్పటికీ తమ వ్యవహారాల పరిష్కారం కొరకు 'తాగూత్' వద్దకు పోవాలని కోరే వారున్నారు. వాస్తవానికి 'తాగూత్'ను తిరస్కరించండి అని వారిని ఆదేశించడం జరిగింది. వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను

న్యాయ నిర్ణేతగా స్వీకరించనంతవరకు, నీవు ఏ నిర్ణయం చేసినా దాన్ని యధాతథంగా, మనస్సులో ఎలాంటి సంకోచం లేకుండా శిరసావహించనంత వరకు వారు నిజమైన విశ్వాసులు కాలేరు. అల్లాహ్‌కు, ప్రవక్తకు విధేయత చూపేవారు అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన ప్రవక్తలు, సత్యసంధులు, షహీదులు, సజ్జనులతోపాటు ఉంటారు. ఈ స్నేహితులు ఎవరికి దొరికినా చాలా మంచివారు.

రుకూ 10 : విశ్వాసులారా! యుద్ధానికి ఎల్లప్పుడు సన్నద్ధులై ఉండండి. పరలోకం కోసం ఇహలోక జీవితాన్ని అమ్మివేసిన వారు అల్లాహ్ మార్గంలో పోరాడాలి. నిస్సహాయులైన పురుషులు, స్త్రీలు, పిల్లల కోసం అల్లాహ్ మార్గంలో మీరు పోరాడకపోవడానికి కారణమేమిటి? బలహీనులవడం వల్ల అణచివేతకు గురయినవారు" ప్రభూ! దుర్మార్గులైన ఈ నగరవాసుల నుంచి మాకు విమోచనం కలిగించు. ఒక సహాయకుణ్ణి, ఒక రక్షకుణ్ణి పంపించు." అని మొరపెట్టుకొంటున్నారే! విశ్వాసమార్గాన్ని ఎన్నుకున్నవారు అల్లాహ్ మార్గంలో పోరాడతారు. అవిశ్వాస మార్గాన్ని ఎన్నుకొన్నవారు తాగూత్ మార్గంలో పోరాడతారు.

రుకూ 11 : వారు యుద్ధం చేస్తామని పట్టుబట్టినప్పుడు మేము వారిని నిరోధించాము. కాని ఇప్పుడు యుద్ధం చెయ్యండని ఆదేశిస్తే వారిలో కొందరు దేవునికి భయపడవలసిన విధంగా మనుషులకు భయపడుతున్నారు. వారికి చెప్పండి, ఐహిక జీవిత భోగాలు అల్పమైనవి. దైవభక్తిపరాయణుడైన మనిషికి పరలోకమే ఎక్కువ మేలైనది. మీరు ఎక్కడ ఉన్నా సరే మృత్యువు తప్పక వస్తుంది. ఎంతటి దృఢమైన భవనాల్లో ఉన్నా సరే తప్పదు.

కపటులు మీ సమక్షంలో "మేము విధేయులం" అంటారు. కాని నీ వద్ద నుంచి వెళ్లిన తర్వాత వారిలోని ఒక వర్గం రాత్రిపూట సమావేశమై నీకు వ్యతిరేకంగా సమాలోచనలు చేస్తారు. మంచి కోసం సిఫారసు చేసేవానికి ఆ మంచిలో భాగం లభిస్తుంది. చెడు కోసం సిఫారసు చేసేవానికి ఆ చెడులో భాగం లభిస్తుంది.

మీకు ఎవరైనా గౌరవ భావంతో సలాము చేస్తే అతనికి మీరు అంతకంటే ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలాము చెయ్యండి లేదా కనీసం అదే విధంగానైనా చెయ్యండి. అల్లాహ్ ప్రతీదానికి లెక్క తీసుకుంటాడు.

రుకూ 12 : కపటులను అల్లాహ్ వెనక్కు (అంటే పూర్వపుస్థితికి మరల్చాడు. అల్లాహ్

మార్గం చూపనివారికి మీరు మార్గం చూపదలిచారా! వారు అవిశ్వాసులుగా ఉన్న మాదిరి మీరు కూడా అవిశ్వాసులుగా మారాలని, మీరు వారు ఒకటై పోవాలని, వారి కోరిక. కనుక అల్లాహ్ మార్గంలో వారు హిజ్రత్ (వలస) చేయనంత వరకు వారిలో ఎవ్వరినీ మీ మిత్రులుగా చేసుకోవద్దు. ఒకవేళ వారు హిజ్రత్ చెయ్యకపోతే ఎక్కడ దొరికినా వారిని పట్టుకుని సంహరించండి. కాని, వారు మీతో యుద్ధం చేయడం మానివేస్తే, సంధి కొరకు, శాంతి కొరకు చేయి చాపితే అప్పుడు వారిపై దాడి చేయడం కూడనిపని. మరొక రకం కపటులున్నారు. వారు మీతోనూ, తమ వారితోనూ శాంతియుతంగా ఉండాలని కోరుతుంటారు. కాని ఎప్పుడైనా కల్లోల పరిస్థితి తలెత్తితే అదును చూసి వారు కూడా అందులోకి దూకుతారు. అలాంటి వారు మీతో పోరాడ్డం మానుకోనంత వరకు, సంధి కోసం, శాంతి కోసం చేయిచాపకపోతే అప్పుడు వారిని ఎక్కడ దొరికితే అక్కడ పట్టుకుని సంహరించండి.

రుకూ 13 : పొరపాటుగా తప్ప, ఒక విశ్వాసి మరొక విశ్వాసిని చంపడం తగనిపని. ఒక విశ్వాసిని పొరపాటున చంపినవాడు దానికి పరిహారంగా ఒక ముస్లిము బానిసకు స్వేచ్ఛ ఇవ్వాలి. ఇంకా హతుని వారసులకు రక్తపరిహారాన్ని చెల్లించాలి. బానిస దొరకని వారు వరుసగా రెండు మాసాలు ఉపవాసం ఉండాలి. ఈ అపరాధానికిగాను అల్లాహ్ ముందు పశ్చాత్తాపపడే పద్ధతి ఇదే. ఇక బుద్ధిపూర్వకంగా ఒక విశ్వాసిని చంపిన వానికి ప్రతిఫలం నరకం. అందులో అతడు సదా ఉంటాడు. అతనిపై అల్లాహ్ ఆగ్రహం, శాపం అవతరిస్తాయి. కారణమేదీ లేకుండా ఇంటివద్ద కూర్చుండిపోయే ముస్లిములు, అల్లాహ్ మార్గంలో తమ ధనప్రాణాలతో 'జిహాద్' చేసే ముస్లిములు ఉభయుల స్థానం సమానం కాదు. కూర్చుండిపోయే వారికన్నా ధన ప్రాణాలతో 'జిహాద్' చేసేవారికి అల్లాహ్ ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు.

రుకూ 14 : అల్లాహ్ మార్గంలో హిజ్రత్ చేయని వారు, తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నారు. వారు మరణించినపుడు దైవదూతలు వారితో "మీరు వలసపోవడానికి కావలసినంత విశాలంగా లేదా అల్లాహ్ భూమి" అని అడుగుతారు. వారి నివాసం నరకం. అయితే నిజంగానే నిస్సహాయులై, బయలుదేరడానికి ఏ మార్గమూ, ఏ సాధన సంపత్తీ లేని పురుషులను, స్త్రీలను, పిల్లలను అల్లాహ్ క్షమించవచ్చు. అల్లాహ్ మార్గంలో వలసపోయేవాడు భూమిపై ఆశ్రయం పొందడానికి కావలసిన స్థలాన్ని, బ్రతుకు తెరువును, అవకాశాలను పొందుతాడు. అల్లాహ్ వైపునకు ఆయన ప్రవక్త

వైపునకు వలస పోవడానికని తన ఇంటి నుంచి బయలుదేరి మార్గమధ్యంలోనే మరణించిన వ్యక్తికి తగిన ప్రతిఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది.

రుకూ 15 : ప్రయాణానికి బయలుదేరినప్పుడు నమాజును సంక్షిప్తం చేస్తే అది తప్పుకాదు. ముఖ్యంగా అవిశ్వాసులు వేధిస్తారనే భయం ఉన్నప్పుడు, యుద్ధ సమయంలో నమాజు చదివే పద్ధతి ఈ రుకూలో చెప్పబడింది. ముస్లిములు రెండు విభాగాలు ఏర్పడాలి. ఒక విభాగం రక్షణకు నిలబడాలి. రెండవ విభాగం ఇమామ్ వెనుక ఒక రకాత్ నమాజు చేయాలి. తర్వాత మొదటి విభాగం ఇమామ్ వెనుక నిలబడి రెండవ రకాత్ పూర్తి చేయాలి. రెండవ విభాగం రక్షణకు నిలబడాలి. రెండు విభాగాలు అప్రమత్తంగా ఉండాలి. తమ ఆయుధాలను ధరించి ఉండాలి. నమాజు ముగించిన పిదప కూర్చున్నా, పడుకొన్నా ఏ స్థితిలో ఉన్నా అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండాలి. శాంతి భద్రతలు నెలకొన్న తర్వాత పూర్తి నమాజు చెయ్యాలి. విశ్వాసులు నిర్ణీత సమయాలలో విధిగా పాటించవలసిన ధర్మం నమాజ్.

రుకూ 16 : ఆత్మద్రోహం చేసుకునే వారిని నీవు సమర్థించవద్దు. నమ్మకద్రోహి, నిత్యపాపి అయిన వాడిని అల్లాహ్ ప్రేమించడు. వారు తమ దుష్కర్మలను మనుషులకు తెలియకుండా దాచగలరు. కాని అల్లాహ్‌కు తెలియకుండా దాచలేరు. ఈ అపరాధుల తరఫున నీవు ఇహలోకంలో వాదించగలిగావు. కాని ప్రళయం రోజున వారి తరఫున అల్లాహ్‌తో ఎవరు వాదిస్తారు? వారిని అక్కడ సమర్థించే వాడెవడు? చెడు పనిచేసిన వాడు, తన ఆత్మకు అన్యాయం చేసుకున్నవాడు. తర్వాత క్షమాభిక్ష కోసం అల్లాహ్‌ను అర్థిస్తే అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు అని తెలుసుకొంటాడు. కాని, ఎవడైనా ఏదైనా నేరం లేదా పాపం చేసి, ఆ నిందను ఏ నిర్దోషిపైనో మోపితే అతడు తీవ్రమైన అపనిందను, ఘోరపాతకాన్ని మూటకట్టుకుంటాడు.

రుకూ 17 : ప్రవక్తా! అల్లాహ్ నీపై గ్రంథాన్ని, వివేకాన్ని అవతరింపజేశాడు. పూర్వం నీకు తెలియనిదంతా నీకు నేర్పాడు. నిజంగా, నీ మీద ఆయనకు అధిక అనుగ్రహం ఉంది. ప్రజలు జరిపే రహస్య సమాలోచనల్లో సాధారణంగా ఏ మేలు లేదు. కాని రహస్యంగా దానధర్మాలు చేయండని బోధించడం, లేదా ఏదైనా సత్కార్యం కొరకు, ప్రజల వ్యవహారాలు చక్కబరిచే ఉద్దేశంతో ఎవరితోనైనా ఏదైనా రహస్యం చెబితే అది మంచి విషయమే. ఋజుమార్గం స్పష్టంగా తెలిసినప్పటికీ ఎవరైనా ప్రవక్తకు

వ్యతిరేకంగా నడుంబిగిస్తే, విశ్వాసుల వైఖరి వదలి భిన్న వైఖరి అవలంభిస్తే, అతడు మళ్లిన దిక్కుకే అతణ్ణి మేము నడిపిస్తాం. నరకంలో పడవేస్తాం. అది అతి నీచమైన నివాస స్థలం.

రుకూ 18 : అల్లాహ్ దృష్టిలో కేవలం షిర్కు ఒక్కటే క్షమార్హం కానిది. అది తప్ప తాను కోరిన వారి అన్ని పాపాలను ఆయన క్షమిస్తాడు. అల్లాహ్ శాపానికి గురి అయిన ఆ తిరుగుబాటుదారు షైతాన్‌ను ప్రజలు తమ ఆరాధ్యునిగా చేసుకుంటున్నారు. ఆ షైతాను అల్లాహ్‌తో "నేను నీ దాసులలో ఒక భాగం జనాన్ని నిశ్చయంగా తీసుకుంటాను. నేను వారిని మార్గం తప్పిస్తాను. నేను వారిలో లేనిపోని ఆశలు కల్పిస్తాను. నేను వారిని ఆజ్ఞాపిస్తాను. వారు నా ఆజ్ఞానుసారం జంతువుల చెవులు చీల్చుతారు. నా ఆజ్ఞాను సారం అల్లాహ్ సృష్టిలో మార్పులు చేస్తారు" అన్నాడు. అల్లాహ్‌కు బదులుగా ఈ షైతాన్‌ను సంరక్షునిగా, స్నేహితునిగా చేసుకొనేవాడు స్పష్టంగా నష్టానికి గురి అవుతాడు. అంతిమ ఫలితం మీ కోరికలపైగాని లేక గ్రంథ ప్రజల కోరికలపైగాని ఆధారపడిలేదు. మంచి పనులు చేసేవారు పురుషులైనా, స్త్రీలైనా, వారు గనుక విశ్వాసులయితే స్వర్గంలో ప్రవేశిస్తారు.

రుకూ 19 : అనాథలతో న్యాయంగా వ్యవహరించండని మీకు అల్లాహ్ ఆజ్ఞాపిస్తు న్నాడు. భర్త నిరాదరిస్తాడని, వేధిస్తాడనీ, లేదా విముఖుడై ఈసడించుకుంటాడనీ ఎవరైనా స్త్రీ భయపడుతుంటే – ఆ భార్యాభర్తలిరువురూ పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సర్దుబాటు చేసుకుంటే దోషం లేదు. సర్దుబాటు అన్ని విధాల ఉత్తమం. మనస్సులు సంకుచిత భావాల వైపునకు తేలిగ్గా మొగ్గుతాయి. మీరు ఉదార బుద్ధితో వ్యవహరిస్తే, భయభక్తులతో మెలిగితే అల్లాహ్‌కు మీ ప్రవర్తన తెలియకుండా ఉండడం జరగదని నమ్మండి. ఒక భార్య వైపునకు అధికంగా మొగ్గి మరొకామెను నిర్లక్ష్యం చేయకండి. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి. భూమ్యాకాశాలలో ఉన్న సమస్త వస్తువులకు యజమాని అల్లాహ్‌యే. ఆయన సంకల్పిస్తే మిమ్మల్ని తొలగించి మీ స్థానంలోకి ఇతరులను తీసుకురాగలడు. అలా చేయగల శక్తి సామర్థ్యాలు ఆయనకు ఉన్నాయి.

రుకూ 20 : విశ్వసించిన ప్రజలారా! న్యాయానికి నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీకు మీ తల్లిదండ్రులకు, మీ బంధువులకు మీ సాక్ష్యం, మీ

న్యాయం ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు బీదలయినా, ధనికులైనా అల్లాహ్ మీకంటే ఎక్కువగా వారి శ్రేయస్సు కాంక్షిస్తాడు. కనుక, మీ మనోవాంఛలను అనుసరించి న్యాయం నుంచి వైదొలిగే పని చేయవద్దు. మీరు గనుక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే - బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్ గమనిస్తున్నాడు.

అల్లాహ్ ఆయతులకు వ్యతిరేకంగా తిరస్కార వచనాలు వాగడాన్ని, వాటిని పరిహసించడాన్ని మీరు విన్నట్లయితే ప్రజలు వేరే విషయాన్ని ప్రారంభించనంతవరకు మీరు అక్కడ కూర్చోరాదు. ఈ కపటులు మీ విషయంలో గాలి ఎటువీస్తుందో చూద్దామని నిరీక్షిస్తున్నారు. అల్లాహ్ తరపు నుంచి విజయం గనుక మిమ్మల్ని వరిస్తే మీ వద్దకు వచ్చి "మేము మీతోనే ఉన్నాం కదా" అంటారు. ఒకవేళ అవిశ్వాసులది పైచేయి అయితే వారితో "మీతో పోరాడే శక్తి మాకు లేదా... అయినా మేం మిమ్మల్ని ముస్లిముల బారి నుంచి కాపాడాం కదా" అంటారు.

రుకూ 21 : ఈ కపటులు కేవలం ప్రజలకు చూపడానికి నమాజు చేస్తారు. నమాజు కొరకు లేస్తే బద్ధకంగా లేస్తారు. అల్లాహ్‌ను చాలా తక్కువగా స్మరిస్తారు. వారు విశ్వాస తిరస్కారాల మధ్య ఊగిసలాడుతున్నారు. విశ్వసించిన ప్రజలారా! విశ్వాసులను కాదని అవిశ్వాసులను మీ మిత్రులుగా చేసుకోకండి. మీరు, మీకు వ్యతిరేకంగా అల్లాహ్‌కు స్పష్టమైన సాక్ష్యం ఇవ్వదలచుకున్నారా? బాగా తెలుసుకోండి. కపటులు నరకంలో అట్టడుగుకుపోతారు.

రుకూ 22 : అన్యాయం జరిగితే తప్ప మనిషి చెడు పలకడాన్ని అల్లాహ్ ఇష్టపడడు. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలనూ తిరస్కరించేవారు, అల్లాహ్, ఆయన ప్రవక్తల మధ్య భేదభావం చూపేవారు, "మేము కొందరిని విశ్వసిస్తాం, కొందరిని విశ్వసించం" అనేవారూ, విశ్వాసం, అవిశ్వాసాల మధ్య ఒక కొత్తమార్గం కనిపెట్టాలనే ఉద్దేశం కలవారూ, -వీళ్లందరూ పరమ అవిశ్వాసులే. ఇలాంటి అవిశ్వాసుల కోసం మేము అత్యంత అవమానకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాము.

రకూ 23 : ప్రవక్తా! ఆకాశం నుంచి ఏదైనా గ్రంథాన్ని మాపై అవతరింపజెయ్యి" అని ఈ గ్రంథ ప్రజలు నేడు నిన్ను కోరితే- ఇంతకంటే ఘోరమైన కోరికలను వారు పూర్వం మూసాను కోరలేదా! ఆయన్ను "అల్లాహ్‌ను మాకు ప్రత్యక్షంగా చూపించు" అని

కోరారు. వారి పాపాల చిట్టా చాలా పెద్దది. వారు తమ అవిశ్వాసంలో ఎంత ముందుకు పోయారంటే మర్యమ్ పైనే తీవ్రమైన అపనిందవేశారు. "మేము మసీహ్ మర్యమ్ కుమారుడైన ఈసా అనే దైవప్రవక్తను చంపాము" అని స్వయంగా చెప్పారు. వాస్తవానికి వారు ఆయన్ను చంపనూ లేదు, శిలువపైకి ఎక్కించనూ లేదు. కాని ఆ విషయంలో వారు భ్రమకు గురిచేయబడ్డారు. అల్లాహ్ ఆయన్ను తన వైపునకు లేపుకున్నాడు. యూదుల ఈ దుర్మార్గ వైఖరి వల్ల, అల్లాహ్ మార్గంలో వారు ఆటంకాలు ఎక్కువగా సృష్టిస్తున్నందువల్ల, నిషిద్ధమైన వడ్డీని తీసుకుంటున్నందువల్ల, అధర్మంగా ఇతరుల సొమ్ము కబళిస్తున్నందు వల్ల, మేము పూర్వం ధర్మసమ్మతమైన ఎన్నో పరిశుద్ధమైన వస్తువులను వారికి నిషిద్ధం చేశాము. అయితే వారిలో జ్ఞానులు, నిజాయితీ పరులు అయిన వారందరూ, ప్రవక్తా! నీపై అవతరింపజెయ్యబడిన దానిని, నీకు పూర్వం అవతరింపజెయ్యబడిన దానిని విశ్వసిస్తారు.

రుకూ 24 : ప్రవక్తా! మేము నీ వైపునకు వహీ (దైవవాణి) పంపాము. నీకు పూర్వం ప్రవక్తల వైపునకు పంపిన మాదిరిగానే నీ వైపునకు వహీ పంపాము. ప్రవక్తలందరూ శుభవార్త తెలిపేవారుగా, హెచ్చరిక చేసేవారుగా పంపబడ్డారు– ఎందుకంటే వారిని పంపిన తర్వాత ఇక ప్రజల వద్ద అల్లాహ్‌కు వ్యతిరేకంగా వాదించే వీలుండరాదని ఇలా చేయడం జరిగింది. ప్రవక్తా! నీపై తాను అవతరింపజేసిన దానిని తన జ్ఞానంతో అవతరింపజేశానని అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు. దీనికి దైవదూతలు కూడా సాక్షులుగా ఉన్నారు.

మానవులారా! ఈ ప్రవక్త మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుంచి సత్యం తీసుకువచ్చాడు. అతన్ని విశ్వసించండి. మీకే మంచిది. కాని, మీరు గనుక తిరస్కరిస్తే ఆకాశాలలో భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే అన్న విషయం తెలుసుకోండి. గ్రంథ ప్రజలారా! మీ ధర్మ విషయంలో అతిగా ప్రవర్తించకండి. మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా అల్లాహ్ పంపిన ఒక ప్రవక్త. అల్లాహ్ మర్యమ్ వైపునకు పంపిన ఒక ఆజ్ఞ. అల్లాహ్ తరఫు నుంచి వచ్చి– మర్యమ్ గర్భంలో బిడ్డ రూపుదాల్చిన ఒక ఆత్మ తప్ప మరేమీ కాదు. కనుక అల్లాహ్‌ను ఆయన ప్రవక్తలను విశ్వసించండి. 'ముగ్గురు' అనడం మానండి. ఇది మీకే శ్రేయస్కరం. అల్లాహ్ ఒక్కడే దేవుడు. ఆయన పరిశుద్ధుడు. ఆయనకు ఒక కొడుకు ఉన్నాడన్న విషయానికి అల్లాహ్ అతీతుడు.

రుకూ 25 : అల్లాహ్‌కు దాసునిగా ఉండడాన్ని మసీహ్ అగౌరవంగా భావించలేదు. అల్లాహ్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే దూతలు కూడా దాన్ని అగౌరవంగా భావించరు. అల్లాహ్ దాస్యాన్ని అగౌరవంగా భావించేవాడు, అలా భావిస్తూ విర్రవీగే వాడు తెలుసుకోవాలి– అల్లాహ్ అందరినీ పోగు చేసి తన ముందు హాజరుపరిచే ఒక సమయం వస్తుంది అని. అల్లాహ్ దాస్యాన్ని అగౌరవంగా భావించి విర్రవీగిన వారికి అల్లాహ్ అతి బాధాకరమైన శిక్ష విధిస్తాడు. మానవులారా! మీ ప్రభువు తరఫు నుంచి మీ వద్దకు స్పష్టమైన నిదర్శనం వచ్చింది. మేము మీ వద్దకు మీకు స్పష్టంగా మార్గం చూపే జ్యోతిని పంపాము. ఇక అల్లాహ్ మాటను ఆలకించే వారిని, ఆయన శరణు వేడుకొనే వారిని అల్లాహ్ తన కరుణతో తన అనుగ్రహంతో కప్పివేస్తాడు. తన వైపునకు వచ్చే రుజుమార్గం చూపుతాడు.

5. అల్‌మాయిదా

రుకూ 1 : విశ్వాసులారా! కట్టుబాట్లను పూర్తిగా పాటించండి. పశువులను పోలిన జంతువులన్నీ మీకు ధర్మసమ్మతం (హలాల్) చేయబడ్డాయి. అయితే, 'ఇహ్రామ్' స్థితిలో వేటాడవద్దు. దైవభక్తి చిహ్నాలను అగౌరవ పరచరాదు– నిషిద్ధ మాసాలలో ఏ మాసాన్ని ధర్మసమ్మతం చేసుకోరాదు. ఖుర్బాని పశువులపై చెయ్యి చేసుకోరాదు. ప్రభువు అనుగ్రహాన్ని, అన్వేషిస్తూ పవిత్ర మందిరం వైపునకు పోయేవారి జోలికి పోకండి. మంచికి, దైవభక్తికి సంబంధించిన పనులలో అందరికీ సహకరించండి. పాపకృత్యాలలో అత్యాచారాలలో ఎవరితోనూ సహకరించకండి. నిషేధించబడినవి– మృతపశువు, రక్తము, పందిమాంసము, అల్లాహ్ పేరుతోకాక మరెవరి పేరుతోనయినా 'జిబహ్' చెయ్యబడిన పశువు, ఊపిరాడక లేదా దెబ్బలేని లేదా ఎత్తుప్రదేశం నుంచి క్రిందపడి లేదా దేన్నయినా ఢీకొని లేదా అడవి మృగం చీల్చడం వల్ల మరణించిన జంతువు– అది సజీవంగా ఉండి మీరు 'జిబహ్' చేస్తే తప్ప - (నిషిద్ధం) ఇంకా బలిపీఠంపై వధింపబడినవి కూడా నిషిద్ధం. పాచికల ద్వారా అదృష్టం తెలుసుకోవడం కూడా నిషేధింపబడింది.

ఈ రోజు నేను మీకోసం మీ ధర్మాన్ని పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీకు మీ ధర్మంగా ఇస్లామ్‌ను అంగీకరించాను. కనుక మీకు విధించబడిన హరామ్, హలాల్ నియమాలు పాటించండి. అయితే ఎవరైనా ఆకలి వల్ల గత్యంతరం

లేని పరిస్థితిలో, పాపం వైపునకు మొగ్గకుండా వీటిలోని ఏ వస్తువునైనా తిన్నట్లయితే, అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను.

రుకూ 2 : విశ్వసించిన ప్రజలారా! మీరు నమాజు కొరకు లేచినప్పుడు, మీ ముఖాలను, చేతులను, మోచేతుల వరకు కడగండి. తలపై చేతులతో రాయండి. కాళ్ళను చీలమండల వరకు కడగండి. మీరు అపరిశుద్ధంగా ఉంటే స్నానం చేసి పరిశుద్ధులు అవ్వండి. మీరు అనారోగ్యంతో ఉంటే, లేదా ప్రయాణంలో ఉంటే లేక కాలకృత్యాలు తీర్చుకొని వస్తే లేదా మీ స్త్రీలను ముట్టుకుంటే అప్పుడు నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన మట్టిపై చేతులతో కొట్టి మీ ముఖాలపై చేతులపై రాయండి. మీకు జీవితం కష్టతరం చేయడం అల్లాహ్ అభిమతం కాదు. ఆయన మిమ్మల్ని పరిశుద్ధులు చేయగోరుతున్నాడు. మీపై తన అనుగ్రహాన్ని పూర్తిచేయగోరుతున్నాడు. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. ఏదైనా వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని విడనాడకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తితో సమానమైనది. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి.

రుకూ 3 : ఇస్రాయీలు సంతతితో అల్లాహ్ "మీరు గనక నమాజు స్థాపిస్తే, జకాత్ ఇస్తే నా ప్రవక్తలను విశ్వసించి వారికి తోడ్పడితే, అల్లాహ్‌కు మంచి రుణాన్ని ఇస్తూ ఉంటే, నమ్మండి, నేను మీతో ఉన్నాను" అన్నాడు. వారు తమ వాగ్దానాన్ని భంగపరిచినందువల్ల మేము వారిని మా కారుణ్యానికి దూరంగా విసరివేశాము. వారి హృదయాలు కర్కశం చేశాము. ఇదేవిధంగా క్రైస్తవులమని చెప్పుకునే వారి నుంచి కూడా మేము దృఢమైన ప్రమాణం చేయించాము. కాని వారు తమకు బోధించిన విషయంలో ఒక పెద్ద భాగాన్ని విస్మరించారు. మేము వారి మధ్య పరస్పర విరోధ విద్వేషబీజాలను ప్రళయం వరకు ఉండే విధంగా నాటాము. గ్రంథ ప్రజలారా! మా ప్రవక్త మీ వద్దకు వచ్చారు. దైవగ్రంథంలో మీరు కప్పిపుచ్చుతూ ఉండిన ఎన్నో విషయాలు ఆయన మీముందు బహిర్గతం చేస్తున్నారు. మీ వద్దకు అల్లాహ్ తరఫు నుంచి కాంతి వచ్చింది. సత్యం వైపునకు మార్గం చూపే గ్రంథం వచ్చింది. దాని ద్వారా అల్లాహ్ తన సంతోషం పొందగోరే వారికి శాంతి పథాలను చూపుతాడు. తన ఇచ్ఛానుసారం వారిని చీకట్ల నుంచి వెలికితీసి వెలుగు వైపునకు తీసుకువస్తాడు. రుజుమార్గంపై నడుపుతాడు.

రుకూ 4 : మూసా తన జాతి వారితో "నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీకు ప్రసాదించిన ఈ వర్గాన్ని గురించి ఆలోచించండి. – ఆయన మీలో ప్రవక్తలను ఆవిర్భవింపజేశాడు. మిమ్మల్ని పాలకులుగా చేశాడు. ప్రపంచంలో ఎవరికీ ఇవ్వని దానిని మీకు ఇచ్చాడు. – నా జాతి సోదరులారా! అల్లాహ్ మీకు రాసి ఉంచిన పవిత్ర భూభాగంలో ప్రవేశించండి" అని చెప్పారు. జాతి ప్రజలు మూసాకు జవాబిస్తూ "మూసా అక్కడ మహాబలవంతులైన ప్రజలు ఉంటున్నారు. వారు అక్కడి నుంచి వెళ్లిపోనంత వరకు మేము సుతరాము అక్కడికి పోము. ఒకవేళ వారు వెళ్లిపోతే మేము ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్నాము. నీవు, నీ ప్రభువు పోయి పోరాడండి. మేము ఇక్కడే కూర్చుని ఉంటాము" అన్నారు. ఈ కృతఘ్నుతకు ఫలితంగా వారికి ఆదేశం నలభై సంవత్సరాల వరకు నిషేధించబడింది. ధరణిలో నిలువ నీడ లేకుండా వారు సంచరించారు.

రుకూ 5 : ఆదమ్ పుత్రులు ఇద్దరూ ఖుర్బాని ఇచ్చినప్పుడు ఒకరి ఖుర్బాని స్వీకరించబడింది. మరొకరిది స్వీకరించబడలేదు. ఖుర్బాని స్వీకరించబడని వాడు తన సోదరుడిని చంపి నష్టపోయే వారిలో కలిసిపోయాడు. అప్పుడు అల్లాహ్ ఒక కాకిని పంపాడు. అది నేలను తవ్వసాగింది. సోదరుడి శవాన్ని ఏ విధంగా దాచాలో అది చూసి తెలుసుకున్న అతడు పశ్చాత్తాపంతో రోదించాడు. ఈ కాకి పాటి వాణ్ణి కూడా కాలేకపోయానే, సోదరుడి శవాన్ని దాచే ఉపాయం వెదకలేకపోయానే అని దు:ఖించాడు. అన్యాయంగా ఒక మనిషిని చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మనిషి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవులను కాపాడినట్లే. అల్లాహ్‌తో, ఆయన ప్రవక్తతో పోరాడేవారికి, భూమిపై కల్లోలం సృష్టిస్తూ తిరిగే వారికి శిక్ష వారిని చంపడమే. లేదా శిలువనెక్కించడం లేదా వారి కాళ్లు చేతులను అభిముఖ దిశలలో ఖండించడం, లేదా దేశం నుంచి బహిష్కరించడం.

రుకూ 6 : విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. ఆయన సాన్నిధ్యానికి చేరే మార్గాన్ని అన్వేషించండి. ఆయన మార్గంలో నిరంతరం కృషి చెయ్యండి. స్పష్టంగా తెలుసుకోండి. తిరస్కార వైఖరి అవలంబించిన వారి వద్ద సమస్త సంపద ఉన్నా, ఇంకా అంతెత్తు సంపద అదనంగా ఉన్నా ప్రళయదిన శిక్ష నుంచి తప్పించుకోడానికి మొత్తం సంపద ఇవ్వదలచినా ప్రయోజనం ఉండదు. వారికి వ్యథాభరిత శిక్షపడుతుంది. దొంగ స్త్రీ అయినా పురుషుడు అయినా ఉభయుల చేతులూ నరకండి. ఇది వారి సంపాదనకు ప్రతిఫలం. అల్లాహ్ తరఫున గుణపాఠం నేర్పే శిక్ష. ప్రవక్తా! అవిశ్వాస మార్గంపై

పరుగులు తీసే ప్రజలను చూసి దు:ఖపడకు. కపట విశ్వాసులు, యూదులు ప్రజలతో "మీకు ఫలానా ఆజ్ఞ ఇస్తేనే స్వీకరించండి. లేకపోతే స్వీకరించవద్దు" అంటారు. అల్లాహ్‌యే పరీక్షకు గురిచెయ్యాలని నిశ్చయించిన వారిని అల్లాహ్ పట్టు నుంచి తప్పించడానికి నీవు ఏమీ చెయ్యలేవు.

రుకూ 7 : మేము తౌరాతు గ్రంథాన్ని అవతరింపజేశాము. అందులో మార్గదర్శకత్వము, ప్రకాశమూ ఉన్నాయి. ముస్లిములైన ప్రవక్తలంతా దాని ప్రకారమే ఈ యూదుల వ్యవహారాలను పరిష్కరించేవారు. ఇదే విధంగా రబ్బీలు, షరియత్ వేత్తలు కూడా దాని ఆధారంగానే తీర్పు చెప్పేవారు. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యని వారు దుర్మార్గులు. ఈ ప్రవక్తల తర్వాత మేము మర్యమ్ కుమారుడైన ఈసాను పంపాము. ఆయన తన కాలంలో ఉన్న తౌరాతు గ్రంథాన్ని ధ్రువీకరించాడు. మేము ఆయనకు ఇంజీలు గ్రంథాన్ని ప్రసాదించాము. అది కూడా తౌరాతు గ్రంథాన్ని ధృవీకరించేది. ఇంజీలు గ్రంథంలో అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం ప్రజలు తీర్పు చెయ్యాలని మేము ఆదేశించాము. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యనివారు హద్దుమీరే వారవుతారు.

ప్రవక్తా! మేము నీ వద్దకు పంపిన ఈ గ్రంథం సత్యాన్ని తీసుకొని వచ్చింది. తన కాలంలో ఉన్నటువంటి 'అల్‌కితాబ్' లోని భాగాలను ధృవీకరిస్తుంది. పరిరక్షిస్తుంది. కనుక నీవు అల్లాహ్ పంపిన చట్టం ప్రకారం ప్రజల వ్యవహారాలు పరిష్కరించు. నీ వద్దకు వచ్చిన సత్యం పట్ల విముఖత చూపి వారి వాంఛలను అనుసరించకు.

రుకూ 8 : విశ్వాసులారా! యూదులనూ, క్రైస్తవులనూ మీ మిత్రులుగా చేసుకోవద్దు. వారు తమకుతాము, ఒకరికొకరు మాత్రమే మిత్రులు. మీలో ఎవరైనా వారిని తన మిత్రులుగా స్వీకరిస్తే అతడు కూడా వారిలో ఒకనిగా పరిగణింపబడతాడు. అల్లాహ్ మీకు తిరుగులేని విజయాన్ని ప్రసాదించినప్పుడు లేక తన తరఫు నుంచి మరేదైనా విషయాన్ని బహిర్గతం చేసినప్పుడు వారు తమ మనస్సులలో దాచి ఉంచిన కాపట్యానికి సిగ్గుపడడం అసంభవం కాదు. విశ్వాసులారా! మీలో ఎవరైనా తమ ధర్మం నుంచి వైదొలిగితే (పోవచ్చు). అల్లాహ్ ఇంకా అనేక మందిని సృష్టిస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు. వారు అల్లాహ్‌ను ప్రేమిస్తారు. వారు విశ్వాసులతో మృదువుగానూ, అవిశ్వాసులతో కఠినంగాను వ్యవహరిస్తారు. అల్లాహ్ మార్గంలో అవిశ్రాంత కృషి

చేస్తారు. వాదించే వారి నిందలకు వారు భయపడరు. అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త, నమాజును స్థాపించే, జకాతు ఇచ్చే, అల్లాహ్ ముందు రుకూ చేసే విశ్వాసులు -వీరు మాత్రమే నిజానికి మీ మిత్రులు. అల్లాహ్‌ను, ప్రవక్తను, విశ్వాసులను తమ మిత్రులుగా స్వీకరించేవారు అల్లాహ్ పక్షమే ఆధిక్యం వహిస్తుందని తెలుసుకోవాలి.

రుకూ 9 : విశ్వాసులారా! మీకు పూర్వపు గ్రంథ ప్రజలతో ధర్మాన్ని ఒక పరిహాసంగా, వినోద వస్తువుగా భావించిన వారిని, అవిశ్వాసులను మీరు మిత్రులుగా చేసుకోవద్దు. మీరు నిజంగా విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడండి. మీరు నమాజు కొరకు పిలుపునిస్తే దానిని పరిహసించి, వినోదిస్తారు వాళ్ళు. వారితో చెప్పండి, "గ్రంథ ప్రజలారా! మేము అల్లాహ్‌ను, మా వైపునకు అవతరించిన, మాకు పూర్వం కూడా అవతరించిన ధర్మాన్ని విశ్వసించడం, మీలో చాలామంది అవిధేయులయి ఉండడం వల్లనే మీరు మాపై కోపం చూపుతున్నారు. అంతకుమించి మరో కారణమేముంది!" వారిలో చాలా మందికి తలబిరుసుతనం, అసత్యాన్ని అనుసరించే గుణం అధికం అయ్యేలా చేసింది. ప్రభువు తరుఫు నుంచి నీపై అవతరించిన గ్రంథం. వారు తౌరాతును, ఇంజీలును, వారి ప్రభువు తరఫు నుంచి వారి వద్దకు పంపబడిన ఇతర గ్రంథాలను అనుసరించి ఉన్నట్లయితే బాగుండేది. వారి కొరకు ఆహారం పై నుంచి వర్షించి ఉండేది. క్రింది నుంచి పొంగి ఉండేది.

రుకూ 10 : ప్రవక్తా! నీ ప్రభువు తరఫు నుంచి నీపై అవతరించిన దానిని ప్రజలకు అందజెయ్యి. ఒకవేళ నీవు ఆ విధంగా చెయ్యకపోతే, ఆయన ప్రవక్తగా నీవు నీ ధర్మాన్ని నిర్వహించనట్లే. ముస్లిములైనా, యూదులైనా, సాబియీలైనా, క్రైస్తవులయినా ఎవరైనా సరే, అల్లాహ్‌ను చివరి రోజును విశ్వసించి మంచి పనులు చేస్తే నిస్సందేహంగా వారికి భయంగాని, శోకం కాని కలిగే ఆస్కారం లేదు. ఇస్రాయీల్ సంతతి తమ వాగ్దానాన్ని భంగపరచింది. వారు ప్రవక్తలను తిరస్కరించారు. కొందరిని హత్య చేశారు. అల్లాహ్ విధించిన శిక్షకు పాత్రులయ్యారు. మర్యమ్ కుమారుడైన మసీహ్‌యే అల్లాహ్ అని కొందరన్నారు. వాస్తవానికి మసీహ్ అల్లాహ్ వైపునకు, ఒకే దేముని వైపునకు ప్రజలను పిలిచాడు. అల్లాహ్ ముగ్గురిలో ఒకడు అని కొందరన్నారు. వాస్తవమేమంటే అల్లాహ్ ఒక్కడు. మరొక దేముడు లేడు. మర్యమ్ పుత్రుడైన మసీహ్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. ఆయన తల్లి సద్గుణ సంపన్నురాలు. వారు ఉభయులూ ప్రతిరోజు భోజనం చేసేవారు. గ్రంథప్రజలారా! మీ తప్పుడు భావాలు మిమ్మల్ని మార్గం తప్పించాయి.

మీకు పూర్వం చాలామంది ఇలాగే మార్గభ్రష్టులయ్యారు. రుజుమార్గం నుంచి దూరమయ్యారు.

రుకూ 11 : ఇస్రాయీలు సంతతి ప్రజలు అవిధేయులయ్యారు. అత్యాచారాలు చేయ సాగారు. చెడు పనులు చేయకుండా ఒకరినొకరు నిరోధించడం మానివేశారు. వారు అవలంభించిన మార్గం చాలా చెడ్డది. వారిలో చాలామంది విశ్వాసులకు వ్యతిరేకంగా అవిశ్వాసులను బలపరిచేవారిగా, అవిశ్వాసులతో మైత్రి చేసేవారిగా నేడు నువ్వు చూస్తావు. విశ్వాసుల పట్ల వైరం విషయంలో యూదులు బహుదైవారాధకులు అతి తీవ్ర వైఖరి కలిగి ఉండడం నీవు చూస్తావు. విశ్వాసుల పట్ల మైత్రి విషయంలో 'మేము నస్రానీయులం' అని చెప్పేవారు అత్యంత సన్నిహితంగా ఉండడం చూస్తావు. ప్రవక్తపై అవతరించిన ఈ గ్రంథాన్ని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన వారి కళ్లు చెమ్మ గిల్లడం నీవు చూస్తావు. వారు "ప్రభూ! మేము విశ్వసించాము. మా పేర్లను సాక్ష్యం ఇచ్చేవారిలో వ్రాయి" అని పలుకుతారు. వారు స్వర్గాన్ని పొందుతారు.

రుకూ 12 : విశ్వాసులారా! అల్లాహ్ మీకు ధర్మసమ్మతం చేసిన పరిశుద్ధ వస్తువులను నిషిద్ధం చేసుకోవద్దు. హద్దులను దాటవద్దు. మితిమీరి ప్రవర్తించేవారంటే అల్లాహ్‌కు ఏమాత్రం ఇష్టం ఉండదు. మీరు చేసే అర్థం లేని ప్రమాణాల గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. కాని మీరు బుద్ధిపూర్వకంగా చేసే ప్రమాణాల గురించి ఆయన మిమ్మల్ని తప్పకుండా ప్రశ్నిస్తాడు. అటువంటి ప్రమాణ భంగానికి పరిహారంగా మీరు మీ ఆలుబిడ్డలకు తినిపించే భోజనం లాంటి భోజనం పది మంది పేదలకు పెట్టాలి. లేదా ఒక బానిసకు స్వేచ్ఛ కల్పించాలి. ఈ స్తోమత లేనివారు మూడు రోజులపాటు ఉపవాసం ఉండాలి. మీరు ప్రమాణాన్ని భంగపరిస్తే పరిహారం ఇది. విశ్వాసులారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల జోస్యం- ఇవన్నీ అసహ్యకరమైన షైతాను పనులు. వాటిని విసర్జించండి. షైతాను, సారాయి, జూదాల ద్వారా మీ మధ్య విరోధ విద్వేషాలను సృష్టించాలనీ, మిమ్మల్ని అల్లాహ్ స్మరణ నుంచి, నమాజు నుంచి నిరోధించాలని కోర్తాడు. కనుక వీటిని ఇకనైనా మానుకుంటారా! విశ్వసించి మంచి పనులు చేసేవారిని వారు పూర్వం తిన్న దానిని గురించి, త్రాగిన దానిని గురించి ప్రశ్నించడం జరుగదు. కాని వారు ఇక ముందు హరాముకు దూరంగా ఉండాలి.

రుకూ 13 : విశ్వసించిన ప్రజలారా! 'ఇహ్రాము' స్థితిలో వేటాడవద్దు. ఒకవేళ మీలో

ఎవరయినా బుద్ధిపూర్వకంగా అలా చేస్తే అతడు తాను చంపిన జంతువుతో సరితూగే ఒక పశువును నజరానా (మొక్కుబడి)గా సమర్పించుకోవాలి. లేకపోతే ఆ పాపానికి పరిహారంగా కొందరు పేదలకు భోజనం పెట్టాలి. లేదా దానికి సమానంగా ఉపవాసాలు ఉండాలి. సముద్ర జంతువులను వేటాడడం, వాటిని తినడం, మీకు ధర్మసమ్మతం చేయబడింది. తెలుసుకోండి. అల్లాహ్ శిక్షించడంలో కఠినుడు. దానితో పాటు మన్నించేవాడు, కరుణించేవాడు కూడా. ప్రవక్తపై కేవలం సందేశాన్ని అందజేసే బాధ్యత మాత్రమే ఉంది. ఆ తర్వాత మీ బాహ్యాంతర పరిస్థితులన్నీ తెలుసుకునేవాడు అల్లాహ్యే. ప్రవక్తా వారికి చెప్పండి. పరిశుద్ధము, అపరిశుద్ధము ఎట్టి పరిస్థితుల లోనూ సమానం కావు. అపరిశుద్ధం పుష్కలంగా ఉండి ఎంతగా ఆకర్షించినప్పటికీ పరిశుద్ధంతో సమానం కాదు.

రుకూ 14 : 'అల్లాహ్ అవతరింపజేసిన శాసనం వైపునకు రండి, ప్రవక్త వైపునకు రండి' అని వారితో చెప్పినప్పుడు వారు 'మాకు మాతాత ముత్తాతలు అవలంభించిన, మేము చూసిన విధానం చాలు" అని జవాబిస్తారు. తాతముత్తాతలకు రుజుమార్గ జ్ఞానం లేకపోయినప్పటికీ వారినే అనుసరిస్తారా? విశ్వాసులారా! మీ గురించి మీరు ఆలోచించండి. మీరు గనుక స్వయంగా సన్మార్గంపై ఉంటే, ఇతరులు మార్గభ్రష్టులై నప్పటికీ మీకు ఏమాత్రం హానికలుగదు. విశ్వాసులారా! మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమై అతడు వీలునామా రాయిస్తున్నప్పుడు దాని సాక్ష్యానికి అనుసరించ వలసిన పద్ధతి ఏమంటే- మీలో న్యాయవర్తనులయిన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా ఉంచాలి. -సాక్ష్యం విషయంలో అనుమానం ఉంటే, సాక్షులు ఎదురు తిరిగితే అలాంటి పరిస్థితులలో అవలంభించవలసిన పద్ధతుల వివరాలు ఈ రుకూలో ఉన్నాయి.

రుకూ 15 : అల్లహ్ ప్రళయ దినాన ప్రవక్తలందరినీ సమావేశపరచి "మీకు ఏమని జవాబు లభించింది?" అని అడుగుతాడు. ప్రవక్త ఈసాకు ప్రసాదించిన అనుగ్రహాలు, మహిమలను గుర్తుచేసి ఆయన్ను కూడా జవాబు ఇవ్వమని ప్రశ్నిస్తాడు. హవారీలు ఈసాను ఆకాశం నుంచి ఆహారం పొందిన పళ్లాన్ని దింపమని కోరారు. హజ్రత్ ఈసా ఈ కోరిక విని మొదట కోపగించారు. కాని హవారీలు "ఆ పళ్లంలో ఆహారాన్ని తినాలని, మా హృదయాలకు తృప్తి కలగాలనీ, నీవు మాకు చెప్పేదంతా నిజమన్న నమ్మకం మాకు కలగాలనీ" పట్టుపట్టారు. హజ్రత్ ఈసా అల్లాహ్ను ప్రార్థించారు. అల్లాహ్ జవాబుగా "నేను దానిని మీపై అవతరింపజేస్తాను. కాని ఆ తర్వాత కూడా

మీలో ఎవరైనా అవిశ్వాసానికి పాల్పడితే వారికి నేను ఇంతవరకు ఎవరికీ విధించని కఠిన శిక్ష విధిస్తాను" అన్నాడు.

రుకూ 16 : ప్రళయదినాన అల్లాహ్, హజ్రత్ ఈసాతో "మర్యమ్ కుమారుడైన ఈసా! అల్లాహ్‌ను కాదని నన్ను నా తల్లిని దేముళ్ళుగా భావించండని నువ్వు మనుష్య జాతిని బోధించావా?" అని ప్రశ్నిస్తాడు. ఈసా ఇలా మనవి చేసుకుంటారు "నీవు అత్యంత పవిత్రుడవు. నేను అలా బోధించలేదు. నేను అలాంటి మాటలు చెప్పి ఉంటే మీకు నిస్సందేహంగా తెలిసి ఉండేది. నీవు ఆదేశించినది తప్ప మరేదీ నేను వారికి చెప్పలేదు. నేను వారికి అల్లాహ్‌ను ఆరాధించండి ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే అని మాత్రమే చెప్పాను. నీవు నన్ను తిరిగి పిలుచుకొన్న తర్వాత నీవే వారిని కనిపెట్టి ఉంటున్నావు. ఇప్పుడు నీవు వారిని శిక్షించినట్లయితే వారు నీ దాసులు. ఒకవేళ క్షమించి నట్లయితే నీవే శక్తిమంతుడవు." అప్పుడు అల్లాహ్ "నేడు సత్యవంతులకు వారి సత్యం లాభాన్నిస్తుంది." అంటాడు.

6. అల్ అన్‌ఆమ్

రుకూ 1 : స్తోత్రం అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తుంది. ఆయన భూమిని ఆకాశాలను నిర్మించాడు. వెలుగు చీకట్లు సృష్టించాడు. అయినప్పటికీ సత్యసందేశాన్ని నిరాకరించేవారు. ప్రభువుకు సాటిగా ఇతరులను నిలబెడుతున్నారు. అల్లాహ్ మిమ్మల్ని మట్టితో సృజించాడు. మీ కొరకు ఒక జీవన వ్యవధిని నిర్ణయించాడు. ఆయన వద్ద మీలో వ్యవధి కూడా నిర్ణయమై ఉంది. ఆ ఏకైక దేముడే ఆకాశాలలో ఉన్నాడు. భూమిలోనూ ఉన్నాడు. మీరు బయటకు ప్రకటించేదీ, లోపల దాచిపెట్టేది అంతా ఆయనకు తెలుసు. మీరు సముపార్జించుకునే మంచి చెడులు తెలిపినవాడు. తమ తమ కాలాల్లో అధిక ప్రాబల్యం కల ఎన్ని జాతులను అల్లాహ్ నాశనం చేశాడో వారు చూడలేదా! అల్లాహ్ మీకు ఇవ్వని అధికారాన్ని భూమిపై పూర్వం వారికి ఇచ్చాడు. చివరకు వారు చేసిన పాపాల ఫలితంగా వారిని సర్వనాశనం చేశాడు. వారి స్థానంలో మరొక తరం, జాతిని పైకి లేపాడు.

రుకూ 2 : ప్రవక్తా! కాస్త భూ సంచారం చేసి చూడండి. సత్య తిరస్కారుల ముగింపు ఎలా జరిగిందో గ్రహిస్తారు. ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే.

దయాదాక్షిణ్యాలు చూపడాన్ని ఆయన తనకు తప్పనిసరిగా చేసుకున్నాడు. ప్రళయం నాడు మీ అందరిని తప్పక సమావేశపరుస్తాడు. ఇది అనుమానానికి ఏమాత్రం ఆస్కారం లేని యదార్థం. వారికి చెప్పండి "భూమ్యాకాశాల సృష్టికర్త ఉపాధి ప్రదాతేకాని, ఉపాధి స్వీకరించేవాడు కాదు. అలాంటి అల్లాహ్‌ను కాదని ఇతరులను సంరక్షకులుగా చేసుకోవాలా? ముందు ఆయన విధేయుణ్ణి కావాలని నన్ను ఆదేశించడం జరిగిందని" అని చెప్పండి. "నేను ఒకవేళ నా ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘిస్తే ఒక మహా (భయంకరమైన) రోజున శిక్ష అనుభవించవలసి వస్తుందని భయపడుతున్నాను. ఆరోజున శిక్షను తప్పించుకున్నవాడు నిజంగా అల్లాహ్ కరుణ పొందినట్లే. అల్లాహ్ గనుక యేదైనా నష్టం కలిగిస్తే ఆయన తప్ప ఆ నష్టం నుంచి రక్షించగల వాడెవ్వడు లేడు. ఆయన ఏదైనా మేలు కలుగజేస్తే ఆయనకు అన్నింటిపై అధికారం ఉంది" అని చెప్పండి.

రుకూ 3: అల్లాహ్‌పై బూటకపు అభాండాలు వేసే వాడిని అల్లాహ్ సూచనలు అసత్యాలని తిరస్కరించే వాడిని మించిన పరమ దుర్మార్గుడెవడు? నిశ్చయంగా అలాంటి దుర్మార్గులు సాఫల్యం పొందలేరు. వారితో నా మాటలు చెవియొగ్గి వినేవాళ్ళు కొందరున్నారు. అయిత వాళ్లే "ఇదంతా పాతకాలపు గాథ తప్ప మరేది కాదు" అని అంటారు. ఈ సత్యవాక్కులను విశ్వసించకుండా ప్రజలను నిరోధిస్తారు. నరకం గట్టుపై వారిని నిలబెట్టే దృశ్యాన్ని నీవు చూపగలిగితే బావుండు. అప్పుడు వారు ఇలా అంటారు: "అయ్యో! మేము భూలోకానికి తిరిగి పంపబడితే, మా ప్రభువు సూచనలు అసత్యాలని తిరస్కరించకుండా విశ్వాసులలో మేమూ కలిసిపోయే మార్గం ఏదైనా ఉంటే ఎంత బావుండు" మరణానంతరం తిరిగి లేపబడడం సత్యమని వాళ్లప్పుడు విశ్వసిస్తారు. ప్రపంచంలో ఉన్నప్పుడు మాత్రం ఈ సత్యాన్ని తిరస్కరిస్తూ ఉండేవారు.

రుకూ 4 : అల్లాహ్‌తో సమావేశం వార్తను అబద్ధంగా పరిగణించిన వారు నష్టానికి గురయ్యారు. అకస్మాత్తుగా ఆ ఘడియ వచ్చినప్పుడు తాము చేసిన పనికి వాపోతారు. తమ పాపాల బరువును తమ వీపుపై మోస్తారు. చూడండి! వాళ్ళు మోస్తున్న ఈ బరువు ఎంత చెడ్డదో! ఇహలోక జీవితం ఒక ఆట, ఒక తమాషా మాత్రమే. నష్టం నుంచి తప్పించుకోగోరే వారికి వాస్తవానికి పరలోకమే అత్యంత శ్రేష్ఠమైనది. వినగలిగిన వారు మాత్రమే సత్య సందేశాన్ని స్వీకరిస్తారు. ఇక మృతుల విషయం అల్లహ్ వారిని నేరుగా గోరీల నుంచి లేపుతాడు. "కొంచెం ఆలోచించి చెప్పండి. ఎప్పుడైనా అల్లాహ్ తరఫు

నుంచి యేదైనా పెద్ద ఆపద మీపై వచ్చి పడినప్పుడు లేదా చివరి ఘడియ దాపురించినపుడు మీరు అల్లాహ్‌ను తప్ప మరెవర్నయినా పిలుస్తారా? చెప్పండి! మీరు సత్యవంతులే అయితే.

రుకూ 5 : వారు తమకు చెయ్యబడిన హితోపదేశాన్ని విస్మరించినపుడు మేము వారి కొరకు సకల భోగభాగ్యాల ద్వారాలు తెరిచాము. వారు తమకు ప్రసాదించిబడిన సంతోషంలో మునిగి ఉండగా అకస్మాత్తుగా మేము వారిని పట్టుకొన్నాము. అప్పుడు పరిస్థితి ఎలా ఉందంటే, వారు ప్రతీ మేలు విషయంలో నిరాశకు గురి అయ్యారు. ఈ విధంగా దుర్మార్గానికి పాల్పడిన వారిని సమూలంగా నిర్మూలించడం జరిగింది. సకల లోక ప్రభువు అల్లాహ్‌యే స్తుతికి పాత్రుడు. అల్లాహ్ మీ చూపును, మీ వినికిడినీ మీ నుంచి లాక్కుంటే, మీ హృదయాలకు ముద్ర వేస్తే మళ్లీ మీకు ఈ శక్తులను అల్లాహ్ తప్ప తిరిగి ఇవ్వగల వాడెవడున్నాడు? సచ్ఛరితులకు సంతోషవార్త ఇవ్వడానికి, దుశ్చరిత్రులను భయపెట్టాలని మేము ప్రవక్తలను పంపుతాము. వారిని అడుగు, గ్రుడ్డివాడు, కళ్ళున్నవాడు ఒకటేనా! మీరు అసలు ఆలోచించరా!

రుకూ 6 : ప్రవక్తా! తమకు అండగా నిలిచి సహాయం చేసేవాడు, లేదా సిఫారసు చేసేవాడు ఎవ్వడు ఉండని స్థితిలో ప్రభువు ముందు హాజరు కావడం జరుగుతుందని భయపడే వారిని నీవు వహీ జ్ఞానం ద్వారా ఉపదేశించు. బహుశా వారు ఈ ఉపదేశం వల్ల జాగరూకులై భయభక్తుల వైఖరి అవలంభించవచ్చు. రేయింబవళ్ళు ప్రభువును వేడుకునే వారిని, ప్రభువు ప్రసన్నత పొందే ప్రయత్నంలో నిమగ్నులయి ఉన్నవారిని నీవు దూరం చేయకు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు చూపే తన భక్తులెవరో బాగా తెలుసు. మా ఆయతులు విశ్వసించేవారు నీవద్దకు వచ్చినపుడు వారితో "మీకు శాంతి కలుగుగాక, మీ ప్రభువు దయాదాక్షిణ్యాలు చూపడం తనపై తప్పనిసరి చేసుకున్నాడు. ఒకవేళ మీలో ఎవరైనా అజ్ఞానం వల్ల ఏదైనా చెడు చేసి తరువాత పశ్చాత్తాపపడి సంస్కరించుకుంటే ఆయన అతనిని క్షమిస్తాడు. ఉదారంగా వ్యవహరిస్తాడు.

రుకూ 7 : ప్రవక్తా! వారికి చెప్పండి. "అల్లాహ్‌ను కాదని మీరు వేడుకుంటున్న ఇతరులకు నేను దాస్యం చేయరాదని నాకు ఆజ్ఞాపించబడింది. నేను మీ కోరికలను అనుసరించను. అలాచేస్తే నేను మార్గభ్రష్టుడనయిపోతాను. సన్మార్గం పొందిన వారిలో ఉండను." - అగోచరాల తాళం చెవులు అల్లాహ్ వద్దనే ఉన్నాయి. వాటి గురించి

తెలిసిన వారు ఆయన తప్ప ఎవ్వరూ లేరు. భూమిలోనూ సముద్రంలోనూ ఉన్నదంతా ఆయనకు తెలుసు. చెట్టు నుంచి ఒక్క ఆకు కూడా ఆయనకు తెలియకుండా రాలదు. భూమిలోని చీకటి పొరలలో ఉన్న యే గింజ అయినా ఆయనకు తెలియకుండా లేదు. తడిగా ఉన్నది, పొడిగా ఉన్నది అంతా ఒక విపులమైన గ్రంథంలో రాయబడి ఉంది. ఆయన రాత్రివేళ మీ ఆత్మలను వశపరచుకుంటాడు. పగటివేళ మీరు చేసేదంతా తెలుసుకుంటాడు. మళ్లీ రెండోరోజు మీ నిర్ణీత జీవితకాలం పూర్తి కావడానికి ఆయనే మిమ్మల్ని ఈ వ్యవహార ప్రపంచంలోకి తిరిగిపంపుతాడు. చివరకు మీరు ఆయన వైపునకే మరలిపోవాలి. అప్పుడు ఆయన మీకు మీరు చేస్తున్నదంతా చూపుతాడు.

రుకూ 8 : ప్రవక్తా! వారిని అడగండి – "భూ సముద్రాల చీకట్లలో ప్రమాదాల నుంచి కాపాడేది ఎవరు? మీరు (ఆపదవేళ) కడుదీనంగా విలపిస్తూ అతి గోప్యంగా వేడుకొనేది ఎవరిని? ఈ ఉపద్రవం నుండి ఆయన గనుక రక్షిస్తే మేము తప్పక కృతజ్ఞులవుతాం అని చెప్పుకొనేది ఎవరితో?" ఇంకా వారిని అడగండి– "అల్లాహ్ మీకు ప్రతి బాధ నుంచి విముక్తి కలిగించిన పిదప మీరు ఇతరులను ఆయనకు భాగస్వాములుగా నిలబెడతారు. ఆయన యేదైనా శిక్షను పై నుంచి మీపై అవతరింపజెయ్యగలడు, లేదా మీ పాదాల క్రింది నుంచి తీసుకురాగలడు. లేదా మిమ్మల్ని వర్గాలుగా విభజించి ఒక వర్గం బలాన్ని మరొక వర్గానికి రుచి చూపించగలడు. ఆయనకు ఆ శక్తి ఉంది." తమ ధర్మాన్ని ఒక క్రీడగా ఒక తమాషాగా భావించిన వారిని, ఇహలోక జీవితం మాయకు గురిచేసిన వారిని నీవు వదలిపెట్టు. కాని, ఈ ఖుర్‌ఆన్‌ను వినిపించి హితబోధ చెయ్యి. హెచ్చరిక చేస్తూ ఉండు. ఎందుకంటే యే వ్యక్తి తన చేష్టల దుష్ఫలితంలో చిక్కుకోరాదు.

రుకూ 9 : రుజుమార్గాన్ని వదిలిపెట్టినవాడు ఎలాంటి వాడంటే– షైతానులు ఎడారిలో దారి తప్పించగా తిరుగాడేవాడు. 'ఇటురా! సరైన మార్గం ఇక్కడుంది' అని సహచరులు పిలుస్తూ ఉన్నప్పటికీ కలవరపాటుతో గాభరాపడి తిరుగాడే వాడితో పోల్చడం జరిగింది. వాస్తవానికి నిజమైన మార్గదర్శకత్వం కేవలం అల్లాహ్ మార్గదర్శకత్వమే. సృష్టి ప్రభువు ముందు విధేయతతో తలవంచండి. నమాజు స్థాపించండి. అవిధేయతకు దూరంగా ఉండండి. ఆయన వద్దకే మీరంతా తీసుకుపోబడతారు. ఇబ్రాహీము రాత్రి ఆవరించగానే ఒక నక్షత్రాన్ని చూసి "ఇది నా ప్రభువు" అన్నాడు. కాని అది అస్తమించగానే "అస్తమించే వాటిని నేను ప్రేమించను" అని అన్నాడు. చంద్రుణ్ణి ప్రకాశిస్తూ చూసి "ఇది నా ప్రభువు" అన్నాడు. కాని అదీ అస్తమించగానే "నా ప్రభువు

గనుక నాకు మార్గం చూపి ఉండకపోతే నేను మార్గభ్రష్టులలో కలిసిపోయి ఉండేవాణ్ణి" అన్నాడు. తరువాత అతను సూర్యుణ్ణి వెలుగుతూ చూసి "అసలు ఇది నా ప్రభువు, ఇది అందరికంటే పెద్దది" అని పలికాడు. కాని అది కూడా అస్తమించగానే ఇబ్రాహీము ఎలుగెత్తి ప్రకటిస్తూ "నా జాతి సోదరులారా! మీరు దైవానికి భాగస్వాములుగా నిలబెట్టే వాటన్నింటితో నాకు యేవిధమైన సంబంధమూ లేదు. నేను ఏకాగ్రతతో నా ముఖాన్ని భూమ్యాకాశాలను సృష్టించిన శక్తి వైపునకు త్రిప్పుకున్నాను. నేను షిర్కుకు పాల్పడేవాడిని కాను" అన్నాడు.

రుకూ 10 : మేము ఇబ్రాహీముకు ఉన్నతస్థానాన్ని ప్రసాదించాము. అతని సంతతిలో అనేక మంది ప్రవక్తలను సృష్టించాము. వారిలో ప్రతి ఒక్కరికి మేము భూలోక వాసులందరిపై ఘనత ప్రసాదించాము. ఇది అల్లాహ్ మార్గదర్శకత్వం. దాని ద్వారా ఆయన తన దాసులలో కోరిన వారికి మార్గం చూపుతాడు. కాని వారు గనుక షిర్కుకు పాల్పడి ఉన్నట్లయితే వారు చేసిన సమస్తం నాశనమై ఉండేది.

రుకూ 11 : ఈ గ్రంథాన్ని మేము అవతరింపజేశాము. ఎనలేని శుభాలు, మేళ్లు కలిగిన గ్రంథం. ఇది తనకు పూర్వం వచ్చిన వాటిని ధృవీకరిస్తుంది. ఈ పురముల కేంద్రం (మక్కా) లోను దాని చుట్టుపక్కల ఉండే వారిని దాని ద్వారా నీవు హెచ్చరిక చెయ్యటానికి ఇది అవతరింపచెయ్యబడింది. అబద్ధపు అపనింద సృష్టించి అల్లాహ్‌పై మోపేవాడికంటే పరమ దుర్మార్గుడెవడు? ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగితేలుతున్న దృశ్యాన్ని, దైవదూతలు తమ చేతులు చాచి "ఇటు తెండి, బయటకు తియ్యండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అపనింద మోపి అన్యాయంగా కూసిన కూతలకు, ఆయన ఆయతుల పట్ల తలబిరుసుతనం ప్రదర్శించినందుకు ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష తప్పదు" అంటున్న దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బావుండు. అప్పుడు అల్లాహ్ వారితో "మేము మొదటిసారి మిమ్మల్ని ఒంటరిగా సృష్టించినట్లే ఇపుడు ఇదిగో మీరు ఒంటరిగా మా ముందు హాజరయ్యారు. మేము ప్రపంచంలో మీకు ఇచ్చినదంతా మీరు అక్కడే వదలిపెట్టి వచ్చారు. ఇపుడు మిమ్మల్నేకాదు, మీ పనులు నెరవేరుస్తారని మీరు భావించిన సిఫారసుదారులను కూడా మేము చూడడం లేదు. ఇపుడు మీ మధ్య సంబంధాలు అన్నీ తెగిపోయాయి. ఎవరిని గురించి మీరు గర్వపడేవారో వారందరూ మీ నుంచి కనుమరుగయిపోయారు.

రుకూ 12 : విత్తనాన్ని, టెంకను చీల్చేవాడు అల్లాహ్, ఆయన నక్షత్రాలను, మీ కొరకు ఎడారి చీకటిలో, సముద్రపు చీకట్లలో మార్గాన్ని తెలుసుకొనే సాధనాలుగా చేశాడు. ఆయనే ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించాడు. దానితో సకల వృక్షజాతులను ఉద్భవింపజేశాడు. ఇంకా పచ్చని పొలాలను, పచ్చని చెట్లను సృష్టించాడు. ఒకదానిపై ఒకటి ఒత్తుగా పెరిగే గింజలను పండించాడు. ఖర్జూరపు పువ్వుల నుంచి బరువుగా వంగిన పండ్ల గుత్తులను సృష్టించాడు. ద్రాక్ష, జైతూను, దానిమ్మ తోటలను సృష్టించాడు. వాటి పండ్ల ఒకదానినొకటి పోలి ఉన్నప్పటికీ ప్రతిదాని ప్రత్యేకత వేర్వేరు. ఈ చెట్లు పంటకు వచ్చి, పండ్లు కాయడం, ఫలాలు పండడం, – ఈ స్థితిని కొంచెం ఆలోచనా దృష్టితో చూడండి. విశ్వసించే వారికి వీటిలో సూచనలు ఉన్నాయి. అయినా ప్రజలు జిన్నాతులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టారు.

రుకూ 13 : అల్లాహ్‌కు జీవిత సహచరి అంటూ ఎవరూ లేనప్పుడు ఆయనకు కొడుకు ఎలా ఉంటాడు? ఆయన ప్రతి వస్తువును పుట్టించాడు. చూపులు ఆయనను అందుకోలేవు. ఆయనే చూపులను అందుకొంటాడు. చూడండి! మీ వద్దకు ప్రభువు తరఫు నుంచి వివేచనా కాంతులు వచ్చేశాయి. కాబట్టి ఇక దృష్టిని ఉపయోగించుకునే వ్యక్తి తనకు తాను మేలు చేసుకోగలడు. గుడ్డిగా వ్యవహరించేవాడు నష్టపోతాడు. ముస్లిములారా! వారు అల్లాహ్‌ను కాదని ఆరాధించే ఇతరులను దూషించకండి. ఎందుకంటే, వారు షిర్కు కన్నా ఇంకా ముందుకు పోయి అజ్ఞానంతో అల్లాహ్‌ను దూషించవచ్చు.

రుకూ 14 : సత్యం రీత్యా, న్యాయం రీత్యా నీ ప్రభువు వాక్కు పరిపూర్ణమైనది. ఆయన ఆదేశాలను మార్చేవాడు ఎవడూ లేడు. ప్రవక్తా! భూమిపై నివసించే ప్రజలలో అధిక సంఖ్యాకులు చెప్పినట్లు నీవు గనుక నడిస్తే, వారు నిన్ను అల్లాహ్ మార్గం నుంచి తొలగిస్తారు., వారు కేవలం అంచనాలు అనుసరిస్తారు. ఊహా కల్పనలు చేస్తుంటారు. చాలా మంది ప్రజలు జ్ఞానం లేకపోయినా కేవలం తమ కోరికలకు లోనయి అపమార్గం పట్టించే విషయాలను మాట్లాడుతుంటారు. ఈ హద్దులు మీరే వారిని నీ ప్రభువు బాగా తెలిసినవాడు. మీరు బహిరంగ పాపాలకు దూరంగా ఉండండి. రహస్య పాపాలకు దూరంగా ఉండండి. పాపాలను సంపాదించుకునేవారు తమ ఈ సంపాదనకు ప్రతిఫలం పొంది తీరుతారు. అల్లాహ్ పేరుతో 'జిబహ్' చెయ్యబడని జంతువు మాంసం తినకండి.

రుకూ 15 : మొదట మృతునిగా ఉండి, మేము ప్రాణం పోసి, జ్యోతిని ప్రసాదించిన

తర్వాత ఆ వెలుగులో జీవన యాత్ర కొనసాగించే వ్యక్తి, చీకట్లలో కూరుకుపోయి వాటి నుంచి బయటకు రాలేని వ్యక్తి, ఈ ఇద్దరు వ్యక్తులు ఒకటే అవుతారా? అల్లాహ్ తాను సన్మార్గం చూపదలిచిన వ్యక్తి హృదయాన్ని ఇస్లామ్ కొరకు తెరుస్తాడు. తాను అపమార్గం పాలు చెయ్యదలిచిన వ్యక్తి హృదయాన్ని సంకుచితం చేసి ఎంతగా అదుముతాడంటే ఇస్లామ్ భావన రాగానే అతనికి తన ఆత్మ ఆకాశానికి ఎగిరిపోయినట్లు అనిపిస్తుంది. ఈ విధంగా అల్లాహ్ అవిశ్వాసులపై (సత్యాన్ని ద్వేషించే) మలినాన్ని రుద్దుతాడు. వాస్తవానికి ఈ మార్గం నీ ప్రభువు చూపిన రుజుమార్గం. దాని చిహ్నాలు హితబోధ స్వీకరించే వారికి స్పష్టం చేయబడ్డాయి.

రుకూ 16 : ప్రళయదినాన అల్లాహ్ ఇలా ప్రశ్నిస్తాడు. "జిన్నాతులారా! మానవులారా! మా ఆయతులను మీకు వినిపించి, ఈ రోజు గురించి హెచ్చరించే ప్రవక్తలు మీ వద్దకు స్వయంగా మీ నుంచే రాలేదా?" అని అడుగుతాడు. ప్రాపంచిక జీవితం తమను మోసానికి గురిచేసిందని, తాము అవిశ్వాసులమని స్వయంగా వారే తమకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాడు. నీ ప్రభువు ఎలాంటి అక్కర లేనివాడు. కరుణచూపడం ఆయన స్వభావం. ఒకవేళ ఆయన తలచుకుంటే మిమ్మల్ని తొలగించి మీ స్థానంలో తాను కోరిన వేరే ప్రజలను తీసుకువస్తాడు. ఆయన మిమ్మల్ని వేరే ప్రజల సంతతి నుంచి ఉద్భవింపజేసిన విధంగానే మీస్థానంలో వేరే ప్రజలను తీసుకురాగలడు. చాలా మంది ముష్రిక్కులకు సంతాన హత్య సరైనదిగా కనిపించేలా చేశారు వారు నమ్మిన భాగస్వాములు. అజ్ఞానం వల్ల మూర్ఖత్వం వల్ల సంతానాన్ని హత్యచేసిన వారు, అల్లాహ్ ఇచ్చిన ఉపాధిని అల్లాహ్‌పై అబద్ధాలు మోపి నిషేధించుకొన్నవారు. నిశ్చయంగా నష్టానికి గురి అయ్యారు.

రుకూ 17 : నిటారు చెట్లు గల పలు రకాల తోటలను, ద్రాక్ష తోటలను, ఖర్జూరపు తోటలను సృష్టించింది అల్లాహ్‌యే. పొలాలను పండించాడు. వాటి ద్వారా రకరకాల ఆహార పదార్థాలు లభిస్తాయి. జైతూను చెట్లను, దానిమ్మ చెట్లనూ ఉద్భవింపజేశాడు. వాటి పండ్లు రూపంలో ఒకేలా ఉన్నా రుచి వేరు. అవి పండినప్పుడు వాటి పంట తినండి. వాటి పంటను కోసేటప్పుడు మీపై ఉన్న అల్లాహ్ హక్కును చెల్లించండి. ఆయనే పశువులలో స్వారి చెయ్యడానికి, బరువు మొయ్యడానికి, తినడానికి, పరచుకోడానికి ఉపయోగపడే జంతువులను సృష్టించాడు. అల్లాహ్ మీకు ప్రసాదించిన వాటిని తినండి. షైతానును అనుసరించకండి. వాడు మీకు బహిరంగ శత్రువు. జ్ఞానం

లేకపోయినా ప్రజలను పెడమార్గం పట్టించే ఉద్దేశ్యంతో అబద్ధాన్ని కల్పించి దాన్ని అల్లాహ్‌కు ఆపాదించే వ్యక్తిని మించిన దుర్మార్గుడెవడు?

రుకూ 18 : ముష్రిక్కు జనులు మీ మాటలకు బదులుగా "అల్లాహ్ కోరినట్లయితే మేము, మా పూర్వీకులు షిర్కు చేసి ఉండేవారం కాదు. మేము దేన్నీ నిషేధించి ఉండే వారం కాదు" అంటారు. ఇలాంటి మాటలనే తరచూ కల్పిస్తూ వారికి పూర్వం ప్రజలు కూడా సత్యాన్ని తిరస్కరించారు. వారి వద్ద ఎలాంటి జ్ఞానమూ లేదు. కేవలం అంచనాలను అనుసరిస్తున్నారు. ఊహాగానాలు చేస్తున్నారు. మా ఆయతులను అసత్యాలుగా చిత్రీకరించి తిరస్కరించినవారు, పరలోకాన్ని నిరాకరించిన వారు ఇతరులను తమ ప్రభువుకు సమానులుగా నిలబెట్టిన వారు ఇలాంటి వారి కోరికలను నీవు ఎంతమాత్రము అనుసరించకు.

రుకూ 19: అల్లాహ్ విధించిన కట్టుబాట్లు ఇవి: 1) ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయరాదు. 2) తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించాలి. 3) పేదరికానికి భయపడి సంతానాన్ని హత్యచేయరాదు. మేము మీకు ఉపాధినిస్తున్నాము. వారికి కూడా ఇస్తాము. 4) అశ్లీల విషయాల దరిదాపులకు పోరాదు. అవి బహిరంగమైనవయినా సరే లేక గోప్యమైనవి అయినా సరే. 5) న్యాయంగా తప్ప అల్లాహ్ పవిత్రంగా నిర్ణయించిన యేప్రాణాన్ని హతమార్చరాదు. 6) అనాథలు వారు యుక్త వయసుకు చేరేవరకు వారి ఆస్తి దరిదాపులకు పోరాదు. 7) కొలతలో తూనికలో పూర్తి న్యాయం చెయ్యాలి. 8) పలికితే న్యాయమే పలకాలి. వ్యవహారం మీ బంధువులకు సంబంధించినది అయినా సరే. 9) అల్లాహ్‌తో చేసుకున్న ఒడంబడిక నెరవేర్చాలి. ఇంకా ఆయన ఇలా ఉద్బోధిస్తున్నాడు నా రుజుమార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి. వేరే మార్గాలపై నడవవద్దు.

రుకూ 20 : మీ ప్రభువు తరపు నుంచి మీ వద్దకు ఒక స్పష్టమైన ప్రమాణం, మార్గదర్శకత్వం, కారుణ్యం వచ్చేసింది. ఇక అల్లాహ్ ఆయతులు అసత్యాలని పలికేవాడి కంటే, వాటిపట్ల వైముఖ్యం ప్రదర్శించే వాడికంటే పరమ దుర్మార్గుడెవ్వడు? అల్లాహ్ వద్దకు సత్కార్యాలు తీసుకొని వచ్చే వానికి అంతకు పదింతలు ప్రతిఫలం ఉంది. దుష్కార్యాలు తీసుకొచ్చే వానికి అతడు ఎంత తప్పు చేశాడో అంతే ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ అన్యాయం ఎంతమాత్రం జరుగదు. ప్రవక్తా ఇలా చెప్పండి– నా నమాజ్,

నా సకల ఉపాసనా రీతులు, నా జీవనం, నా మరణం –సమస్తమూ సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు యే భాగస్వామి లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడింది. అందరికంటే ముందు విధేయతతో తలవంచేవాణ్ణినేనే." బరువు మోసే వాడెవ్వడూ ఇతరుల బరువు మొయ్యడు. చివరకు మీరంతా మీ ప్రభువు వైపునకు మరలిపోవలసి ఉంది. అప్పుడు ఆయన మీ విభేదాల యధార్థాన్ని మీకు విశదం చేస్తాడు.

7. అల్ ఆరాఫ్

రుకూ 1 : ఇది ఒక గ్రంథం. నీ (ప్రవక్త) వైపునకు అవతరింపజెయ్యబడింది. నీవు దాని ద్వారా తిరస్కారులను భయపెట్టడానికి, విశ్వాసుల హితోపదేశం కోసం ఇది అవతరింపజెయ్యబడింది. ప్రజలారా! మీ ప్రభువు తరపు నుంచి మీపై అవతరించిన దానిని అనుసరించండి. మీ ప్రభువును కాదని ఇతరులను అనుసరించకండి. మేము నాశనం చేసిన నగరాలు ఎన్నో ఉన్నాయి. వాటిపై మా శిక్ష రాత్రి సమయంలో హఠాత్తుగా విరుచుకుపడింది. లేదా పట్టపగలు వారు విశ్రాంతి తీసుకొంటూ ఉండగా వచ్చిపడింది. వారిపై మా శిక్ష వచ్చిపడినప్పుడు వారు "మేము నిజంగానే దుర్మార్గులం" అని రోదించడం తప్ప వారి నోటి నుంచి మరేమీ రాలేదు. ఆ రోజున సత్యమే బరువుగా ఉంటుంది. ఎవరి త్రాసుపళ్లాలు బరువుగా ఉంటాయో వారే సాఫల్యం పొందుతారు. ఎవరి త్రాసు పళ్లాలు తేలికగా ఉంటాయో వారు నష్టానికి తమనుతాము గురిచేసు కొన్నవారు. అల్లాహ్ ఆయతుల పట్ల వారు దుర్మార్గంగా ప్రవర్తించేవారు.

రుకూ 2 : ఆదముకు సాష్టాంగపడండి అని మేము దైవదూతలను ఆజ్ఞాపించాము. ఈ ఆదేశానుసారం అందరూ సాష్టాంగపడ్డారు. కాని ఇబ్లీసు సాష్టాంగపడలేదు. అప్పుడు అల్లాహ్ "నిన్ను ఆజ్ఞాపించినప్పటికి సాష్టాంగపడకుండా ఎందుకున్నావు?" అని ప్రశ్నించాడు. అతడు జవాబిస్తూ "నేను అతని కంటే గొప్పవాడిని. నీవు నన్ను అగ్నితో సృష్టించావు. అతణ్ణి మట్టితో" అన్నాడు. అప్పుడు అల్లాహ్ "సరే, అయితే ఇక్క ణ్ణుంచి క్రిందికి దిగు, ఇక్కడ నీ గొప్పతనాన్ని గురించి గర్వపడే హక్కు నీకు లేదు. వెళ్లిపో. పరాభవాన్ని కోరుకునే వారిలో నువ్వు ఒకడివి." అన్నాడు. అప్పుడు ఇబ్లీసు "వారందరూ మళ్లీ లేపబడే రోజు వరకు నాకు వ్యవధి నివ్వు" అనడిగి వ్యవధి పొందాడు. "నీవు నన్ను మార్గభ్రష్టత్వానికి గురిచేసినట్లు నేను కూడా నీ రుజుమార్గంపై

ఈ మానవుల కొరకు మాటు వేసి కూర్చుంటాను. వెనుక, ముందు, కుడి, ఎడమల అన్ని వైపుల నుంచి వారిని చుట్టుముట్టుతాను. వారిలో అధిక సంఖ్యాకులు కృతజ్ఞులుగా మిగలరు" అని చెప్పాడు. అప్పుడు అల్లాహ్ "వెళ్లిపో, నిన్ను అనుసరించే వారందరిలో నిన్ను కలిపి నరకాన్ని నింపుతాను" అన్నాడు.

రుకూ 3 : ఆదము సంతానమా! మేము మీపై దుస్తులు అవతరింపజేశాము. అవి మీరు సిగ్గుపడే మీ శరీర భాగాలను కప్పుతాయి. మీ శరీర రక్షణకు, శోభకు సాధనంగా ఉంటాయి. అయితే భయభక్తులనే దుస్తులే మంచి దుస్తులు. ఇది అల్లాహ్ సూచనలలోని ఒక సూచన. బహుశా ప్రజలు దీనిద్వారా గుణపాఠం నేర్చుకోవచ్చు. ఆదము సంతానమా, షైతాను మీ మాతపితరులను స్వర్గం నుంచి బహిష్కరింపజేశాడు. వారి వస్త్రాలను తొలగింపజేసి వారి మర్మాంగాలు ఒకరివి ఒకరికి బహిర్గతం అయ్యేలా చేశాడు. మిమ్మల్ని కూడా వాడు ఆపదకు గురిచెయ్యడం అనేది జరగరాదు. మీరు ప్రతి ఆరాధనలో దిక్కును సరిగ్గా అమర్చుకోండి. ఆయననే వేడుకోండి. మీ ధర్మాన్ని ఆయన కొరకు ప్రత్యేకం చేసుకొని ఆయననే ప్రార్థించండి. ఆదము సంతానమా, ప్రతీ ఆరాధన సమయంలో మీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి.

రుకూ 4 : ప్రవక్తా! వారిని అడగండి– "అల్లాహ్ తన దాసుల కొరకు సృష్టించిన వస్త్రాలను నిషేధించింది ఎవరు? అల్లాహ్ ప్రసాదించిన పరిశుద్ధ వస్తువులను నిషేధించింది ఎవరు? – ఈ వస్తువులన్నీ ఇహలోక జీవితంలో విశ్వాసుల కొరకే ఉన్నాయి. ప్రళయం నాడు ప్రత్యేకంగా వారి కొరకు మాత్రమే ఉంటాయి. ప్రభువు నిషేధించినవి– 1) సిగ్గుమాలిన పనులు – అవి బహిరంగమైనవికాని, గుప్తమైనవి కాని 2)పాపాలు 3) సత్యాన్ని అతిక్రమించడం 4) ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టడం 5) మీకు తెలియని విషయాన్ని మీరు అల్లాహ్ పేరు మీద చెప్పడం. ప్రతీ వర్గం అది నరకంలో ప్రవేశించేటప్పుడు తన పూర్వపు వర్గాన్ని శపిస్తూ ప్రవేశిస్తుంది. చివరకు వారంతా అక్కడకు చేరినప్పుడు ప్రతి వర్గమూ తన పూర్వపు వర్గాన్ని గురించి "ప్రభూ మమ్మల్ని మార్గభ్రష్టులుగా చేసింది వీళ్లే. కనుక వారికి రెట్టింపు అగ్నిశిక్ష విధించు" అంటారు. అందుకు జవాబుగా "ప్రతివాడికి రెట్టింపు శిక్షపడుతుంది."

రుకూ 5 : నమ్మండి మా ఆయతులను తిరస్కరించిన వారికి, వాటిపట్ల తలబిరుసుతనం ప్రదర్శించిన వారికి ఆకాశ ద్వారాలు ఎంతమాత్రం తెరువబడవు. సూరి రంధ్రం

గూండా ఒంటె పోవడం ఎంత అసంభవమో వారు స్వర్గంలోకి పోవడం కూడా అంతే అసంభవం. వారికి నరకమే పాన్పు. నరకమే దుప్పటి. మా ఆయతులను విశ్వసించి మంచి పనులు చేసిన వారు స్వర్గనివాసులు. అక్కడ వారు కలకాలం ఉంటారు. స్వర్గవాసులు నరకవాసులను పిలిచి "మా ప్రభువు మాకు చేసిన వాగ్దానాలన్ని సత్యమైనవిగా చూస్తున్నాము. మరి మీరు కూడా మీ ప్రభువు చేసిన వాగ్దానాలను సత్యమైనవిగా చూస్తున్నారా" అని ప్రశ్నిస్తారు. దానికి జవాబుగా వారు "అవును" అని పలుకుతారు. ఈ ఉభయ వర్గాల మధ్య ఒక తెర అడ్డుగా ఉంటుంది. దానిపైన (ఆరాఫ్ పై) మరికొందరు ప్రజలు ఉంటారు. వారు స్వర్గవాసులను పిలిచి మీకు శాంతి కలుగుగాక అంటారు. వారు ఇంకా స్వర్గంలోకి ప్రవేశించని వారు. కాని దానిని ఆశిస్తున్నవారు. వారి దృష్టి నరకవాసులపైకి మళ్లినప్పుడు "ప్రభూ మమ్మల్ని ఈ దుర్మార్గులలో చేర్చకు" అంటారు.

రుకూ 6 : ఈ ఆరాఫ్ ప్రజలు, అంటే స్వర్గ నరకాల మధ్య తెరపై ఎత్తయిన ప్రదేశాలలో ఉన్న వారు నరకంలో ఉన్న కొందరు పెద్ద మనుష్యులను గుర్తుపట్టి వారితో "చూశారా, మీ అనుచర వర్గాలుగాని, మీ ఆస్తిపాస్తులుగాని, ఈ రోజు మీకు యేవిధంగానూ ఉపయోగపడడం లేదు" అంటారు. నరకవాసులు స్వర్గవాసులతో "కాస్త జాలిపడి మాపై కొద్దిగా నీళ్ళు పోయండి, అల్లాహ్ మీకు ప్రసాదించిన ఆహారంలో కొంతైనా ఇటు విసరండి" వారు ఇలా సమాధానం చెబుతారు. "ఈ రెంటిని అల్లాహ్ సత్య తిరస్కారులకు నిషేధించాడు. తమ ధర్మాన్ని ఒక ఆటగా, ఒక కాలక్షేపంగా చేసుకున్నారు. ఇహలోక జీవితం వారిని మోసానికి గురిచేసింది" అనంటారు. మేము ఈ ప్రజల వద్దకు ఒక గ్రంథాన్ని తీసుకొని వచ్చాము. దానిని మేము జ్ఞానం ఆధారంగా సవివరమైనదిగా చేశాము. అది విశ్వాసులకు మార్గదర్శకత్వం. కారుణ్యం. గ్రంథం తెలియజేసే ఆ ముగింపు వచ్చే రోజున, దానిని నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన వారు తాము చేసిన పనికి వాపోతారు.

రుకూ 7 : అల్లాహ్ ఆకాశాలను, భూమిని ఆరు రోజులలో సృష్టించాడు. తర్వాత తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు. అల్లాహ్ అనంతమైన శుభాలు కలవాడు. సకల లోకాలకు ప్రభువు, స్వామి ఆయనే. విలపిస్తూ గోప్యంగా ప్రభువును వేడుకోండి. భూమిపై సంస్కరణ జరిగిన తర్వాత సంక్షోభాన్ని సృష్టించకండి. తన కారుణ్యానికి ముందుగా శుభవార్తలను మోసుకుపోయే వాయువులను పంపేది అల్లాహ్‌యే.

తరువాత ఆ వాయువులు వాటితో నిండిన మేఘాలను మోసుకొని పోయేటప్పుడు వాటిని అల్లాహ్ నిర్జీవంగా పడి ఉన్న ప్రదేశాల వైపునకు కదలిస్తాడు. అక్కడ వర్షం కురిపించి రకరకాల పండ్లను వెలికితీసుకొస్తాడు. చూడండి. ఈ విధంగా మేము మృతులను నిర్జీవ స్థితి నుంచి లేపుతాము. బహుశ ఇది చూసి అయినా మీరు గుణపాఠం నేర్చుకోవచ్చుని. ఇది ఒక సూచన. మంచి నేల తన ప్రభువు ఆదేశానుసారం పుష్కలంగా పంటనిస్తుంది. చెడ్డ నేలలో నాసిరకం పంట తప్ప మరేమీ పండదు.

రుకూ 5 : మేము నూహ్‌ను అతని జాతి వద్దకు పంపాము. ఆయన జాతిని ఉద్దేశించి "నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఒక భయంకరదినం నాటి శిక్ష విషయమై నేను మీ గురించి ఆందోళన చెందుతు న్నాను" అని చెప్పాడు. కాని ఆ జాతి తిరస్కరించింది. అపమార్గం పట్టిన మాటలు పలికింది. నూహ్ చాలా నచ్చచెప్పాడు. కాని వారు ఆయన మాటలు వినలేదు. చివరకు మేము ఆయనను, ఆయన సహచరులను ఒక పడవ ద్వారా విముక్తి కలిగిం చాము. సత్యాన్ని తిరస్కరించిన వారందరినీ మేము ముంచి వేశాము. నిశ్చయంగా వారు అంధ జనం.

రుకూ 9 : ఆద్ జాతి వద్దకు మేము వారి సోదరుడు హూద్‌ను పంపాము. ఆయన తన జాతిని ఉద్దేశించి 'నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మరొక దేముడు లేడు" అని ప్రకటించాడు. జాతి ప్రజలు ఆయన్ను తిరస్కరించారు. హూద్ వారికి నచ్చజెప్పాడు. "మీ ప్రభువు నూహ్ జాతి తర్వాత మిమ్మల్ని వారసులుగా చేశాడు. మీకు బలాధిక్యత ప్రసాదించాడు. కాబట్టి అల్లాహ్ శక్తి, మహిమలను జ్ఞాపకముంచుకోండి. మీరు సాఫల్యం పొందవచ్చు" అని చెప్పాడు. దానికి జవాబిస్తూ వాళ్లు "అల్లాహ్ ఒక్కడి కోసం మేము మా తాతముత్తాతలు పూజించిన దేముళ్లను వదలలేము" అన్నారు. చివరకు మేము మా కృపతో హూద్‌ను అతని అనుయాయు లను రక్షించాము. విశ్వసించని వారిని మేము సమూలంగా నావనం చేశాము.

రుకూ 10 : సమూద్ జాతి వద్దకు మేము వారి సోదరుడు సాలిహ్‌ను పంపాము. సాలిహ్ తన జాతిని ఉద్దేశించి "నా జాతి సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మరొక దేముడు లేడు. అల్లాహ్‌కు చెందిన ఈ ఆడ ఒంటె మీకొక సూచన వంటిది. దురుద్దేశంతో దాన్ని ముట్టుకోకండి. అల్లాహ్ ఆద్ జాతి తర్వాత మిమ్మల్ని వారసులుగా చేశాడు. మీకు భూమిపై ఆయన ఉన్నత స్థానాన్ని ప్రసాదించడం వల్ల

ఈ రోజు మీరు చదునైన మైదానాలలో మహోన్నత భవనాలు నిర్మిస్తున్నారు. కొండలను గృహాలుగా చెక్కుతున్నారు" అన్నాడు. కాని ఆద్ జాతి సర్దారులు తిరస్కరించారు. ఆ ఆడ ఒంటెను చంపివేశారు. చివరకు ఊపివేసే భయంకరమైన ఆపద వారిని చుట్టుముట్టింది. వారు తమ ఇళ్లల్లోనే బోర్లాపడి, పడినట్లే ఉండిపోయారు. అలాగే లూత్‌ను మేము ప్రవక్తగా చేశాము. ఆయన తన జాతితో "మీరు ఇంత సిగ్గులేని వారయిపోయారేంటి? మీకు పూర్వం ప్రపంచంలో ఎవ్వడూ చెయ్యని బూతుపని చేస్తున్నారు? స్త్రీలను వదలి పురుషులతో మీ కామాన్ని తీర్చుకుంటున్నారు" అని ప్రశ్నించారు. జాతి ఆయనకు శత్రువు అయిపోయింది. చివరకు మేము లూత్‌ను అతని ఇంటి వారిని - వెనుక ఉండి పోయే వారితో కలిసిపోయిన అతని భార్యను తప్ప - రక్షించాము. ఆ జాతిని నిర్మూలించాము.

రుకూ 11 : మేము మద్‌యను జాతి వద్దకు వారి సోదరుడు షుఐబ్‌ను పంపాము. అతను తన జాతిని ఉద్దేశించి "నా జాతి సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో దేముడు లేడు. తూకాన్ని, కొలతను పూర్తిగా పాటించండి. ప్రజలకు వారి వస్తువుల విషయంలో నష్టం కలిగించకండి. జ్ఞాపకం తెచ్చుకోండి మీరు అల్పసంఖ్యలో ఉన్న కాలాన్ని అల్లాహ్ మీ సంఖ్యను అధికం చేశాడు" అని బోధించాడు. కాని దురహంకారులైన ఆ జాతి సర్దారులు అతని మాటలు వినలేదు. ఊపివేసే ఒక పెద్ద ఆపద వారిని పట్టుకుంది. షుఐబ్‌ను తిరస్కరించి వారు -అసలక్కడ ఎన్నడూ నివసించని విధంగా తుడిచిపెట్టుకుపోయారు.

రుకూ 12 : ఆయా పాట్టణాల ప్రజలు విశ్వసించి భయభక్తుల వైఖరి అవలంభించి ఉంటే మేము వారి కోసం ఆకాశాలలోనూ, భూమిలోనూ శుభాల ద్వారాలు తెరిచే వాళ్లం. కాని వారు ధిక్కరించారు. మా శిక్ష రాత్రి సమయంలో వారు గాఢనిద్రలో ఉన్నప్పుడు అకస్మాత్తుగా వచ్చిపడదని నిర్భయంగా ఉన్నారా పట్టణాల ప్రజలు. లేక శక్తిమంతమైన మా హస్తం పగటివేళ వారు ఆడుకుంటున్నప్పుడు హఠాత్తుగా పడడం జరుగదని తృప్తిగా ఉన్నారా? ఏమిటి... ఈ ప్రజలు అల్లాహ్ ఎత్తుగడ అంటే నిర్భయంగా ఉన్నారా?

రుకూ 13 : మేము మీకు వినిపిస్తున్న గాథలకు సంబంధించిన ఈ జాతుల ప్రజల వద్దకు ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు తీసుకొని వచ్చారు. కాని వారు తిరస్కరించడమే

తప్పు అంగీకరించలేదు. వారిలో చాలామంది తమ వాగ్దానం పట్ల గౌరవం లేని వారు. చాలామంది దుర్మార్గులే. మూసాను మా సూచనలతో ఫిరౌను వద్దకు అతని జాతి సర్దారుల వద్దకు పంపాము. వారిని సత్యం వైపునకు పిలిచాము. "ఇస్రాయీలు సంతానాన్ని తనతో పంపమని మూసా ఫిరౌనును అడిగాడు. ఫిరౌను మూసాను నిదర్శనాలు చూపవలసిందిగా కోరినపుడు మూసా తనకు అల్లాహ్ ప్రసాదించిన నిదర్శనాలు చూపారు.

రుకూ 14 : ఫిరౌను జాతి సర్దారులు మూసాను మహానైపుణ్యంగల మాంత్రికుడని అన్నారు. ఫిరౌను తన దేశంలోని మాంత్రికులు అందరినీ పిలిపించాడు. వారికి మంచి ప్రతిఫలం, రాజదర్బారులో స్థానం ఇస్తానన్నారు. వారు మూసాతో పోటీకి దిగారు. వారు తమ పాచికలు విసరి చూపులను మంత్రముగ్ధం, హృదయాలను భీతావహం చేశారు. హజ్రత్ మూసా అల్లాహ్ ఆజ్ఞతో తన చేతికర్రను విసిరారు. తృటిలో అది వారి బూటకపు మాయాజాలాన్ని మింగివేసింది. ఇది చూసి మాంత్రికులు సాష్టాంగ పడ్డారు. "మేము విశ్వసించాము సకల లోకాల ప్రభువును. మూసా, హారూనులు విశ్వసిస్తున్న ప్రభువును" అని ప్రకటించారు. ఫిరౌను కోపంగా "మీ చేతులను కాళ్లను వ్యతిరేక దిశలలో నరికిస్తాను. మీ అందర్ని శిలువ ఎక్కిస్తాను" అన్నాడు. "ఎట్టి పరిస్థితిలోనూ మేము మరలవలసింది ప్రభువు వైపునకే" అన్నారు వాళ్ళు.

రుకూ 15 : ఫిరౌనును అతని జాతి సర్దారులు మూసాకు వ్యతిరేకంగా ఉసిగొల్పారు. అప్పుడు ఫిరౌను "నేను వారి కుమారులను చంపిస్తాను. స్త్రీలను బ్రతకనిస్తాను" అన్నాడు. మూసా తన జాతివారితో "అల్లాహ్‌ను సహాయం కోసం అర్థించండి. ఓర్పు వహించండి. భూమి అల్లాహ్‌ది. తన దాసులలో తాను కోరినవారిని భూమికి వారసులుగా ఆయన చేస్తాడు. అంతిమ సాఫల్యం అల్లాహ్‌కు భయపడుతూ పని చేసేవారికే" అని బోధించాడు.

రుకూ 16 : మేము ఫిరౌను ప్రజలను అనేక సంవత్సరాల వరకు కరువుకు, పంటల కొరతకు గురిచేశాము. మేము వారిపైకి తుఫానులు పంపాము. మిడుతల దండులు వదిలాము. వేలు వ్యాపింపజేశాము. కప్పలను వదిలాము. రక్తం కురిపించాం. వారిపై ఆపద అవతరించినప్పుడల్లా వారు మూసాతో నీ ప్రభువును ప్రార్థించి ఆపద తొలగేలా చెయ్యమని కోరేవారు. కాని మేము మా శిక్షను ఒక నిర్ణీత కాలం వరకు తొలగించి నప్పుడు వారు తమ వాగ్దానం నుంచి మరలిపోయేవారు. అప్పుడు మేము వారికి

ప్రతీకారం చేశాము. వారిని సముద్రంలో ముంచివేశాం. ఇంకా, బలహీనులుగా చెయ్యబడిన వారిని మేము వారి స్థానంలో ఆ భూభాగం తూర్పుపడమరలకు వారసులుగా చేశాం. ఇస్రాయీలు సంతతి సముద్రం దాటుతూ మార్గమధ్యంలో విగ్రహాలను ఆరాధ్యదైవాలుగా చేసుకుందామని మూసాను కోరారు. మూసా ఈ కోరిక విని కోపంగా మీ కొడుకులను చంపి స్త్రీలను బ్రతకనిచ్చిన రాజు నుంచి అల్లాహ్ మీకు ఇప్పుడే విముక్తి ప్రసాదించాడు అని గుర్తు చేశారు.

రుకూ 17 : మేము మూసాను (సినాయ్ కొండపైకి) నలభై రేయింబవళ్ల కోసం పిలిచాము. మూసా వెళుతూ తన సోదరుడు హారూనును తన స్థానంలో నియమించాడు. ప్రభువు అతనితో సంభాషించాడు. అప్పుడు మూసా అల్లాహ్‌తో "ప్రభూ! నా చూపులకు బలాన్ని ప్రసాదించు నిన్ను చూస్తాను" అని వేడుకున్నాడు. అందుకు అల్లాహ్ "నీవు నన్ను చూడలేవు. నీ ముందున్న ఆ కొండవైపునకు చూడు, అది తన స్థానంలో స్థిరంగా ఉంటే అప్పుడు నీవు నన్ను చూడగలవు" అన్నాడు. అతని ప్రభువు ఆ కొండపై తన తేజస్సు ప్రసరింపజేసి దానిని భస్మం చేశాడు. మూసా స్పృహతప్పి పడిపోయాడు. తెలివి వచ్చిన తర్వాత అల్లాహ్ ఆయనతో "మేము నిన్ను ప్రవక్తగా ఎన్నుకున్నాము. నీతో మాట్లాడాము. నేనిచ్చే దానిని తీసుకో. కృతజ్ఞతలు తెలుపు" అన్నాడు. తరువాత మూసాకు జీవితంలోని ప్రతి రంగానికి కావలసిన హితబోధను, ప్రతి వ్యవహారానికి సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని శిలాఫలకాలపై రాసి ఇవ్వడం జరిగింది. "ఈ ఉపదేశాలను నీ చేతలతో గట్టిగా పట్టుకో. వాటి ఉత్తమ భావాలను అనుసరించ మని నీ జాతి వారిని ఆజ్ఞాపించు" అని చెప్పడం జరిగింది.

రుకూ 18 : మూసా వెళ్లిన తర్వాత అతని జాతి ప్రజలు తమ ఆభరణాలతో ఒక ఆవుదూడ విగ్రహాన్ని తయారు చేశారు. దాన్ని ఆరాధ్యదైవంగా చేసుకున్నారు. మూసా తన జాతి ప్రజలపై ఆగ్రహించాడు. బాధ పడ్డాడు. శిలాఫలకాలను విసరివేశాడు. తన సోదరుడు హారూను తలవెంట్రుకలు పట్టుకుని గుంజాడు. హారూను పరిస్థితి వివరించాడు. "నీవు శత్రువులకు నన్ను చూసి నవ్వే అవకాశం ఇవ్వకు. ఈ దుర్మార్గుల ముఠాతో నన్ను కలపకు" అన్నాడు. అప్పుడు మూసా అల్లాహ్‌తో "ప్రభూ! నన్నూ, నా సోదరుణ్ణి క్షమించు. మమ్మల్ని నీ కారుణ్యంలో ప్రవేశింపజెయ్యి" అని వేడుకున్నారు.

రుకూ 19 : కోపం చల్లారిన పిమ్మట మూసా ఆ శిలాఫలకాలను తన చేతుల్లోకి తీసు

కున్నాడు. వాటి రాతలో ప్రభువుకు భయపడే వారికి మార్గదర్శకతమూ, కారుణ్యమూ ఉన్నాయి. మేము నిర్ణయించిన సమయానికి హాజరు కావడానికిగాను మూసా తన జాతి ప్రజల నుంచి డెబ్బైమందిని ఎన్నుకున్నాడు. వారిని ఒక తీవ్ర భూకంపం వచ్చి పట్టుకున్నప్పుడు అల్లాహ్‌ను మొరపెట్టుకొంటూ "స్వామి, మీరు తలచుకుంటే మొదట్లోనే వీళ్లను, నన్ను నాశనం చేయగలిగి ఉండేవారు. మాలోని కొందరు అజ్ఞానులు చేసిన తప్పుకు అందరిని నాశనం చేస్తారా? మమ్మల్ని క్షమించండి. మాపై దయచూపండి. మేము మీ వైపునకే మరలాము" అని వేడుకున్నారు. అందుకు సమాధానంగా అల్లాహ్ "శిక్షను నేను కోరిన వారికే విధిస్తాను. కాని నా కారుణ్యం ప్రతి వస్తువును ఆవరించి ఉంది. నా పట్ల అవిధేయతకు దూరంగా ఉండేవారికి, జకాత్ ఇచ్చేవారికి, నా ఆయతులను విశ్వసించే వారికి నేను దానిని రాస్తాను" అన్నాడు. చదువనూ, రాయనూ రాని ఈ ప్రవక్త మంచిని ఆజ్ఞాపిస్తాడు, చెడు నుంచి నిరోధిస్తాడు. పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతం చేస్తాడు. అపరిశుద్ధమైన వాటిని నిషిద్ధం చేస్తాడు. వారిపై మోపబడి ఉన్న బరువులను దించుతాడు. వారు బంధింపబడి ఉన్న శృంఖలాలు తెంచుతాడు.

రుకు 20 : విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను- ఈ ప్రవక్త అల్లాహ్‌ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు - అతనిని అనుసరించండి. మీరు సరియైన మార్గం పొందగలరు. మేము మూసా జాతిని పన్నెండు వంశాలుగా విభజించి వాటిని శాశ్వత వర్గాలుగా చేశాము. ఒక కొండరాయి నుంచి 12 ఊటలు, ప్రతి వర్గానికి ఒక్కో ఊట చొప్పున వెలువరించాము. మేము వారిపై మేఘాల నీడ కల్పించాము. వారిపై 'మన్న్' 'సల్వా' లు దింపాము. అయితే వారిని "ఈ పట్టణంలోకి పోయి నివసించండి. మీ ఇష్టప్రకారం ఆహారం పొందండి. సాష్టాంగపడుతూ పట్టణ ద్వారంలో ప్రవేశించండి" అని ఆదేశించినపుడు వారిలోని దుర్మార్గులు మా ఆజ్ఞను మార్చివేశారు. వారి దుర్మార్గానికి ఫలితంగా మేము వారిపై ఆకాశం నుంచి శిక్ష దింపాము.

రుకూ 21 : సముద్రపు గట్టున ఒక పట్టణం ఉండేది. అక్కడి ప్రజలు సబ్బత్ రోజున దేవుని ఆజ్ఞలు ఉల్లంఘించేవారు. ఒక వర్గం వారిని పనులు చేయవద్దని వారించేది. అయితే రెండో వర్గం మాత్రం "అల్లాహ్ కఠినంగా శిక్షించేవారికి, నాశనం చేసేవారికి

మీరు హితబోధ ఎందుకు చేస్తున్నారు?" అని ప్రశ్నించేది. అందుకు జవాబుగా మొదటి వర్గం "మేము ప్రభువు ముందు క్షమించబడడానికి ఇదంతా చేస్తున్నాము. ఈ ప్రజలు అల్లాహ్ పట్ల అవిధేయతకు దూరంగా ఉంటారనే ఆశతో చేస్తున్నాము" అనేవారు. చెడు నుంచి ప్రజలను వారించే వారిని మేము రక్షించాము. దుర్మార్గులైన ఇతరులు అందరిని వారి అవిధేయత కారణంగా కఠినశిక్షకు గురిచేశాము. కోతులుగా మార్చి వేశాము. నా ప్రభువు ఇలా ప్రకటించాడు, "ప్రళయదినం వరకు ఇస్రాయీలు సంతతిని తీవ్ర యాతనలకు గురిచేసే ప్రజల అదుపులో ఉండేలా చేస్తాము."

పూర్వపు తరాల తర్వాత అయోగ్యులైన వారు వారికి వారసులయ్యారు. వారు దైవగ్రంథానికి వారసులై కూడా తుచ్ఛమైన ఐహిక ప్రయోజనాలను సేకరించ సాగారు. క్షమించబడతామని అనుకునేవారు, గ్రంథాన్ని పాటించే నమాజును స్థాపించే సద్వర్తనుల ప్రతిఫలాన్ని మేము నిశ్చయంగా వ్యక్తం చేయము.

రుకూ 22 : నీ ప్రభువు ఆదము సంతతి పాపుల నుంచి వారి సంతానాన్ని తీసి, వారినే వారికి సాక్షులుగా నిలబెట్టి "నేను మీ ప్రభువును కాదా?" అనడిగాడు. వారంతా "నిశ్చయంగా మీరే మా ప్రభువు. మేము దానికి సాక్ష్యమిస్తున్నాము" అన్నారు. మేము ఇలా ఎందుకు చేశామంటే ప్రళయదినంనాడు "మాకు ఈ విషయం తెలియదు" అని చెప్పే అవకాశం మీకు ఉండరాదని, లేదా షిర్కును మా తాతముత్తాతలు మా కన్నా ముందే ప్రారంభించారు. మేము వారి సంతతికి జన్మించాము. దుర్జనులు చేసిన నేరానికి మీరు మమ్మల్ని పట్టుకుంటారా? అని అడిగే అవకాశం మీకు ఉండరాదని అల్లాహ్ ఆయతుల జ్ఞానం కలిగి ఉండి, తన మనోవాంఛలనే అనుసరించేవాని పరిస్థితి కుక్కవంటిది. మీరు దానిపై దాడి చేసినప్పుడు కూడా అది నాలుక వెళ్లబెట్టుతూ తిరుగుతుంది. వారికి హృదయాలున్నాయి కాని వాటితో ఆలోచించరు. కళ్లున్నాయి కాని వాటితో చూడరు. చెవులున్నాయి కాని వినరు. వారు జంతువులవంటి వారు. కాదు అంతకన్నా హీనం.

రుకూ 23 : మా ఆయతులు అసత్యాలని తిరస్కరించిన వారిని మేము వారికి యేమాత్రం తెలియని విధంగా క్రమేణా వినాశం వైపునకు తీసుకునిపోతాము. వారు భూమ్యాకాశాలు పనిచేసే తీరు గురించి ఎప్పుడు యోచించలేదా? అల్లాహ్ సృష్టించిన యేవస్తువును వారు కళ్లు తెరచి చూడలేదా! బహుశా వారి జీవితపు గడువు పూర్తి

అయ్యే సమయం ఆసన్నమయ్యిందనే విషయాన్ని గురించి కూడా వారు ఆలోచించలేదా! అల్లాహ్ తన మార్గదర్శకత్వం నుంచి దూరం చేసిన వ్యక్తికి మరొక మార్గదర్శకుడు ఎవడు లేడు. ప్రవక్తా! వారికి చెప్పండి, "నాకు సంబంధించిన లాభనష్టాలపై నాకు యేమాత్రం అధికారం లేదు. అల్లాహ్ కోరింది మాత్రమే జరుగుతుంది. నాకే గనుక అగోచర విషయజ్ఞానం ఉన్నట్లయితే నేను ఎన్నో ప్రయోజనాలను పొంది ఉండేవాణ్ణి. నాకు ఎన్నటికీ యేనష్టమూ వాటిల్లేది కాదు."

రుకూ 24 : భార్యాభర్తలు కలిసి తమ ప్రభువైన అల్లాహ్‌ను వేడుకుంటూ "నీవు గనక మాకు మంచి పిల్లవాణ్ణి ఇచ్చినట్లయితే మేము నీకు కృతజ్ఞులం అవుతాము." అన్నారు. అప్పుడు అల్లాహ్ వారికి ఒక చక్కని యే లోపం లేని పిల్లవాణ్ణి ప్రసాదించాడు. కాని వారు అల్లాహ్ ప్రసాదించిన ఈ కానుక విషయంలో ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టసాగారు. అల్లాహ్‌ను కాదని మీరు మొరపెట్టుకుంటున్న వారు కూడా మీ మాదిరిగా కేవలం దాసులే. వారికి నడవడానికి కాళ్ళు ఉన్నాయా? పట్టుకోడానికి చేతులు ఉన్నాయా? చూడ్డానికి కళ్లున్నాయా? వినడానికి చెవులున్నాయా? మీరు అల్లాహ్‌ను కాదని వేడుకుంటున్న ఇతరులు మీకు సహాయం చేయలేరు. స్వయంగా తమను తాము సహాయం చేసుకోలేరు. ప్రవక్తా! మృదువైఖరి, మన్నింపు వైఖరి అవలంబించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులతో వాదానికి దిగకు. ఒకవేళ ఎప్పుడైనా షైతాను నిన్ను ఉసిగొల్పితే అల్లాహ్ శరణు వేడు. దివ్యఖురాను మీముందు పఠించబడుతూ ఉన్నప్పుడు దానిని శ్రద్ధగా వినండి. మౌనంగా ఉండండి. మీరు కూడా కరుణించబడవచ్చు.

8. అన్‌ఫాల్

రుకూ 1 : మీరు అల్లాహ్‌కు భయపడండి. మీ పరస్పర సంబంధాలను సంస్కరించుకోండి. మీరు గనుక విశ్వాసులే అయితే అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయత చూపండి. నిజమైన విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావన విన్నంతనే భయంతో కంపిస్తాయి. వారి సమక్షంలో అల్లాహ్ ఆయతులు పారాయణం చెయ్యబడినపుడు వారి విశ్వాసం పెరుగుతుంది. వారు తమ ప్రభువు పట్ల నమ్మకం కలిగి ఉంటారు. వారు నమాజును స్థాపిస్తారు. వారికి మేమిచ్చిన దాని నుంచి మా మార్గంలో ఖర్చు

పెడతారు. వారే నిజమైన విశ్వాసులు – బదర్ యుద్ధం గురించి విశ్లేషిస్తూ ఇలా చెప్ప బడింది. మీకు బలహీనమైన వర్గం తారసపడాలని మీరు కోరుకున్నారు. కాని, సత్యం యొక్క సత్యతను నిరూపించాలని, అవిశ్వాసులను సమూలంగా నాశనం చేయాలని అల్లాహ్ సంకల్పించాడు. సత్యం సత్యంగా రూఢికావాలి. అసత్యం అసత్యంగా రుజువు కావాలి. అందుకే మీ సహాయం కొరకు వెయ్యిమంది దైవదూతలను పంపుతానని అల్లాహ్ వాగ్దానం చేశాడు.

రుకూ 2 : ఆయన మిమ్మల్ని పరిశుద్ధపరచాలని, మీ పాదాలను సుస్థిరం చేయాలని ఆకాశం నుంచి మీపై నీళ్లను వర్షింపచేస్తూ ఉన్నాడు. సమయం వచ్చినప్పుడు మీ ప్రభువు దైవదూతలతో అవిశ్వాసుల మెడలపై కొట్టండని, కీలుకీలుపై కొట్టండని సంజ్ఞ చేశాడు. విశ్వాసులారా! మీరు అవిశ్వాసుల సైన్యాన్ని ఎదుర్కొంటే వారికి వెన్ను చూపకండి. అటువంటి సమయంలో వెన్నుచూపేవాడు అల్లాహ్ ఆగ్రహంలో చిక్కు కుంటాడు. యధార్థం ఏమిటంటే, యుద్ధంలో మీరు వారిని చంపలేదు. అల్లాహ్ వారిని చంపాడు. ప్రవక్తా! నీవు కంకర విసరలేదు. అల్లాహ్ విసిరాడు. అల్లాహ్ అవిశ్వాసుల వ్యవహారాలను బలహీనపరుస్తాడు.

రుకూ 3 : విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపండి. ఆజ్ఞ విన్న తర్వాత దాని నుంచి మరలకండి. బుద్ధిని ఉపయోగించని చెవిటివారు, మూగవారు మాత్రమే అల్లాహ్ దృష్టిలో నీచాతినీచమైన కోవకు చెందిన జంతువులు. విశ్సఇంచిన ప్రజలారా! అల్లాహ్ పిలుపునకు ఆయన ప్రవక్త పిలుపునకు జవాబు పలకండి. ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దాని వైపునకు పిలిచినపుడు, తెలుసుకోండి అల్లాహ్ వైపునకే మీరు పోగుచేయబడతారు. ఆ ఉపద్రవం నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. దానివల్ల కలిగే హాని ప్రత్యేకంగా మీలో పాపం చేసిన వారికే పరిమితమై ఉండదు. బుద్ధిపూర్వకంగా అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు నమ్మకద్రోహం చెయ్యకండి. మీ అమానతుల విషయంలో ద్రోహానికి పాల్పడకండి. మీ సంపద మీ సంతానం వాస్తవానికి పరీక్షా సాధనాలనీ, అల్లాహ్ వద్ద ప్రతిఫలంగా ఇవ్వడానికి కావలసినంత ఉందని తెలుసుకోండి.

రుకూ 4 : విశ్వసించిన ప్రజలారా! మీరు గనుక భయభక్తులు అవలంభిస్తే అల్లాహ్ మీకు గీటురాయి ప్రసాదిస్తాడు. మీ నుంచి మీ చెడులను దూరం చేస్తాడు. మీ

తప్పులను మన్నిస్తాడు. వారు తమ ఎత్తులు వేస్తున్నారు. అల్లాహ్ తన ఎత్తు వేస్తు ఉన్నాడు. అల్లాహ్ అందరికంటే బాగా ఎత్తులు వేస్తాడు. ప్రజలు క్షమాభిక్ష అర్థిస్తూ ఉంటే వారిని శిక్షించడం అల్లాహ్ సంప్రదాయం కాదు. మస్జిదెహరామ్‌కు ధర్మసమ్మత మైన ముతవల్లీలు (ధర్మకర్తలు) కేవలం భయభక్తులు కలవారు మాత్రమే. అల్లాహ్ మాలిన్యాన్ని పరిశుద్ధత నుంచి వేరుచేయడానికి, అన్ని రకాల మాలిన్యాలను కలిపి ఒకచోట పోగుచెయ్యడానికి, తరువాత ఆ కుప్పను నరకంలో పడవెయ్యడానికి అవిశ్వాసులు పోగుచేయబడి నరకం వైపునకు తరుమబడతారు.

రుకూ 5 : విశ్వసించిన ప్రజలారా! పీడన యేమాత్రం మిగలనంతవరకు అల్లాహ్ నిర్ణయించిన ధర్మం పూర్తిగా నెలకొల్పబడే వరకు, అవిశ్వాసులతో యుద్ధం చెయ్యండి. – బదర్ యుద్ధం గురించి ప్రస్తావిస్తూ –నశించవలసిన వాడు స్పష్టమైన నిదర్శనాలతో నశించాలని, జీవించవలసిన వాడు స్పష్టమైన నిదర్శనంతో జీవించాలని అల్లాహ్ తీసుకొన్న నిర్ణయం ప్రకారమే అంతా జరిగింది. నిశ్చయంగా అల్లాహ్ వినేవాడు, తెలిసినవాడు. జ్ఞాపకం తెచ్చుకోండి, యుద్ధ సమయంలో అల్లాహ్ మీ దృష్టికి శత్రువులను కొద్దిమందిగా చూపాడు. జరుగవలసి ఉన్న దానిని అమలులోకి తీసుకురావడానికి అల్లాహ్ అలా చేశాడు. చివరకు అన్నీ వ్యవహారాలు ఆయన వద్దకే మరలి పోతాయి.

రుకూ 6 : విశ్వాసులారా! మీరు ఒక వర్గాన్ని ఎదుర్కొన్నప్పుడు ధైర్యంగా ఉండండి. అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపండి. పరస్పరం కలహించుకోకండి. అలాచేస్తే మీలో బలహీనత ప్రవేశిస్తుంది. మీ శక్తిసన్నగిల్లిపోతుంది. యుద్ధానికి ముందు షైతాన్ వారిని ఉసిగొల్పుతూ "నేడు మిమ్మల్ని ఎవరూ జయించలేడు. నేను మీతో ఉన్నాను" అన్నాడు. కాని రెండు పక్షాలు ఎదురెదురు అయినప్పుడు మడమ తిప్పాడు. "మీకు నాకు యే సంబంధమూ లేదు. మీరు చూడనివి యెన్నో నేను చూస్తున్నాను నాకు అల్లాహ్ అంటే భయం కలుగుతోంది" అన్నాడు.

రుకూ 7: కపటులూ, హృదయాలకు రోగం తగిలినవారు "వారిని వారి ధర్మం పిచ్చివాళ్ళు చేసింది" అని అన్నారు. ఒక జాతి తన నడవడికను మార్చుకోనంత వరకు అల్లాహ్ దానికి ప్రసాదించిన ఏ అనుగ్రహాన్ని ఉపసంహరించడు. పూర్వపు జాతుల వారికి జరిగిందంతా ఈ నియమం ప్రకారమే జరిగింది. వారు తమ ప్రభువు

ఆయతులను తిరస్కరించారు. అప్పుడు వారి పాపాలకు ఫలితంగా మేము వారిని నాశనం చేశాము. వారందరూ దుర్మార్గులే. సత్యాన్ని అంగీకరించడానికి తిరస్కరించి, ఇక ఎట్టిపరిస్థితిలోనూ దానిని అంగీకరించడానికి సిద్ధపడనివారు. నిశ్చయంగా భూమిపై సంచరించే ప్రాణులన్నింటిలోకెల్లా, అల్లాహ్ దృష్టిలో మిక్కిలి నీచమైన వారు. ముస్లిములతో ఒప్పందం కుదుర్చుకొని ఉల్లంఘించిన వారు రణరంగంలో ఎదురైతే, వారికి ఎలా బుద్ధిచెప్పాలంటే వారి తరువాత అదే వైఖరి అవలంభించనున్న ప్రజలు భయభ్రాంతులై పారిపోవాలి.

రుకూ 8 : మీరు మీ శక్తి మేరకు అత్యధిక బలాన్నీ, కట్టివేసి సిద్ధంగా ఉన్న గుర్రాలను వారిని ఎదుర్కోడానికి సమాయత్తపరచుకోండి. ఆ విధంగా అల్లాహ్ శత్రువులనూ మీ శత్రువులను, ఇంకా మీకు తెలియని, అల్లాహ్‌కు మాత్రమే తెలిసిన ఇతర శత్రువులను భయకంపితులు చెయ్యండి. శత్రువు గనక సంధీ, శాంతుల వైపునకు మొగ్గు చూపితే, నీవు కూడా దానికి సిద్ధపడు. ఇంకా ముస్లిముల మనస్సులను ఒకదానితో ఒకటి కలిపిన వాడు ఆయనేకదా! నీవు సమస్త భూ సంపదను ఖర్చుపెట్టినా వారి మనస్సు లను కలుపగలిగి ఉండేవాడవు కాదు. కాని అల్లాహ్ వారి మనస్సులను కలిపాడు.

రుకూ 9 : ప్రవక్తా! ముస్లిములను యుద్ధానికి పురికొలుపు. మీలో కనుక ఇరవైమంది ధైర్యం కలవారు ఉంటే, వారు రెండువందల మందిని జయిస్తారు. ఇంకా అటువంటి వారు వందమంది గనుక ఉంటే వేయిమంది సత్యతిరస్కారులను జయిస్తారు. మీలో బలహీనత ఉంటే, వందమంది సహనస్థయిర్యాలు కలవారు రెండువందల మందిని, ఇంకా అటువంటి వారు వేయిమంది ఉంటే రెండువేల మందిని అల్లాహ్ ఆదేశాను సారం జయించగలరు. ధరణిలో శత్రువులను పూర్తిగా అణచనంత వరకు, తన వద్ద యుద్ధ ఖైదీలను ఉంచుకోవడం యే ప్రవక్తకూ తగదు.

రుకూ 10 : విశ్వాసాన్ని స్వీకరించి వలస పోయిన వారూ, అల్లాహ్ మార్గంలో తమ ప్రాణాలనూ తమ సంపదలనూ ఒడ్డిపోరాడినవారూ వలస వచ్చిన వారికి ఆశ్రయమిచ్చి సహాయం చేసినవారూ– వీరే నిజానికి ఒకరికొకరు స్నేహితులు. ఇక విశ్వసించి నప్పటికీ (దారుల్ ఇస్లాంలోకి) వలస రానివారు, వలస రానంతవరకు వారి సంరక్షణతో మీకు సంబంధం లేదు. ఒకవేళ వారు ధర్మ వ్యవహారాలలో మీ సహాయం

కోరితే వారికి సహాయం చెయ్యడం మీ విద్యుక్త ధర్మం. అల్లాహ్ గ్రంథం ప్రకారం రక్తసంబంధం కలవారు పరస్పరం ఎక్కువ హక్కుదారులు. నిశ్చయంగా అల్లాహ్‌కు ప్రతి విషయం తెలుసు.

9. అత్ తౌబా

రుకూ 1 : పెద్ద హజ్ రోజున సమస్త ప్రజలకు అల్లాహ్ తరఫు నుంచి ఆయన ప్రవక్త తరఫు నుంచి చేయబడే బహిరంగ ప్రకటన ఏమిటంటే - అల్లాహ్ ముష్రిక్కులకు యేవిధంగానూ బాధ్యుడు కాడు, అదే విధంగా ఆయన ప్రవక్త కూడా బాధ్యుడు కాడు. మీరు గనుక ఇప్పుడు పశ్చాత్తాపపడితే అది మీకే మేలు. ఒకవేళ విముఖులైతే మీరు అల్లాహ్‌ను అశక్తునిగా చేయలేరు. ప్రవక్తా! తిరస్కరించే వారికి కఠినశిక్ష గురించి వినిపించు. నిషిద్ధ మాసాలు గడిచిపోయిన తర్వాత ముష్రిక్కులను హతమార్చండి. ఎక్కడ కనిపిస్తే అక్కడ, వారిని పట్టుకోండి, చుట్టుముట్టండి. ప్రతి మాటు వద్ద వారి కొరకు పొంచి కూర్చోండి. తరువాత ఒకవేళ వారు పశ్చాత్తాప పడితే, నమాజు స్థాపిస్తే, జకాతు ఇస్తే వారిని విడిచిపెట్టండి. ఒకవేళ ముష్రిక్కులలో ఏ వ్యక్తి అయినా శరణుగోరి మీ వద్దకు రాదలిస్తే (అల్లాహ్ గ్రంథాన్ని వినడానికి) అతడు అల్లాహ్ గ్రంథం వినే వరకు అతనికి శరణు ఇవ్వండి.

రుకూ 2 : ఈ ముష్రిక్కులకు అల్లాహ్ వద్ద ఆయన సందేశహరుని వద్ద ఒడంబడిక అనేది ఎలా సాధ్యం. - వారు మీపై ప్రాబల్యం వహించినపుడు మీ విషయంలోఏ బంధుత్వాన్నీ లెక్కచెయ్యరు. యే ఒడంబడిక బాధ్యతనూ ఖాతరు చెయ్యరు. నోటి మాటలతో మిమ్మల్ని సమాధానపరచటానికి ప్రయత్నిస్తారు. ఇది వారి పరిస్థితి. వారు అల్లాహ్ ఆయతులను అల్పధరకు విక్రయించారు. అల్లాహ్ మార్గంలో అవరోధాలుగా నిల్చున్నారు. అతి క్రమణకు పాల్పడింది ఎల్లప్పుడు వారే. ఒకవేళ వారు పశ్చాత్తాప పడితే, నమాజును స్థాపిస్తే, జకాత్ ఇస్తే వారు మీకు ధార్మిక సోదరులే. ఒకవేళ ఒడంబడిక కుదుర్చుకున్న తర్వాత వారు మళ్లీ తమ ప్రమాణాలను భంగపరిస్తే, మీ ధర్మంపై దాడులు చేయడం ప్రారంభిస్తే, అవిశ్వాసులతో యుద్ధం చెయ్యండి. మీరు వారికి భయపడుతున్నారా? మీరు గనుక విశ్వాసులే అయితే, మీరు ఎక్కువగా భయపడవలసింది అల్లాహ్‌కే. మీరు ఊరికే వదలిపెట్టబడతారని అనుకుంటున్నారా!

మీలో ప్రాణాలొడ్డి పోరాడిన వారు ఎవరో? అల్లాహ్‌ను, ప్రవక్తను, విశ్వాసులను తప్ప మరెవ్వరినీ ఆప్తమిత్రులుగా చేసుకోనివారు ఎవరో అల్లాహ్ ఇంకా చూడనేలేదు.

రుకూ 3 : అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించి, నమాజు స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ భయపడనివారు మాత్రమే అల్లాహ్ మసీదులకు సంరక్షకులు, సేవకులు కాగలరు. విశ్వసించిన ప్రజలారా! మీ తండ్రులను, మీ సోదరులను ఒకవేళ వారు విశ్వాసం కన్నా అవిశ్వాసానికి ప్రాధాన్యం ఇస్తే వారిని కూడా మీ సహచరులుగా చేసుకోవద్దు. ఒకవేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు, మీ ఆప్తులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, మీ వ్యాపారాలు, మీరు ఇష్టపడే మీ గృహాలు అల్లాహ్ కంటే, ఆయన ప్రవక్త కంటే, ఆయన మార్గంలో శ్రమించడం కంటే ఎక్కువగా మీకు ప్రియతరమైతే– అల్లాహ్ తన తీర్పును మీ ముందుకు తీసుకువచ్చే వరకు నిరీక్షించండి.

రుకూ 4 : హునైన్ సంగ్రామం నాడు మీరు మీ సంఖ్యాబలాన్ని చూసి గర్వపడ్డారు. కాని అది మీకు ఏవిధంగానూ పనికిరాలేదు. భూమి విశాలమైనది అయినప్పటికీ మీకు ఇరుకైపోయింది. మీరు వెన్ను చూపి పారిపోయారు. తరువాత అల్లాహ్ మిమ్మల్ని అనుగ్రహించాడు. సత్య తిరస్కారులను శిక్షించాడు. విశ్వసించిన ప్రజలారా! ముష్రిక్కులు అపరిశుద్ధులు కనుక ఈ సంవత్సరం తరువాత వారు మస్జిదె హరామ్ దరిదాపులకు కూడా రాకూడదు. గ్రంథ ప్రజలలో అల్లాహ్‌ను అంతిమదినాన్ని విశ్వసించనివారు అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించిన దానిని నిషిద్ధంగా భావించనివారు ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోనివారు– ఇలాంటి వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. వారు లోబడి ఉండడానికి సిద్ధపడి స్వయంగా తమ చేతులతో జిజియా ఇచ్చేవరకు వారితో పోరాడండి.

రుకూ 5: వారు అల్లాహ్ జ్యోతిని తమ నోటితో ఊది ఆర్పేయాలని అనుకుంటున్నారు. కాని అల్లాహ్ తన జ్యోతిని పరిపూర్ణం చేయకుండా వదిలిపెట్టడు. అది అవిశ్వాసులకు ఎంత అయిష్టం అయినా సరే. తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్ని సత్యధర్మాన్ని ఇచ్చి పంపినవాడు అల్లాహ్‌యే. ముష్రిక్కులకు అది ఎంత భరించరానిదయినా సరే దానిని జీవన వ్యవస్థలన్నింటిపై ప్రభవింపజెయ్యాలని పంపాడు. వెండి, బంగారాలను నిల్వ చేసి వాటిని దైవమార్గంలో ఖర్చుపెట్టనివారికి ఈ వెండి బంగారాలు నరకాగ్నిలో

కాల్చబడే ఒక రోజు వస్తుంది. వాటితోనే వారి నొసటిపై, వారి పార్శ్వాలపై, వీపులపై వాతలు వెయ్యబడతాయి. 'మీరు మీ కోసం కూడబెట్టుకున్న సంపదను రుచి చూడండి' ఆకాశాన్ని, భూమిని అల్లాహ్ సృష్టించినప్పటినుంచి మాసాల సంఖ్య అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు నిషిద్ధమాసాలు.

రుకూ 6: విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ మార్గంలో బయలుదేరండి అని మీకు చెప్పినప్పుడు మీరు నేలకు అతుక్కుపోయారు. ఈ వైఖరి సరైనది కాదు. మీరు గనుక లేవకపోతే దేముడు మీకు వ్యధాభరితమైన శిక్ష విధిస్తాడు. ఇంకా మీ స్థానంలో మరొక సమాజాన్ని లేపుతాడు. మీరు ప్రవక్తకు సహాయం చెయ్యకపోతే మరేమీ ఫర్వాలేదు- అవిశ్వాసులు ఆయన్ను బహిష్కరించినప్పుడు, తన స్నేహితునితో కలిసి అతను గుహలో తలదాచుకున్నప్పుడు అల్లాహ్ అతనికి సహాయం చేశాడు. బయలుదేరండి తేలికగా అయినాసరే, బరువుగా అయినా సరే అల్లాహ్ మార్గంలో పోరాడండి. మీ సంపదను మీ ప్రాణాలను ఒడ్డి పోరాడండి. మీరుగనుక గ్రహిస్తే ఇదే మీకు శ్రేయస్కరం.

రుకూ 7 : తబూక్ యుద్ధంలో కపటులు మీతోపాటు పాల్గొనకపోవడం మీకే మంచి దయ్యింది. వారు గనుక మీతో ఉన్నట్లయితే మీకు కీడు తప్ప మరేది అధికం చేసి ఉండేవారు కాదు. వారు మీ మధ్య విభేదాలు సృష్టించే నిమిత్తం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. మీకు మేలు కలిగితే వారికి బాధ కలుగుతుంది. ఏదైనా ఆపద మీ మీదకు వచ్చినప్పుడు వారు ముఖాన్ని తిప్పుకొని సంతోషంతో పొంగిపోతూ 'మేము ముందే మా వ్యవహారాన్ని సరిచేసుకోవడం మంచిదయ్యింది' అంటూ వెళ్ళిపోతారు. విశ్వాసులారా! వారితో చెప్పండి 'అల్లాహ్ స్వయంగా మిమ్మల్ని శిక్షిస్తాడా లేక మా చేతుల ద్వారా శిక్ష ఇప్పిస్తాడా' అని మేము నిరీక్షిస్తున్నాము' అని తెలుపండి. ఈ కపటులు నమాజుకు వస్తే బద్ధకంగా వస్తారు. దేవుని మార్గంలో ఖర్చుపెడితే అయిష్టంగా ఖర్చుపెడతారు.

రుకూ 8 : నిరుపేదలకు, అక్కరలు తీరని వారికి, జకాత్ వ్యవహారాలపై నియుక్తులైన వారికి, ఇంకా ఎవరి హృదయాలు గెలుచుకోవడం అవసరమో వారికి, బానిసల విముక్తికి, రుణగ్రస్తుల సహాయానికి, దేముని మార్గంలో ఖర్చుకు, బాటసారుల ఆతిథ్యానికి ఉపయోగించడానికి ఉన్నాయి జకాత్ నిధులు. ప్రవక్తను తమ మాటలతో నొప్పించేవారికి వ్యధాభరితమైన శిక్ష పడుతుంది. ఈ కపటులు తమ హృదయాలలో ఉన్న రహస్యాలను బయటపెట్టే సూరా ఏదైనా ముస్లిములపై అవతరిస్తుందేమో అని

భయపడుతున్నారు. ఒకవేళ వారిని అడిగితే మేము సరదాగా వేళాకోళంగా అంటు న్నాము అని తక్షణం బదులు చెబుతారు. వారిని అడగండి. 'మీ వేళాకోళం అల్లాహ్‌తోనా, ఆయన ఆయతులతోనా, ఆయన ప్రవక్తతోనా? ఇక సాకులు చెప్పకండి. మీరు విశ్వసించిన తర్వాత అవిశ్వాసానికి పాల్పడ్డారు.

రుకూ 9 : కపటులైన ఈ పురుషులకు, స్త్రీలకు, అవిశ్వాసాలకు అల్లాహ్ నరకాగ్నిని వాగ్దానం చేశాడు. మీవి కూడా మీ పూర్వం వారి తీరుతెన్నులే. వారు ప్రపంచంలో తమ వంతు సుఖాలను జుర్రుకున్నారు. మీరు కూడా మీ వంతు సుఖాలను వారి మాదిరిగానే అనుభవించారు. వారి మాదిరిగానే మీరు కూడా వాదోపవాదాల్లో పడ్డారు. అందరూ నష్టానికి గురవుతారు. విశ్వాసులయిన పురుషులు, విశ్వాసులయిన స్త్రీలు వారందరూ ఒకరికొకరు సహచరులు. వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చేయవద్దు అని నిరోధిస్తారు. నమాజు స్థాపిస్తారు. జకాత్ ఇస్తారు. అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల విధేయత పాటిస్తారు. వారి మీద అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పక అవతరింపజేస్తాడు. వారి కొరకు స్వర్గాలున్నాయి. అన్నిటికంటే మించి అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది.

రుకూ 10 : ప్రవక్తా! అవిశ్వాసులను, కపటులను, ఈ ఉభయులనూ పూర్తి శక్తితో ఎదుర్కో. వారితో కఠినంగా వ్యవహరించు. వారు తమ వైఖరి మానుకుంటే అది వారికే మేలు. అల్లాహ్ గనక తన అనుగ్రహం నుంచి మాకు ప్రసాదిస్తే మేము దానం చేస్తాము, సజ్జనులమై ఉంటాము అని అల్లాహ్‌కు ప్రమాణం చేసినవారు కూడా కొందరు ఉన్నారు. కాని అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేసినప్పుడు వారు పిసినారితనానికి దిగారు. ప్రమాణాన్ని మరిచిపోయారు. ఈ ప్రమాణ భంగం కారణంగా అల్లాహ్ వారి హృదయాలలో కాపట్యాన్ని నాటాడు. ప్రవక్తా! నీవు అటువంటి ప్రజలను క్షమించమని విజ్ఞప్తి చేసినా, చేయకున్నా ఒకటే. వారిని క్షమించవలసిందిగా నీవు డెబ్బై సార్లు విజ్ఞాపన చేసినా, అల్లాహ్ వారిని ఎంతమాత్రం క్షమించడు.

రుకూ 11 : కపటులు ఇంటివద్దనే కూర్చుండి పోయినందుకు ఆనందించారు. అల్లాహ్‌మార్గంలో తమ సంపదను, ప్రాణాలను ఒడ్డి పోరాడ్డం వారికి ఇష్టం లేదు. వారు ప్రజలతో 'ఈ తీవ్రమైన వేడిలో బయల్దేరకండి' అన్నారు. ప్రవక్తా! వారికి చెప్పండి. నరకాగ్ని దానికంటే ఎక్కువ వేడిగా వుంటుంది. ప్రవక్తా! ఇకముందు వారిలో

ఎవడైనా మరణిస్తే అతడి జనాజా నమాజును కూడా నీవు ఎంతమాత్రం చేయకు, ఎన్నడూ అతని గోరి వద్ద నిలబడకు. వారు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను తిరస్కరించారు. సంపన్నులైన కపటులను వారి సంపద ద్వారా, సంతానం ద్వారా ప్రపంచంలోనే శిక్షించాలని వారు అవిశ్వాసులుగా ఉన్న స్థితిలోనే వారి ప్రాణాలు పోవాలని అల్లాహ్ సంకల్పించాడు. ప్రవక్తతోపాటు విశ్వసించినవారు తమప్రాణాలతో తమ సంపదలతో పోరాడారు. కనుక ఇప్పుడు అన్ని మేళ్ళు వారివే.

రుకూ 12 : వృద్ధులు, వ్యాధిగ్రస్తులు పోరాటంలో పాల్గొనడానికి దారిభత్యం లేని వాళ్ళు ఒకవేళ వెనుక ఉండిపోతే ఏ దోషమూ లేదు. బీదలకు వాహనాల ఏర్పాటు చేయనందువల్ల గత్యంతరం లేక వారు మరలిపోయారు. వారి కళ్ళ నుంచి అశ్రువులు ప్రవహించాయి. తమ సొంత ఖర్చులతో పోరాటంలో పాల్గొనే శక్తి తమకు లేనందుకు వారు చాలా బాధపడ్డారు. కాని ధనవంతుల ఆక్షేపణ ఉంది. వారు స్తోమత ఉండి కూడా పోరాటంలో పాల్గొనే విషయమై మన్నించవలసిందిగా నీకు విజ్ఞప్తి చేశారు.

రుకూ 13: ప్రవక్తా! యుద్ధం నుంచి మరలివచ్చిన తర్వాత నీవు వారిని ఉపేక్షించాలని వారు నీ ముందు ప్రమాణాలు చేస్తారు. నీవు ప్రసన్నుడవు కావాలని ప్రయత్నిస్తారు. నీవు ఒకవేళ వారి పట్ల ప్రసన్నత చూపినా అల్లాహ్ మటుకు అటువంటి విద్రోహులకు ఎన్నటికీ ప్రసన్నత చూపడు. వీళ్ళు దేముని మార్గంలో ఖర్చు పెడుతున్నప్పుడు అది తమపై బలవంతంగా రుద్దబడిందని భావించేవారు. అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించేవారు తాము ఖర్చు చేసే దానిని అల్లాహ్ సాన్నిహిత్యాన్ని పొందడానికి, ప్రవక్త నుంచి దేముని కారుణ్యానికై ప్రార్థనలు పొందడానికి సాధనంగా చేసుకుంటారు. అల్లాహ్ తప్పకుండా వారిని తన కారుణ్యంలో ప్రవేశింపజేస్తాడు.

రుకూ 14 : ఈ రుకులో మదీనాలోని అయిదు రకాల ప్రజల ప్రస్తావన ఉంది. 1) అందరికంటే ముందు విశ్వాస సందేశాన్ని స్వీకరించిన ముహాజిర్లు (వలస వచ్చిన వారు), అన్సారులు (వలస వచ్చిన వారికి ఆశ్రయమిచ్చినవారు). ఈ ప్రజల పట్ల అల్లాహ్ తృప్తి చెందాడు. వారు కూడా అల్లాహ్ పట్ల తృప్తి చెందారు. 2) ఎడారి అరబ్బులలో కపటులు కాపట్యంలో రాటుదేలారు. మేము వారికి రెట్టింపు శిక్ష విధించే సమయం దగ్గరలోనే ఉంది 3) తమ తప్పులను ఒప్పుకున్నవారు కొందరు ఉన్నారు. వారి ఆచరణ కొంత మంచి, కొంత చెడు కలగలిసినది. ప్రవక్తా! నీవు వారి సంపదల

నుంచి సదఖా తీసుకొని వారిని పరిశుద్ధపరచు. సన్మార్గంలో వారిని ముందుకు నడుపు. వారిని కరుణించమని దేవుని ప్రార్థించు. 4) మరికొందరున్నారు. వారి వ్యవహారం దేవుని ఆజ్ఞ కోసం ఆగివుంది. ఆయన వారికి శిక్ష విధించనూ వచ్చు. కనికరించనూ వచ్చు 5) ఇంకా కొందరు ఉన్నారు. వారు సత్యసందేశానికి నష్టం కలిగించాలనే ఉద్దేశ్యంతో ఒక మసీదు నిర్మించారు. దేముని ఆరాధనకు బదులుగా అవిశ్వాసాన్ని అనుసరించాలనే విశ్వాసులలో చీలిక తీసుకురావాలని (బూటకపు మసీదు నిర్మించారు). ఈ మసీదు వారిని తీసుకొని నేరుగా నరకాగ్నిలో పడిపోయింది.

రుకూ 15 : యధార్థం ఏమిటంటే, విశ్వాసుల నుంచి అల్లాహ్ స్వర్గానికి బదులుగా వారి ప్రాణాలను, వారి సంపదలను కొన్నాడు. వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు. చంపుతారు, చస్తారు. కాబట్టి దేమునితో మీరు చేసిన ఈ వ్యాపారానికి సంతోషించండి. ఇదే అన్నిటికంటే మహత్తరమైన సాఫల్యం. ఇది పొందే వారి లక్షణాలు 1) అల్లాహ్ వైపునకు అనుక్షణం మరలేవారు. 2) ఆయనను ఆరాధించేవారు 3) ఆయనను స్తుతించేవారు 4) ఆయన కొరకు భూమిపై సంచారం చేసేవారు 5) ఆయన సన్నిధిలో రుకూలు, సజ్దాలు చేసేవారు 6) మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపించేవారు 7) చెడు చెయ్యవద్దు అని నిరోధించేవారు. 8) అల్లాహ్ విధించిన హద్దులను కాపాడేవారు. ప్రవక్తా! ఇటువంటి విశ్వాసులకు శుభవార్త అందజెయ్యి. ముష్రిక్కులను క్షమించవలసిందిగా ప్రార్థించడం ప్రవక్తకూ, విశ్వాసులకు తగని పని. వారు బంధువులయినప్పటికీ కూడా– తబూక్ యుద్ధం సందర్భంగా విశ్వాసుల వల్ల జరిగిన తప్పులను అల్లాహ్ క్షమించాడు.

రుకూ 16 : అల్లాహ్ మార్గంలో వారు ఆకలిదప్పులను, శరీర శ్రమకు సంబంధించిన బాధను సహించి ఉంటే, సత్య తిరస్కారులు సహించలేని మార్గంపై వారు ఏదైనా అడుగువేస్తే ఏ శత్రువుకయినా (సత్య విరోధానికి) వారు ప్రతీకారం చేస్తే దానికి బదులుగా వారి కొరకు ఒక సత్కార్యం రాయబడకుండా ఉండడం అన్నది ఎన్నటికీ జరగదు. నిశ్చయంగా అల్లాహ్ వద్ద సజ్జనులకు సేవాఫలం పొందే హక్కు హరించబడదు. ఇదేవిధంగా వారు దైవమార్గంలో ఏదైనా ఖర్చును భరిస్తే వారు ఏదైనా లోయను దాటితే, వారి కొరకు దానిని రాయకపోవడం అనేది కూడా జరగదు. అల్లాహ్ వారి ఈ మంచి పనులకు ప్రతిఫలాన్ని ప్రసాదించడానికి (ప్రతిది రాయడం జరుగుతుంది)

రుకూ 17: కొత్త సూరా ఏదైనా అవతరించినప్పుడల్లా కపటులు హేళనగా ముస్లిములను 'మీలో ఎవరి విశ్వాసం దీనివల్ల పెరిగిందో చెప్పండి' అని అంటారు. విశ్వాసుల విశ్వాసాన్ని వాస్తవంగానే ప్రతి సూరా పెంచింది. అందుకు వారు ఆనంది స్తున్నారు. చూడండి మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీ లోని వాడే. మీరు నష్టానికి గురికావడం ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు. కారుణ్యం గలవాడు- ఇక వారు నీకు విముఖులైతే ఓ ప్రవక్తా! వారితో చెప్పు' 'నాకు అల్లాహ్ చాలు. ఆయన తప్ప ఆరాధ్యుడు ఎవడూ లేడు. ఆయననే నేను నమ్ము కున్నాను. ఆయన మహత్తర మైన అధికార పీఠానికి ప్రభువు'.

10. యూనుస్

రుకూ 1 : యథార్థం ఏమిటంటే, ఆకాశాలను, భూమిని ఆరు రోజులలో సృష్టించి, తరువాత రాజ్యపీఠాన్ని అలంకరించి సృష్టి వ్యవహారాలు నడుపుతున్న దేముడే మీ ప్రభువు. ఆయన అనుమతి ఇస్తే తప్ప ఎవడూ సిఫారసు చేయలేడు. నిస్సందేహంగా సృష్టిని ఆయనే ప్రారంభిస్తాడు. తరువాత రెండోసారి మళ్ళీ ఆయనే సృష్టిస్తాడు. సూర్యుణ్ణి కాంతిమంతునిగా చేసింది ఆయనే. చంద్రునికి వెలుగు ఇచ్చినవాడు ఆయనే. చంద్రుని తరిగే పెరిగే దశలను ఖచ్చితంగా నిర్ణయించినవాడు ఆయనే. మీరు సంవత్సరాల, తేదీల లెక్కను తెలుసుకోవాలని ఆయన అలా చేశాడు. నిశ్చయంగా రేయింబవళ్ళ నిరంతర పరిభ్రమణంలో, భూమ్యాకాశాలలో అల్లాహ్ సృష్టించిన ప్రతి వస్తువులో (తప్పుడు ప్రవర్తన నుంచి) తప్పించుకోగోరే వారికి సూచనలు ఉన్నాయి. మమ్మల్ని కలుసుకోవాలని ఆశించనివారు ప్రాపంచిక జీవితమునే వరించి దానితోనే తృప్తి చెందినవారు మా సూచనల పట్ల నిర్లక్ష్య భావం కలిగివున్నవారు- అటువంటి వారి అంతిమ నివాస స్థలం నరకం-

రుకూ 2 : మానవుని స్థితి ఎలాంటిదంటే - అతడికి కష్టకాలం దాపురించినప్పుడు నిలబడి, కూర్చుని, పడుకొని మాకు మొరపెట్టుకుంటాడు. కాని మేము అతని ఆపదను తొలగించినప్పుడు అతడు ఎప్పుడు మాకు మొరపెట్టుకోనే లేదు అన్నట్లు ప్రవర్తిస్తాడు. మీకు పూర్వం జాతులు దుర్మార్గపు వైఖరి అవలంభించినందువల్ల మేము నాశనం చేశాము. వారి తర్వాత మేము భూమిపై వారి స్థానాన్ని మీకు ఇచ్చాము. మీరు ఎలా

ప్రవర్తిస్తారో చూద్దామని ఇచ్చాము. ఈ ప్రజలు అల్లాహ్‌ను కాదని తమకు నష్టాన్ని గాని లాభాన్ని గాని కలిగించలేని వారిని పూజిస్తున్నారు. పైగా 'వారు అల్లాహ్ వద్ద మా కోసం సిఫారసు చేస్తారని' అంటున్నారు. ప్రారంభంలో సర్వ మానవులు ఒకే విధంగా ఉండేవారు. తరువాత వారు విభిన్న విశ్వాసాలను ఆచారాలను సృష్టించుకున్నారు.

రుకూ 3 : వాయువులు అనుకూలంగా వీస్తూ ఉండగా మీరు ఓడలపై ఎక్కి ఆనందంగా ఆహ్లాదంగా ప్రయాణం చేస్తూ ఉంటారు. ఆ తరువాత అకస్మాత్తుగా ఎదురుగాలి ఉధృతమై అన్ని దిశల నుండి అలల దెబ్బలు తగలగా ప్రయాణికులు తాము తుఫానులో చిక్కుకుపోయామని గ్రహించి, అప్పుడు అందరూ తమ ధర్మాన్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకుని ఆయనకే మొర పెట్టుకొంటారు. 'నీవు గనుక మాకు ఈ ఆపద తొలగిస్తే మేము కృతజ్ఞతలు తెలుపుకొని నీకు దాసులవుతామని' వేడుకుంటారు. కాని ఆయన వారిని రక్షించిన తర్వాత వారు సత్యానికి విముఖులై భూమిపై తిరుగుబాటు చేస్తారు. ఇహలోక సుఖాలు కొన్ని రోజులు సుఖాలు మాత్రమే. తరువాత మా వైపునకే మీరు మరలిరావలసి ఉన్నది. అప్పుడు మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో మేము మీకు తెలుపుతాము. ప్రళయదినాన వారిని వారు కల్పించిన భాగస్వాములను అల్లాహ్ లేపుతాడు. అప్పుడు వారు కల్పించిన భాగస్వాములు ఇలా అంటారు: 'మీరు మమ్మల్ని ఆరాధించలేదు. మీరు చేసిన ఆ ఆరాధనను గురించి మాకు ఏమాత్రం తెలియదు' అప్పుడు ప్రతి మనిషి తాను చేసిన దానికి ఫలితం రుచి చూస్తాడు.

రుకూ 4 : వారిని అడుగు– మీరు దేవునికి భాగస్వాములుగా నిలబెట్టినవారిలో సృష్టిని ప్రారంభించేవాడు, దానిని తిరిగి సృష్టించేవాడు, ఎవడైనా ఉన్నాడా అని అడగండి. సృష్టిని ప్రారంభించేవాడు, దానిని తిరిగి సృష్టించేవాడు కేవలం అల్లాహ్ మాత్రమే అని చెప్పండి. ఇంకా వారిని అడగండి. మీరు అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టిన వారిలో సత్యం వైపునకు మార్గం చూపేవాడు ఎవడైనా ఉన్నాడా? అని అడగండి. అసలు మీకేమయింది ఇలాంటి తలక్రిందులు నిర్ణయాలు చేస్తున్నారని ప్రశ్నించండి. అల్లాహ్ పంపిన వహీ, ఆయన చేసిన బోధనలు లేకుండా రచించబడేది కాదు ఈ ఖుర్‌ఆను.

రుకూ 5 : వారిలో చాలామంది నీ మాటలు వింటారు. కాని నీవు చెవిటి వారికి వినిపించగలవా? వారు ఏమి అర్థం చేసుకోకపోయినప్పటికీ వినిపించగలవా? వారిలో

చాలామంది నిన్ను చూస్తారు. కాని గుడ్డివారికి, ఏమి కనిపించనప్పటికీ నీవు వారికి మార్గం చూపగలవా? యధార్థం ఏమంటే, అల్లాహ్ ప్రజలకు అన్యాయం చెయ్యడు. ప్రజలే తమకు తాము అన్యాయం చేసుకుంటారు. అల్లాహ్ వారిని సమావేశపరిచిన రోజున ఇహలోక జీవితం వారికి ఎలా అనిపిస్తుందంటే, కేవలం ఒక ఘడియకాలం వారు ఒకరినొకరు గుర్తు పట్టడానికి అక్కడ ఆగారా అనిపిస్తుంది. అల్లాహ్‌తో సమావేశాన్ని తిరస్కరించినవారు తీవ్రమైన నష్టాన్ని పొందుతారు. ప్రతి సంఘానికి నిర్థారిత గడువు ఉంది. ఈ గడువు పూర్తయినప్పుడు ఒక్క ఘడియకాలం కూడా ముందూ వెనుక కాదు.

రుకూ 6 : దుర్మార్గం చేసిన ప్రతి మనిషి వద్ద భూమిపై ఉన్న మొత్తం సంపద అంతా ఉంటే, శిక్ష నుంచి తప్పించుకోవడానికి మొత్తం అంతా పరిహారంగా ఇవ్వడానికి సిద్ధపడతాడు. మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుంచి హితోపదేశం వచ్చేసింది. అది హృదయాల రుగ్మతలకు స్వస్థత చేకూరుస్తుంది. స్వీకరించేవారికి అది మార్గదర్శకత్వం, కారుణ్యం. అల్లాహ్ తన అనుగ్రహం వల్ల, కారుణ్యం వల్ల దానిని పంపాడు. అందుకుగాను ప్రజలు ఆనందించాలి. ప్రజలు కూడబెట్టే వాటన్నింటికంటే అది ఉత్తమమైనది. అల్లాహ్ మానవులను దయా దృష్టితో చూస్తాడు. కాని చాలామంది మనుషులు కృతజ్ఞతలు చూపరు.

రుకూ 7 : భూమ్యాకాశాలలో ఉన్న వస్తువు ఏదైనా సరే అది చిన్నదిగాని, పెద్దదిగాని దాని అణువు కూడా నీ ప్రభువు దృష్టికి గోప్యంగా లేదు. ఒక స్పష్టమైన గ్రంథంలో రాయబడకుండా లేదు. అల్లాహ్‌కు స్నేహితులైన వారికి, ఆయనను విశ్వసించి భయభక్తుల వైఖరి అవలంభించినవారికి ఏవిధమైన భయంకాని, వివాదం కాని, కలిగే అవకాశం లేదు. ఇహపర జీవితాలు రెండింటిలోను వారికి శుభవార్తలే శుభవార్తలున్నాయి. ప్రవక్తా! నీ గురించి వారు కల్పించే మాటలకు బాధపడకు. గౌరవం అంతా అల్లాహ్ అధీనంలో ఉంది. ఆయన ఆది నుంచి ఉన్నాడు. మీ ప్రశాంతత కోసం రాత్రిని సృష్టించాడు. మీ కోసం పగలును కాంతిమంతం చేసినవాడు అల్లాహ్‌యే. చెవియొగ్గి ప్రవక్త సందేశాన్ని వినేవారికి ఇందులో సూచనలు ఉన్నాయి.

రుకూ 8 : నూహ్ తన జాతి ప్రజలను అల్లాహ్ వైపునకు పిలిచాడు. వారితో 'ఎవరు విశ్వసించినా విశ్వసించకపోయినా నేను మాత్రం ముస్లిముగా ఉండాలని ఆదేశించబడింది' అని చెప్పారు. ఆ జాతి ఆయనను తిరస్కరించింది. దానికి ఫలితంగా మేము

జాతిని ముంచివేశాము– ఈ రుకూలో హజ్రత్ మూసా, ఫిరౌన్‌ల వృత్తాంతం కూడా ఉంది. ఫిరౌన్ హజ్రత్ మూసాకు వ్యతిరేకంగా మాంత్రికులను పిలిచి భంగపడిన గాథ ఉంది.

రుకూ 9 : మూసాను అతని జాతిలోని కొందరు యువకులు తప్ప మరెవ్వరూ విశ్వసించలేదు. వారు అందరూ ఫిరౌన్‌కు భయపడ్డారు. ఫిరౌన్ యాతనకు గురిచేస్తాడని భీతిల్లారు. ఫిరౌన్ భూమిపై ప్రాబల్యం కలిగి వుండేవాడు. మేము మూసాకు అతని సోదరుని ఆజ్ఞాపిస్తూ 'మీరు ఈజిప్టులో మీ జాతి వారికొరకు కొన్ని ఇళ్ళు సమకూర్చుకోండి, ఆ గృహాలను ఖిబ్లాగా నిర్ణయించుకోండి. నమాజును స్థాపించండి" అన్నాము. మూసా దేవుని ప్రార్థించాడు. ఫిరౌన్‌కు అతడి జాతిని సముద్రంలో ముంచి వేయడం జరిగింది. ఫిరౌన్ మునిగిపోతూ 'ఇస్రాయీలు సంతతి విశ్వసించిన దేవుడే నిజమైన దేవుడు, ఆయన తప్ప వేరే దేవుడు లేడని నేను విశ్వసిస్తున్నాను. నేను కూడా విధేయతతో శిరస్సు వంచుతున్నాను' అని అరవసాగాడు. అందుకు జవాబుగా "ఇప్పుడు విశ్వసిస్తున్నావా! ఇంతవరకు అవిధేయత చూపుతూ వచ్చావు. కల్లోలాన్ని రేకెత్తించావు. (ఇప్పుడు మేము కేవలం నీ శవాన్ని మాత్రమే రక్షిస్తాము నీవు వచ్చే తరాల వారికి గుణపాఠం కావాలి)' అని చెప్పబడింది.

రుకూ 10 : నీ ప్రభువు తరఫు నుంచి నీ వద్దకు వచ్చినదే సత్యం. యథార్థం ఏమిటంటే, ఎవరి విషయంలో నీ ప్రభువు మాటలు సత్యంగా నిరూపితమయ్యాయో వారి ముందు ఏ నిదర్శనం వచ్చినా వారు ఎన్నటికీ విశ్వసించరు బాధాకరమైన శిక్ష వారి ముందుకు వస్తూ కనబడితే తప్ప. శిక్షను చూశాక మాత్రమే విశ్వసించిన ఏ జాతిని మేము రక్షించ లేదు – ఒక్క యూనుస్ జాతిని తప్ప– అల్లాహ్ విధానం ఏమిటంటే, బుద్ధిజ్ఞానా లతో వ్యవహరించని వారిపై ఆయన మాలిన్యాన్ని పడవేస్తాడు. ఇప్పుడు వారు ఇంకా దేనికోసం నిరీక్షిస్తున్నారు? వారికి పూర్వం గతించిన ప్రజలు చూసినటువంటి చెడు దినాలను చూడడం కోసం తప్ప – ప్రవక్తా! ఇలా చెప్పు, 'మానవులారా! మీరు అల్లాహ్‌ను కాదని ఆరాధించే ఇతరులను నేను ఆరాధించను. ఏ దేవుని అధీనంలో మీ మరణం ఉందో అతన్నే నేను ఆరాధిస్తాను. విశ్వాసులలో ఒకనిగా ఉండమని నన్ను ఆదేశించడం జరిగింది. ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో పూర్తిగా ధర్మానికి ఆత్మసమర్పణం చేసుకోవాలని నాకు చెప్పబడింది. ముష్రిక్కులతో ఎంతమాత్రం కలిసి పోరాదని నాకు ఆదేశించబడింది. అల్లాహ్ గనక ఏదైనా ఆపదకు గురిచేస్తే స్వయంగా ఆయన తప్ప

ఆ ఆపద తొలగించేవారు ఎవ్వరూలేరు. ఆయన గనక ఏదైనా మేలు చేయదలిస్తే ఆయన అనుగ్రహాన్ని మళ్ళించేవాడు కూడా ఎవ్వడూ లేడు.

11. హూద్

రుకూ 1 : ప్రజలారా! మీ ప్రభువును క్షమాభిక్ష కోరండి. ఆయన వైపునకు మరలిరండి. ఆయన ఒక నిర్ణీత కాలం వరకు మీకు మంచి జీవిత సామాగ్రిని అనుగ్రహిస్తాడు. అర్హుడైన ప్రతి వాడికి ఆయన తన అనుగ్రహాలు ప్రసాదిస్తాడు. మీరు గనక విముఖులైతే, ఒక అతి భయంకర దినం నాటి యాతనకు మీరు గురికావచ్చు. ధరణిపై సంచరించే ఏ ప్రాణి ఉపాధి అయినా అల్లాహ్ బాధ్యతలో లేకుండా లేదు. ఆ ప్రాణి ఎక్కడ నివసిస్తుందో అది ఎక్కడకు చేర్చబడనున్నదో ఆయనకు తెలియకుండా లేదు. సమస్తం ఒక స్పష్టమైన గ్రంథంలో రాయబడి వుంది. ఆకాశాలను, భూమిని ఆరు దినాలలో సృష్టించినవాడు ఆయనే. అంతకుముందు ఆయన సింహాసనం నీళ్ళపై ఉండేది. మీలో ఎవడు మంచి పనులు చేస్తాడో మిమ్మల్ని పరీక్షించి చూద్దామని (ఆయన సంకల్పం).

రుకూ 2 : ఒకవేళ మేము ఎప్పుడైనా మానవునికి మా కారుణ్యాన్ని ప్రసాదించి, తరువాత అది అతనికి లేకుండా చేస్తే అతడు నిరాశ చెందుతాడు. కృతఘ్నత చూపుతాడు. అతనిపై పడిన ఆపద తొలగిన తర్వాత ఒకవేళ మేము అతనికి అనుగ్రహాన్ని రుచి చూపిస్తే 'కష్టాలన్నీ తొలగిపోయాయి' అంటాడు. ఉబ్బితబ్బిబ్బవుతాడు. విర్రవీగుతాడు, సహనశీలురు, సత్కార్యాలు చేసేవారు మాత్రమే ఈ దోషానికి అతీతులు. వారికే మన్నింపు, పెద్ద బహుమానం లభిస్తాయి. ఈ ప్రాపంచిక జీవితాన్ని దాని అకర్షకాలనూ కోరుకునేవారు చేసిన దానికి పూర్తి ఫలితాన్ని వారికి ఇక్కడే ఇచ్చివేస్తాము. అందులో వారికి తక్కువ చెయ్యడం అంటూ జరగదు. అయితే పరలోకంలో అటువంటి వారికి అగ్ని తప్ప మరేమీ ఉండదు. దుర్మార్గుల మీద దేముని శాపం పడుతుంది. దేముని మార్గం నుంచి ప్రజలను ఆపే దుర్మార్గుల మీద, ఆయన మార్గాన్ని వక్రీకరించగోరే దుర్మార్గుల మీద, పరలోకాన్ని తిరస్కరించే దుర్మార్గుల మీద దేముని శాపం పడుతుంది.

రుకూ 4 : నూహ్‌కు వహీ ద్వారా ఒక పడవ తయారు చెయ్యమని తెలుపబడింది. నూహ్ పడవను తయారు చేస్తుండగా అతని వైపుగా పోయే అతని జాతి సర్దారులలో

ప్రతివాడు ఎగతాళి చేసేవాడు. మేము నూహ్‌ను 'ప్రతి జాతి జంతువుల ఒక్కో జంటను పడవలో ఎక్కించు, నీ ఇంటి వారిని కూడా– ఇది వరకే సూచించిన వ్యక్తులు తప్ప– ఇందులో ఎక్కించు. ఇంకా విశ్వాసులను కూడా ఎక్కించుకో' అని చెప్పాము. పడవ ఎక్కినవారు కొద్దిమంది మాత్రమే. నూహ్ వారితో 'ఇందులో ఎక్కండి. అల్లాహ్ పేరుతోనే దీని పయనం, ఆగడం– నా ప్రభువు క్షమించేవాడు, కనికరించేవాడు' అని అన్నారు. నూహ్ తన కుమారుని 'బాబూ! మాతోపాటు ఎక్కు, అవిశ్వాసులతో ఉండకు' అని పిలిచాడు. కాని అతడు 'నేను కొండపైకి ఎక్కుతాను. అది నీళ్ళ నుంచి కాపాడు తుంది' అని జవాబిచ్చాడు. ఇంతలోనే ఒక పెద్ద కెరటం వారి మధ్యకు వచ్చింది. కుమారుణ్ణి ముంచేసింది. పిదప నీరు భూమిలో ఇంకిపోయిన తర్వాత 'నూహ్! దిగిపో. నీపై నీతోపాటు ఉన్న వారిపై మా తరఫు నుంచి శాంతి శుభాలు' అని ఆజ్ఞాపించడం జరిగింది.

రుకూ 5 : ఆద్ జాతి వైపునకు మేము వారి సోదరుడైన హూద్‌ను పంపాము. అతను తన జాతి ప్రజలను ఉద్దేశించి 'నా జాతి సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. మీ ప్రభువును క్షమాభిక్ష కోరండి. పశ్చాత్తాపంతో ఆయన వైపునకు మరలండి. ఆయన మీకోసం ఆకాశ ద్వారాలను తెరుస్తాడు. ఇప్పుడు మీకున్న శక్తిని మరింత పెంచుతాడు. దోషులై ఆరాధన పట్ల ప్రాముఖ్యం చూపకండి' అని బోధించాడు. అందుకు జవాబిస్తూ జాతి ప్రజలు 'నీవు చెప్పినంత మాత్రాన మేము మా ఆరాధ్య దైవాలను వదిలిపెట్టలేము. మా ఆరాధ్య దైవాలలో ఎవరిదో ఒకరి దెబ్బ నీపై పడిందని మా అభిప్రాయం' అన్నారు. వారికి నచ్చచెబుతూ హూద్ 'నా నమ్మకం అల్లాహ్‌పైనే. ఆయన నాకూ ప్రభువే, మీకు ప్రభువే. ఏ ప్రాణి జుట్టు అయినా ఆయన చేతుల్లోనే ఉంది' అన్నారు. ఆద్ జాతి తమ ప్రభువు ఆయతులను తిరస్కరించింది. చివరకు ఈ లోకంలో కూడా వారిపై శాపం పడింది. ప్రళయం నాడు కూడా పడుతుంది.

రుకూ 6 : సమూద్ జాతి వద్దకు మేము వారి సోదరుడైన సాలిహ్‌ను పంపాము. తన జాతి ప్రజలకు అతను హితోపదేశం చేస్తూ 'నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధిం చండి. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనను క్షమాభిక్ష కోరండి. ఆయన వైపునకు పశ్చాత్తాపంతో మరలండి. నిశ్చయంగా నా ప్రభువు దగ్గరే ఉన్నాడు. ఆయన ప్రార్థనలకు సమాధానం ఇస్తాడు' అని బోధించాడు. వారు అతనికి జవాబిస్తూ 'సాలిహ్

మా మధ్య ఉన్న నీమీద నిన్నటి వరకు మేము పెద్ద పెద్ద ఆశలు పెట్టుకున్నాము. మా తాత ముత్తాతలు పూజించిన దేవుళ్ళను మేము పూజించకుండా నువ్వు ఆపదలిచావా?' అని ప్రశ్నించారు. సాలిహ్ వారితో 'నా జాతి సోదరులారా! చూడండి! అల్లాహ్‌కు చెందిన ఈ ఒంటె మీకు ఒక నిదర్శనంగా ఉంది. దానిని అల్లాహ్ భూమిపై మేయ డానికి స్వేచ్ఛగా వదిలిపెట్టండి. దాని జోలికి వెళ్ళకండి' అన్నాడు. కాని వారు ఒంటెను చంపేశారు. చివరకు మా తీర్పు సమయం వచ్చినప్పుడు మేము మా కారుణ్యంతో సాలిహ్‌ను అతనితోపాటు విశ్వసించినవారిని రక్షించాము. దుర్మార్గానికి పాల్పడిన వారిపై ఒక పెద్ద పేలుడు విరుచుకుపడింది. వారు తమ గృహాలలో చలనమూ, చైతన్యమూ లేకుండా పడిపోయారు. అసలు వారెప్పుడు అక్కడ నివసించి ఉండని మాదిరిగా అయిపోయారు.

రుకూ 7 : ఇబ్రాహీమ్ వద్దకు మా దూతలు శుభవార్త తీసుకొని చేరారు. ఇస్‌హాఖ్, ఇస్‌హాఖ్‌ల తర్వాత యాకూబ్ గురించిన శుభవార్తను అందజేశారు. ఇది విని ఇబ్రాహీమ్ భార్య 'అయ్యో! నా దౌర్భాగ్యం! నాకు ఇప్పుడా పిల్లలు పుట్టేది. నేనూ ముసలిదాన్నే, నా భర్త కూడా ముసలివారే' అన్నది. అప్పుడు దైవదూతలు 'అల్లాహ్ ఆజ్ఞ పట్ల ఆశ్చర్యపోతున్నావా?' అని ప్రశ్నించారు. ఆ తర్వాత దైవదూతలు అందమైన యువకుల రూపంలో లూత్ వద్దకు వచ్చారు. లూత్ జాతి ప్రజలు అప్రయత్నంగా అతని ఇంటి వైపునకు పరుగెత్తుకు వచ్చారు. లూత్ తన జాతి ప్రజలతో 'సోదరులారా! ఇదిగో నా కూతుళ్ళు ఉన్నారు. మీకు వీరు ఎక్కువ పరిశుద్ధమైనవారు. దేవునికి కొంచెం భయపడండి. నా అతిథుల విషయంలో నన్ను అవమానం పాలు చెయ్యకండి' అన్నారు. దానికి వారు 'నీ కూతుళ్ళు మాకు అవసరం లేదని నీకు బాగా తెలుసు. అసలు మేము కోరేది ఏమిటో కూడా నీకు తెలుసు' అని జవాబిచ్చారు. అప్పుడు దైవదూతలు లూత్‌తో 'మేము నీ ప్రభువు పంపిన దూతలం. వారు నీకు ఏమాత్రం కీడు చెయ్యలేరు. నీవు నీ ఇంటి వారిని తీసుకొని బయలుదేరు. మీలో ఎవరూ వెనక్కి తిరిగి చూడకూడదు. నీ భార్య (నీతో రాకూడదు)' అన్నారు. ఉదయం ఆ పట్టణాన్ని మేము తలక్రిందులు చేశాము. దాని మీద కాల్చిన మట్టిరాళ్ళు ఎడతెగకుండా కురిపించాము.

రుకూ 8 : మద్‌యన్ ప్రజల వైపునకు మేము వారి సోదరుడు షుఐబ్‌ను పంపాము. అతను తన జాతి ప్రజలతో 'అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. కొలతల్లో, తూకంలో తక్కువ చెయ్యకండి. ప్రజలకు వారి వస్తువులను తక్కువ

చేసి ఇవ్వకండి. భూమిపై సంక్షోభాన్ని వ్యాపింపజేస్తూ తిరగకండి' అని బోధించారు. కాని ఆ ప్రజలు 'షుఐబ్! మా తాత ముత్తాతలు పూజించిన దేవుళ్ళందరినీ మేము వదిలిపెట్టాలా! మా సంపద మా ఇష్టానుసారం ఖర్చు చేసుకునే అధికారం మాకు ఉండకూడదా' అని ఎదురు తిరిగారు. షుఐబ్ వారికి నచ్చజెబుతూ 'సోదరులారా! చూడండి, మీ ప్రభువును క్షమాభిక్ష కోరండి. పశ్చాత్తాపంతో ఆయన వైపునకు మరలండి. నిస్సందేహంగా నా ప్రభువు కారుణ్యమూర్తి. తన సృష్టిని ప్రేమిస్తాడు' అని అన్నారు. అయినా ఆ జాతి అతని మాటలు వినలేదు. చివరకు మేము మా కారుణ్యంతో షుఐబ్‌ను అతని తోటి విశ్వాసులను రక్షించాము. దుర్మార్గులపై ఒక తీవ్రమైన పేలుడు విరుచుకుపడింది. వారు తమ నివాసాలలో చలనమూ, చైతన్యం లేకుండా పడిపోయారు. అక్కడ వారెప్పుడు నివసించి ఉండలేదన్నట్లుగా అయిపోయారు.

రుకూ 9 : మేము మూసాను మా సూచనలతో ఫిరౌన్ వద్దకు అతని రాజ్యాధికారుల వద్దకు పంపాము. కాని వారు తిరస్కరించారు. ప్రళయం నాడు ఫిరౌన్ తన జాతి వారికి ముందుముందు నడుస్తూ, వారిని నరకం వైపునకు తీసుకుపోతాడు. ఇవి కొన్ని పట్టణాల గాథలు. వాటిని మేము నీకు వినిపిస్తున్నాము. వారు తమనుతాము ఆపదలకు గురిచేసుకున్నారు. అల్లాహ్‌ను వదిలి వారు ప్రార్థిస్తూ ఉండిన దేవుళ్ళు వారికి ఏవిధంగానూ సహాయపడలేదు. ఆ దేవుళ్ళు వారికి వినాశం, విధ్వంసం తప్ప మరో ప్రయోజనమేదీ సమకూర్చలేదు. పరలోక శిక్షకు భయపడే ప్రతి మనిషికి ఇందులో ఒక సూచన ఉంది. ఆ రోజున దురదృష్టవంతులు కొందరు ఉంటారు. అదృష్టవంతులు కొందరు ఉంటారు. అభాగ్యులైన వారు నరకానికి పోతారు. అక్కడ వేడి దప్పికల వల్ల వారు రొప్పుతూ వుంటారు. అదృష్టవంతులుగా తేలినవారు స్వర్గానికి పోతారు. అక్కడ శాశ్వతంగా ఉంటారు.

రుకూ 10 : ప్రవక్తా! ఆజ్ఞాపించిన విధంగా రుజుమార్గాన స్థిరంగా వుండండి. దైవదాస్యం హద్దులను అతిక్రమించవద్దు ఈ దుర్మార్గుల వైపు కొంచెం కూడా మొగ్గవద్దు. ఒకవేళ మొగ్గినట్లయితే నరకంలో చిక్కుకుపోతారు. నమాజు స్థాపించండి. పగటిరెండు సరిహద్దు సమయాలలో కొంత రాత్రి గడిచిన తర్వాత కూడా నమాజు స్థాపించండి. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. నీకు ముందు గతించిన జాతులలో భూమిపై కల్లోలాన్ని రేకెత్తించకుండా ప్రజలను నిరోధించిన సజ్జనులు ఎందుకు లేరు. వారిని మేము ఆ జాతుల బారి నుంచి రక్షించాము.

నీ ప్రభువు పట్టణాలను అక్కడి ప్రజలు సంస్కరణా ప్రయత్నాలు చేసేవారయినా, అన్యాయంగా నాశనం చేసేవాడు ఎంతమాత్రమూ కాదు. కనుక, ప్రవక్తా! నీవు ఆయననే సేవించు. ఆయననే నమ్ముకో. మీరు చేస్తున్నదంతా నీ ప్రభువుకు తెలియకుండా లేదు.

12. యూసుఫ్

రుకూ 1 : ప్రవక్తా! మేము వహీ ద్వారా ఈ ఖుర్‌ఆన్‌ను నీ వద్దకు పంపి సంఘటన లనూ, యదార్థాలను అత్యుత్తమ రీతిలో నీకు వివరిస్తున్నాము. యూసుఫ్ తన తండ్రితో 'నేను ఒక కలగన్నాను. అందులో పదకొండు నక్షత్రాలను, సూర్యుణ్ణి, చంద్రుణ్ణి చూశాను. అవి నా ముందు సాష్టాంగపడ్డాయి' అన్నారు. అతని తండ్రి యూసుఫ్‌ను 'కుమారా! నీ స్వప్నం గురించి నీ సోదరులకు చెప్పకు. వారు నీకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తారు. నీ ప్రభువు నిన్ను (తన పని కొరకు) ఎన్నుకుంటాడు. నీకు విషయాల లోతు అందుకోవడం నేర్పుతాడు. నీ పెద్దలైన ఇబ్రాహీముకు, ఇస్‌హాఖ్‌కు ప్రసాదించినట్లు నీకు యాకూబ్ సంతతికి తన అనుగ్రహాన్ని పూర్తిగా ప్రసాదిస్తాడు' అని అన్నారు.

రుకూ 2 : యూసుఫ్‌ను చంపాలని, లేదా ఎక్కడైనా పారేయాలని అతని సోదరులు కుట్ర చేశారు. ఈ పని చేశాక ఏమి ఎరుగనట్లు మంచిగా వ్యవహరించాలని అనుకున్నారు. తండ్రి అనుమతితో యూసుఫ్‌ను వెంట తీసుకెళ్ళాలని తర్వాత ఏ బావిలోనో పారేయాలని నిర్ణయించారు. అయితే వారితో యూసుఫ్‌ను పంపడానికి తండ్రి సంకోచించారు. కాని వాళ్ళు పట్టుబట్టి ఒప్పించారు. యూసుఫ్‌ను రక్షిస్తామని మాట ఇచ్చారు. యూసుఫ్‌ను తీసుకెళ్ళి అనుకొన్నది చేశాక ఏడుస్తూ తిరిగి వచ్చి 'నాన్నా! మేము పరుగుపందెంలో మునిగి ఉన్నప్పుడు తోడేలు ఒకటి వచ్చి అతన్ని తినేసింది' అన్నారు. యూసుఫ్ చొక్కాకు బూటకపు రక్తం పూసి తీసుకువచ్చి చూపించారు. ఇది విని వారి తండ్రి 'మీ దుష్టమనసులు మీ చేత ఒక ఘోరాన్ని చేయించాయి. సరే, ఓర్చుకుంటాను. సహాయం కోసం అల్లాహ్‌నే అర్థిస్తాను' అన్నారు. బావి వైపుగా ఒక బాటసారుల బృందం వచ్చింది. బావిలో బాలుని చూసి బయటకి తీశారు. అతడిని ఒక వ్యాపార వస్తువుగా కొన్ని దిర్హములకు అమ్మేశారు.

రుకూ 3 : అతనిని కొన్న ఈజిప్టు వ్యక్తి తన భార్యతో మనం ఇతన్ని కొడుకుగా

చేసుకోవచ్చు అని చెప్పాడు. యూసుఫ్ యుక్తవయస్కుడయ్యాక అతను ఉంటున్న ఇంటి స్త్రీ అతని కోసం వల పన్నసాగింది. ఒకరోజున తలుపులు మూసి 'వచ్చెయ్యి' అన్నది. యూసుఫ్ ఆమె నుంచి పరుగెత్తాడు, వెనుక ఆమె ఇరువురు ఒకరి వెనుక ఒకరు తలుపు వైపునకు పరుగెత్తారు. ఆమె వెనుక నుంచి యూసుఫ్ చొక్కాను లాగి చింపేసింది. వాకిలి వద్ద ఉభయులు ఆమె భర్తను చూశారు. ఆయనను చూడగానే ఆ స్త్రీ యూసుఫ్ మీద నిందవేసింది. యూసుఫ్ తాను నిర్దోషినన్నారు. ఆ స్త్రీ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి సాక్ష్యమిస్తూ 'యూసుఫ్ చొక్కా ముందు భాగం చినిగి ఉంటే స్త్రీ చెప్పేది నిజం. అతనిది అబద్ధం. కాని చొక్కా వెనుక భాగం చినిగి ఉంటే అప్పుడు స్త్రీ చెప్పేది అబద్ధం, ఆయన పలికేది నిజం' అన్నాడు. యూసుఫ్ చొక్కా వెనుక భాగం చినిగి ఉండడాన్ని చూసిన భర్త తప్పు ఎవరిదో అర్థం చేసుకున్నాడు. యూసుఫ్‌ను క్షమాపణ కోరమని ఆ స్త్రీకి చెప్పాడు.

రుకూ 4 : అజీజ్ భార్య పడుచు బానిస వెంట పడిందని పట్టణ స్త్రీలంతా చెప్పుకో సాగారు. వారి మాటలు విన్న ఆమె వారందరిని తన ఇంటికి పిలిచి విందు ఏర్పాటు చేసింది. ప్రతి వారి ముందు ఫలాలు, కోయడానికి కత్తి పెట్టింది. వారు పండ్లు కోసి తినే సమయంలో యూసుఫ్‌ను వారి ముందుకు రమ్మంటూ సైగ చేసింది. అతనిని చూసిన ఆ స్త్రీలు దిగ్భ్రమ చెందారు. తమ చేతులను కోసుకున్నారు. అప్పుడు అజీజ్ భార్య 'చూశారా! ఇతనే ఆ మనిషి. నిస్సందేహంగా నేను అతన్ని మోహింపజేయడానికి ప్రయత్నించాను. కాని ఇతను తప్పించుకున్నాడు. ఇతను గనక నా మాట వినకపోతే చెరసాల పాలవుతాడు' అన్నది. యూసుఫ్ తన ప్రభువుకు మొరపెట్టుకున్నాడు. 'ఆమె కోరే పని చేయడం కంటే చెరసాలయే నాకు ఇష్టం. ప్రభూ! నీవుగనక వారి జిత్తుల నుంచి నన్ను తప్పించకపోతే నేను వారి వలలో చిక్కుకుపోతాను. అజ్ఞానులలో కలిసిపోతాను' ప్రభువు అతని ప్రార్థనను అంగీకరించాడు.

రుకూ 5 : అతనిని కొంతకాలం జైలులో పెట్టాలని వారు (పురుషులు) అనుకున్నారు. జైలులో అతనితోపాటు మరో యుద్ధ బానిసలు కూడా ఉన్నారు. ఆ బానిసలిద్దరూ రెండు వేర్వేరు కలలు చూసి వాటి స్వప్నఫలం యూసుఫ్‌ను అడిగారు. యూసుఫ్ వారికి స్వప్న ఫలం చెప్పారు. ఆయన జైలులో ఖైదీలను అల్లాహ్ దాస్యం వైపునకు పిలిచారు 'నా తోటి ఖైదీలారా! చాలామంది విభిన్న ప్రభువులు మేలా? లేక సర్వశక్తిమంతుడైన ఏకైక దేవుడు అల్లాహ్ మేలా? మీరే ఆలోచించండి. ఆయన్ను కాదని మీరు దాస్యం

చేస్తున్నవి మీరు, మీ తాతముత్తాతలు కల్పించుకొన్న కొన్ని పేర్లు తప్ప మరేమీ కాదు. వారి కొరకు అల్లాహ్‌యే నిదర్శనాన్ని అవతరింపజేయలేదు. ఆయనకు తప్ప మరెవ్వరికీ మీరు దాస్యం చేయరాదని ఆయన ఆజ్ఞ. ఇదే శుద్ధమైన, సరైన జీవన విధానం.

రుకూ 6 : రాజు ఒక కల చూసి స్వప్న ఫలం గురించి దర్బారులో అడిగాడు. అయితే ఆయన కలకు స్వప్న ఫలం ఎవ్వరూ చెప్పలేకపోయారు. యూసుఫ్‌తో పాటు జైలులో ఉన్న ఇద్దరు ఖైదీలలో విడుదలయిపోయిన వ్యక్తి దర్బారులో ఉన్నాడు. తనను జైలులోని యూసుఫ్ వద్దకు పంపితే స్వప్న ఫలం చెప్పగలనన్నాడు. యూసుఫ్, స్వప్న ఫలం వివరిస్తూ, ఏడు సంవత్సరాలు మీరు ఎడతెగకుండా సేద్యం చేస్తూ ఉంటారు. ఆ కాలంలో మీరు కోసిన పంటలో కొంత భాగాన్ని ఆహారంగా తీసిపెట్టుకోండి. మిగతా భాగాన్ని వెన్నులలోనే ఉంచండి. తరువాత ఏడు సంవత్సరాలు బహుగడ్డుగా ఉంటాయి. మీరు నిలువ చేసి ఉంచిన దాన్యం ఆ కాలంలో మీరు తింటారు' అన్నాడు.

రుకూ 7 : రాజు యూసుఫ్‌ను తన వద్దకు పిలుచుకు రమ్మన్నాడు. రాజదూత యూసుఫ్ వద్దకు వెళ్ళినప్పుడు యూసుఫ్ అతనితో చేతులు కోసుకొన్న స్త్రీల వ్యవహారం ముందు తేల్చమన్నాడు. ఆపై రాజు ఆ స్త్రీలను విచారించాడు. వారందరూ ముక్తకంఠంతో అతని దోషం ఎంతమాత్రం లేదని అన్నారు. నిస్సందేహంగా అతడు పూర్తిగా సత్య వంతుడని అజీజ్ భార్య చెప్పింది. రాజు హజ్రత్ యూసుఫ్‌ను పిలిచి గౌరవ ప్రదమైన స్థానాన్ని ఇచ్చాడు. యూసుఫ్ దేశంలోని ఖజానాను తనకు అప్పగించమన్నారు. తనకు వాటిని రక్షించగల పరిజ్ఞానం ఉందని వాటిని రక్షించగలనని రాజుకు చెప్పారు. ఇలా మేము ఆ భూభాగంపై యూసుఫ్‌కు అధికార మార్గాన్ని సుగమం చేశాము.

రుకూ 8 : యూసుఫ్ సోదరులు ధాన్యం కొరకు ఈజిప్టుకు వచ్చి అతని ముందు హాజరయ్యారు. అతను వారిని గుర్తుపట్టాడు. కాని వారు గుర్తుపట్టలేదు. వారి సామాను సిద్ధం అయిన తర్వాత అతను వారితో 'మీ మారుసోదరుని నా వద్దకు తీసుకురండి. మీరు గనుక అతన్ని తీసుకురాకపోతే మీకు నా వద్ద ధాన్యం లభించదు' అన్నాడు. వారు తమ తండ్రి వద్దకు పోయి విషయం చెప్పారు. తండ్రి వారితో 'ఇదివరకు అతని సోదరుని విషయంలో నేను మిమ్మల్ని నమ్మినట్లుగానే ఈసారీ నమ్మాలా?' అని ప్రశ్నించారు. ఆ తర్వాత కుమారులకు హితబోధ చేస్తూ 'అల్లాహ్‌యే ఉత్తమ రక్షకుడు. ఆయనే అందరికంటే అధికంగా కరుణించేవాడు' అన్నారు.

రుకూ 9 : వారు యూసుఫ్ సమక్షానికి మరల పోయినప్పుడు అతను తన వద్దకు తన సొంత సోదరుణ్ణి వేరుగా పిలిపించుకున్నాడు. తప్పిపోయిన నీ అన్నయ్యను నేనే అని చెప్పాడు. తన సోదరుల సామానులు బస్తాలకు ఎత్తిస్తున్నప్పుడు యూసుఫ్ తన సొంత సోదరుని సామానులో తన పాత్రను పెట్టాడు. తర్వాత ప్రభుత్వోద్యోగుల తనిఖీలో ఆ పాత్ర యూసుఫ్ సోదరుని సామాను నుంచి బయటపడింది. మిగిలిన సోదరులు ఇది చూసి 'ఇతను దొంగతనం చేయడంలో ఆశ్చర్యం లేదు. ఇదివరకు ఇతని సోదరుడు (యూసుఫ్) కూడా దొంగతనం చేసి ఉన్నాడు' అన్నారు. యూసుఫ్ వారి మాటలు విని తన భావాలు అణచుకున్నాడు. లోలోన మాత్రం 'మీరు చాలా దుర్మార్గులు (నా ముఖం మీదే) నాపై మీరు వేస్తున్న అభియోగం వాస్తవమేమిటో అల్లాహ్‌కు బాగా తెలుసు' అనుకున్నాడు. దొంగతనం చేసిన సోదరుడిని వదిలి తమలో ఎవరో ఒకర్ని ఉంచుకోండనీ, తమ తండ్రి చాలా ముసలివాడనీ వారు చాలా విజ్ఞప్తులు చేశారు. కాని వారి విజ్ఞప్తులను మన్నించలేదు.

రుకూ 10 : వారు తండ్రి వద్దకు వెళ్ళి జరిగింది చెప్పారు. 'మీ కుమారుడు దొంగతనం చేశాడు. మేము అతనిని దొంగతనం చేస్తూ ఉండగా చూడలేదు' అన్నారు. వారి తండ్రి ఈ కథనాన్ని విని 'సరే, దీనిని కూడా సహిస్తాను, బాగా సహిస్తాను. చివరకు అల్లాహ్ వారందరినీ తెచ్చి నాతో కలుపవచ్చు' అన్నారు. పిదప వారి నుంచి ముఖం తిప్పుకొని 'అయ్యో! యూసుఫ్' అంటూ కుమిలిపోసాగారు. 'తన ఆందోళన గురించి, ఆవేదన గురించి అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ ఫిర్యాదు చెయ్యనని అన్నారు. తన కుమారులతో యూసుఫ్ గురించి, అతని సోదరుని గురించి దర్యాప్తు చెయ్యండని, అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందవద్దనీ, కేవలం అవిశ్వాసులే అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందుతారని బోధించారు. వారు ఈజిప్టుకు పోయి యూసుఫ్ దర్బారులో హాజరయ్యారు. ఈ సందర్భంగా యూసుఫ్ తానెవరయినది వారికి చెప్పారు. సోదరులు తమ దోషాన్ని అంగీకరించారు. యూసుఫ్ వారిని నిందించడం జరగదని అంటూ 'వెళ్ళండి నా చొక్కా తీసుకొని వెళ్ళండి. నా తండ్రి ముఖంపై వేయండి. ఆయనకు తిరిగి దృష్టి వస్తుంది. మీ కుటుంబసభ్యులు అందరినీ నా వద్దకు తీసుకురండి' అన్నారు.

రుకూ 11 : ఈజిప్టు నుంచి ఆ బిడారు బయలుదేరినప్పుడు అక్కడ కవాన్‌లో వారి తండ్రి తనకు యూసుఫ్ పరిమళం స్ఫురిస్తుందని అన్నారు. తరువాత కుమారులు

యూసుఫ్ చొక్కాను ఆయన ముఖంపై వేశాక హఠాత్తుగా ఆయనకు మళ్ళీ దృష్టి వచ్చింది. అప్పుడు వారంతా 'నాన్న! మా పాపాలను క్షమించవలసిందిగా మీరు అల్లాహ్‌ను ప్రార్థించండి. మేము నిజంగానే దోషులం' అన్నారు. పట్టణంలోకి ప్రవేశించిన తర్వాత యూసుఫ్ తన తల్లిదండ్రులను తన చేతులతో ఎత్తి సింహాసనంపై తనతో కూర్చొబెట్టుకున్నారు. అందరూ అతని ముందు అప్రయత్నంగా సజ్దాలో పడిపోయారు. యూసుఫ్ తన తండ్రితో 'నాన్నా! నేను పూర్వం చూసిన కలకు స్వప్న ఫలం ఇది. నా ప్రభువు దానిని నిజం చేశాడు. యధార్థం ఏమిటంటే, నా ప్రభువు ప్రజలు గ్రహించలేని యుక్తుల ద్వారా తన సంకల్పాన్ని నెరవేరుస్తాడు' అన్నారు.

ప్రవక్తా! ఈ గాథ అగోచర విషయాలలోనిది. దీనిని మేము వహీ ద్వారా నీకు తెలియ జేస్తున్నాము. యూసుఫ్ సోదరులు కూడబలుక్కొని కుట్ర చేసిన సమయంలో నీవు లేవు కదా!

రుకూ 12 : భూమిలో, ఆకాశాలలో ఎన్ని సూచనలు లేవు. కాని వారు వాటిని చూస్తూపోతారు. కొంచెమయినా గమనించరు. నీవు వారికి స్పష్టంగా తెలియజెయ్యి: 'నా మార్గం ఇది. నేను అల్లాహ్ వైపునకు పిలుస్తాను. నేను స్వయంగా నిండు వెలుగులో నా మార్గాన్ని చూస్తున్నాను. అల్లాహ్ పరిశుద్ధుడు. షిర్క్ చేసేవారితో నాకు ఏ సంబంధమూ లేదు. ప్రవక్తా! నీకు పూర్వం మేముపంపిన ప్రవక్తలందరూ మానవులే. ఈ పట్టణవాసులలోని వారే. వారి వైపునకు మేము వహీని పంపుతూ వచ్చాము. ఖుర్‌ఆన్‌లో చెప్పబడుతున్న ఇవన్నీ కల్పిత విషయాలు కావు. వాస్తవానికి ఇవి ఇదివరకు వచ్చిన గ్రంథాలకు ధ్రువీకరణ. ప్రతి విషయానికి వివరణ. విశ్వసించే వారికి హితబోధ. దేవుని కారుణ్యం.

13. అర్రాద్

రుకూ 1 : మీకు కనిపించే ఆధారాలు లేకుండా ఆకాశాలను నిలిపిన వాడు అల్లాహ్‌యే. తరువాత ఆయన తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు. ఆయన సూర్యుణ్ణి, చంద్రుణ్ణి ఒక నియమానికి బద్ధులుగా చేశాడు. ఈ సమస్త వ్యవస్థకు చెందిన ప్రతి వస్తువు ఒక నిర్ణీత కాలం వరకు పయనిస్తుంది. అల్లాహ్‌యే ఈ భూమిని విశాలంగా పరచినవాడు. అందులో పర్వతాలను గుంజలవలె పాతిపెట్టినవాడు. నదులను

ప్రవహింపజేసిన వాడు. ఆయనే అన్నిరకాల పండ్ల జాతులను పండించాడు. ఆయనే పగటిపై రాత్రిని కప్పేవాడు. చూడండి. భూమిలో వేర్వేరు ప్రదేశాలు ఉన్నాయి. అవి ఒకదానికొకటి పక్కపక్కనే ఉన్నాయి. ద్రాక్షతోటలు ఉన్నాయి. పంటపొలాలు ఉన్నాయి. ఖర్జూరపు చెట్లూ ఉన్నాయి. వాటిలో కొన్ని ఒక్కొక్కటిగాను, మరికొన్ని జంటలుగానూ ఉన్నాయి. వాటన్నింటికీ ఒకే నీరు పారుతోంది. కాని మేము కొన్నింటిని ఎక్కువ రుచికరమైనవిగా చేశాము. మరికొన్నింటిని తక్కువ రుచికరమైనవిగా చేశాము. ఈ అన్ని విషయాలలో బుద్ధిని ఉపయోగించే వారికి చాలా సూచనలు ఉన్నాయి.

రుకూ 2 : మీలో ఎవరైనా బిగ్గరగా మాట్లాడినా లేక మెల్లిగా మాట్లాడినా, మీలో ఎవరైనా రాత్రి చీకటిలో దాగి ఉన్నా లేక పగటి వెలుగులో నడుస్తూ ఉన్నా ఆయనకు వారంతా సమానమే. యథార్థం ఏమిటంటే, ఒక జాతి స్వయంగా తన లక్షణాలను మార్చుకోనంత వరకు అల్లాహ్ దాని స్థితిని మార్చడు. అల్లాహ్ ఒక జాతిని తన శిక్షకు గురిచేసే నిర్ణయం తీసుకున్నప్పుడు ఆ శిక్షను ఎవరు తొలగించదలిచినా అది తొలగదు. ఆయనను మాత్రమే వేడుకోవడం ధర్మం. ఆయనను వదలి వారు వేడుకొంటున్న ఇతర శక్తులు- అవి వారి ప్రార్థనలకు ఏ సమాధానమూ ఇవ్వలేవు. వాటిని వేడుకోవడం అన్నది ఒక మనిషి నీళ్ళ వైపు చేతులు సాచి దానిని 'నువ్వు నా నోటిదాకా వచ్చేయ్యి' అని అడగడం మాదిరిగా ఉంది. వాస్తవానికి నీరు అతని వద్దకు చేరడం జరగదు. గుడ్డివాళ్ళు కళ్ళున్నవారు సమానులు కాగలరా? అని అడగండి. సత్యాసత్యాల ఉదాహరణనిస్తూ ఇలా చెప్పడం జరిగింది. అల్లాహ్ ఆకాశం నుంచి నీళ్ళను కురిపించాడు. ప్రతి నది, ప్రతి కాలువ తన శక్తికొలది దానిని గ్రహించి బయలుదేరింది. వరద వచ్చినప్పుడు నీటి ఉపరితలంపై నురుగులు కూడా వచ్చాయి. అటువంటి నురుగులే నగలు, పాత్రలు మొదలైనవి చేయడానికి ప్రజలు కరిగించే లోహాలపై కూడా వస్తాయి. నురుగంత ఎగిరిపోతుంది. మానవులకు లాభం కలిగించే వస్తువు భూమిలో ఉండిపోతుంది.

రుకూ 3 : నీ ప్రభువు నీపై అవతరింపజేసిన ఈ గ్రంథం సత్యమని గ్రహించిన వ్యక్తి, ఈ యథార్థం పట్ల అంధుడైన వ్యక్తి- ఉభయులు సమానం ఎలా అవుతారు? హితబోధను వివేకవంతులు మాత్రమే స్వీకరిస్తారు. వారి ప్రవర్తన ఎలా ఉంటుందంటే 1) వారు అల్లాహ్‌తో చేసుకున్న తమ ఒడంబడికను నెరవేరుస్తారు 2) అల్లాహ్ స్థిరపరచండని ఆదేశించి సంబంధాలు స్థిరపరుస్తారు 3) ప్రభువునకు తమ నుంచి

కఠినంగా లెక్క తీసుకుంటారేమోనని భయపడుతూ ఉంటారు 4) తమ ప్రభువు ప్రసన్నత కోసం సహనంతో వ్యవహరిస్తారు 5) నమాజును స్థాపిస్తారు 6) మేము ప్రసాదించిన ఉపాధి నుంచి బహిరంగంగా, రహస్యంగా ఖర్చు చేస్తారు 7) చెడును మంచి ద్వారా పారద్రోలుతారు. పరలోక గృహం వారి కొరకే ఉన్నది. అల్లాహ్ తన ఇష్టప్రకారం కొందరికి ఎక్కువ జీవనోపాధి ఇస్తాడు. కొందరికి తక్కువ జీవనోపాధి ఇస్తాడు.

రుకూ 4 : అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు. ఆయన తన వైపునకు మరలేవారిని మాత్రమే తన వైపునకు వచ్చే మార్గాన్ని చూపుతాడు. వారి హృదయాలకు అల్లాహ్ సంస్మరణం వల్ల తృప్తి కలుగుతుంది. తెలుసుకోండి, అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు తృప్తి పొందే భాగ్యం లభిస్తుంది. ప్రవక్తా! ప్రజలు ఎంతో కరుణామయుడైన తమ దేవుణ్ణి తిరస్కరిస్తున్న స్థితిలో ఉన్నారు. మేము నీపై అవతరింపజేసిన సందేశాన్ని వారికి వినిపించు. పర్వతాలను నడిపించే, భూమిని బ్రద్దలు చేసే, మృతులను గోరీ నుంచి బయటకు రప్పించి మాట్లాడించే లాంటి ఖుర్‌ఆన్ దేనినైనా అవతరింపజేయడం అల్లాహ్‌కు కష్టం కాదు. అల్లాహ్ పట్ల అవిశ్వాస వైఖరి అవలంభించేవారికి వారి చేష్టల కారణంగా ఏదో ఒక ఆపద వస్తూనే ఉంటుంది. లేదా వారి ఇళ్ళకు సమీపంలో ఎక్కడైనా దిగుతుంది.

రుకూ 5 : అల్లాహ్ ఎల్లప్పుడూ తిరస్కారులకు కొంత సడలింపు ఇస్తాడు. చివరకు వారిని పట్టుకొని కఠిన శిక్ష విధిస్తాడు. సత్యసందేశాన్ని తిరస్కరించినవారికి తమ పన్నాగాలు ఆకర్షకంగా కనబడేలా చెయ్యబడ్డాయి. వారు సన్మార్గం నుంచి నిరోధించబడ్డారు. మార్గభ్రష్టత్వంలోకి స్వయంగా అల్లాహ్‌యే విసిరివేసిన వాడికి మార్గం చూపేవాడు ఎవడూ లేడు. ప్రవక్తా! స్పష్టంగా వారికి చెప్పండి 'అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని నాకు ఆజ్ఞ అయ్యింది. ఇతరులను భాగస్వాములుగా నిలబెట్టడం నాకు నిషేధించబడింది. కనుక నేను మిమ్మల్ని ఆయన వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఆయన వైపునకే నేను మరలుతాను' ఇక నీవు గనక నీ వద్దకు ఈ జ్ఞానం వచ్చిన తర్వాత కూడా ప్రజల కోరికలను అనుసరిస్తే అల్లాహ్ సమక్షంలో నిన్ను రక్షించేవాడు గాని, నీకు సహాయపడేవాడు గానీ ఎవడూ ఉండడు.

రుకూ 6 : నీకు పూర్వం కూడా మేము చాలామంది ప్రవక్తలను పంపాము. వారిని

ఆలుబిడ్డలు కలవారు గానే మేము చేశాము. అల్లాహ్ అనుమతి లేకుండా ఏ సూచన నయినా స్వయంగా తెచ్చి చూపే శక్తి ఏ ప్రవక్తకూ లేదు. ఈ ప్రజలు చూడడం లేదా! మేము ఈ భూభాగంపై పురోగమిస్తూ దాని పరిధిని అన్నివైపుల నుంచి తగ్గిస్తూ వస్తు న్నాము. అల్లాహ్ సృష్టిని శాసిస్తున్నాడు. ఆయన నిర్ణయాలను పున:పరిశీలించగల వాడెవడులేడు. వారికి పూర్వం గతించిన ప్రజలు కూడా పెద్దపెద్ద పన్నాగాలు పన్నారు. కాని నిర్ణయాత్మకమైన అసలు పన్నాగం పూర్తిగా అల్లాహ్ చేతులలోనే ఉంది.

14. ఇబ్రాహీమ్

రుకూ 1 : ఇది ఒక గ్రంథం. మేము దీనిని నీ వైపునకు అవతరింపజేశాము. ప్రభువు అనుమతితో నీవు ప్రజలను చీకట్ల నుంచి వెలికి తీసి వెలుగులోకి తీసుకురావాలని, మహాశక్తిమంతుడు, స్తోత్రాలకు స్వతహా అర్హుడు భూమ్యాకాశాలలో ఉన్న సమస్తానికి స్వామి అయిన దేవుని మార్గం మీదకు తీసుకురావాలనీ అవతరింపజేశాము. సత్యాన్ని తిరస్కరించే వారికి కఠినమైన, వినాశకరమైన శిక్ష పడుతుంది. వారు పరలోక జీవితం కంటే ఇహలోక జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వారు ప్రజలను అల్లాహ్ మార్గం నుంచి వారిస్తారు. ఈ మార్గం తమ కోరికలకు అనుగుణంగా వక్రమైనదిగా ఉండాలని కోరుతారు. మేము ఇంతకు ముందు మూసాకు కూడా మా సూచనలు ఇచ్చి పంపి ఉన్నాము. ఆయన్ను మేము 'నీ జాతి వారిని చీకట్ల నుంచి వెలుగుకు తీసుకురా, చరిత్రలో గుణపాఠంతో నిండి ఉన్న సంఘటనలు వారికి వినిపించు, హితబోధ చెయ్యి. ఈ సంఘటనలలో సహనశీలుడు, కృతజ్ఞుడు అయిన ప్రతి మనిషికీ గొప్ప నిదర్శనాలున్నాయి' అని ఆజ్ఞాపించాము.

రుకూ 2 : నూహ్ జాతి, ఆద్ జాతి, సమూద్ జాతి, ఇంకా వాటి తర్వాత వచ్చిన అనేక జాతుల వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన మాటలనూ, ప్రస్ఫుటమైన నిదర్శనాలనూ తీసుకొని వచ్చినప్పుడు ఆ ప్రజలు తమ ప్రవక్తలతో రుజువులు చూపండని కోరారు. అప్పుడు ఆ ప్రవక్తలు 'నిజంగానే, మేము మీవంటి మానవులమే తప్ప మరేమీ కాదు. ఏదైనా రుజువు తెచ్చి మీకు చూపడం అన్నది అల్లాహ్ అనుమతితో మాత్రమే జరుగుతుంది. విశ్వాసులు అల్లాహ్‌నే నమ్ముకోవాలి' అన్నారు.

రుకూ 3 : ప్రతి కాలంలోనూ తిరస్కారులు తమ ప్రవక్తలతో 'మీరు మా మతంలోకి

తిరిగి రావాలి. లేకపోతే మేము మిమ్మల్ని మా దేశం నుంచి బహిష్కరిస్తాం' అన్నారు. అప్పుడు వారి ప్రభువు వారికి 'వహీ' పంపి 'మేము ఈ దుర్మార్గులను నాశనం చేస్తాము. వారి తర్వాత మిమ్మల్ని భూమిపై నివసింపజేస్తాము. నా సాన్నిధ్యంలో సమాధానం చెప్పుకోవాలని భయపడుతూ, నా శిక్షకు భయపడుతూ ఉండే వ్యక్తికే ఈ బహుమానం' అని తెలిపాడు. తమ ప్రభువును విశ్వసించనివారు చేసే పనులను తుఫాను రోజున వీచే పెనుగాలిలో ఎగిరే బూడిదతో పోల్చవచ్చు. వారు తాము చేసిన దానికి ఎటువంటి ప్రతిఫలాన్ని పొందలేరు. ఈ ప్రజలందరినీ కలిపి అల్లాహ్ ముందు హాజరు పరిచినప్పుడు వారిలో ప్రపంచంలో బలహీనులుగా ఉన్నవారు ప్రపంచంలో పెద్ద మనుషులుగా చలామణి అయినవారితో ఇలా అడుగుతారు: "ప్రపంచంలో మేము మిమ్మల్ని అనుసరించాము. ఇప్పుడు అల్లాహ్ శిక్ష నుంచి కాపాడడానికి మీరేమయినా చెయ్యగలరా?' అందుకు జవాబుగా వారు 'ఇప్పుడు మనం ఏడ్చి మొత్తుకున్నా, లేక ఓర్పు వహించినా, ఏం చేసినా మనం తప్పించుకునే మార్గం ఏదీలేదు' అనంటారు.

రుకూ 4 : ప్రళయదినాన షైతాను ఇలా చెబుతాడు : 'వాస్తవానికి అల్లాహ్ మీకు చేసిన వాగ్దానాలన్ని నిజమైనవే. నేను మీకు చేసిన వాగ్దానాలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. నాకు మీమీద ఎటువంటి అధికారమూ లేదు. నేను మిమ్మల్ని నా మార్గం వైపునకు ఆహ్వానించడం తప్ప మరేమీ చేయలేదు. మీరు నా ఆహ్వానాన్ని అంగీకరించారు. ఇప్పుడు నన్ను నిందించకండి. మిమ్మల్ని మీరే నిందించుకోండి. ఇక్కడ మీ మొరలను నేను ఆలకించలేను. నా మొరలను మీరూ ఆలకించలేరు. పూర్వం మీరు నన్ను దైవత్వంలో భాగస్తునిగా చేశారు. దానికి నా బాధ్యత ఏమీ లేదు' సత్య విశ్వాసం వాక్కును అల్లాహ్ ఏ వస్తువులతో పోల్చాడో మీరు గమనించడం లేదా? ఆ పోలిక ఇలా ఉంది : ఒక మేలు జాతి చెట్టు, దాని వేళ్ళు భూమిలో లోతుగా నాటుకొని ఉన్నాయి. కొమ్మలు ఆకాశాన్ని అంటాయి.ప్రతి క్షణం అది తన ప్రభువు ఆజ్ఞానుసారం తన పండ్లను ఇస్తుంది– అసత్యాన్ని ఒక చెడ్డ జాతి చెట్టుతో పోల్చవచ్చు. అది భూమి ఉపరితలం నుంచి పీకి పారవేయబడుతుంది.

రుకూ 5 : ప్రవక్తా! విశ్వసించిన నా దాసులకు చెప్పు. క్రయ విక్రయాలు కానీ, మిత్రుల సాయం పొందడం కాని సాధ్యపడని రోజు రాక ముందే నమాజును స్థాపించండని, మేము వారికి ఇచ్చిన దాని నుంచి బహిరంగంగా, గుప్తంగా (మంచి పనులకు) ఖర్చు పెట్టండనీ చెప్పు. భూమిని ఆకాశాలను పుట్టించిన వాడు అల్లాహ్. ఆకాశం నుంచి

నీళ్ళను కురిపించినవాడు, దాని ద్వారా మీ ఆహారం కొరకు రకరకాల ఫలాలను సృష్టించినవాడు, తన ఆజ్ఞానుసారం సముద్రంలో నడిచే పడవను మీ సేవకై మీకు లోబరచినవాడు, నదులను మీ సేవకై మీకు లోబరచిన వాడు, నిరంతర ప్రయాణం చేస్తున్న సూర్యచంద్రులు మీ కొరకే ప్రయాణిస్తున్నాయి. రాత్రిని పగలును మీ సేవకై చేసినవాడు, మీరు అడిగిన సమస్తాన్ని మీకు ఇచ్చినవాడు అల్లాహ్‌యే. మీరు గనుక ఆయన అనుగ్రహాలను లెక్కించదలిస్తే లెక్కించలేరు. నిజంగా మానవుడు నీతిలేనివాడు, కృతఘ్నుడు.

రుకూ 6 : ఇబ్రాహీమ్ తన ప్రభువుతో 'ప్రభూ ఈ నగరాన్ని (మక్కాను) శాంతి నగరంగా చెయ్యి. నన్ను, నా సంతానాన్ని విగ్రహ పూజ నుంచి కాపాడు. ప్రభూ, ఈ విగ్రహాలు చాలామందిని మార్గం తప్పించాయి. ప్రభూ, నీటిచుక్క, గడ్డిపరక లేని లోయలో నా సంతానంలో కొందరిని తెచ్చి నీ పవిత్ర గృహం వద్ద నివసింపజేశాను. ప్రభూ, వారు ఇక్కడ నమాజు స్థాపించాలని నేను ఆశించాను. కనుక నీవు ప్రజల హృదయాలను ఆసక్తితో వారివైపు మొగ్గేలా చెయ్యి. తినడానికి వారికి పండ్లు ప్రసాదించు. ప్రభూ, నన్ను నమాజు స్థాపించే వానిగా చెయ్యి. నా సంతతిలో కూడా ఈ పనిచేసేవాళ్ళను లేపు. ప్రభూ, నా ప్రార్థనలు స్వీకరించు. ప్రభూ, నన్ను నా తల్లిదండ్రులను విశ్వసించేవారందరినీ లెక్క ఖరారు అయ్యే రోజున క్షమించు' అని ప్రార్థించారు.

రుకూ 7 : దుర్మార్గులు తమ ఎత్తులన్నీ వేసి చూశారు. కాని అల్లాహ్ వారి ప్రతి ఎత్తు చిత్తు చేశాడు. వాస్తవానికి కొండలను సైతం కదిలించే భయంకరమైన ఎత్తులు వేశారు వాళ్ళు. భూమ్యాకాశాల రూపాలను పూర్తిగా మార్చడం జరిగే రోజు గురించి నీవు వారిని భయపెట్టు. అద్వితీయుడు, రౌద్రుడు అయిన అల్లాహ్ ముందు అందరూ హాజరవుతారు. ఆ రోజు నీవు దోషులను చూస్తావు. వారి చేతులు, కాళ్ళు బేడీలతో బంధించబడి ఉంటాయి. వారు తారు వస్త్రాలు ధరించి ఉంటారు. అగ్నిజ్వాలలు వారి ముఖాలను కమ్ముకుంటాయి. అల్లాహ్ ప్రతి వ్యక్తికి అతను చేసిన దానికి ప్రతిఫలం ఇచ్చేందుకు ఇలా జరుగుతుంది.

15. అల్ హిజ్ర్

రుకూ 1 : ఇది జ్ఞాపిక, దీనిని మేము అవతరింపజేశాము. స్వయంగా మేమే దీనిని

రక్షిస్తాము. దోషుల గుండెలలోకి మేము ఈ జ్ఞాపికను ఊచలా పోనిచ్చినా వారు దానిని విశ్వసించడం అనేది జరగదు. పూర్వకాలం నుంచి కూడా ఇటువంటి ప్రజల పద్ధతి ఇలానే ఉంటూ వచ్చింది. ఒకవేళ మేము వారి కొరకు ఏదైనా ఆకాశ ద్వారాన్ని తెరిచినా వారు పట్టపగలు అందులోకి ఎక్కిపోతూ ఉన్నప్పుడు కూడా వారు 'మా కళ్ళు మోసపోతున్నాయి. మాపై మంత్రజాలం ప్రయోగించారు' అనే అంటారు.

రుకూ 2 : మేము ఆకాశంలో దృఢమైన కోటలు అనేకం నిర్మింపజేశాము. చూపరుల కోసం వాటిని నక్షత్రాలతో అలంకరించాము. శాపగ్రస్తుడైన ప్రతి షైతాన్ నుంచి వాటిని సురక్షితం చేశాము. షైతాన్ ఎవడైనా వాటిలోకి పోలేడు. దొంగచాటుగా ఏదైనా వినడం తప్ప. దొంగచాటుగా వినే ప్రయత్నం వాడు చేసినప్పుడు అగ్నిజ్వాల ఒకటి వాడిని వెంటాడుతుంది. అల్లాహ్ ఇక్కడ తన అనుగ్రహాలను ప్రస్తావించాడు. మీకు పూర్వం గతించినవారిని తరువాత వచ్చేవారిని నిశ్చయంగా మీ ప్రభువు అందరిని, సమావేశపరుస్తాడని చెప్పబడింది.

రుకూ 3 : మేము మానవుణ్ణి కుళ్ళిన మట్టి ఎండిన గారతో సృష్టించాము. దీనికి పూర్వం జిన్నాతును మేము తీవ్రమైన ఉష్ణజ్వాలతో సృష్టించాము. నీ ప్రభువు దైవదూతలతో 'నేను కుళ్ళిన మట్టి ఎండిన గారతో ఒక మానవుణ్ణి సృష్టిస్తున్నాను. నేను అతణ్ణి పూర్తిగా తయారు చేసి నా ఆత్మను కొద్దిగా ఊదినప్పుడు మీరంతా అతడికి సాష్టాంగపడాలి' అని చెప్పినప్పుడు దైవదూతలందరూ సాష్టాంగపడ్డారు. ఒక్క ఇబ్లీసు తప్ప. ధిక్కారం గురించి ప్రశ్నించినప్పుడు అతడు 'కుళ్ళిన మట్టి ఎండిన గారతో నీవు సృష్టించిన ఈ మనిషికి సాష్టాంగపడడం నాకు తగిన పని కాదు. అల్లాహ్ ఈ మాటలకు ఆగ్రహిం చాడు. షైతాన్ ప్రళయం వరకు తనకు వ్యవధినివ్వమని కోరాడు. అతడికి వ్యవధి ఇవ్వబడింది. అప్పుడు ఇబ్లీసు 'ఇక నేను మనసును మోహింపజేసే విషయాలను భూమిలో సృష్టించి వారందరినీ అపమార్గం పట్టిస్తాను' అన్నాడు. అయితే నిజమైన అల్లాహ్‌దాసులపై వాడి ఆటలు సాగవు.

రుకూ 4 : భయభక్తులు కలవారు తోటలలో చెలమల మధ్య ఉంటారు. వారితో 'వాటిలోకి ప్రవేశించండి. శాంతిగా, నిర్భయంగా' అనడం జరుగుతుంది. వారి హృద యాలలో మిగిలివున్న మాలిన్యాన్ని కాపట్యాన్ని మేము తొలగిస్తాము. వారు పరస్పరం సోదరులైపోతారు– హజ్రత్ ఇబ్రాహీమ్‌కు కుమారుడు పుడతాడన్న శుభవార్త

దైవదూతలు వినిపించారు. అప్పుడాయన 'ఏమిటి? ఈ ముసలితనంలో సంతాన శుభవార్త వినిపిస్తున్నారా?' అన్నారు. అందుకు దైవదూతలు 'మేము మీకు సత్యమైన శుభవార్త అందజేస్తున్నాము. మీరు నిరాశ పడకండి' అన్నారు. ఇబ్రాహీమ్ 'తమ ప్రభువు కారుణ్యం పట్ల మార్గం తప్పిన వారు మాత్రమే నిరాశ చెందుతారు' అని బదులిచ్చారు.

రుకూ 5 : లూత్ జాతి ప్రజలు నీచకృత్యానికి పాల్పడసాగారు. స్త్రీలను వదిలి పురుషులతో కోరికలు తీర్చుకోసాగారు. ఈ నీచ చేష్టలు మానండని లూత్ ఎంత చెప్పినా ఆ జాతి వినలేదు. అల్లాహ్ లూత్‌ను ఇంటివారిని రక్షించాడు. తెల్లవారగానే ఒక భయంకరమైన ప్రేలుడు వారిపైకి వచ్చిపడింది. ఆ నగరాన్ని తలక్రిందులు చేసింది. వారిపై కాల్చిన మట్టిరాళ్ళ వర్షం కురిసింది.

రుకూ 6 : ప్రవక్త మేము నీకు ఏడు ఆయత్‌లు ఇచ్చాము. అవి మాటిమాటికి పఠించ దగ్గవి. ఇంకా నీకు మహత్తరమైన ఖుర్‌ఆన్‌ను ప్రసాదించాము. వారిలోని విభిన్న వర్గాల వారికి మేము ఇచ్చిన ఐహిక సంపద వైపు నువ్వు కన్నెత్తి చూడకు. ప్రవక్తా! నీకు ఆజ్ఞాపించబడిన విషయాన్ని బహిరంగంగా ఎలుగెత్తి చాటు. షిర్కు చేసేవారిని ఏమాత్రం లెక్కచెయ్యకు. నీ ప్రభువు స్తోత్రం చేస్తూ ఆయన పవిత్ర నామాన్ని స్మరించు. ఆయన సన్నిధిలో సాష్టాంగపడు. తప్పనిసరిగా వచ్చే చివరి ఘడియ వరకు నీ ప్రభువు దాస్యం చేస్తూ ఉండు.

16. అన్ నహ్ల్

రుకూ 1 : ఆయన మానవుణ్ణి స్వల్పమైన బిందువుతో సృష్టించాడు. చూస్తూ చూస్తూ ఉండగానే అతను ఒక బహిరంగ వివాదిగా మారిపోయాడు. ఆయన పశువులను సృష్టించాడు. గుర్రాలను, కంచర గాడిదలను, గాడిదలను మీ సేవ కొరకు సృష్టించాడు. మీరు స్వారీ చేయడానికి, మీ జీవితాలకు శోభను చేకూర్చడానికి వీటిని సృష్టించాడు. ఆయన ఇంకా చాలా వస్తువులను మీ ప్రయోజనం కొరకు సృష్టిస్తాడు. వాటి గురించి మీకసలు తెలియదు.

రుకూ 2 : ఆకాశం నుంచి భూమి వరకు వివేకంగల వారికి అనేక సూచనలున్నాయి. వాటిలో మనిషికి ప్రయోజనం చేకూర్చేవి అసంఖ్యాకంగా ఉన్నాయి. సృష్టించేవాడు,

అసలు ఏదీ సృష్టించనివాడు ఈ ఉభయులు సమానులెలా అవుతారు? మీరు ఈ మాత్రం అర్థం చేసుకోలేరా? ఒకవేళ మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే లెక్కించలేరు? అల్లాహ్‌ను వదిలి ప్రజలు వేడుకుంటున్న ఇతర శక్తులు ఏ వస్తువుకు సృష్టికర్తలుకారు. వారు స్వయంగా సృష్టించబడినవారు. నిర్జీవులే కాని సజీవులు కారు. వారు మళ్ళీ బ్రతికించబడి ఎప్పుడు లేపబడనున్నారో వారికెంత మాత్రం తెలియదు.

రుకూ 3 : అహంభావానికి గురైన వారిని అల్లాహ్ ఎంతమాత్రం ప్రేమించడు. వారు ప్రళయం నాడు తమ బరువును పూర్తిగా మోస్తారు. దానికితోడు వారు అజ్ఞానం వల్ల అపమార్గం పట్టిస్తున్న వారి బరువును కూడా కొంత మోస్తారు.

రుకూ 4 : ప్రళయం నాడు అల్లాహ్ అవిశ్వాసులను అవమానపరుస్తాడు. హీనపరుస్తాడు. వారితో 'ఎక్కడ ఉన్నారో చూపించండి నా భాగస్వాములు– వారి కోసమే మీరు సత్యవాదులతో పోట్లాడేవారు కదా, చూపించండి' అని ప్రశ్నిస్తాడు. ఇకపొండి, నరకద్వారాలలో దూరిపొండి. అక్కడనే మీరు శాశ్వతంగా ఉంటారు. సజ్జనులకు ఈ ప్రపంచంలోనూ మేలు కలుగుతుంది. ఇక పరలోక గృహం కూడా తప్పనిసరిగా వారికి ఎంతో మేలైనదిగా ఉంటుంది. వారు పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ 'మీకు శాంతి కలుగుగాక!' మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి' అని అంటారు.

రుకూ 5 : మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతిని ద్వారా అందరిని హెచ్చరిస్తూ 'అల్లాహ్‌ను ఆరాధించండి. మిథ్యాదైవాల ఆరాధనకు దూరంగా ఉండండి' అని తెలిపాము. కాస్త భూమిపై సంచారం చేసి చూడండి. తిరస్కారులకు ఏ గతి పట్టిందో. చనిపోయినవాణ్ణి అల్లాహ్ మళ్ళీ బ్రతికించి లేపడం జరుగుతుంది. ఎందుకంటే వారు విభేదిస్తూ ఉన్నటువంటి వాస్తవాన్ని వారి ముందు అల్లాహ్ బహిర్గతం చేయడానికి. సత్య తిరస్కారులు తమ అసత్యాన్ని తెలుసుకోవడానికి.

రుకూ 6 : ప్రవక్తా! ఇప్పుడు ఈ జ్ఞాపికను నీపై అవతరింపజేశాము. నీవు ప్రజల ముందు వారి కోసం అవతరింపజేయబడిన ఉపదేశాన్ని స్పష్టంగా వివరించడానికి, ప్రజలు కూడా ఆలోచించడానికి దీన్ని అవతరింపజేశాము. ప్రవక్త సందేశానికి వ్యతిరేకంగా అత్యంత దుష్ట పన్నాగాలను పన్నుతున్న వారిని అల్లాహ్ భూమిలో దిగబడిపోయేలా చేస్తాడని లేదా వారు ఊహించని దిక్కు నుంచి వారిపైకి శిక్షను

తీసుకువస్తాడని, లేదా వారు తిరుగాడుతూ ఉన్నప్పుడు అకస్మాత్తుగా పట్టుకుంటాడని లేదా రాబోయే ఆపదకు భయపడి దాని నుంచి తప్పించుకొనే ప్రయత్నాలు చేస్తున్నప్పుడు వారిని పట్టుకుంటాడని వారికి భయం లేకుండా పోయిందా?

రుకూ 7 : దేవుడు ఒక్కడే. కాబట్టి మీరు నాకే భయపడండి. ఆకాశాలలో ఉన్నదంతా భూమిలో ఉన్నదంతా ఆయనదే. కేవలం ఆయన ధర్మం మాత్రమే సృష్టి అంతటా అనుసరించబడుతోంది. మీకేదైనా గడ్డుకాలం దాపురించినప్పుడు, మీరు మొరపెడుతూ ఆయన వైపునకే పరుగెత్తుతారు. కాని అల్లాహ్ ఆ గడ్డుకాలాన్ని తొలగించినప్పుడు, మీలో ఒక వర్గం తన ప్రభువునకు భాగస్వాములుగా ఇతరులను నిలబెడుతుంది. వారిలో ఎవడికైనా కూతురు పుట్టిందని శుభవార్త అందజేస్తే అతడి ముఖం నల్లబడిపోతుంది. లోలోన కుమిలిపోతాడు. ఈ దుర్వార్త విన్న తర్వాత ఇక లోకులకు ఎలా ముఖం చూపాలి అని నక్కినక్కి తిరుగుతుంటాడు. ఒకవేళ అల్లాహ్ ప్రజలను వారి మితిమీరిన ప్రవర్తనకు పట్టుకోదలిస్తే భూమిపై ఏ ప్రాణిని వదిలిపెట్టడు. కాని ఆయన అందరికీ ఒక నిర్ణీత కాలం వరకు గడువు ఇస్తాడు. నీకు పూర్వం కూడా ఎన్నో జాతుల వద్దకు మేము ప్రవక్తలను పంపి ఉన్నాము. వారికి షైతాన్ చెడ్డపనులను మనోహరమైనవిగా చూపాడు. ఆ షైతాన్ ఈనాడు వీరికి సంరక్షకుడై కూర్చున్నాడు. ఈ గ్రంథాన్ని నీపై ఎందుకు అవతరింపజేశామంటే వారు విభేదిస్తున్న విషయాల యధార్థాన్ని నీవు వారికి స్పష్టం చెయ్యాలని. ఈ గ్రంథం విశ్వసించిన వారికి మార్గదర్శకం గానూ కారుణ్యం గానూ అవతరించింది.

రుకూ 8 : మీకు పశువులలో కూడా ఒక గుణపాఠం ఉంది. వాటి గర్భంలో పేడ, రక్తాలకు మధ్య ఉన్న ఒక వస్తువును మేము మీకు తాగిస్తాము. అంటే స్వచ్ఛమైన పాలు. అవి తాగేవారికి ఎంతోకమ్మగా ఉంటాయి. ఇదేవిధంగా ఖర్జూరపు చెట్లు, ద్రాక్ష తీగెల నుంచి కూడా మేము ఒక పదార్థాన్ని మీకు త్రాగిస్తాము. దానిని మీరు మత్తు పానీయంగా కూడా చేసుకుంటారు. పరిశుద్ధమైన ఆహారంగా కూడా ఉపయోగిస్తారు. తేనెటీగ కడుపులో నుంచి రంగురంగుల పానకం ఒకటి వెలువడుతుంది. అందులో ప్రజలకు వ్యాధి నివారణ శక్తి ఉంది. ఆలోచించే వారికి ఇందులో కూడా నిశ్చయంగా ఒక సూచన ఉన్నది.

రుకూ 10 : చూడండి, అల్లాహ్ మీలో కొందరికి, ఇతరులకన్నా ఎక్కువగా ప్రసాదించాడు. అల్లాహ్‌యే మీ కోసం మీ జాతి నుంచే భార్యలను చేశాడు. ఆ భార్యల ద్వారా

మీకు కుమారులను, మనవలను ఆయనే ప్రసాదించాడు. మంచి మంచి వస్తువులను మీకు తినడానికి ఇచ్చాడు. అయితే ఇదంతా తెలిసి కూడా వారు అసత్యాన్నే విశ్వసిస్తున్నారా? అల్లాహ్ ఉపకారాన్నే తిరస్కరిస్తున్నారా? అల్లాహ్‌ను విడిచి వీళ్ళు పూజిస్తున్నవి ఎలాంటి శక్తి లేనివి మాత్రమే. అధికారం ఉన్నవాడు, లేనివాడు ఇద్దరు సమానులెలా అవుతారు?

రుకూ 11 : అల్లాహ్ మిమ్మల్ని, మీరు ఏదీ ఎరుగని స్థితిలో మీ మాతృగర్భాల నుంచి బయటకు తీశాడు. ఆయన మీకు చెవులు ఇచ్చాడు. కళ్ళు ఇచ్చాడు. ఆలోచించే మనసు ఇచ్చాడు– మీరు కృతజ్ఞులవుతారని.

గగన మండలంలో భద్రంగా విహరించే పక్షులను వారు ఎన్నడూ చూడలేదా? వాటిని క్రింద పడకుండా నిలిపి ఉంచేది అల్లాహ్ తప్ప ఇంకెవరు? ఈవిధంగా అల్లాహ్ తన అనుగ్రహాలను మానవులకు, వారు విధేయులవుతారని పూర్తిగా ప్రసాదిస్తాడు. వారు ఒకవేళ విముఖులైతే, ప్రవక్తా! సత్యసందేశాన్ని స్పష్టంగా అందజెయ్యడం తప్ప నీపై మరొక బాధ్యత లేదు.

రుకూ 12 : స్వయంగా అవిశ్వాస మార్గాన్ని అవలంభించిన వారికి అల్లాహ్ మార్గంలో ఇతరులను నిరోధించిన వారికి దుర్మార్గులకు మేము శిక్షపై శిక్ష విధిస్తాము. వారు ప్రపంచంలో వ్యాపింపజేసిన దుర్మార్గానికి బదులుగా శిక్ష తప్పదు. మేము ప్రతి సంఘం నుంచి ఒక సాక్షిని లేపి నిలబెట్టే రోజు గురించి ప్రవక్తా! వారిని హెచ్చరించు. ఆ సాక్షి తన సంఘానికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాడు. వీరికి వ్యతిరేకంగా సాక్ష్యమివ్వడానికి మేము నిన్ను తీసుకుని వస్తాము. ఈ సాక్ష్యం కొరకు సన్నాహంగా మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. అది ప్రతి విషయాన్ని స్పష్టంగా వివరిస్తుంది. విధేయులయిన వారికి అది ఉపదేశం, కారుణ్యం, శుభవార్త.

రుకూ 13 : న్యాయం చెయ్యండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ, అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడును, అశ్లీలాన్ని, అన్యాయాన్ని మితిమీరి ప్రవర్తించడాన్ని నిషేధిస్తున్నాడు. మీరు గుణపాఠం నేర్చుకోవాలని ఆయన మీకు హితబోధ చేస్తున్నాడు. మీరు అల్లాహ్‌తో ఏదైనా వాగ్దానం చేసి ఉంటే ఆ వాగ్దానాన్ని నెరవేర్చండి. అల్లాహ్ సాక్షిగా చేసిన ప్రమాణాలను దృఢపరిచిన తర్వాత భంగపరచకండి. శ్రమతో నూలు వడికి తర్వాత తానే దానిని ముక్కలు ముక్కలుగా

చేసిన స్త్రీ పరిస్థితి వంటి పరిస్థితి మీది కారాదు. మీరు మీ వ్యవహారాలలో ఒకరినొకరు మోసగించుకోవడానికి ప్రమాణాలను పనిముట్లుగా చేసుకోరాదు. అపరాధానికి దుష్ఫలితాన్ని చూస్తారు. శిక్ష అనుభవిస్తారు. మీరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని స్వల్ప లాభానికి అమ్మివేయకండి. పురుషుడైనా, స్త్రీ అయినా సత్కర్మలు చేస్తే, విశ్వాసి అయిన పక్షంలో మేము అతనిని ప్రపంచంలో పరిశుద్ధ జీవితం గడిపేలా చేస్తాము. పరలోకంలో అటువంటి వారి మంచిపనులకు అనుగుణంగా ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము.

రుకూ 14 : నా ప్రభువు తరఫు నుంచి పరిశుద్ధాత్మ దీనిని ఉన్నది ఉన్నట్లుగా క్రమ క్రమంగా అవతరింపజేశాడు. విశ్వాసుల విశ్వాసాన్ని పటిష్టం చేయడానికి, జీవితానికి సంబంధించిన వ్యవహారాలలో విధేయులకు సరైన మార్గం చూపడానికి అవతరింప జేశాడు. అల్లాహ్ ఆయతులను విశ్వసించని వారికి అల్లాహ్ ఎన్నడూ సరైన విషయం వరకు చేరుకునే భాగ్యాన్ని కలుగజెయ్యడు.ఎవరైనా విశ్వసించిన తర్వాత ఎవరి బలవంతం వల్లనయినా అవిశ్వాసిగా మారిన పక్షంలో అతని హృదయం విశ్వాసం పట్ల తృప్తితో ఉంటే అది వేరే విషయం, కాని ఎవరైనా హృదయ పూర్వకంగా అవిశ్వాసానికి పాల్పడితే, అతనిపై అల్లాహ్ ఆగ్రహం పడుతుంది.

రుకూ 15 : అల్లాహ్ ఒక జనపదానికి సంబంధించిన ఉదాహరణ ఇస్తున్నాడు. ఆ జన పదం శాంతి, సంతోషాల జీవితాన్ని గడుపుతూ ఉండేది. అన్నివైపుల నుంచి దానికి ఆహారం పుష్కలంగా అందుతూ ఉండేది. అప్పుడు అది అల్లాహ్ కానుకలకు కృతఘ్నత చూపడం ప్రారంభించింది. అప్పుడు అల్లాహ్ అక్కడి పౌరులకు వారి అకృత్యాల రుచిని చూపాడు. ఆకలి, భయమూ అనే ఆపదలు వారిని చుట్టుముట్టాయి. వారి వద్దకు వారి జాతి నుంచే ఒక ప్రవక్త వచ్చాడు. కాని వారు ఆయనను తిరస్కరించారు. చివరకు వారు పూర్తిగా దుర్మార్గులైపోయినప్పుడు వారిని శిక్ష పట్టుకుంది. కనుక ప్రజలారా! అల్లాహ్ మీకు ప్రసాదించిన ధర్మసమ్మతమైనటువంటి, పరిశుద్ధమైనటువంటి ఆహారాన్ని తినండి. అల్లాహ్ చేసిన మేలుకు కృతజ్ఞతలు తెలుపండి.

రుకూ 16 : ఇబ్రాహీమ్ ఒక సంఘం వంటి వారు. అల్లాహ్‌కు పరమ విధేయుడు. ఆయన యందే మనసు నిలిపినవాడు. అతను ఎన్నడూ ముష్రిక్కుగా లేడు. అల్లాహ్

అనుగ్రహాలకు కృతజ్ఞత తెలుపుతూ ఉండేవాడు. అల్లాహ్ అతనిని ఎన్నుకున్నాడు. అతనికి రుజమార్గాన్ని చూపాడు. ప్రపంచంలో అతనికి మేలును ప్రసాదించాడు. పరలోకంలో నిశ్చయంగా అతను సజ్జనులలో ఉంటాడు. ప్రవక్తా! ఏకాగ్రచిత్తుడవై ఇబ్రాహీమ్ విధానాన్ని అనుసరించు. ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు. వివేకంతో, చక్కని హితబోధతో ప్రజలతో ఉత్తమోత్తమ రీతిలో వాదించు. ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చెయ్యండి. కాని మీరు సహనం చూపితే అది నిశ్చయంగా సహనం చూపేవారికి మంచిది.

17. బనీ ఇస్రాయీల్

రుకూ 1 : ఇస్రాయీల్ సంతతి రెండుసార్లు భూమిపై కల్లోలాన్ని రేకెత్తించారు. తలబిరుసుగా వ్యవహరించారు. రెండుసార్లు కూడా అల్లాహ్ వారికి తగిన ఫలితాన్ని రుచి చూపించాడు. మహా బలాఢ్యులైన పాలకులను వారిపై ప్రాబల్యం వహించేలా చేశాము. వారి ఇళ్ళల్లోని అన్నివైపుల నుంచి వారు చొరబడ్డారు. వారి ముఖాలను వికృతం చేశారు. మస్జిదుల్లో చొరబడి విధ్వంసం చేశారు. ఇస్రాయీల్ సంతతి మళ్ళీ అల్లాహ్ వైపునకు మరలిన తర్వాత అల్లాహ్ మళ్ళీ వారికి ప్రాబల్యాన్నిచ్చాడు. సంపద, సంతానం ప్రసాదించి సహాయపడ్డాడు. వారి సంఖ్యను ఇదివరకటి కన్నా పెంచాడు. 'మీరు మంచి చేస్తే మీకు మంచి జరుగుతుంది. చెడు చేస్తే చెడు జరుగుతుంది' అని వారికి స్పష్టంగా చెప్పడం జరిగింది.

రుకూ 2 : మనిషి మేలును అర్థించవలసిన విధంగా కీడును అర్థిస్తాడు. మనిషి నిజంగానే తొందరపాటు కలవాడు. రుజుమార్గాన్ని అవలంభించేవారి రుజువర్తనం వారికే ప్రయోజనకరం. మార్గం తప్పినవాడు తన మార్గభ్రష్టత్వం దుష్ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. బరువుమోసేవాడెవడూ ఇతరుల బరువు మోయడు. మేము ఏదైనా పట్టణాన్ని నాశనం చేయదలచినప్పుడు అందులోని స్థితిమంతులకు మొదట ఒక ఆజ్ఞ పంపుతాము. వారు ఆ ఆజ్ఞ విషయంలో అవిధేయతకు పాల్పడితే అప్పుడు శిక్ష విధింపుకు ఆ పట్టణం గురవుతుంది. మేము దానిని సర్వనాశనం చేస్తాము. పరలోకాన్ని కోరుకొని దాని కోసం కృషి చేయవలసిన విధంగా కృషి చేసేవాడు, విశ్వాసి కూడా అయివుంటే అటువంటి ప్రతి వ్యక్తి కృషికి గుర్తింపు ఉంటుంది.

రుకూ 3 : మీరు కేవలం అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించవద్దు 2. తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించండి. ఒకవేళ వారిలో ఒకరుగానీ, ఇద్దరుగాని ముసలి వారయి ఉంటే వారి ముందు విసుగ్గా ఛీ అని కూడా అనకండి. కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. 3) బంధువుల పట్ల పేదవారి పట్ల, బాటసారుల పట్ల మీ విధులను నిర్వర్తించండి. వృథా ఖర్చు చెయ్యకండి. వృథా ఖర్చు చేసేవారు షైతాన్ సోదరులు 4) పైన పేర్కొన్న అవసరార్థులు మీ నుండి ఏదైనా అర్థిస్తే ఇచ్చే శక్తి మీకు లేకపోతే మృదువుగా జవాబు చెప్పండి. 5) పిసినారితనం చూపరాదు, వృథా ఖర్చుచేయరాదు.

రుకూ 4 : పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హతమార్చకండి. మేము వారికి ఉపాధినిస్తాము. మీకు ఇస్తాము. వ్యభిచారం దరిదాపులకు పోకండి. అది అతి దుష్టకార్యం. ఏ ప్రాణాన్ని న్యాయంగా తప్ప హతమార్చకండి. సక్రమమైన పద్ధతిలో తప్ప అనాధుల సొమ్ము జోలికి పోకండి. చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. కొలపాత్రతో ఇస్తే పూర్తిగా నింపి ఇవ్వండి. తూచినట్లయితే సరైన త్రాసుతో తూయండి. మీకు తెలియని విషయం వెంట పడకండి. భూమిపై విర్రవీగుతూ నడవకండి. మీరు భూమిని చీల్చనూ లేరు. పర్వతాల ఎత్తుకు చేరనూ లేరు.

రుకూ 5 : మేము ఈ ఖుర్‌ఆన్‌లో ప్రజలకు రకరకాలుగా బోధించాము. వారు స్పృహ లోకి రావాలని. ప్రవక్తా! వారికి చెప్పు. ఒకవేళ అల్లాహ్‌తోపాటు, వారు చెప్పేవిధంగా ఇతర దేవుళ్ళు కూడా ఉంటే, వారు సింహాసనాధీశుని స్థానం అందుకొనే ప్రయత్నం తప్పక చేస్తారు– ఆయన పరిశుద్ధుడు, వారు చెప్పే మాటలకు అతీతుడు. సప్తాకాశాలు, భూమి, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన పరిశుద్ధతను కొనియాడుతున్నాయి. నీవు ఖుర్‌ఆన్ పఠించేటప్పుడు నీకు, తిరస్కారులకు మధ్య మేము ఒక తెరను అడ్డుగా పెడతాము. వారి హృదయాలకు గలేబులు తొడుగుతాము. ఇక వారు ఏదీ అర్థం చేసుకోలేరు. వారి చెవులను మొద్దుబార చేస్తాము.

రుకూ 6 : ప్రవక్తా! నా దాసులతో వారు తమ నోట అత్యుత్తమమయిన మాటనే పలుకుతూ ఉండాలని చెప్పు. అసలు మానవుల మధ్య కలహం లేపాలని ప్రయత్నించే వాడు షైతాన్. మీరు దేవుణ్ణి కాదని, మీ పనులు నెరవేర్చేవారని నమ్ముతూ ఆరాధిస్తున్న వారిని పిలిచి చూడండి. వారు మీ ఆపద దేన్నీ మరల్చలేరు. మార్చలేరు. ఈ ప్రజలు మొరపెట్టుకొంటున్న ఈ దేవుళ్ళే స్వయంగా తమ ప్రభువు సాన్నిధ్యాన్ని పొందడానికి

మార్గం వెదుకుతున్నారు. ఒకరితో ఒకరు పోటీపడుతున్నారు. వారు ఆయన కారుణ్యాన్ని ఆశిస్తున్నారు. ఆయన శిక్షకు భయపడుతున్నారు.

రుకూ 7 : సముద్రంలో మీకేదన్నా ఆపద కలిగినప్పుడు, ఆయన ఒక్కడు తప్ప మీరు పిలిచే వారంతా మటుమాయమైపోతారు. కాని, మిమ్మల్ని ఆయన రక్షించి నేలపైకి చేర్చిన తర్వాత మీరు ఆయన నుంచి ముఖం తిప్పుకుంటారు. మానవుడు నిజంగా చాలా కృతఘ్నుడు. దేవుడు మిమ్మల్ని సముద్రం వెలుపలే భూమిలోకి అణగదొక్కడం ఎన్నడూ జరగదనీ లేదా రాళ్ళను కురిపించే తుఫాను మీపైకి ఎన్నడూ పంపడనీ మీరు నిర్భయంగా ఉన్నారా? దేవుడు మిమ్మల్ని మళ్ళీ ఎప్పుడైనా సముద్రంలోకి కొనిపోయి మీ కృతఘ్నతకు ఫలితంగా తీవ్రమైన తుఫాను గాలులు పంపి మిమ్మల్ని ముంచి వేయడం ఎన్నడూ జరగదని నిర్భయంగా ఉన్నారా? – మేము ఆదమ్ సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము. నేలపై నీటిలో నడిచే వాహనాలు ప్రసాదించాము. పరి శుద్ధమైన వస్తువులను ఆహారంగా ఇచ్చాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము.

రుకూ 8 : ప్రపంచంలో గుడ్డివానిగా వ్యవహరించేవాడు పరలోకంలోనూ గుడ్డివానిగానే ఉంటాడు. అంతేకాదు మార్గాన్ని పొందడంలో అంధునికన్నా ఎక్కువగా విఫలుడవు తాడు. ప్రవక్తా! ఈ ప్రజలు నిన్ను పరీక్షకు గురిచేసి మేము నీ వైపునకు పంపిన వహీ నుంచి నిన్ను మరలించడానికి పూర్తిగా ప్రయత్నిస్తున్నారు. నీవు మా పేరుతో నీ తరఫున ఏదైనా విషయాన్ని కల్పించేలా చేయాలని చూశారు. ఒకవేళ నీవు అలా చేసి ఉంటే నిన్ను తప్పక మిత్రునిగా చేసుకుని ఉండేవారు. కాని అలాగనక నీవు వారి వైపునకు మొగ్గి ఉంటే మేము నీకు ప్రపంచంలో కూడా రెట్టింపు శిక్ష రుచి చూపించి ఉండేవారం. పరలోకంలో కూడా రెట్టింపు శిక్ష. ఈ భూభాగంలో నీకు నిలువ నీడలేకుండా చేయడానికి, నిన్ను ఇక్కడి నుంచి వెళ్ళగొట్టడానికి వారు పూనుకొన్నారు. ఒకవేళ వారు గనక అలా చేస్తే, నీ తరువాత వారు కూడా ఇక్కడ ఎంతోకాలం ఉండలేరు.

రుకూ 9 : నమాజును స్థాపించు. పొద్దువాలినప్పటి నుంచి రాత్రి చీకటి పడేవరకు ప్రాత:కాలంలో ఖుర్ఆన్ పారాయణం పట్ల ప్రత్యేక శ్రద్ధవహించు. ఎందుకంటే ప్రాత: కాలం ఖుర్ఆన్ పారాయణం సాక్ష్యంగా ఉంటుంది. రాత్రిపూట తహజ్జుద్ నమాజు చెయ్యి. నీ ప్రభువు వద్ద నీకు ప్రశంసనీయమైన ఉన్నత స్థానం లభిస్తుంది. దేవుడిని

ప్రార్థిస్తూ 'ప్రభూ నీవు నన్ను ఎక్కడికి తీసుకొని వెళ్ళినా సత్యంతో తీసుకొని వెళ్ళు. ఎక్కడి నుంచి తీసినా సత్యంతో తియ్యి' అని వేడుకో. 'సత్యం వచ్చేసింది అసత్యం నశించింది. అసత్యం నశించకతప్పదు' అని ప్రకటించు. ఈ ఖుర్‌ఆన్ విశ్వాసులకు స్వస్థత, కారుణ్యం. కాని దుర్మార్గులకు అది నష్టాన్ని తప్పమరి దేనిని పెంచదు. మానవుడు ఎలాంటి వాడంటే మేము అతనికి అనుగ్రహించినప్పుడు విర్రవీగుతాడు. వెనక్కి మరలిపోతాడు. కొంచెం కష్టానికి గురయితే చాలు నిరాశపడిపోతాడు.

రుకూ 10 : ఒకవేళ మానవులు, జిన్నాతులు అందరూ కలిసి ఒకరికొకరు సహాయపడి, ఈ ఖుర్‌ఆన్ వంటి దానిని తీసుకువచ్చే ప్రయత్నం చేసినప్పటికీ తీసుకురాలేరు. మేము ఈ ఖుర్‌ఆన్‌లో ప్రజలకు రకరకాలుగా హితబోధ చేశాము. కాని చాలామంది ప్రజలు అవిశ్వాస స్థితిలోనే స్థిరంగా ఉండిపోయారు. నీ మాట నీవు భూమిని చీల్చి వారి కోసం ఒక చెలమ పొంగింపజేయాలని, ఖర్జూరపు చెట్లు ద్రాక్ష లతలు గల తోట ఒకటి నీ కోసం ఉద్భవించాలని లేదా ఆకాశాన్ని ముక్కలు ముక్కలుగా చేసి వారిపై పడవేయాలని దేవుణ్ణి దైవదూతలను వారి ముందుకు తీసుకురావాలని లేదా నీ కోసం ఒక స్వర్ణ గృహం తయారు అవ్వాలని లేదా నీవు ఆకాశాన్ని అధిరోహించాలని లేదా వారు చదవడానికి వారిపై ఒక రచన అవతరింపజేయాలని వారు చూస్తున్నారు. ప్రవక్తా! వారికి చెప్పండి. 'నాప్రభువు పరిశుద్ధుడు, నేను సందేశాన్ని తెచ్చే ఒక మానవ మాత్రుణ్ణి మాత్రమే' అని చెప్పండి.

రుకూ 11 : అల్లాహ్ మనిషిని ప్రవక్త చేసి పంపాడా! అన్నారు వాళ్ళు. భూమిపై దైవదూతలు నిశ్చింతగా తిరిగేదయితే మేము తప్పకుండా ఆకాశం నుంచి దైవదూతనే వారి కోసం ప్రవక్తగా పంపి ఉండేవారం. ప్రళయం నాడు వారిని గుడ్డివారిగా, మూగవారిగా, చెవిటివారిగా చేసి బోర్లాపడవేసి లాక్కువస్తాము. వారి నివాసం నరకం. వారు ఇలా అంటారు : మేము కేవలం ఎముకలుగా, దుమ్ముగా ధూళిగా, మారిపోయిన తర్వాత సరికొత్తగా మమ్మల్ని పుట్టించి లేపి నిలబెట్టడం జరుగుతుందా?' భూమిని ఆకాశాలను సృష్టించిన దేవుడు అటువంటి వారిని పుట్టించే శక్తి కూడా తప్పక కలిగి వుంటాడన్న విషయం వారికి తోచనే లేదా.

రుకూ 12 : మూసాను, ఇస్రాయీలు సంతతిని భూమిపై లేకుండా చేయాలని ఫిరౌన్ సంకల్పించాడు. కాని మేము అతడిని, అతడి సహచరులను మూకుమ్మడిగా ముంచి

వేశాము. ఈ ఖుర్‌ఆను మేము సత్యంతో అవతరింపజేశాము. సత్యంతోనే అది అవతరించింది. ఈ ఖుర్‌ఆన్‌ను కొద్దికొద్దిగా అవతరింపజేశాము. నీవు దానిని నెమ్మది నెమ్మదిగా ప్రజలకు వినిపించాలని. ఇదివరకు జ్ఞానం ఇవ్వబడిన వారికి దానిని వినిపించినప్పుడు వారు ముఖాన్ని నేలకు ఆనించి సాష్టాంగపడి ముక్తకంఠంతో 'మా ప్రభువు పరిశుద్ధుడు, ఆయన వాగ్దానం పూర్తయి తీరవలసిందే' అంటారు. ప్రవక్తా వారికి చెప్పు 'అల్లాహ్' అనయినా పిలవండి లేదా 'రహ్మాన్' అని అయినా సరే. ఏ పేరుతో అయినా పిలవండి. ఆయనకున్న పేర్లు అన్ని చక్కనివే. మీరు నమాజు చేసేటప్పుడు కంఠాన్ని మరీ పెంచకండి. మరీ తగ్గించకండి. ఈ రెంటికి మధ్య సగటు స్థాయిలో ఉండే స్వరంతో నమాజు చేయండి.

18. అల్ కహఫ్

రుకూ 1 : అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన తన దాసునిపై ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు. ఇందులో ఏ విధమైన వక్రత్వమూ లేదు. అది సూటిగా ఉన్నది ఉన్నట్లు ప్రకటించే గ్రంథం. దీనిద్వారా అతను దేవుని కఠిన శిక్షను గురించి ప్రజలను హెచ్చరించాలని, విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి మంచి ప్రతిఫలం లభిస్తుంది అనే శుభవార్తను అందజేయాలనీ దీనిని అవతరింపజేశాడు. ప్రజలలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించాలని, భూమిపై ఉన్న వస్తుసామగ్రిని మేము భూమికి అలంకారంగా చేశాము. చివరకు మేము దీనినంతటినీ చదునైన మైదానంగా చేసి వేస్తాము.

రుకూ 2 : గుహ వారి కథను వినిపించడం జరిగింది. వారు తమ ప్రభువును విశ్వసించిన కొందరు యువకులు. 'ఆకాశాలకు, భూమికి ప్రభువైన వాడే మా ప్రభువు. మేము ఆయనను కాదని మరొకణ్ణి దేవునిగా చేసుకోము' అని ప్రకటించారు వారు. జాతి వారిని వ్యతిరేకించింది. వాళ్ళు ఒక గుహలో ఆశ్రయం పొందారు. సూర్యుడి తాపం నుంచి అల్లాహ్ వారిని రక్షించాడు. వారిని నిద్రపుచ్చాడు. ఇది అల్లాహ్ సూచనలలో ఒక సూచన.

రుకూ 3 : వారిని చూసి నీవు వారు మేల్కొనే ఉన్నారని అనుకుంటావు. వాస్తవానికి వారు నిద్రపోతున్నారు. మేము వారిని కుడి పక్కకు ఎడమ పక్కకు దొరలేలా, మరలి పడుకునేలా చేశాము. వారి కుక్క గుహ ముఖ ద్వారం వద్ద ముందు కాళ్ళను చాచి

కూర్చుండి ఉండేది. ఒకవేళ నీవు వారిని తొంగిచూస్తే వెనక్కి తిరిగి పారిపోతావు. మేము ఇదే అద్భుత మహిమ ద్వారా వారిని మేల్కొలిపాము. వారిలో ఒకడు 'మనం ఈ స్థితిలో ఎంత కాలం ఉన్నాం' అన్నాడు. మిగతా వారు 'బహుశ ఒక రోజు లేదా దానికంటే కొంచెం తక్కువ అయి ఉండొచ్చు' అన్నారు. తరువాత వారు తమలోని ఒక వ్యక్తిని తినడానికి ఏదైనా తెమ్మని పట్టణంలోనికి పంపారు. పట్టణ ప్రజలు అతని వద్ద ఉన్న నాణేలు చూసి ఆశ్చర్యపోయారు. అవి చాలా పాతకాలం నాటి నాణేలు. చివరకు ప్రజలు గుహ వారిపై ఒక ఆరాధనాలయం కట్టారు. వారు ఎంతమంది అన్నది ప్రజలకు సందేహాస్పదంగానే ఉండిపోయింది.

రుకూ 4 : ఏ విషయాన్ని గురించి అయినా ఎన్నడూ "నేను ఈ పని రేపు చేస్తాను" అని అనవద్దు. (నీవు ఏమీ చేయలేవు) అల్లాహ్ తలిస్తే తప్ప యేదీ జరుగదు. ఒకవేళ పొరబాటున నీవు అలా అంటే, తక్షణం నీ ప్రభువును స్మరించు. వారు తమ గుహలో మూడు వందల సంవత్సరాలు ఉన్నారు. చూసేవాడు, వినేవాడు, అన్నీ తెలిసినవాడు అల్లాహ్‌యే. ప్రవక్తా! నీ ప్రభువు గ్రంథం నుంచి నీపై అవతరింపజేయబడిన దానిని యధాతథంగా వినిపించు. ఒకవేళ ఎవరికోసమైనా నీవు అందులో మార్పులు చేర్పులు చేస్తే ఆయన్ను తప్పించుకొని పారిపోయి నీవు యే ఆశ్రయాన్నీ పొందలేవు. స్పష్టంగా ప్రకటించు. "ఇది సత్యం మీ ప్రభువు నుంచి వచ్చింది. ఇష్టమైన వారు దీనిని స్వీకరించవచ్చు. ఇష్టం కాని వారు తిరస్కరించనూ వచ్చు" అని ప్రకటించు. మేము సత్యాన్ని తిరస్కరించే దుర్మార్గుల కోసం ఒక అగ్నిని సిద్ధం చేసి ఉంచాము. వారికి త్రాగడానికి నూనె మడ్డి లాంటిది దొరుకుతుంది. ఇక విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి స్వర్గాలున్నాయి. నిత్యహరిత వనాలు ఉన్నాయి.

రుకూ 5 : ప్రవక్తా! వారికి ఈ పోలిక వినిపించు – అదేమిటంటే, ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. వారిలో ఒకనికి మేము రెండు ద్రాక్ష తోటలు ఇచ్చాము. వాటి చుట్టూ ఖర్జూరపు చెట్ల కంచె పెరిగేలా చేశాము. వాటి మధ్య సేద్యపు భూమి ఇచ్చాము. ఇదంతా పొందిన అతను ఒకనాడు తన పొరుగు మిత్రునితో మాట్లాడుతూ– "నేను నీకంటే ధనవంతుణ్ణి, ఎక్కువ బలం కలవాణ్ణి" అన్నాడు. తరువాత తన తోటలోకి వెళుతూ "ఈ సంపద ఎన్నటికీ నాశనం కాదు, ప్రళయం అనేది వస్తుందన్న నమ్మకమూ నాకు లేదు. ఒకవేళ ఎప్పుడైన నేను ప్రభువు సన్నిధికి వెళ్ళవలసి వస్తే తప్పకుండా నాకు మహోజ్వల స్థానం లభిస్తుంది" అన్నాడు. అప్పుడు అతని పొరుగువాడు "నీవు

అల్లాహ్‌ను తిరస్కరిస్తున్నావా! నీవు నీ తోటలోకి ప్రవేశిస్తున్న సమయంలో "మాషా అల్లాహ్ లాఖువ్వత ఇల్లా బిల్లాహ్" అన్న మాటలు నీ నోట ఎందుకు రాలేదు? సంపద దృష్ట్యా సంతానం దృష్ట్యా నన్ను నీకంటే తక్కువ వానిగా నీవు చూస్తుండవచ్చు. కాని నా ప్రభువు నీకంటే ఉత్తమమైన దానిని నీకు ప్రసాదించడం అసంభవమేమీ కాదు" అన్నాడు. చివరకు జరిగిందేమిటంటే అతని పంట మొత్తం ధ్వంసం అయ్యింది. అతడు తాను చేసిన పనికి వాపోయాడు.

రుకూ 6 : ఆకాశం నుంచి వర్షం కురిస్తే నేలపై పచ్చిక దట్టంగా పెరుగుతుంది. మరునాడు అదే పచ్చిక పొట్టుగా మారిపోతుంది. ఇహలోక జీవిత వాస్తవం ఇదే. ఈ సంపద, ఈ సంతానం కేవలం ఇహలోక జీవితానికి అలంకారాలు మాత్రమే. శాశ్వతంగా ఉండిపోయే పుణ్యకార్యాలే నీ ప్రభువు వద్ద పరిణామం రీత్యా ఉత్తమమైనవి. ఆలోచించవలసింది. ఆ రోజు గురించే. ఆనాడు అపరాధులు తమ జీవిత గ్రంథంలో నమోదు అయి ఉన్న విషయాలను చూసి "అయ్యో! మా దౌర్భాగ్యం. ఇదేమి గ్రంథం. మేము చేసిన చిన్న పని గాని, పెద్ద పని గాని ప్రతిదీ ఇందులో నమోదై ఉందే" అని వాపోతారు.

రుకూ 7 : ఇబ్లీస్ ఆదమ్‌కు సజ్దా చేయలేదు. ప్రభువు ఆజ్ఞ ఉల్లంఘించాడు. వాడు వాడి సంతతి మీ శత్రువు అయినప్పటికీ మీరు ప్రభువును కాదని వారినే మీకు సంరక్షకులుగా చేసుకుంటారా! ప్రళయం రోజు ప్రభువు వారితో "నాకు భాగస్వాములని మీరు భావించిన ఆ శక్తులను పిలవండిప్పుడు" అంటాడు. అప్పుడు వారి ఆ శక్తులను పిలుస్తారు. కాని వారు సహాయానికి రారు. మేము వారికి ఒక వినాశ గుండాన్ని ఏర్పాటు చేస్తాము.

రుకూ 8 : మేము ఈ ఖురానులో ప్రజలకు పలు విధాలుగా హితవు గరిపాము. కాని మనిషి పరమ జగడాలకోరు. మేము ప్రవక్తలను, శుభవార్త అందజేయడానికి, హెచ్చరిక చేయడానికి తప్ప మరే ఉద్దేశంతోనూ పంపము. ప్రభువు వాక్యాలను వినిపించి హితోపదేశం చేసినపుడు వాటికి విముఖుడై, తాను చేజేతులా చేసుకున్న దాని దుష్పరిణామాన్ని మరిచిపోయే వ్యక్తికంటే దుర్మార్గుడెవరు? వారి హృదయాలకు మేము గలీబులు తొడిగాము. అవి వారిని ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకోనీయవు. వారి చెవులకు మేము చెముడు కలిగించాము.

రుకూ 9 : మూసా సేవకునితో కలిసి నదిలో ప్రయాణిస్తున్నారు. నదిలో చేప వెనక్కి

వెళ్ళిపోయిన చోటు వెదుకుతున్నారు. అల్లాహ్ ఆయన్ను ఏమరుపాటుకు గురిచేశాడు. ఆయన చాలా దూరం ముందుకు వెళ్ళిపోయారు. పొరపాటు తెలుసుకొని వాళ్ళు మళ్ళీ వెనక్కి వచ్చారు. ఆ చోటును గుర్తించారు. అక్కడ ఆయన హజ్రత్ ఖిజర్‌ను కలుసుకున్నారు. హజ్రత్ ఖిజర్‌కు అల్లాహ్ విశిష్ట జ్ఞానం ప్రసాదించాడు. మూసా ఆయనతో "నేను మీతోపాటు ఉండి మీ జ్ఞానం కొంత గ్రహించాలనుకుంటున్నాను" అన్నారు. హజ్రత్ ఖిజర్ మూసాతో "మీరు నా విషయంలో సహనంతో ఉండలేరు" అన్నారు. అందుకు మూసా బదులిస్తూ "ఇన్షా అల్లాహ్ నేను సహనవంతుణ్ణని మీరు తెలుసుకుంటారు" అన్నారు. అప్పుడు హజ్రత్ ఖిజర్ "సరే, మీరు నాతో ఉండేదయితే నేను ప్రస్తావించనంత వరకు మీరు యే విషయం గురించి నన్ను అడగరాదు" అన్నారు.

రుకూ 10 : వారు ఇద్దరూ కలిసి బయలుదేరారు. వారి ఒక పడవ ఎక్కినపుడు హజ్రత్ ఖిజర్ ఆ పడవకు ఒక రంధ్రం వేశారు. ఇది చూసి మూసా "పడవలో ఉన్నవారందరినీ ముంచడానికి రంధ్రం వేశారా? మీరు చేసింది దారుణం" అన్నారు. హజ్రత్ ఖిజర్ "మీరు నాతో ఓర్పుగా ఉండలేరని నేను ముందే చెప్పాను" అన్నారు. పొరపాటున చెప్పిన మాటకు తప్పుపట్టవద్దని మూసా మనవి చేశారు. తరువాత వారు ప్రయాణం సాగిస్తూ దారిలో ఒక బాలుని కలిశారు. హజ్రత్ ఖిజర్ ఆ బాలుణ్ణి చంపేశారు. అది చూసి మూసా "ఒక అమాయకుడి ప్రాణాన్ని తీశారు" అన్నారు. అప్పుడు హజ్రత్ ఖిజర్ "మీరు నాతో ఓర్పుగా ఉండలేరని నేను మీకు చెప్పలేదా" అన్నారు. అందుకు మూసా "ఇక నుంచి నేను మిమ్మల్ని ఏదైనా అడిగితే మీరు నన్ను మీ వెంట ఉండనీయకండి" అన్నారు. ఆ తరువాత వారు ముందుకు సాగిపోయారు. చివరకు ఒక పట్టణాన్ని చేరుకున్నారు. అక్కడి ప్రజలను అన్నంపెట్టమని అభ్యర్థించారు. కాని వారు వీరిద్దరికీ ఆతిథ్యమీయడానికి తిరస్కరించారు. అక్కడ వారు కూలిపోతున్న ఒక గోడను చూశారు. హజ్రత్ ఖిజర్ ఆ గోడను మళ్ళీ నిలబెట్టారు. మూసా ఇది చూసి "మీరు కావాలనుకుంటే ఈ శ్రమకు ప్రతిఫలం దొరికేది" అన్నారు. అప్పుడు హజ్రత్ ఖిజర్ "ఇక చాలు మన సహవాసం ముగిసింది. ఇక మీరు ఓర్పు వహించలేని విషయాల గురించి వివరిస్తాను. ఆ పడవ వృత్తాంతం ఏమిటంటే, కష్టపడి పనిచేసుకునే కొందరు నిరుపేదలది ఆ పడవ. ప్రతి పడవను బలవంతంగా స్వాధీనం చేసుకునే ఒక రాజుకు చెందిన ప్రాంతం దారిలో ఉంది. అందుకే ఆ పడవకు ఒక లోపం కల్పించాను. ఇక బాలుని విషయం – అతని తల్లిదండ్రులు విశ్వాసులు. ఈ బాలుడు తలబిరుసుతనంతో,

అవిశ్వాసంతో తల్లిదండ్రులను వేధిస్తాడని అతణ్ణి చంపాను. ఇక గోడ విషయం ఏమిటంటే, అది యీ పట్టణంలో నివసిస్తున్న ఇద్దరు బాలలది. ఆ గోడ క్రింద ఆ బాలల కోసం ఒక నిధి దాచబడి ఉంది. ఆ బాలలు యుక్తవయస్కులయ్యాక ఆ నిధి వారికి అందాలని నీ ప్రభువు సంకల్పం. ఇదంతా నీ ప్రభువు కారుణ్యం వల్లనే చేశాను.

రుకూ 11 : జుల్‌ఖర్‌నైన్‌కు భూమిపై అధికారాన్ని ప్రసాదించాము. అతడికి అన్ని రకాల సాధనాలు, వనరులు ఇచ్చాము. అతను మొదట పశ్చిమ దిశ వైపునకు దండయాత్ర చేయడానికి సన్నాహాలు చేశాడు. చివరకు అతడు సూర్యుడు అస్తమించే హద్దునకు చేరాడు. తరువాత అతను మరొక దండయాత్రకు సన్నాహాలు చేశాడు. చివరకు అతను రెండు పర్వతాల మధ్యకు చేరినప్పుడు, అక్కడ ఉండే జాతి ప్రజలు జుల్‌ఖర్‌నైన్‌తో "యాజూజ్, మాజూజ్‌లు ఈ భూభాగంలో కల్లోలాన్ని రేకెత్తిస్తున్నారు. నీవు మమ్మల్ని వారి నుంచి రక్షిస్తే మేము మీకు సుంకం చెల్లిస్తాం" అన్నారు. వారి కోసం జుల్‌ఖర్‌నైన్ ఒక ఇనుప గోడ నిర్మించాడు. యాజూజ్, మాజూజ్‌లు దానిపైకి ఎక్కి రానూలేరు. దానికి కన్నం వేయనూ లేరు.

రుకూ 12 : తిరస్కారులు నన్ను కాదని నా దాసులను తమ కార్యసాధకులుగా భావిస్తున్నారు. ఇలాంటి అవిశ్వాసుల ఆతిథ్యానికి మేము నరకాన్ని సిద్ధం చేసి ఉంచాము. ప్రాపంచిక జీవితంలో వారి ప్రయత్నాలు అన్నీ రుజుమార్గం నుంచి వైదొలిగి ఉంటాయి. తాము చేసేదంతా సవ్యంగా ఉందని వారు భావిస్తారు. ఇలాంటి వారు ఆచరణల విషయంలో దారుణంగా విఫలమై నష్టపోతారు. విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి ఫిర్‌దౌస్ ఉద్యానవనాలు లభిస్తాయి. అక్కడ వారు కలకాలం ఉంటారు. ఒకవేళ ప్రభువు మాటలు రాయడానికి సిరాగా సముద్ర జలాన్ని వాడినా అది సరిపోదు. ప్రభువు మాటలు పూర్తికావు. అంతేకాదు. ఇంకా అంత సిరా తెచ్చినా అది కూడా సరిపోదు.

19. మర్యమ్

రుకూ 1 : జకరియా ప్రభువును వేడుకుంటూ "ప్రభూ! నా ఎముకలు సయితం కృశించిపోయాయి. ముదిమి వల్ల తల నెరసిపోయింది. ప్రభూ! నిన్ను వేడుకొని నేను ఎన్నడూ నిష్ఫలుణ్ణి కాలేదు. నీ ప్రత్యేక అనుగ్రహం ద్వారా నాకు ఒక వారసుణ్ణి ప్రసాదించు. అందరికీ ఇష్టుడైన వ్యక్తిగా అతణ్ణి రూపొందించు" అని ప్రార్థించారు.

ఆ ప్రార్థనకు జవాబు "జకరియ్యా! మేము నీకు యహ్యా అనే పేరుగల ఒక కుమారుని శుభవార్త ఇస్తున్నాము." – అప్పుడు జకరియ్యా "ప్రభూ నాకు కుమారులెలా పుడతారు. నా భార్య గొడ్రాలు. నేను వృద్ధుడనై కృశించిపోయాను" అన్నారు. బదులు లభించింది– "అలాగే జరుగుతుంది... నీ ప్రభువు సెలవిస్తున్నాడు. ఇది ఆయనకు చాలా చిన్న విషయం. వాస్తవానికి అంతకు ముందు యేమి లేని దశ నుంచి నిన్ను సృష్టించలేదా!"– యహ్యాకు బాల్యం నుంచే వివేకాన్ని ప్రసాదించాము. దయార్ద్ర హృదయాన్ని, పరిశుద్ధతను అనుగ్రహించాము.

రుకూ 2 : మర్యమ్ వద్దకు మా ఆత్మను (అంటే దూతను) పంపాము. అతడు ఆమె ముందు పూర్తి మానవాకారంలో ప్రత్యక్షమయ్యాడు. మర్యమ్‌తో "నేను నీ ప్రభువు దూతను మాత్రమే. నీకు ఒక పరిశుద్ధ పుత్రుణ్ణి ఇవ్వడానికి పంపబడ్డాను" అని చెప్పాడు. అప్పుడు మర్యమ్ "నాకు పుత్రుడు ఎలా పుడతాడు. నన్ను యే పురుషుడూ తాకలేదు. నేను చెడు నడతగల దానిని కాను" అన్నారు. అప్పుడు దైవదూత "అలాగే జరుగుతుంది" అన్నాడు. నీ ప్రభువుకు ఇది ఎంతో సులభం. ఆ బాలుణ్ణి ప్రజల కొరకు ఒక సూచనగా మేము ఈ పని చేస్తున్నాము. మర్యమ్ ఆ మగశిశువును గర్భంలో దాల్చింది. గర్భవతి అయిన ఆమె ఒక దూర ప్రదేశానికి వెళ్ళిపోయింది. తరువాత ఆమె ఆ బాలుని తీసుకొని తన ప్రజల వద్దకు వచ్చింది. ప్రజలు ఆమెతో "మర్యమ్ నువ్వు చాలా పెద్ద పాపం చేశావు. ఓ హారూన్ సోదరీ! నీ తండ్రి చెడ్డ మనిషి కాదు. నీ తల్లి చెడు నడతగల స్త్రీ కాదే" అన్నారు. మర్యమ్ బాలుని వైపునకు సైగ చేసింది. ఉయ్యాలలోని పిల్లవాడు "నేను అల్లాహ్ దాసుణ్ణి. ఆయన నాకు గ్రంథం ఇచ్చాడు. నన్ను ప్రవక్తగా నియమించాడు. నన్ను శుభవంతునిగా చేశాడు" అని వారికి చెప్పాడు. అతనే మర్యమ్ కుమారుడు ఈసా. ఇదే అతనికి సంబంధించిన అసలు నిజం. దీనిని గురించే ప్రజలు సందేహిస్తున్నారు.

రుకూ 3 : ఇబ్రాహీం తన తండ్రితో "వినలేని, కనలేని, మీకు యే పనీ చేసిపెట్టలేని వాటిని మీరు ఎందుకు ఆరాధిస్తున్నారు? తండ్రి నాకు లభించిన జ్ఞానం మీ వద్దకు రాలేదు. మీరు నన్ను అనుసరించండి. నేను మీకు సరియైన మార్గం చూపుతాను. తండ్రీ! మీరు షైతానుకు దాస్యం చేయకండి. షైతాను కరుణామయుణ్ణి ధిక్కరించాడు. తండ్రీ! మీరు కరుణామయుని శిక్షకు గురి అవుతారేమో అని, షైతాను సహచరులు అయిపోతారేమో అని నేను భయపడుతున్నాను" అన్నాడు. ఆయన తండ్రి ఆగ్రహంగా

"ఓ ఇబ్రాహీం! నా ఆరాధ్యులైన వాటికి నీవు విముఖుడవు అయ్యావా? నీవు ఈ పని మానుకోకపోతే, నేను నిన్ను రాళ్ళతో కొట్టి చంపేస్తాను. కనుక నువ్వు శాశ్వతంగా నాకు దూరమైపో" అన్నాడు. "మిమ్మల్ని విడిచిపోతున్నాను. మీరు దేవుణ్ణి కాదని ప్రార్థిస్తున్న శక్తులను కూడా విడిచిపోతున్నాను. నేను నా ప్రభువునే ప్రార్థిస్తాను" అన్నారు ఇబ్రాహీం.

రుకూ 4: మూసా, హారూన్, ఇస్మాయీల్, ఇద్రీస్, వీరంతా అల్లాహ్‌కు ఇష్టులైన దాసులు. ప్రవక్తలు. రుజుమార్గాన్ని చూపించినవారు. వారిని అల్లాహ్ అనుగ్రహించాడు. వారి తర్వాత కొందరు అయోగ్యులు వారి స్థానంలో వచ్చారు. వారు నమాజును త్యజించారు. మనోవాంఛలు అనుసరించారు. వారు త్వరలోనే మార్గం తప్పిన దానికి ఫలితం అనుభవిస్తారు. అయితే పశ్చాత్తాపపడి మరలేవారు, విశ్వసించి సత్కార్యాలు చేసేవారు, స్వర్గంలో ప్రవేశిస్తారు. భయభక్తులు కలవారే స్వర్గానికి అర్హులు.

రుకూ 5 : నీ ప్రభువు సాక్షిగా! మేము వారందరినీ, వారితో పాటు షైతానులను కూడా తప్పకుండా పోగుచేస్తాం. తరువాత నరకం చుట్టూ హాజరుపరచి వారిని మోకాళ్ళపై కూలదోస్తాం. భయభక్తులు కలవారిని రక్షిస్తాం. తిరస్కారులు విశ్వాసులతో "మన ఇరు వర్గాలలో మంచి స్థితిలో ఉన్న వర్గం యేదో, ఎవరి సభలు అద్భుతంగా ఉన్నాయో చెప్పండి" అంటారు. వాస్తవానికి మేము వారికి పూర్వం ఇలాంటి జాతులు ఎన్నో నాశనం చేశాము. ఆ జాతులు వీరికంటే అధికంగా వస్తు సామగ్రి కలిగి ఉండేవి. బాహ్య ఆడంబరాల విషయంలో వారికన్నా ఎంతో మిన్నగా ఉండేవి. మార్గం తప్పిన వ్యక్తికి కరుణామయుడు వ్యవధినిస్తూ పోతాడు. రుజుమార్గం అవలంబించిన వ్యక్తికి అల్లాహ్ రుజుమార్గావలంబనలో వృద్ధిని ప్రసాదిస్తాడు. వస్తుసామగ్రి, మంది మార్బలమూ అన్నీ వదిలి ఒంటరిగా మా ముందు హాజరుకావలసి ఉంటుంది.

రుకూ 6 : భయభక్తులు కలవారిని మేము కరుణామయుని సన్నిధిలో అతిథులుగా ప్రవేశపెట్టే రోజు, అపరాధులను దప్పికగొన్న జంతువుల వలే నరకం వైపునకు తోలుకుపోయే రోజు రానున్నది. అపుడు ప్రజలకు ఎవరి సిఫారసు తీసుకు రాగలిగే శక్తి ఉండదు. కరుణామయుని సమ్ముఖం నుంచి అనుమతి పత్రం పొందిన వ్యక్తికి తప్ప. కరుణామయుడు ఎవరినో కుమారునిగా చేసుకున్నాడు అని వారు అంటారు. నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉన్న వారి పట్ల కరుణామయుడు త్వరలోనే, హృదయాలలో ప్రేమను కలుగజేస్తాడు.

20. తాహా

రుకూ 1 : మూసా (అ) ఒక రాత్రి తన ఆలు బిడ్డలతో "నేను ఒక మంట చూశాను. బహుశా మీ కోసం కాస్త నిప్పు తీసుకురాగలనేమో చూస్తాను లేదా ఆ మంట వద్ద నాకేదైనా దారికి సంబంధించిన సహాయం లభిస్తుందేమో" అన్నారు. మూసా (అ) అక్కడకు చేరగానే ఒక వాణి వినిపించింది. "మూసా! నేనే నీ ప్రభువును, చెప్పులు విడువు. నీవు పవిత్రమైన తువా లోయలో వున్నావు. నేను నిన్ను ఎన్నుకున్నాను. వహీ ద్వారా చెప్పబడే దానిని విను. నేనే అల్లాహ్. నేను తప్ప మరొక దేవుడు లేడు. కనుక నీవు నాకు దాస్యం చేయి. నా జ్ఞాపకం కోసం నమాజు స్థాపించు. ప్రళయ ఘడియ తప్పనిసరిగా వస్తుంది. నేను ఆ సమయాన్ని గోప్యంగా ఉంచాలనుకున్నాను. ఎందుకంటే, ప్రతి మనిషి తన కృషి ప్రకారం ఫలితం పొందడానికి. తరువాత అల్లాహ్ మూసాకు చేతికర్ర, మెరుస్తున్న చెయ్యి వంటి మహిమలు ప్రసాదించాడు. ఫిరౌను వద్దకు వెళ్ళమన్నాడు.

రుకూ 2 : మూసా అల్లాహ్‌ను ప్రార్థించారు. అల్లాహ్ ఆయన ప్రార్థన స్వీకరించాడు. మూసాతో అల్లాహ్ "మూసా! మేము నీ తల్లికి సూచన ఇచ్చాము. ఈ బాలుణ్ణి పెట్టెలో పెట్టి, ఆ పెట్టె నదిలో వదిలివేయమన్నాము. నది ఆ పెట్టెను ఒడ్డున పడవేస్తుంది. నాకు, ఆ బాలునికి శత్రువు అయిన వాడు ఆ పెట్టెను పట్టుకు వెళతాడు అని చెప్పాము" అని గుర్తు చేశాడు. ఇంకా ఇలా గుర్తు చేశాడు, "జ్ఞాపకం తెచ్చుకో, అప్పుడు నీ సోదరి అనుసరిస్తూ వెళ్ళీ (పెట్టెను తీసుకువెళ్ళిన వారితో) "ఈ బాలుణ్ణి చక్కగా పెంచి పోషించే ఆమెను గురించి తెలుపనా?" అని అన్నది. అలా మేము నిన్ను మళ్ళీ నీ తల్లి వద్దకే చేర్చాము. ఇంకా ఈ విషయం కూడా జ్ఞాపకం తెచ్చుకో. నీవు ఒక వ్యక్తిని హత్య చేశావు. మేము ఆ ఉచ్చు నుంచి నీకు విముక్తి కలిగించాము. నీవు మద్యన్ ప్రజల మధ్య చాలా సంవత్సరాలు గడిపావు. మూసా! ఇప్పుడు నీవు, నీ సోదరుడు నా సూచనలతో ఫిరౌను వద్దకు వెళ్ళండి. అతనితో మృదువుగా మాట్లాడండి. బహుశా అతను హితబోధ స్వీకరిస్తాడేమో! లేదా దేవునికి భయపడతాడేమో! ఇరువురూ ఫిరౌను దగ్గరకు వెళ్ళారు. ఫిరౌనును అల్లాహ్ వైపునకు పిలిచారు. ఇస్రాయీల్ సంతతిని తమతో పంపమని అడిగారు.

రుకూ 3 : ఈ నేల నుంచే మేము మిమ్మల్ని సృష్టించాము. దాని లోనికే మేము మిమ్మల్ని

తిరిది తీసుకొని పోతాము. దాని నుంచే మిమ్మల్ని మళ్ళీ వెలికితీస్తాము – ఉత్సవదినం నిర్ణయమయ్యింది. ఒక బహిరంగ మైదానంలో ప్రజలు సమావేశమయ్యారు. మాంత్రికుల తాళ్ళు, కర్రలు వారి మంత్ర శక్తితో పరుగెత్తుతూ ఉన్నట్లు మూసాకు కనిపించాయి. వారు కల్పించింది కేవలం మంత్రజాలమే. మాంత్రికుడు ఎన్నడూ సఫలం కాలేడు. అల్లాహ్ ఆజ్ఞతో మూసా చేతి కర్రను విసరగానే మాంత్రికుల మంత్రజాలం సమాప్తమయ్యింది. మాంత్రికులు ఎలుగెత్తి, "మేము హారూన్, మూసాల ప్రభువును విశ్వసించాము" అని ప్రకటించారు. ఫిరౌను ఆగ్రహంతో, "నేను మీ కాళ్ళు చేతులను వ్యతిరేక దిశల నుంచి నరికిస్తాను. శిలువ వేయిస్తాను" అన్నాడు. జవాబుగా మాంత్రికులు మమ్మల్ని సృష్టించిన శక్తి సాక్షిగా! స్పష్టమైన సూచనలు ముందుకు వచ్చిన తర్వాత కూడా సత్యం కన్నా నీకు అధిక ప్రాధాన్యతనీయడం జరగని పని" అన్నారు. దోషిగా తన ప్రభువు ముందు హాజరయ్యేవాడికి నరకం తప్పదు. అల్లాహ్ సాన్నిధ్యంలో విశ్వాసిగా హాజరయినవారు, సత్కార్యాలు చేసినవారు అందరికీ ఉన్నత స్థానాలు ఉన్నాయి. నిత్యం పచ్చగా ఉండే ఉద్యానవనాలు ఉన్నాయి.

రుకూ 4 : మూసా (అ) రాత్రే తన జాతి ప్రజలను తీసుకొని బయలుదేరారు. ఆయన వెనుక ఫిరౌను తన సైన్యంతో వెంబడించసాగాడు. అల్లాహ్ మూసా జాతి ప్రజలను రక్షించాడు. ఫిరౌనును అతడి జాతిని ముంచివేశాడు. ఆ పిదప మూసా జాతి ప్రజల కోసం 'మన్న్' 'సల్వా'లు అవతరింపజేశాడు. కాని తర్వాత అల్లాహ్ మూసాను తూర్ కొండపైకి పిలిచినపుడు ఆయన వెళ్ళిన తర్వాత జాతి ప్రజలు ఆవు దూడకు పూజలు చేయడం ప్రారంభించారు. తన జాతి వారి వద్దకు తిరిగి వచ్చాక మూసా ఇది చూసి ఆగ్రహోదగ్రుడై, "నా జాతి ప్రజలారా! మీ ప్రభువు మీకు మంచి వాగ్దానాలు చేయలేదా? అప్పుడే మీకు ఎన్నో రోజులు గడిచిపోయినట్లు అనిపించిందా?" అని అడిగాడు. అప్పుడు జాతి ప్రజలు అతనితో "మేము మా ఆభరణాలను పారేస్తే వాటితో 'సామిరి' ఒక ఆవుదూడను తయారు చేశాడు. దానిలోంచి ఎద్దు అరుపు లాంటిది వినవచ్చేది. ఇది చూసి ప్రజలు ఇదే మా దైవం అని అరవడం ప్రారంభించారు" అన్నారు.

రుకూ 5 : హజ్రత్ హారూన్ వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని ప్రజలు ఆయన మాట వినలేదు. హజ్రత్ మూసా తిరిగి వచ్చిన పిదప హారూన్‌తో కఠినంగా ఈ విషయం గురించి ప్రశ్నించారు. హారూన్ తన వాదన వినిపించారు, 'సామిరి'ని

అంటరాని వాడిగా చేసివేయడం జరిగింది. వాడు జీవితాంతం, "నన్ను మట్టుకోకండి" అంటూ అరుస్తూ ఉంటాడు. ఆ తర్వాత ఆ ఆవుదూడను నాశనం చేయడం జరిగింది.

ఓ ప్రవక్తా! మేము ప్రత్యేకంగా మా వద్ద నుంచి నీకు ఒక 'జ్ఞాపిక' (హితోపదేశం) ప్రసాదించాము. దీనిపట్ల వైముఖ్యం చూపేవాడు ప్రళయదినాన పాప భారాన్ని మోస్తాడు. ఇలాంటి వారందరూ ఎల్లప్పుడూ సంకటంలో చిక్కుకొని ఉంటారు. ప్రళయదినం వారికి బాధాకరమైన బరువుగా ఉంటుంది. ప్రళయం నాడు అతి జాగ్రత్తగా అంచనా వేసేశాడు సయితం "ఇహలోక జీవితం ఒక్కరోజు పాటిదే" అంటాడు.

రుకూ 6 : ప్రళయ దినాన ప్రజలందరూ ఒక పిలిచేవాని పిలుపు విని నేరుగా వచ్చేస్తారు. ఎవరూ ఎలాంటి తలబిరుసుతనమూ చూపలేరు. కంఠస్వరాలన్నీ కరుణామయుని ముందు అణిగిపోతాయి. సజీవుడు, నిత్యుడు అయిన అల్లాహ్ ముందు ప్రజల తలలు వంగిపోతాయి. ఏదైనా దుర్మార్గం చేసి ఆ పాప భారాన్ని నెత్తిపై మోసేవాడు ఆ రోజున పరమ దురదృష్టవంతుడు. సత్కార్యాలు చేసిన వ్యక్తికి, విశ్వాసి కూడా అయిన వానికి ఆ రోజున ఎలాంటి అన్యాయమూ జరగదు. ప్రవక్తా! మేము ఈ ఖుర్‌ఆన్‌ను అరబ్బీ భాషలో అవతరింపజేశాము. ఇందులో పలు విధాలుగా హెచ్చరికలు చేశాము. ప్రజలు వక్ర వైఖరి విడనాడాలని, వారిలో చేతన కలుగుతుందేమోనని హెచ్చరికలు చేశాము.

రుకూ 7 : అల్లాహ్ ఆదమ్‌ను ఆయన భార్యను ముందుగానే హెచ్చరించాడు. షైతాను మీకు శత్రువు, వాడు మిమ్మల్ని స్వర్గం నుంచి బహిష్కరించబడేలా చేయడం, మీరు కష్టాలపాలు కావడం జరుగరాదు అని ముందస్తు హెచ్చరిక చేశాడు. కాని షైతాను వారిని మోసానికి గురిచేశాడు. ఒక చెట్టు చూపి దీనివల్ల శాశ్వత జీవితం, అంతం కాని సామ్రాజ్యం ఆ చెట్టు వల్ల లభిస్తాయని చెప్పాడు. ఆ భార్యా భర్తలిరువురు ఆ చెట్టు ఫలాన్ని తిన్నారు. అల్లాహ్ పట్ల వారిద్దరూ అవిధేయత చూపారు. రుజుమార్గం నుంచి తప్పిపోయారు. వారి పశ్చాత్తాపాన్ని ప్రభువు అంగీకరించాడు. వారికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదించాడు. మనిషిని, షైతానును ఒకరికొకరు శత్రువులుగా ఈ భూమిపై పంపడం జరిగింది. నా స్మరణ విని ముఖం త్రిప్పుకునే వాడికి ప్రపంచంలో జీవితం ఇరుకుగా ఉంటుంది. ప్రళయ దినాన మేము అతడిని గ్రుడ్డివానిగా

లేపుతాము. అప్పుడతడు "ప్రభూ! ప్రపంచంలో నాకు చూపు ఉండేది ఇక్కడ గ్రుడ్డివానిగా లేపావు ఎందుకు" అన్నప్పుడు అల్లాహ్ అతనితో, "మా ఆయతులు నీ వద్దకు వచ్చినప్పుడు నీవు ఎలా విస్మరించావో అదే మాదిరిగా ఈ రోజు నీవు విస్మరించబడ్డావు" అంటాడు.

రుకూ 8 : ఓ ప్రవక్తా! నీ వ్యతిరేకులు కల్పించే మాటల పట్ల సహనం వహించు. నీ ప్రభువును స్తుతించు. ఆయన స్తోత్రం చేయి. సూర్యోదయానికి ముందు. సూర్యాస్త మయానికి ముందు, రాత్రి పూట పగటి అంచులలో ఆయనను స్తుతిస్తూ ఉండు. వీరిలోని రకరకాల ప్రజలకు మేము ఇచ్చిన ప్రపంచం జీవన శోభా వైభవాలను కన్నెత్తి కూడా చూడకు. వారిని మేము పరీక్షించడానికే అదంతా ఇచ్చాము. నీ ప్రభువు ప్రసాదించిన హలాల్ ఉపాధి ఉత్తమమైనది. చిరకాలం ఉండేది. నీ కుటుంబం సభ్యు లను నమాజు స్థాపించండని ఆజ్ఞాపించు. నీవు కూడా దానికి కట్టుబడి ఉండు. ఉపాధిని మేమే నీకు ఇస్తున్నాము. చివరకు మేలు జరిగేది భయభక్తులు కలవారికే.

21. అల్ అంబియా

రుకూ 1 : మానవుల లెక్కల సమయం సమీపించింది. అయినా వారు ఏమరుపాటులో పడి ఉన్నారు. వైముఖ్యం చూపుతున్నారు. వారి వద్దకు వారి ప్రభువు తరఫు నుంచి యే కొత్త ఉపదేశం వచ్చినా వారు అనాసక్తిగా వింటున్నారు. ఆటలలో మునిగిపోయి ఉంటారు. దుర్మార్గులు పరస్పరం గుసగుసలాడుకుంటూ "ఈయన కూడా ఒక మనిషి మాత్రమే కదా! కళ్ళారా చూస్తూ కూడా మంత్రజాలంలో చిక్కుకుంటారా" అని చెప్పుకుంటుంటారు. ప్రవక్తా! మీకు పూర్వం కూడా మేము మనుషులనే ప్రవక్తలుగా చేసి పంపాము. వారిపై వహీ అవతరింపజేసేవారం. ఆ ప్రవక్తలకు కూడా మేము ఆహారం అవసరం లేని శరీరాన్ని ఇవ్వలేదు. వారు కూడా చిరంజీవులు కాదు. ప్రజ లారా! మేము మీ వద్దకు మీ ప్రస్తావన ఉన్న గ్రంథాన్ని పంపాము. మీరు అర్థం చేసుకోరా!

రుకూ 2 : దుష్ట జనావాసాలు ఎన్నో మేము పిండి పిండి చేసివేశాము. వారి తరువాత మరొక జాతిని ఆవిర్భవింపజేశాము. మేము ఆకాశాన్ని, భూమిని వాటిలో ఉన్న సమస్తాన్ని కాలక్షేపం కోసం సృష్టించలేదు. మేము ఏదన్నా ఆట వస్తువు చేయదలిచి

ఉంటే మా వద్ద ఉన్న దానినే చేసుకుని ఉండేవారం. మేము అసత్యంపై సత్యంతో దెబ్బతీస్తాము. ఆ దెబ్బ దాని తల పగులకొడుతుంది. అసత్యం చూస్తూ ఉండగానే సమసిపోతుంది. దైవదూతలు, అల్లాహ్ సృష్టించిన ఇతర సృష్టి రాత్రింబవళ్ళు ఆయన స్తోత్రమే చేస్తూ ఉంటారు. ఊపిరి పీల్చుకోడానికి కూడా ఆగరు. భూమ్యాకాశాలలో ఒక దేవుడు కాక వేరే దేవుళ్ళు కూడా ఉంటే, భూమ్యాకాశాల వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది.

రుకూ 3 : ఈ భూమ్యాకాశాలు పరస్పరం కలిసి ఉండేవి. మేము వాటిని వేర్వేరు చేశాము. నీటి ద్వారా ప్రతి ప్రాణిని పుట్టించాము. భూమిపై పర్వతాలు పటిష్ఠంగా నిలబెట్టాము. విశాలమైన మార్గాలు సృష్టించాము. ఆకాశాన్ని ఒక దృఢమైన పై కప్పుగా చేశాము. కాని ఈ ప్రజలు విశ్వంలోని ఈ సూచనల పట్ల శ్రద్ధ చూపరు. శాశ్వత జీవితాన్ని మేము ఏ మనిషికీ ఇవ్వలేదు. ప్రతి ప్రాణి మృత్యువును చవిచూడక తప్పదు. మీ అందరినీ మంచి చెడు పరిస్థితులలో వేసి పరీక్షిస్తున్నాము. మనిషి తొందరపడే ప్రాణి. మేము నీకు మా సూచనలు చూపిస్తాము. నన్ను తొందరపెట్టవద్దు.

రుకూ 5 : ఇబ్రాహీం తన తండ్రిని తన జాతి ప్రజలను ఉద్దేశించి, "మీరు అమిత భక్తి చూపుతున్న ఈ విగ్రహాలు దేనికి? వీటి కోసం పడి ఛస్తున్నారెందుకు? నిజానికి భూమ్యాకాశాలను సృష్టించినవాడే మీ ప్రభువు" అని బోధించారు. వారు లేనప్పుడు చూసి ఇబ్రాహీం విగ్రహాలను ముక్కలు ముక్కలు చేశారు. ఒక్క పెద్ద విగ్రహాన్ని మాత్రం వదిలేశాడు. ప్రజలు తర్వాత అక్కడికి వచ్చి, ఇది చూసి ఇబ్రాహీంను పిలిచారు. "ఇబ్రాహీం మా దేవుళ్ళను ఇలా చేసింది నువ్వేనా" అనడిగారు. ఇబ్రాహీం జవాబిస్తూ "ఇదంతా చేసింది ఆ విగ్రహాల నాయకుడే, అతడినే అడగండి" అన్నారు. "అవి మాట్లాడవని నీకు తెలియదా" అన్నారు వాళ్ళు. అప్పుడు ఇబ్రాహీం వారితో "అయితే మీరు అల్లాహ్‌ను కాదని వాటిని పూజిస్తారా? ఇవి మీకు లాభంగాని, నష్టంగాని చేకూర్చే శక్తి కలిగి లేవు. మీకు బుద్ధి అనేది లేదా?" అని నిలదీశారు. ఆ తర్వాత ఒక పెద్ద అగ్ని గుండం తయారు చేశారు. ఇబ్రాహీంను మేము రక్షించాము. ఆయనకు ఇస్హాఖ్‌ను, యాకూబ్‌ను ప్రసాదించాము. వారు సౌశీల్యం గలవారు. లూత్‌ను మేము ఆ నీచమైన జాతి నుంచి బయటకు తీసి మా కారుణ్యంలోకి తీసుకున్నాము.

రుకూ 6 : మేము నూహ్‌ను అనుగ్రహించాము. ఆయన్ను ఆయన కుటుంబసభ్యులను తీవ్రమైన వ్యథ నుంచి రక్షించాము. ఆయన జాతికి విరుద్ధంగా ఆయనకు సహాయం

చేశాము. దుష్టులు అందరినీ ముంచివేశాము. దావూద్, సులైమాన్‌లకు ఘనత ప్రసాదించాము. సులైమాన్ అల్లాహ్ ఆదేశంతో ఒక చేను వ్యాజ్యం సందర్భంగా న్యాయమైన తీర్పు ఇచ్చారు. పర్వతాలను పక్షులను దావూద్‌కు వశమయ్యేలా చేశాము. ఆయనకు కవచాలు తయారు చేసే విద్య ప్రసాదించాము. వేగంగా వీచే గాలిని మేము సులైమాన్‌కు వశం చేశాము. షైతాన్‌లలో చాలా మందిని మేము ఆయనకు అధీనం చేశాము. అయ్యూబ్ వ్యాధిగ్రస్తుడైనపుడు మేము ఆయన ప్రార్థనను స్వీకరించాము. ఆయన బాధను తొలగించాము. ఇస్మాయీల్, ఇద్రీస్, జుల్‌కిఫ్ల్ – వీరందరూ సహన శీలం గలవారు. వీరికి మేము మా కారుణ్యంలో చోటు ప్రసాదించాము. జ్ఞాపకం తెచ్చుకో, చేపవాడు మమ్మల్ని చీకట్ల నుంచి మొరపెట్టుకుంటూ, "నీవు తప్ప దేవుడు లేడు. నీవు పరిశుద్ధుడవు. నిస్సందేహంగా నేను తప్పు చేశాను" అని పిలిచినపుడు మేము అతని ప్రార్థన స్వీకరించాము. అతనికి విముక్తి ప్రసాదించాము. జకరియ్యా మమ్మల్ని ప్రార్థించినపుడు మేము అతనికి యహ్యాను ప్రసాదించాము. వీరంతా మంచి పనుల కోసం శ్రమించేవారు. వారు మమ్మల్ని ప్రేమతోనూ, భయంతోనూ ప్రార్థించే వారు. ఇంకా ఆ మహిళ – మేము మా ఆత్మను ఊదిన మహిళను ఆమె కుమారుని మేము ప్రపంచ ప్రజలకు ఒక సూచనగా చేశాము.

రుకూ 7 : విశ్వాసిగా ఉండి సత్కార్యాలు చేసే వానిని నిరాదరించడం జరగదు. వీరు అల్లాహ్‌ను వదలి పూజిస్తున్న ఈ ఆరాధ్య దైవాలు అన్నీ నరకాగ్ని ఇంధనం అవుతాయి. మంచివారు నరకానికి దూరంగానే ఉంచబడతారు. వారు సదా తమ మనస్సులు కోరుకునే వస్తువుల మధ్య ఉంటారు. దైవదూతలు ఎదురు వచ్చి వారికి స్వాగతం పలుకుతారు. భూమికి వారసులు సౌశీల్యవంతులైన మా దాసులే అవుతారు. ఆరాధనాపరులకు ఇందులో గొప్ప సమాచారం ఉంది. మీరు బిగ్గరగా మాట్లాడే మాటలు, మీరు రహస్యంగా చెప్పుకునే మాటలు అన్నీ అల్లాహ్‌కు తెలుసు. ఒక నిర్ణీత సమయం వరకు అనుభవించే అవకాశం మీకు ఇవ్వబడింది.

22. అల్ హజ్

రుకూ 1 : అల్లాహ్ మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. తర్వాత వీర్యబిందువుతో, ఆ తర్వాత నెత్తుటి గడ్డతో, ఆపై రూపం కలదిగానూ, రూపం లేనిదిగానూ ఉండే మాంసపు

కండతో చేశాము. మేము కోరిన వీర్యబిందువును ఒక ప్రత్యేక కాలం వరకు మాతృ గర్భంలో ఉంచుతాము. తర్వాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటకు తీస్తాము. ఆ పిదప మిమ్మల్ని పోషిస్తాము. మీరు యవ్వన దశకు చేరుకోడానికి పోషిస్తాము. మీలో కొందరు ముందుగానే పిలుచుకోబడతారు. మరికొందరు అతి నికృష్టమైన వయస్సు వైపునకు మరలించబడతారు. మీరు చూస్తూనే ఉన్నారు. ఎండిపోయిన నేలపైన మేము వర్షం కురిపించగానే అది పులకరిస్తుంది. మనోహరమైన అనేక రకాల మొక్కలు మొలకెత్తించడం ప్రారంభిస్తుంది. అదే విధంగా శవాలను కూడా బ్రతికించడం జరుగుతుంది. ప్రళయ ఘడియ వచ్చి తీరుతుంది. గోరీలలోకి వెళ్ళిపోయిన వారిని అల్లాహ్ తప్పక లేపుతాడు.

రుకూ 2 : కొందరు విశ్వాసం అంచులపై నిలబడి అల్లాహ్ దాస్యం చేస్తుంటాడు. లాభం కలిగితే సంతృప్తి చెందుతాడు. ఏదైనా కష్టం కలిగితే వెనక్కి మరలిపోతారు. అలాంటి వారికి ఇహమూ దక్కదు. పరమూ దక్కదూ. అసలు నష్టం అంటే ఇదే. అలాంటి వారు, ప్రపంచంలోనూ పరలోకంలోనూ అల్లాహ్ తనకు యే సహాయమూ చేయడని అనుమానించే వ్యక్తి, ఒక తాడు ద్వారా ఆకాశానికి చేరి దానికి కన్నం వేసి, ఆ కన్నం ద్వారా తనకు అయిష్టమైన విషయాన్ని దైవనిర్ణయాన్ని తన యుక్తి ఎత్తుగడలు మార్చగలవేమో చూసుకోవాలి. అవిశ్వాసానికి పాల్పడిన వారి కోసం అగ్ని దుస్తులు కత్తిరించబడి ఉన్నాయి. వారి తలపై మరిగే నీరు పోయబడుతుంది. దాని వల్ల వారి చర్మమే కాదు, కడుపు లోపలి భాగాలు కూడా కరిగిపోతాయి. వారు ఆందోళనతో నరకం నుంచి బయటపడాలని ప్రయత్నించిన ప్రతిసారీ వారిని ఇనుప గదలతో లోపలికి నెట్టివేయడం జరుగుతుంది.

రుకూ 3 : విశ్వసించి మంచి పనులు చేసిన వారికి స్వర్గాలున్నాయి. క్రింద సెల యేళ్ళు ప్రవహించే ఉద్యాన వనాలున్నాయి. అక్కడ వారిని స్వర్ణ కంకణాలతో, ముత్యాలతో అలంకరించడం జరుగుతుంది. వారికోసం పట్టు వస్త్రాలు ఉంటాయి. మస్జిదె హరామ్‌లో స్థానికులకు, బయటి నుంచే వచ్చే ప్రజలు – ఇరు వర్గాల హక్కులు సమానం. మస్జిదె హరామ్‌లో నిజాయితీ నుంచి వైదొలిగి, అన్యాయపు పద్ధతి అవలంబించే వాడికి మేము వ్యధాభరితమైన శిక్ష రుచి చూపిస్తాము.

రుకూ 4 : హజ్రత్ ఇబ్రాహీమ్‌ను ఆదేశిస్తూ హజ్ కొరకు మానవులందరినీ పిలువమనీ,

సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన, ఒంటెలపై ప్రజలు వచ్చి ఇక్కడ వారి కోసం ఉన్న ప్రయోజనాలు చూసుకోవాలనీ, తర్వాత పశువులను అల్లాహ్ పేర ఖుర్బానీ ఇవ్వాలనీ, వారు స్వయంగా తిని అగత్యపరులకూ పెట్టాలనీ, పిదప శిరోముండనం చేయించుకొని స్నానమాచరించి పరిశుద్ధులై ఆ ప్రాచీన గృహానికి ప్రదక్షిణం చేయాలనీ చెప్పడం జరిగింది. అల్లాహ్ నిర్ణయించిన వాటిని గౌరవిస్తున్న ప్రతి వ్యక్తీ విగ్రహాల మాలిన్యానికి దూరంగా ఉండాలి. అబద్ధపు మాటలకు దూరంగా ఉండాలి. ఏకాగ్ర చిత్తంతో అల్లాహ్ దాస్యం చేయాలి. అల్లాహ్‌కు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్ట రాదు.

రుకూ 5 : ప్రవక్తా! అణకువతో మెలిగే వారికి శుభవార్త వినిపించు. అలాంటివారు అల్లాహ్ ప్రస్తావన వినగానే వారి గుండెలు కంపిస్తాయి. తమపైకి ఎలాంటి ఆపద వచ్చిపడినా సహనం వహిస్తారు. నమాజు స్థాపిస్తారు. మేము ప్రసాదించిన ఉపాధి నుంచి ఖర్చుపెడతారు. ఖుర్బానీ ఒంటెలను మేము మీకోసం అల్లాహ్ చిహ్నాలలో చేర్చాము. వాటిని అల్లాహ్ పేర ఖుర్బాని ఇవ్వండి. స్వయంగా మీరూ తినండి. నిరుపేదలకూ పెట్టండి. వాటి మాంసంగాని, రక్తంగాని అల్లాహ్‌కు చేరదు. కాని మీ భయభక్తులు ఆయన వద్దకు చేరుతాయి.

రుకూ 6 : అల్లాహ్ గనుక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండనట్లయితే ఆశ్రమాలు, చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు మసీదులు – అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడే ఈ స్థలాలన్నీ ధ్వంసం చేయబడి ఉండేవి. భూమిపై అధికారాన్ని అల్లాహ్ ఎవరికి ప్రసాదిస్తాడో వారు నమాజ్ స్థాపిస్తారు. జకాత్ ఇస్తారు. మంచి చేయమని ఆజ్ఞాపిస్తారు. చెడు నుంచి నిరోధిస్తారు. పాపాల పుట్టలుగా మారిన అనేక బస్తీలను మేము నాశనం చేశాము. నేడు ఆ బస్తీలు తల్లక్రిందులుగా పడి ఉన్నాయి. ఎన్నో బావులు నిరుపయోగంగా పడి వున్నాయి. ఎన్నో ఎత్తయిన భవనాలు శిథిలాలుగా మారిపోయాయి. ఈ ప్రజలు భూమిపై సంచరించడం లేదా? వారి హృదయాలు అర్థం చేసుకోవా? వారి చెవులు వినలేవా? వాస్తవమేమిటంటే కళ్ళు గ్రుడ్డివి కావు, కానీ హృదయం గ్రుడ్డిదయిపోతుంది.

రుకూ 7 : విశ్వసించి మంచి పనులు చేసిన వారికి క్షమాభిక్ష లభిస్తుంది. వారికి గౌరవ ప్రదమైన ఉపాధి లభిస్తుంది. మా ఆయతులను కించపరచడానికి ప్రయత్నించేవారు

నరకానికి మిత్రులవుతారు. కాపట్యం అనే రోగం హృదయాలకు సోకిన వారికి, హృదయాలు మొద్దుబారిపోయిన వారికి షైతాన్ కల్పించే చెడు ఒక పరీక్షగా చేయబడుతుంది. వాస్తవానికి దుర్మార్గులు వైరంలో చాలా ముందుకు వెళ్ళిపోయారు. జ్ఞాన సంపన్నులైన ప్రజలు ఇది నీ ప్రభువు తరఫు నుంచి వచ్చిన సత్యమని గ్రహిస్తారు. దీనిని విశ్వసిస్తారు. దీని ముందు వారి హృదయాలు వంగిపోతాయి. నిశ్చయంగా, అల్లాహ్ విశ్వాసులకు రుజుమార్గం చూపిస్తాడు.

రుకూ 8 : అల్లాహ్ మార్గంలో వలసపోయిన వారికి, లేదా చంపబడ్డారో, లేదా చనిపోయారో వారికి అల్లాహ్ మంచి ఉపాధి ప్రసాదిస్తాడు వారు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యే ప్రాంతానికి చేరవేస్తాడు. తనపై జరిగిన దానికి అంత మేరకే ప్రతీకారం తీర్చుకొన్న వారికి – అతడిపై దౌర్జన్యం జరిగి ఉంటే అల్లాహ్ అతనికి తప్పక సహాయం చేస్తాడు. రాత్రి నుంచి పగలును, పగటి నుంచి రాత్రిని తీసేవాడు అల్లాహ్‌యే. ఆయన చూసేవాడు. వినేవాడు, అల్లాహ్‌యే సత్యం. అల్లాహ్‌ను వదలి ఈ ప్రజలంతా ఎవరినయితే పిలుస్తున్నారో అవన్నీ అసత్యాలే.

రుకూ 9 : భూమిపై ఉన్న వాటినన్నంటినీ ఆయన మీకు అధీనం చేశాడు. అల్లాహ్ పడవను కట్టుబాటులో ఉంచాడు. ఆయన ఆజ్ఞతోనే అది సముద్రంలో పయనిస్తోంది. ఆయనే ఆకాశాన్ని నిలిపి ఉంచాడు. ఆయన ఆదేశం లేనిదే అది భూమిపై పడదు. మీకు జీవితాన్ని ఇచ్చింది ఆయనే, మరణం ఇచ్చేది ఆయనే. మళ్ళీ మిమ్మల్ని బ్రతికించేది ఆయనే. ప్రవక్తా! నీతో విభేదించే వారికి చెప్పు, అల్లాహ్ ప్రళయ దినాన ఈ వ్యవహారాలన్నింటి తీర్పు చేస్తాడు. మా స్పష్టమైన ఆయతులు వారికి చదివి వినిపించినప్పుడు సత్య తిరస్కారుల ముఖాలు మాడిపోతాయి. మా ఆయతులు వినిపించేవారిపై విరుచుకుపడతారా? అనిపిస్తుంది. వారికి చెప్పు, వారికి వాగ్దానం చేయబడి ఉన్నది అగ్ని మాత్రమే అని.

రుకూ 10 : మీరు అల్లాహ్‌ను వదలి పిలుస్తున్న ఆరాధ్య దైవాలు అన్ని కలసి కూడా ఒక్క ఈగను సృష్టించలేవు. అంతేకాదు వారి నుంచి యే వస్తువునయినా ఈగ లాక్కునిపోతే వారు దాన్ని విడిపించుకోనూ లేరు. సహాయాన్ని అర్థించేవారు బలహీనులే, అర్థింపబడే వారూ బలహీనులే. ఈ ప్రజలు అల్లాహ్ ఔన్నత్యాన్ని గుర్తించవలసిన విధంగా గుర్తించడం లేదు. విశ్వాసులారా! రుకూ, సజ్దాలు చేయండి. మీ ప్రభువునకు దాస్యం చేయండి. మంచి పనులు చేయండి. మీరు సాఫల్యం

పొందుతారని ఆశించవచ్చు. అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయవలసిన విధంగా చేయండి. ఆయన తన సేవకై ఎన్నుకున్నాడు. అల్లాహ్ ఈ ఖురానులోనూ, ఇంతకు పూర్వం కూడా మీకు 'ముస్లిమ్' అని పేరుపెట్టాడు. దైవప్రవక్త మీ విషయంలో సాక్షిగా ఉండడానికి, మీరు ప్రజల విషయంలో సాక్షులుగా ఉండడానికి, ఇలా చేశాడు. నమాజు స్థాపించండి. జకాత్ ఇవ్వండి. అల్లాహ్‌తో గట్టి సంబంధం కలిగి ఉండండి.

23. అల్ మూమినూన్

రుకూ 1 : విశ్వసించిన వారే సాఫల్యం పొందుతారు. వారి లక్షణాలు 1) నమాజులో వినమ్రతను పాటిస్తారు 2) వ్యర్థ విషయాల జోలికి పోరు 3) తమ మర్మాంగాలను పరిరక్షించుకొంటారు 4) తమ వద్ద ఉన్న అమానతులకు, తమ వాగ్దానాలకు కట్టుబడి ఉంటారు 5) తమ నమాజులను కాపాడుకుంటారు.

మేము మనిషిని మట్టిసారంతో చేశాము. తరువాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము. ఆ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము. ఆ ముద్దను కండగా చేశాము. పిదప కండను ఎముకలుగా చేశాము. ఎముకలపై మాంసాన్ని తొడిగాము. ఆపైన దానిని విభిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. సృజనకారులందరికన్నా ఉత్తమ సృజనకారుడు అల్లాహ్.

రుకూ 2 : ఈ రుకూలో హజ్రత్ నూహ్ గాథ చెప్పబడింది. నూహ్ జాతి ప్రజలను అల్లాహ్ దాస్యం వైపునకు ఆహ్వానించినపుడు జాతి సర్దారులు "ఈ వ్యక్తి మీపై ఆధిక్యత పొందడానికి ఇదంతా చేస్తున్నాడని అల్లాహ్ ప్రవక్తను పంపదలిస్తే దైవదూతలను పంపేవాడు" అనసాగారు. అల్లాహ్ ఆజ్ఞతో హజ్రత్ నూహ్ ఒక పడవ తయారు చేశారు. ప్రతి రకం జంతువుల ఒక్కో జతను పడవలోకి చేర్చారు. తన కుటుంబ సభ్యులలో సచ్ఛీలురను పడవలోకి ఎక్కించుకున్నారు. హజ్రత్ నూహ్‌కు ఒక ప్రత్యేక ప్రార్థన నేర్పడం జరిగింది. ఆ ప్రార్థన – "దుర్మార్గుల నుంచి మాకు విమోచనం కలిగించిన దేవునికి కృతజ్ఞతలు", స్వామి నన్ను శుభప్రదమైన స్థలంలో దించు, ఉత్తమ స్థలాన్ని ఇచ్చేవాడవు నీవే".

రుకూ 3 : నూహ్ జాతి ప్రజల వినాశం తర్వాత మేము మరొక తరం జాతిని ఉద్భవింపజేశాము. వారి జాతి నుంచే ఒక ప్రవక్తను పంపాము. ఆ ప్రవక్త జాతి

ప్రజలను అల్లాహ్ వైపునకు పిలిచాడు. ఇహలోక జీవితంలో భాగ్యవంతులుగా మేము చేసినటువంటి ఆ ప్రజలు “ఇతను ఒక మనిషే, మనలాంటి వాడే, మనం తినేదే ఇతనూ తింటున్నాడు. మనం తాగేదే ఇతనూ తాగుతున్నాడు. మనలాంటి ఓ మనిషికి విధేయత చూపితే నష్టపోతాం” అన్నారు. ఆ జాతి ప్రజలు ప్రళయాన్ని కూడా తిరస్కరించారు. అప్పుడు మేము ఒక పెద్ద కల్లోలాన్ని వారిపైకి పంపాము. వారిని కసువుగా ఊడ్చి పారవేశాము. ఆ తర్వాత మేము ఇతర జాతులను పైకి లేపాము. ప్రవక్తలను ఒకరి తర్వాత ఒకరిని పంపాము. జాతులు తమ ప్రవక్తలను తిరస్కరిస్తూ వచ్చాయి. మేము జాతులను నాశనం చేస్తూ వచ్చాము.

రుకూ 4 : మీ ఈ సంఘం ఒకే సంఘం. నేను మీకు ప్రభువును. నాకు మాత్రమే భయపడండి. ప్రజలు తమ ధర్మాన్ని ముక్కలుముక్కలుగా చేసుకొని పంచుకున్నారు. ప్రతి వర్గం తన వద్ద ఉన్న ముక్కను పట్టుకుని ఆనందపరవశమై ఉంది. వదలండి వారిని. వారిని వారి అజాగ్రత్తలోనే ఒక నిర్ణీత కాలం వరకు ఉండనివ్వండి. ప్రభువు వైపుకు మరలిపోవలసి ఉందన్న భావన కలుగగానే హృదయాలు భయంతో కంపించే మా దాసులు కొందరు ఉన్నారు. వారే మంచి వైపునకు పరుగెత్తేవారు. పోటీపడి మేళ్ళను పొందుతారు. ఏ వ్యక్తికీ మేము అతడి శక్తికి మించిన కష్టం కలుగజేయము. మా ఆయతులను ప్రవక్తలు చదివి వినిపించినపుడు తిరస్కారులు గర్వంతో వ్యర్థ ప్రేలాపన చేస్తుంటారు. తమ సమావేశాల్లో ఎద్దేవా చేస్తుంటారు. ప్రవక్త తీసుకు వచ్చింది సత్యం. వారి మనోకాంక్షల వెనుక సత్యం అనుసరిస్తూ ఉంటే ఈ విశ్వ వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోతుంది.

రుకూ 5 : మీకు చూసే శక్తి, వినే శక్తి ప్రసాదించినవాడు అల్లాహ్ ఆలోచించే హృదయాన్ని ఇచ్చాడు. కాని మీరు కృతజ్ఞత చూపడం అన్నది అరుదు. మరణించిన పిదప మళ్ళీ లేపబడతారన్న విషయాన్ని మనిషి నిరాకరిస్తున్నాడు. భూమ్యాకాశాల ప్రభువు అల్లాహ్‌యేనని వారు అంటారు. అంతేకాదు శరణు ఇచ్చేవాడు కేవలం అల్లాహ్ మాత్రమేనని కూడా అంటారు. వాళ్ళు అబద్ధాలకోరులు. అల్లాహ్ కాక మరొక ప్రభువు ఉన్నట్లయితే ప్రతి దేవుడు తన సృష్టిని తీసుకొని వేరైపోతాడు. పిదప ఒకరిపై ఒకరు దాడికి పూనుకొని ఉండేవారు. వారు కల్పించే భాగస్వామ్యాలకు అల్లాహ్ అతీతుడు.

రుకూ 6 : ప్రవక్తా! ఉత్తమమైన రీతిలో చెడును నిర్మూలించు. దేవుని ప్రార్థించు, “ఓ

ప్రభూ! షైతాన్ నా వద్దకు వచ్చి నన్ను ఉసిగొల్పకుండా నేను నీ శరణు వేడుతున్నాను. ప్రళయ దినాన ఎవరి త్రాసు పళ్ళాలు బరువుగా ఉంటాయో వారే సాఫల్యం పొందుతారు. ఎవరి పళ్ళాలయితే తేలిగ్గా ఉంటాయో వాస్తవానికి వారు తమ్ము తాము నష్టంలో పడవేసుకున్నారు. వారక్కడ అల్లాహ్‌తో తమను ఇక్కడి నుంచి బయటకు తీస్తే మళ్ళీ ఇలాంటి తప్పు చేయం అని వేడుకొంటారు. అప్పుడు అల్లాహ్ వారితో "మీరు ప్రపంచంలో మా సచ్ఛీలురయిన దాసులను వేధించారు. వారిని పరిహసించారు. అయితే అపహాస్యానికి గురయిన వారి సహనం నేడు వారికి సాఫల్యాన్నిచ్చింది. అల్లాహ్‌తోపాటు మరో ఆరాధ్య దైవాన్ని పిలిచే వానికి లెక్క అతడి ప్రభువు వద్ద తేలుతుంది.

24. అన్ నూర్

రుకూ 1 : ఈ రుకూలో క్రింది ఆజ్ఞలు జారీ అయ్యాయి 1) వ్యభిచారిణి వ్యభిచారి ప్రతి ఒక్కరికి వంద కొరడా దెబ్బలు కొట్టండి. వారిమీద జాలిపడవద్దు 2) వ్యభిచారి అయిన పురుషుడు వ్యభిచారిణి అయిన స్త్రీని లేదా ముష్రిక్ స్త్రీని తప్ప మరెవ్వరినీ వివాహం చేసుకునే వీలులేదు. అలాగే వ్యభిచారిణి అయిన స్త్రీని ఒక వ్యభిచారి లేక ముష్రిక్కు పురుషుడు తప్ప మరెవ్వరూ వివాహం చేసుకోరాదు 3) శీలవతులైన స్త్రీలపై నింద మోపిన వారు తరువాత నలుగురు సాక్షులను తీసుకు రాకపోతే వారికి ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి. వారి సాక్ష్యాన్ని ఇక ఎన్నడూ అంగీకరించకండి 4) భర్త తన భార్యపై నిందమోపితే వారిద్దరు తప్ప ఇతర సాక్షులెవ్వరూ లేని పక్షంలో పాటించవలసిన పద్ధతి – భర్త నాలుగు సార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి తన ఆరోపణ సత్యం అని చెప్పాలి. ఐదోసారి ప్రమాణం చేస్తూ తన ఆరోపణ అసత్యమైతే తనపై అల్లాహ్ శాపం అవతరించుగాక! అనాలి. భార్యకు శిక్ష ఎలా తప్పుతుందంటే, ఆమె నాలుగు సార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి భర్త చేసిన ఆరోపణ అసత్యం అని చెప్పాలి. ఐదోసారి ప్రమాణం చేస్తూ భర్త ఆరోపణ సత్యమైతే తనపై అల్లాహ్ శాపం అవతరించుగాక! అనాలి.

రుకూ 2 : మీరు ఆ విషయం గురించి విన్నప్పుడు ఇది స్పష్టమైన అభాండమని ఎందుకు ఖండించలేదు. విశ్వాసులైన స్త్రీ పురుషులు పరస్పరం సదభిప్రాయాన్ని

ఎందుకు కలిగిలేరు? ప్రపంచంలోనూ పరలోకంలోనూ మీపై అల్లాహ్ కారుణ్యం, కృప చూపనట్లయితే మీరు యే విషయాల్లో అయితే మునిగిపోయారో ఆ విషయాల ఫలితంగా ఒక పెద్ద శిక్ష మిమ్మల్ని పట్టుకుని ఉండేది. కొంచెం ఆలోచించండి. ఎంత ఘోరమైన తప్పు చేశారో! ఈ అబద్ధాన్ని మీ నాలుకలు ఒకదాని నుంచి మరొకటి అందుకుంటూ పోయాయి. మీకు తెలియని విషయాన్ని మీరు చెబుతూపోయారు మీరు విశ్వాసులే అయితే ఇలాంటి పనికి ఇక ముందు ఎన్నడూ పాల్పడరాదని అల్లాహ్ ఉపదేశిస్తున్నాడు. విశ్వాసుల వర్గంలో అశ్లీలత వ్యాపించాలని కోరేవారు, ఇహపర లోకాల్లో వ్యధాభిరతమైన శిక్షకు గురి అవుతారు.

రుకూ 3 : విశ్వసించిన ప్రజలారా! షైతాను అడుగుజాడల్లో నడువకండి. తనను అనుసరించే వారికి షైతాను చెడును అశ్లీలతను ఆజ్ఞాపిస్తాడు. మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకు, నిరుపేదలకు, అల్లాహ్ మార్గంలో వలసి వచ్చిన ప్రజలకు సహాయం చేయకూడదని ప్రమాణం చేయరాదు. వారిని క్షమించాలి. వారి తప్పులను ఉపేక్షించాలి. అల్లాహ్ మిమ్మల్ని క్షమించాలని మీరు కోరడం లేదా? శీలవతులు, అమాయకులు అయిన, విశ్వసించిన స్త్రీలపై అభాండం వేసేవారు ఇహ పరలోకాల్లో శాపానికి గురయ్యారు. వారికి పెద్ద శిక్ష పడుతుంది. అపవిత్ర స్త్రీలు అపవిత్ర పురుషుల కొరకు, అపవిత్ర పురుషులు అపవిత్ర స్త్రీల కొరకు, పవిత్ర పురుషులు పవిత్ర స్త్రీల కొరకు, పవిత్ర స్త్రీలు పవిత్ర పురుషుల కొరకు.

రుకూ 4 : విశ్వసించిన ప్రజలారా! మీ ఇళ్ళల్లోకి తప్ప ఇతరుల ఇళ్ళలోకి – ఆ యింటి వారి అనుమతి పొందనంత వరకు, ఇంటి వారికి సలామ్ చేయనంత వరకు– ప్రవేశించరాదు. ఒకవేళ ఆ యింటిలో మీకు ఎలాంటి జవాబు లభించకపోతే అనుమతి లభించక ముందే ప్రవేశించరాదు. ఒకవేళ వారు మిమ్మల్ని మరలిపొమ్మని అంటే తిరిగి వెళ్ళిపొండి. ఇది మీకు ఎంతో పరిశుద్ధమైన పద్ధతి. ప్రవక్తా! విశ్వసించిన పురుషులు తమ చూపులు కాపాడుకోవాలని, తమ మర్మాంగాలు రక్షించుకోవాలని వారికి చెప్పు. ఇది వారికి పరిశుద్ధమైన పద్ధతి. అలాగే విశ్వసించిన మహిళలు తమ చూపులు కాపాడుకోవాలని, మర్మాంగాలు రక్షించుకోవాలని, అలంకరణను ప్రదర్శించరాదనీ, వక్షస్థలాన్ని ఓణితో కప్పుకోవాలనీ, వారికి చెప్పు. వారు తమ అలంకరణను భర్త ముందు, తండ్రి ముందు, భర్తల తండ్రులు, కుమారులు, భర్తల కుమారులు, అన్నదమ్ములు, అన్నదమ్ముల కుమారులు, అక్కచెల్లెళ్ళ కుమారులు, తమతో కలసి

మెలసి ఉండే స్త్రీలు, తమ స్త్రీ పురుష బానిసలు, స్త్రీల గుప్త విషయాల గురించి తెలియని బాలుర ముందు తప్ప మరెవరి ముందు ప్రదర్శించకూడదు. తాము దాచి ఉంచిన తమ అలకంరణ ప్రజలకు తెలిసేలా కాళ్ళను నేలపై కొడుతూ నడువరాదని వారికి చెప్పు.

రుకూ 5 : అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి తన వైపునకు మార్గం చూపుతాడు. యే గృహాలను మహోన్నతం చేయడానికి, యే గృహాలలో తన నామాన్ని స్మరించడానికి ఆ గృహాలలో ఆయన వైపునకు పోయే మార్గం పొందిన వారు ఉంటారు. వ్యాపారం, క్రయవిక్రయాలలో మునిగిపోయి అల్లాహ్ సంస్మరణ, నమాజు స్థాపనం, జకాత్ చెల్లింపుల విషయంలో ఎలాంటి అశ్రద్ధ చేయరు. హృదయాలు తలక్రిందులై, కనుగుడ్లు తేలిపోయే పరిస్థితి ఏర్పడబోయే రోజు గురించి వారు భయపడుతూ ఉంటారు. అవిశ్వాసానికి పాల్పడిన వారి కర్మలు ఎడారిలో ఎండమావుల వంటివి. దప్పికగొన్న వాడు వాటిని చూసి నీరు అనుకుంటాడు. కాని అక్కడకు చేరి ఏమీ పొందలేడు. అయితే అక్కడ అల్లాహ్ ఉన్నట్లు కనుగొంటాడు. ఆయన అతడి లెక్కను పూర్తిగా తేల్చివేస్తాడు.

రుకూ 6 : ఆకాశాలలోనూ, భూమిపైనా ఉన్న సమస్తమూ, రెక్కలు విప్పి ఎగిరే పక్షులు సయితం అల్లాహ్ స్తోత్రం చేయడాన్ని నీవు చూడడం లేదా? అవి అన్నీ తమ నమాజు గురించి, స్తోత్రం చేసే పద్ధతి గురించి పూర్తిగా తెలుసుకున్నవి. అల్లాహ్ మేఘాన్ని మెల్లమెల్లగా నడుపుతాడు. వాటి తునకలను ఒక దానితో ఒకటి కలుపుతాడు. తరువాత వాటిని పోగుచేసి ఒక దట్టమయిన మబ్బుగా మలుస్తాడు. తరువాత దాని పై పొర నుంచి వర్షపు చినుకులు రాలడాన్ని నీవు చూస్తావు. పిడుగుల మెరుపు చూపులను చెదరగొడుతుంది. రేయింబవళ్ళ పరిభ్రమణను ఆయనే చేస్తున్నాడు. కళ్ళున్న వారికి ఇందులో గుణపాఠం ఉంది. అల్లాహ్ ప్రతి ప్రాణిని ఒక విధమైన నీటితో సృష్టించాడు. ఒకటి పొట్టపై నడిస్తే, మరొకటి రెండు కాళ్ళపై నడుస్తోంది. ఇంకొకటి నాలుగు కాళ్ళపై నడుస్తుంది. ఆయన తనకు ఇష్టమైన దానిని సృష్టిస్తాడు. వారి మధ్యన ఉన్న వ్యాజ్యం విషయంలో తీర్పు చెప్పడానికి దైవ ప్రవక్త వారిని అల్లాహ్ వైపునకు, దైవప్రవక్త వైపునకు రమ్మని పిలిచినప్పుడు వారిలోని ఒక వర్గం విముఖత చూపుతుంది. కాని, సత్యం గనక వారికి అనుకూలంగా ఉంటే దైవప్రవక్త వద్దకు పెద్ద విధేయుల మాదిరిగా వచ్చేస్తారు. వారి హృదయాలకు రోగం (కాపట్యం) పట్టుకొందా?

రుకూ 7 : విశ్వసించిన వారు చేయవలసిన పని – వారి వ్యాజ్యాన్ని పరిష్కరించడానికి దైవప్రవక్త వారిని అల్లాహ్ వైపునకు, ప్రవక్త వైపునకు పిలిచినప్పుడు వారు "మేము విన్నాము. విధేయత చూపాము" అనాలి. అలాంటి వారే సాఫల్యం పొందుతారు. ప్రవక్తా! వారిని అల్లాహ్‌కు విధేయులు అవ్వండని, దైవప్రవక్త ఆదేశాలు పాటించండనీ బోధించు. విశ్వసించి మంచి పనులు చేసే వారిని – పూర్వపు ప్రజల మాదిరిగా – భూమిపై ఖలీఫాలుగా చేస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అల్లాహ్ వారి కొరకు అంగీకరించిన ధర్మాన్ని పటిష్టమైన పునాదులపై స్థాపిస్తాడు. వారి ప్రస్తుత భయాందోళనల పరిస్థితిని శాంతిభద్రతల పరిస్థితిగా మారుస్తాడు. నమాజును స్థాపించండి. జకాత్ ఇవ్వండి. దైవప్రవక్తకు విధేయులుగా ఉండండి. మీరు కరుణించబడతారని ఆశించగలరు.

రుకూ 8 : విశ్వసించిన ప్రజలారా! మీ బానిసలూ, యుక్తవయస్సుకు ఇంకా చేరని మీ పిల్లలు మూడు సమయాలలో మీ వద్దకు వచ్చే ముందు తప్పనిసరిగా మీ అనుమతి తీసుకోవాలి. ఆ సమయాలు: ఉదయం నమాజుకు ముందు, మద్యాహ్నం మీరు దుస్తులు మార్చుకొనేప్పుడు, ఇషా నమాజు తర్వాత. ఈ మూడు సమయాలు మీకు పరదా సమయాలు. ఈ సమయాలు మినహా మిగతా వేళల్లో వారు అనుమతి లేకుండా వస్తే మీకు పాపం కాదు. వారికీ పాపం కాదు. మీ పిల్లలు యుక్త వయస్సుకు చేరుకున్నప్పుడు తమ పెద్దలు అనుమతి తీసుకున్న విధంగానే వారు కూడా అనుమతి తీసుకుని మరీ రావాలి. వయసు ఉడిగి, వివాహం పట్ల ఆసక్తి సన్నగిల్లిన స్త్రీలు తమ దుప్పట్లు తీసి వస్తే ఎలాంటి దోషమూ లేదు. అయితే వారు అలంకరణను ప్రదర్శించే వారు కారాదు. ఇళ్ళలోకి ప్రవేశించే ముందు మీ వారికి సలాము చేయండి. ఇది మేలు కొరకు చేయబడే ప్రార్థన. అల్లాహ్ తరపు నుంచి నిర్ణయించబడింది. ఎంతో శుభవంతమైనది. పరిశుద్ధమైనది.

రుకూ 9 : అల్లాహ్‌ను, ప్రవక్తనూ హృదయపూర్వకంగా విశ్వసించేవారు ఏదైనా సామూహిక కార్యం నిమిత్తం దైవప్రవక్త వెంట ఉన్నప్పుడు ప్రవక్త అనుమతి లేనిదే అక్కడి నుంచి వెళ్ళని వారు మాత్రమే అసలైన విశ్వాసులు. ప్రవక్తా! నిన్ను అనుమతి అడిగేవారే అల్లాహ్‌ను, ప్రవక్తనూ విశ్వసించేవారు. కనుక వారు యేదైనా పని ఉండి అనుమతి అడిగితే వారికి అనుమతి ఇస్తూ ఉండు. ముస్లిములారా! దైవప్రవక్త పిలుపును, మీరు ఒకరినొకరు పిలుచుకునే పిలుపు లాంటిదిగా భావించకండి. మీలో

ఒకరి చాటున ఒకరు దాక్కుంటూ మెల్లగా జారిపోయే వారు అల్లాహ్‌కు బాగా తెలుసు. దైవప్రవక్త ఆజ్ఞను ఉల్లంఘించేవారు తాము యేదైనా ఉపద్రవంలో చిక్కుకోవచ్చనీ, తమపై బాధాకరమైన శిక్ష అవతరించవచ్చనీ భయపడాలి.

25. అల్ ఫుర్ఖాన్

రుకూ 1 : ప్రజలు అల్లాహ్‌ను కాదని కల్పించుకున్న దేవుళ్ళు ఏ వస్తువునూ సృష్టించలేరు. నిజానికి వారే సృష్టించబడతారు. వారు స్వయంగా తమకు తాము లాభంగాని, నష్టంగాని కల్గించుకోలేరు. వారు చంపనూ లేరు, బ్రతికించనూ లేరు, మరణించిన వాణ్ణి మళ్ళీ లేపనూ లేరు. ఖుర్ఆన్ గురించి అవిశ్వాసులు "ఇవి పూర్వం కాలం నాటి వారు వ్రాసిన విషయాలు. వాటికి ఇతను నకలు రాయిస్తున్నాడు," అంటారు. ప్రవక్తా వారికి చెప్పు, "భూమ్యాకాశాల రహస్యాలు తెలిసినవాడు దీనిని అవతరింపజేశాడని."

"ఇతనేమి ప్రవక్త, భోం చేస్తాడు. బజారుల్లో నడుస్తూ ఉంటాడు. ఇతని వెంట ఒక్క దైవదూత కూడా లేడేందుకు? ఇతనితో ఉంటూ విశ్వసించని వారిని బెదిరించడు ఎందుకు? లేదా కనీసం ఇతనికి ఒక నిధి అయినా ఇవ్వబడలేదు ఎందుకని? కనీసం నిశ్చింతగా ఉపాధి పొందడానికి ఒక తోట అయినా లేదు" అని కూడా అంటుంటారు వాళ్ళు. వారు ఎంతగా మార్గం తప్పిపోయారంటే స్థిరమైన మాట యేదీ వారికి తోచదు.

రుకూ 2 : ప్రళయం రోజున నీ ప్రభువు ఈ ప్రజలందరినీ ఒక చోటకు చేరుస్తాడు. వారు అల్లాహ్‌ను కాదని నేడు పూజిస్తున్న దేవుళ్ళను కూడా ఆనాడు పిలుస్తాడు. తర్వాత ఆయన ఆ దేవుళ్ళతో "నా యీ దాసులను మార్గం తప్పించింది మీరేనా? లేక స్వయంగా వారే మార్గభ్రష్టులయ్యారా?" అని ప్రశ్నిస్తాడు. అప్పుడు వారు "నీవు అత్యంత పరిశుద్ధుడవు, నిన్ను తప్ప మరొకరిని మా రక్షకుడు చేసుకొనే ధైర్యం మాకులేదు. నీవు వీరికి, వీరి పూర్వీకులకు జీవితావసర వస్తువులు పుష్కలంగా ప్రసాదించావు. చివరకు వారు బోధనను మరిచిపోయి దౌర్భాగ్య స్థితికి గురయ్యారు" అని విన్నవించుకుంటారు. ఈ రోజున ఈ ప్రజలు చెబుతున్న మాటలను ప్రళయ దినాన వారి దేవుళ్ళు తిరస్కరిస్తారు. ఇక వీరు వీరి దౌర్భాగ్యాన్ని ఆపలేరు. ఎక్కడి నుంచీ సహాయాన్ని పొందలేరు. ప్రవక్తా! నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరూ (సాధారణ మనుషుల్లా) భోం చేయడం, బజారున నడవడం చేసిన వారే.

రుకూ 3 : ఆ రోజున నిజమైన రాజ్యాధికారం కేవలం కరుణామయుడైన దేవుని చేతుల్లో ఉంటుంది. అది అవిశ్వాసులకు ఎంతో కఠినమైన రోజు. దుర్మార్గపు మనిషి తన చేతులను కొరుక్కుంటూ "అయ్యో! నేను దైవప్రవక్త వెంట ఉండి ఉంటే ఎంత బాగుండేది. అయ్యో! నా దౌర్భాగ్యం. నేను ఫలానా వారితో స్నేహం చేయకుండా ఉంటే ఎంత బాగుణ్ణు! అతడి మాయలో పడి నేను నా వద్దకు వచ్చిన హితబోధను స్వీకరించలేదు" అని వాపోతాడు. దైవప్రవక్త అల్లాహ్‌తో "నా ప్రభూ! నా జాతి వారు ఖుర్‌ఆన్‌ను ఒక పరిహాసంగా చేసుకున్నారు" అని విన్నవిస్తారు. మేము ఖుర్‌ఆన్‌ను ఒక ప్రత్యేక క్రమంలో వేర్వేరు భాగాలుగా రూపొందించాము. వారు నీ ముందుకు ఏదైనా వినూత్న విషయాన్ని, వింత ప్రశ్నను తీసుకు వచ్చినప్పుడల్లా దానికి సరి అయిన జవాబును మేము సకాలంలో నీకు ఇచ్చాము. ఉత్తమమైన రీతిలో విషయాన్ని విస్పష్టం చేశాము.

రుకూ 4 : ఫిర్‌ఔన్ జాతి, నూహ్ జాతి, ఆద్, సమూద్ జాతుల ప్రజలు, అర్‌రస్ ప్రజలు ఇంకా ఆ మధ్య కాలంలో ఎన్నో తరాల వారికి మేము అనేక ఉదాహరణల ద్వారా ఎంతో నచ్చజెప్పాము. చివరకు వారు నాశనం చేయబడ్డారు. వారిలో ప్రతి ఒక్కరికి మేము పూర్వం నాశనమైన వారి దృష్టాంతాలను ఇచ్చి నచ్చజెప్పాము. చివరికి ప్రతి ఒక్కరిని నాశనం చేశాము. నీవు పిలిచి, పిలిచి ఎంతగా ఉపదేశిస్తున్నప్పటికీ ఈ ప్రజలు మరణానంతర జీవితాన్ని నిరాకరిస్తున్నారు. మార్గభ్రష్ఠత్వంలో చాలా దూరం ముందుకు పోయిన వీరికి తెలిసి వస్తుంది. మనోవాంఛనే దైవంగా చేసుకున్న వ్యక్తి పరిస్థితి ఎలా ఉంటుందో నీవు గమనించావా? అలాంటి వ్యక్తిని రుజుమార్గం పైకి తెచ్చే బాధ్యత నీవు స్వీకరించగలవా? వీరిలో చాలా మంది వింటారని, అర్థం చేసుకుంటారనీ నీవు అనుకుంటున్నావా? వారు పశువుల లాంటి వారు, కాదు, అంతకన్నా దిగజారిన వారు.

రుకూ 5 : మీ కోసం రాత్రిని దుప్పటిగానూ, నిద్రను మృత్యుశాంతిగానూ, పగలును బ్రతికి లేచే సమయం గానూ చేసినవాడు అల్లాహ్‌యే. ఆయన వర్షం ద్వారా మృత ప్రదేశానికి ప్రాణం పోస్తాడు. తన సృష్టిలోని జంతువులకు, మానవులకు దప్పిక తీర్చుతాడు. కాని అధిక సంఖ్యలో ప్రజలు అవిశ్వాసాన్ని, కృతఘ్నతను మాత్రమే అవలంబిస్తున్నారు. ప్రవక్తా! అవిశ్వాసుల మాటలు ఎంత మాత్రం నమ్మకు. ఈ ఖుర్‌ఆన్‌తో వారిపై గొప్ప పోరాటం చేయి. రెండు సముద్రాలను కలిపి ఉంచినవాడు అల్లాహ్‌యే. ఆ రెండింటి మధ్య ఒక అడ్డు తెర ఉంది. ఆ రెండూ కలిసిపోకుండా ఆపి ఉంచే

అవరోధం అది. నీ ప్రభువు సర్వశక్తి సంపన్నుడు. ఆయన కరుణామయుడు. ఆయన ఔన్నత్యం గురించి తెలిసిన వారిని అడుగు.

రుకూ 6 : కరుణామయునికి నిజమైన దాసులు ఎవరంటే, నేలపై అణకువతో నడిచేవారు, మూర్ఖులు తమను పలుకరిస్తే "మీకో సలామ్" అని చెప్పేవారు. ప్రభువు సన్నిధిలో సాష్టాంగపడి (సజ్దాలో), నిలబడి రాత్రులు గడిపేవారు. వారే నిజమైన దాసులు. నరకయాతన నుంచి రక్షించవలసినదిగా అల్లాహ్‌ను వేడుకుంటారు. దుబారాగానూ ఖర్చు పెట్టరు, లోభత్వాన్నీ చూపరు. ఈ రెండింటికీ మధ్య సమతూకాన్ని పాటిస్తారు. అల్లాహ్‌ను తప్ప యే ఇతర దేవుణ్ణీ వేడుకోరు. అల్లాహ్ నిషేధించిన యే ప్రాణాన్నీ అన్యాయంగా హతమార్చరు. వ్యభిచారానికి పాల్పడరు. వారు అబద్ధానికి సాక్షులుగా ఉండరు. వ్యర్థ విషయాల వైపుగా పోవడం జరిగితే సంస్కారుల మాదిరి దాటిపోతారు. వారికి ప్రభువు ఆయతులు వినిపించి హితబోధ చేసినప్పుడు వారు అంధులుగా, చెవిటి వారిగా ఉండిపోరు. అల్లాహ్‌ను ప్రార్థిస్తూ వేడుకుంటుంటారు. అలాంటి వారికి అక్కడ గౌరవమర్యాదలతో, శాంతి వచనాలతో స్వాగతం పలుకడం జరుగుతుంది.

26. అష్ షుఅరా

రుకూ 1 : ప్రవక్తా! వారు విశ్వసించరని బాధపడుతూ బహుశా నీవు నీ ప్రాణాలు కోల్పోతావేమో! కరుణామయుని తరఫు నుంచి వారి వద్దకు యే కొత్త ఉపదేశం వచ్చినా వారు దానిపట్ల వైముఖ్యం చూపుతారు. ఇప్పుడు వారు తిరస్కరిస్తున్నారు. త్వరలోనే వారికి వారు దేన్ని ఎగతాళి చేస్తున్నారో దాని యథార్థం (విభిన్న రూపాల్లో) వారికి తెలిసి వస్తుంది.

రుకూ 2 : మేము మూసాను "దుష్టులైన ఫిరౌను జాతి ప్రజల వద్దకు వెళ్ళు" అని ఆదేశించాము. మూసా విన్నపంపై హారూన్‌ను కూడా తోడు పంపాము. ఫిరౌన్ మూసాతో "నిన్ను చిన్నప్పుడు మా ఇంట పెంచలేదా? నీవు నీ వయస్సులో అనేక సంవత్సరాల కాలం మా వద్ద గడిపావు. సరే, తర్వాత చేసిందేదో చేశావు. నువ్వు చాలా కృతఘ్నుడివి" అన్నాడు. మూసా సమాధానమిస్తూ, "అపుడు నేను పొరపాటు వల్ల ఆ పని చేశాను. తర్వాత నా ప్రభువు నాకు వివేకాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించాడు. నన్ను ప్రవక్తల్లో చేర్చుకున్నాడు. పోతే, నీవు నాకు ఉపకారం చేశావని ఎత్తిపొడుస్తున్న

విషయానికి వస్తే యథార్థం ఏమిటంటే నువ్వు ఇస్రాయీలు సంతతిని బానిసలుగా చేసుకున్నావు" అని చెప్పారు. అప్పుడు ఫిరౌను "ఈ సకల లోకాల ప్రభువెవరూ?" అనడిగాడు. జవాబుగా మూసా , "ఆకాశాలకూ, భూమికి ప్రభువు, భూమ్యాకాశాల మధ్యన ఉన్న సమస్తానికి ప్రభువు ఆయనే నీకూ ప్రభువు, పూర్వం గతించిన మీ తాతముత్తాతలకు కూడా ప్రభువు" అని తెలిపారు. ఆపై ఫిరౌను "నువ్వు నన్ను కాదని ఇంకెవరినైనా ఆరాధ్యుడిగా చేసుకుంటే నిన్ను కూడా జైళ్ళలో మగ్గుతున్న వారిలో చేరుస్తాను" అన్నాడు. ఆ పిదప మూసా తన మహిమలు ప్రదర్శించారు.

రుకూ 3 : ఫిరౌను మంత్రగాళ్ళను పిలిచాడు. మంత్రగాళ్ళు ఫిరౌనుతో "మేము గెలిస్తే మాకు బహుమానం దొరుకుతుందా?" అని అడిగాడు. ఫిర్ఔను "మిమ్మల్ని నా సన్నిహితుల్లో చేర్చుకుంటాను" అన్నాడు. మంత్రగాళ్ళు తమ తాళ్ళు, కర్రలు విసరి 'ఫిరౌను ఔన్నత్యం సాక్షిగా మేమే గెలుస్తాం' అన్నారు. తర్వాత మూసా తన చేతి కర్ర విసరినప్పుడు అది తటాలున వారి బూటకపు మంత్రజాలాన్ని కబళించసాగింది. అది చూసి మాంత్రికులు అమాంతం సజ్దాలో పడిపోయారు. "విశ్వసించాము. మేము సకల లోకాల ప్రభువును, మూసా, హారూన్‌ల ప్రభువును విశ్వసించాం" అన్నారు. అప్పుడు ఫిరౌన్ కోపంగా "నేను అనుమతించక ముందే మీరు మూసా మాటలు విశ్వసిస్తారా! నేను మీ కాళ్ళూ, చేతులు వ్యతిరేక దిశల్లో నరికిస్తాను, మీ అందర్నీ శిలువ వేయిస్తాను" అన్నాడు. దానికి వారు "ఏమీ ఫర్వాలేదు. మేము మా ప్రభువు సాన్నిధ్యానికే చేరుకుంటాం" అని జవాబిచ్చారు.

రుకూ 4 : 'రాత్రికి రాత్రే నా దాసులను తీసుకొని వెళ్ళిపో. మిమ్మల్ని వెంటాడడం జరుగుతుంది' అని మేము మూసాకు వహీ పంపాము. తర్వాత ఫిరౌను పట్టణంలోకి వార్తాహరులను పంపి ప్రకటన ఒకటి చేయించాడు. "వారు గుప్పెడు మంది మాత్రమే మాకు చాలా కోపం తెప్పించారు. మనం సదా అప్రమత్తంగా ఉండే ప్రజలం" అని ప్రకటన చేయించాడు. ఈ విధంగా మేము వారిని వారి తోటల నుంచి, చెలమల నుంచీ, ఖజానాల నుంచీ, మహోన్నతమైన వారి నివాస స్థలాల నుంచి బయటకు వచ్చేలా చేశాము. తెల్లవారుతూ ఉండగా వారు మూసా జాతి ప్రజలను వెంటాడ సాగారు. ఇరుపక్షాలు ఒకరికొకరు ఎదురుపడినప్పుడు, మేము మూసాను "నీ చేతి కర్రతో సముద్రాన్ని కొట్టు" అని వహీ ద్వారా ఆజ్ఞాపించాము. అప్పుడు హఠాత్తుగా సముద్రం చీలిపోయింది. మూసాను అతనితో ఉన్న వారందరినీ మేము రక్షించాము. మిగతా అందరినీ ముంచి వేశాము.

రుకూ 5 : ఇబ్రాహీం తన తండ్రినీ, తన జాతి వారినీ "మీరు వేటిని పూజిస్తున్నారు?" అని ప్రశ్నించినపుడు వారు "ఇవి కొన్ని విగ్రహాలు మేము వీటిని పూజిస్తాము" అని జవాబిచ్చారు. అప్పుడు అతను వారితో "మీరు పిలిస్తే ఇవి మీ మొర ఆలకిస్తాయా? లేక మీకు ఏదైనా లాభం గాని నష్టం గాని కలిగిస్తాయా?" అని అడిగారు. దానికి వారు "లేదు, కాని మా తాతముత్తాతలు ఇలా చేస్తుండడం మేము చూశాము" అని జవాబిచ్చారు. అప్పుడు ఇబ్రాహీము వారితో "ఒకే ఒక్కడైన సకల లోకాల ప్రభువు నా ప్రభువు. ఆయన నన్ను సృష్టించాడు. ఆయనే నాకు మార్గం చూపుతున్నాడు. ఆయనే నాకు తినిపిస్తాడు, త్రాగిస్తాడు. నేను వ్యాధికి గురయితే స్వస్థత చేకూరుస్తాడు. ఆయనే నాకు మృత్యువును ఇస్తాడు. మళ్ళీ జీవితాన్ని అనుగ్రహిస్తాడు. తీర్పుదినం నాడు నా పాపాలను క్షమిస్తాడని ఆయన పైనే ఆశలు పెట్టుకున్నాను" అని చెప్పారు. ఆ తర్వాత ఇబ్రాహీం దేవుని ప్రార్థించారు.

రుకూ 6 : నూహ్ వారితో "అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి" అని బోధించినపుడు వారు "ఏమిటి, మేము, నిన్ను విశ్వసించాలా? అధములైన వారు నిన్ను అనుసరిస్తున్నారు" అని జవాబిచ్చారు. అప్పుడు నూహ్ "వారు చేసే పనులు ఎలాంటివో నాకేమి తెలుసు. వారి లెక్క చూడటం నా ప్రభువు పని. విశ్వసించిన వారిని గెంటివేయడం నా పని కాదు. నేను కేవలం స్పష్టంగా హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే" అని జవాబిచ్చి పిదప మమ్ముల్ని ప్రార్థించాడు. చివరకు మేము అతన్ని అతని సహచరులనూ ఒక నిండు పడవలో రక్షించాము. మిగతా వారినందరినీ ముంచి వేశాము.

రుకూ 7 : హూద్ వారితో "నేను విశ్వసనీయుడైన దైవప్రవక్తను. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. విధేయత చూపండి. ఏమిటి మీ వ్యవహారం? ఎత్తుగా ఉన్న ప్రతి స్థలం మీద ఏమీ ప్రయోజనం లేని స్మారక కట్టడం కట్టేస్తున్నారు. మీరిక్కడే శాశ్వతంగా ఉంటారన్నట్లు పెద్ద పెద్ద భవనాలు నిలబెడుతున్నారు. మీరు ఎవరినయినా పట్టుకుంటే, దౌర్జన్యపరులై పట్టుకుంటారు. మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి" అని బోధించినపుడు వారు "నీవు బోధించినా, బోధించకపోయినా మాకు ఒక్కటే. ఇదంతా పూర్వం నుంచి ఇలానే జరుగుతూనే వస్తోంది. శిక్ష యేదీ రావడం లేదు" అన్నారు. వారు అతన్ని తిరస్కరించారు. మేము వారిని నాశనం చేశాము.

రుకూ 8 : సమూద్ జాతి వద్దకు సాలెహ్‌ను పంపాము. సాలెహ్ వారితో "మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి. ఇక్కడున్న ఈ వస్తువుల మధ్య మీరు ప్రశాంతంగా ఇలానే ఉంటారని అనుకుంటున్నారా! ఈ తోటలలో ఈ జలాశయాల మధ్య, ఈ పొలాల్లో మాగిన పండ్ల గుత్తులు ఉన్న ఈ ఖర్జూరపు చెట్ల నడుమ ఇలానే మిమ్మల్ని ఉండనివ్వటం జరుగుతుందనుకుంటున్నారా! మీరు కొండలను తొలిచి విగ్రహీగుతూ వాటిలో భవనాలు నిర్మిస్తారు. అల్లాహ్‌కు భయపడండి. నాకు విదేయత చూపండి" అని బోధించినపుడు ఆ జాతి ప్రజలు అతన్ని నిదర్శనాలు చూపమన్నారు. అప్పుడు సాలిహ్, "ఇదిగో ఈ ఒంటెను చూడండి. ఒకరోజు అది నీళ్ళు తాగుతుంది. ఒకరోజు మీరు నీళ్ళు తోడుకోవాలి. ఈ ఒంటెకు యే మాత్రం హాని తలపెట్టవద్దు" అన్నారు. కాని వారు దాని వెనక కాలి పెద్ద నరాన్ని కోసేశారు. చివరకు వాపోతూ ఉండిపోయారు. శిక్ష వారిని పట్టుకుంది.

రుకూ 9 : లూత్ జాతి ప్రజలతో, "మీరు భయపడరా! నేను విశ్వసనీయుడనైన దైవప్రవక్తను. మీరు అల్లాహ్‌కు భయపడండి. నా పట్ల విధేయత చూపండి. మీరు పురుషుల వద్దకు పోతారేమిటి? మీ ప్రభువు మీ భార్యల వద్ద మీ కోసం సృష్టించిన దానిని విడిచిపెడుతున్నారేమిటి?" అని బోధించినపుడు వారు 'ఓ లూత్! నువ్వీ మాటలు మానకపోతే, నిన్ను కూడా నగరం నుంచి గెంటివేయబడిన వారిలో కలిపేస్తాం" అన్నారు. చివరకు మేము అతన్ని అతని కుటుంబ సభ్యులందరినీ కాపాడాము. వెనక ఉండిపోయిన అతని భార్యను తప్ప – మిగిలిన వారినందరినీ మేము నాశనం చేశాము. వారిపై ఒక వర్షాన్ని కురిపించాము. అతి భయంకరమైన వర్షాన్ని.

రుకూ 10 : అయ్‌కహ్ ప్రజల వద్దకు షుఐబ్‌ను పంపాము. షుఐబ్ వారితో, " అల్లాహ్‌కు భయపడండి, నా పట్ల విధేయత చూపండి. కొలపాత్రలను పూర్తిగా నింపండి. ఎవరికీ తక్కువ చేసి ఇవ్వకండి. సరియైన తరాజుతో తూయండి" అని బోధించినపుడు వారు, "మేము నిన్ను అసత్యవాదిగా భావిస్తున్నాం. నువ్వు సత్యవంతుడవే అయితే మా మీద ఆకాశపు ముక్క ఏదైనా పడేలా చేయి" అన్నారు. చివరకు వారిపై గొడుగుల రోజు శిక్ష పడింది. అతి భయంకరమైన శిక్ష అది.

రుకూ 11 : ఇది సకల లోకాల ప్రభువు అవతరింపజేసింది. స్వచ్ఛమైన అరబీ భాషలో అవతరించింది. అయినా తిరస్కారులు విశ్వసించడం లేదు. ఈ సుబోధకమైన

గ్రంథాన్ని తీసుకుని క్రిందికి వచ్చిన వారు షైతానులు కాదు. ఈ పని అవి చేయనూ లేవు. ఇది వాటికి తగిన పని కూడా కాదు. కనుక ప్రవక్తా! అల్లాహ్‌తోపాటు మరో దేవుణ్ణి ఎవ్వరినీ వేడుకోరాదు. నీ దగ్గరి బంధువులను హెచ్చరించు. విశ్వాసులలో నిన్ను అనుసరించే వారి పట్ల మృదువుగా వ్యవహరించు. మహాశక్తిమంతుడైన ఆ అనంతకరుణామయుడిపై భారం మోపు. ప్రజలారా! షైతానులు ఎవరిపై దిగుతాయో చెప్పనా! అవి వంచకుడైన ప్రతి దుర్మార్గునిపై దిగుతాయి. ఇక కవులు వారి వెంట నడిచేది మార్గభ్రష్టులు మాత్రమే. వారు ప్రతి లోయలో దారి తప్పడం తాము ఆచరించని దాన్ని చెప్పడం నువ్వు చూడడం లేదా?

27. అన్ నమ్ల్

రుకూ 1 : ఈ ఖురాను విశ్వాసులకు పూర్తి మార్గదర్శకత్వం, శుభవార్త. వారు నమాజు స్థాపిస్తారు. జకాత్ ఇస్తారు. పరలోకాన్ని పూర్తిగా నమ్ముతారు. పరలోకాన్ని విశ్వసించని వారికి వారి చేష్టలు ఆకర్షణీయమైనవిగా చేశాం మేము. అందువల్ల వారు దారితప్పి తిరుగుతూ ఉంటారు – మూసాకు దూరాన మంట కనబడినపుడు తన ఇంటి వారి కోసం కాస్త నిప్పు తీసుకురావాలని అక్కడకు వెళ్ళారు. ఆయన అక్కడికి చేరినపుడు ఒక ధ్వని వినిపించింది. "మూసా! నేను అల్లాహ్‌ను. సర్వశక్తి సంపన్నుడను. వివేకం నిండినవాడను. నువ్వు నీ చేతి కర్ర విసరి వెయ్యి" – ఆ చేతికర్ర పాము మాదిరిగా కదలాడడం చూడగానే మూసా భయపడి వెనుకకు చూడకుండా పారిపోయారు. "మూసా భయపడకు. నా సన్నిధిలో ప్రవక్తలు భయపడరు – కొంచెం నీ చేతిని చొక్కాలోకి దూర్చు. అది మెరసిపోతూ ఎలాంటి బాధ లేకుండా బయటకు వస్తుంది. ఇవి రెండు తీసుకుని ఫిరౌను వద్దకు అతడి జాతి ప్రజల వద్దకు వెళ్ళు" అని ఆదేశించాము. వారు అన్యాయంగా, అహంకారంగా మా సూచనలు తిరస్కరించారు.

రుకూ 2 : సులైమాన్‌కు పక్షుల భాష నేర్పాము. జిన్నాతులు, మానవులు, పక్షుల సైన్యాలు అతనికి ఇచ్చాము. ఒకసారి అతను సైన్యంతో చీమల లోయకు చేరుకొన్న ప్పుడు ఒక చీమ "చీమల్లారా! మీరు పుట్టల్లోకి దూరి పొండి. లేకపోతే సులైమాన్, అతని సైనికులు మిమ్మల్ని నలిపేస్తారు" అని మిగిలిన వారికి చెప్పింది. సులైమాన్ దాని మాటలు విని చిరునవ్వుతో "ప్రభూ! నన్ను అదుపులో ఉంచు" అన్నారు. మరొక సందర్భంలో సులైమాన్ పక్షులను పరిశీలిస్తూ ఉండగా హుద్ హుద్ పక్షి కానరాలేదు.

తర్వాత కొంతసేపటికి అది వచ్చి సులైమాన్‌తో "నేను సబాలో ఒక స్త్రీని చూశాను. ఆమె ఆ జాతిని ఏలుతోంది. ఆమె సింహాసనం మహోజ్వలంగా ఉంది. ఆమె, ఆమె జాతి ప్రజలు అల్లాహ్‌కు బదులు సూర్యుని ముందు సాష్టాంగ పడుతున్నారు" అని తెలిపింది. సులైమాన్ హుద్‌హుద్ ద్వారా ఆ రాణికి ఒక లేఖ పంపారు. ఆమె తన దర్బారులో ఆ లేఖ గురించి ప్రస్తావిస్తూ, "ఆస్థాన సభ్యులారా! ఒక లేఖ సులైమాన్ తరఫు నుంచి వచ్చింది. కరుణామయుడు, కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభించబడిన ఆ లేఖలో "నాకు వ్యతిరేకంగా తిరుగుబాటు వైఖరి అవలంబించకు. ముస్లిమ్ అయి నా వద్దకు వచ్చెయి" అని ఉంది.

రుకూ 3 : లేఖ వినిపించి ఆ రాణి "రాజులు ఏ దేశంలో అయినా చొరబడితే దానిని వారు నాశనం చేస్తారు. అక్కడి గౌరవనీయులను అవమానిస్తారు" అని చెప్పి, ఆ పిదప ఆమె సులైమాన్‌కు ఒక కానుక పంపింది. సులైమాన్ దూతతో "మీ కానుక మీరే అనుభవించండి. నిన్ను పంపిన వారి వద్దకు తిరిగి వెళ్ళిపో. మేము వారిపైకి వారు ఎదిరించలేని సైన్యాలను తీసుకువస్తాము" అన్నారు. ఒక జిన్ను కన్ను మూసి తెరిచేలోగా రాణి సింహాసనాన్ని సులైమాన్ ముందు పెట్టాడు. అది చూసి సులైమాన్ అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లిస్తూ స్తోత్రం చేశారు. రాణి వచ్చినపుడు ఆమెను "నీ సింహాసనం ఇలాంటిదేనా" అని అడగడం జరిగింది. దానికి ఆమె "ఇది పూర్తిగా అలాంటిదే. మేము ఇంతకు ముందే విషయం తెలుసుకొని విధేయులం అయి పోయాము (ముస్లిములమైపోయాము)" అని చెప్పింది. విశ్వసించకుండా ఆమెను ఆపిన విషయం అల్లాహ్‌ను వదలి ఆమె పూజిస్తూ ఉండిన దైవాల ఆరాధనే. ఆమె రాజగృహంలో ప్రవేశించి అది నీటి కొలనుగా భావించి అందులో దిగడానికి తన కాళ్ళ మీది వస్త్రాన్ని పైకి ఎత్తిపట్టుకొన్నది. అప్పుడు సులైమాన్ "ఇది గాజుతో చేయబడిన నున్నని నేల మాత్రమే" అని చెప్పారు. అప్పుడు ఆమె "నా ప్రభూ! ఈనాటి వరకూ నేను నా ఆత్మకు అన్యాయం చేసుకొంటూ ఉండేదాన్ని. ఇప్పుడు నేను సులైమాన్‌తో పాటు సకల లోకాల ప్రభువైన అల్లాహ్ పట్ల విధేయత స్వీకరిస్తున్నాను" అని ఎలుగెత్తి చాటింది.

రుకూ 4 : సమూద్ జాతి వైపునకు మేము వారి సోదరుడు సాలిహ్‌ను, 'అల్లాహ్‌ను ఆరాధించండి' అన్న సందేశం ఇచ్చి పంపాము. ఆ జాతి ప్రజలు అతనితో "మేము నిన్నూ, నీ సహచరులను అపశకునాలుగా భావిస్తున్నాం" అన్నారు. నగరంలో తొమ్మిది

మంది ముఠా నాయకులు ఉండేవారు. వారు సాలిహ్‌ను, అతని కుటుంబ సభ్యులను హతమార్చే కుట్ర చేశారు. వారొక పన్నాగం పన్నారు. ఒక పన్నాగం మేము కూడా పన్నాము. వారి పన్నాగానికి పర్యవసానంగా మేము వారిని, వారి జాతి మొత్తాని సర్వనాశనం చేసి వేశాము. విశ్వసించి, అవిధేయతకు దూరంగా ఉన్న వారిని మేము కాపాడాము. లూత్ తన జాతి ప్రజలతో "మీరు చూస్తూ చూస్తూ అశ్లీలానికి పాల్పడతారేంటి? కామం తీర్చుకోడానికి స్త్రీలను వదలి పురుషుల వద్దకు పోతారేమిటి? అని అడినప్పుడు వారు "లూత్ కుటుంబాన్ని పట్టణం నుంచి వెళ్ళగొట్టండి. వారు మహాపవిత్రులట!" అన్నారు. మేము వారిపై ఒక వర్షాన్ని కురిపించాం. అత్యంత ఘోరమైన వర్షం.

రుకూ 5 : ఆకాశాలనూ, భూమిని ఎవరు సృష్టించారు? మీ కోసం ఆకాశం నుంచి నీటిని కురిపించి, దానితో మనోహరమైన తోటలను ఎవరు పండించారు? వాటిలోని చెట్లను మొలిపించడం అన్నది మీ వల్ల సాధ్యమయ్యే పని కాదు. భూమిని నివాస స్థలంగా చేసింది ఎవరు? అందులో నదులను ప్రవహింపజేసినవాడు ఎవరు? దాని మీద పర్వతాల మేకులు పాతినది ఎవరు? రెండు రకాల జలధుల మధ్య అడ్డుతెర పెట్టింది ఎవరు? బాధితుడి మొరను ఆలకించి అతడి బాధను తొలగించేది ఎవరు? భూమిపై మిమ్మల్ని ప్రతినిధులుగా చేసింది ఎవరు? నేలపై, సముద్రంలో, చీకట్లలో మీకు దారి చూపేది ఎవరు? తన కారుణ్యానికి ముందు గాలులను శుభవార్తతో పంపేది ఎవరు? సృష్టిని మొదట చేసింది ఎవరు? దానిని పునఃసృష్టించేది ఎవరు? నింగి నుంచి నేల నుంచి మీకు ఉపాధి ఇస్తుంది ఎవరు? అల్లాహ్ కాక ఈ పనుల్లో పాలుపంచుకొనే మరో దేవుడు ఎవరైనా ఉన్నాడా? – పరలోకం గురించి జ్ఞానం వారికి లోపించింది. వారు ఆలోచించడం లేదు. వాళ్ళు చేస్తున్న బహుదైవారాధనకు అతీతుడు అల్లాహ్.

రుకూ 6 : మరణానంతరం తిరిగి లేపబడడాన్ని తిరస్కరిస్తున్న వారిని నేరస్తులకు ఎలాంటి గతి పట్టినదో కాస్త భూమిపై తిరిగి చూడమని చెప్పు. యధార్థం ఏమిటంటే నీ ప్రభువు ప్రజల పట్ల అపార అనుగ్రహం కలవాడు. కాని చాలా మంది కృతజ్ఞతలు తెలపరు. వారి హృదయాలలో దాగి ఉన్నది ఏమిటో, యేది బయటకు చెబుతున్నారో? అంతా నీ ప్రభువుకు నిసందేహంగా బాగా తెలుసు.

ఓ ప్రవక్తా! అల్లాహ్‌పై భారం వేయి. నిశ్చయంగా నువ్వు సత్యంపై ఉన్నావు. నువ్వు

మృతులకు వినిపించలేవు. నీవు త్రిప్పి పరుగెత్తే బధిరులకు కూడా వినిపించ లేవు. అంధులకు దారి చూపి వారు తప్పిపోకుండా కాపాడలేవు. మా వాక్యాలను విశ్వసించి, విధేయులయ్యే వారికి మాత్రమే నీవు నీ మాటను వినిపించగలవు.

రుకూ 7 : ఆ రోజు గురించి కాస్త ఆలోచించు. అప్పుడు మేము ప్రతి సముదాయం నుంచి మా వాక్యాలను తిరస్కరించిన వారి సమూహాన్ని ఒక చోట చేరుస్తాము. ఆ పై వారిని తరగతుల వారీగా, అంతస్తుల ప్రకారం ఒక క్రమపద్ధతిన ఉంచడం జరుగు తుంది. వారు చేసిన దుర్మార్గం వల్ల శిక్షకు సంబంధించిన వాగ్దానం వారి విషయంలో నెరవేరుతుంది. శంఖం ఊదబడే రోజున ఆకాశాలలోని, భూమిలోని సకల సృష్టిరాశు లు భయంతో కంపించిపోతాయి - ఆ భయానక పరిస్థితి నుంచి అల్లాహ్ కాపాడదలిచిన వారు తప్ప - మంచిని తీసుకువచ్చే మనిషికి అంతకన్నా మేలైన ప్రతిఫలం లభిస్తుంది. అటువంటి వారు ఆనాటి భయానక పరిస్థితి నుంచి సురక్షితంగా ఉంటారు. చెడును తీసుకువచ్చేవారు అందరూ అగ్నిలోకి బోర్లా విసరివేయబడతారు. మీరు చేసిన కర్మల ప్రకారమే మీకు ఫలితం లభిస్తుంది. అందుకు భిన్నంగా ప్రతిఫలం ఎలా పొందగలరు? ఓ ప్రవక్తా! వారికి చెప్పు, విధేయుడిగా ఉండాలనీ, ఈ ఖురాన్ చదివి వినిపించాలని, నీకు ఆజ్ఞాపించబడిందని చెప్పు. ఇక సన్మార్గాన్ని అవలంబించే వాడు తన మేలు కొరకే సన్మార్గం అవలంబిస్తాడు. మార్గభ్రష్టుడైన వాడితో "నేను కేవలం హెచ్చరించే వాడినే" అని చెప్పు.

28. అల్ ఖసస్

రుకూ 1 : ఫిరౌను భూమిపై తిరుగుబాటు వైఖరి అవలంబించాడు. ప్రజలను వర్గాలుగా విభజించాడు. ఒక వర్గాన్ని కించపరిచేవాడు. వారి మగ పిల్లలను హత మార్చేవాడు. బాలికలను మాత్రం బ్రతకనిచ్చేవాడు. మేము భూమిపై అణచివేయబడిన వారిని కనికరించాలని, వారిని నాయకులుగా చేయాలనీ, భూమిపై వారికి అధికారాన్ని ప్రసాదించాలని అనుకొన్నాము. అల్లాహ్ సూచన ప్రకారం మూసాను తల్లి ఒక పెట్టెలో పెట్టి నదిలో వదిలిపెట్టింది. ఆ బాలుడు ఫిరౌను భార్య వద్దకు చేరాడు. ఫిరౌను భార్య ఫిరౌనుతో "ఇతణ్ణి చంపకు, బహుశా ఇతడు మనకు ఉపయోగపడవచ్చు" అని చెప్పింది. మూసా తల్లి, మూసా సోదరిని పెట్టెను అనుసరిస్తూ వెళ్ళమని పంపింది.

మేము మొదట్లోనే పాలుపట్టే స్త్రీల స్తనాల నుంచి పిల్లవాడు పాలు తాగకుండా చేశాము. ఈ పరిస్థితి చూసి మూసా సోదరి వారితో "ఇతనిని పెంచి పోషించే బాధ్యత నిర్వహించగల ఇంటి వారి గురించి చెప్పనా" అనడిగింది. ఈ విధంగా మేము మూసాను అతని తల్లి వద్దకు తిరిగి చేర్చాము.

రుకూ 2 : మూసా తన నిండు యవ్వన దశకు చేరుకొన్నప్పుడు ఒకసారి అతను నగరంలో ప్రవేశించాడు. ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడుతూ ఉండడాన్ని చూశాడు. ఒకడు స్వయంగా అతని జాతికి చెందినవాడు. రెండవ వాడు శత్రు జాతికి చెందిన వాడు. అతని జాతి వ్యక్తి, శత్రు జాతి వ్యక్తికి వ్యతిరేకంగా సహాయపడమని పిలిచాడు. మూసా శత్రు జాతి వ్యక్తిని ఒక గ్రుద్దుతో కడతేర్చాడు. ఆ వెంటనే మూసా పశ్చాత్తాపంతో అల్లాహ్‌ను క్షమాభిక్ష అర్థించాడు. అల్లాహ్ అతన్ని క్షమించాడు. మరుసటి రోజు ఉదయం అతను నగరంలో పోతూ ఉండగా అంతకు ముందు రోజు సహాయానికై పిలిచిన వ్యక్తే ఈ రోజు మళ్ళీ పిలుస్తుండడాన్ని చూశాడు. శత్రుజాతి వ్యక్తిపై దాడి చేద్దామని మూసా అనుకుంటుండగా ఆ వ్యక్తి బిగ్గరగా "మూసా! నిన్న నువ్వు ఒక వ్యక్తిని చంపినట్లే ఈ రోజు నన్ను కూడా చంపుతావా! ఈ దేశంలో ఒక దౌర్జన్యపరుడిగా ఉండాలనుకొంటున్నావా" అన్నాడు. ఆ తర్వాత ఒక వ్యక్తి పరుగున వచ్చి మూసాతో "మూసా! నిన్ను హత్య చేయాలని సర్దారులు అనుకొంటున్నారు. ఇక్కడి నుంచి వెళ్ళిపో" అన్నాడు.

రుకూ 3 : ఈజిప్ట్ నుంచి బయలుదేరి మూసా మద్యన్ వైపు ప్రయాణమయ్యాడు. అతను మద్యన్ బావి వద్దకు చేరుకొన్నప్పుడు, అక్కడ చాలా మంది ప్రజలు తమ పశువులకు నీరు పడుతుండడం చూశాడు. ఒక ప్రక్క ఇద్దరు స్త్రీలు తమ పశువులను ఆపుతూ ఉండడాన్ని చూశాడు. మూసా ఆ స్త్రీలను ప్రశ్నించారు. ఆ స్త్రీలు "ఈ పశువుల కాపరులు తమ పశువులు తోలుకుపోనంత వరకు మేము మా పశువులకు నీరు పెట్టలేము" అన్నారు. ఇది విని మూసా వారి పశువులకు నీరు పట్టాడు. తరువాత నీడ ఉన్న ఓ స్థలం వద్ద కూర్చుని "స్వామీ, నీవు నాపై యే మేలు అవతరింపజేసినా నాకు అది అవసరమే" అని ప్రార్థించారు. ఇంతలో ఆ ఇద్దరు స్త్రీలలో ఒకామె సిగ్గు పడుతూ, బిడియపడుతూ, అతని వద్దకు వచ్చి "మా నాన్నగారు మిమ్మల్ని పిలుస్తున్నారు" అని చెప్పింది. మూసా ఆయన వద్దకు వెళ్ళి తన వృత్తాంతం పూర్తిగా వినిపించారు. ఆయన మూసాకు ధైర్యం చెప్పారు. ఆ పిదప మూసాతో "నువ్వు నా వద్ద

ఎనిమిది సంవత్సరాల కాలం నౌకరుగా ఉండేదయితే నా ఇద్దరు కుమార్తెలలో ఒకామెను నీకిచ్చి వివాహం చేస్తాను. ఒకవేళ పది సంవత్సరాలు పూర్తి చేయదలిస్తే నీ యిష్టం. నేను నిన్ను బలవంతం చేయను" అన్నాడు. జవాబుగా మూసా "ఈ విషయంపై మీకూ నాకు మధ్య ఒప్పందం అయిపోయినట్లే" అన్నారు.

రుకూ 4 : గడువు పూర్తి చేసిన మూసా తన కుటుంబంతో పాటు ప్రయాణమయ్యారు. ఆయనకు తూర్ పర్వతం దిక్కున ఒక మంట కనబడింది. ఆయన తన ఇంటి వారితో "ఆగండి. నేనో మంట చూశాను. నేను అక్కడి నుంచి ఏదైనా సమాచారం తీసుకొని వస్తాను. లేదా ఆ మాట నుంచి నిప్పు రవ్వ అయినా పట్టుకు వస్తాను. మీరు చలి కాచుకోవచ్చు" అని వెళ్ళారు. ఆయన అక్కడకు చేరినప్పుడు ఒక పిలుపు వినబడింది. "మూసా! నేను అల్లాహ్‌ను, సకల లోకాలకు ప్రభువును" అని వినబడింది. ఆ తర్వాత మూసాకు చేతికర్ర, మెరుస్తున్న చెయ్యి వంటి మహిమలు ప్రసాదించబడ్డాయి. అవి తీసుకొని ఫిరౌను వద్దకు అతని జాతి సర్దారుల వద్దకు వెళ్ళమని ఆజ్ఞ అయ్యింది. మూసా కోరికపై హారూన్‌ను కూడా తోడు ఇవ్వడం జరిగింది. మూసా ఆ ప్రజల వద్దకు వెళ్ళి అల్లాహ్ వైపునకు వారిని పిలిచారు. అప్పుడు ఫిరౌను "ఆస్థాన సభ్యులారా! నేనుకాక మీకు మరొక దేవుడు ఉన్నాడని నాకు తెలియదు. హామాన్! ఇటుకలు కాల్చి ఒక ఎత్తయిన కట్టడం నిర్మించు దానిపైకి ఎక్కి బహుశా నేను మూసా దేవుణ్ణి చేస్తానేమో" అన్నాడు. ఈ విధంగా అహంభావాన్ని చూపాడు. చివరికు మేము అతన్ని, అతని సైన్యాన్ని పట్టుకొని సముద్రంలో విసరివేశాము.

రుకూ 5 : ప్రవక్తా! మేము మూసాకు ఈ షరీయత్తు ఆదేశాన్ని ఇచ్చినపుడు, మేము మూసాను ప్రప్రథమంగా పిలిచినప్పుడు నీవు అక్కడ లేవు. మూసా మద్యన్ ప్రజల మధ్య ఉన్నప్పుడు కూడా నీవు అక్కడ లేవు. ఈ సమాచారం ప్రభువు కారుణ్యం వల్ల నీకు అందుతోంది. నీవు పోయి వారిని హెచ్చరించు. బహుశా వారు స్పృహలోకి వస్తారేమో! ఖురాను, తౌరాతు రెండూ మాయాజాలాలే. మేము దేన్నీ విశ్వసించం అన్నారు వారు. ప్రవక్తా! వారికి చెప్పు. వారు నిజాయితీపరులే అయితే, అల్లాహ్ దగ్గరి నుంచి ఈ రెండింటి కంటే మెరుగైన మార్గదర్శకత్వాన్నిచ్చే గ్రంథాన్ని తీసుకురమ్మను. అలాంటి గ్రంథాన్ని అనుసరిస్తానని చెప్పు.

రుకూ 6 : పూర్వం మేము గ్రంథాన్ని ప్రసాదించిన ప్రజలు దీన్ని (ఖురాను) విశ్వ సిస్తారు. "మేము దీన్ని విశ్వసించాము. ఇది నిజంగానే మా ప్రభువు తరఫు నుంచి

వచ్చిన సత్యం. మేము మొదటి నుంచి విధేయులమే (ముస్లిములమే)" అని అంటారు. తమ స్థయిర్యానికి ప్రతిఫలం రెండు సార్లు పొందేది వీరే. వీరు చెడును మంచితో నివారిస్తారు. మేము వారికి ఇచ్చిన జీవనోపాధి నుంచి అల్లాహ్ మార్గంలో ఖర్చుపెడ తారు. కాని ఇతర ప్రజలు విశ్వసించడంలేదు. మేము శాంతికి నిలయమైన ఒక పవిత్ర స్థలాన్ని వారి స్థిరనివాసంగా చేశాము. మా తరఫు నుంచి జీవనోపాధిగా అన్నిరకాల పండ్లు ఫలాలు ఆ స్థలానికి వస్తున్నాయి. జనావాసాలలోకి మా ఆయతులను వినిపించే ప్రవక్తలను పంపనంత వరకు నీ ప్రభువు వాటిని నాశనం చేయడు. మీకు ఇవ్వబడింది కేవలం ప్రాపంచిక జీవన సామగ్రి అలంకరణలు మాత్రమే. అల్లాహ్ వద్ద ఉన్నది దీనికంటే ఉత్తమమైనది, నిత్యమైనది.

రుకూ 7 : మేము చేసిన మంచి వాగ్దానాన్ని తప్పక పొందే వ్యక్తీ, మేము ఇహలోక జీవన సామగ్రి ఇచ్చిన తర్వాత ప్రళయం నాడు శిక్షకై హాజరయ్యే వక్తి – ఈ ఇద్దరూ ఒకటే అవుతారా? – "మీరు నిలబెట్టిన భాగస్వాములను ఇప్పుడు పిలవండి" అని వారికి చెప్పినప్పుడు, వారు పిలుస్తారు. కాని వారికి ఏ సమాధానమూ లభించదు. అప్పుడు అల్లాహ్ వారిని పిలిచి, "ప్రవక్తలకు మీరు ఏమని సమాధానమిచ్చారు?" అని ప్రశ్నించినపుడు వారికి యే సమాధానమూ తోచదు. ఒకవేళ అల్లాహ్ ప్రళయం వరకు మీపై శాశ్వతంగా రాత్రిని ఆవహింపజేస్తే అల్లాహ్ తప్ప మీకు వెలుగును ఇచ్చే దేవుడెవరు? మీరు వినరా? ఒకవేళ అల్లాహ్ ప్రళయం వరకు మీపై పగలును శాశ్వతంగా ఉండేలా చేస్తే, మీరు విశ్రాంతి పొందడానికి రాత్రిని తెచ్చి ఇచ్చే దేవుడు అల్లాహ్ తప్ప మరెవ్వరు? మీకేమీ కనబడడం లేదా?

రుకూ 8 : ఖారూన్, మూసా జాతికి చెందిన వ్యక్తి. మేము అతనికి ఎన్నో నిధులు ఇచ్చాము. ఆ నిధుల తాళం చెవులను బలాఢ్యులైన మనుష్యుల సమూహం అతి కష్టంగా ఎత్తగలిగేది. అతడు తలబిరుసు వైఖరి అవలంబించాడు. అతని జాతి ప్రజలు "విర్రవీగకు, విర్రవీగే వారిని అల్లాహ్ ప్రేమించడు. అల్లాహ్ నీకు ఇచ్చిన సంపదతో పరలోకంలో ఇల్లు కట్టుకొనే ఆలోచన చేయి. అల్లాహ్ నీకు ఉపకారం చేసిన విధంగానే నువ్వు ఉపకారం చేయి. భూమిపై కల్లోలం సృష్టించే ప్రయత్నం చేయకు" అని హెచ్చరించాడు. అప్పుడతడు "నాకు లభించిన జ్ఞానం వల్లనే ఇదంతా వచ్చింది" అన్నాడు. ఒకరోజు అతను పూర్తి ఆడంబరాలతో తన జాతి ప్రజల ముందుకు వచ్చాడు. ఐహిక జీవితం పట్ల వ్యామోహం కలవారు అతణ్ణి చూసి "ఖారూన్‌కు

ఇవ్వబడినది. మాకూ లభిస్తే ఎంత బాగుండేది. అతను చాలా అదృష్టవంతుడు అనుకు న్నారు. కాని జ్ఞాన సంపన్నులు మాత్రం "అయ్యో! దౌర్భాగ్యులారా! అల్లాహ్ ఇచ్చే ప్రతిఫలమే విశ్వసించి మంచి పనులు చేసే వారికి శ్రేష్టమైనది" అన్నారు. చివరకు మేము అతన్ని అతని గృహాన్ని భూమిలోనికి అణగద్రొక్కాము. ఇక అల్లాహ్‌కు వ్యతిరేకంగా అతని సహాయానికి వచ్చే అతని మద్దతుదారులు ఎవరూ లేకపోయారు. స్వయంగా అతడు కూడా తనకు తాను సహాయం చేసుకోలేకపోయాడు. విన్న అతడి అంతస్తు కోసం ఉవ్విళ్ళూరిన వారు ఇప్పుడు, "అయ్యో! మా దౌర్భాగ్యం! మేము మరిచేపోయాం. అల్లాహ్ తన ఇష్టప్రకారం తన దాసుల్లో కొందరి జీవనోపాధి అధికం చేస్తాడు. మరికొందరికి ఆచితూచి ఇస్తాడు. అల్లాహ్ మాపై దయచూపి ఉండకపోతే మమ్మల్ని కూడా భూమిలోకి అణగద్రొక్కి ఉండేవాడు" అని అంటారు.

రుకూ 9 : భూమిపై పెద్దరికాన్ని కోరుకోని వారికి, కల్లోలాన్ని సృష్టించదలచని వారికి పరలోక గృహాన్ని మేము ప్రత్యేకించి ఉంచుతాము. భయభక్తులు కల వారికే మేలైనా పరిణామం ఉంది. మంచి తెచ్చే వాడికి దానికంటే మేలైన మంచి లభిస్తుంది. ఇక చెడును తెచ్చే వారి విషయం చెడు పనులు చేసిన వారికి దాని ప్రకారమే ప్రతిఫలం లభిస్తుంది. ప్రవక్తా! ఖురాను కేవలం నీ ప్రభువు కారుణ్యం వల్లనే నీపై అవతరించింది. కనుక నీవు నీ ప్రభువు వైపునకు వారిని ఆహ్వానించు బహుదైవారాధకుల్లో ఎంతమాత్రం చేరకు. ఒక్క ఆయన ఉనికి తప్ప ప్రతిదీ నశించేదే.

29. అల్ అన్‌కబూత్

రుకూ 1 : "మేము విశ్వసించాం" అని అన్నంత మాత్రాన వదలివేయడం జరుగు తుందని, పరీక్షించడం జరుగదనీ ప్రజలు భావిస్తున్నారా? సత్యవాదులెవరో? అసత్యవాదులెవరో అల్లాహ్ చూడవలసి ఉంది. యే వ్యక్తి అయినా అల్లాహ్ మార్గంలో తీవ్రంగా పరిశ్రమిస్తే అతడు తన మేలు కొరకే అలా చేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్‌కు సకల లోకాలలోని వారి అవసరం ఎంతమాత్రం లేదు. తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించాలని, మేము మానవునికి బోధించాము. కాని ఒకవేళ నీవు ఎరుగని ఆరాధ్యుణ్ణి నాకు భాగస్వామిగా చేయమని వారు బలవంతపెడితే, అప్పుడు వారి పట్ల విధేయత చూపకు. విశ్వసించిన తర్వాత అల్లాహ్ మార్గంలో హింసించబడినప్పుడు

లోకులు పెట్టిన ఈ పరీక్షను అల్లాహ్ విధించిన శిక్షగా ఎవడైనా భావిస్తే అతడు కపట విశ్వాసి మాత్రమే. విశ్వాసులెవరో? కపటులెవరో అల్లాహ్ తప్పనిసరిగా చూడవలసి వుంది.

రుకూ 2 : నూహ్ 950 సంవత్సరాల వరకు తన జాతి వారిని అల్లాహ్ వైపునకు పిలుస్తూ ఉన్నాడు. చివరకు తుఫాను వచ్చి వారు దుర్మార్గులుగా ఉన్న స్థితిలో వారిని చుట్టుముట్టింది. తరువాత నూహ్‌ను, నావలోని వారిని మేము రక్షించాము. దానిని ప్రపంచ వాసులకు ఒక గుణపాఠం వంటి సూచనగా చేశాము. ఇబ్రాహీమ్ తన జాతి వారితో, "అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు భయపడండి. అల్లాహ్‌ను వదలి మీరు పూజిస్తున్న విగ్రహాలు ఎలాంటి అధికారం కలిగి లేవు. అల్లాహ్‌కే దాస్యం చేయండి. ఆయనకు కృతజ్ఞతలు తెలుపండి" అని బోధించారు. అల్లాహ్ సృష్టిని ప్రారంభించాడు. తిరిగి దాని పునః సృష్టి చేస్తాడు. ఈ పని అల్లాహ్‌కు ఎంతో సులభం. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు. ఆయన తనకు ఇష్టమైన వారిని శిక్షిస్తాడు. తనకు ఇష్టమైన వారిని కరుణిస్తాడు. మీరు ఆయనను భూమిలోనూ లొంగదీయలేరు. ఆకాశంలోనూ లొంగదీయలేరు.

రుకూ 3 : ఇబ్రాహీమ్ జాతి ప్రజలు "ఇతడ్ని చంపండి. లేదా కాల్చివేయండి" అన్నారు. చివరకు అల్లాహ్ ఆయన్ను అగ్ని జ్వాలల నుంచి రక్షించాడు. ఇబ్రాహీం తన జాతి వారితో "మీరు ప్రపంచ జీవితంలో అల్లాహ్‌ను కాదని విగ్రహాలను మీ మధ్య ప్రేమకు సాధనంగా చేసుకొన్నారు. కాని ప్రళయం నాడు మీరు ఒకరికొకరు తిరస్కరించు కొంటారు" అన్నారు. లూత్, ఇబ్రాహీంను విశ్వసించారు. ఇబ్రాహీమ్‌కు ఇస్‌హాఖ్, యాకూబ్ వంటి సంతానాన్ని ప్రసాదించాము. అతని వంశంలో ప్రవక్త పదవినీ, గ్రంథాన్నీ ఉంచాము. అల్లాహ్ లూత్‌ను అశ్లీల చేష్టలు చేసే జాతి వద్దకు వారిని హెచ్చరించమని పంపాడు. కాని ఆ ప్రజలు శిక్షనే కోరారు.

రుకూ 4 : మా దూతలు ఇబ్రాహీమ్‌కు శుభవార్త వినిపించి, తరువాత లూత్ వద్దకు వెళ్ళారు. వారు లూత్‌తో "భయపడకు, బాధపడకు. మేము నిన్ను నీ యింటి వారిని రక్షిస్తాము. ఒక్క నీ భార్యను తప్ప. మేము పట్టణ వాసులపై ఆకాశం నుంచి శిక్షను అవతరింపజేయబోతున్నాము" అని చెప్పారు. మేము మద్యన్ వైపునకు షుఐబ్‌ను పంపాము. తిరస్కరించిన ఆ జాతిని నాశనం చేశాము. ఆద్, సమూద్, జాతులను

మేము నాశనం చేశాము. ఖారూన్, ఫిరౌన్, హామాన్‌లను నాశనం చేశాము. ప్రతివాణ్ణి మేము అతని పాపానికి గాను పట్టుకొన్నాము. వారిలోని కొందరి పైకి మేము రాళ్ళు విసిరే పెనుగాలి పంపాము. మరి కొందరిని ఒక భయంకర ప్రేలుడు కబళించింది. ఇంకొందరిని మేము భూమిలో కూరుకుపోయేలా చేశాము. మరి కొందరిని ముంచి వేశాము. అల్లాహ్ వారికి అన్యాయం చేయలేదు. వారు తమకు తామే అన్యాయం చేసుకొన్నారు. అల్లాహ్‌ను కాదని ఇతరులను సంరక్షకులుగా చేసుకొన్న వారు సాలెపురుగుల్లాంటి వారు. అది తన కోసం ఒక ఇల్లు కట్టుకుంటుంది. అన్ని ఇళ్ళ కంటే అతి బలహీనమైన ఇల్లు సాలెపురుగు ఇల్లు. అయ్యో! వారికి ఈ విషయం తెలిస్తే ఎంత బాగుండు.

రుకూ 5 : ప్రవక్తా! వహీ ద్వారా నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని పారాయణం చెయ్యి. నమాజు స్థాపించు. నిశ్చయంగా నమాజు అశ్లీలపు చేష్టల నుంచి, చెడు పనుల నుంచి నిరోధిస్తుంది. అల్లాహ్ సంస్మరణ ఇంతకన్నా గొప్పది. గ్రంథ ప్రజలకు చెప్పు "మేము మా వద్దకు పంపబడిన దానినీ విశ్వసించాము, మీ వద్దకు పంపబడిన దానినీ విశ్వసించాము. మీ దేవుడు, మా దేవుడు ఒక్కడే. మేము ఆయనకే విధేయులం" అని చెప్పు. ప్రవక్తా! నీవు ఇంతకు పూర్వం ఏ గ్రంథాన్ని చదివేవాడవు కావు. నీ చేతితో వ్రాసేవాడవూ కావు. ఒకవేళ అలా గనక జరిగి ఉన్నట్లయితే, అసత్యవాదులు అనుమానానికి లోనయి ఉండేవారు. అసలు ఇవి జ్ఞానం కలవారికి స్పష్టమైన సూచనలు. మా ఆయతులను దుర్మార్గపు ప్రజలు తప్ప మరెవ్వరూ తిరస్కరించరు. మేము నీ పై అవతరింపజేసిన గ్రంథం వారి ముందు చదివి వినిపించబడుతోంది. ఈ నిదర్శనం చాలదా వారికి!

రుకూ 6 : అసత్యాన్ని విశ్వసించి, అల్లాహ్‌ను తిరస్కరించేవారే అసలు నష్టానికి గురి అయ్యేది. ఆ రోజున శిక్ష వారిని పైనుంచి క్రమ్ముకుంటుంది. పాదాల క్రింది నుంచి కూడా క్రమ్ముకుంటుంది. "ఇక రుచి చూడండి. మీరు చేసిన పనులకు" అంటుంది. విశ్వసించి మంచి పనులు చేసే వారిని మేము స్వర్గంలోని ఎత్తయిన భవనాలలో ఉంచుతాము. వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడనే వారు శాశ్వతంగా ఉంటారు. వారు సహనం చూపారు. అల్లాహ్‌నే నమ్ముకొన్నారు. ఆహారాన్ని మోసుకొంటూ తిరగని జంతువులు అనేకం ఉన్నాయి. అల్లాహ్ వాటికి ఉపాధిని సమకూరుస్తాడు. మీ ఉపాధి ప్రదాత కూడా ఆయనే. తన దాసులలో తనకు ఇష్టమైన

వారి ఉపాధిని విస్తరింపజేసేవాడు, తాను తలచిన వారి ఉపాధిని పరిమిత పరిచేవాడు అల్లాహ్ మాత్రమే.

రుకూ 7 : ఈ ప్రాపంచిక జీవితం ఒక క్రీడ, ఒక వినోదం తప్ప మరేమీ కాదు. అసలు జీవన గృహం పరలోక గృహమే. వారు పడవలోకి ఎక్కినపుడు తమ ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించుకొని ఆయన్ను వేడుకొంటారు. తరువాత ఆయన వారిని రక్షించి నేలపైకి తీసుకురాగానే అల్లాహ్ కలుగజేసిన విముక్తికి కృతఘ్నుత చూపడానికి, ప్రాపంచిక భోగాలు అనుభవించడానికి, అకస్మాత్తుగా బహుదైవారాధన చేయటం ప్రారంభిస్తారు. అల్లాహ్‌కు అబద్ధాన్ని ఆపాదించేవాడు, సత్యం తన ముందుకు వచ్చిన తర్వాత కూడా దానిని తిరస్కరించే వాడి కన్నా దుర్మార్గుడెవడు? మా కోసం తీవ్ర ప్రయత్నం చేసే వారికి మేము మా మార్గాలు చూపుతాము. నిశ్చయంగా అల్లాహ్ సజ్జనులతోపాటు ఉంటాడు.

౩౦. అర్‌రూమ్

రుకూ 1 : ఈ రుకూ ప్రారంభంలో రెండు భవిష్యవాణులు వినిపించడం జరిగింది.
1) పొరుగు భూభాగంలో పరాజితులైన రోమన్ ప్రజలు ఈ పరాజయం తర్వాత కొన్ని సంవత్సరాలలోనే మళ్ళీ విజేతలవుతారు.

2) నేడు బలహీనులుగా ఉన్న ముస్లిములు త్వరలోనే విజయులవుతారు. ఆ రోజున అల్లాహ్ ప్రసాదించిన విజయానికి విశ్వాసులు వేడుకలు జరుపుకొంటారు. ఈ వాగ్దానం అల్లాహ్ చేసిన వాగ్దానం. అల్లాహ్ ఎన్నడూ తన వాగ్దానాన్ని భంగపరచడు. ప్రజలకు ప్రాపంచిక జీవితపు బాహ్య స్వరూపం మాత్రమే తెలుసు. పరలోకం గురించి ఉపేక్ష చూపుతున్నారు. చాలామంది ప్రభువుతో సమావేశం కావలసి ఉందన్న విషయాన్ని తిరస్కరిస్తున్నారు. వీరి పూర్వీకులు వీరికన్నా ఎక్కువ బలవంతులు. వారు భూమిని బాగా తవ్వారు. వీరికంటే ఎక్కువ దాన్ని నివాస ప్రాంతంగా చేశారు. చివరకు చెడు పనులు చేసిన వారి ముగింపు చాలా చెడ్డగా జరిగింది.

రుకూ 2 : ఆ ఘడియ నెలకొన్న నాడు అపరాధులు దిగ్భ్రమకు లోనవుతారు. వారు అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టిన వారెవరూ సిఫారసు చేయరు. మానవులందరూ విభిన్న వర్గాలుగా చీలిపోతారు. విశ్వసించి మంచి పనులు చేసినవారు ఉద్యానవనంలో సుఖంగా, సంతోషంగా ఉంచబడతారు. కనుక నీవు సాయంత్రం కాగానే, ఉదయం

కాగానే అల్లాహ్ పరిశుద్ధతను కొనియాడు. ఆకాశాలలోనూ, భూమిలోనూ స్తుతింపదగ్గ వాడు ఆయన ఒక్కడే. మధ్యాహ్నం అయినప్పుడు, సూర్యాస్తమయం అయినప్పుడు ఆయన్ను స్తుతించు. ఆయన జీవిని, నిర్జీవి నుంచి వెలికి తీస్తాడు. నిర్జీవిని జీవి నుంచి వెలికితీస్తాడు. భూమి మృతి చెందిన తర్వాత దానికి ప్రాణం పోస్తాడు.

రుకూ 3 : అల్లాహ్ మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. మీరు మానవులయ్యారు. భూమిపై వ్యాపిస్తూ ఉన్నారు. ఆయన మీ కొరకు భార్యలను మీ జాతి నుంచే సృష్టించాడు. మీరు వారి వద్ద శాంతిని పొందడానికి, మీ మధ్య ప్రేమ, కారుణ్యాలను సృజించాడు. భూమ్యాకాశాల సృష్టి, మీ భాషలు, మీ రంగులలోని వైవిధ్యమూ, రాత్రీ పగలు, మీరు నిద్రపోవడం, ఆయన అనుగ్రహాన్ని అన్వేషించడం, మెరుపుల జిగేలు, ఆకాశం నుంచి నీరు కురవడం, భూమిని మరణానంతరం మళ్ళీ ప్రాణం రావడం– నిశ్చయంగా వీటిలో తెలివిని ఉపయోగించుకొనే వారికి ఎన్నో సూచనలు ఉన్నాయి. ఆయన సూచనలలో ఇంకొకటి ఏమిటంటే ఆకాశం, భూమి ఆయన ఆజ్ఞ వల్లనే సుస్థిరంగా ఉన్నాయి. తర్వాత ఆయన మిమ్మల్ని భూమి నుంచి రమ్మని పిలిచినంతనే మీరు తక్షణం బయటకు వచ్చేస్తారు.

రుకూ 4 : మీ అధీనంలో ఉన్న బానిసలలో ఎవరయినా సిరిసంపదలలో మీకు సమానంగా ఉన్నారా? మీరు మీ సరిసమానులతో భయపడేటటువంటి వారు బానిసల్లో ఎవరయినా ఉన్నారా? – ప్రవక్తా! ఏకాగ్రచిత్తంతో మీ ముఖాన్ని ఈ ధర్మం దిశగా స్థిరంగా ఉంచండి. అల్లాహ్ మనిషిని ఏ స్వభావంతో సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి. ఇదే సవ్యమైన, తిన్నని ధర్మమార్గం. అల్లాహ్ వైపునకు మరలుతూ ఆయనకు భయపడండి. నమాజు స్థాపించండి. మనిషి పరిస్థితి ఎలాంటిదంటే ఏదైనా కష్టం కలిగినప్పుడు, తమ ప్రభువు వైపునకు మరలి ఆయనకు మొరపెట్టుకొంటారు. ఆయన తన కారుణ్యపు మాధుర్యాన్ని కొంచెం వారికి రుచి చూపిస్తే అప్పుడు కొందరు వెంటనే షిర్క్ (బహు దైవారాధన) చేయడం ప్రారంభిస్తారు. త్వరలోనే మీకు తెలిసిపోతుంది– విశ్వాసి బంధువులకు వారి హక్కులు ఇవ్వాలి. పేదలకు, బాటసారులకు వారి హక్కులు చెల్లించాలి. అల్లాహ్ ప్రసన్నత లభిస్తుంది. ప్రజల సంపదలో చేరి పెరగాలని మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో పెరగదు. అల్లాహ్ ప్రసన్నతను పొందే సంకల్పంతో జకాతు ఇచ్చేవారే వాస్తవానికి తమ సంపదను వృద్ధి చేసుకుంటారు.

రుకూ 5 : మనిషి చేజేతులా సంపాదించుకున్నదాని ఫలితంగానే వారి చేష్టలను వారికే రుచి చూపడానికి నేలపైన, నీటిలోన కల్లోలం రేగింది. కనుక ప్రవక్తా! ఈ సత్యధర్మం వైపునకు నీ ముఖాన్ని స్థిరంగా నిలుపు– ఆ రోజు తొలగిపోయే అవకాశం అల్లాహ్ తరఫు నుంచి ఏమాత్రమూలేని ఆ రోజు రాకముందే. శుభవార్త తెలుపడానికి, మీకు తన కారుణ్యాన్ని రుచి చూపడానికి పడవలు ఆయన ఆజ్ఞతో ప్రయాణించడానికి, మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించడానికి ఆయన వాయువులను పంపుతాడు. ఇది ఆయన సూచనల లోనిది. అల్లాహ్‌యే గాలులను పంపేవాడు. అవి మేఘాలను లేపుతాయి. తరువాత ఆయన ఆ మేఘాలను తన ఇష్టప్రకారం ఆకాశంలో వ్యాపింపజేస్తాడు. వాటిని ఖండికలుగా విభజిస్తాడు. తరువాత మేఘాల నుంచి వర్షపు బిందువులు కురియడాన్ని మీరు చూస్తారు. అల్లాహ్ కారుణ్యం ప్రభావాన్ని చూడండి. నిర్జీవంగా ఉన్న భూమిని ఆయన బ్రతికించి లేపుతాడు. నిశ్చయంగా ఆయన మృతులకు ప్రాణం పోసేవాడు.

రుకూ 6 : బలహీనావస్థ నుంచి మీ పుట్టుకను ప్రారంభించిన వాడు, మళ్ళీ ఆ బలహీనత తర్వాత మీకు బలాన్ని ప్రసాదించిన వాడు, ఆ బలం తర్వాత మళ్ళీ మిమ్మల్ని బలహీనులుగా ముసలివారిగా చేసినవాడు అల్లాహ్‌యే. ఆయన తనకు ఇష్టమైన దానిని సృష్టిస్తాడు. ఆ ఘడియ సంభవించినప్పుడు దుర్మార్గులకు వారి సాకులు ఏ ప్రయోజనాన్నీ కలిగించలేవు. వారిని క్షమాభిక్ష కోరండి అని అడగడమూ జరగదు. మేము ఈ ఖుర్‌ఆన్‌లో మానవులకు రకరకాలుగా బోధించాము. నీవు ఏ సూచన తెచ్చినా, అవిశ్వాసులు మాత్రం నువ్వు అసత్యాన్ని ఆశ్రయించావనే అంటారు. ప్రవక్తా! సహనంతో ఉంటు. నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. అవిశ్వాసులు నిన్ను తేలికగా తీసుకోరాదు.

31. లుఖ్మాన్

రుకూ 1 : ఖుర్‌ఆన్ సజ్జనులకు మార్గం చూపే గ్రంథం. వారికి కారుణ్యం, వారు నమాజు స్థాపిస్తారు. జకాత్ ఇస్తారు. పరలోకం పట్ల దృఢ విశ్వాసం కలిగి వుంటారు. ప్రజలను అల్లాహ్ మార్గం నుంచి తప్పించడానికీ, అల్లాహ్ మార్గం వైపునకు పిలిచే పిలుపును ఎగతాళి చేయడానికి, తనకు ఎలాంటి జ్ఞానం లేకపోయినా ప్రజల మనసులను ఆకట్టుకొనే మాటలు కొనుక్కొచ్చేవారు ఉంటారు. అటువంటి వారికి

అవమానకరమైన తీవ్ర శిక్ష ఉంది. మా వాక్యాలు అలాంటి వారికి వినిపించినప్పుడు అసలు వాటిని విననే లేదన్నట్లుగా, చెవిటి వాని వలే, అహంకారంతో ముఖాన్ని తిప్పుకొంటారు. అలాంటి వారికి అతి బాధాకరమైన శిక్ష ఉందన్న వార్త వినిపించండి.

నీవు చూడగలిగే స్తంభాలు లేకుండానే ఆయన ఆకాశాన్ని సృష్టించాడు. ఆయన భూమిపై అది మీతోపాటు దొర్లిపోకుండా ఉండాలని పర్వతాలను అమర్చాడు. ఆయన అన్నివిధాల జంతువులను భూమిపై వ్యాపింపజేశాడు. ఆకాశం నుంచి నీళ్ళను కురిపించాడు. భూమిపై రకరకాల శ్రేష్టమైన పదార్థాలను పండించాడు. ఇది అల్లాహ్ సృష్టి. ఇతరులు సృష్టించిందేమిటో ఇప్పుడు చూపండి.

రుకూ 2 : కృతజ్ఞతలు తెలుపడం, అలా తెలిపే వారికే లాభదాయకం. ఇక ఎవడైనా కృతఘ్నుతకు పాల్పడితే- నిజానికి అల్లాహ్ వీటన్నింటికీ అతీతుడు. స్వతహాగా స్తుతిపాత్రుడు. హజ్రత్ లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేస్తూ 'కుమారా! దేవునికి భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టకు. ఇతరులను దేవునికి భాగస్వాములుగా చేర్చడం పరమ దుర్మార్గం. మనిషి తన తల్లిదండ్రుల హక్కులను గుర్తించాలి. మనిషిని అతడి తల్లి ఒక బలహీనతపై మరొక బలహీనత భరిస్తూ తన కడుపున మోసింది. పాలు మానడానికి రెండు సంవత్సరాలు పట్టింది. అందుకే మనిషి దేవునికి కృతజ్ఞుడయి వుండాలి. తల్లిదండ్రులకు కృతజ్ఞుడయి వుండాలి. ఒకవేళ వారు దేవునికి భాగ స్వాములుగా ఎవరినైనా చేర్చమని బలవంతపెడితే వారి మాట వినరాదు. కుమారా! ఆవగింజంత చిన్న వస్తువు అయినాసరే అది కొండ రాయిలోగాని, ఆకాశాలలోగాని, భూమిలో గాని ఎక్కడ దాగి ఉన్నప్పటికీ అల్లాహ్ దాన్ని బయటకు తీస్తాడు. కుమారా! నమాజు స్థాపించు. మంచిని ఆజ్ఞాపించు. చెడు పనుల నుంచి నిరోధించు. కష్టం కలిగినప్పుడు సహనం చూపు. ప్రజలతో ముఖం పక్కకు తిప్పి మాట్లాడవద్దు. భూమిపై అహంకారంతో నడవకు. నీ నడకలో సమతూకాన్ని పాటించు. నీ కంఠస్వరాన్ని కొంచెం తగ్గించు. అన్నిటికంటే అతి చెడ్డ స్వరం గార్ధభ స్వరం.

రుకూ 3 : అల్లాహ్ అవతరింపజేసిన దానిని అనుసరించండి అని వారితో అన్నప్పుడు వారు 'మా పూర్వీకులు దేన్ని అనుసరించడం చూశామో అదే చేస్తాము' అని అంటారు. జ్వలించే అగ్ని వైపునకు షైతాన్ వారిని ఆహ్వానిస్తున్నప్పటికీ వారినే అనుసరిస్తారా? తనను తాను అల్లాహ్‌కు అర్పించుకున్న వ్యక్తి, ఆచరణ రీత్యా సద్వర్తనుడు అయిన

వ్యక్తి, నిజానికి నమ్మదగిన ఒక ఆధారాన్ని పట్టుకొన్నాడు. ఇక ఎవడైనా అవిశ్వాసానికి పాల్పడితే ప్రపంచంలో సుఖాలను అనుభవించే అవకాశం మేము వారికి కొంతకాలం ఇస్తున్నాము. తరువాత వారిని అశక్తులుగా చేసి ఒక కఠోర యాతన వైపునకు లాక్కుపోతాము. భూమిపై ఉన్న చెట్లన్నీ కలాలు అయినా, సముద్రం, ఇంకా ఏడు సముద్రాల సిరా ఉన్నా అప్పటికీ అల్లాహ్ మాటలు రాయడానికి పూర్తి కావు. మనుషులందరినీ సృష్టించడం, తరువాత వారిని మళ్ళీ బ్రతికించి లేపడం అన్నది ఒక మనిషిని సృష్టించి, మళ్ళీ బ్రతికించి లేపడం వంటిదే ఆయనకు.

రుకూ 4 : సముద్రంలో వారిపై మృత్యువు కమ్ముకొచ్చినప్పుడు వారు అల్లాహ్‌కు మొరపెట్టుకొంటారు. తరువాత ఆయన వారిని రక్షించి నేలపైకి చేరవేసినప్పుడు వారిలో కొందరు ద్రోహులు కృతఘ్నులు అయిపోతారు. మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుంచి మిమ్మ మీరు కాపాడుకోండి. ఏ తండ్రీ తన కుమారునికి బదులుగా ముందుకు రాని, ఏ కొడుకూ తన తండ్రికి బదులుగా నిలబడని ఆ రోజుకు భయపడండి. అయిదు విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. అవి– 1) ప్రళయం రాకడ 2) వాన రాకడ 3) తల్లుల గర్భంలో ఏముందన్న విషయం 4) మనిషి రేపు ఏం సంపాదిస్తాడన్న విషయం 5) ఎక్కడ మృత్యువు వాటిల్లుతుందన్న విషయం. ఇవి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.

32. అస్ సజ్దహ్

రుకూ 1 : ఆకాశాలనూ, భూమిని, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఆరు రోజులలో సృష్టించి, ఆ పిదప అధికార పీఠాన్ని అధిష్ఠించినవాడు అల్లాహ్. ఆయన తప్ప ఆదుకునేవాడు, సహాయం చేసేవాడు ఎవడూ లేడు. ఆయన సమక్షంలో సిఫారసు చేసేవాడు కూడా ఎవడూ లేడు. గోప్యంగాను, బహిరంగంగానూ ఉన్న ప్రతిదీ తెలిసినవాడు, శక్తిమంతుడు, కరుణామయుడు ఆయనే. ఆయన ఏ వస్తువును చేసినా చక్కగానే చేశాడు. ఆయన మానవ సృష్టిని ప్రారంభంలో మట్టితో చేశాడు. తరువాత అతని సంతతిని నీచమైన నీటితో కొనసాగించాడు. ఆ తర్వాత మనిషిని నఖశిఖ పర్యంతం తీర్చిదిద్దాడు. అతని లోనికి తన ఆత్మను ఊదాడు. చెవులిచ్చాడు. కళ్ళు ఇచ్చాడు. హృదయం ఇచ్చాడు. అయినా మీరు కృతజ్ఞతలు తెలుపడం చాలా అరుదు.

రుకూ 2 : ఆ దోషులు తలలు వంచి తమ ప్రభువు ఎదుట నిలబడి ఉండే ఆ సమయాన్ని నీవు చూస్తే ఎంత బాగుండును. అప్పుడు వారు 'మా ప్రభూ! మేము బాగా చూశాము. బాగా విన్నాము. ఇక మమ్మల్ని వెనక్కి పంపించు. మేము మంచి పనులు చేస్తాము. మాకు ఇప్పుడు నమ్మకం కుదిరింది' అంటారు. వారు ఈ సమావేశాన్ని విస్మరించారు. కనుక ఇప్పుడు ఫలితం అనుభవించాలి. దేవుడు ఇప్పుడు మిమ్మల్ని విస్మరించాడు. మీ పనులకు ఫలితంగా శాశ్వత యాతనను చవిచూడండి. విశ్వసించిన వారు ఈ వాక్యాలను వినిపించి హితబోధ చేసినప్పుడు సజ్దాలో పడిపోతారు. తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పవిత్రతను కొనియాడుతారు. వారు గర్వం ప్రదర్శించరు. వారి వీపులు పడకలకు దూరంగా ఉంటాయి. వారు తమ ప్రభువును భయంతోనూ, ఆశతోనూ వేడుకొంటారు. వారికి ప్రసాదించిన ఉపాధి నుంచి ఖర్చుపెడతారు. ప్రభువు వాక్యాలను వినిపించి హితబోధ చేసినప్పుడు వాటి పట్ల విముఖుడయ్యే వానికంటే పరమ దుర్మార్గుడెవడు. అటువంటి అపరాధులకు మేము తప్పనిసరిగా ప్రతీకారం చేస్తాము.

రుకూ 3 : ఆ గ్రంథాన్ని మేము ఇస్రాయీల్ సంతతికి మార్గదర్శకంగా చేశాము. వారు సహనం చూపినప్పుడు మా వాక్యాలను దృఢంగా విశ్వసించినప్పుడు మేము వారిలో నాయకులను ఉద్భవింపజేశాము. వారు మా ఆజ్ఞానుసారం మార్గం చూపేవారు. ఇస్రాయీల్ సంతతి పరస్పరం విభేదిస్తున్న విషయాల గురించి నీ ప్రభువు నిశ్చయంగా ప్రళయం నాడు తీర్పు చెబుతాడు. వారికి పూర్వం మేము ఎన్నో జాతులను నాశనం చేశాము. ఆ జాతులు నివసించిన ప్రదేశాలలోనే నేడు వీరు సంచరిస్తున్నారు కదా! ఇందులో గొప్ప సూచనలున్నాయి. మేము ఒక బంజరు భూమి వైపునకు నీళ్ళను ప్రవహింపచేస్తాము. తర్వాత ఆ భూమి నుంచే పంటలు పండిస్తాము. ఇదేవిధంగా సత్యం పంట కూడా పండుతుంది.

33. అల్ అహ్జాబ్

రుకూ 1 : మీరు 'జిహార్' చేసే భార్యలను ఆయన మీ తల్లులుగా చేయలేదు. ఇంకా, ఆయన మీ దత్తపుత్రులను మీ సొంత పుత్రులుగా చేయలేదు. దత్తపుత్రులను వారి తండ్రులతో ఉన్న సంబంధం ప్రకారం పిలువండి. ఒకవేళ వారి తండ్రులెవరో మీకు తెలియకపోతే అప్పుడు వారు మీకు ధార్మిక సోదరులు, సహచరులు. విశ్వాసులకు

దైవప్రవక్త నిస్సందేహంగా స్వయంగా వారికంటే ముఖ్యమైనవారు. దైవప్రవక్త భార్యలు వారికి తల్లులు. కాని అల్లాహ్ గ్రంథం ప్రకారం సాధారణ విశ్వాసులు, వలస వచ్చిన వారికంటే రక్త సంబంధీకులు పరస్పరం ఎక్కువ హక్కులు కలిగివుంటారు.

రుకూ 2 : విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి. సైన్యాలు మీపైకి దండెత్తి వచ్చినప్పుడు అల్లాహ్ వాటి మీదకు ఒక పెనుగాలిని పంపాడు. మీకు కానరాని సైన్యాలు పంపాడు. మీరు ఆ సమయంలో చేస్తూ ఉండినదంతా అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు. శత్రువులు పైనుంచి క్రింది నుంచి దండెత్తి వచ్చినప్పుడు భయం వల్ల మీ కళ్ళు తేలేసినప్పుడు– ఆ సమయంలో విశ్వాసులు కఠిన పరీక్షకు గురయ్యారు. తీవ్రంగా కుదిపివేయబడ్డారు. కపటులు, రోగగ్రస్త హృదయాల వాళ్ళు నానా సాకులు చెప్పి జారుకోసాగారు. విశ్వాసులకు యుద్ధంలో అవరోధాలు సృష్టించసాగారు. విశ్వాసులకు తోడ్పడే విషయంలో పరమ పిసినారులు. ప్రమాదం సంభవించినప్పుడు మరణ సమయంలో అపస్మారకానికి గురైనవారి వలే గుడ్లు తిప్పుతూ నీవైపునకు చూస్తారు. కాని ప్రమాదం తొలగిపోగానే, లాభాలను తామే పొందాలని దురాశపరులై, కత్తెరల వలే ఆడే నాలుకలతో నీకు స్వాగతం చెప్పడానికి వస్తారు.

రుకూ 3 : వాస్తవానికి అల్లాహ్ ప్రవక్తతో ప్రజలకు ఒక మంచి ఆదర్శం ఉంది. అల్లాహ్‌పై, అంతిమదినంపై ఆశలు పెట్టుకొని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికీ ప్రవక్తలో ఒక మంచి ఆదర్శం ఉంది. దాడికి వస్తున్న సైన్యాలను చూసినప్పుడు సత్యవిశ్వాసులు 'అల్లాహ్, ప్రవక్త మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే. అల్లాహ్, ఆయన ప్రవక్త నిజమే చెప్పారు' అని అన్నారు. అల్లాహ్‌కు తాము చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన వారు విశ్వాసులలో ఉన్నారు. వారిలో కొందరు తమ మాట నిలబెట్టుకున్నారు. మరికొందరు సమయం కోసం వేచి ఉన్నారు. నిజాయితీపరులకు అల్లాహ్ వారి నిజాయితీకి ప్రతిఫలం ఇస్తాడు. అవిశ్వాసులు ఏ లాభాన్ని పొంద కుండానే, కడుపు మంటతో వెనక్కి వెళ్ళిపోయారు. ఈ దాడి చేసిన వారికి తోడ్పడిన గ్రంథ ప్రజలను వారి కోటల నుంచి అల్లాహ్ కిందికి లాక్కువచ్చాడు. నేడు వారిలోని ఒక వర్గం వారిని మీరు చంపుతున్నారు. మరొక వర్గం వారిని బందీలుగా చేస్తున్నారు.

రుకూ 4 : ప్రవక్తా! మీ భార్యలకు ఇలా చెప్పండి – 'ఒకవేళ మీరు ప్రాపంచిక జీవితాన్ని, దాని ఆకర్షణలను కోరుతున్నట్లయితే మీకు ఎంతో కొంత ఇచ్చి మంచి పద్ధతి

ప్రకారం సాగనంపుతాను. కాని ఒకవేళ మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను పరలోక నివాసాన్ని కోరుతూ ఉన్నట్లయితే– తెలుసుకోండి, అల్లాహ్ గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు.' ఓ ప్రవక్త భార్యలారా! మీలోఎవరైనా, ఏదైనా స్పష్టమైన నీతిబాహ్యామైన పని చేస్తే ఆమెకు రెట్టింపు శిక్ష పడుతుంది.

రుకూ 5 : మీలో ఎవరు అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో, సత్కార్యాలు చేస్తారో ఆమెకు రెట్టింపు ప్రతిఫలం ఇస్తాము. ప్రవక్త భార్యలారా! ప్రజలతో తగ్గు స్వరంతో మాట్లాడకండి. స్పష్టంగా, సూటిగా మాట్లాడండి. ఇళ్ళల్లోనే ఉండండి. పూర్వపు అజ్ఞాన కాలంలో మాదిరిగా అలంకరణ ప్రదర్శిస్తూ తిరగకండి. నమాజును స్థాపించండి. జకాత్ ఇవ్వండి. దైవప్రవక్త కుటుంబీకులయిన మీ నుంచి కల్మషాన్ని తొలగించాలని మిమ్మల్ని పూర్తిగా పరిశుద్ధపరచాలని అల్లాహ్ కోరుతున్నాడు.

రుకూ 6 : ముస్లిములు, విశ్వాసులు, విధేయులు, నిజాయితీపరులు, సహనశీలం గలవారు, అల్లాహ్ ముందు వినమ్రులయ్యేవారు, దానధర్మాలు చేసేవారు, ఉపవాసం పాటించేవారు, తమ మర్మాంగాలు కాపాడుకొనేవారు, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించేవారు అయిన స్త్రీ పురుషులకు అల్లాహ్ నిశ్చయంగా గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు. అల్లాహ్ ఆయన ప్రవక్త ఏ విషయంలో అయినా ఒక నిర్ణయం చేసినప్పుడు విశ్వాసులయిన స్త్రీ పురుషులకు ఆ విషయమై మరో నిర్ణయం తీసుకొనే హక్కు లేదు. విశ్వాసులకు దత్తపుత్రుల భార్యల విషయమై– దత్తపుత్రులు తమ భార్యలకు సంబంధించి అవసరాన్ని పూర్తి చేసుకున్నప్పుడు– దత్తపుత్రుల భార్యలను వివాహమాడవచ్చు. అల్లాహ్ ఆజ్ఞతో ప్రవక్త(స) తన దత్తపుత్రుడు జైద్ భార్యను (విడాకుల తర్వాత) వివాహమాడారు.

రుకూ 7 : విశ్వసించిన మానవులారా! అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి. ఉదయం, సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడండి. అల్లాహ్ దూతలు మీ కోసం కారుణ్యానికై ప్రార్థనలు చేస్తారు. మిమ్మల్ని చీకట్ల నుంచి అల్లాహ్ వెలుగులోకి తీసుకురావాలని ప్రార్థనలు చేస్తారు. విశ్వాసుల పట్ల ఆయన అమిత దయ కలవాడు. ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా, శుభవార్త ఇచ్చేవానిగా, హెచ్చరిక చేసేవానిగా, అల్లాహ్ అనుమతితో ఆయన వైపునకు పిలిచేవానిగా, ప్రకాశదీపంగా చేసి పంపాము. అవిశ్వాసుల, కపటుల ఒత్తిడికి ఏమాత్రం లొంగకు. వారి వేధింపులను లెక్క చెయ్యకు.

విశ్వాసులయిన మానవులారా! మీరు విశ్వాసులయిన స్త్రీలను వివాహమాడిన తర్వాత వారిని ముట్టుకోకముందే విడాకులిస్తే అప్పుడు మీ తరఫు నుంచి 'ఇద్దత్' ఏదీ వారిపై లేదు. భార్యల సంఖ్య విషయంలో ప్రవక్తకు ప్రత్యేక మినహాయింపు ఉంది. ఇతర విశ్వాసులకు ఈ మినహాయింపు లేదు.

రుకూ 8 : విశ్వాసులయిన ప్రజలారా! దైవప్రవక్త ఇళ్ళల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించవద్దు. భోజన సమయానికై కాచుకొని కూచోవద్దు. కాని, మిమ్మల్ని భోజనానికి పిలిస్తే తప్పక వెళ్ళండి. అయితే భోజనం ముగిసిన వెంటనే బయటికి వెళ్ళిపొండి. పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఉండిపోవద్దు. ప్రవక్త భార్యలను మీరు ఏదైనా అడగ వలసి ఉంటే తెరచాటున ఉండి అడగండి. ఆయన తర్వాత ఆయన భార్యలను వివాహమాడడం కూడా మీకు ధర్మసమ్మతం కాదు. ఇది అల్లాహ్ దృష్టిలో మహాపాపం. అల్లాహ్, ఆయన దూతలు దైవప్రవక్తపై 'దరూద్'ను పంపుతారు. అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకూ బాధ కలిగించిన వారిని అల్లాహ్ ఇహపరాలు రెండింటా శపించాడు. వారికి అవమానకరమైన శిక్ష విధిస్తాడు. విశ్వాసులయిన స్త్రీ పురుషులకు వారు ఏ తప్పు చేయకపోయినా మనస్తాపం కలుగజేసే వారు ఒక పెద్ద అభాండ భారాన్ని, ఒక స్పష్టమైన పాపభారాన్ని తమ తలపై మోపుకున్నట్లే.

రుకూ 9 : ప్రవక్తా! మీ భార్యలకూ, మీ కూతుళ్ళకు, విశ్వాసుల స్త్రీలకు వారు గుర్తింపబడేలా ఉండడానికి, వేధింపబడకుండా ఉండడానికి గాను వారి దుప్పట్ల అంచులను మీద కప్పుకోమని చెప్పండి. కపటులు, కలుషిత మనస్కులు, మదీనా నగరంలో అలజడి కలిగించే వదంతులు వ్యాపింపజేసేవారు తమ దుశ్చేష్టలను మానుకోనట్లయితే వారికి వ్యతిరేకంగా చర్య తీసుకోడానికి మేము మిమ్మల్ని నిలబెడ తాము. అల్లాహ్ అవిశ్వాసుల కొరకు మండే అగ్నిని సిద్ధం చేసి ఉంచాడు. వారి ముఖా లను నిప్పులపై అటుఇటు తిప్పడం జరిగిన నాడు వారు ఇలా అంటారు– 'అయ్యో! మేము అల్లాహ్కు దైవప్రవక్తకూ విధేయత చూపి ఉంటే ఎంత బాగుండేది– ఓ మా ప్రభూ! మేము మా నాయకులకు, మా పెద్దలకూ విధేయత చూపాము. వారు మమ్మల్ని రుజుమార్గం నుంచి తప్పించారు. ఓ ప్రభూ! వారికి రెట్టింపు యాతన విధించు. వారిని తీవ్రంగా శపించు."

రుకూ 10 : విశ్వాసులారా! అల్లాహ్కు భయపడండి. సత్యమైన మాటలే పలకండి. అల్లాహ్ మీ ఆచరణలను చక్కబరుస్తాడు. మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్కు,

దైవప్రవక్తకు విధేయత చూపేవాడు గొప్ప సాఫల్యం పొందుతాడు- మేము ఈ అమానతు ఆకాశాల ముందు, భూమి ముందు, పర్వతాల ముందు పెట్టాము. అవి దానిని మోయడానికి సిద్ధపడలేదు. దానికి భయపడ్డాయి. కాని మనిషి దాన్ని తనపై మోసాడు. నిస్సందేహంగా, మనిషి అన్యాయం చేసుకున్నాడు. మూర్ఖుడు. దీనికి అనివార్య ఫలితం ఏమిటంటే కపటులు, ముష్రిక్కులయిన స్త్రీ పురుషులను అల్లాహ్ శిక్షించడం, విశ్వాసులయిన స్త్రీ పురుషుల పశ్చాత్తాపాన్ని అంగీకరించడం. అల్లాహ్ మన్నించేవాడు. కరుణించేవాడూను.

34. సబా

రుకూ 1 : అల్లాహ్ మాత్రమే స్తోత్రానికి అర్హుడు. ఆకాశాలకు, భూమిలోని ప్రతి వస్తువుకు ఆయనే స్వామి. భూమిలోకి ప్రవేశించేది, దాని నుంచి వెలికి వచ్చేది, ఆకాశం నుంచి దిగేది, దానిలోకి ఎక్కేది, అంతా ఆయనకు తెలుసు. ఆకాశాలలోగాని, భూమిలోగాని రవ్వంత వస్తువు అయినా సరే ఏదీ ఆయనకు గోప్యంగా లేదు. విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి అల్లాహ్ మంచి ప్రతిఫలం ఇవ్వడానికి గాను ప్రళయం వస్తుంది. మా వాక్యాలను అగౌరవ పరచడానికి ప్రయత్నించే వారికి తీవ్రమైన, బాధాకరమైన శిక్ష పడుతుంది. వాస్తవానికి పరలోకాన్ని విశ్వసించనివారే యాతనలకు గురవుతారు. వారే ఘోరంగా మార్గం తప్పుతారు. మేము తలచుకొంటే వారిని భూమిలోకి కూరుకుపోయేలా చేయగలము. లేదా ఆకాశ ఖండాలను కొన్నిటిని వారిపై పడవేయగలము.

రుకూ 2 : మేము దావూద్‌కు పర్వతాలను, పక్షులను అధీనం చేశాము. మేము అతని కోసం కవచాలు తయారు చేయడానికి ఇనుము మెత్తబడేలా చేశాము. సులేమాన్‌కు గాలులు వశం చేశాయి. అతని కోసం కరిగిన రాగి ఊటను ప్రవహింపజేశాము. జిన్నాతులను మేము అతనికి అధీనం చేశాము. వారు అతని కోసం ఎత్తయిన కట్టడాలను, చిత్రాలను, కోనేరుల వంటి పెద్దపెద్ద పళ్ళాలను, తమ స్థానం నుంచి కదలని భారీ డేగిసాలను తయారు చేసేవారు. ఆ తర్వాత సులేమాన్‌పై మేము మరణ నిర్ణయాన్ని అమలు జరిపినప్పుడు ఆయన చేతికర్ర ఊతంతో నిలబడే ఉన్నారు. జిన్నాతులు పనిచేస్తూనే ఉన్నాయి. జిన్నాతులకు ఆయన మరణం గురించి తెలియ జేసింది- ఆయన చేతికర్రను తింటూ ఉన్న చీడపురుగు తప్ప మరొకటేదీ కాదు.

జిన్నాతులకు అగోచర విషయాల జ్ఞానం ఉన్నట్లయితే సులైమాన్ మరణం తర్వాత కూడా వారు నిర్మాణం పనిచేస్తూ ఉండేవారుకాదు. సబా జాతి విషయంలో ప్రభువేమో మన్నించేవాడు. అయినప్పటికీ వారు వైముఖ్యం చూపారు. చివరకు వారిపై కట్టలు తెగే వరద వచ్చిపడింది. వారు తమకు తామే అన్యాయం చేసుకున్నారు. చివరకు ఒక కథగా మిగిలారు.

రుకూ 3 : అల్లాహ్‌ను కాదని మీరు ఆరాధ్యులుగా భావించిన వారిని పిలిచి చూడండి. వారు ఆకాశాలలో గాని, భూమిలో గానీ రవ్వంత వస్తువు దేనికి కూడా యజమానులు కారు. భూమ్యాకాశాల ఆధిపత్యంలో భాగస్వాములు కానేకారు. వారిలో ఎవ్వడూ అల్లాహ్‌కు సహాయకుడు కాడు. అల్లాహ్ ఏ వ్యక్తి విషయంలో సిఫారసుకు అనుమతి ఇచ్చాడో, ఆ వ్యక్తికి తప్ప మరెవరికీ ఏ సిఫారసు అల్లాహ్ సమక్షంలో లాభదాయం కాదు. చివరకు ప్రజల హృదయాల నుంచి భయం తొలగిపోయినప్పుడు వారు సిఫారసు చేసే వారిని "మీ ప్రభువు ఏం సమాధానం ఇచ్చాడు?" అని అడుగుతారు. 'సరైన సమాధానమే దొరికింది. ఆయన మహిమాన్వితుడు, మహోన్నతుడు' అని జవాబిస్తారు సిఫారసు చేయగలవారు. ప్రవక్తా! మేము మిమ్మల్ని సర్వమానవులకు శుభవార్త ఇచ్చేవానిగా, హెచ్చరిక చేసేవానిగా నియమించి పంపాము. ప్రళయం ఒకనాడు నిర్ణయమయ్యే ఉంది. దాని రాకను మీరు ఒక గంట ఆలస్యమూ చెయ్యలేరు. ఒక గంట శీఘ్రమూ చేయలేరు.

రుకూ 4 : ప్రళయం నాడు రెండువర్గాలుంటాయి. ఒకటి అణగదొక్కబడిన వారిది. రెండవది పెద్ద మనుషులుగా చలామణి అయిన వారిది. ఈ రెండువర్గాలు పరస్పరం ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకుంటూ ఉంటాయి. చివరకు వారు శిక్షను చూసినప్పుడు తమ మనస్సులలో పశ్చాత్తాపపడతారు. ఈ అవిశ్వాసుల మెడలకు మేము గుదిబండలు వేస్తాము. ప్రజలకు వారు చేసిన కర్మల ప్రకారమే ప్రతిఫలం లభిస్తుంది. ఏదైనా పట్టణానికి మేము హెచ్చరిక చేసేవానిని పంపినప్పుడు ఆ పట్టణంలోని సంపన్నులు 'నీవు తీసుకువచ్చిన సందేశాన్ని మేము విశ్వసించం' అని అనకుండా ఉండడమన్నది ఎన్నడూ జరగలేదు. మాకు ఎక్కువ సంపద ఉంది. ఎక్కువ సంతానం ఉంది. మాకు శిక్ష పడదు అన్న భ్రమలో ఉండేవారు. ప్రవక్తా! వారికి చెప్పు 'ప్రభువు తాను కోరిన వారికి ఉపాధి విస్తారంగా ఇస్తాడు. కోరిన వారికి ఆచితూచి ఇస్తాడు.'

రుకూ 5 : మిమ్మల్ని మాకు దగ్గర చేసేవి మీ సంపద కానీ, మీ సంతానం గానీ కాదు. విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రమే మాకు దగ్గర అవుతారు. అటువంటి వారికి వారు చేసిన దానికి రెట్టింపు ప్రతిఫలం లభిస్తుంది. మా వాక్యాలు చులకన చేయడానికి నిరంతరం ప్రయత్నించే వారు యాతనలకు గురవుతారు. మీరు దేనిని ఖర్చు చేసినప్పటికీ దాని స్థానంలో ఆయనే మీకు మరింత ఇస్తాడు. ఉపాధి ఇచ్చే వారందరికంటే ఆయనే శ్రేష్ఠుడయిన ఉపాధి ప్రధాత. స్పష్టమైన వాక్యాలను వారికి వినిపించినప్పుడు వారు 'ఈ వ్యక్తి మన తాత ముత్తాతలు ఆరాధించిన దేవుళ్ళ నుంచి మనలను దూరం చేయదలిచాడు' అని అంటారు. 'ఇది (ఖుర్ఆన్) కేవలం కల్పితం అబద్ధం మాత్రమే. ఇది స్పష్టమైన మంత్రజాలం మాత్రమే' అనంటారు. వారికి పూర్వం గతించినవారు కూడా ఇదేవిధంగా తిరస్కరించారు. మేము పూర్వపు వారికి ఇచ్చిన దానిలో పదో వంతుకు కూడా వీరు చేరలేదు. కాని వారు మా ప్రవక్తలను తిరస్కరించినప్పుడు వారికి విధించబడిన శిక్ష ఎంత కఠినంగా ఉండిందో వీరు తెలుసుకోవాలి.

రుకూ 6 : ప్రవక్తా! వారిని అడగండి. మీ మాటలలో పిచ్చితనం ఉందని నిరూపించే రుజువు చూపమనండి. 'నా ప్రభువు నాకు సత్యస్ఫూర్తిని పంపుతున్నాడు' అని చెప్పండి. 'సత్యం వచ్చేసింది. ఇక అసత్యం ఏం చేసినా గెలవలేదు' అని చెప్పండి. ఒకవేళ నేను సన్మార్గంపై ఉంటే నా ప్రభువు నాపై అవతరింపజేసే వహీ ఆధారంగానే ఉన్నాను' అని చెప్పండి. మీరు ఆ సమయంలో వారిని చూస్తే ఎంత బాగుండును. అప్పుడు వారు భయకంపితులయి తిరుగుతూ ఉంటారు. ఎటూ తప్పించుకొని పోలేరు. 'మేము దానినే విశ్వసించాము' అని అంటారు. కాని, దూరమైపోయిన వస్తువు ఇక చేతికి ఎలా అందుతుంది. వారు ఇదివరకు అవిశ్వాసానికి పాల్పడి ఉన్నవారు.

35. ఫాతిర్

రుకూ 1 : అల్లాహ్ ప్రజల కొరకు తెరిచే కారుణ్య ద్వారాన్ని అడ్డుకునేవాడెవ్వడూ లేడు. ఆయన మూసివేసిన దానిని ఆయన తప్ప తెరిచేవాడు ఎవ్వడూలేడు. మానవులారా! అల్లాహ్ మీకు చేసిన మేళ్ళను గుర్తుంచుకోండి. అల్లాహ్ తప్ప భూమ్యాకాశాలలో మీకు ఉపాధినిచ్చే సృష్టికర్త మరెవ్వడు? మానవులారా! నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయరాదు. ఆ మహా

మోసగాడు కూడా అల్లాహ్ విషయంలో మిమ్మల్ని మోసంలో పడవేయకూడదు. నిజానికి షైతాన్ మీకు శత్రువు. కనుక మీరు వాడిని శత్రువుగానే భావించండి. వాడు, తనను అనుసరించేవారు నరకం పాలు కావాలని తన మార్గం వైపునకు పిలుస్తున్నాడు.

రుకూ 2 : అల్లాహ్ వద్దకు అధిరోహించ గల వస్తువు పవిత్ర వాక్కు మాత్రమే. సత్కర్మ దానిని పైకి ఎక్కిస్తుంది. ఇక కుతంత్రాలు చేసే వారి విషయం– వారికి కఠిన శిక్ష పడుతుంది. అల్లాహ్ మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. తర్వాత ఇంద్రియం బిందువుతో– ఆ తర్వాత మిమ్మల్ని జంటలుగా చేశాడు. అల్లాహ్‌కు తెలియకుండా ఏ స్త్రీ కూడా గర్భం దాల్చనూలేదు, ప్రసవించనూ లేదు. వయసు పెరుగుతున్న వాడెవడు ఆయుష్షు పొందలేడు. ఎవరి ఆయుష్షులోనూ తగ్గింపు అనేది జరగదు. గ్రంథంలో రాయబడి ఉన్న దాని ప్రకారం తప్ప– మీరు మంచి నీటి నుంచి, ఉప్పు నీటి నుంచి రెంటి నుంచి స్వచ్ఛమైన తాజా మాంసాన్ని పొందుతారు. నీటిపైనే పడవలు దాని గుండెను చీల్చుకొంటూ పోతూ ఉంటాయి. ఆయన పగలులోనికి రాత్రిని, రాత్రిలోనికి పగలును జొనుపుతున్నాడు. సూర్యచంద్రులను ఆయన నియమబద్ధులు చేశాడు. ఆ అల్లాహ్‌యే మీ ప్రభువు సామ్రాజ్యాధికారం ఆయనదే. ఆయన్ను కాదని మీరు పిలిచే ఇతరులు కనీసం ఒక గడ్డిపోచకు కూడా యజమానులు కారు.

రుకూ 3 : బరువు మోసేవాడెవ్వడూ మరొకరి బరువు మోయడు. బరువును మోసే ఆత్మ ఏదైనా తన బరువును మోయమని ఇతరులను పిలిచినప్పుడు దాని బరువులో రవ్వంత భాగం ఎత్తుకోవడానికి కూడా ఎవ్వడూ ముందుకు రాడు. అతడు ఎంత సమీప బంధువు అయినాసరే. ప్రవక్తా! చూడకపోయినప్పటికీ తమ ప్రభువుకు భయపడేవారిని, నమాజు స్థాపించేవారిని మాత్రమే నీవు హెచ్చరించగలవు. గుడ్డివాడు కళ్ళున్నవాడు సమానం కాదు. చీకటి వెలుగులు ఒకటి కాదు. చల్లని నీడ, ఎండతాపం ఒకేలా ఉండవు. బ్రతికి ఉన్నవారు, చనిపోయినవారు సమానం కాదు. ప్రవక్తా! సమాధుల్లో ఖననమైన వారికి నీవు వినిపించలేవు. హెచ్చరిక చేసేవాడు ఎవ్వడూ రాని జాతి ఏదీ లేదు. తర్వాత విశ్వసించని వారిని మేము పట్టుకొన్నాము. నా శిక్ష ఎంత కఠినంగా ఉందో చూడండి.

రుకూ 4 : యధార్థమేమిటంటే, అల్లాహ్ దాసులలో కేవలం జ్ఞానం కలవారు మాత్రమే ఆయనకు భయపడతారు. అల్లాహ్ గ్రంథాన్ని పారాయణం చేసేవారు, నమాజును స్థాపించేవారు, మేము వారికి ఇచ్చిన ఉపాధి నుంచి బహిరంగంగానూ, గోప్యంగానూ

ఖర్చు చేసేవారు నిశ్చయంగా ఏమాత్రం నష్టంరాని వ్యాపారాన్ని కోరుతున్నారు. మా దాసుల నుంచి మేము ఎన్నుకొన్న వారినే ఈ గ్రంథానికి వారసులుగా చేశాము. ఇప్పుడు వారిలో కొందరు తమ ఆత్మకు అన్యాయం చేసుకుంటున్నారు. కొందరు మధ్యస్థంగా ఉన్నారు. మరికొందరు అల్లాహ్ అనుమతితో పుణ్యకార్యాలలో ముందుకు సాగుతున్నారు. ఇదే మహా అనుగ్రహం. శాశ్వతంగా ఉండే ఉద్యాన వనాలలోకి వారు ప్రవేశిస్తారు. అవిశ్వాసానికి పాల్పడిన వారికి నరకాగ్ని ఉన్నది. వారు అక్కడ పెడబొబ్బలు పెడుతూ 'ప్రభూ! మమ్మల్ని ఇక్కడి నుంచి బయటకు తియ్యి. మేము పూర్వం చేసిన పనులకు భిన్నంగా మంచిపనులు చేస్తాం' అంటారు. వారికి జవాబుగా 'గుణపాఠం నేర్చుకోదలిచినవాడికి గుణపాఠం నేర్చుకొనడానికి సరిపోయే ఆయుష్షు మేము మీకు ఇవ్వలేదా? మీ వద్దకు హెచ్చరిక చేసేవాడు కూడా వచ్చాడు కదా!' అనబడుతుంది.

రుకూ 5 : ప్రవక్తా! వారికి చెప్పండి 'అల్లాహ్‌ను కాదని మీరు వేడుకునే ఈ భాగస్వాములను మీరెప్పుడన్నా చూశారా? వారు భూమిపై సృష్టించింది ఏమిటో నాకు చూపండి? లేక వారికి ఆకాశాల్లో ఉన్న భాగస్వామ్యం ఏమిటి? ఈ దుర్మార్గులు ఒకరికొకరు కుయుక్తులతో మోసం చేసుకుంటున్నారు. యధార్థమేమిటంటే ఆకాశాలనూ, భూమిని తొలగిపోకుండా ఆపి ఉంచినవాడు అల్లాహ్‌యే. ఒకవేళ అవి తొలగిపోతే వాటిని నిలబెట్టగల వాడు అల్లాహ్ తప్ప మరెవడూ లేడు. అల్లాహ్ సంప్రదాయాన్ని దాని నిర్ణీత మార్గం నుంచి ఏ శక్తి అయినా సరే మరల్చడాన్ని నీవు ఎన్నడూ చూడలేవు. పూర్వం గతించిన ప్రజలు వీరికంటే అత్యంత బలసంపన్నులు. తలబిరుసుతనానికి అందరూ ఫలితం అనుభవించారు. అల్లాహ్‌ను అశక్తునిగా చేసే వస్తువు ఏదీ ఆకాశాల్లోగాని, భూమిపైన గాని లేదు. ఒకవేళ ఆయన ప్రజలను వారు చేసిన అకృత్యాలకు గాను పట్టుకుంటే, భూమిపై ఏ ప్రాణిని సజీవంగా వదిలిపెట్టేవాడు కాదు. కాని ఆయన వారికి ఒక నిర్ణీత కాలం వరకు గడువు ఇస్తున్నాడు.

36. యాసీన్

రుకూ 1 : నీవు నిశ్చయంగా దైవప్రవక్తలలోని వాడవు. రుజుమార్గంపై ఉన్నావు. చాలామంది ప్రజలు శిక్షకు అర్హులయిపోయిన ఆ జాతిని హెచ్చరించు. ఎందుకంటే, వారు విశ్వసించడంలేదు. మేము వారి మెడలలో పట్టాలు వేశావు. వారి ముందు,

వెనుక గోడలు కట్టబడి ఉన్నాయి. ఇక వారికి ఏదీ తోచదు. కరుణామయుడైన దేవుణ్ణి చూడకుండానే భయపడేవాడిని మాత్రమే నీవు హెచ్చరించగలవు. అలాంటి వారికి క్షమాభిక్ష, గొప్ప ప్రతిఫలమూ లభిస్తాయన్న శుభవార్త వినిపించు. వారు చేసే పనులన్నింటినీ మేము నమోదు చేస్తూనే ఉన్నాము. వారు తమ వెనుక విడిచి వెళ్ళిన చిహ్నాలను కూడా నమోదు చేస్తూ ఉన్నాము.

రుకూ 2 : ఒక పట్టణం గురించిన ఉదాహరణ ఇవ్వబడింది– వారి వద్దకు ఇద్దరు ప్రవక్తలను పంపడం జరిగింది. వారికి సహాయంగా మూడో అతన్ని పంపడం జరిగింది. వారు ప్రజలను ఒకే దేవుని వైపునకు పిలిచారు. పట్టణ వాసులు వారిని రాళ్ళతో కొట్టి చంపుతామని బెదిరించారు. అంతలో పట్టణంలోని ఒక మారుమూల ప్రాంతం నుంచి ఒక వ్యక్తి పరుగెత్తుకొంటూ వచ్చి 'నా జాతి ప్రజలారా! దైవప్రవక్తలను అనుసరించండి. ఒకే దేవుని ఆరాధించండి' అన్నాడు. చివరకు వారు అతన్ని హత్య చేశారు. ఆ వ్యక్తితో 'స్వర్గంలో ప్రవేశించు' అనడం జరిగింది. అతను అప్పుడు 'నా ప్రభువు ఏ విషయం వల్ల నన్ను క్షమించి గౌరవనీయులలోనికి ప్రవేశింపజేశాడో ఆ విషయం నా జాతి వారికి తెలిస్తే ఎంత బాగుండును' అనుకొన్నాడు. ఆ తరువాత, కేవలం ఒక పేలుడు మాత్రమే సంభవించింది. అంతే వారంతా ఒక్కసారిగా ఆరిపోయారు. వారికి పూర్వం మేము ఎన్నో జాతులను నాశనం చేసిన విషయం వారికి తెలియదా? ఆ జాతులు ఆ తర్వాత ఎన్నడూ వారి వద్దకు తిరిగిరాని విషయాన్ని వారు గమనించలేదా?

రుకూ 3 : వారికి మృతభూమి ఒక సూచన. మేము దానికి ప్రాణం పోశాము. దాని నుంచి మీరు తినే ధాన్యం ఉత్పత్తి చేశాము. మేము దానిలో ఖర్జూరం, ద్రాక్ష తోటలు పెంచాము. దానిలో నుంచి ఊటలు చిమ్మేలా చేశాము. అన్ని రకాల జంటలను సృష్టించాము. భూమిలో నుంచి పుట్టే వృక్ష జాలం లోనివి అయినా లేక స్వయంగా మానవులే అయినా లేక వారు అసలు ఎరుగని వస్తువులలో అయినా జంటలు సృష్టించాము. రాత్రి పైనుంచి పగలును తొలగించినప్పుడు వారిని చీకటి ఆవరిస్తుంది. ఒక సూర్యుడు– తన నిజస్థానం దిశగా పయనిస్తున్నాడు. చంద్రుని కొరకు మేము దశలు నిర్దేశించాము. వాటిని దాటుతూ చివరకు ఎండిన ఖర్జూరపు కొమ్మ మాదిరిగా అయిపోతాడు. వారి ప్రభువు సూచనలలోని ఏ సూచన వారి ముందుకు వచ్చినా వారు

ఏ మాత్రం శ్రద్ధ వహించరు. అంతేకాదు, 'అల్లాహ్ మీకు ప్రసాదించిన దాని నుంచి కొంత అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టండి' అని వారితో అన్నప్పుడు 'అల్లాహ్ తలిస్తే తానే స్వయంగా ఆహారం అందించే వారికి మేము ఇవ్వాలా?' అంటారు. 'ప్రళయం గురించిన బెదిరింపు ఎప్పుడు నెరవేరుతుంది? నీవు సత్యవంతుడవైతే చెప్పు' అని అడుగుతారు. వారు దేనికోసం నిరీక్షిస్తున్నారో వాస్తవానికి అది ఒక పేలుడు మాత్రమే. అది వారిని అకస్మాత్తుగా పట్టుకొంటుంది. అప్పుడు వారు తమ ప్రాపంచిక వ్యవహారాల గురించి వివాదపడుతూ ఉంటారు. ఆ సమయంలో వారు మరణశాసనం కూడా రాయలేరు. తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళనూ లేరు.

రుకూ 4 : ఒక శంఖం ఊదబడుతుంది. ఆ వెంటనే వారు తమ ప్రభువు ముందు హాజరయ్యేందుకు తమ సమాధుల నుంచి బయటకు వస్తారు. భయాందోళనలతో 'అరె, మన పడకల నుంచి మనల్ని ఎవరు లేపి నిలబెట్టారు?' అని అంటుంటారు. 'ఇది దయామయుడైన దేవుడు వాగ్దానం చేసిన విషయం. దైవప్రవక్తల మాట పూర్తిగా నిజం' అంటుంటారు. నేడు స్వర్గవాసుల సుఖాలు అనుభవించడంలో నిమగ్నులయివుంటారు. ఆదమ్ సంతానమా! నేను మీకు ఉపదేశించలేదా! షైతాన్‌కు దాస్యం చేయవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువనీ, నా దాస్యమే చెయ్యండి అని ఇదే సరైన మార్గమని బోధించలేదా? భయపడండి అని మీకు చెబుతూ ఉన్న నరకం ఇదే. నేడు మేము వారి నోళ్ళు మూయిస్తాము. వారు ప్రపంచంలో ఏమేం సంపాదించాలో వారి చేతులు మాకు చెబుతాయి. వారి కాళ్ళు సాక్ష్యమిస్తాయి.

రుకూ 5 : ఇది ఒక హితబోధ మాత్రమే. స్పష్టంగా పఠించే గ్రంథం మాత్రమే. బ్రతికి ఉన్న ప్రతి మనిషిని హెచ్చరించడానికి ఉద్దేశించినది. ప్రజల కోసం మేము పశువులను సృష్టించాడు. వారు వాటిని యజమానులయ్యారు. మేము వాటిని వారికి స్వాధీన పరిచాము. కొన్నిటిపై వారు స్వారీ చేస్తారు. కొన్నిటి మాంసాన్ని తింటారు. వాటిలో వారికి రకరకాల ప్రయోజనాలూ, పానీయాలూ ఉన్నాయి. అయినా వారు కృతజ్ఞత చూపరేమిటి? మేము మనిషిని వీర్యబిందువుతో సృష్టించాము. అతడు బహిరంగ ప్రత్యర్థిగా నిలబడ్డాడు. మనిషికి చెప్పు 'మొదట సృష్టించిన వాడే మళ్ళీ జీవం పోస్తాడు' మీకై ఆయన పచ్చని చెట్ల నుంచి అగ్నిని సృష్టించాడు. మీరు దానితో కుంపట్లు రాజేసు కుంటారు. ఆయన మహా నిపుణుడు అయిన సృష్టికర్త.

37. అస్ సాఫ్ఫాత్

రుకూ 1 : మేము ఆకాశ ప్రపంచాన్ని నక్షత్రాల అలంకరణతో తీర్చిదిద్దాము. షైతానులు ఊర్ధ్వ లోకపు మాటలు వినలేరు. వారిలో ఎవడైనా ఏదైనా మాటను ఎగరేసుకుపోతే ఒక తీక్షణమైన అగ్నిజ్వాల వెంటాడుతుంది. వారిని అడగండి. వారిని సృష్టించడం కష్టమా? లేక ఈ సకల చరాచరాలను సృష్టించడం కష్టమా? ఎంత నచ్చజెప్పినా వారు చెవికెక్కించుకోరు. ఏదైనా సూచన ఇస్తే, దానిని ఎగతాళి చేస్తారు. మరణించిన వారిని మళ్ళీ లేపడం జరుగదంటున్నారు. అది కేవలం ఒక గద్దింపు మాత్రమే. హఠాత్తుగా వారు తమకు చెప్పబడిన విషయాలన్నింటిని కళ్ళారా చూస్తారు. అప్పుడు వారు 'మేమెంత దౌర్భాగ్యులం. ఇది తీర్పుదినం కదా!' అంటారు.

రుకూ 2 : దుర్మార్గులందరినీ, వారి సహచరులను, వారు ఆరాధిస్తూ ఉండిన దైవాలను చుట్టుముట్టి తీసుకురండి. వారందరికీ నరకానికి దారి చూపండి అని ఆజ్ఞ అవుతుంది. షైతానును అనుసరించినవారు, వారి నాయకులు పరస్పరం కోట్లాడుకుంటుంటారు. తమ మార్గభ్రష్టత్వానికి కారణం మీరంటే మీరని ఆరోపించుకుంటుంటారు. అయితే ఎన్నికయిన దైవదాసులు మాత్రం సురక్షితంగా ఉంటారు. పరస్పరం ముచ్చటించు కుంటూ ఉంటారు. వారికి గొప్పగా అతిథి సత్కారం జరుగుతుంది. చెప్పండి! ఈ ఆతిథ్యం మంచిదా? లేదా రాకాసి జెముడు చెట్టు (జఖ్ఖూమ్) ఆతిథ్యం మంచిదా? అది నరకం అడుగు భాగం నుంచి మొలిచే ఒక చెట్టు. తమ తాతముత్తాతలు మార్గభ్రష్టులవడాన్ని చూసినప్పటికీ వారి అడుగుజాడలలో పరుగెత్తిన వాళ్ళు నరకానికి వారసులు.

రుకూ 3 : నూహ్ దేవుణ్ణి వేడుకొన్నారు. మేము ప్రార్థనలకు ఎంత మంచి జవాబు ఇచ్చామో చూడండి. మేము అతన్ని, అతని కుటుంబాన్ని పెద్ద విపత్తు నుంచి కాపాడాము. అతని సంతతి మాత్రమే మిగిలి ఉండేలా చేశాము. తరువాతి తరాలలో అతని కీర్తిప్రతిష్ఠలు నిలిచి ఉండేలా చేశాము. ఇబ్రాహీం తన ప్రభువు సాన్నిధ్యానికి నిర్మల హృదయంతో వచ్చాడు. తన తండ్రిని, తన జాతి ప్రజలను ఏకదైవారాధన వైపునకు పిలిచాడు. ఒకరోజు దేవుళ్ళ ఆలయానికి వెళ్ళి విగ్రహాలన్నింటినీ విరగ్గొట్టాడు. అగ్ని గుండంలోకి విసిరివేయబడ్డారు. మేము ఆయన్ను రక్షించాము. అతనికి ఒక సహనశీలుడైన కుమారుడు కలుగుతాడని మేము శుభవార్త తెలిపాము. ఆ బాలుడు

అతనికి చేదోడు అయ్యే వయసుకు చేరుకొన్నప్పుడు ఒకరోజు ఇబ్రాహీం బాలునితో 'కుమారా! నేను నిన్ను 'జిబహ్' (బలి) చేస్తున్నట్లు కలలో చూశాను' అన్నారు. దానికి జవాబుగా బాలుడు 'నాన్నగారూ! మీకు ఆజ్ఞాపించబడిన విధంగా చేయండి. అల్లాహ్ తలచితే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు' అన్నాడు. తర్వాత ఇబ్రాహీమ్ తన కుమారుని నుదుటిపై బోర్లా పరుండబెట్టాడు. అప్పుడు మేము అతన్ని పిలిచి 'ఇబ్రాహీమ్ నీవు కలను నిజం చేసి చూపించావు' అన్నాము. మేము ఒక పెద్ద ఖుర్బానీని పరిహారంగా ఇచ్చి ఆ బాలుని విడిపించుకొన్నాము. ఇబ్రాహీంకు శాంతి కలుగుగాక! మేము సత్కార్యాలు చేసే వారికి ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తాము.

రుకూ 4 : మేము మూసాకు, హారూన్‌కు మేలు చేశాము. మేము వారికి స్పష్టమైన గ్రంథాన్ని ప్రసాదించాము. వారికి రుజుమార్గం చూపాము. తరువాతి తరాల వారితో వారి గురించి మంచి ప్రస్తావన ఉండేలా చేశాము. మూసాకు, హారూన్‌కు శాంతి కలుగుగాక! నిశ్చయంగా ఇల్యాస్ కూడా మా ప్రవక్తలలో ఒకరు. అతను తన జాతి వారితో 'మీకు మీ తాతముత్తాతలకు ప్రభువు అయిన అల్లాహ్‌ను వదిలి 'బఅల్'ను వేడుకొంటున్నారా?' అన్నాడు. వారు అతనిని అసత్యవాది అని తిరస్కరించారు. ఇల్యాస్ గురించిన మంచి ప్రస్తావన తరువాతి తరాలలో మిగిలి వుండేలా చేశాము. ఇల్యాస్‌కు శాంతి కలుగుగాక! లూత్ కూడా దైవప్రవక్తలుగా నియమించబడిన వారిలో ఒకరు. మేము అతనికి, అతని కుటుంబంలో వారందరికీ విముక్తి కలిగించాము. ఒక్క వృద్ధురాలికి తప్ప. మిగతా వారందరినీ సర్వనాశనం చేసి వేశాము.

రుకూ 5 : యూనుస్ కూడా దైవప్రవక్తలలో ఒకరు. ఆయన నిండు పడవ వైపునకు పరుగెత్తాడు. చివరకు ఆయన్ను చేప మింగివేసింది. ఆయన దైవనామస్మరణ చేసేవారిలో ఒకడై ఉండనట్లయితే ప్రళయదినం వరకు ఆ చేప కడుపులోనే ఉండేవాడు. చివరకు మేము అతన్ని తీవ్ర అనారోగ్య స్థితిలో ఒక తీరం మీద పడవేశాము. ఆ తర్వాత మేము ఆయన్ను ఒక లక్ష లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజల వద్దకు పంపాము. వారు విశ్వసించారు.

అల్లాహ్ సంతానం కలవాడన్న విషయాన్ని వీళ్ళే కల్పిస్తున్నారు. వీళ్ళు అల్లాహ్‌కు, దైవదూతలకు మధ్య రక్తసంబంధాన్ని కల్పించారు. వాస్తవానికి వీళ్ళు నేరస్తులుగా ప్రవేశపెట్టబడతారని దైవదూతలకు బాగా తెలుసు. ఇతరులు తనకు ఆపాదించే

గుణగణాల నుంచి అల్లాహ్ పరిశుద్ధుడు. కనుక ప్రవక్తా! కొంతకాలం వరకు వారిని వారి స్థితిలో వదిలిపెట్టి చూస్తూ ఉండు. త్వరలోనే స్వయంగా వారు కూడా చూస్తారు.

38. సాద్

రుకూ 1 : విశ్వసించకుండా తిరస్కరించిన ఈ ప్రజలు దురహంకారులు. పరమ మూర్ఖులు. స్వయంగా తమ నుంచే భయపెట్టే వాడొకడు వచ్చాడని ఆశ్చర్యపోతున్నారు. ఈ సత్య తిరస్కారులు ఇంకా ఇలా అంటున్నారు. సమస్త దైవాల స్థానంలో కేవలం ఒకే ఒక దైవాన్ని నిలబెట్టాడేమిటి? ఎంత విచిత్రం– మన దైవాల ఆరాధన పట్ల స్థిరంగా ఉండండి. అల్లాహ్ హితోపదేశం అవతరించే అర్హత మనందరిలో కేవలం ఇతనొక్కడికే ఉందా? అని అంటున్నారు. ఇది అనేక సమూహాలలోని ఒక చిన్న సమూహం మాత్రమే. ఈ సమూహం ఇదే స్థలంలో పరాజయం పాలవుతుంది అని తెలిపాడు అల్లాహ్.

రుకూ 2 : మా దాసులకు దావూద్ వృత్తాంతం తెలుపు. అతను మహా శక్తులు గలవాడు. మేము పర్వతాలు అతనికి లొంగిపోయేలా చేశాము. ఉదయం, సాయంత్రం అవి అతనితోపాటు దైవస్తోత్రం చేసేవి. పక్షులు గుమిగూడేవి. మేము అతని రాజ్యాన్ని శక్తిమంతమైనది చేశాము. ఒక వ్యాజ్యం విషయంలో అతన్ని పరీక్షకు గురిచేశాము. అతన్ని పరీక్షించడానికే మేము ఇలా చేశామని దావూద్ అర్థం చేసుకొన్నాడు. ప్రభువును క్షమాభిక్ష కోరాడు. సజ్దాలో పడిపోయాడు. పశ్చాత్తాపంతో ప్రభువు వైపునకు మరలాడు. వ్యాజ్యం సందర్భంగా దావూద్ ఒక వాస్తవాన్ని తెలిపాడు. కలిసి ఒక చోట ఉండేవారు తరచూ ఒకరికొకరు అన్యాయం చేసుకుంటారు. అయితే విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రం దీనికి దూరంగా ఉంటారు. అటువంటి వారు కొందరు మాత్రమే.

రుకూ 3 : మేము ఈ ఆకాశాన్ని, ఈ భూమిని వీటి మధ్య ఉన్న ఈ ప్రపంచాన్ని వృధాగా సృష్టించలేదు. విశ్వసించి సత్కార్యాలు చేసేవారినీ, ధరణిపై కల్లోలాన్ని రేకెత్తించే వారిని మేము ఒకేలా చూడాలా? భయభక్తులు కలవారిని మేము పాపాత్ముల మాదిరిగా చూడాలా? ప్రవక్తా! మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. ఎందుకంటే, ప్రజలు దాని వాక్యాలను గురించి ఆలోచించాలనీ, బుద్ధిమంతులు ఆలోచనాపరులు దాని నుంచి గుణపాఠం నేర్చుకోవాలనీ ఇలా చేశాము. దావూద్‌కు మేము సులైమాన్ వంటి కుమారున్ని ప్రసాదించాము. అతను

మంచి దాసుడు. అత్యధికంగా ప్రభువు వైపునకు మరలుతూ ఉండేవాడు. మేము సులైమాన్‌ను కూడా పరీక్షకు గురిచేశాము. అప్పుడు అతను అల్లాహ్ వైపునకు మరలి పోయాడు. మేము గాలులను అతనికి వశం చేశాము. షైతాన్‌లను అతని అధీనంలో ఉంచాము.

రుకూ 4 : మా దాసుడు అయ్యూబ్ రోగగ్రస్తుడై మొరపెట్టుకున్నప్పుడు అల్లాహ్ ఆయనకు ఆరోగ్యాన్ని ప్రసాదించాడు. ఆయనకు ఆయన కుటుంబాన్ని తిరిగి ఇచ్చాడు. అల్లాహ్ ఆయనను సహనశీలునిగా చూశాడు. ఆయన మంచి దాసుడు. తన ప్రభువు వైపునకు ఎక్కువగా మరలుతూ ఉండేవాడు. మా దాసులయిన ఇబ్రాహీం, ఇస్‌హాఖ్, యాకూబ్‌లను మేము వారి ఒక విశిష్ట గుణం కారణంగా ఎన్నుకొన్నాము. ఆ విశిష్ట గుణం వారిలోని పరలోక చింతన, భయభక్తులు కలవారికి నిశ్చయంగా ఉత్తమ నివాసం ఉన్నది. శాశ్వతమైన స్వర్గవనాలు ఉన్నాయి. తలబిరుసు కలవారికి అతిచెడ్డ నివాసం ఉంది. అది నరకం. వారు ఒండొరులతో 'ఏమిటి ఈ విచిత్రం? మన ప్రపంచంలో చెడ్డవారిగా భావించిన వారు మనకు కనబడరేం? మనం ఊరికే వారిని ఎగతాళి చేశామా? లేక వారు మనకు కనిపించడంలేదా?' అని అంటుంటారు. నిస్సందేహంగా ఇది నిజం. నరకవాసుల మధ్య ఇటువంటి తగాదాలే జరుగుతాయి.

రుకూ 5 : ప్రవక్తా! వారికి చెప్పండి. నేను హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే. అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్య దైవం ఎవ్వడూలేడు. ఆయన అద్వితీయుడు. అందరిపై ఆధిపత్యం కలవాడు. ఆకాశాలకు భూమికి స్వామి. వాటి మధ్య ఉన్న సకల వస్తువులకు ప్రభువు. మహా శక్తిశాలి. క్షమించేవాడు. ఆజ్ఞ ప్రకారం దైవదూతలు అందరూ ఆదమ్‌కు సజ్దా చేశారు. కాని ఇబ్లీస్ తాను అగ్నితో పుట్టాననీ, ఆదమ్ మట్టితో పుట్టారనీ గర్వించి అల్లాహ్ శాపానికి గురయ్యాడు. పిదప ప్రభువును ప్రళయం వరకు వ్యవధి ఇవ్వండని కోరాడు. వాడికి వ్యవధి ఇవ్వబడింది. ప్రజలను మార్గం తప్పించడమే వాడి ఉద్యమం అయిపోయింది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు. 'కనుక సత్యం ఇదే. నేను సత్యాన్నే పలుకుతాను. నీతోనూ, ఈ మనుషులలో నిన్ను అనుసరించే వారందరితోనూ నరకాన్ని నింపుతాను' అన్నాడు.

39. అజ్ జుమర్

రుకూ 1 : ధర్మాన్ని అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకిస్తూ అల్లాహ్‌కు మాత్రమే దాస్యం చెయ్యండి. జాగ్రత్త! ధర్మం అన్నది ప్రత్యేకంగా అల్లాహ్‌కు మాత్రమే చెందిన హక్కు.

అల్లాహ్‌ను వదిలి ఇతరులను సంరక్షకులుగా చేసుకొన్నవారు తమ ఈ పనికి కారణం చూపుతూ– 'వారు మమ్మల్ని అల్లాహ్ వద్దకు చేరుస్తారని మాత్రమే వారిని ఆరాధిస్తున్నాము' అని అంటారు. వారు విభేదిస్తున్న అన్ని విషయాల గురించి నిశ్చయంగా అల్లాహ్ తీర్పు చెబుతాడు. అల్లాహ్ తన సృష్టిలో తాను కోరిన వారిని ఎన్నుకుంటాడు. అల్లాహ్ ఒక్కడు. అందరిపై ఆధిక్యం కలవాడు. ఆయన మీ తల్లుల గర్భాలలో మూడేసి చీకటి తెరలలో మీకు ఒక రూపం తర్వాత మరొక రూపాన్ని ఇస్తున్నాడు. ఆయనే మీ ప్రభువు, సృష్టి సామ్రాజ్యం ఆయనదే. ఆయన తన దాసులు తిరస్కార వైఖరి అవలంభించడాన్ని ఇష్టపడడు. బరువు మోసే వాడెవ్వడూ ఇతరుల బరువును మోయడు. మనిషిపైకి ఎప్పుడైనా ఏదైనా ఆపద వచ్చి పడినప్పుడు అతడు తన ప్రభువు వైపునకు మరలుతాడు. ఆ పిదప ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెడతాడు. జ్ఞానం కలవారు, జ్ఞానం లేనివారు ఒకటే అవుతారా?

రుకూ 2 : ఓ ప్రవక్తా వారికి చెప్పండి, 'విశ్వసించిన దాసులారా! మీ ప్రభువునకు భయపడండి. ఈ లోకంలో మంచి నడవడికలిగి ఉన్నవారికి మేలు జరుగుతుంది' ఇంకా చెప్పండి. 'ధర్మాన్ని అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకించి ఆయనకు మాత్రమే దాస్యం చేయాలని నన్ను ఆజ్ఞాపించడం జరిగింది. అందరికన్నా ముందు స్వయంగా నేను ముస్లిమ్ అయిపోవాలని ఆజ్ఞాపించడం జరిగింది' అని తెలపండి. ప్రళయం నాడు తమనూ, తమ భార్యాపిల్లలనూ నష్టంలో పడవేసుకొన్నవారే అసలైన దివాళకోరులు. నిప్పు గొడుగులు వారిని పైనుంచి, కింది నుంచి క్రమ్ముకుంటాయి. తాగూత్ దాస్యాన్ని మానుకొని అల్లాహ్ వైపునకు మరలేవారికి శుభవార్త ఉన్నది. కనుక ఓ ప్రవక్తా! మాటను శ్రద్ధగా విని, అందులోని మంచి మంచి విషయాలను అనుసరించే నా దాసులకు శుభవార్త అందజెయ్యి. అల్లాహ్ సన్మార్గం చూపినది వీరికే. వారే విజ్ఞత కలవారు. వారి కోసం అంతస్తులపై అంతస్తులు కట్టబడిన ఎత్తయిన భవనాలు ఉన్నాయి. వాటికింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి.

రుకూ 3 : అల్లాహ్ ఎంతో శ్రేష్ఠమైన వచనాన్ని అవతరింపజేశాడు. ఒకే పోలిక గల భాగాలు ఉన్న గ్రంథం ఇది. ఇందులో విషయాలు మాటిమాటికి పునరుక్తమవుతుంటాయి. వాటిని విన్నప్పుడు ప్రభువునకు భయపడేవారి రోమాలు నిక్కబొడుచుకుంటాయి. వారి శరీరాలు, మనస్సులు మెత్తబడి అల్లాహ్ ధ్యానం వైపునకు మొగ్గుతాయి. ఇది అల్లాహ్ మార్గదర్శకత్వం. దీనిద్వారా ఆయన తాను కోరిన వారిని సత్యమార్గంపైకి తీసుకువస్తాడు. ఖుర్‌ఆన్‌లో మేము ప్రజలు స్పృహలోకి రావాలని

ప్రజల కొరకు అనేక నిదర్శనాలు ఇచ్చాము. అరబ్బీ భాషలో ఉన్న ఈ ఖుర్‌ఆన్‌లో ఎలాంటి వక్రతా లేదు. అల్లాహ్ మరో ఉదాహరణ ఇస్తున్నాడు– అనేకమంది సంస్కార హీనులైన యజమానులచేత వారి వారి వైపునకు లాగబడే వ్యక్తి, పూర్తిగా ఒక యజమానికి దాసునిగా ఉన్న వ్యక్తి ఈ ఇద్దరు వ్యక్తుల పరిస్థితి ఒకటే అవుతుందా?

రుకూ 4 : సత్యాన్ని తీసుకువచ్చిన వ్యక్తి, అది సత్యమని అంగీకరించిన ప్రజలు మాత్రమే శిక్షను తప్పించుకుంటారు. వారికి ప్రభువు వద్ద వారు కోరేదంతా లభిస్తుంది. వారు చేసిన తప్పిదాలను అల్లాహ్ వారి లెక్క నుంచి తొలగిస్తాడు. వారు చేసిన మంచి పనులకు ప్రతిఫలం ప్రసాదిస్తాడు. ఈ ప్రజలు అల్లాహ్‌ను గురించికాక ఇతరుల గురించి నిన్ను భయపెడుతున్నారు. వాస్తవానికి అల్లాహ్ దారి తప్పించిన వాడికి దారి చూపేవాడు ఎవడూ లేడు. ఆయన దారి చూపేవాడిని దారి తప్పించగలవాడు కూడా ఎవ్వడూ లేడు. నమ్ముకునేవారు ఆయననే నమ్ముకుంటారు. ఓ ప్రవక్తా! మేము మనుషులందరి కోసం ఈ సత్యగ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. ఇప్పుడు ఎవడు రుజుమార్గాన్ని అవలంభిస్తాడో అతడు తన మేలు కోసమే అలా చేస్తున్నాడు. ఎవడు మార్గం తప్పుతాడో ఆ మార్గం తప్పడమనే కీడుకు అతడే బాధ్యుడు అవుతాడు.

రుకూ 5 : మరణ సమయంలో ఆత్మలను వశపరచుకునేవాడు అల్లాహ్‌యే. ఇంకా మరణించనివారి ఆత్మలను వారు నిద్రావస్థలో ఉన్నప్పుడు అల్లాహ్ వశపరుచుకొంటాడు. ఆయన ఎవరి విషయమై మరణ నిర్ణయం అమలు చేస్తాడో అతడి ఆత్మను ఆపి ఉంచుతాడు. మిగతా వారి ఆత్మలను ఒక నిర్ణీత సమయం వరకు తిరిగి పంపి వేస్తాడు. అటువంటి దేవుణ్ని విడిచి ఇతరులను సిఫారసు చేసేవారిగా భావించారా వాళ్ళు? వారికి చెప్పు. సిఫారసు అనేది పూర్తిగా అల్లాహ్ చేతిలోనే ఉంది. ఒక్క అల్లాహ్ గురించి మాత్రమే ప్రస్తావించడం జరిగినప్పుడు పరలోకం పట్ల విశ్వాసం లేనివారి హృదయాలు బాధపడతాయి. ఆయనను విడిచి ఇతరుల గురించి ప్రస్తావించడం జరిగినప్పుడు వారి ముఖాలు ఒక్కసారిగా సంతోషంతో వెలిగిపోతాయి. ఈ మనిషి తనకు కొంచెం కష్టం కలిగినప్పుడు మాకు మొరపెట్టుకుంటాడు. మేము మా తరఫు నుంచి అతడికి అనుగ్రహాన్ని ప్రసాదించినప్పుడు 'నాకున్న బుద్ధిజ్ఞానాల వల్లనే ఇది లభించింది' అని అంటాడు.

రుకూ 6 : ఓప్రవక్తా! వారికి చెప్పండి– 'ఆత్మలకు అన్యాయం చేసుకొన్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని

పాపాలను క్షమిస్తాడు. మీ మీదకు శిక్ష రాకముందే, మీకు ఎవరి నుంచీ సహాయం లభించని పరిస్థితి ఏర్పడకముందే మీరు మీ ప్రభువు వైపునకు మరలి ఆయనకు విధేయత చూపండి. మీకు తెలియకుండా మీ మీదకు అకస్మాత్తుగా శిక్ష రాక ముందే మీ ప్రభువు పంపిన గ్రంథంలోని ఉత్తమ బోధనలు అనుసరించండి. అల్లాహ్‌కు అసత్యాన్ని ఆపాదించిన వారి ముఖాలు ప్రళయం నాడు నల్లగా మారిపోవడాన్ని నీవు చూస్తావు. నరకంలో అహంకారులకు చాలినంత స్థలం లేదా ఏమిటి? ఇందుకు భిన్నంగా ఇక్కడ అల్లాహ్‌కు భయపడినవారికి ఏ కష్టమూ కలుగదు. వారికి ఎలాంటి విచారమూ ఉండదు.

రుకూ 7 : ప్రవక్తా! కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు. కృతజ్ఞులై ఉండే దాసులలో చేరిపో. ఈ ప్రజలు అల్లాహ్‌ను ఏవిధంగా గౌరవించాలో ఆవిధంగా గౌరవించలేదు. ప్రళయం నాడు యావత్తు భూ మండలం ఆయన పిడికిట ఉంటుంది. ఆకాశాలు ఆయన కుడిచేతికి చుట్టబడి ఉంటాయి. ఆరోజు శంఖం ఊదబడుతుంది. ఆకాశాలలో, భూమిపై ఉన్న వారందరూ చచ్చిపడిపోతారు. తరువాత రెండోసారి శంఖం ఊదబడుతుంది. అప్పుడు ఒక్కసారిగా అందరూ లేచి చూడడం ప్రారంభిస్తారు. కర్మల చిట్టా తీసుకురాబడుతుంది. దైవప్రవక్తలు, సాక్షులు అందరూ హాజరు పరచబడతారు. ప్రజలకు సరిగ్గా, న్యాయంగా తీర్పు చేయబడుతుంది.

రుకూ 8 : సత్యాన్ని తిరస్కరించిన ప్రజలను నరకం వైపు గుంపులుగా తోలడం జరుగుతుంది. వారు చివరకు అక్కడకు చేరినప్పుడు నరకం కావలివారు వారితో 'మీకు మీ ప్రభువు వాక్యాలు వినిపించి, ఎప్పటికైనా ఈ రోజును చూడవలసి వస్తుందని మిమ్మల్ని హెచ్చరించే ప్రవక్తలు స్వయంగా మీలో నుంచే అవతరించలేదా?' అని అంటారు. దానికి జవాబుగా వారు 'అవును, వచ్చారు కాని అవిశ్వాసుల విషయంలో శిక్ష నిర్ణయమైపోయింది' అని అంటారు. అప్పుడు వారిని 'అయితే నరకద్వారాలలో ప్రవేశించండి. ఇక్కడ మీరు శాశ్వతంగా ఉండవలసి ఉంది. ఇది అహంకారుల నివాసం. చాలా చెడ్డ నివాసం' అని చెప్పడం జరుగుతుంది. తమ ప్రభువు పట్ల అవిధేయతకు దూరంగా ఉన్నవారిని బృందాలుగా స్వర్గం వైపునకు తీసుకుపోవడం జరుగుతుంది. స్వర్గ నిర్వాహకులు ఈ ప్రజలతో 'మీకు శాంతి కలుగుగాక! మీరు చక్కగా ప్రవర్తించారు. ప్రవేశించండి ఇందులోకి– శాశ్వతంగా ఉండడానికి' అని అంటారు. మాకు చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన, మమ్మల్ని భూమికి వారసులుగా చేసిన దేవునికి కృతజ్ఞతలు' అని జవాబిస్తారు వారు.

40. అల్ మూ'మిన్

రుకూ 1 : అల్లాహ్ తరఫు నుంచి అవతరించిన గ్రంథం ఇది. ఆయన అపారశక్తిశాలి. మహాజ్ఞాని. పాపాలను క్షమించేవాడు. పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు. కఠినంగా శిక్షించేవాడు కూడా. ఘనంగా కరుణించేవాడు. ఆయన తప్ప ఆరాధ్య దైవం మరెవ్వడూ లేడు. అందరూ ఆయన వైపునకే మరలిపోవలసి ఉంది. కనుక ప్రపంచ దేశాలలో ప్రజలు ఆడంబరంగా తిరగడాన్ని చూసి మీరు మోసపోరాదు. వారికి పూర్వం ఎందరో ప్రజలు ఇలానే చేశారు. అసత్యమనే ఆయుధంతో సత్యాన్ని ఓడించడానికి ప్రయత్నం చేశారు. కాని చివరకు మేము వారిని పట్టుకొన్నాము. దైవ సింహాసనాన్ని మోసే దైవదూతలు, ఆ సింహాసనం చుట్టూ ఉండే దైవదూతలు అందరూ తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పవిత్రతను కొనియాడుతున్నారు. విశ్వసించిన వారి కోసం మన్నింపుకై ప్రార్థిస్తున్నారు. 'ప్రభూ! నీవు నీ కారుణ్యంతో నీ జ్ఞానంతో ప్రతి వస్తువుపై ఆవరించి ఉన్నావు కనుక పశ్చాత్తాపంతో నీ వైపునకు మరలినవారిని, నీ మార్గాన్ని అనుసరించేవారిని క్షమించు, వారిని నరక యాతన నుంచి రక్షించు. ప్రభూ! వారి తల్లిదండ్రులలో, వారి భార్యలలో వారి సంతానంలో సజ్జనులయిన వారిని కూడా వారితోపాటు అక్కడకు చేర్చు' అని ప్రార్థిస్తున్నారు.

రుకూ 2 : అవిశ్వాసానికి పాల్పడిన వారిని ప్రళయం నాడు పిలిచి 'నేడు మీకు స్వయంగా మీ మీద ఎంత కోపంగా ఉందో, మిమ్మల్ని విశ్వాసం వైపునకు పిలిచి నప్పుడు మీరు నిరాకరించిన ఆనాడు అల్లాహ్‌కు మీ పట్ల అంతకన్నా ఎక్కువ కోపం వచ్చింది' అనడం జరుగుతంది. అప్పుడు వారు 'ప్రభూ! ఇప్పుడు మేము మా తప్పులను ఒప్పుకొంటున్నాము. కనుక ఇక్కడ నుంచి బయటపడే మార్గం ఏదైనా ఉందా?' అని అడుగుతారు. జవాబుగా 'మీ ఈ దుస్థితికి కారణం– ఒకేఒక్క దేవుడు అల్లాహ్ వైపునకు పిలిచినప్పుడు మీరు విశ్వసించకుండా తిరస్కరించడమే' అని చెప్పబడుతుంది. కనుక అల్లాహ్ వైపునకు మరలే ప్రజలారా! అల్లాహ్‌ను మాత్రమే వేడుకోండి. మీ ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకం చేసుకోండి. ప్రళయం నాడు దుర్మార్గులకు ఆప్తమిత్రుడు కాని చెల్లుబడి అయ్యే సిఫారసు చేయగలవాడు కాని ఎవ్వడూ ఉండడు. అల్లాహ్ ఖచ్చితంగా, న్యాయంగా తీర్పు చేస్తాడు.

రుకూ 3 : వీరికి పూర్వం గతించిన ప్రజలు వీరికంటే అత్యంత బలసంపన్నులు. వీరిని

మించి గొప్ప గుర్తులను భూమిపై వదిలి వెళ్ళారు. కాని, అల్లాహ్ వారి పాపాలకుగాను వారిని పట్టుకొన్నాడు. అల్లాహ్ పట్టు నుండి వారిని రక్షించేవాడెవడూ లేకపోయాడు. మూసాను విశ్వసించిన ప్రజల పురుష సంతానాన్ని చంపండి. వారి కూతుళ్ళను వదిలిపెట్టండి అని ఫిరౌన్ ఆదేశించాడు. ఒకరోజు ఫిరౌన్ తన దర్బారులోని వారితో 'మూసా మన మతాన్ని మార్చివేస్తాడని, లేదా దేశంలో సంక్షోభం పుట్టిస్తాడని నేను భయపడుతున్నాను. నన్ను వదలండి. నేను ఈ మూసాను చంపివేస్తాను' అన్నాడు.

రుకూ 4 : అప్పుడు తన విశ్వాసాన్ని రహస్యంగా దాచి ఉంచిన ఫిరౌన్‌జాతికి చెందిన ఒక విశ్వాసి మాట్లాడుతూ, ఒక వ్యక్తి 'నా ప్రభువు అల్లాహ్' అని అన్నంత మాత్రాన మీరు అతన్ని చంపేస్తారా? వాస్తవానికి అతను మీ ప్రభువు వద్ద నుంచి మీ వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకువచ్చాడు. నా జాతి ప్రజలారా! మీకు ఈనాడు రాజ్యాధికారం ఉంది. భూమిపై మీకు ప్రాబల్యం ఉంది. కాని దైవశిక్ష ఒకవేళ మనపైకి వచ్చిపడితే అప్పుడు మనకు సహాయం చేయగలవాడు ఎవడైనా ఉన్నాడా?' అని చెప్పాడు. ఇంకా మాట్లాడుతూ ఆ వ్యక్తి 'నూహ్ జాతి, ఆద్ జాతి, సమూద్ జాతులకు దాపురించిన దుర్దినం మీపై కూడా వస్తుందని నేను భయపడుతున్నాను. నా జాతి ప్రజలారా! మీరు రోదించే రోజు వస్తుందేమో అని నేను భయపడుతున్నాను. అప్పుడు మీరు ఒకరినొకరు పిలుచుకొంటూ, పరుగెత్తుతూ ఉంటారు. కాని, అప్పుడు అల్లాహ్ నుంచి మిమ్మల్ని రక్షించే వాడెవ్వడూ ఉండడు. మీరు అల్లాహ్ ఆయత్‌లతో విభేదిస్తున్నారు' అని చెప్పాడు. ఫిరౌన్ 'హామాన్... నేను మూసా దేవుణ్ణి తొంగిచూడ డానికి నా కోసం ఒక ఎత్తైన సౌధాన్ని నిర్మించు' అన్నాడు.

రుకూ 5 : విశ్వసించిన ఆ వ్యక్తి ఇంకా మాట్లాడుతూ, నా జాతి ప్రజలారా! ఈ ప్రాపంచిక జీవితం తాత్కాలికం. శాశ్వత నివాస స్థలం పరలోకమే. చెడు చేసిన వాడికి అక్కడ అతడు చేసినంత చెడుకు ఫలితం లభిస్తుంది. మంచి పనులు చేసిన స్త్రీ పురుషులు వారు విశ్వాసులయితే వారందరూ స్వర్గంలో ప్రవేశిస్తారు. నా జాతి ప్రజలారా! ఇదేం వైపరీత్యం? నేను మిమ్మల్ని సాఫల్యం వైపునకు ఆహ్వానిస్తుంటే మీరు నన్ను అగ్ని వైపునకు పిలుపుస్తున్నారు. నేను అల్లాహ్‌ను తిరస్కరించాలని, నాకు తెలియలని శక్తులను అల్లాహ్‌కు సహవర్తులుగా నిలబెట్టాలని పిలుపు ఇస్తున్నారు. నిజానికి నేను మిమ్మల్ని సర్వశక్తి సంపన్నుడు, క్షమాశీలుడు అయిన అల్లాహ్ వైపునకు పిలుస్తున్నాను. మనం అందరం అల్లాహ్ వద్దకే మరలిపోవలసి ఉంది. హద్దులు మీరే వారు అగ్నిలోకి

పోతారు' అని చెప్పాడు. అయితే విశ్వసించిన ఆ వ్యక్తికి వ్యతిరేకంగా వారు పన్నిన కుయుక్తుల నుంచి అల్లాహ్ అతడిని రక్షించాడు. ఫిరౌన్ అనుచరులు ఒక భయం కరమైన శిక్షలో చిక్కుకొన్నారు. వారు ఉదయం, సాయంత్రం నరకాగ్ని ముందు ఉంచబడుతూ ఉంటారు. అగ్నిలో పడివున్నవారు నరకభటులతో 'మా శిక్ష నుంచి కనీసం ఒక్క రోజయినా తగ్గించమని మీ ప్రభువును మీరు ప్రార్థించండి' అని అర్థిస్తారు. అందుకు జవాబుగా భటులు 'మీరే ప్రార్థించండి. సత్య తిరస్కారుల ప్రార్థన నిరర్థకమే అవుతుంది' అంటారు.

రుకూ 6 : మా ప్రవక్తలకూ, విశ్వాసులకు నిశ్చయంగా మేము ఇహలోకంలోనూ తప్పక సహాయం చేస్తాం, సాక్షులు నిలబడే రోజున కూడా సహాయం చేస్తాము. కనుక ఓ ప్రవక్తా! సహనం వహించు. అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. నీ తప్పులకు క్షమాభిక్ష వేడుకో. ఉదయం, సాయంత్రం నీ ప్రభువును స్తుతిస్తూ ఆయన పరిశుద్ధతను కొనియాడు. అల్లాహ్ వాక్యాల విషయంలో వాదులాడే వారి మనస్సులు అహంకారంతో నిండి ఉన్నాయి. కళ్ళు లేనివాడు, కళ్ళు ఉన్నవాడు సమానం కావడం జరగదు. విశ్వసించి సత్కార్యాలు చేసేవారు, దుర్మార్గులయిన వారు ఒకలాంటి వారు కాదు. నీ ప్రభువు ఇలా తెలిపాడు- 'నన్ను ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనయి నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పనిసరిగా అవమానానికి, పరాభవానికి గురై నరకంలోకి ప్రవేశిస్తారు'

రుకూ 7 : మీకు భూమిని నివాస స్థలంగా చేసినవాడు, పైన ఆకాశం కప్పును నిర్మించినవాడు, మీ రూపాన్ని తీర్చిదిద్ది, ఎంతో చక్కగా మలచినవాడు, మీకు పరిశు భ్రమైన పదార్థాలు తినడానికి ఇచ్చినవాడు అల్లాహ్‌యే. ఆ విశ్వప్రభువు అసంఖ్యాక శుభాలు కలవాడు. ఆయనే సజీవుడు. ఆయన తప్ప ఆరాధ్యదైవం ఎవడూ లేడు. ఆయననే వేడుకోండి. మీ ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకం చేసుకోండి. మిమ్మల్ని మట్టితో సృష్టించింది ఆయనే. ఆ పిదప రేతస్సుతో, తరువాత నెత్తురు ముద్దతో ఆ తర్వాత ఆయనే మిమ్మల్ని శిశువు రూపంలో బయటకు తీసుకు వస్తాడు. మీరు పూర్తి బలం పుంజుకునే వరకు మిమ్మల్ని పోషిస్తాడు. ఆ పిదప మీరు వృద్ధులయ్యే వరకు మిమ్మల్ని పెంచుతాడు. మీలో కొందరు ముందే పిలువబడతారు. మీరు మీ నిర్ణీత వ్యవధికి చేరుకోవడానికి ఇదంతా జరుగుతుంది.

రుకూ 8 : అల్లాహ్ వాక్యాలను తిరస్కరించేవారు నరకాగ్నిలోకి నెట్టబడతారు. వారి ఈ ముగింపుకు కారణం వారు భూమిపై అసత్యాన్ని అనుసరించి ఆనందించడం. దానికి గర్వపడడం. కనుక ప్రవక్తా! సహనం వహించు. అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. ఓ ప్రవక్తా! నీకు పూర్వం మేము ఎంతోమంది ప్రవక్తలను పంపాము. వారిలో కొందరి గురించి మేము నీకు తెలిపాము. కొందరి గురించి తెలుపలేదు. అల్లాహ్ అనుమతి లేకుండా ఏ నిదర్శనాన్నయినా స్వయంగా తెచ్చే శక్తి ఏ ప్రవక్తకూ లేదు. అల్లాహ్‌యే మీ కొరకు ఈ పశువులను సృష్టించాడు. వాటిలో కొన్నింటిపై మీరు స్వారీ చేస్తారు. కొన్నిటి మాంసం తింటారు. వాటివల్ల మీకు ఇంకా ఎన్నో లాభాలు ఉన్నాయి. పడవలపై మీరు ప్రయాణాలు చేస్తారు. మీరు అల్లాహ్‌కు సంబంధించిన ఏఏ సూచనలు తిరస్కరించగలరు? పూర్వం గతించిన ప్రజలు సంఖ్యాపరంగా వీరికంటే అధికులు. వారికంటే అత్యధిక బలవంతులు. భూమిపై వీరిని మించి మహోజ్వలమైన గుర్తులు వదిలివెళ్ళారు. కాని ప్రవక్తలను తిరస్కరించి మా శిక్షను చవిచూశారు. అప్పుడు 'భాగస్వాములు లేని ఒకే ఒక్కడు అయిన అల్లాహ్‌ను విశ్వసించామ' అన్నారు. కాని మా శిక్షను చూసిన తర్వాత వారు విశ్వసించడం వారికి ఏ మాత్రం లాభదాయకం కాదు.

41. హామీమ్ అస్‌సజ్దహ్

రుకూ 1 : కరుణామయుడు, కృపాశీలుడు అయిన దేవుని తరఫు నుంచి అవతరింపజేయబడిన గ్రంథం ఇది. స్పష్టంగా విశదీకరించబడిన వాక్యాలు గల గ్రంథం. అరబ్బీ భాషలో ఉన్న ఈ ఖుర్‌ఆన్ జ్ఞానం కలవారికి శుభవార్త ఇచ్చేది, భయపెట్టేదీనూ. కాని ప్రజలలో చాలామంది దాని పట్ల వైముఖ్యం చూపారు. ప్రవక్తా! వారికి చెప్పు 'నేను కూడా మీలాంటి ఒక మనిషినే. వహీ ద్వారా నాకు తెలుపబడుతోంది. మీ దేవుడు కేవలం ఒకే ఒక దేవుడు మాత్రమే. కనుక మీరు నేరుగా ఆయన వైపునకే మరలండి. క్షమాభిక్ష ఆయన్నే వేడుకోండి. విశ్వసించి మంచి పనులు చేసిన వారికి నిశ్చయంగా శాశ్వత ప్రతిఫలం లభిస్తుంది.

రుకూ 2 : అల్లాహ్ భూమిని రెండు రోజులలో సృష్టించాడు. దానిపై పర్వతాలను అమర్చాడు. అర్థించే వారికి, వారి కోరికలు, అవసరాలకు అనుగుణంగా ఖచ్చితంగా అంచనా వేసిన ఆహార సామాగ్రిని భూమిపై సమకూర్చాడు. ఈ పనులన్నీ నాలుగు

రోజులలో పూర్తయ్యాయి. తరువాత కేవలం పొగగా ఉన్న ఆకాశం వైపునకు తన ధ్యానాన్ని మరల్చి ఆకాశాన్ని, భూమిని ఉద్దేశించి 'ఉనికిలోకి రండి' అని ఆజ్ఞాపించాడు. అవి 'మేము వచ్చేశాము విధేయుల మాదిరిగా' అన్నాయి. అప్పుడు ఆయన రెండు రోజులలో ఏడు ఆకాశాలను నిర్మించాడు. ప్రతి ఆకాశంలోనూ దాని చట్టాన్ని వహీ ద్వారా నిర్దేశించాడు. ఆద్ జాతి 'మాకంటే అధిక బల సంపన్నులెవరూ?' అని అనుకొంది. వారు మా వాక్యాలను తిరస్కరిస్తూ పోయారు. చివరకు మేము వారికి ఈ లోకంలోనే అవమానకరమైన శిక్షను రుచి చూపించాము. పరలోక శిక్ష దీనికన్నా ఎంతో అవమానకరమైనది. సమూద్ జాతి సత్యమార్గాన్ని చూడడానికి బదులు, అంధులుగా ఉండడానికే ఇష్టపడ్డారు. అవమానకరమైన శిక్ష వారిపై విరుచుకుపడింది.

రుకూ 3 : ఈ అల్లాహ్ శత్రువులు నరకానికి చేరినప్పుడు వారి చెవులు వారి కళ్ళు, వారి శరీర చర్మాలు, వారు ప్రపంచంలో చేస్తూ ఉన్నదాని గురించి సాక్ష్యం చెబుతాయి. అప్పుడు వారు తమ శరీర, చర్మాలను 'మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యం చెప్పారని' అడుగుతారు. అప్పుడు అవి సమాధానమిస్తూ 'ప్రతి వస్తువుకూ మాట్లాడే శక్తిని ఇచ్చిన దేవుడే మాకూ మాట్లాడే శక్తిని ప్రసాదించాడు. ప్రపంచంలో మీరు రహస్యంగా నేరాలు చేస్తున్నప్పుడు, స్వయానా మీ కళ్ళూ చెవులు మీ శరీర చర్మాలు మీకు వ్యతిరేకంగా సాక్షమిస్తాయన్న ఆలోచన మీకు ఉండేది కాదు. అదే మిమ్మల్ని నట్టేట ముంచింది' అని అంటాయి. మేము ప్రపంచంలో వారికి సహచరులుగా ఎలాంటి వారిని తగిలించామంటే, వారికి ముందూ వెనుక ఉన్న ప్రతి వస్తువునూ ఆకర్షకంగా మలచి చూపించేవారు వాళ్ళు.

రుకూ 4 : ఈ సత్యతిరస్కారులు ప్రజలతో 'ఈ ఖుర్ఆన్‌ను అసలు వినకండి. అది వినిపించబడుతున్నప్పుడు దానికి ఆటంకాలు కలిగించండి. బహుశ ఈ విధంగా ప్రాబల్యం పొందవచ్చు' అని చెబుతారు. ఈ అవిశ్వాసులకు మేము కఠినశిక్ష రుచి చూపిస్తాం. అక్కడ ఈ అవిశ్వాసులు 'ప్రభూ! మమ్మల్ని మార్గభ్రష్టులు చేసిన జిన్నాతులనూ, మానవులనూ కొంచెం మాకు చూపించు. మేము వారిని మా కాళ్ళకింద వేసి తొక్కుతాము' అంటారు. అల్లాహ్‌యే మా ప్రభువు అని పలికి ఆ మాటపై స్థిరంగా ఉన్నవారి వద్దకు నిశ్చయంగా దైవదూతలు అవతరిస్తారు. 'భయపడకండి. బాధపడకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్త విని ఆనందించండి' అంటారు.

రుకూ 5 : అల్లాహ్ వైపునకు పిలిచి, మంచిపనులు చేసి, నేను ముస్లిమ్‌ను అని ప్రకటించే మనిషి మాటకంటే మంచి మాట మరెవరిది కాగలదు! చెడును ఉత్తమమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు కూడా నీకు ప్రాణ స్నేహితుడయిపోవడాన్ని నీవు చూస్తావు. ఈ సుగుణం సహనశీలురకు తప్ప మరెవరికీ లభించదు. ఒకవేళ నీకు షైతాను నుంచి ఏదయినా దుష్ప్రేరణ కలిగితే అప్పుడు అల్లాహ్‌ను శరణువేడుకో. మా వాక్యాలకు పెడర్థాలు అంటగట్టే వారిని మేము చూస్తూనే ఉన్నాము. స్వయంగా మీరే ఆలోచించండి. అగ్నిలో పడవేయబడేవాడు మెరుగైన వాడా? లేక ప్రళయం నాడు సురక్షితంగా హాజరయ్యేవాడు మెరుగైనవాడా? ఇది ఒక శక్తిమంతమైన గ్రంథం. అసత్యం దీనిపైకి ముందు నుండి గాని, వెనుక నుంచి గాని రాలేదు. ఈ ఖుర్ఆన్ విశ్వాసులకు మార్గం చూపేది. స్వస్థత చేకూర్చేది. కాని విశ్వసించని వారికి ఇది చెవులకు అవరోధం. కళ్ళకు గంత.

రుకూ 6 : మంచి పని చేసేవాడు తనకు తాను మేలు చేసుకొంటాడు. చెడ్డ పని చేసే వాడు దాని దుష్ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. నీ ప్రభువు తన దాసులకు అన్యాయం చేసేవాడు కాదు. మనిషి మేలు కోసం ప్రార్థిస్తూ ఎన్నడూ అలసిపోడు. ఏదైనా ఆపద కలిగినప్పుడు నిరాశ నిస్పృహలకు లోనై గుండె పగిలినవాడవుతాడు. కాని కష్టకాలం తీరిపోయాక, మేము మా కారుణ్యాన్ని రుచి చూపితే 'అసలు నేను దీనికి అర్హుణ్ణే. ప్రళయం వస్తుందని నేను అనుకోను. ఒకవేళ నిజంగా నేను నా ప్రభువు వద్దకు వెళ్ళవలసి వస్తే అక్కడ కూడా సుఖాలే అనుభవిస్తాను' అని అంటాడు. మనిషికి మేము కానుకలు ప్రసాదించినప్పుడు విర్రవీగుతాడు. ఏదైనా ఆపద కలిగినప్పుడు సుదీర్ఘమైన ప్రార్థనలు చేస్తాడు. ఈ ఖుర్ఆన్‌ను తిరస్కరించినవానికంటే మించిన మార్గభ్రష్టు డెవడు?

42. అష్ షూరా

రుకూ 1 : దైవదూతలు తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పవిత్రతను స్తోత్రం చేస్తూ ఉన్నారు. భూలోక వాసులను మన్నించమని విన్నపాలు చేస్తున్నారు. ప్రవక్తా! ఈ అరబ్బీ ఖుర్ఆన్‌ను మేము వహీ ద్వారా నీ వైపునకు పంపాము. నీవు పట్టణాల కేంద్రం మక్కా నగరంలో, దాని పరిసరాలలో ఉండే ప్రజలను హెచ్చరించాలని, సమావేశ దినం గురించి వారిని భయపెట్టాలని దీన్ని నీ వైపునకు పంపాము. ఒక వర్గం వారు స్వర్గానికి

పోతారు. మరొక వర్గం వారు నరకానికి పోతారు. వారు అల్లాహ్‌ను కాదని ఇతరులను సంరక్షులుగా చేసుకొన్నారు. సంరక్షకుడు ఒక్క అల్లాహ్ మాత్రమే. ఆయనే మృతులను బ్రతికిస్తాడు. ఆయన ప్రతిదానిపై అధికారం కలవాడు.

రుకూ 2 : ఆయనను పోలినది సృష్టిలో ఏదీ లేదు. ఆయన అన్నీ వినేవాడు. అన్నీ చూసేవాడు. భూమ్యాకాశాలలోని నిక్షేపాల తాళం చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. తాను కోరిన వారికి ఆయన పుష్కలంగా ఉపాధి ప్రసాదిస్తాడు. తాను కోరిన వారికి ఆయన ఆచితూచి ఉపాధి ఇస్తాడు. ప్రజల వద్దకు జ్ఞానం వచ్చిన తరువాతనే వారిలో విభేదం తలెత్తింది. వారు ఒండొరులకు అన్యాయం చేయదలచుకొన్న కారణంగానే తలెత్తింది. యధార్థం ఏమిటంటే, వారి తరువాత గ్రంథానికి వారసులుగా చేయబడినవారు దీని గురించి ఆందోళనాకరమైన సంశయానికి గురయ్యారు. సత్యం గల ఈ గ్రంథాన్ని, త్రాసును అల్లాహ్ అవతరింపజేశాడు. బహుశా తీర్పు ఘడియ దగ్గరలోనే ఉందేమో! మీకేం తెలుసు. దీనిని విశ్వసించేవారు మాత్రం దీనికి భయపడతారు. ఆ ఘడియ తప్పక వస్తుందని వారికి తెలుసు.

రుకూ 3 : పరలోకపు పంటను ఎవరు కోరుకుంటాడో, మేము అతని కోసం ఆ పంటను వృద్ధి చేస్తాము. ఇహలోకపు పంటను ఎవడు కోరుకుంటాడో వాడికి మేము ఇహలోకం లోనిది మాత్రమే ఇస్తాము. అతనికి పరలోకంలో మాత్రం వాటా ఉండదు. ప్రళయం నాడు ఈ దుర్మార్గులు తాము చేసిందానికి భయపడుతూ ఉంటారు. కానీ, దీనికి భిన్నంగా విశ్వసించి సత్కార్యాలు చేసినవారు స్వర్గ వనాలలో ఉంటారు. అల్లాహ్ అసత్యాన్ని రూపుమాపుతాడు. సత్యాన్ని తన వాక్యాల ద్వారా సత్యంగా నిరూపిస్తాడు. తన దాసుల పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తాడు. వారి చెడుల పట్ల చూపోవు వహిస్తాడు. విశ్వసించి మంచి పనులు చేసేవారి ప్రార్థనలు వింటాడు. వారిపై ఇంకా ఎక్కువ కరుణిస్తాడు. అల్లాహ్ గనక ఒకవేళ తన దాసులందరికీ పుష్కలంగా ఉపాధి ఇచ్చి ఉన్నట్లయితే వారు భూమిపై తిరుగుబాటు తుఫాను రేపి ఉండేవారు.

రుకూ 4 : మీ చేజేతుల చేసుకున్న దాని ఫలితంగానే మీపై ఈ ఆపద వచ్చింది. చాలా పొరబాట్లను అల్లాహ్ మన్నిస్తాడు. అనేక పాపాలను క్షమించినప్పటికీ కొన్ని అకృత్యాల ఫలితంగా ఆయన వారిని ముంచి వేయవచ్చు. మీకు ఇవ్వబడింది అంతా కేవలం కొన్ని రోజుల ప్రాపంచిక జీవన సామాగ్రి మాత్రమే. అల్లాహ్ వద్ద ఉన్నది అత్యుత్తమ

మైనది. శాశ్వతమైనది కూడా. విశ్వసించి తమ ప్రభువును నమ్ముకొన్న వారి కోసమే అదంతా ఉంది. పెద్దపెద్ద పాపాలకు, సిగ్గుమాలిన పనులకు దూరంగా ఉండేవారి కోసం, కోపం వచ్చినప్పుడు కూడా క్షమాగుణం చూపేవారి కోసం, ప్రభువు ఆజ్ఞను పాలించేవారి కోసం, నమాజ్‌ను స్థాపించేవారి కోసం, తమ వ్యవహారాలను పరస్పర సంప్రదింపుల ద్వారా చక్కబరచుకొనేవారి కోసం, మేము ఇచ్చిన ఉపాధి నుంచి దైవమార్గాన ఖర్చు చేసేవారి కోసం, తమపై దౌర్జన్యం జరిగినప్పుడు దానిని ఎదుర్కొనే వారి కోసం అల్లాహ్ వద్ద ఈ శాశ్వత ప్రతిఫలం ఉంది. తమకు అపకారం జరిగి నప్పుడు ఎవరైనా దానికి ప్రతీకారం చేస్తే వారిని నిందించడానికి వీలులేదు.

రుకూ 5 : జాగ్రత్త! దుర్మార్గులు శాశ్వత నరకశిక్షకు గురవుతారు. అల్లాహ్‌కు వ్యతిరేకంగా వారి సహాయానికి వచ్చే సంరక్షకులుగాని, సహాయకులుగాని ఎవ్వరూ ఉండరు. తొలగించబడే అవకాశం ఏమాత్రం లేనటువంటి ఆరోజు అల్లాహ్ తరఫు నుంచి రాకముందే మీరు మీ ప్రభువు మాట స్వీకరించండి. భూమ్యాకాశాల సామ్రాజ్యా నికి అల్లాహ్ ప్రభువు. ఆయన తాను కోరిన దానిని సృష్టిస్తాడు. తాను కోరిన వారికి కూతుళ్ళను, తాను తలచిన వారికి కొడుకులను ఇస్తాడు. తనకు తోచిన వారికి కొడుకు లను, కూతుళ్ళను కలిపి ఇస్తాడు. కొందరికి అసలు సంతానమే ఇవ్వడు. ఆయనకు అంతా తెలుసు. అన్నిటిపైనా ఆయనకు అధికారం ఉంది. అల్లాహ్‌తో ముఖాముఖి మాట్లాడగలిగే స్థాయి మనిషికి లేదు. ఆయన మాట్లాడడం అన్నది 'వహీ' ద్వారా గాని లేదా ఆయన దైవదూతను పంపడం ద్వారా గాని జరుగుతుంది. ప్రవక్తా! మేము మా ఆజ్ఞ ద్వారా నీ వైపునకు 'వహీ' పంపాము. గ్రంథం అంటే ఏమిటో, విశ్వాసం అంటే ఏమిటో మునుపు నీవు ఎరుగవు.

43. అజ్ జుఖ్రుఫ్

రుకూ 1 : మీరు అర్థం చేసుకోవాలని మేము దీనిని అరబ్బీ భాషలో ఖుర్ఆన్‌గా చేశాము. మీరు హద్దులు మీరిపోయినందువల్ల మేము మీతో విసిగిపోయి ఈ హితబోధను మీ వద్దకు పంపడం మానేయ్యాలా? భూమిని ఆకాశాలను అల్లాహ్‌యే సృష్టించాడు. మీ కొరకు ఈ భూమిని ఊయలగా చేసినవాడు, మీరు మీ గమ్యస్థానాలు చేరే మార్గం పొందడానికి భూమిపై రహదారులు ఏర్పరిచినవాడు, ఆకాశం నుంచి

ఒక ప్రత్యేక పరిమాణంతో నీటిని దించినవాడు, జంటలన్నింటిని పుట్టించినవాడు, మీ కోసం పడవలను, పశువులను వాహనాలుగా చేసినవాడు ఆయనే. మీరు వాటిపై కూర్చున్నప్పుడు ప్రభువు ఉపకారం జ్ఞప్తి చేసుకొని 'వీటిని మాకు వశపరిచినవాడు పవిత్రమైనవాడు. వీటిని వశం చేసుకొనే శక్తి మాకయితే లేదు. ఓ రోజున మేమూ ప్రభువు వైపునకు మరలిపోవలసి ఉన్నది' అని పలకండి.

రుకూ 2 : వారిలో ఎవడికన్నా కూతురు పుట్టిందన్న వార్త అందజేస్తే అతడి ముఖం నల్లబడిపోతుంది. దు:ఖంలో మునిగిపోతాడు. కరుణామయుడైన దేవునికి ప్రత్యేక దాసులయిన దైవదూతలను వారు స్త్రీలుగా నిర్ణయించారు. వారి శరీర నిర్మాణాన్ని వీళ్ళు చూశారా! 'మేము మా తాతముత్తాతలు నడిచిన మార్గాన్ని చూశాము. వారి అడుగుజాడల్లోనే నడుస్తాం' అని వారు అంటారు. సరైన, ఉత్తమమైన మార్గాన్ని మేము చూపినప్పటికీ వారు తిరస్కరించారు.

రుకూ 3 : ఇబ్రాహీం తన తండ్రితో, తన జాతివారితో 'మీరు పూజిస్తున్నవాటికి, నాకు ఏ సంబంధంలేదు. నన్ను సృష్టించిన వానితో మాత్రమే నా సంబంధం. ఆయనే నాకు మార్గం చూపుతాడు' అని చెప్పిన విషయం జ్ఞాపకం చేసుకోండి. 'రెండు నగరాలలోని పెద్ద మనుషులలో ఏ పెద్ద మనిషిపై కూడా ఈ ఖుర్‌ఆన్ ఎందుకు అవతరించలేదు?' అంటారు వీళ్ళు. ఈ ప్రపంచ జీవితంలో వారి బ్రతుకు తెరువును మేమే వారికి ఇచ్చాము. వారిలో కొందరికి ఇతరులపై అంతస్తుల వారీగా ఆధిక్యం ఇచ్చాము. ఒండొరుల సేవలు వారు పొందాలని అలా చేశాము. నీ ప్రభువు ఇచ్చిన ఈ ప్రవక్త పదవి వారు సమీకరించుకొన్న సంపద కంటే ఎంతో విలువైనది.

రుకూ 4 : కరుణామయుడైన అల్లాహ్ ధ్యానాన్ని నిర్లక్ష్యం చేసే వ్యక్తిపై మేము ఒక షైతాన్‌ను నియమిస్తాము. వాడు అతనికి సహచరుడు అవుతాడు. ఇలాంటి వారు రుజుమార్గానికి రాకుండా ఈ షైతానులు ఆపుతారు. సక్రమ మార్గంపైనే ఉన్నాం అని వారు అనుకొంటారు. కాని, చివరకు అలాంటి వారు మా వద్దకు వచ్చినప్పుడు తన వెంట ఉన్న షైతాన్‌తో 'నీకు నాకు మధ్య తూర్పు పడమరల మధ్య ఉన్నంత దూరం ఉంటే ఎంత బాగుండేది. నువ్వు అతి చెడ్డ మిత్రునిగా నిరూపించుకున్నావు' అంటాడు. ప్రవక్తా! వహీ ద్వారా నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని గట్టిగా పట్టుకో, నిశ్చయంగా నీవు రుజుమార్గాన ఉన్నావు. మేము కరుణామయుడైన అల్లాహ్‌ను తప్ప ఇతర

దైవాలను ఆరాధనకు నిర్ణయించామా? నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలను అడిగి చూడు.

రుకూ 5 : మేము మూసాకు మా సూచనలు ఇచ్చి, ఫిరౌన్ వద్దకు అతని ప్రభుత్వాధికారుల వద్దకు పంపాము. మేము వారికి అనేక నిదర్శనాలు, ఒకదాని మించినది మరొకటి చూపాము. శిక్షకు గురి అయినప్పుడల్లా వారు మూసాతో 'నీ ప్రభువు తరఫు నుంచి నీకు లభించిన పదవి ఆధారంగా మా కోసం ఆయన్ను ప్రార్థించు. మేము తప్పక సన్మార్గాన నడుస్తాం' అనేవారు. కాని వారిపై నుంచి మేము శిక్షను తొలగించగానే వారి ఆడినమాట తప్పేవారు. ఒకరోజు ఫిరౌన్ తన జాతి ప్రజల ముందు 'నేను శ్రేష్ఠుడినా లేక నీచుడు, అల్పుడు, తన మాట స్పష్టంగా వివరించలేని ఇతడా?' అని ప్రశ్నించాడు. చివరకు, వారు మాకు ఆగ్రహం కలిగించినప్పుడు వారందరినీ ముంచి వేశాము. భవిష్యత్ తరాల వారికి గుణపాఠం గరిపే ఒక నిదర్శనంగా చేసివేశాము.

రుకూ 6 : మర్యమ్ పుత్రుడు కూడా ఒక దాసుడు తప్ప మరేమీ కాదు. మేము అతనిని అనుగ్రహించాము. ఇస్రాయీల్ సంతతి వారి ముందు అతన్ని మా శక్తికి నిదర్శనంగా నిలబెట్టాము. నిజానికి అతను ప్రళయానికి సూచన. స్పష్టమైన సూచనలు తీసుకువచ్చిన ఈసా 'నేను మీ వద్దకు వివేకం తీసుకొని వచ్చాను. మీరు విబేధాలకు లోనయిన కొన్ని విషయాల వాస్తవాలు మీకు స్పష్టంగా వివరించడానికి వచ్చాను. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. నన్ను అనుసరించండి. యధార్థం ఏమిటంటే, అల్లాహ్‌యే మీ ప్రభువు, నా ప్రభువు. ఆయన్నే ఆరాధించండి. ఇదే సరైన మార్గం'. కాని ఈ స్పష్టమైన బోధ తర్వాత కూడా ఈ వర్గాలు విభేదాలలోనే మునిగిపోయాయి. ప్రళయదినాన భయభక్తులు కలవారు తప్ప మిత్రులందరూ ఒకరికొకరు శత్రువులయి పోతారు.

రుకూ 7 : విశ్వాసులను అల్లాహ్ స్వర్గంలో ప్రవేశపెడ్తాడు. వారు ప్రపంచంలో చేసిన సత్కార్యాల కారణంగా స్వర్గానికి వారసులవుతారు. ఇక అపరాధుల విషయం, వారు నరకంలో నుంచి 'ఓ మాలిక్! నీ ప్రభువు మమ్మల్ని అంతం చేస్తే బాగుండు' అని వేడుకొంటారు. దానికి అతడు 'మీరు ఇలాగేపడి వుంటారు. మేము మీ వద్దకు సత్యాన్ని తీసుకొని వచ్చాము. కాని మీలో చాలా మందికి సత్యం అంటే నచ్చేది కాదు' అని

జవాబిస్తాడు. ఆకాశంలోనూ భూమిలోనూ దేవుడు ఆయన ఒక్కడే. భూమ్యాకాశాలపై వాటి మధ్య ఉన్న ప్రతి వస్తువుపై అధికారం ఉన్న ఆయన అత్యున్నతుడు. ప్రళయ ఘడియ గురించి తెలిసినవాడు ఆయనే. ఆయన వైపునకే మీరంత మరలించబడతారు. ఆయనను కాదని వీళ్ళు వేడుకొంటున్న దేవుళ్ళకు సిఫారసు చేసే అధికారం ఏమాత్రం లేదు.

44. అద్ దుఖాన్

రుకూ 1 : ఎంతో మేలయిన, అత్యంత శుభవంతమైన రాత్రివేళ మేము ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము. ఆకాశాలకు, భూమికి, భూమ్యాకాశాల మధ్య ఉన్న ప్రతి వస్తువుకు అల్లాహ్ ప్రభువు. ఆయన తప్ప ఆరాధ్య దైవం ఎవ్వడూలేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మరణాన్ని ఇస్తాడు. ఆయనే మీ ప్రభువు. గతించిన మీ పూర్వీకుల ప్రభువు. ప్రజల పరిస్థితి ఎలా ఉందంటే వారి వద్దకు సాక్షాత్తు ఒక ప్రవక్త వచ్చినప్పటికీ వారు అతని పట్ల శ్రద్ధ చూపడంలేదు. మూసా ఫిరౌన్ వద్దకు వెళ్ళి, అతన్ని అల్లాహ్ వైపునకు పిలిచారు. కాని ఫిరౌన్ ఒక అపరాధి. అతను తిరస్కరించాడు, అప్పుడు మేము తోటలు, నీటిబుగ్గలు, అందమైన సౌధాల నుంచి వారందరినీ బయటకు లాగి సముద్రంలో ముంచివేశాము.

రుకూ 2 : మాకు మరణం తర్వాత మరింకేంలేదు. ఆ తర్వాత లేపబడడం జరగదు. నీవు నిజమే చెబుతున్నట్లయితే మా తాత ముత్తాతలను లేపి తీసుకురా' అంటున్నారు ఈప్రజలు. అపరాధులైన వారిని మేము నాశనం చేశాము. ఆకాశాన్ని, భూమిని, వాటి మధ్య ఉన్న వస్తువులను మేము వినోదం కోసం సృష్టించలేదు. వాటిని మేమ సత్యబద్ధంగానే సృష్టించాము. తీర్పుదినం నాడు దగ్గరి బంధువు కూడా తన దగ్గరి బంధువుకు ఎంతమాత్రం ఉపయోగపడడు.

రుకూ 3 : ప్రళయ దినాన పాపాత్ములను పట్టుకొని నరకం మధ్యకు ఈడ్చుకువెళ్ళండి. వారి తలపై సలసల కాగే నీరు గుమ్మరించండి అనడం జరుగుతుంది. 'బలవంతుడవు మహా గౌరవనీయుడవు కదా! ఇప్పుడు అనుభవించు. ఏ విషయం రాక గురించి సందేహించారో ఆ విషయం ఇదే అనడం జరుగుతుంది. దైవభీతి గలవారు శాంతిభద్రతలు గల ప్రదేశంలో ఉంటారు. ఉద్యాన వనాలు, సెలయేళ్ళ మధ్య సన్నని

జరి పట్టువస్త్రాలు ధరించి ఎదురెదురుగా కూర్చుని ఉంటారు. అలా ఉంటుంది వారి దర్పం. ఇదే గొప్ప సాఫల్యం.

45. అల్ జాసియహ్

రుకూ 1 : ఆకాశాలలోనూ, భూమిపైననూ విశ్వాసులకు అనేక నిదర్శనాలు ఉన్నాయి. ప్రజలను సృష్టించడంలో, భూమిపై అల్లాహ్ వ్యాపింపజేస్తున్నటువంటి జంతువులలో, రేయింబవళ్ళ మధ్య ఉన్న వ్యత్యాసంలో, అల్లాహ్ ఆకాశం నుంచి అవతరింపజేస్తూ ఉన్న ఆహారంలో వాయువుల భ్రమణంలో, బుద్ధిని ఉపయోగించే వారికి అనేక నిదర్శనాలున్నాయి. ఇవన్నీ అల్లాహ్ సూచనలు, మేము వాటిని యధాతథంగా వివరిస్తు న్నాము. ఇక అల్లాహ్‌ను ఆయన వాక్యాలను కాక మరే విషయాన్ని విశ్వసిస్తారు.

అసత్యవాది, దుష్కర్ముడు అయిన ప్రతీ వ్యక్తి సర్వనాశనమవుతాడు. అల్లాహ్ వాక్యాలు తన ముందు పఠించబడుతున్నప్పుడు వాటిని విని కూడా, ఆ పిదప వాటిని ఎన్నడూ వినని వాని మాదిరిగా గర్వంతో తిరస్కార వైఖరిని మొండిగా అవలంభించేవానికి అత్యంత బాధాకరమైన శిక్ష పడుతుందనే వార్త వినిపించు.

రుకూ 2 : దుష్కార్యం చేసేవాడు దాని ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. అందరూ ప్రభువు వైపునకే మరలిపోతారు. పూర్వం ఇస్రాయీల్ సంతతి వారి మధ్య తలెత్తిన విభేదాలు తెలియనితనం వల్ల కాదు, జ్ఞానం వచ్చిన తర్వాతనే తలెత్తాయి. వారు ఒకరి కొకరు అన్యాయం చేయదలచుకున్నందువల్ల తలెత్తాయి. వారు విభేదిస్తున్న విషయాల గురించి అల్లాహ్ ప్రళయం నాడు తీర్పు చెబుతాడు. ప్రవక్తా! ఇప్పుడు మేము ధర్మం విషయంలో నిన్ను ఒక స్పష్టమైన షరియత్‌పై స్థిరపరిచాము. కనుక నీవు ఈ చట్టం ప్రకారం మాత్రమే నడుచుకో. జ్ఞానహీనుల కోరికలను అనుసరించవద్దు. దుర్మార్గులు ఒకరికొకరు సహాయకులు. భయభక్తులు కలవారికి అల్లాహ్ సహాయకుడు. విశ్వసించి మంచి పనులు చేసేవారితో సమానంగా చెడులకు పాల్పడే వారిని మేము చూస్తామని వీళ్ళు అనుకొంటున్నారా?

రుకూ 3 : తన మనోవాంఛలనే తన దైవాలుగా చేసుకున్న వ్యక్తి పరిస్థితి ఎలాంటిదో ఆలోచించావా? జ్ఞానం ఉన్నప్పటికీ అతన్ని మార్గభ్రష్టత్వంలో విసరివేశాడు అల్లాహ్. అతని హృదయంపై చెవులపై సీలు వేశాడు. అతని కళ్ళపై తెర వేశాడు. ఇక అతనికి

మార్గం చూపేవాడు అల్లాహ్ తప్ప మరెవడున్నాడు! 'జీవితం అంటే ఈ ప్రపంచం లోనిదే. ఇక్కడే బ్రతకడం, ఇక్కడే చావడం కాలగతి తప్ప మనల్ని మరేదీ చంపలేదు' అంటారు ఈ ప్రజలు. ప్రవక్తా! వారికి చెప్పు, అల్లాహ్‌యే జీవితం ప్రసాదిస్తున్నాడు. ఆయనే మరణం కలిగిస్తున్నాడు. ఆయనే ప్రళయదినాన మిమ్మల్ని సమావేశపరుస్తాడు. ప్రళయం రావడమన్నది సందేహంలేని విషయం.

రుకూ 4 : ప్రళయ ఘడియ వచ్చి పడిన రోజున అసత్యవాదులు నష్టానికి గురవుతారు. ఆనాడు ప్రతీవర్గం మోకరిల్లి ఉండడాన్ని నీవు చూస్తావు. ప్రతీ వర్గాన్ని తమ కర్మల పత్రం వచ్చి చూసుకోండని పిలవడం జరుగుతుంది. విశ్వసించి మంచి పనులు చేసిన వారిని ప్రభువు తన కారుణ్యం లోనికి తీసుకుంటాడు. అవిశ్వాసులతో 'నా వాక్యాలు మీకు వినిపించడం జరగలేదా? కాని మీరు గర్వం ప్రదర్శిస్తూ అపరాధులైపోయారు; మీరు నేటి సమావేశాన్ని మరిచిపోయిన విధంగానే మేము కూడా ఈనాడు మిమ్మల్ని మరిచిపోయాము' అనడం జరుగుతుంది. అల్లాహ్ వాక్యాలను పరిహాసంగా భావించడం వల్లనే వారి గతి ఇలా అయ్యింది. నేడు నరకం నుంచి బయటకు తీయడం లేదా క్షమాభిక్ష కోసం ప్రభువును ప్రసన్నుడుగా చేసుకోండి అనడమూ జరగదు. కనుక అల్లాహ్ మాత్రమే స్తోత్రాలకు అర్హుడు.

46. అల్ అహ్‌ఖాఫ్

రుకూ 1 : ప్రవక్తా! వారిని అడుగు. దేవుణ్ణి కాదని వారు వేడుకొంటున్న శక్తులు అసలు ఏమిటో వారెప్పుడయినా కళ్ళు తెరిచి చూశారా! ఈ శక్తులు భూమిపై సృష్టించింది ఏమిటో లేదా ఆకాశాల సృష్టిలో, వాటి నిర్వహణలో ఈ శక్తుల పాత్ర ఏమిటో కాస్త నాకు చూపండి. ఒకవేళ ఇదివరకు వచ్చిన ఏదైనా గ్రంథం గాని లేక జ్ఞాన అవశేషం గాని ఈ విశ్వాసాలకు ఆధారంగా మీ వద్ద ఉంటే దాన్నే పట్టుకురండి. ప్రళయం వచ్చే వరకు సమాధానమైనా ఇవ్వలేని వారిని, మొరపెట్టుకొనేవారు తమకు మొరపెట్టు కుంటున్నారన్న విషయం కూడా తెలియని వారిని వేడుకొంటూ, అల్లాహ్‌ను కాదంటున్న వాడికంటే పరమ భ్రష్టుడయిన మనిషి మరెవడు? వారికి చెప్పండి. కొత్త ప్రవక్తనేమీకాదని, రేపు మీకు ఏమీ జరగనున్నదో, నాకు ఏమి జరగనున్నదో తెలిసినవాణ్ణి కాదని, నావద్దకు పంపబడే దైవవాణి 'వహీ'ని అనుసరిస్తున్న వాణ్ణి మాత్రమేనని, స్పష్టంగా హెచ్చరిక చేసేవాణ్ణి తప్ప మరేమీ కానని వారికి చెప్పండి.

రుకూ 2 : వాస్తవానికి ఇంతకుపూర్వం మూసా గ్రంథం మార్గదర్శిగా, కారుణ్యంగా వచ్చింది. ఈ గ్రంథం అరబ్బీభాషలో ఆ గ్రంథాన్ని ధృవీకరిస్తూ అవతరించింది. దుర్మార్గులను హెచ్చరించడానికి, మంచి వైఖరి అవలంభించేవారికి శుభవార్త ఇవ్వ డానికి వచ్చింది. అల్లాహ్‌యే మా ప్రభువు అని ప్రకటించి, దానిపై స్థిరంగా ఉండి పోయిన వారికి ఎలాంటి భయమూ లేదు. వారికి ఎలాంటి దు:ఖమూ లేదు. స్వర్గానికి పోయేవారు వీరే. మనిషి తన తల్లిదండ్రుల పట్ల మంచిగా మెలగాలని మేము ఉపదేశిం చాము. మనిషిని తల్లి ఎంతో శ్రమతో కన్నది. అతడిని గర్భంలో పెట్టుకొని మోయ డానికి, పాలు మానిపించడానికి ముప్పయి నెలలు పట్టింది. చివరకు మనిషి పరిపూర్ణ శక్తిని పొంది పెద్దవాడు అయ్యాక అల్లాహ్ పట్ల కృతజ్ఞతలు చూపుతూ, అల్లాహ్‌ను వేడుకునేవాడు అయ్యాడు. నేను ముస్లిమును అని ప్రకటించాడు. తన తల్లిదండ్రుల పట్ల చెడుగా వ్యవహరించే వ్యక్తి, మరణానంతర జీవితాన్ని తిరస్కరించే వ్యక్తి అల్లాహ్ వచనాలను పాతకాలం కట్టుకథలుగా కొట్టిపారేసే వ్యక్తి – ఇటువంటి వారిపైననే శిక్షా నిర్ణయం రూఢీ అయిపోయింది.

రుకూ 3 : అల్లాహ్‌ను తప్ప మరెవరనీ ఆరాధించకండి. మీ విషయంలో ఒక భయంకర దినాన విధించబడే శిక్ష గురించి భయపడుతున్నానని హూద్ తన జాతి వారితో అన్నప్పుడు వారు అతన్ని తిరస్కరించారు. సత్యవంతుడవే అయితే మమ్మల్ని భయ పెడుతున్న ఆ శిక్షను తీసుకురా అన్నారు. నల్లని మబ్బులు తమ లోయ వైపునకు రావడం చూసి, వారు అవి పుష్కలంగా వర్షం కురిపించే మబ్బులని అనుకొన్నారు. అది తుఫాను గాలి. వ్యధాభరిత శిక్షను తెచ్చింది. ప్రభువు ఆజ్ఞానుసారం ప్రతి వస్తువును సర్వనాశనం చేసింది. మీకు ఇవ్వనివి ఎన్నో మేము ఆ ప్రజలకు ఇచ్చాము. చెవులు, కళ్ళు, మనస్సు అన్నీ ఇచ్చాము. కాని వారికి చెవులు, కళ్ళు, మనస్సు యే విధంగానూ పనికిరాలేదు. ఎందుకంటే వారు అల్లాహ్ వాక్యాలను తిరస్కరిస్తూ ఉండే వారు కాబట్టి.

రుకూ 4 : ఎన్నో పట్టణాలను మేము నాశనం చేశాము. మేము మా వచనాలను పంపి అనేక సార్లు వారికి నచ్చజెప్పాము. అల్లాహ్‌ను కాదని, అల్లాహ్ సాన్నిధ్యం పొందడానికి సాధనాలుగా ఈ ప్రజలు యే శక్తులను దైవాలుగా చేసుకొన్నారో అవి వారికి సహాయ మెందుకు చేయవు?! ఖుర్‌ఆన్ పారాయణాన్ని విన్న జిన్నాతులు హెచ్చరిక చేసేవిగా తమ జాతి వైపునకు వెళ్ళి తోటి జిన్నాతులను దైవమార్గం వైపునకు పిలిచాయి. తోటి

జిన్నాతులతో, “జాతి ప్రజలారా! మేము ఒక గ్రంథాన్ని విన్నాము. అది మూసా ప్రవక్త తర్వాత అవతరించింది. పూర్వం అవతరించిన గ్రంథాలను ధ్రువీకరిస్తుంది. సత్యం వైపునకు రుజు మార్గం వైపునకు దారి చూపుతుంది. అల్లాహ్ వైపునకు పిలిచే దాని సందేశాన్ని స్వీకరించండి. అతనిని విశ్వసించండి. అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు. భయంకర శిక్ష నుంచి కాపాడుతాడు” అని చెప్పాయి. ఈ భూమిని, ఆకాశాన్ని సృష్టించడంలో యే మాత్రం అలసిపోని దేవుడు మృతులను మళ్ళీ బ్రతికించి లేపే శక్తి కలిగి వున్నాడు. ప్రళయదినాన ప్రజలకు వారు ప్రపంచంలో ఒక్క ఘడియ కంటే ఎక్కువ కాలం ఉండలేదని అనిపిస్తుంది.

47. ముహమ్మద్

రుకూ 1 : విశ్వసించి మంచి పనులు చేసేవారు, ముహమ్మద్ (సఅసం) పై అవతరించినది పూర్తిగా సత్యం అనీ, ప్రభువు వద్ద నుంచి వచ్చినదనీ నమ్మినవారు - ఇలాంటి వారి నుంచి వారి చెడులను దూరం చేసి అల్లాహ్ వారిని చక్కదిద్దాడు. అవిశ్వాసులతో మార్కొనినప్పుడు వారి మెడలను ఖండించడమే మీరు చేయవలసిన మొదటి పని. మీరు వారిని పూర్తిగా అణచివేసిన తర్వాత ఖైదీలను గట్టిగా బంధించండి. అల్లాహ్ తలచుకొంటే స్వయంగా ఆయనే వారిని ఎదుర్కొనేవాడు. అయితే ఆయన మిమ్మల్ని ఒకరి ద్వారా మరొకరిని పరీక్షించడానికి ఈ పద్ధతి పాటించాడు. తన మార్గంలో చంపబడిన వారి కర్మలను అల్లాహ్ ఎంత మాత్రం వృథాగానీయడు. ఆయన వారిని స్వర్గంలో ప్రవేశపెడతాడు. విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు సహాయం చేస్తే ఆయన మీకు సహాయం చేస్తాడు. మీ కాళ్ళు స్థిరంగా ఉంచుతాడు.

రుకూ 2 : విశ్వసించి మంచి పనులు చేసే వారిని అల్లాహ్ సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశపెడతాడు. అవిశ్వాసులు కేవలం కొన్ని రోజుల ప్రాపంచిక జీవనంలోని సుఖాలను మాత్రం జుర్రుకొంటున్నారు. పశువుల మాదిరిగా తింటున్నారు. త్రాగుతున్నారు. వారి అంతిమ నివాసం నరకం. ప్రవక్తా! నిన్ను బహిష్కరించిన నగరం కన్నా అత్యంత శక్తివంతమయిన నగరాలు అనేకం గతించిపోయాయి. భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గంలో నిర్మలమైన నీటి సెలయేర్లు ప్రవహిస్తూ ఉంటాయి. రుచి ఏమాత్రం మారని పాల ఏరులు

ప్రవహిస్తూ ఉంటాయి. త్రాగే వారికి మధురంగా ఉండే మద్యం కాల్వలు ప్రవహిస్తూ ఉంటాయి. స్వచ్ఛమైన తేనె కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. నరకంలో పేగులను కోసి వేసే సలసల కాగే నీరు ఇవ్వబడుతుంది. సన్మార్గం పొందిన వారికి అల్లాహ్ ఇంకా ఎక్కువగా మార్గం చూపుతాడు. వారికి వారి వాటా భయభక్తులు ప్రసాదిస్తాడు. ప్రళయం నిదర్శనాలయితే వచ్చేశాయి. ఇక అదే వచ్చినప్పుడు ఇక హితోపదేశం స్వీకరించే అవకాశం ఎక్కడ మిగిలి ఉంటుంది?

రుకూ 3 : యుద్ధ ప్రస్తావన ఉన్న నిర్దిష్టమైన సూరా అవతరింపజేయబడినప్పుడు, రోగగ్రస్త హృదయాల వాళ్ళు, మృత్యువు మీద పడిన వారి మాదిరిగా నీవైపు చూడడాన్ని నీవు గమనిస్తావు. స్పష్టమైన ఆజ్ఞ అందిన తర్వాత, వారు అల్లాహ్‌కు తాము చేసిన ప్రమాణాన్ని నెరవేర్చడంలో నిజాయితీ చూపి ఉంటే వారికి శ్రేయస్కరమై ఉండేది. వీరి నుంచి ఇంతకన్నా యేం ఆశించవచ్చు. ఒకవేళ వీరు విముఖులైతే భూమిపై మళ్ళీ కల్లోలం రేకెత్తిస్తారు. పరస్పరం గొంతులు కోసుకుంటారు. వీళ్ళు ఖుర్‌ఆన్ గురించి ఆలోచించలేదా? లేక వీరి హృదయాలకు తాళం పడిందా? యధార్థమేమిటంటే, మార్గదర్శకత్వం స్పష్టమైన తర్వాత కూడా దానికి విముఖులైపోయిన వారికి షైతాను ఇలాంటి వైఖరి అవలంబించడం సులభం చేశాడు. లేనిపోని ఆశలు వారిలో పెంచాడు.

రుకూ 4 : హృదయాలలో రోగమున్నవాళ్ళు, తమ మనస్సులలో ఉన్న మాలిన్యాన్ని అల్లాహ్ బయటపెట్టడని భావిస్తున్నారా? మేము తలచుకొంటే వారిని నీకు చూపగలం. వారి ముఖాలను చూసి నీవు గుర్తించగలవు. అసలు వాళ్ళు మాట్లాడే తీరునుబట్టే నీవు తెలుసుకొంటావు. మేము మిమ్మల్ని తప్పక పరీక్షించి మీ స్థితిని నిర్ణయిస్తాము. అల్లాహ్ మార్గంలో గట్టి ప్రయత్నం చేసేవాళ్ళు ఎవరో, ఎవరు స్థిరచిత్తులో చూస్తాము. విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్తకు విధేయత చూపండి. మీ కర్మలు వృధా చేసుకోకండి. అధైర్యపడకండి. రాజీపడడానికి వారిని పిలువకండి. మీరు ఆధిక్యం పొందుతారు. ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట మాత్రమే. ఒక వినోదం మాత్రమే, విశ్వసించి భయభక్తుల వైఖరి అవలంబిస్తే అల్లాహ్ మీకు ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టండి అని పిలుపు ఇవ్వబడినపుడు మీలో కొందరు పిసినారితనం చూపుతారు. పిసినారి తనం అవలంబించే వ్యక్తి తన పట్ల తానే పిసినారిగా వ్యవహరిస్తున్నాడు. అల్లాహ్ అయితే ఎంతో సంపన్నుడు. మీరు

ఆయనపై ఆధారపడి ఉన్నారు. మీరు వైముఖ్యం చూపితే, అల్లాహ్ మీ స్థానంలో మరో జాతిని ఎన్నుకుంటాడు. వారు మీ వంటి వారిగా ఉండరు.

48. అల్ ఫత్హ్

రుకూ 1 : ప్రవక్తా! మీ పూర్వపు పొరబాట్లను, భావికాలపు పొరబాట్లను అల్లాహ్ మన్నించాలనీ, మీపై తన అనుగ్రహాన్ని పూర్తి చేయాలనీ, మీకు రుజుమార్గం చూపాలనీ, మీకు గొప్ప సహాయం చేయాలని మేము మీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము. భూమిపైనా, ఆకాశాలలోని సైన్యాలన్నీ అల్లాహ్ అధీనంలో వున్నాయి. విశ్వాసులైన స్త్రీ పురుషులు శాశ్వతంగా స్వర్గంలో ఉంటారు. కపటులు, ముష్రిక్కులు అయిన స్త్రీ పురుషులు అల్లాహ్ ఆగ్రహానికి గురవుతారు. ప్రవక్తా! మేము నిన్ను సాక్షి (షాహిద్)గా, శుభవార్త అందజేసేవానిగా, హెచ్చరిక చేసేవానిగా పంపాము. ఎందుకంటే, ప్రజలు అల్లాహ్‌ను, దైవప్రవక్తను విశ్వసించాలనీ, ప్రవక్తకు సహకరించాలనీ, ఆయన్ను గౌరవించాలనీ, ఉదయం, సాయంత్రం అల్లాహ్‌ను స్తుతించాలనీ ఇలా చేశాము.

రుకూ 2 : కపటులు మీ వద్దకు వచ్చి సాకులు చెబుతుంటారు. వారు తమ మనస్సులో లేని విషయాలు నోటితో పలుకుతూ ఉంటారు. ప్రవక్త, విశ్వాసులు తిరిగి ఇళ్ళకు చేరుకోరు అని వాళ్ళు భావించారు. ఈ ఆలోచన వారి మనస్సులకు బాగా నచ్చింది. నీవు విజయధనం పొందడానికి వెళ్ళేటప్పుడు, వెనుకడుగు వేసిన వారు నీతో తమను కూడా తీసుకెళ్ళమని తప్పక అడుగుతారు. వారు రావడానికి ఎంతమాత్రం వీలులేదని స్పష్టంగా చెప్పండి. త్వరలోనే అమిత బలసంపన్నులైన ప్రజలతో పోరాడడానికి వారిని పిలువడం జరుగుతుందనీ, ఆ ప్రజలతో వారు యుద్ధం చేయవలసి ఉంటుందనీ, లేదా వారు లొంగి పోతారనీ, అప్పుడు జిహాద్ ఆజ్ఞను శిరసావహిస్తే అల్లాహ్ మంచి ప్రతిఫలం ప్రసాదిస్తాడనీ, ఒకవేళ మునుపటి మాదిరిగా వెనుకడుగు వేస్తే అల్లాహ్ బాధాకరమైన శిక్ష విధిస్తాడని వారికి చెప్పండి.

రుకూ 3 : విశ్వాసులు చెట్టు క్రింద నీతో విధేయతా ప్రతిజ్ఞ చేస్తున్నప్పుడు అల్లాహ్ వారిని చూసి సంతోషించాడు. అల్లాహ్ వారిపై సకీనత్ (శాంతి సంతృప్తులు) అవత రింపజేశాడు. వారికి బహుమానంగా త్వరలోనే విజయాన్ని ప్రసాదించాడు. అల్లాహ్

మీకు అపార విజయధనాలు వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరు పొందుతారు తక్షణం ఆయన మీకు ఈ విజయాన్ని ప్రసాదించాడు. ఈ అవిశ్వాసులు ఈ సమయంలో మీతో యుద్ధానికి దిగి ఉంటే నిశ్చయంగా వెన్నుచూపి పారిపోయేవారు. ఏ సహాయకుణ్ణీ రక్షకుణ్ణీ పొంది ఉండేవారు కాదు. మక్కా లోయలో మీపై వారి చేతులను, వారిపై మీ చేతులను ఆపినవాడు అల్లాహ్యే. వాస్తవానికి ఆయన మీకు వారిపై ఆధిక్యం ఇచ్చాడు. సత్యాన్ని తిరస్కరించి, మస్జిదె హరామ్‌కు వెళ్ళకుండా మిమ్మల్ని అడ్డుకుని, ఖుర్బానీ ఒంటెలను వధ్య స్థలాలకు చేరుకుండా చేసింది వీరే కదా! మక్కాలో మీరు ఎరుగని విశ్వాసులైన స్త్రీ పురుషులు లేనట్లయితే, తెలియకపోవడం వల్ల మీరు వారిని కాలరాచే ప్రమాదం లేనట్లయితే యుద్ధాన్ని ఆపటం జరిగేది కాదు.

రుకూ 4 : నిశ్చయంగా అల్లాహ్ తన ప్రవక్తకు నిజమైన కలనే చూపించాడు. అల్లాహ్ సంకల్పిస్తే మీరు మస్జిదె హరామ్‌లో పూర్తి శాంతితో ప్రవేశిస్తారు. శిరోముండనం చేయించుకొంటారు. వెంట్రుకలు కత్తిరించుకొంటారు. మీకు యే భయమూ ఉండదు. అల్లాహ్ తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్ని, సత్య ధర్మాన్ని – అది అన్ని ధర్మాలపై ఆధిక్యం పొందేలా చేయడానికి – ఇచ్చి పంపాడు. ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త. ఆయన సహచరులు అవిశ్వాసుల పట్ల కఠినంగానూ, పరస్పరం కరుణామయులుగానూ ఉంటారు. వారిని చూసినప్పుడు రుకూ, సజ్దాలలో అల్లాహ్ అనుగ్రహాన్ని, ప్రసన్నతనూ అర్థిస్తూ కనబడతారు. సజ్దాల చిహ్నాలు వారి నుదుటిపై ఉంటాయి. వారు ఒక పంటపొలం వంటివారు. ఆ పొలం మొదట ఒక మొలకను అంకురింపజేసింది. ఆ పిదప ఏపుగా పెరిగింది. కాండంపై నిలబడింది. రైతులను ఆనంద పరుస్తుంది. అవిశ్వాసులు వారి వృద్ధీవికాలు చూసి అసూయపడాలనీ, విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి క్షమాభిక్షను గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు.

49. అల్ హుజురాత్

రుకూ 1 : విశ్వాసులారా! అల్లాహ్‌కు, దైవప్రవక్తకు ముందు నడువకండి. మీ కంఠ స్వరాన్ని ప్రవక్త కంఠస్వరం కంటే పెంచకండి. ప్రవక్తతో బిగ్గరగా మాట్లాకండి. దానివల్ల బహుశా మీ కర్మలన్నీ మీకు తెలియకుండా వృథా కావచ్చు. ఎవడయినా దుర్మార్గుడు మీ వద్దకు ఏదయినా సమాచారం తీసుకొని వస్తే నిజానిజాలు విచారించి తెలసు కోండి. లేకపోతే మీరు మీకు తెలియకుండానే ఏదైనా వర్గాన్ని నష్టపరచవచ్చు. తర్వాత

చేసిన దానికి పశ్చాత్తాప పడవలసి రావచ్చు. ఒకవేళ విశ్వాసులలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ సంభవిస్తే వారి మధ్య రాజీ చెయ్యండి. తర్వాత ఒకవేళ వారిలో ఓ వర్గం మరో వర్గంపై దౌర్జన్యం చేస్తే, దౌర్జన్యం చేసినవారు అల్లాహ్ వైపునకు మరలే వరకు వారితో యుద్ధం చెయ్యండి. తర్వాత వారు గనక మరలివస్తే వారి మధ్య రాజీ కుదర్చండి. న్యాయం చేయండి. విశ్వాసులు పరస్పరం అన్నదమ్ములు. కనుక మీ సోదరుల మధ్య సంబంధాలు చక్కబరచండి. అల్లాహ్‌కు భయపడండి.

రుకూ 2 : విశ్వాసులారా! పురుషులు, సాటి పురుషులను అపహసించరాదు. వీరికంటే వారే ఉత్తములై ఉండవచ్చు. స్త్రీలు సాటి స్త్రీలను ఎగతాళి చేయరాదు. వీరికంటే వారే శ్రేష్టమైన వారై ఉండవచ్చు. ఒండొరులను ఎత్తిపొడవడం చేయకండి. చెడ్డ పేర్లతో పిలుచుకోకండి. విశ్వసించిన తర్వాత చెడ్డతనంతో పేరు పొందడం నీచమైన విషయం. అతిగా అనుమానించడం మానండి. కొన్ని అనుమానాలు పాపాలవుతాయి. కూపీలాగే వారిగా వ్యవహరించకండి. ఒకరినొకరు పరోక్షంగా నిందించకండి. మృత సోదరుని మాంసం తినడాన్ని మీరు ఎవరైనా ఇష్టపడతారా? మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుంచి ఒకే స్త్రీ నుంచి సృష్టించాము. తర్వాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకోడానికి గాను మిమ్మల్ని జాతులుగా, తెగలుగా చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ వద్ద అధిక గౌరవానికి అర్హుడు. అల్లాహ్ పట్ల, ప్రవక్త పట్ల విధేయత చూపినపుడే మనిషి విశ్వాసులలో ఒకడవు తాడు.

50. ఖాఫ్

రుకూ 1 : మేము మరణించి మట్టిలో కలిసిపోయిన తర్వాత మళ్ళీ బ్రతికించ బడతామా? చాలా విచిత్రంగా ఉందే! అంటున్నారు ఈ ప్రజలు. వీళ్ళు తమపై ఉన్న ఆకాశాన్ని ఎన్నడూ చూడలేదా? మేము దాన్ని ఎలా నిర్మించి అలంకరించామో. చూడలేదా! అందులో ఎలాంటి పగుళ్ళు లేవు. మేము భూమిని పరిచాము. దానిపై పర్వతాలను అమార్చము. మనోహరమైన అన్ని రకాల వృక్ష జాతులు మొలకెత్తిం చాము. ఆకాశం నుంచి శుభమైన నీటిని అవతరింపజేశాము. తోటలను, పంట పొలాలను, ఎత్తయిన ఖర్జూరపు చెట్లను పుట్టించాము. వాటికి గుత్తులు గుత్తులుగా పండ్లు కాస్తాయి. ఇది దాసులకు ఉపాధి ఇచ్చే ఏర్పాటు, ఈ నీటితో మేము మృత

భూమికి ప్రాణం పోస్తాము. మరణించిన మనుషులు భూమి నుంచి లేవటం కూడా ఇదే విధంగా జరుగుతుంది.

రుకూ 2 : మనిషి మనస్సులో కదలాడే ఊహలు సైతం మాకు తెలుసు. మేము అతని కంఠరక్తనాళం కంటే కూడా చాలా దగ్గరగా ఉన్నాము. ఇద్దరు లేఖకులు అతనికి కుడి ఎడమల కూర్చుని ప్రతి విషయాన్ని నమోదు చేస్తున్నారు. అతని నోటి నుంచి వెలువడే ప్రతిమాట రాయడానికి ఒక పరిశీలకుడు సిద్ధంగా ఉన్నాడు. ప్రళయ దినాన ప్రతి వ్యక్తి తన వెంట ఒక తోలేవాడు, ఒక సాక్ష్యం చెప్పేవాడు ఉన్న స్థితిలో హాజరవుతాడు. సత్యం పట్ల ద్వేషంతో మంచిని నిరోధిస్తూ ఉండేవాడు. హద్దులు అతిక్రమిస్తూ ఉండేవాడు, అనుమానంలో పడి ఉండేవాడు అయిన ప్రతి అవిశ్వాసి నరకంలో వేయబడతాడు. ప్రళయంనాడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు. "నేను ముందుగానే చెడు పర్యవసానం గురించి హెచ్చరించాను. నా దగ్గర మాట మార్చడం ఉండదు. నేను నా దాసులపై దౌర్జన్యం చేసేవాడిని కాదు."

రుకూ 3 : ఆనాడు మేము నరకాన్ని నువ్వు నిండిపోయావా? అని అడిగినప్పుడు అది "ఇంకేమైనా మిగిలి ఉందా?" అంటుంది. భయభక్తులుగల వారికి చాలా దగ్గరగా స్వర్గం తీసుకురాబడుతుంది. అల్లాహ్ వైపునకు అధికంగా మరలేవాడు, అల్లాహ్ హద్దులను పరిరక్షించేవాడు, చూడకనే కరుణామయునికి భయపడేవాడు ఏకాగ్రచిత్తంతో వచ్చినవాడు అయిన ప్రతి వ్యక్తికి అది లభిస్తుంది. కనుక ప్రవక్తా! సహనం వహించు. నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని జపిస్తూ ఉండు. సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయానికి ముందు, రాత్రి సమయంలో ఆయన పవిత్ర నామాన్ని జపించు. సజ్దాలు చేయడం పూర్తి అయిన తర్వాత కూడా.

చాటింపు వేసేవాడు ప్రతి మనిషికి అతి దగ్గర నుంచి కేక వేసే రోజున, ప్రజలందరు హాషర్ కేకను స్పష్టంగా వింటారు. ఆ రోజు మృతులు భూమి నుంచి బయల్పడే రోజు. ఆనాడు భూమి బద్దలవుతుంది. మనుషులు దాని నుంచి బయల్పడి గాభరాగా పరుగెత్తుతూ ఉంటారు. బ్రతికించి సమీకరించడం మాకు ఎంతో తేలికయిన పని. ఈ ఖుర్ఆన్ ద్వారా నా హెచ్చరికకు భయపడే ప్రతి వ్యక్తికీ హితోపదేశం చేయి.

51. అజ్ జారియాత్

రుకూ 1 : ఊహలు, అనుమానాల ఆధారంగా నిర్ణయాలు చేసేవారు నాశనమవుతారు.

వారు అజ్ఞానంలో కూరుకుపోయారు. ఏమరుపాటు మైకంలో పడి ఉన్నారు. ఆ రోజున వీళ్ళు అగ్నిలో కాల్చబడతారు. కాని భయభక్తులు కలవారు ఆ రోజున ఉద్యాన వనాలలో నీటి బుగ్గల నడుమ ఉంటారు. సత్కార్యాలు చేసేవారిగా, రాత్రివేళ చాలా తక్కువ నిద్రపోయే వారిగా, రాత్రి చివరి ఘడియలలో క్షమాపణ వేడుకునే వారిగా ఉండేవారు. వారి సంపదలో యాచకులకు, అగత్యపరులకు హక్కు ఉండేది. విశ్వసించే వారికి భూమిపై ఎన్నో నిదర్శనాలున్నాయి. స్వయాన వారిలోనూ నిదర్శనాలున్నాయి.

రుకూ 2 : ఇబ్రాహీమ్ వద్దకు గౌరవనీయులైన అతిథులు వచ్చారు. ఆయన ఒక బలిసిన మంచి ఆవుదూడను వేపబడినది వారి ముందు పెట్టాడు. వారు దాన్ని ముట్టకపోయేసరికి ఇబ్రాహీం భయపడ్డారు. వారు అతనితో ఒక జ్ఞాన సంపన్నుడైన కుమారుడు పుడతాడని శుభవార్త వినిపించారు. ఇది విని అతని భార్య, "ముసలిదానికి, గొడ్రాలికా!" అన్నది. అప్పుడు వారు "నీ ప్రభువు ఇదే చెప్పాడు" అన్నారు. ఇంకా "మేము ఒక అపరాధ జాతిపై కాల్చబడిన మట్టిరాళ్ళను వర్షింపజేయడానికి పంపబడ్డాము" అని తెలిపారు. మేము ఫిర్ఔన్‌ను, అతడి సైన్యాలను సముద్రంలోకి విసిరివేశాము. ఆద్ జాతిపైకి ఒక వినాశకరమైన గాలిని పంపాము. సమూద్ జాతిని అకస్మాత్తుగా విరుచుకుపడే ఆపద పట్టుకుంది. వారందరి కంటే ముందు మేము నూహ్ జాతిని నాశనం చేశాము.

రుకూ 3 : ఆకాశాన్ని మేము స్వశక్తితో నిర్మించాము. భూమిని పరిచాము. ప్రతి వస్తువును జంటలుగా సృష్టించాము. మీరు గుణపాఠం బహుశా నేర్చుకొంటారని. కనుక పరుగెత్తండి అల్లాహ్ వైపునకు. ఆయన తరఫు నుంచి స్పష్టంగా హెచ్చరిక చేసేవానిగా వచ్చాను నేను. ఈ ప్రజలకు పూర్వపు జాతుల వారి వద్దకు వచ్చిన ప్రవక్తలు కూడా "మాంత్రికుడు లేదా పిచ్చివాడు" అని నిందించబడకుండా ఉండడం అన్నది జరుగలేదు. ఈ విషయం గురించి వీళ్ళందరూ పరస్పరం కూడబలుక్కున్నారా ఏమిటి! అది కాదు, నిజానికి వీళ్ళంతా హద్దు మీరే ప్రజలు. కనుక ప్రవక్తా! ఉపదేశిస్తూ ఉండు. ఎందుకంటే, ఉపదేశం విశ్వాసులకు ప్రయోజనకరమైనది. నేను జిన్నాతులను మానవులను నా ఆరాధన కొరకు తప్ప మరి దేనికీ సృష్టించలేదు. నేను వారి నుంచి ఎలాంటి ఉపాధి కోరను. వారు నాకు ఆహారం పెట్టాలని కూడా కాదు. అల్లాహ్ స్వయంగా ఉపాధి ప్రదాత. మహాశక్తిశాలి. అత్యంత దృఢమైనవాడు.

52. అత్తూర్

రుకూ 1 : నేడు ఒక వినోదంగా వితండవాదాలు చేస్తున్న తిరస్కారులకు ప్రళయం నాడు వినాశం తప్పదు. ఆ రోజున వారిని కొడుతూ, నెడుతూ నరకం వైపునకు తీసుకెళ్ళడం జరుగుతుంది. "మీరు తిరస్కరించిన నరకాగ్ని ఇదే ఇప్పుడు చెప్పండి. ఇది మంత్రజాలమా! మీకు యేదీ తట్టడంలేదా?" అని వారిని అడగడం జరుగుతుంది. భయభక్తులు కలవారు అక్కడ ఉద్యాన వనాల్లో భోగభాగ్యాలతో ఉంటారు. వారితో "మీరు చేసిన కర్మలకు ప్రతిఫలంగా హాయిగా తినండి త్రాగండి" అని చెప్పడం జరుగుతుంది. విశ్వాసుల సంతానం కూడా విశ్వాసం విషయంలో వారి అడుగు జాడల్లో నడిచి ఉంటే వారి సంతానాన్ని కూడా స్వర్గంలో వారితో కలుపుతాము. వారు ఒకరినొకరు ప్రపంచంలో జరిగిన విశేషాల గురించి అడిగి తెలుసుకొంటారు, "మేము మా కుటుంబ సభ్యులతో దేవునికి భయపడుతూ గడిపేవారం" అని అంటారు.

రుకూ 2 : ఇతడు కవి. ఈతడి వినాశం కోసం మేము ఎదురు చూస్తున్నాం" అంటున్నారా వాళ్ళు. సరే, ఎదురు చూడండి. నేను కూడా ఎదురు చేస్తాను. ఈయన ఈ ఖుర్ఆన్‌ను స్వయంగా కల్పించాడని వాళ్ళు అంటున్నారా? వాళ్ళు సత్యవంతులే అయితే ఇలాంటి ఔన్నత్యంగల వాణినే రచించి తీసుకురావాలి. సృష్టికర్త లేకుండా తమంతట తామే పుట్టారా వాళ్ళు. తమకు తామే సృష్టికర్తలా వాళ్ళు, భూమిని ఆకాశాలను సృష్టించారా! నీ ప్రభువు నిక్షేపాలు వారి అధీనంలో ఉన్నాయా? వారి దగ్గర నిచ్చెన ఏదయినా ఉందా! దానిపైకి ఎక్కి పై లోకం మాటలు విని రావడానికి. ప్రతిఫలం ఏదయినా ఇమ్మని నీవు వారిని అడుగుతున్నావా! బలవంతపు రుణాల ఒత్తిడి క్రింద వారు అణగిపోడానికి – అగోచర సత్యాలేమయినా వారికి తెలుసా! వారు ఏదయినా పన్నాగం పన్నదలిచారా? అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు వారికి ఉన్నాడా! కనుక ప్రవక్తా వారి మానాన వారిని వదలిపెట్టు. వారిని కొట్టిపడవేసే రోజు వచ్చే వరకు – అప్పుడు వారు దెబ్బ తిని క్రిందపడతారు. ప్రవక్తా! నీ ప్రభువు ఉత్తర్వు వచ్చే వరకు ఓర్పు వహించు. నీవు మా దృష్టిలో వున్నావు.

53. అన్ నజ్మ్

రుకూ 1 : మీ సహచరుడు (ప్రవక్త) తన మనోవాంఛలను అనుసరించి మాట్లాడడం లేదు. ఇది ఒక 'వహీ' ఆయనపై అవతరింపజేయబడుతోంది. జిబ్రాయీల్ (అస)

ఆయనకు నేర్పుతున్నారు. జిబ్రాయీల్ దిగ్మండలం ఎగువ భాగాన ఉన్నప్పుడు ఆయన జిబ్రాయీల్‌ను అతి దగ్గరగా చూశారు. తరువాత మరొకసారి సిద్రతుల్ మున్‌తహా వద్ద జిబ్రాయీల్‌ను దిగుతూ ఉండగా ఆయన చూశారు.

ఈ లాత్, ఈ ఉజ్జా, మనాత్‌లు అసలు ఇవి ఏమీకావు. మీరు మీ తాతముత్తాతలు పెట్టుకొన్న కొన్ని పేర్లు మాత్రమే. యధార్థమేమిటంటే వీళ్ళు కేవలం ఊహలు అంచనాలను అనుసరిస్తున్నారు. మనోవాంఛలకు దాసులయిపోయారు. నిజానికి వారి ప్రభువు తరఫు నుంచి వారి వద్దకు సన్మార్గం వచ్చేసింది.

రుకూ 2 : ఆకాశాలలో ఎంతోమంది దైవదూతలు ఉన్నారు. కాని వారిలో ఎవరి సిఫారసు ఎంత మాత్రం ఉపయోగపడదు. అల్లాహ్ తాను ఎవరి గురించయినా ఏదైనా విన్నపం వినదలిచి, తనకు ఇష్టులయిన వ్యక్తి అందుకు అనుమతి ఇస్తే తప్ప ఎవరి సిఫారసూ చెల్లదు. వారు కేవలం అంచనాలను అనుసరిస్తున్నారు. సత్యానికి బదులుగా ఈ అంచనాల వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. కాబట్టి ప్రవక్తా! భౌతిక జీవితం తప్ప మరో ఆలోచన లేని వ్యక్తిని, మా ప్రస్తావన విని ముఖం త్రిప్పుకునే వాడిని వాడి మానాన వదలిపెట్టు. పెద్దపెద్ద పాపాలకు, స్పష్టమైన అసభ్య చేష్టలకు దూరంగా ఉండేవారికి అల్లాహ్ మంచి ప్రతిఫలం ప్రసాదిస్తాడు. వారి వల్ల మహా అయితే కొన్ని పొరబాట్లు జరిగి ఉంటాయి. నిస్సందేహంగా నీ ప్రభువు క్షమాగుణ పరిధి చాలా విస్తృతమైనది.

రుకూ 3 : మూసా ప్రవక్త గ్రంథాలలోనూ, ఇబ్రాహీమ్ ప్రవక్త గ్రంథాలలోను వివరించబడిన విషయాలు వారికి తెలియవా! ఆ విషయాలు ఏమిటంటే, బరువు మోసేవాడెవడూ ఇతరుల బరువు మోయడు. మనిషి దేని కోసం కృషి చేస్తాడో అది తప్ప అతనికి మరొకటేదీ లభించదు. త్వరలోనే మనిషి కృషిని చూసి అందుకు తగిన ప్రతిఫలం పూర్తిగా అతడికి ఇవ్వడం జరుగుతుంది. చివరకు నీ ప్రభువు వద్దకే చేరవలసి ఉంది. ఆయనే నవ్విస్తున్నాడు, ఏడిపిస్తున్నాడు. మరణం ఇచ్చాడు. జీవితాన్ని ప్రసాదించాడు. విడిచే ఒక బిందువు ద్వారా ఆడమగల జంటను ఆయనే సృష్టించాడు. మరొక జీవితాన్ని ప్రసాదించడం కూడా ఆయనే చేస్తాడు. సంపన్నులను తయారు చేసింది ఆయనే. ఆస్తిపాస్తులు ప్రసాదించేది ఆయనే. సిరియస్ (అగ్ని నక్షత్రం)కు ప్రభువు ఆయనే. ఆయనే ప్రాచీన ఆద్ జాతిని, సమూద్, నూహ్ జాతులను నాశనం చేశాడు. కనుక ఓ మనిషి! నీ ప్రభువు అనుగ్రహాలను వేటిని అనుమానిస్తావూ!

54. అల్ ఖమర్

రుకూ 1 : ప్రజలు ప్రళయాన్ని తిరస్కరించారు. మనోవాంఛలను అనుసరించారు. ప్రతి వ్యవహారం చివరకు ఒక పర్యవసానానికి చేరవలసి ఉంది. ప్రళయ దినాన ప్రజలను పిలువడం జరిగినపుడు వారు బిక్కచచ్చిన చూపులతో తమ సమాధుల నుంచి చెల్లాచెదరయిన మిడుతల మాదిరిగా బయల్పడతారు. తిరస్కారులు అప్పుడు, "ఈ రోజు చాలా కఠినమైన రోజు" అంటుంటారు. మొదట నూహ్ జాతి తిరస్కరించింది. వాళ్ళు మా భక్తుణ్ణి అసత్యవాదిగా నిర్ణయించి పిచ్చివాడని అన్నారు. దారుణంగా కసరికొట్టారు. మేము కుంభవృష్టి కురిపించే ఆకాశ ద్వారాలను తెరిచాము. నూహ్‌ను పడవలో రక్షించాము. ఆ పడవను ఒక సూచనగా చేసి వదలిపెట్టాము. హితబోధకు సులభమార్గంగా ఖుర్ఆన్‌ను చేశాము. ఈ హితబోధను స్వీకరించే వారు ఎవరయినా ఉన్నారా? ఆద్ జాతి ప్రజలపై ప్రచండమైన తూఫాన్ గాలి పంపాము. వేళ్ళు తెగిన ఖర్జూరపు మొదళ్ళ మాదిరిగా ప్రజలను ఆ గాలి ఎత్తి కుదేసింది.

రుకూ 2 : సమూద్ జాతి ప్రజలు హెచ్చరికలు తిరస్కరించారు. ప్రవక్తను వేధించారు. అబద్ధాల రాయుడు, డంబాలు పలికేవాడు అన్నారు. దేవుని సూచన అయిన ఒంటెను చంపేశారు. మేము వారిపై ఒక ప్రేలుడు పడవేశాము. వారు నుగ్గునుగ్గు అయ్యారు. లూత్ తన జాతి ప్రజలను మా పట్టు గురించి హెచ్చరించారు. కాని ఆ ప్రజలు హెచ్చరికలను ఖాతరు చేయక ఎగురగొట్టారు. అతని అతిథులను అతడు రక్షించ కుండా నిరోధించడానికి ప్రయత్నించారు. వారిపైకి ఉదయం పూట రాళ్ళు విసిరే గాలిని పంపాము. తిరుగులేని శిక్ష వారిని పట్టుకొంది. మేము ఖుర్ఆన్‌ను హితబోధకు సులభ మార్గంగా చేశాము. కాబట్టి హితబోధ స్వీకరించే వారెవరయినా ఉన్నారా?

రుకూ 3 : ఫిర్ఔన్ ప్రజల వద్దకు కూడా హెచ్చరికలు వచ్చాయి. కాని వారు మా నిదర్శనాలన్నింటినీ తిరస్కరించారు. చివరకు మేము వారిని పట్టుకొన్నాము. మహత్తర శక్తి సంపన్నుడు పట్టుకునే విధంగా మీ అవిశ్వాసులు ఆ ప్రజల కంటే గొప్పవాళ్ళా! "మాది ఒక శక్తిమంతమైన వర్గం. మమల్ని మేం కాపాడుకోగలం" అంటున్నారా! త్వరలోనే ఈ వర్గం పరాజయం పాలవుతుంది. వారంతా వెన్ను చూపి పారిపోతూ ఉంటారు. కాని వారి పీచమణచడానికి అసలు సమయం ప్రళయదినమే. వారు బోర్లా అగ్నిలోకి ఈడ్చబడతారు. మరి, ఈ హితబోధను స్వీకరించే వారు ఎవరయినా

ఉన్నారా? వారు చేసిందంతా గ్రంథాలలో నమోదు చేయబడి ఉంది. అవిధేయతకు దూరంగా ఉండేవారు నిశ్చయంగా తోటలలో, కాలువలలో ఉంటారు. నిజమైన గౌరవ స్థానం, మహత్తర అధికారాలు గల చక్రవర్తికి సమీపంలో ఉంటారు.

55. అర్ రహ్మాన్

రుకూ 1 : అనంత కృపాకరుడయిన అల్లాహ్ ఈ ఖుర్ఆన్ బోధించాడు. ఆయనే మనిషిని సృష్టించి మాట్లాడడం నేర్పాడు. ఆయన ఆకాశాన్ని పైన అమర్చాడు. త్రాసును నెలకొలిపాడు. కనుక మీరు సమతూకాన్ని భంగపరచకండి. న్యాయంగా, ఖచ్చితంగా తూయండి. తూకంలో తక్కువ చేయకండి. భూమిపై ఉన్న రుచికరమైన ఫలాలు, రకరకాల ధాన్యాలు, మట్టితో మనిషిని సృష్టించడం, జిన్నాతులను అగ్ని జ్వాలతో పుట్టించడం, సముద్రాలలో ముత్యాలు, పగడాలు లభించడం సముద్రాలపై ఎత్తయిన ఓడలు నడవడం – ఇవన్నీ అల్లాహ్ అనుగ్రహాలే. కాబట్టి జిన్నాతులారా, మానవులారా! మీ ప్రభువు అనుగ్రహాలు వేటిని కాదనగలరు.

రుకూ 2 : భూమిపై ఉన్న ప్రతి వస్తువు నాశనమయ్యేదే. మహోన్నతుడు, మహోపకారి అయిన ప్రభువు మాత్రమే మిగిలి ఉండేవాడు. సమస్తమూ అవసరాల పరిపూర్తికి అల్లాహ్‌నే అర్థిస్తున్నాయి. ఆయన అనుక్షణం ఒక క్రొత్త వైభవంతో వెలుగుతుంటాడు. “జిన్నాతులారా, మానవులారా! మీరు భూమ్యాకాశాల సరిహద్దులు దాటి పారిపోగలిగితే పారిపోయి చూడండి. మీరు అలాంటి ప్రయత్నం చేస్తే మీపైకి అగ్నిజ్వాలను, పొగను వదలడం జరుగుతుంది. దానిని మీరు ఎదుర్కోలేరు. ప్రళయం రోజున యే మనిషిని లేదా జిన్నాతులను వారి పాపాల గురించి ప్రత్యేకంగా అడిగే అవసరం ఉండదు. అక్కడ అపరాధులు వారి ముఖాలను ఒట్టే గుర్తింపబడతారు. వారి నుదుటి జుట్టు, కాళ్ళు పట్టుకొని ఈడ్చుకుపోవడం జరుగుతుంది. అపరాధులు అబద్ధంగా కొట్టిపారేసిన నరకం ఇదే. ఈ నరకంలో మరుగుతున్న నీటిలో వాళ్ళు కొట్టుమిట్టాడుతుంటారు – మీరు మీ ప్రభువు శక్తిసామర్థ్యాలు వేటిని కాదనగలరు?

రుకూ 3 : ప్రభువు సన్నిధిలో హాజరు కావాలని భయపడుతూ బతికిన ప్రతి వ్యక్తికి రెండు తోటలు లభిస్తాయి. పచ్చని కన్నుల పండువయిన కొమ్మలు రెమ్మలతో నిండి ఉంటాయి. రెండు సెలయేర్లు ప్రవహిస్తూ ఉంటాయి. ప్రతి పండు రెండు విధాలుగా

ఉంటుంది. స్వర్గవాసులు దళసరి పట్టు వస్త్రం అంచులుగల తివాచీలపై దిండ్లకు ఆనుకొని కూర్చుని ఉంటారు. కెంపులు, ముత్యాల మాదిరిగా ఎంతో అందంగా ఉండే, సిగ్గులొలికే చూపులు గల సుకన్యలు ఉంటారు – మీ ప్రభువు అనుగ్రహాలను వేటిని కాదనగలరు? సత్కార్యానికి ప్రతిఫలం సత్కార్యం కాక మరేమిటి? ఆ రెండు తోటలు కాక మరో రెండు తోటలు ఉంటాయి. అవి దట్టమైన ముదురు ఆకుపచ్చ తోటలు. వాటిలో రెండు చెలమలు పొంగిపొరలుతుంటాయి. వాటిలో పండ్లు, ఫలాలు, ఖర్జూరాలు, దానిమ్మలు, పుష్కలంగా ఉంటాయి. శీలవతులు, సౌందర్యవతులు అయిన భార్యలు ఉంటారు. గుడారాలలో భద్రంగా ఉన్న సుందరీమణులు ఉంటారు. ఆకుపచ్చ తివాచీలపై, అందమైన, శ్రేష్ఠమైన పరుపులపై దిండ్లకు ఆనుకొని వారు కూర్చొని ఉంటారు. మీ ప్రభువు అనుగ్రహాలను వేటిని కాదనగలరు?

56. అల్ వాఖిఅహ్

రుకూ 1 : ప్రళయం నాడు మనుషులు మూడు వర్గాలుగా ఉంటారు. కుడి పక్షం వారు, ఎడమ పక్షం వారు, ముందున్న వారు. ముందున్న వారయితే వారు సాన్నిధ్యంలో ఉండేవారు. ముందు వారిలో చాలా మంది, ఇంకా వెనుక వారిలో తక్కువ మంది సకల భోగభాగ్యాలు నిండి ఉన్న స్వర్గవనాలలో ఉంటారు. వారు గోష్టులలో మధుపాత్రలు సరఫరా అవుతుంటాయి. రకరకాల రుచికరమైన ఫలాలు, పక్షి మాంసాలు వారి ముందు ఉంటాయి. వారి కొరకు అందమైన కళ్ళు గల 'హూర్' (రమణులు) ఉంటారు. అక్కడ వారు పాప విషయాలు గాని, పనికి మాలిన విషయాలు గాని వినరు. ఇక కుడిపక్షం వారు. దీర్ఘంగా పరుచుకొని ఉన్న నీడలు సతతం ప్రవహించే నీళ్ళు, నిరాటంకంగా, నిరంతరం లభించే పండ్లు ఫలాలు, ఎత్తయిన ఆసనాలు వారికి ఉంటాయి. వారి భార్యలను మేము ప్రత్యేకంగా రూపొందిస్తాము. వారిని సుకన్యలుగా చేస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు. సమవయస్కులై ఉంటారు. ఇదంతా కుడిపక్షం వారి కోసం. వీరిలో ముందువారు చాలా మంది ఉంటారు. వెనక వారు కూడా చాలా మంది ఉంటారు.

రుకూ 2 : ఇక ఎడమ పక్షం వారు. ఈ గతి పట్టక ముందు వారు సంపన్నులుగానే ఉండేవారు. ఎంత చెప్పినా వినక, మూర్ఖంగా పాపాలు చేస్తూ ఉండేవారు. మరణానంతర జీవితాన్ని తిరస్కరించారు. వీళ్ళు జఖ్ఖూమ్ చెట్టును ఆహారంగా

తింటారు. సలసల మరిగే నీటిని దప్పికగొన్న ఒంటెల మాదిరి తాగుతారు. మీరు విడిచే రేతస్సుతో బిడ్డను మీరు తయారు చేస్తున్నారా లేక మేమా? మీరు ఆలోచించరా? మీరు నాటే విత్తనాలలో పొలాన్ని మీరు పండిస్తున్నారా లేక మేమా? మీరు యోచించరా? మీరు త్రాగే నీటిని మేఘాల నుంచి కురిపించేది మీరా లేక మేమా? మీరు ఆలోచించరా? మీరు రాజేసే అగ్నికి సంబంధించిన వృక్షాన్ని సృష్టించింది మీరా లేక మేమా? మీరు ఆలోచించరా? ప్రవక్తా! మహోన్నతుడయినా నీ ప్రభువు నామాన్ని స్తుతించు.

రుకూ 3 : ఇది ఒక మహోన్నతమైన ఖుర్ఆన్. ఒక సురక్షితమైన గ్రంథంలో రాయబడి ఉంది. దీన్ని పరిశుద్ధమైన వాళ్ళు తప్ప మరెవ్వరూ తాకలేరు. సకల లోకాల ప్రభువు అవతరింపజేసిన గ్రంథం ఇది. అయినా, ఈ వాణిని మీరు తేలిగ్గా తీసుకొంటున్నారా! మీరు ఆజ్ఞకు కట్టుబడరా? మీరెవరి అధీనంలోనూ లేరా? సరే అయితే, చనిపోయే వాడి ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు అతను చనిపోతున్నాడని మీరు కళ్ళారా చూస్తూ ఉంటారు కదా! ఆ సమయంలో పోయే ప్రాణాన్ని మీరు తిరిగి ఎందుకు తీసుకు రాలేరు? ఆ సమయంలో మీ కన్నా మేమే ఆ వ్యక్తికి అతి దగ్గరగా ఉంటాము. చనిపోయే మనిషి పుణ్యాత్ముడయితే అతనికి గొప్ప స్వాగతం లభిస్తుంది. స్వర్గం లభిస్తుంది. ఒకవేళ అతడు తిరస్కరించిన మార్గభ్రష్టుడయితే అతనికి సలసల మరిగే నీళ్ళలో ఆతిథ్యం ఇవ్వబడుతుంది. నరకంలో విసరివేయబడతాడు.

57. అల్ హదీద్

రుకూ 1 : భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు అల్లాహ్. జీవితాన్ని, మరణాన్ని ప్రసాదించేది ఆయనే. ఆయనే ఆరంభం, ఆయనే అంతం, ఆయనే బాహ్యము ఆయనే గోప్యమూ ఆయనకు ప్రతిదీ తెలుసు. భూమి లోపలకు పోయేది, అందులో నుంచి వెలికి వచ్చేది, ఆకాశం నుంచి దిగేది, దాని లోపలకు ఎక్కేది అంతా ఆయనకు తెలుసు. మీరు ఎక్కడ ఉన్నా ఆయన మీతో ఉంటాడు. యే పని చేస్తున్నా ఆయన చూస్తూ ఉన్నాడు. విశ్వసించి ధనం ఖర్చుపెట్టిన వారికి మంచి ప్రతిఫలం ఉంది. తన దాసునికి స్పష్టమైన వాక్యాలు అందజేస్తూ ఉన్నవాడు అల్లాహ్యే. వాటి ద్వారా ఆయన మిమ్మల్ని చీకటి నుంచి వెలుగులోకి తీసుకు రాదలిచాడు. అసలు మీరు అల్లాహ్ మార్గంలో

ఖర్చుపెట్టకపోడానికి కారణం ఏమిటి? వాస్తవానికి భూమ్యాకాశాల వారసత్వం కేవలం అల్లాహ్‌దే.

రుకూ 2 : అల్లాహ్‌కు మంచి రుణం ఇచ్చేవాడు ఎవడయినా ఉన్నాడా? అలాంటి వారికి అల్లాహ్ అందుకు ఎన్నో రెట్లు పెంచి తిరిగి ఇస్తాడు. విశ్వాసులయిన స్త్రీ పురుషులకు వారి ముందు, వారి కుడివైపున వారి వెలుగు పడుగెడుతూ కనబడు తుంది. కపట స్త్రీ పురుషులు, విశ్వాసులతో "కాస్త మా వైపు చూడండి. మీ వెలుగు ద్వారా కాస్త ప్రయోజనం పొందుతాం" అని అడుగుతుంటారు. విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావనతో చలించపోయే సమయం, ఆయన అవతరింపజేసిన సత్యం ముందు వంగిపోయే సమయం ఇంకా రాలేదా? గత కాలంలో గ్రంథం ఇవ్వబడిన ప్రజల మాదిరిగా వీళ్ళు అయిపోరాదు. ఒక సుదీర్ఘ కాలం తర్వాత ఆ ప్రజల హృదయాలు కఠినమైపోయాయి. అల్లాహ్‌ను, ప్రవక్తను విశ్వసించిన వారే ప్రభువు దృష్టిలో సత్యసంధులు (సిద్దీఖ్). సత్యానికి సాక్షులు (షాహిద్) వారికి వారి ప్రతిఫలం, ప్రకాశం లభిస్తాయి.

రుకూ 3 : ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, ఒక వినోదం, ఒక పటాటోపం. పరస్పరం ప్రగల్భాలు పలుకడం, సంపద, సంతానాల విషయంలో ఒండొరులతో పోటీపడడం తప్ప మరేమీ కాదు. ఇది ఒక మాయ తడిక తప్ప మరేమీ కాదు. మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు పరుగెత్తండి. ఒకరికన్నా ముందు మరొకరు చేరాలని పోటీపడండి. ఆకాశాలంత, భూమి అంత విశాలమైన స్వర్గం వైపునకు పరుగెత్తండి. అల్లాహ్‌ను, దైవప్రవక్తలనూ విశ్వసించిన వారి కోసం సిద్ధం చేయబడింది స్వర్గం. తామే గొప్పవార మని గర్వించే వారిని అల్లాహ్ ప్రేమించడు. వారు స్వయంగా లోభత్వం చూపడమే కాదు ఇతరులను కూడా పిసినారితనం చూపేలా పురికొలుపుతారు. మేము మా ప్రవక్తలను స్పష్టమైన నిదర్శనాలతో, హితోపదేశాలతో పంపాము. ప్రజలు న్యాయంపై నిలబడాలని, వారితోపాటు త్రాసును, గ్రంథాన్ని అవతరింపజేశాము. ఇనుమను దింపాము. అందులో మహత్తరమైన శక్తి ఉంది. ప్రజలకు ప్రయోజనాలు ఉన్నాయి.

రుకూ 4 : నూహ్, ఇబ్రాహీమ్ సంతతిలో కొందరు సన్మార్గాన్ని అవలంబించారు. కాని చాలా మంది అవిధేయులై పోయారు. ఆ పిదప మేము వరుసగా ప్రవక్తలను పంపాము. మర్యమ్ పుత్రుడు ఈసాను అవతరింపజేశాము. ఆయనకు 'ఇంజీల్' ఇచ్చాము. ఆయన్ను అనుసరించిన ప్రజలు ఆ పిదప తమకు తామే వైరాగ్యాన్ని (రూహ్

బానియత్) కనిపెట్టారు. అల్లాహ్ ప్రసన్నత పొందడానికని వారు స్వయంగా సృష్టించిన దురాచారం ఇది. తరువాత దాన్ని పాటించడంలో న్యాయం చేయలేకపోయారు. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. అల్లాహ్ ప్రవక్తను విశ్వసించండి. అల్లాహ్ మీకు తన కారుణ్యంలో నుంచి రెట్టింపు భాగాన్ని ప్రసాదిస్తాడు. జ్యోతిని ప్రసాదిస్తాడు. దాని వెలుగులో మీరు నడుస్తారు.

58. అల్ ముజాదలహ్

రుకూ 1 : 'జిహార్' ద్వారా భార్యలను దూరం చేసిన వారికి వారి భార్యలు తల్లులై పోరు. వారిని కన్నవారే వారి తల్లులు. జిహార్ ద్వారా భార్యలను దూరం చేసిన వారు తరువాత మాటను వెనక్కి తీసుకోదలిస్తే, వారు ఉభయులు ఒకరినొకరు తాకక ముందు ఒక బానిసకు స్వేచ్ఛ కల్పించాలి. బానిస లభించకపోతే భర్త వరుసగా రెండు నెలల పాటు ఉపవాసం ఉండాలి. లేదా అరవై మంది నిరుపేదలకు అన్నం పెట్టాలి. ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. మేము స్పష్టమైన వాక్యాలు అవతరింపజేశాము. తిరస్కారులకు తీవ్రమైన అవమానకరమైన శిక్షపడుతుంది. తాము చేసిన పనులను ప్రజలు మరచిపోతారు. కాని అల్లాహ్ వారు చేసినవన్నీ లెక్కబెట్టి భద్రంగా ఉంచాడు.

రుకూ 2 : ముగ్గురు కలసి మంతనాలు జరుపుతున్నప్పుడు నాలుగోవానిగా అల్లాహ్ ఉండకపోవడమన్నది జరుగదు. అయిదుగురు మంతనాలు చేస్తున్నప్పుడు ఆరోవానిగా అల్లాహ్ ఉంటాడు. రహస్య సమాలోచనలు చేసేవారు ఇంతకన్నా తక్కువ మంది ఉన్నా లేక ఎక్కువ మంది ఉన్నా వారు ఎక్కడ ఉన్నా అల్లాహ్ వారితోపాటు ఉంటాడు. విశ్వాసులారా! మీరు గనుక రహస్యంగా మాట్లాడుకొంటుంటే పాపం, దౌర్జన్యం, ప్రవక్త పట్ల అవిధేయతలకు సంబంధించిన విషయాలు కాక, దైవభీతికి సంబంధించిన విషయాలు మాట్లాడుకోండి. రహస్య మంతనాలు జరుపడం షైతాను చేష్ట. విశ్వసించిన ఓ ప్రజలారా! మీ సమావేశాలలో వచ్చే వారికి చోటు కల్పించండని మీకు చెప్పినపుడు వారికి చోటు కల్పించండి. లేచి వెళ్ళండని మీతో అన్నప్పుడు లేచి వెళ్ళండి. నమాజ్ స్థాపించండి. జకాత్ ఇవ్వండి. అల్లాహ్‌కు దైవప్రవక్తకూ విధేయత చూపండి.

రుకూ 3 : అల్లాహ్ ఆగ్రహానికి గురయిన వర్గం- అంటే యూదులను కొందరు ముస్లిములు మిత్రులుగా చేసుకొన్నారు. వాళ్ళు అసత్య విషయాలపై ప్రమాణాలు

చేస్తారు. ప్రమాణాలను అడ్డుపెట్టుకొని, ప్రజలను అల్లాహ్ మార్గాన అడ్డుకొంటుంటారు. వారందరినీ అల్లాహ్ లేపిన రోజు, ఆయన ముందు కూడా వారు మీ ముందు చేసినట్లే ప్రమాణాలు చేస్తారు. వారు షైతాన్ పక్షానికి చెందిన వారు షైతాన్ పక్షం వారే నష్టానికి గురి అయ్యేవారు. అల్లాహ్‌ను, పరలోకాన్ని విశ్వసించేవారు, అల్లాహ్‌ను, పరలోకాన్ని కాదనే వారిని ప్రేమించడం అనేది ఉండదు. అలా కాదనే వారు సొంత తల్లిదండ్రులయినా, కుమారులైనా, సోదరులైనా సరే లేదా వారి కుటుంబీకులైనా సరే. వారు అల్లాహ్ పక్షానికి చెందిన వారు. అల్లాహ్ పక్షం వారే సాఫల్యం పొందుతారు.

59. అల్ హష్ర్

రుకూ 1 : అల్లాహ్ యూదులను వారి ఇళ్ళ నుంచి గెంటివేశాడు. వారి నొసట దేశ బహిష్కారాన్ని అల్లాహ్ రాశాడు. వారు అల్లాహ్‌ను దైవప్రవక్తను వ్యతిరేకించినందు వల్లనే ఇదంతా జరిగింది. అల్లాహ్ వారి నుంచి లాక్కుని ప్రవక్తకు ఇచ్చిన ఆస్తులలో అల్లాహ్‌కు, ప్రవక్తకు, బంధువులకు, అనాధులకు, నిరుపేదలకు, బాటసారులకు హక్కు ఉంది. తమ ఇళ్ళ నుంచి ఆస్తిపాస్తుల నుంచి తరిమివేయబడిన నిరుపేద శరణార్థులకు హక్కు ఉంది. శరణార్థుల రాకకు ముందు విశ్వసించి వలస కేంద్రంలో స్థిరపడిన వారికి కూడా హక్కు ఉంది. వారు తమ వద్దకు వలస వచ్చిన వారిని ప్రేమిస్తారు. వారు స్వయంగా అగత్యం కలవారు. అయినప్పటికీ తమ కంటే ఇతరులకే ప్రాధాన్యం ఇస్తారు. ఆ తర్వాత వచ్చిన వారికి కూడా ఆ ఆస్తులలో హక్కు ఉంది.

రుకూ 2 : మదీనాలోని కపటులు గ్రంథ ప్రజలతో "ఒకవేళ మిమ్మల్ని బహిష్కరించడం జరిగితే మేము కూడా మీతో వస్తాం. మీతో యుద్ధం జరిగితే మీకు సహాయం చేస్తాం" అంటారు. కాని వీళ్ళు పరమ అబద్ధాలకోరులు. వారు బహిష్కరించబడితే వీళ్ళు వారితో పాటు ఎంత మాత్రం వెళ్ళరు. వారికి యే మాత్రం సహాయపడరు. వీళ్ళ గుండెల్లో అల్లాహ్ భయం కంటే మీ భయమే ఎక్కువగా ఉంది. వీళ్ళు ఐక్యంగా లేరు. వీళ్ళ మనస్సులు చీలిపోయి ఉన్నాయి. వీళ్ళ పరిస్థితి షైతాన్ పరిస్థితి వంటిది. షైతాన్ మొదట మనిషిని 'సత్యాన్ని తిరస్కరించు' అని చెబుతాడు. కాని మనిషి సత్యాన్ని తిరస్కరించిన తర్వాత వాడు మనిషితో "నా బాధ్యత యేదీ లేదు. సకలలోక ప్రభువు అల్లాహ్ అంటే నాకు భయం" అంటాడు. ఆ యుద్ధం పర్యవసానం నరకానికి శాశ్వతంగా పోవడమే.

రుకూ 3 : విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. ప్రతి మనిషి రేపటి కోసం తానేమి సమకూర్చుకొన్నాడో చూసుకోవాలి. అల్లాహ్‌ను విస్మరించిన వారి మాదిరిగా మీరు మారిపోకండి. అల్లాహ్‌ను విస్మరించడం వల్ల వారిని తమను తాము మరచిపోయేలా చేశాడు అల్లాహ్. నరకానికి పోయేవారు, స్వర్గానికి పోయేవారు, స్వర్గానికి పోయేవారు ఎన్నటికీ ఒకటి కాలేదు. స్వర్గానికి పోయేవారే సాఫల్యం పొందిన వారు. దృశ్యాదృశ్య విషయాలన్నీ తెలిసినవాడు అల్లాహ్‌యే. కరుణామయుడు, కృపాశీలుడు, ఆయన తప్ప ఆరాధ్యుడు ఎవడూలేడు. ఆయనే చక్రవర్తి. ఎంతో పవిత్రుడు, సురక్షితుడు, శాంతిప్రదాత, సంరక్షకుడు, సర్వాధికుడు, తన ఉత్తర్వులు తిరుగులేని విధంగా అమలు పరిచేవాడు. ఎల్లప్పుడు గొప్పవాడిగా ఉండేవాడు, సృష్టి వ్యూహాన్ని రచించేవాడు. దానిని అమలుపరచేవాడు. ఆ ప్రకారం రూపకల్పన చేసేవాడు. ఇవి ఆయనక్కు అత్యుత్తమ పేర్లు.

౬౦. అల్ ముమ్‌తహినహ్

రుకూ 1 : విశ్వసించిన ప్రజలారా! నాకూ, మీకు శత్రువులయిన వారితో మైత్రి చేయకండి. ఈ ప్రజలు సత్యాన్ని తిరస్కరించారు. ప్రవక్త, ఆయన సహచరులు మీ ప్రభువు అల్లాహ్‌ను విశ్వసించినందువల్ల వీళ్ళు ప్రవక్తనూ, ఆయన సహచరులను దేశం నుంచి బహిష్కరించేశారు. వీళ్ళు గనుక మీపై అదుపు సాధిస్తే ఇక తమ చేష్టలతో మాటలతో మిమ్మల్ని వేధిస్తారు. మీకు ఇబ్రాహీమ్, ఆయన అనుచరుల్లో మంచి ఆదర్శం ఉంది. వారు తమ జాతి వారితో స్పష్టంగా "మాకు, మీకు మధ్య శాశ్వత వైరం విరోధాలున్నాయని" చెప్పారు. ఈ ఆదర్శాన్ని ఎవరయినా కాదంటే అల్లాహ్ ఏ అవసరమూ లేని వాడు, స్వతహాగా ప్రశంసనీయుడు అని తెలుసుకోవాలి.

రుకూ 2 : అవిశ్వాసులలో రెండు రకాల ప్రజలు వున్నారు. ఒక వర్గం ముస్లిములతో ధర్మం విషయంలో యుద్ధం చేయనివారు. ముస్లిములను వారి ఇళ్ళ నుంచి బహిష్క రించడం చేయరు. అలాంటి వారి పట్ల మీరు మంచిగా, న్యాయంగా వ్యవహరించండి. ఇక రెండవ వర్గం వారు, ధర్మం విషయంలో ముస్లిములతో యుద్ధం చేస్తారు. వారిని ఇళ్ళ నుంచి గెంటివేస్తారు. ఇలాంటి వారితో మైత్రి చేసేవారే దుర్మార్గులు. విశ్వసించిన ప్రజలారా! విశ్వసించిన స్త్రీలు హిజ్రత్ చేసి మీ వద్దకు వచ్చినపుడు వారు విశ్వాసు

లయినదీ లేనిది బాగా విచారించండి. వారు విశ్వసించిన వారేనని తెలిశాక వారిని అవిశ్వాసుల వద్దకు వాపసు పంపకండి. ఓ ప్రవక్తా! విశ్వసించిన స్త్రీలు తాము షిర్క్ చేయబోమని, దొంగతనం చేయమని, వ్యభిచారం చేయము అనీ, తమ సంతానాన్ని చంపం అనీ, ఎలాంటి అపనిందను కల్పించి తీసుకురాము అనీ, ధర్మసమ్మతమైన మంచి విషయాలలో మీ పట్ల అవిధేయత చూపము అని ప్రతిజ్ఞ చేయడానికి మీ వద్దకు వచ్చినపుడు వారి నుంచి బైత్ తీసుకోండి.

61. అస్ సఫ్

రుకూ 1 : విశ్వసించిన ప్రజలారా! మీరు చేయని పనులను చేస్తాం అంటారెందుకు? ఇది అల్లాహ్‌కు యే మాత్రం రుచించని విషయం. మర్యమ్ పుత్రుడు ఈసా భవిష్యవాణి వినిపిస్తూ తన తర్వాత ఒక ప్రవక్త రానున్నారని చెప్పారు. ఆ ప్రవక్త పేరు 'అహ్మద్' అయి ఉంటుందని తెలిపారు. కాని, ఆ ప్రవక్త ప్రజల వద్దకు స్పష్టమైన నిదర్శనాలు తీసుకొని వచ్చినపుడు వాళ్ళు ఇదంతా పచ్చిమోసం అన్నారు. వీళ్ళు అల్లాహ్ జ్యోతిని తమ నోటితో ఊది ఆర్పేయాలనుకొంటున్నారు. కాని అల్లాహ్ తన ప్రకాశాన్ని పూర్తిగా వ్యపింపజేయాలని నిర్ణయించుకొన్నాడు. ఆయనే తన ప్రవక్తకు హితబోధ, సత్యధర్మం ఇచ్చి దాన్ని సమస్త ధర్మాలపై ప్రాబల్యం వహించేలా చేయడానికి పంపినవాడు. ఇది ముష్రిక్కులకు ఎంత అయిష్టం అయినా సరే.

రుకూ 2 : విశ్వసించిన ప్రజలారా! మిమ్మల్ని వ్యధాభరితమైన శిక్ష నుంచి కాపాడే ఉపాయమేమిటో చెప్పనా! అల్లాహ్‌ను విశ్వసించండి. దైవప్రవక్తను విశ్వసించండి. అల్లాహ్ మార్గాన మీ ధన ప్రాణాలు ఒడ్డి జిహాద్ చేయండి. మీరు గ్రహిస్తే ఇదే మీకు మంచిది. అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు. స్వర్గంలో ప్రవేశపెడతాడు. ఇదే గొప్ప సాఫల్యం. అంతేకాదు మీకు సహాయం విజయం కూడా అనుగ్రహిస్తాడు. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు మద్దతుదారులై పొండి. మీ కన్నా ముందు హవారీలు "మేము అల్లాహ్ మద్దతుదారులం" అన్నారు.

62. అల్ జుముఅహ్

రుకూ 1 : నిరక్షరాస్యులలో (ఉమ్మీలు) ఒక ప్రవక్తను స్వయంగా వారి నుంచే ఉద్భవింపజేశాడు అల్లాహ్. ఆ ప్రవక్త వారికి అల్లాహ్ వాక్యాలను వినిపిస్తున్నాడు.

వారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాడు. వారికి గ్రంథాన్ని వివేకాన్ని బోధిస్తున్నాడు. వాస్తవానికి, ఇంతకు మునుపు ఈ ప్రజలు స్పష్టమైన అపమార్గాన పడి ఉండేవారు. తౌరాత్ గ్రంథం బాధ్యతను ఎవరికైతే అప్పగించడం జరిగిందో వారు ఆ భారాన్ని మోయలేదు. వారి పరిస్థితి పుస్తకాల బరువు మోసే గాడిద వంటిది. దుర్మార్గులకు చెప్పండి. యే చావు నుంచి వీళ్ళు పారిపోతున్నారో అది తప్పక వస్తుంది.

రుకూ 2 : విశ్వసించిన ప్రజలారా! శుక్రవారం నాడు నమాజుకు మిమ్మల్ని పిలిచి నపుడు అల్లాహ్ స్మరణ వైపునకు పరుగెత్తండి. క్రయవిక్రయాలు వదలండి. ఇదే మీకు మంచిది. నమాజు పూర్తి అయిన పిదప భూమిపై వ్యాపించండి. అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి. అల్లాహ్ వద్ద ఉన్నది వినోద వ్యాపకాల కంటే, వ్యాపారం కంటే ఎంతో శ్రేష్ఠమైనది. అల్లాహ్ అందరికంటే మేలయిన ఉపాధి ప్రదాత.

63. అల్ మునాఫిఖూన్

రుకూ 1 : కపటులు నోటితో "మీరు అల్లాహ్ ప్రవక్తలు" అని అంటారు. కాని వాళ్ళు పచ్చి అబద్ధాలకోరులు. వాళ్ళు విశ్వసించిన తర్వాత తిరస్కారానికి పాల్పడ్డారు. వారి రూపాలు మీకు ఎంతో గొప్పగా కనిపిస్తాయి. మాట్లాడుతుంటే వారి మాటలు నీవు వింటూ ఉండిపోతావు. కాని నిజానికి వీళ్ళు గోడకు ఆనించిన కొయ్య దుంగల వంటివారు. ఆగర్భ శత్రువులు. వారికి దూరంగా ఉండండి. ప్రవక్తా! నీవు వారి కోసం క్షమా ప్రార్థన చేసినా, చేయకపోయినా, అల్లాహ్ వారిని ఎంతమాత్రం క్షమించడు. "ప్రవక్త అనుచరుల కోసం ఖర్చుపెట్టడం ఆపేయండి. వాళ్ళు చెల్లాచెదురు అయి పోతారు" అంటున్నది వీళ్ళే.

రుకూ 2 : విశ్వసించిన ప్రజలారా! మీ సంపద, మీ సంతానం మిమ్మల్ని దైవస్మరణను మరచేలా చేయరాదు ఇలా చేసిన వారే నష్టానికి గురయ్యేది. మీకు మృత్యు సమయం రాక ముందే ఖర్చుపెట్టండి. ప్రభూ! నేను దానాలు చేసి సజ్జనులలో కలవడానికి నాకు మరికాస్త వ్యవధి ఎందుకు లభించలేదు అని వాపోయే సమయం రాక ముందే ఖర్చు పెట్టండి. ఎవరికయినా వారికివ్వబడిన వ్యవధి పూర్తయ్యే సమయం వచ్చినపుడు ఆ వ్యక్తికి అల్లాహ్ వ్యవధి పొడిగించడం యే మాత్రం జరుగదు.

64. అత్ తగాబున్

రుకూ 1 : మిమ్మల్ని పుట్టించింది అల్లాహ్యే. మీలో కొందరు అవిశ్వాసులుగా, కొందరు విశ్వాసులుగా ఉన్నారు. మీరు దాచేదీ, మీరు ప్రకటించేది అంతా అల్లాహ్కు తెలుసు. ఆయన మనస్సుల పరిస్థితిని సయితం తెలిసినవాడు. మీకు పూర్వం ప్రజలు కూడా ప్రవక్తలను తిరస్కరించారు. ఆ ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు, చిహ్నాలు తీసుకొచ్చినవారు. అయినా తిరస్కరించిన వారు తాము మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరుగదని అన్నారు. వారికి చెప్పు. "నా ప్రభువుపై ఒట్టు, మీరు మళ్ళీ తప్పక బ్రతికించబడతారు. మహా సమావేశం రోజున అందరిని ఒక చోట చేర్చినపుడు, ఆ రోజు ప్రజలు ఎవరు సాఫల్యం పొందారో, ఎవరు వైఫల్యం పొందారో స్పష్టమయ్యే రోజు. విశ్వసించి సత్కార్యాలు చేసిన వారిని స్వర్గాలలో ప్రవేశపెడ్తాడు. నూ వాక్యాలను తిరస్కరించినవారు నరకవాసులు అవతారు.

రుకూ 2 : అల్లాహ్ అనుమతి లేనిదే ఎలాంటి ఆపదయినా సరే రావడం అన్నది జరుగదు. అల్లాహ్కు విధేయత చూపండి. దైవప్రవక్త (సఅసం) కు విధేయత చూపండి. మీరు విధేయత చూపక ముఖం త్రిప్పుకొంటున్నారా, సరే సత్యాన్ని స్పష్టంగా అందజేయడం తప్ప మరో బాధ్యత యేదీ మా ప్రవక్తపై లేదు. విశ్వసించిన వారు కేవలం అల్లాహ్ను మాత్రమే నమ్ముకోవాలి. మీ సిరిసంపదలు, మీ సంతానం మీకొక పరీక్ష, ప్రతిఫలం అన్నది అల్లాహ్ వద్దనే ఉంది. అందువల్ల అల్లాహ్కు భయపడుతూ ఉండండి. వినండి. విధేయత చూపండి. మీ ధనం ఖర్చు పెట్టండి. ఇదే మీకు మంచి వైఖరి. మీరు అల్లాహ్కు మంచి రుణాన్ని ఇస్తే అల్లాహ్ అది ఎన్నో రెట్లు పెంచి మీకు ఇస్తాడు. మీ పొరబాట్లను మన్నిస్తాడు. అల్లాహ్ యోగ్యత గుర్తించేవాడు, మహా శక్తిసంపన్నుడు.

65. అత్ తలాఖ్

రుకూ 1 : ఈ రుకులో క్రింది ఆదేశాలు ఉన్నాయి. 1)బహిష్టు కాలంలో స్త్రీకి విడాకులు ఇవ్వకండి. 2) ఇద్దత్ (నిర్ణీతగడువు) కాలాన్ని ఖచ్చితంగా లెక్క కట్టండి. 3) ఇద్దత్ కాలంలో వారిని వారి ఇళ్ళ నుంచి వెళ్ళ గొట్టకండి. స్వయంగా, వారు కూడా వెళ్ళ రాదు. 4) ఇద్దత్ గడువు ముగిసినప్పుడు వారిని మంచి పద్ధతితో వివాహ బంధంలో

ఉంచుకోండి. లేదా మంచి పద్ధతితో సాగనంపండి. 5) ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా పెట్టుకోండి. అల్లాహ్‌కు భయపడుతూ పనిచేసే వాడికి, వాడి కష్టాల నుంచి బయటపడే మార్గాన్ని అల్లాహ్ చూపుతాడు. అతడు ఊహించనయినా ఊహించని మార్గాల నుంచి ఉపాధి అందిస్తాడు. 6) బహిష్టు ఆగిపోయిన స్త్రీలకు ఇద్దత్ గడువు మూడు మాసాలు. 7) గర్భిణీ స్త్రీల ఇద్దత్ గడువు వారి కాన్పు అయ్యే వరకు ఉటుంది. 8) ఇద్దత్ కాలంలో మీరు నివసిస్తున్న చోటనే ఉంచండి. వారిని వేధించకండి. 9) గర్భిణీ స్త్రీ అయితే కాన్పు అయ్యే వరకు పూర్తి ఖర్చు భరించండి. తర్వాత వారు బిడ్డకు పాలు పడుతుంటే వారి ప్రతిఫలం వారికి ఇవ్వండి. 10) స్థితిపరుడయిన వ్యక్తి తన ఆర్థిక స్తోమతను బట్టి ఖర్చులు ఇవ్వాలి. తక్కువ ఉపాధి గల వ్యక్తి అల్లాహ్ తనకిచ్చిన ధనం నుంచే ఖర్చుపెట్టాలి.

రుకూ 2 : విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ మీ వైపునకు ఒక హితబోధను పంపాడు. స్పష్టంగా హితబోధను ఇచ్చే అల్లాహ్ వాక్యాలను ప్రవక్త మీకు వినిపిస్తున్నాడు. తద్వారా విశ్వాసులను, సత్కర్మలు ఆచరించే వారిని చీకట్ల నుంచి వెలికి తీసి వెలుగులోకి తీసుకురావాలని. విశ్వసించి సత్కార్యాలు చేసిన వారు స్వర్గంలో ప్రవేశపెట్టబడతారు.

66. అత్ తహ్రీమ్

రుకూ 1 : ప్రవక్తా! అల్లాహ్ మీకు ధర్మసమ్మతం చేసిన దానిని మీరెందుకు నిషేధించుకొంటున్నారు? నీవు నీ భార్యల సంతోషం కోరుతున్నావా? ప్రవక్త తనకు చెప్పిన ఒక రహస్యాన్ని ప్రవక్త భార్య ఒకరు మరొకరి ముందు చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని అల్లాహ్ ప్రవక్తకు తెలియజేశాడు. మీరు ఉభయులు పశ్చాత్తాపపడితే అది మీకు శ్రేయస్కరం. అల్లాహ్ ప్రవక్తకు యజమాని. ఆ తర్వాత జిబ్రయీల్‌కు, సజ్జనులైన విశ్వాసులు, దైవదూతలు అందరూ ఆయనకు సహచరులు. సహాయకులు. విశ్వసించిన ప్రజలారా! మీరు స్వయాన మిమ్మల్ని, మీ కుటుంబ సభ్యులను రాళ్ళు మనుషులు ఇందనం అయ్యే అగ్ని నుంచి కాపాడుకోండి. ఈ అగ్నిపై అమిత బలశాలులు, అత్యంత కఠినులు అయిన దైవ దూతలు నియమించబడి ఉంటారు.

రుకూ 2 : విశ్వసించిన ప్రజలారా! పశ్చాత్తాపంతో అల్లాహ్ వైపునకు మరలండి. చిత్తశుద్ధితో కూడిన పశ్చాత్తాపం. అల్లాహ్ మీ చెడులను దూరం చేస్తాడు. స్వర్గంలో ప్రవేశపెడ

తాడు. ప్రవక్తా! అవిశ్వాసులతో కపటులతో పోరాడండి. వారి పట్ల కఠినంగా వ్యవహరించండి. నూహ్, సాలెహ్ ప్రవక్తల భార్యలు, సజ్జనులైన మాయిద్దరు దాసుల వివాహ బంధంలో ఉన్నప్పటికీ వాళ్ళు భర్తలకు ద్రోహం చేశారు. వారిని "వెళ్ళండి. అగ్నిలోకి పోయే వాళ్ళతో పాటు మీరూ పొండి" అనడం జరిగింది. విశ్వసించిన ప్రజలకు ఫిరౌను భార్య, ఇమ్రాన్ కూతురులు మంచి ఉదాహరణలు. ఫిరౌన్ భార్య అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, "ఓ నా ప్రభూ! నాకు స్వర్గంలో ఇంటిని నిర్మించు. నన్ను ఫిరౌన్ నుంచి, అతడి చేష్టల నుంచి కాపాడు. దుర్మార్గపు జాతి నుంచి నాకు విముక్తి ప్రసాదించు" అని వేడుకొన్నది.

67. అల్ ముల్క్

రుకూ 1 : అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించి చూడాలనీ, మీలో ఎవరు మంచి ఆచరణ పాటిస్తాడో చూడాలని జీవనర్మణాలు సృష్టించాడు. అల్లాహ్ సృష్టిలో మీకు ఎలాంటి క్రమ రాహిత్యమూ కనబడదు. కాస్త మరోసారి చూడండి. ఎక్కడైనా ఏదైనా లోపం కనిపిస్తుందా? మళ్ళీ, మళ్ళీ చూడండి. మీ దృష్టి అలసిపోయి విఫలమై వెనక్కి వస్తుంది. ప్రభువును తిరస్కరించిన ప్రజలకు నరక శిక్ష ఉంది. వారు దాని భయంకర గర్జనలు వింటారు. అది ఉద్రేకంతో ఊగుతుంటుంది. దాని కావలి వారు నరకవాసులను "మీ వద్దకు హెచ్చరించేవాడు రాలేదా?" అనడుగుతారు. జవాబుగా "అవును, హెచ్చరించేవాడు మా వద్దకు వచ్చాడు. కాని మేము తిరస్కరించాము" అయ్యో! మేం మాట విని అర్థం చేసుకొని ఉంటే, నేడు ఈ ఎగసే మంటల శిక్షకు గురి అయ్యే వారం కాదు గదా! అంటారు వాళ్ళు. చూడకపోయినా ప్రభువునకు భయపడే వారికి మన్నింపు గొప్ప ప్రతిఫలం లభిస్తాయి.

రుకూ 2 : మీకు భూమిని అధీనపరిచినవాడు ఆయనే. దాని రొమ్ముపై తిరగండి. దేవుడిచ్చిన ఆహారాన్ని తినండి. ఆయన వద్దకే రెండోసారి బ్రతికి వెళ్ళవలసి ఉంది. తమపై ఎగిరే పక్షులు ఏ విధంగా రెక్కలు చాపుతూ ముడుచుకొంటూ ఎగురుతున్నాయో వీళ్ళు చూడడం లేదా? వాటిని నిలబెడుతున్నది కరుణామయుడైన అల్లాహ్ తప్ప మరెవ్వరూ కాదు. కరుణామయుడు మీకు ఆహారాన్ని ఇవ్వడం ఆపేస్తే మీకింకా ఎవరు ఆహారం ఇవ్వగలడు. వారికి చెప్పండి. మిమ్మల్ని పుట్టించింది అల్లాహ్‌యే. మీకు చూసే, వినే శక్తులు ప్రసాదించాడు. ఆలోచించే, అర్థం చేసుకొనే హృదయాలు

ఇచ్చాడు. కాని మీరు కృతజ్ఞత తెలుపడం అన్నది అరుదు. అల్లాహ్ నన్ను నా సహచరులను నాశనం చేయవచ్చు లేదా మమ్మల్ని కరుణించవచ్చు కాని తిరస్కారులను బాధాకరమైన శిక్ష నుంచి ఎవరు రక్షిస్తారు? ఈ విషయమై ఎప్పుడయినా ఆలోచించారా? అని వారిని అడుగు. వారికి చెప్పు ఆయన ఎంతో కరుణామయుడు ఆయన్నే విశ్వసించామని చెప్పు. ఆయన్నే నమ్ముకొన్నామని చెప్పు. ఎవరు మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నది. త్వరలోనే తేలిపోతుంది. మీ బావుల నీరు భూమిలోనికి ఇంకిపోతే ఆ నీటి ఊటల ప్రవాహాలను మళ్ళీ మీ కోసం బయటకు లాగేదెవురు? ఈ విషయం ఎప్పుడన్నా ఆలోచించారా? అని వారిని అడుగు.

68. అల్ ఖలమ్

రుకూ 1 : ప్రవక్తా! మీకు ఎన్నటికీ తరగని ప్రతిఫలం లభిస్తుంది. నిస్సందేహంగా నీవు మహోన్నత నైతికత కలవాడవు. నీ ప్రభువు మార్గం తప్పిన వారెవరో బాగా తెలిసినవాడు. రుజుమార్గాన ఉన్న వారెవరో కూడా తెలిసినవాడు. తిరస్కారుల ఒత్తిడికి మీరు ఎంతమాత్రం లోనవకండి. నీవు అణగిమణగి పని చేయాలని కోరుతున్నారు వీళ్ళు. అప్పుడు వీళ్ళు కూడా మెతకగా ఉందామనుకొంటున్నారు - తోట యజమానులు "రేపు ఉదయం తోటలోని పండ్లు కోద్దామని" భావించి ఆ రాత్రి నిద్రపోయారు. కాని ఆ రాత్రి అల్లాహ్ తరఫు నుంచి ఆ తోటపై ఒక ఆపద వచ్చిపడింది. పొద్దుట వాళ్ళు తోట వైపునకు బయలుదేరుతూ బీదవాళ్ళను తోట వైపు రానీయరాదనీ, దానం, అస్సలు ఏమీ ఇవ్వకూడదని అనుకొన్నారు. కాని తోటను చూసి మొదట "అరె, మనం దారి తప్పాము" అన్నారు. తర్వాత వారికి సర్వం కోల్పోయిన విషయం తెలిసి వచ్చింది. అప్పుడు వాళ్ళు పశ్చాత్తాపపడ్డారు. నిస్సందేహంగా తాము తలబిరుసుతనం చూపామనీ, ప్రభువు వైపునకు మరలితే ఇంతకన్నా మంచి తోట ఆయన ఇస్తాడని పశ్చాత్తాపపడ్డారు.

రుకూ 2 : భయభక్తులు కలవారి కోసం వారి ప్రభువు వద్ద భోగభాగ్యాల స్వర్గాలు ఉన్నాయి. విధేయుల స్థితిని అపరాధుల స్థితి మాదిరిగా చేయాలా మేము?! కష్టకాలం వచ్చి పడినపుడు ప్రజలను సజ్దా చేయడానికి పిలిచినపుడు వీళ్ళు సజ్దా చేయలేరు. వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి. అవమానం వారిని ఆవరించుకొని ఉంటుంది. వారు నిక్షేపంగా ఉన్న కాలంలో వారిని సజ్దా చేయడానికి పిలిచినపుడు వీళ్లు తిరస్కరిస్తూ ఉండే వారు. ప్రవక్తా! తిరస్కారుల వ్యవహారాన్ని నాకు వదలిపెట్టు.

నేను వారికి అవకాశం ఇస్తూ పోతున్నాను. నా పన్నుగడ చాలా పటిష్టమైనది. నీ ప్రభువు నిర్ణయం వెలువడే వరకు ఓర్మి చూపు ఈ ఖుర్ఆన్ సకల లోకాల వారికి హితోపదేశం.

69. అల్ హాఖ్ఖహ్

రుకూ 1 : సమూద్ ప్రజలు ఒక భయానక ఆపదకు హతమయ్యారు. ఆద్ ప్రజలు భయంకరమైన పెను తుఫాను వల్ల సర్వనాశనమయ్యారు. ఈ ప్రజల్లో ఎవరైనా మిగిలి ఉన్నవాడు. మీకు కనబడుతున్నాడా ఇప్పుడు. ఈ ప్రజలు ఇంకా ఫిరౌను అతనికి పూర్వం గతించిన ప్రజలు, తల్లక్రిందులైన పట్టణాల వారు తమ ప్రవక్తల మాట విననందువల్ల ఆయన వారిని కఠినంగా పట్టుకొన్నాడు. తరువాత బూర ఊదబడు తుంది. భూమిని, పర్వతాలను లేపి నుగ్గునుగ్గు చేయడం జరుగుతుంది. ఆ రోజున మీరందరూ ప్రవేశపెట్టబడతారు. మీ రహస్యం యేదీ దాగి ఉండదు. ఆనాడు ఎవరికి కర్మల పత్రం కుడి చేతికి ఇవ్వబడుతుందో అతడు "చూడండి, చదవండి నా కర్మల పత్రం" అంటాడు. అతడు ఉన్నత స్వర్గాలలో ఉంటాడు. అతడితో "హాయిగా తిను, త్రాగు, గత జీవితంలో నీవు చేసిన కర్మల ఫలితం ఇది" అనడం జరుగుతుంది. కర్మల పత్రం ఎడమ చేతికి ఇవ్వబడిన వ్యక్తి వాపోతూ 'అయ్యో ప్రపంచంలో నాకు సంభవించిన మరణం తుది మరణం అయి ఉంటే ఎంత బాగుండేది. నేడు నా సంపద గాని అధికారం గాని నాకు ఉపయోగపడటం లేదు" అంటుంటాడు. వాడిని డెబ్బయి గజాల పొడుగు సంకెళ్ళతో సంబంధించి నరకంలో విసరివేయడం జరుగుతుంది.

రుకూ 2 : ఈ వచనాలు యే కవి వాక్కులు కావు. యే జ్యోతిష్యుని వాక్కు కూడా కాదు. మీరు ఆలోచించడం అన్నది చాలా అరుదు. ఇది సకల లోకాల ప్రభువు తరఫు నుంచి అవతరించింది. ప్రవక్త కనుక ఏదయినా స్వయంగా కల్పించిన మాట మాకు ఆపాదించి చెప్పి ఉన్నట్లయితే మేము అతని కుడి చెయ్యి పట్టుకునే వారము. అతడి మెడ నరాన్ని ఖండించి ఉండేవారము. మమ్మల్ని ఈ పని చేయకుండా మీలో ఎవ్వడూ ఆపగలిగే వాడు కాదు. నిజానికి ఇది దైవభీతి కలవారికి హితోపదేశం

70. అల్ మఆరిజ్

రుకూ 1 : ప్రళయ దినాన ఆకాశం కరగిన వెండి వలే మారిపోతుంది. పర్వతాలు

ఏకిన రంగురంగుల ఉన్ని మాదిరి అయిపోతాయి. ప్రాణ స్నేహితుడు కూడా తన ప్రాణ స్నేహితుడిని పట్టించుకోడు. నిజానికి వాళ్ళు ఒకరినొకరు చూడడం కూడా జరుగుతుంది. అపరాధులు తమ సంతానాన్ని, భార్య, సోదరులను, దగ్గరి బంధువులను, భూమండలంలోని వారినందరినీ పరిహారంగా ఇచ్చి శిక్ష నుంచి తప్పించుకోవాలని అనుకొంటారు. మనిషిపై ఆపద వచ్చిపడినపుడు గాభరా పడి పోతాడు. సుఖంగా ఉన్నప్పుడు మాత్రం పిసినారితనం ప్రదర్శిస్తాడు. అయితే క్రింది వారు ఈ దోష గుణానికి అతీతంగా ఉంటారు – 1) నమాజును ఎల్లప్పుడు పాటించేవారు. 2) తమ సంపదలో యాచకులకు, దిక్కులేని వారికి నిర్ణీత హక్కు ఇచ్చేవారు. 3) తీర్పుదినం సత్యమని నమ్మేవారు 4) ప్రభువు శిక్షకు భయపడేవారు 5) తమ మర్మాంగాలను పరిరక్షించుకొనేవారు 6) తమ అమానతులను కాపాడేవారు 7) తమ వాగ్దానాన్ని నిలబెట్టుకొనేవారు. 8) సాక్ష్యం విషయంలో నిజాయితీగా ఉండేవారు 9) తమ నమాజులు రక్షించుకొనేవారు – ఈ ప్రజలు స్వర్గ వనాలలో ఉంటారు.

రుకూ 2 : సత్యధిక్కారులు ఖుర్‌ఆన్ పఠనం విని కుడి, ఎడమల నుంచి గుంపులు, గుంపులుగా నీ వైపునకు పరుగెత్తి వస్తున్నారు. వాళ్ళు సత్యం స్వీకరించే ఉద్దేశంతో కాదు, ఎగతాళి చేయడానికి వస్తున్నారు. కేకలు వేయడానికి వస్తున్నారు. వారిని ఈ వ్యర్థ ప్రేలాపనల్లో, ఆటపాటల్లో పడి ఉండనివ్వండి. వారికి వాగ్దానం చేయబడిన రోజు చేరువయ్యే వరకు అలాగే పడి ఉండనివ్వండి. అప్పుడు వీళ్ళు తమ సమాధుల నుంచి లేచి తమ విగ్రహాల మందిరాల వైపునకు పరుగెత్తిన మాదిరిగా పరుగెత్తుతూ ఉంటారు. వారి చూపులు క్రిందికి వాలిపోయి ఉంటాయి. అవమానం వారిని క్రమ్ముకొని ఉంటుంది. అది వారికి వాగ్దానం చేయబడిన రోజు.

71. నూహ్

రుకూ 1 : నూహ్‌ను మేము అతని జాతి వైపునకు పంపాము. ఆయన జాతి ప్రజలను అల్లాహ్ వైపునకు పిలిచాడు. మాతో ఇలా విన్నవించుకొన్నాడు. "ఓ ప్రభూ, నేను నా జాతి ప్రజలను రాత్రింబవలు పిలిచాను. కాని వారు చెవుల్లో వ్రేళ్ళు దూర్చుకొనేవారు. వస్త్రాలతో ముఖాలు కప్పుకొనేవారు. మహా గర్వం చూపారు. పిదప నేను వారిని ఎలుగెత్తి పిలిచి సందేశం అందజేశాను. బహిరంగంగా ప్రచారం చేశాను. రహస్యంగా కూడా నచ్చజెప్పడం చేశాను. ప్రభువును క్షమాభిక్ష కోరండి. ఆయన చాలా క్షమాగుణం

కలవాడు. ఆయన పుష్కలంగా ఆకాశం నుంచి వర్షం కురిపిస్తాడు. మీకు సిరిసంపదలు, సంతానం అనుగ్రహిస్తాడు. మీ కోసం తోటలు పుట్టిస్తాడు. మీ కోసం సెలయేళ్ళు ప్రవహింపజేస్తాడు. అల్లాహ్ ఏడు ఆకాశాలను ఒకదానిపై ఒకటి ఎలా సృష్టించాడో మీరు చూడడం లేదా? ఆకాశాల్లో చంద్రుణ్ణి ప్రకాశంగాను సూర్యుణ్ణి దీపంగాను ఎలా చేశాడో చూడ్డం లేదా? మీ కోసం భూమిని పాన్పు మాదిరిగా పరచి దానిపై ఉన్న రహదారుల్లో మీరు నడిచేలా చేశాడో చూడ్డం లేదా అని చెప్పారు.

రుకూ 2 : నూహ్ ఇంకా ఇలా విన్నవించుకొన్నాడు. "ఓ ప్రభూ వారు నా మాట కొట్టి పారేశారు. సంపద, సంతానాలు పొంది మరింత వైఫల్యం పొందిన వారినే అనుస రిస్తున్నారు. "మీ ఆరాధ్య దైవాలను ఎంతమాత్రం వదలిపెట్టకండి" అన్నారు. వాళ్ళ అనేకమంది ప్రజలను అపమార్గం పట్టించారు. ప్రభూ! నీవు కూడా ఈ దుర్మార్గులకు మార్గభ్రష్టత్వంలో తప్ప మరి దేనిలోనూ వృద్ధి ఇవ్వకు" అన్నాడు. చివరకు వారందరూ ముంచి వేయబడ్డారు. అల్లాహ్ నుంచి తమను కాపాడే సహాయకుణ్ణి ఎవరినీ పొంద లేకపోయారు. నూహ్ మాతో "ప్రభూ! ఈ తిరస్కారుల్లో భూమిపై ఎవరినీ మిగల నీయకు. వీరి సంతతిలో పుట్టేవాడు ఎవడయినా పరమ పాపిగా, కరడుగట్టిన అవిశ్వాసిగానే రూపొందుతాడు. ప్రభూ! నన్నూ, నా తల్లిదండ్రులను, విశ్వాసులయిన స్త్రీ పురుషులందరినీ క్షమించు" అని వేడుకొన్నాడు.

72. అల్ జిన్న్

రుకూ 1 : జిన్నాతుల ఒక సమూహం దైవవాణిని శ్రద్ధగా విన్నది తరువాత వెనక్కి వెళ్ళి తమ జాతితో "మేము అద్భుతమైన ఖుర్ఆన్ విన్నాము. అది రుజుమార్గం వైపునకు దారి చూపుతుంది. అందువల్ల మనం దానిని విశ్వసిద్దాము. మనం మన ప్రభువునకు సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనుషులలో కొందరు జిన్నాతులను శరణు వేడుతుండేవారు. అందువల్ల జిన్నాతులకు అహంకారం పెరిగిపోయింది. ఇప్పుడు ఆకాశం పహారాదారులతో నిండిపోయి ఉంది. ఉల్కాపాతం కురుస్తుంది. ఇప్పుడు మేము ఆకాశంలో దొంగతనంగా ఏదైనా వినడానికి ప్రయత్నిస్తే అలాంటి వారికోసం ఒక అగ్నిజ్వాల మాటువేసి కనబడుతోంది. మనలో కొందరు సజ్జనులు ఉన్నారు. కొందరు అందుకు భిన్నంగా ఉన్నారు. మనం అల్లాహ్‌ను భూమిపై అశక్తుని చేయలేము లేదా తప్పించుకొని పారిపోయి ఆయన్ను ఓడించనూ లేము.

మేము హితబోధ విన్నాము. దానిని విశ్వసించాము. మనలో కొందరు ముస్లిము లున్నారు. కొందరు సత్యానికి దూరమైనవారు ఉన్నారు. ఇస్లామ్‌ను స్వీకరించిన వారు సాఫల్య మార్గాన్ని పొందారు. సత్యానికి దూరంగా ఉన్నవారు నరకానికి ఇంధనం అవుతారు. ప్రభువు ప్రస్తావన విని ముఖం తిప్పుకొన్న వాడిని ప్రభువు తీవ్ర శిక్షకు గురి చేస్తాడు. మస్జిద్‌లు అల్లాహ్ కోసం ఉన్నాయి. వాటిలో అల్లాహ్‌ను కాక మరెవ్వరినీ వేడుకోకండి.

రుకూ 2 : ఓ ప్రవక్తా వారికి చెప్పండి - "నేను నా ప్రభువును వేడుకొంటున్నాను. ఆయనతోపాటు సహవర్తులెవ్వరినీ చేర్చను. మీకు యే నష్టాన్నయినా కలిగించడం లేదా యే లాభాన్నయినా చేకూర్చడం నా చేతుల్లో లేదు. నన్ను అల్లాహ్ పట్టు నుంచి ఎవ్వరూ కాపాడలేరు. నాకు ఆయన తప్ప మరెక్కడా శరణులేదు. అల్లాహ్ వచనాలు, ఆయన సందేశం చేరవేయడం మాత్రమే నా పని. ప్రవక్త మాటను స్వీకరించనివాడికి నరకాగ్ని ఉంది. అక్కడ తెలిసిపోతుంది ఎవరి సహాయకులు బలహీనంగా ఉన్నది, ఎవరి సమూహం సంఖ్యలో తక్కువ ఉన్నది.

73. అల్ ముజ్జమ్మిల్

రుకూ 1 : ఓ దుప్పటి చుట్టకొని పడుకొనే వాడా! రాత్రులు నమాజుకు నిలబడుతూ ఉండు. ఖుర్ఆన్‌ను నెమ్మదిగా ఆగి ఆగి పఠిస్తూ ఉండు. రాత్రివేళ లేవడం మనస్సును అదుపు చేయడానికి చాలా ఉపయోగపడుతుంది. ఖుర్ఆన్‌ను శ్రద్ధగా పఠించడానికి ఎంతో అనువయిన సమయం. పగటివేళ నీ పనుల్లో ప్రభువు నామస్మరణ చేస్తూ ఉండు. అన్నిటిని వదలి పూర్తిగా ఆయనకే అంకితమైపో. ఆయన్నే నీ వకీలుగా చేసుకో. ప్రజలు కల్పిస్తున్న మాటల పట్ల సహనం వహించు. మంచితనంతో వారి నుంచి వైదొలగిపో. ప్రజలారా! మీ వద్దకు ఒక ప్రవక్తను మీపై సాక్షిగా చేసి మేము పంపాము. మీరు అంగీకరించక తిరస్కరించినట్లయితే ఆ రోజును బాలలను, వృద్ధులుగా చేసి వేసే ఆ రోజును ఎలా తప్పించుకోగలరు.

రుకూ 2 : నీవు రాత్రిళ్ళు ఆరాధనలో నిలబడి ఉంటావని నీ ప్రభువునకు తెలుసు. నీ సహచరులు కూడా ఈ పని చేస్తున్నారు. మీరు వేళలను ఖచ్చితంగా లెక్కించలేరు. అందువల్ల ఇప్పుడు ఎంత ఖుర్ఆన్ సులభంగా పఠించగలవో అంతే పఠించు. మీలో కొందరు వ్యాధిగ్రస్తులు ఉండవచ్చు. కొందరు ఉపాధి అన్వేషణలో ప్రయాణంలో

ఉండవచ్చు. మరికొందరు దైవమార్గాన 'జిహాద్' చేస్తుండవచ్చు. కనుక మీరు ఖుర్ఆన్ సులభంగా పఠించగలిగినంత వరకు పఠించండి. నమాజు స్థాపించండి. జకాత్ ఇవ్వండి. అల్లాహ్‌కు మంచి రుణం ఇస్తూ ఉండండి. మీరు మీ కోసం యే సత్కార్యాన్ని ముందుగా పంపుతున్నారో దాన్ని అల్లాహ్ వద్ద పొందుతారు.

74. అల్ ముద్దస్సిర్

రుకూ 1 : దుప్పటికప్పుకొని పడుకొన్నవాడా! లే; లేచి హెచ్చరించు. నీ ప్రభువు ఘనతను చాటిచెప్పు. నీ దుస్తులు పరిశుభ్రంగా ఉంచుకో. మాలిన్యానికి దూరంగా ఉండు. ప్రజలకు నిస్వార్థంగా ఉపకారాలు చేయి. మక్కాలోని ఆ నాయకుడు అల్లాహ్‌ను దైవ ప్రవక్తనూ వ్యతిరేకించాడు. ఇదంతా ఒక మాయాజాలం. ఇది ఎప్పటి నుంచో కొనసాగుతూ వస్తోంది. ఇదంతా మానవ కల్పిత రచన మాత్రమే అన్నాడు. త్వరలోనే అతణ్ణి నరకంలో విసరివేస్తాము మేము నరక నిర్వాహకులుగా దైవదూతలనే నియమించాము. ఈ నరక నిర్వాహకుల సంఖ్యను అవిశ్వాసులకు ఒక పరీక్షగా ఉండేలా చేశాము. నీ ప్రభువు సైన్యాల గురించి ఆయనకు తప్ప మరెవ్వరికీ ఏమీ తెలియదు.

రుకూ 2 : స్వర్గాలలో ఉండే కుడిపక్షం వారు తప్ప ప్రతి వ్యక్తి తాను సంపాదించిన దానికి స్వయంగా తాను తాకట్టుగా ఉంటాడు. అపరాధులతో "మిమ్మల్ని నరకానికి తీసుకొచ్చిన విషయమేది?" అని అడగడం జరుగుతుంది. అప్పుడు వారు "మేము నమాజు చదివేవారము కాదు, బీదలకు అన్నం పెట్టేవారం కాదు, సత్యానికి విరుద్ధంగా మాటలు కల్పించే వారితో కలసి మేము కూడా మాటలు కల్పించే వారం. తీర్పు దినాన్ని తిరస్కరించేవారము. చివరకు ఆ అనివార్య ఘడియ మాకు ఎదురయ్యింది" అంటారు. ఈ ప్రజలకు అసలు ఏమయ్యింది. హితబోధ నుంచి ముఖం త్రిప్పుకొం టున్నారు. సింహానికి భయపడి పరుగెత్తే అడవి గాడిదల మాదిరిగా ప్రవర్తిస్తున్నారు. ఇది ఒక హితబోధ. ఇక ఎవరు ఇష్టపడితే వారు గుణపాఠం గ్రహించగలరు.

75. అల్ ఖియామహ్

రుకూ 1 : ప్రళయ దినం అసలు ఎప్పుడు వస్తుందని అడుగుతున్నాడు మనిషి. అప్పుడు కనుగ్రుడ్లు తేలవేయడం జరుగుతుంది. చంద్రుడు కాంతిహీనమై పోతాడు. చంద్రుణ్ణి

సూర్యుణ్ణి కలిపి ఒక్కటి చేసేయడం జరుగుతుంది. అప్పుడు ఈ మనిషే "ఇప్పుడు ఎక్కడికి పారిపోగలను" అంటాడు. అక్కడ ఎలాంటి ఆశ్రయమూ లభించదు. ఆ రోజున నీ ప్రభువు వద్దకే వెళ్ళవలసి ఉంటుంది. అతడు ఎన్ని సాకులు చెప్పినా, మనిషికి స్వయంగా తానేమిటో బాగా తెలిసినవాడు. ఓ ప్రవక్తా! ఈ 'వహీ'ని త్వర త్వరగా జ్ఞాపకం చేసుకోడానికి గబగబ చదివే పని చేయవద్దు. శ్రద్ధగా విను. జ్ఞాపకం ఉండేలా చేయడం, చదివింపజేయడం, భావం అర్థమయ్యేలా చేయడం మా బాధ్యత.

రుకూ 2 : మనిషి సత్యాన్ని ఒప్పుకోలేదు. నమాజు చదువలేదు. తిరస్కరించాడు. ముఖం త్రిప్పుకొన్నాడు. నిక్కుతూ తన యింటి వారి వద్దకు వెళ్ళిపోయాడు. మనిషిని ఇలాగే విచ్చిలవిడిగా వదలి వేయడం జరుగుతుందని అనుకొంటున్నాడా? అతడు కార్చబడిన ఒక నీచపు నీటి బిందువు కాడా? తర్వాత అతడు ఒక నెత్తుటి ముద్దగా మారాడు. పిదప అల్లాహ్ అతడి శరీరాన్ని రూపొందించాడు. అవయవాలను చక్క దిద్దాడు. అటుపై స్త్రీ పురుషులన్న రెండు జాతులు చేశాడు. అలాంటప్పుడు ఆయన మరణించిన వారిని మళ్ళీ బ్రతికించలేడా?

76. అద్దహ్ర్

రుకూ 1 : అనంతమైన కాలంలో యే దశలో అయినా మనిషి అప్రధాన వస్తువుగా ఉన్నాడా? మనిషిని పరీక్షించడానికి మేము అతడిని ఒక మిశ్రమ వీర్య బిందువుతో సృష్టించాము. ఆ ఉద్దేశంతోనే మేము మనిషిని చూసే, వినే శక్తిగలవానిగా రూపొందించాము. మేము అతడికి రుజుమార్గం చూపించాము. ఇక అతడు కృతజ్ఞతలు తెలిపేవాడయినా కావచ్చు లేదా సత్యాన్ని తిరస్కరించేవాడయినా కావచ్చు. ప్రపంచంలో మొక్కుబడులు చెల్లించేవారు, నలువైపుల నుంచి ఆపదలు కమ్ముకు వచ్చే రోజుకు భయపడేవారు, అల్లాహ్‌పై ప్రేమతో పేదలకు, అనాధలకు, ఖైదీలకు అన్నం పెట్టేవారు, "మేము కేవలం అల్లాహ్ కోసమే మీకు అన్నం పెడుతున్నామని; దీనికి మీ నుంచి ఎలాంటి బదులుగాని, కృతజ్ఞతలుగాని కోరడం లేదని" వారికి చెప్పేవారు – ఇలాంటి అల్లాహ్ దాసులను అల్లాహ్ ప్రళయం నాటి కీడు నుంచి రక్షిస్తాడు. వారికి తాజా దనాన్ని, ఆనందాన్ని ప్రసాదిస్తాడు. భోగభాగ్యాల స్వర్గాలలో ప్రవేశపెడతాడు.

రుకూ 2 : ప్రవక్తా! మేము నీపై ఖుర్ఆన్‌ను కొద్దికొద్దిగా నీపై అవతరింపజేశాము.

అందువల్ల నీవు ప్రభువు ఆజ్ఞల విషయంలో సహనం వహించు. ఏ సత్య తిరస్కారి మాటను వినకు నీ ప్రభువును ఉదయ సాయంత్రాలు స్మరించు. రాత్రులు కూడా ఆయన ముందు సాష్టాంగపడుతూ ఉండు. రాత్రివేళ సుదీర్ఘ సమయంపాటు ఆయనను స్తుతిస్తూ ఉండు. ప్రజలు తొందరగా లభించేదాన్ని (అంటే ప్రపంచాన్ని) ప్రేమిస్తున్నారు. కాని మున్ముందు రానున్న బరువైన రోజును విస్మరిస్తున్నారు. ఇది ఒక హితోబోధ. ఇక ఇప్పుడు ఇష్టం ఉన్నవారు. తమ ప్రభువు వద్దకు పోయే మార్గాన్ని అవలంబించవచ్చు.

77. అల్ ముర్సలాత్

రుకూ 1 : ఆ రోజున నక్షత్రాలు కాంతి కోల్పోతాయి. ఆకాశం చించివేయబడుతుంది. పర్వతాలు ఏకబడతాయి. దైవప్రవక్తలు హాజరయ్యే సమయం వస్తుంది. అదే తీర్పుదినం. మేము మనిషిని నీచమైన నీటి బందువుతో సృష్టించాము. ఆ పిదప ఒక నిర్ణీత కాలం వరకు ఒక సురక్షిత ప్రదేశంలో ఉంచాము. భూమిని మేము ప్రోగు చేసేదిగా చేశాము. దానిపై ఎత్తయిన పర్వతాలు అమర్చము. మీకు త్రాగడానికి మంచి నీరు ఇచ్చాము. పదండి. మీరు తిరస్కరిస్తూ వచ్చిన దాని వైపునకు ఇప్పుడు పదండి. ఆ రోజున వారు యేమీ మాట్లాడలేరు. వారికి సాకులు చెప్పే ఎలాంటి అవకాశమూ ఇవ్వబడదు. ఇప్పుడు మీరు నాకు వ్యతిరేకంగా ఏదయినా పన్నాగం పన్నగలిగితే ప్రయత్నించండి. సత్యతిరస్కారులకు ఆ రోజున వినాశం ఉంది.

78. అన్ నబా

రుకూ 1 : మహావార్త గురించి వారికి త్వరలోనే తెలిసిపోతుంది. భూమి, పర్వతాలు, స్త్రీ పురుష జంటలు, సుఖాన్ని ఇచ్చే నిద్ర, ఏడు ఆకాశాలు, సూర్యుడు, మేఘాల నుంచి వర్షం, దాని ద్వారా ధాన్యం, కూరగాయలు, తోటలు పండడం - ఇవన్ని అల్లాహ్ సృష్టి నైపుణ్య విశేషాలు. వాస్తవానికి నరకం ఒక మాటు. తలబిరుసు ప్రజల గమ్య స్థానం అది. వారి కర్మలకు పూర్తి ప్రతిఫలం అది. వాళ్ళు ఆయతులను పూర్తిగా తిరస్కరించారు. మేము ప్రతిదీ లెక్కపెట్టి రాసి ఉంచాము. ఇప్పుడు అనుభవించండి. ఇక మీ బాధలలో తప్ప మరి దేనిలోనూ వృద్ధి వుండదు.

రుకూ 2 : భయభక్తులు కలవారికి సాఫల్యం ఉంది. వారికోసం తోటలు, ద్రాక్షతోటలు, సమ వయస్కులైన కన్యలు మద్యం తొణికే చషకాలు ఉంటాయి. ఆ రోజున దైవ దూతలు, ఆత్మలు బారులు తీరి నిలబడి ఉంటారు. కరుణామయుడు అనుమతించిన వారు తప్ప మరెవ్వరూ మాట్లాడలేరు. అది కూడా సవ్యమైన మాట పలికే మాత్రమే మాట్లాడతారు. సమీపంలో ఉన్న శిక్షను గురించి మేము మిమ్మల్ని హెచ్చరించాము. ఆ రోజున మనిషి తన చేజేతులా చేసుకొని పంపించినదంతా అక్కడ చూసుకొంటాడు. అప్పుడు తిరస్కారులు "అయ్యో! నేను మట్టి అయిపోతే ఎంత బాగుండును" అని వాపోతారు.

79. అన్ నాజిఆత్

రుకూ 1 : ఆ రోజున ఒక భూకంపం కుదుపుతుంది. ఆ పైన మరో కుదుపు. గుండెలు భయంతో వణుకుతుంటాయి. చూపులు క్రిందికి వాలిపోయి వుంటాయి. ఈ ప్రజలు మళ్ళీ బ్రతికించబడడాన్ని తిరస్కరించేవారు. నిజానికి ఒక తీవ్రమైన గద్దింపు దెబ్బతో వీరు తక్షణం ఒక బహిరంగ మైదానంలో ఉంటారు. మూసాను ఫిరౌను వద్దకు పంపడం జరిగింది. ఆ విధంగా అతడు పరిశుద్ధత అవలంబించడానికి అతనిలో దైవభీతి జనించడానికి అవకాశం ఇవ్వడం జరిగింది. కాని అతడు ప్రజల సమూహం ముందు "నేనే మీ అందరికి అతిపెద్ద ప్రభువును" అని ప్రకటించాడు. అతడు ఇహపరలోకాల శిక్షకు అర్హుడయ్యాడు. భయపడే ప్రతి వ్యక్తికి ఒక గుణపాఠం గ్రహించే ఉదాహరణగా మారాడు.

రుకూ 2 : మనిషిని సృష్టించడం కష్టమైన పనా లేక ఆకాశాలు, భూమి, నీరు, పర్వతాలు సృష్టించడం కష్టమా? పెద్ద అల్లకల్లోలం చెలరేగే ఆ రోజున, మనిషి తాను చేసుకొన్నదంతా జ్ఞాపకం తెచ్చుకొనే ఆ రోజు తలబిరుసు వైఖరి అవలంబించిన ప్రాపంచిక జీవితానికి ప్రాధాన్యం ఇచ్చిన ప్రతి వ్యక్తికి నరకం నివాసస్థలం అవుతుంది. ప్రభువు ముందు నిలబడాల్సి ఉందని భయపడి తన మనస్సును దుష్ట వాంఛలకు దూరంగా ఉంచిన వ్యక్తి నివాస స్థలం స్వర్గం అవుతుంది. ప్రళయం ఎప్పుడు వస్తుం దన్నది అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఈ ప్రజలు దాన్ని చూసుకొన్న రోజున వారికి ప్రపంచంలో ఒకరోజులో ఒక పూట మాత్రమే ఉన్నట్లు అనిపిస్తుంది.

80. అబస

రుకూ 1 : అల్లాహ్‌కు భయపడుతూ, ఆపేక్షతో నీ వద్దకు పరుగెత్తుకొచ్చిన వ్యక్తి అంధుడు అయినా సరే హితోపదేశం పొందే హక్కు అతనికి ఎక్కువగా ఉంది. లక్ష్యపెట్టని వారి కన్నా అతడికే ఎక్కువ హక్కు ఉందని రసూలుల్లా (సఅసం)కు బోధించడం జరిగింది. మనిషి కరుడుగట్టిన సత్య తిరస్కారి. ఒక వీర్యబిందువుతో అల్లాహ్ అతడిని సృష్టించాడు. పిదప అతడి నిధిరాతను నిర్ణయించాడు. మనిషికి జీవన మార్గాన్ని సుగమం చేశాడు. తర్వాత అతడికి మృత్యువును ఇచ్చాడు. సమాధిలోకి చేర్చాడు. మళ్ళీ తాను తలచినపుడు మనిషిని లేపి నిలబెడతాడు. మనిషి ఆహారం కోసం ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయో మనిషి ఆలోచించాలి. ప్రళయ దినాన మనిషి తన సోదరులను తన తల్లిని, తన తండ్రిని, తన సంతానాన్ని వదలి దూరంగా పరుగెడ తాడు. ఆ రోజున మనిషి తన గురించి తప్ప మరెవ్వరి గురించి పట్టించుకోడు. ఆ రోజు కొన్ని ముఖాలు దేదీప్యమానంగా వెలుగుతుంటాయి. మరికొన్ని ముఖాలు దుమ్మధూళి కొట్టుకొని ఉంటాయి.

81. అత్తక్వీర్

రుకూ 1 : సూర్యుడు చుట్టివేయబడినప్పుడు, నక్షత్రాలు చెదిరిపోయినప్పుడు, పర్వతాలు నడిపించబడినప్పుడు, పది మాసాల చూలి ఒంటెలను కూడా వాటి మానాన వాటిని వదిలేయడం జరిగినప్పుడు, అడవి జంతువులు ఒకచోట సమీకరించబడినప్పుడు, సముద్రాలు జ్వలింపజేయబడినప్పుడు, ప్రాణాలు శరీరాలకు కలుపబడినప్పుడు, కర్మల పత్రాలు తెరువబడినప్పుడు, నరకం మండించబడినప్పుడు, స్వర్గం దగ్గరకు తీసుకు రాబడినప్పుడు ప్రతి మనిషికి ఆ సమయాన తెలిసి వస్తుంది అతడు ఏం చేసి వచ్చా డన్నది అర్థమవుతుంది. ఇది నిశ్చయంగా ఒక గౌరవనీయుడైన సందేశహరుని (దైవ దూత) వాక్కు. ఇది శాపగ్రస్తుడైన యే షైతాను వాక్కు కాదు. ఇది సలక లోకాల వాసు లకు ఒక హితబోధ. రుజుమార్గాన నడువ దలచిన ప్రతి వ్యక్తికి ఇది హితబోధ.

82. అల్ ఇన్‌ఫితార్

రుకూ 1 : ప్రళయం ఆసన్నమైనపుడు ప్రతి మనిషికి తాను ముందు వెనుక

చేసుకొన్నదంతా తెలిసి వస్తుంది. కరుణామయుడైన ప్రభువు మనిషిని సృష్టించాడు. నఖశిఖ పర్యంతం తీర్చిదిద్దాడు. సౌష్టవాకారంలో రూపొందించాడు. తాను తలచిన ఆకారంలో మనిషిని మలిచాడు. మనిషి చేసే ప్రతి చర్యను కనిపెడుతూ ఉండే గౌరవ నీయులైన లేఖకులు నియమించబడి వున్నారు. సజ్జనులు నిశ్చయంగా సుఖసంతోషా లతో ఉంటారు. దుర్జనులు నరకంలో ఉంటారు. తీర్పుదినం నాడు ఏ వ్యక్తి కోసమైనా సరే, యేదయినా చేయడం ఎవరి వల్లా కాదు. ఆనాడు తీర్పు ఇచ్చే అధికారం పూర్తిగా అల్లాహ్ చేతుల్లోనే ఉంటుంది.

83. అల్ ముతఫ్ఫిఫీన్

రుకూ 1 : తూనికలలో కొలతలలో తగ్గించి ఇచ్చే వారికి వినాశం తప్పదు. వాళ్ళు ప్రజల నుంచి తీసుకొనేటప్పుడు పూర్తిగా తీసుకుంటారు. కాని కొలిచి లేదా తూచి ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. నిస్సందేహంగా దుర్జనుల కర్మల పత్రం జైలు గ్రంథంలో ఉంది. అది ఒక రాయబడిన గ్రంథం తీర్పు దినాన్ని తిరస్కరించిన వారికి ఆనాడు వినాశం తప్పదు. వారి చెడు పనుల తుప్పు వారి హృదయాలకు పట్టుకొంది. తీర్పుదినాన వారికి వీరి ప్రభువును దర్శించుకొనే భాగ్యం లభించదు. నరకంలో పోయి పడతారు. సజ్జనుల కర్మల పత్రం ఉన్నత వ్యక్తుల గ్రంథంలో ఉంది. అది ఒక రాయబడిన గ్రంథం. వారి స్వర్గసుఖాలను అనుభవిస్తారు. ప్రళయ దినాన విశ్వసించిన వారు తిరస్కారులను చూసి హేళన చేస్తుంటారు.

84. అల్ ఇన్షిఖాఖ్

రుకూ 1 : ఆకాశం బ్రద్దలయినపుడు, భూమి విస్తరింపజేయబడినపుడు, అది తన లోపల ఉన్నదంతా బయటకు విసరేసి ఖాళీ అయిపోతుంది. ఓ మనిషీ, నీవు క్రమేణా నీ ప్రభువు వైపునకు వెళుతున్నావు. కర్మల పత్రం కుడి చేతికి ఇవ్వబడిన వారి నుంచి తేలికపాటి లెక్క తీసుకోవడం జరుగుతుంది. అతడు సంతోషంతో తన వారి వైపునకు తిరుగుతాడు. కర్మల పత్రాన్ని వీపు వెనక నుంచి ఇవ్వబడిన వ్యక్తి చావును పిలుస్తూ మండుతున్న అగ్నిలో పోయి పడతాడు. ప్రపంచంలో అతడు తన కుటుంబ సభ్యుల మధ్య సుఖ సంతోషాల్లో మునిగి ఉండేవాడు. మరలిపోవలసిన అవసరం ఎప్పుడు ఉండదని భావించేవాడు. ఈ ప్రజలకు ఏమయ్యింది వీళ్ళు విశ్వసించడం లేదు. వారి ముందు ఖుర్ఆన్ పఠించబడినప్పుడు సజ్దా చెయ్యరు.

85. అల్ బురూజ్

కందకం వాళ్ళు ముస్లిములను అగ్నిగుండాల్లో విసరి తమాషా చూశారు. అల్లాహ్ కందకం వాళ్ళను సర్వనాశనం చేశాడు. విశ్వసించిన స్త్రీ పురుషులపై హింసా దౌర్జన్యాలు చేస్తూ, దానికి పశ్చాత్తాపపడని వారికి నరకయాతన తప్పదు. విశ్వసించి మంచి పనులు చేసిన వారికి స్వర్గవనాలున్నాయి. మీ ప్రభువు పట్టు చాలా తీవ్రమైనది. ఆయనే మొదటిసారి పుట్టిస్తాడు. ఆయనే రెండవసారి పుట్టిస్తాడు. ఆయన మన్నించేవాడు, ప్రేమించేవాడు, అర్ష్ సింహాసనాధీశుడు, ఔన్నత్యం కలవాడు, మహిమాన్వితుడు, తాను తలచినది చేయగలవాడు, ఈ ఖుర్ఆన్ ఫలకంపై వ్రాయబడి భద్రంగా ఉంది.

86. అత్ తారిఖ్

ప్రతి ప్రాణిపైన ఒక సంరక్షకుడు ఉన్నాడు. దుమికే ఒక నీటితో మనిషి పుట్టించబడ్డాడు. ఈ నీరు వెన్నుముకకు ప్రక్కటెముకలకు మధ్య నుంచి వెలువడుతుంది. అల్లాహ్ మనిషిని మళ్ళీ పుట్టించగల శక్తి ఉన్నవాడు. ఆ రోజున (ప్రళయంనాడు) మనిషి వద్ద ఎలాంటి శక్తి ఉండదు. అతడికి సహాయం చేసేవాడు ఎవ్వడూ ఉండడు. ఖుర్ఆన్ చెబుతున్నది ఒక నిర్ణయాత్మక విషయం. నవ్వులాటకాదు.

87. అల్ ఆలా

మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని స్తోత్రం చేయి. ఆయనే పుట్టించాడు. సమతూకాన్నిచ్చాడు. జాతకం నిర్ణయించాడు. రుజుమార్గం చూపాడు. ప్రవక్తా! మేము నీ చేత చదివిస్తాము. ఆపై ఇక నీవు మరచిపోవు. అల్లాహ్ కోరింది తప్ప మరేదీ మరిచిపోవు. నీవు హితబోధ చెయ్యి. హితబోధ లాభం కలిగించేదయితే భయపడే వ్యక్తి దాన్ని స్వీకరిస్తాడు. దౌర్భాగ్యుడు అగ్నిలో పడవేయబడతాడు. పరిశుద్ధతను అవలంబించిన వ్యక్తి, ప్రభువు నామాన్ని స్మరించే వ్యక్తి, నమాజు చదివే వ్యక్తి సాఫల్యం పొందుతాడు. కాని మీరు ప్రపంచ జీవనానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి పరలోక జీవితం ఉత్తమమైనది శాశ్వతమైనది.

88. అల్ గాషియహ్

ప్రళయ దినాన కొన్ని ముఖాలు భయం క్రమ్ముకొని ఉంటాయి. తీక్షణమైన అగ్నిలో

చిక్కుకుని ఉంటారు. సలసల మరిగే నీరు త్రాగడానికి ఇవ్వబడుతుంది. ఎండిన ముళ్ళ గడ్డి ఆహారంగా ఇవ్వబడుతుంది. ఆనాడు కొన్ని ముఖాలు కళకళలాడుతూ ఉంటాయి. తాము చేసిన పనులకు ఆనందిస్తుంటారు. ఉన్నత స్థాయి స్వర్గాలలో ఉంటారు. ఈ ప్రజలు ఒంటెలను చూడరా? అవి ఎలా తయారు చేయబడ్డాయో చూడరా? ఆకాశాన్ని అది ఎలా పైన నిలబెట్టబడిందో చూడరా? పర్వతాలను అవి ఎలా అమర్చబడ్డాయో చూడరా? భూమిని అది ఎలా పరచబడిందో చూడరా? ప్రవక్తా! నీవు హితబోధ చేస్తూ ఉండు. నీవు హితబోధ చేసేవాడవు మాత్రమే. వారి లెక్క చూడడం మా బాధ్యత.

89. అల్ ఫజ్ర్

ఆద్, సమూద్, ఫిరౌన్‌లు దుర్మార్గులు, తలబిరుసుకలవాళ్ళు. నీ ప్రభువు వారిపై శిక్ష అనే కొరడా ఝుళిపించాడు. మీరు అనాథలను గౌరవంగా చూడరు. నిరుపేదలకు అన్నం పెట్టాలని ఒకరినొకరు ప్రోత్సహించుకోరు. వారసత్వపు ఆస్తి మొత్తం పోగు చేసి కబళిస్తారు. ధన వ్యామోహంలో పూర్తిగా చిక్కుకుపోయారు. నరకం ముందుకు తీసుకురాబడినపుడు మనిషికి తెలిసి వస్తుంది. కాని అప్పుడు తెలిసిరావడం వల్ల ప్రయోజనం ఏముంటుంది? అప్పుడు మనిషి "అయ్యో! నా ఈ జీవితం కోసం నేను ముందుగా ఏర్పాట్లు చేసుకొని ఉంటే ఎంత బాగుండేది" అనుకొంటాడు. మరో వైపున "తృప్తి చెందిన మనసా! నీ ప్రభువు వైపునకు పద, నీవు ప్రభువునకు ఇష్టమైన దాని వైపు ఆనందంతో పద. పుణ్యాత్ములైన నా దాసులలో చేరిపో. నా స్వర్గంలో చేరిపో" అనడం జరుగుతుంది.

90. అల్ బలద్

మనిషిని మేము పరిశ్రమ కోసం పుట్టించాము. తాను అపార ధనరాశులు ఖర్చుపెట్టానని మనిషి అంటుంటాడు. తనను ఎవరూ గమనించడం లేదనుకొంటున్నాడా? మేము మనిషికి రెండు కళ్ళు, ఒక నాలుక, రెండు పెదవులు ఇవ్వలేదా? రెండు స్పష్టమైన మార్గాలు చూపలేదా? మనిషి ఎవరినైనా బానిస సంకెళ్ళ నుంచి విడిపించడం, లేదా ఆకలిగొన్న సమీప అనాథునికి, నిరుపేదకు అన్నం పెట్టడం, విశ్వసించి సహనం సానుభూతుల గురించి పరస్పరం బోధించుకొనే వారిలో చేరిపోవడం లాంటి పనులు చేయడానికి సాహసించడం లేదు.

91. అష్ షమ్స్

అల్లాహ్ మానవాత్మను తీర్చిదిద్దాడు. ఆ పిదప మంచి చెడులను దానికి తెలియజేశాడు. ఆత్మను పరిశుద్ధం చేసుకొన్న వ్యక్తి నిస్సందేహంగా సఫలుడయ్యాడు. ఆత్మను అణచివేసిన వ్యక్తి విఫలుడయ్యాడు. సమూద్ ప్రజలు తలబిరుసుతనం చూపారు. సత్యాన్ని తిరస్కరించారు. అప్పుడు అల్లాహ్ ప్రవక్త వారిని హెచ్చరిస్తూ అల్లాహ్‌కు చెందిన ఒంటెపై చేయి వేయవద్దని, అది నీరు త్రాగకుండా అడ్డుకోవద్దని చెప్పాడు. కాని వాళ్ళు ఒంటెను చంపివేశారు. పర్యవసానంగా సర్వనాశనమయ్యారు.

92. అల్ లైల్

అల్లాహ్ మార్గంలో ధనాన్ని వినియోగించేవారు, దైవ అవిధేయతకు భయపడినవారు, మంచిని సత్యం అని అంగీకరించిన వారు – ఇలాంటి వ్యక్తికి మేము సన్మార్గంలో నడిచే సౌలభ్యం కలుగజేస్తాము. పిసినారితనం చూపేవారు, దైవం పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించేవారు, మంచిని నిరాకరించినవారు – ఇలాంటి వారిని కఠిన మార్గంలో నడిచేలా చేస్తాము. తిరస్కరించినవారు, ముఖం త్రిప్పుకున్నవారు, మండే అగ్నిలో చిక్కుకుంటారు. పరిశుద్ధం కావడానికి తన సంపదను ఖర్చు చేసేవారు, మహోన్నతుడైన ప్రభువు ప్రసన్నతను పొందడానికి పని చేసేవారు, దైవభీతి కలవారిని నరకానికి దూరంగా ఉంచడం జరుగుతుంది.

93. అజ్ జుహా

ఓ ప్రవక్తా! (సఅసం) మీ ప్రభువు నిన్ను విడిచిపెట్టనూ లేదు, మీ పట్ల అసంతృప్తి చెందనూలేదు. నిశ్చయంగా భవిష్యత్కాలం నీకు గతించిన కాలం కన్నా మేలైనదిగా ఉంటుంది. త్వరలోనే నీ ప్రభువు నీవు సంతోషపడే అంత ఎక్కువగా ప్రసాదిస్తాడు. నీవు అనాధగా ఉన్నప్పుడు ఆయన నీకు ఆశ్రయాన్ని చూపాడు. మార్గమేదో తెలియని స్థితిలో ఉన్నప్పుడు సన్మార్గం చూపించాడు. నిరుపేదగా ఉన్న నిన్ను సంపన్నునిగా చేశాడు. కాబట్టి అనాధల పట్ల కఠినంగా వ్యవహరించవద్దు. యాచకులను కసురుకోవద్దు. నీ ప్రభువు అనుగ్రహాలను ప్రకటించండి.

94. అలమ్ నష్రహ్

ఓ ప్రవక్తా! (సఅసం) మేము మీ హృదయాన్ని తెరిచాము. నీ నడుము విరగగొడుతున్న ఓ పెద్ద భారాన్ని నీపై నుంచి దించివేశాము. నీ పేరు ప్రఖ్యాతులను అత్యున్నతం చేశాము. కష్టాలతోపాటు సుఖాలు కూడా ఉన్నాయి. నిస్సందేహంగా, కష్టాలతోపాటు సుఖాలు ఉంటాయి. కాబట్టి తీరిక లభించినపుడు ఆరాధనలో లీనమైపో.

95. అత్ తీన్

మేము మనిషిని అత్యుత్తమ ఆకృతిలో రూపొందించాము. పిదప అతణ్ణి నీచాతి నీచునిగా మార్చివేశాము. విశ్వసించి, మంచి పనులు చేసే వారిని తప్ప. అలాంటి వారికి ఎడతెగని ప్రతిఫలం లభిస్తుంటుంది. కాబట్టి ఓ మనిషీ, ఇక శిక్షా బహుమానా లను ఎలా తిరస్కరించగలవు? అధికారులందరి కన్నా అల్లాహ్ గొప్ప అధికారి కాదా?

96. అల్ అలఖ్

ఓ ప్రవక్తా (సఅసం)! నీ ప్రభువు పేరుతో చదువు. ఆయన ఒక నెత్తుటి ముద్దతో మనిషిని సృష్టించాడు. చదువు, నీ ప్రభువు పరమ దయామయుడు. ఆయన కలం ద్వారా జ్ఞానాన్ని నేర్పాడు. మనిషికి తెలియని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు. మనిషి తలబిరుసుతనం చూపుతున్నాడు. ఎందుకంటే, మనిషి తన్ను తాను ఎవరి అక్కరలేని వాడిగా భావిస్తున్నాడు. ప్రవక్తను నమాజు చదవకుండా అడ్డుకొన్న ప్రవక్త శత్రువును నుదుటి వెంట్రుకలు పట్టి ఈడ్చుతామని అల్లాహ్ సెలవిచ్చాడు. ఒకవేళ అతడు తన మద్దతుదారుల గుంపును పీల్చుకొంటే, అల్లాహ్ కూడా శిక్షించే దూతలను పిలుస్తానన్నాడు.

97. అల్ ఖద్ర్

దివ్యఖుర్‌ఆన్‌ను మేము ఘనమైన రాత్రి (షబె ఖద్ర్) అవతరింపజేశాము. ఆ రాత్రి వేయి నెలలకన్నా శ్రేష్ఠమైనది. ఆ రాత్రి జిబ్రాయీల్, దైవదూతలు తమ ప్రభువు ఆజ్ఞతో ప్రతి ఆదేశాన్ని తీసుకొని అవతరిస్తారు. ఆ రాత్రి అంతా తెల్లవారే వరకు శాంతి శ్రేయాలే ఉంటాయి.

98. అల్ బయ్యినహ్

గ్రంథ ప్రజలలోనూ, బహుదైవారాధకులలోనూ ఉన్న అవిశ్వాసులు అల్లాహ్ తరఫు నుంచి ఒక ప్రవక్త రావడాన్ని ఒప్పుకొనే వారు కాదు. అల్లాహ్ దాస్యం చెయ్యండనీ, తమ ధర్మాన్ని కేవలం అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకం చేసుకోండనీ, నమాజు స్థాపించండనీ, జకాతు ఇవ్వండనీ గ్రంథ ప్రజలకు ఆదేశించడం జరిగింది. కాని అవిశ్వాసానికి పాల్పడిన వారు నరకవాసులే అవుతారు. వారు సృష్టిలోకెల్లా పరమ నీచులు విశ్వసించి సత్కార్యాలు చేసిన వారు సృష్టిలో అత్యుత్తమమైన వారు. వారి పట్ల అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతృప్తి చెందారు.

99. అజ్జిల్ జాల్

భూమి పూర్తి తీవ్రతతో ఊపి వేయబడినప్పుడు, తన లోపల ఉన్న భారాన్ని తీసి బయట వేసినప్పుడు, భూమి తనపై జరిగిన సంఘటనలను వివరిస్తుంది. ఆ రోజున ప్రజలు విభిన్న పరిస్థితుల్లో దేవుని వైపునకు మరలుతారు. ఆ పిదప రవ్వంత సత్కార్యం చేసి ఉన్నా సరే దాన్ని ఆ వ్యక్తి అక్కడ చూసుకొంటాడు. రవ్వంత దుష్కార్యం చేసినవాడు కూడా దాన్ని అక్కడ చూసుకుంటాడు.

100. అల్ ఆదియాత్

మనిషి తన ప్రభువు పట్ల మహాకృతఘ్నుడు. ధన సంపదల వ్యామోహంలో పూర్తిగా మునిగిపోయి వున్నాడు. సమాధులలో ఉన్నదంతా వెలికి తీయబడే సమయం గురించి అతడికి తెలియదా? హృదయాల్లో ఉన్నదంతా బయటకు రాబట్టి పరిశీలించి విచారించేవేళ గురించి ఎరుగడా? నిశ్చయంగా ఆ రోజున వారి ప్రభువు వారి గురించి పూర్తి సమాచారం తెలిసినవాడు.

101. అల్ ఖారిఅహ్

ప్రజలు చెల్లాచెదరయిన దీపపు పురుగుల మాదిరి అయిపోయిన రోజున, పర్వతాలు ఏకబడిన రంగురంగుల దూది మాదిరిగా మారిన రోజున, అప్పుడు మహా సంఘటన జరుగుతుంది. అప్పుడు ఎవరి త్రాసు పళ్ళెం బరువుగా ఉంటుందో అతడు తనకు ఇష్టమైన భోగభాగ్యాలలో ఉంటాడు. ఎవరి త్రాసు పళ్ళాలు తేలిగ్గా ఉంటాయో వాడు భగభగమండే అగ్ని గుండంలో ఉంటాడు.

102. అత్తకాసుర్

ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని పొందాలన్న ధ్యాస మిమ్మల్ని ఏమరుపాటుకు గురి చేసింది. చివరికు మీరు ఈ వ్యామోహంలోనే స్మశానికి చేరుకొంటారు. మీ ఈ వైఖరి పర్యవసానం గురించి మీకు తెలిసి ఉంటే ఇలా ప్రవర్తించే వారు కాదు. నిశ్చయంగా మీరు నరకాన్ని చూస్తారు. ఆ రోజున మిమ్మల్ని ఇక్కడి అనుగ్రహాల గురించి తప్పక ప్రశ్నించడం జరుగుతుంది.

103. అల్ అస్ర్

వేగంగా గతించే కాలం సాక్షిగా, మనిషి పెద్ద నష్టంలో ఉన్నాడు. విశ్వసించి సత్కార్యాలు చేసిన వారు, పరస్పరం సత్యోపదేశం, సహన బోధ చేసుకునేవారు తప్ప.

104. అల్ హుమజహ్

ప్రజలను దెప్పి పొడుస్తూ ప్రజల వీపు వెనుక వారి లోపాలను ఎంచేవాడు, ధనాన్ని కూడబెడుతూ, మాటిమాటికి లెక్కబెట్టుకొంటూ దాచేవాడు, ధనం తన వద్ద శాశ్వతంగా ఉంటుందనుకొంటున్నాడు. అలాంటి వాడికి సర్వనాశనం తప్పదు. మండే అగ్నిలో వేయబడతాడు. ఆ అగ్ని గుండెల వరకు చొచ్చుకుపోతుంది.

105. అల్ ఫీల్

నీ ప్రభువు ఏనుగుల వారి కుట్రను భగ్నం చేశాడు. వారిపైకి పక్షుల గుంపులను పంపాడు. ఆ పక్షులు వారిపై కాల్చిన మట్టిరాళ్ళను విసిరాయి. చివరికి ఏనుగుల వాళ్ళు తినబడిన పొట్టు మాదిరి అయిపోయారు.

106. ఖురైష్

అల్లాహ్ ఖురైష్ ప్రజలకు చలికాలంలో ఎండా కాలంలో వ్యాపార ప్రయాణాలకు అలవాటు పడేలా చేశాడు. కాబట్టి వాళ్ళు కాబా గృహ ప్రభువును ఆరాధించాలి. ఆయన వారికి ఆహారమిచ్చి ఆకలి బాధ తీర్చాడు. భయం తొలగించి శాంతి ప్రసాదించాడు.

107. అల్ మావూన్

పరలోకపు శిక్షా బహుమానాలను తిరస్కరించే వారిలో క్రింది లక్షణాలు జనిస్తాయి 1) అనాథలను కసరి కొడతారు. 2) పేదవాళ్ళకు అన్నం పెట్టేలా చేయడు. 3) నమాజులను నిర్లక్ష్యం చేస్తారు. 4) ప్రదర్శనా బుద్ధితో వ్యవహరిస్తారు. 6) మామూలు వాడుక వస్తువులు కూడా ప్రజలకు ఇవ్వడానికి వెనుకాడతారు.

108. అల్ కౌసర్

ఓ ప్రవక్తా! (సఅసం) మేము నీకు కౌసర్ ప్రసాదించాము. నీవు నీ ప్రభువు కొరకే నమాజు చేయాలి. ఖుర్బానీ ఇవ్వాలి. నిస్సందేహంగా నీ శత్రువే నామరూపాల్లేకుండా పోయాడు.

109. అల్ కాఫిరూన్

ప్రకటించు– "ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించను. నేను ఆరాధించే ప్రభువును మీరు ఆరాధించరు. మీ ధర్మం మీదే నా ధర్మం నాదే."

110. అన్ నస్ర్

అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు, విజయం లభించినప్పుడు ప్రజలు తండోపతండాలుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించడాన్ని నీవు చూశావు. నీవు నీ ప్రభువు స్తోత్రాన్ని చేస్తూ ఆయన పవిత్ర నామాన్ని స్మరించు. ఆయన్ను మన్నింపు వేడుకో.

111. అల్ లహబ్

అబూ లహబ్ చేతులు విరిగిపోయాయి (బలం అణగిపోయింది). అతడు సర్వనాశనమయ్యాడు. అతడు సంపాదించినదంతా దేనికి పనికిరాకుండాపోయింది. అతడు తప్పక అగ్నిలో వేయబడతాడు. అతడి భార్య కూడా చాడీలు చెబుతూ కలహాలు రేపే ఆమె మెడలో బాగా పేనిన త్రాడు ఉంటుంది.

112. అల్ ఇఖ్లాస్

చెప్పు. అల్లాహ్ అద్వితీయుడు. ఎవరి అక్కరా లేనివాడు. అందరూ ఆయనపై ఆధారపడిన వారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన ఎవరికీ సంతానం కాదు. ఆయనకు సరి సమానులు ఎవరూ లేరు.

113. అల్ ఫలఖ్

చెప్పు. చీకట్లను చీల్చి ఉదయాన్ని తీసుకొచ్చే ప్రభువు శరణు వేడుతున్నానని. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుంచి, కమ్ముకునే చీకట్ల కీడు నుంచి, ముడులపై మంత్రించే వారి కీడు నుంచి, అసూయ పరుని అసూయ కీడు నుంచి ప్రభువు శరణు వేడు తున్నాను"

114. అన్ నాస్

చెప్పు. మనష్యుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవులకు వాస్తవ ఆరాధ్య దైవం శరణు వేడుతున్నాని దుష్ట భావాలు రేకెత్తించే వాని కీడు నుంచి, వాడు మాటిమాటికి మరలి వస్తూ ప్రజల మనస్సుల్లో దుష్ఫభావాలు రేకెత్తిస్తుంటుంటాడు. వాడు జిన్నాతు లలోని వాడు అయినా, మానవులలోని వాడు అయినా, వాని కీడు నుంచి ప్రభువు శరణు వేడుతున్నాని చెప్పు.